

జ్ఞాన యోగం
విచారణ
బ్రహ్మ జిజ్ఞాస-3



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.మహానుభావులైన సాధకులు, జిజ్ఞాసువులు జ్ఞాన ప్రచారార్ధం తాము సేకరించిన విలువైన గ్రంధాలను స్క్రిబ్డ్ వెబ్ సైట్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ సైట్(https://archive.org), గూగుల్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: http://www.scribd.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని

సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో సాధకులు,జిజ్ఞాసువులు స్క్రిబ్డ్ వెబ్ సైట్ ద్వారా అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు.వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు*

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

http://www.scribd.com



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

బ్రహ్మజిజ్ఞాస

తృతీయ భాగము

మట్టిబోయిన రామసుబ్బయ్య



బ్రహ్మజిజ్ఞాస

(షడ్దర్శన షణ్మతసార సంగ్రహము)

తృతీయ భాగము

గ్రంథకర్త

మట్టిబోయిన రామసుబ్బయ్య

Thuryadhi 4-11-2010 to 8-11-2010

ముందుమాట

వేదాంత విజ్ఞానాన్ని సామాన్యులకు అందించాలనే ఉదాత్తమైన ఆశయంతో రచింపబడిన ఉద్గ్రంథం బ్రహ్మజిజ్ఞాస. సహజమైన ఈశ్వరచింతన, వైరాగ్యధోరణి, బహుగ్రంథ పరిశీలన, అనేక సంవత్సరాల అనుభవం -- ఇవన్నీ ఏకత్ర సమన్వయం పొందిన జ్ఞానవయోవృద్ధులు శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారి లేఖిని నుండి ఈ గ్రంథం అపూర్వంగా రూపొందింది.

బ్రహ్మజిజ్ఞాస నాలుగు భాగాలుగా ప్రచురింపబడుతోంది. మొదటి భాగం అద్వైతసిద్ధాంతాన్ని, రెండవ భాగం అనుష్ఠాన మార్గాలను తెలుపుతుంది.

ప్రస్తుతం షడ్దర్శన, షణ్మతాలను గూర్చి తెలియజేస్తున్న ఈ మూడవ భాగం కూడ తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక ప్రచురణగా వెలువడుతోంది. మిగిలిన చతుర్థ భాగం సైతం త్వరలో వెలువడనున్నది. పరమాత్మను (బ్రహ్మ) గూర్చి తెలుసుకోవాలనుకునే ఆసక్తి కలవారందరూ విశిష్ట శైలితో విలసిల్లుతు వున్న 'బ్రహ్మజిజ్ఞాస' ను పఠించి ఆత్మోన్నతిని, ఆనందాతిశయాన్ని పొందగలరని మా ఆశయము, ఆకాంక్ష.

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగముపై

పత్రికల అభిప్రాయము

14-7-1967 ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బ్రహ్మజిజ్ఞాస

"ఆయా విషయాల్లో ప్రవేశమూ, ఉత్సాహమూ ఉన్నవారికి తప్ప శాస్త్రీయ గ్రంథాలు జనసామాన్యానికి నచ్చవు. అందులోను వేదాంతమంటే బొత్తిగా ఇష్టపడరు. కారణం అందులోని విషయం దురవగాహంగా ఉండడమే. ఇలాంటి విషయాలను సులభమైన భాషలో సుబోధంగా ఉండేరీతిని రచించబడినవి మనభాషలో అరుదు. అట్టి లోపాన్ని తీర్చడానికి ఈ గ్రంథం మిక్కిలి ఉపయోగించగలదు.

రచయిత 'ఉపోద్ఘాతం'లో తెలిపిన విషయాలనుబట్టి ఆయన పరిశ్రమించి సంస్కృతభాషను నేర్చుకోలేదనీ పెద్దల అనుగ్రహం వల్ల వేదాంత విషయాలు అవగాహన అయాయనీ, తనకు తెలిసిన విషయాలను గ్రంథరూపంలో పెట్టడానికి భగవదనుగ్రహమే కారణమనీ తెలుస్తున్నది. తాము ఏళ్ల తరబడి అనారోగ్యంగా ఉండి అణుమాత్రము ఓపిక లేని స్థితి లోనే యీ గ్రంథాన్ని-తాను చెప్పుతూ ఇతరుల చేత వ్రాయించారట! విషయాలన్నీ కరతలామలకాలై ఎంతో అనుభవం ఉన్నవారే యిట్టి మహత్కార్యానికి పూనుకోగలరు. ఈ విషయంలో రచయిత కృతార్థు లయినారనే చెప్పవలసి వున్నది.

శ్రీ రామసుబ్బయ్యగారు ఈ గ్రంథాన్ని మూడు భాగములుగా విభజించారు. మొదటి భాగం అద్వైత మత సిద్ధాంతాలను తెలిపేది. రెండోభాగంలో జ్ఞాన. రాజ, కర్మ, భక్తి యోగాలను గురించి వివరించారట. మూడవభాగంలో అచలవాదాన్ని గురించి వ్రాశారట. ప్రస్తుత గ్రంథం మొదటిభాగం మాత్రమే. తక్కిన రెండు భాగాలు అచ్చు కావలసి వున్నవి.

బ్రహ్మజిజ్ఞాసలోని ప్రథమ భాగ రూపమైన యీ గ్రంథంలో మూడు
రణాలున్నవి. మొదటి ప్రకరణం శీర్షిక ఉపక్రమం. ఇందులో
వేదాంగాలు, వర్ణవ్యవస్థ, ధర్మశాస్త్రాలు, ఉపదేశాధికారం, శంకరుల
భిప్రాయం మున్నగు విషయాలను గుఱించి ఉన్నది. రెండవ ప్రకరణం
క 'పరబ్రహ్మము-మాయ' అనేది. ఇందులో అద్వైతం పరుడు, మాయ,
శ్వరుల రూపాలు, వాటిని గూర్చి భిన్నాభిప్రాయాలు, జీవేశ్వరుల
స్థలు, పంచీకరణం, ప్రపంచోత్పత్తి, సత్‌చిత్ స్వరూపాలు,
ఖదుఃఖాలు, కపిల గౌడ పాదుల సిద్ధాంతాలు, జ్ఞాన-విజ్ఞానాలు,
ద్యావిద్యలు, మహా వాక్యవిచారం మొదలైన చాలా విషయాలు రమారమి
డు వందల పుటల్లో వివరించబడి వున్నవి. 'సంసారము ముక్తి'
 శీర్షిక గల మూడవ ప్రకరణం తక్కిన వాటి కంటె చాలా
న్నది. దీనిలో మరణానంతరం జీవుని స్థితి, శ్రాద్ధాదులు, పునర్జన్మ
ద్ధాంతం, సోక్రటీసు సిద్ధాంతం, దేవ యాన పితృయానములు, ఉత్క్రాంతి,
కార పురుషులు మొదలైన విషయాల చర్చలు ఉన్నవి.

ఇందులోని విషయాలన్నీ సామాన్యులకు దురవగాహాలే. అయినా
యిత వీలగునంత సులభమార్గంలో సరళ మైన భాషలో సామాన్యులకు
గే సందేహాలను ప్రశ్నరూపంగా చూపి వాటికి తగిన సమాధానాలను
తిస్మృత్యాది ప్రమాణాలతో వివరించారు. ఇందులోని విషయం,
రణనుబట్టి రచయితకున్న వేదాంతములోని విశిష్ట జ్ఞానం వ్యక్త
గుచున్నది. ఈ గ్రంథాన్ని ప్రశంసించి బ్రహ్మవేత్తలు, విద్వద్వతంసులు
చ్చిన సదభిప్రాయాలు అతిశయోక్తులు కావని నిర్ణయించవచ్చును.
 రామసుబ్బయ్యగారు తక్కిన భాగాలను కూడా ప్రకటించినయెడల
హ్మజిజ్ఞాసువులకు ఎంతో ఉపకారం చేసిన వారగుదురు.

— *అంగీరస*

23-7-67 ఆంధ్రజ్యోతి దినపత్రిక

వేదాంత గ్రంథాలు మనకు కోకొల్లలుగా వున్నాయి. కాని, వేదాంతాన్ని గురించి అధికారయుతంగా బోధించగల సప్రమాణ గ్రంథాలు బహు తక్కువ. వెలువడిన ఉత్తమమైన తెలుగు గ్రంథాలలో నిస్సంకోచముగా ఇది యొకటి.

రచయిత ఈ చిన్న గ్రంథాన్ని మూడు ప్రకరణాలుగ విభజించి తొలిగా 15, పిదప 46, చివరిలో 12, మొత్తము 73 అధ్యాయాలుగ దీనిని రచించారు. వర్ణవ్యవస్థ పుట్టు పూర్వోత్తరాల నుంచి అచలవాదం వరకు, అద్వైతతత్త్వము నుంచి తురీయాతీతం వరకు, మరణానంతరం జీవుని అస్తిత్వం నుంచి అధికార పురుషులవఱకు తడిమిచూచారు. పరబ్రహ్మం, మాయ, సంసారము, ముక్తి, ఈశ్వర, జీవ, జీవేశ్వరుల అవస్థలు; అధ్యాత్మ, అధిభూత, అధిదైవతాలు; కాపిల, కర్మ, అపవాద సచ్చిదానందాలు; సత్తు, చిత్తు, ఆత్మానాత్మ వివేకం, జ్ఞానాజ్ఞానాలు, తదితర తురీయాంశాలను తమ పుస్తకంలో ఆయన కూలంకషంగా చర్చించారు.

అద్వైత సిద్ధాంతాల వివరణంలో రచయిత సత్యాన్వేషణమే పరమలక్ష్యంగా భావించారు. జిజ్ఞాసువులకు ఉపకరించే రీతిలో సమగ్రంగా సుమారు వందకు పైగా అధికారిక గ్రంథాలు; శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాల సమ్మతంగా వ్రాసుకొంటూపోయారు. ముముక్షువులు, బ్రహ్మజిజ్ఞాసువులు తప్పక ఒకసారి పరిశీలించదగినట్టిది ఈ గ్రంథం.

శ్రీ రామసుబ్బయ్యగారు తమ బృహద్గ్రంథములోని మిగిలిన రెండు భాగాలను త్వరలోనే ప్రకటించగలరని ఆశిస్తున్నాము. వాటి రచన సందర్భముగా వీలయితే అన్యప్రాంతాలకు చెందిన ఇతర భాషలలోని వేదాంత విషయక పరిశీలనలను ఒక సారి సమీక్షించడం సముచితం కాగలదు.

— *ప్రాచేతస*

21-6-1967 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

రచన శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్య గ్రంథములో రచయిత వర్ణవ్యవస్థ దగ్గర నుంచి పరబ్రహ్మము, మాయ, సంసారము, ముక్తివరకూ ఈ గ్రంథములో చర్చించారు.

—— * ——

1967 అక్టోబర్ నెల వేదాంతభేరి మాసపత్రిక

ఇది అద్వైతతత్త్వ ప్రతిపాదకమగు గ్రంథము. ఇందు మొదటి ప్రకరణమున వేదాంత పురాణేతిహాసముల నుండి ప్రమాణ వాక్యముల నుదాహరించుచు, వర్ణవ్యవస్థ, స్త్రీ శూద్రులకు బ్రహ్మవిచారార్హత మొదలైన యంశములు కూలంకషముగా చర్చింపబడినవి. రెండవ ప్రకరణమున బ్రహ్మముయొక్కయు, మాయయొక్కయు, స్వరూప నిరూణము శాస్త్రప్రమాణ పురస్సరముగా గావింపబడినది, ఎడనెడ సుబోధములగు చక్కని దృష్టాంతము లీయబడినవి, జ్ఞానాజ్ఞానములయొక్కయు, ఆత్మానాత్మల యొక్కయు, విచారణ విశదముగా గావింపబడినది. మూడవ ప్రకరణమున జీవునకు భవబంధమునుండి విమోచన మార్గము సప్రమాణముగా తెలుపబడినది. జిజ్ఞాసువుల కీ గ్రంథము అత్యంతోపకారమై యొప్పుచున్నది.

—— * ——

HINDU SUNDAY APRIL28, 1968
BRAHMA JIJNASA, PART1.

In this book the first of a series planned in three volumes, the author aims at giving a clear idea of Brahman and self realisation as found in ancient books on Vedanta, and Upanishads : Though a lay reader of Indian philosophy to deeper sophy his thirst for knowledge spurred him to deeper studies, for a rational approach that caste or creed do not stand in the way of men for realising, the Supreme Brahman. The historical background throwing light on the origin of castes, the beginnings of the "Yajnopavita" and the Brahmanical way of life are really interesting. The author's simple and direct approach and clearity of expression are commendable.

— *VEDAM VENKATARAYA SASTRY.*

యథార్థ భారతి - వ్యాసాశ్రమమునుండి వెలువడు వేదాంత మాసపత్రిక. సంపుటి 43 - సౌమ్యనామ సం|| నిజాషాఢము జూలై నెల 1969 - సంచిక 5.

ఓమ్

గ్రంథసమీక్ష

"బ్రహ్మజిజ్ఞాస" (ప్రథమ, ద్వితీయ భాగములు)

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు. కడప.

ఇందు అద్వైతమత సిద్ధాంతమునకు సంబంధించిన అనేక విషయములు చర్చింపబడినవి. గ్రంథకర్త అనేక శాస్త్రములను పరిశోధించి వేదాంతజిజ్ఞాసువులకు తెలుసుకోదగిన పెక్కు విషయములను అనగా సాధకుని యొక్క బ్రహ్మజిజ్ఞాస మొదలుకొని బ్రహ్మసాక్షాత్కార పర్యంతము జిజ్ఞాసువులకు ఉపకరించు నటుల శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస ప్రమాణ పురస్సరముగ అనేక విషయములను వివరించిరి. వర్ణ వ్యవస్థాది విషయములు నవ్యదృష్టితో, సత్య దృష్టాంతములతో పరిశీలింపబడినవి. బ్రహ్మజిజ్ఞాసువులు తప్పక పఠింపదగిన గ్రంథము, బ్రహ్మజిజ్ఞాస, ఆంధ్రజిజ్ఞాసు లోకమునకు మహోపకార మొనర్చినది. శ్రీరామసుబ్బయ్య గారు విలక్షణమైన ప్రతిభతో, అసమాన ప్రజ్ఞతో ఈ బ్రహ్మజిజ్ఞాసను తెలుగు భాషామతల్లికి సమర్పించి ఎనలేని కీర్తిని గడించిరి.

——— * ———

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 17-9-1969

బ్రహ్మజిజ్ఞాస (ద్వితీయభాగము)

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు.

జ్ఞాన, రాజ, కర్మ, భక్తి యోగములున్నూ, 'ప్రపత్తి' అను భాగమును కల ఆధ్యాత్మిక విద్యా వివరణ రూపమైన దివ్య గ్రంథము ఇది.

జిజ్ఞాసువు ప్రశ్నిస్తూ ఉంటాడు. వేదాంతి సమాధాన మిస్తూ

ఉంటాడు. శ్రుతిస్మృతులు, ఉపనిషత్తులు, భారత భాగవత రామాయణ ములు, భగవద్గీత-ఈ గ్రంథాన్ని సప్రమాణమును చేశాయి.

ఆధ్యాత్మవిద్య అనగానే అమడదూరం పర్వెత్తిపోయే వానిని అత్యంత శ్రద్ధాభక్తులతో అతి సన్నిహితునిచేసే గ్రంథము ఇది.

జీవాత్మ సంబంధాన్ని, రహస్యాన్ని తెలుసుకుని తరణోపాయము గుర్తించి పరమహంసయై పరబ్రహ్మమునందు లీనము కావడమే జీవిక చరమలక్ష్యం. దానికి మించిన కృత కృత్యత లేదు.

'ద్వేపదే బంధ మోక్షాయ
న మమేతి మమేతి చ
మమేతి బధ్యతే జంతుః
న మమేతి విముచ్యతే' (పైంగలోపనిషత్తు)

బంధమునకు, మోక్షమునకు రెండు మార్గములు గలవు.

ఒక మార్గము 'న మమ'. రెండవది 'మమ'. 'మమ'(నాది, నావారు) అను మార్గమునందు బంధమును, 'న మమ' (నాది కాదు) అను మార్గమున పోయిన మోక్షము కలుగును.

రాజయోగ మనగా నా కేదో సందేహ ముండేది. ఈ గ్రంథమున గల రాజయోగ వివృతివలన అది తీరింది. అలాగే భక్తికి, ప్రపత్తికి గల భేదము, ఫలము ప్రపత్తి వివృతివలన తేట తెల్లమయింది.

రామానుజాదుల మత సిద్ధాంతాలు కూడ దీని వల్ల సులభ గ్రాహ్యము లవుతున్నాయి. వాటికి చిన్న చిన్న కథలు కూడ ఉన్నాయి.

ప్రపత్తిని వివరిస్తూ ఆళ్వారుల మార్గాన్ని రామ సుబ్బయ్యగారు రమ్యంగా చూపారు. వాటిలో 'దాశరథి' సంఘటన చక్కగా ఉంది. తేట తెలుగున బ్రహ్మవిద్యను బోధించే గ్రంథాలలో ఇది ప్రథమ గణ్యమన దగ్గది.

— *యామిజాల.*

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 12-12-1969

బ్రహ్మజిజ్ఞాస (ద్వితీయ భాగము)

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు.

వేదాంత విద్యలో సమగ్రకృషి చేసి, తాము తెలుసుకొన్న విషయాలన్నింటిని సరళమూ, సులభమూ అయిన భాషలో శ్రీ రామసుబ్బయ్యగారు వ్రాసిన 'బ్రహ్మజిజ్ఞాస'లో ఇది రెండవభాగము. రెండవభాగములో అయిదు ప్రకరణాలున్నాయి. మొదటి ప్రకరణములో జ్ఞానయోగం, రెండవదానిలో రాజయోగం, మూడవదానిలో కర్మయోగం వివరింపబడ్డాయి. నాలుగో ప్రకరణము భక్తియోగాన్ని గురించి, అయిదవది ప్రపత్తిని గురించి వివరిస్తున్నాయి. భక్తిప్రపత్తులను గుఱించి ఇంత విపులముగా వివరించిన గ్రంథము తెలుగులో ఇంతవఱకు రాలేదనుకొంటాను.

అద్వైతులు విశిష్టాద్వైతాన్ని గురించిగాని, విశిష్టాద్వైతులు అద్వైతాన్ని గురించిగాని విపులముగా వివరించడం అరుదు. ఈ రెండు మతాలను సమపక్షపాతంగా చూచే రచయిత అద్వైతమతాభిమాని అయినా, విశిష్టాద్వైత సంప్రదాయాలను విశిష్టంగా వివరించడం మెచ్చదగినది. భక్తి, ప్రపత్తులకుండే తారతమ్యం సుస్పష్టంగా తెలుసుకొనడానికి చివరి రెండు ప్రకరణాలు చాల ఉపకరిస్తాయి. విశిష్టాద్వైతంలో కూడ రచయిత చేసిన అపారకృషి ప్రశంసించదగింది.

ఇది 'బ్రహ్మజిజ్ఞాస' రెండవ భాగమైనా దీన్ని అర్థం చేసుకోవడంలో మొదటి భాగ అపేక్ష లేదు. దేనికది ప్రత్యేక గంథమే! మొదటి భాగములో చెప్పిన విషయాలు ఇందులో కూడ సంగ్రహించబడ్డాయి.

తమ జీవితాన్ని బ్రహ్మజిజ్ఞాసకోసమే ధారపోసిన యోగివర్యులు, విద్వద్వతంసులూ దీన్ని ప్రశంసిస్తూ యోగ్యతా పత్రాలిచ్చారు. సాధారణమైన పుస్తకాలకు అట్టి ఆమోదముద్ర పడదు. అట్టి ప్రశంసలను పొందే అర్హత యీగ్రంథానికి ఉన్నది. కఠిన విషయాలను సులభపద్ధతిలో వివరించే శక్తి రచయిత కున్నది. అది యీ గ్రంథములో వ్యక్తమవుతూ వున్నది.

శ్రీ రామసుబ్బయ్యగారు మిగిలివున్న మూడో భాగాన్ని కూడ త్వరలోనే వెలువరించి బ్రహ్మజిజ్ఞాసువులకు సంపూర్ణముగా సంతృప్తిని కలిగిస్తున్నారని ఆశిస్తున్నాను.

— *"అంగీరస"*

---*---

1969 డిశంబరు నెలలో వెలువడిన "రామదర్శనం"అను అనుష్ఠాన వేదాంత సందేశక మాసపత్రిక యం దిట్లున్నది.

బ్రహ్మజిజ్ఞాస - ద్వితీయభాగం

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు,

ఈ గ్రంథమున జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగ, ప్రపత్తులు - సరళ సరస శైలిలో జిజ్ఞాసువులకు సంతృప్తి కలుగురీతి వివరింపబడినవి. బ్రహ్మవిద్యాదేవికి ఇది యొక మనోహరభూషణం.

---*---

20-10-1972 "మాసీమ"

కడపనుండి వెలువడు పక్షపత్రిక

బ్రహ్మజిజ్ఞాస - ద్వితీయ భాగము.

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు.

వేదాంతమంటె అర్థం కాని విషయమనే వారెందరో వున్నారు. అందలి పడికట్టు పదాలతో గుట్టు తెలియక దానికో నమస్కారము పెట్టేవారు వున్నారు. కాని క్లిష్టమైన బ్రహ్మతత్త్వమును సర్వజనులకు సులువుగా అందజేసే ప్రయత్నాలు జరుగుచునే వున్నవి. శ్రీరామకృష్ణ పరమహంస చిన్న కథల రూపములో వేదాంతవిషయములను సర్వులకూ అర్థమయ్యే రీతిగ చెప్పినారు.

శ్రీ రామసుబ్బయ్యగారు అధ్యాత్మవిద్యానిధులు. అసందేహాస్పదము లైన శబ్ద ప్రయోగములచే సామాన్యులకు సయితము అవగత మగునట్లుగ బ్రహ్మతత్త్వమును ప్రశ్నోత్తర రూపమున అందజేసినారు. శుద్ధమైన

భాషలో, లలితమైన శైలిలో సాగిన వేదాంత గ్రంథ మిది. అయిదు వందల పుటలు గల ఈ గ్రంథమున జ్ఞానయోగము, రాజయోగము, కర్మయోగము, భక్తియోగము, ప్రపత్తితత్త్వము అనెడి అయిదు ప్రకరణము లున్నవి. గ్రంథకర్త సర్వమత సమన్వయ దృష్టి కలవారు. వారి వాక్యాలు కొన్ని : భిన్న భిన్న సంస్కారములు గల భిన్న జీవులకు సరిపడునట్లు భిన్నభిన్నములగు మోక్షధర్మములను భగవంతుడు, లేక గీతాకారుడు గీతాముఖమున లోకమున కుపదేశించియున్నాడు. ఎవరికేది తగునో వారద్దాని ననుసరింతురు. (పేజి - 496)

స్వామి నిత్యానంద, స్వామి రామకృష్ణానందుల వంటి యతీంద్రులు పండిత ప్రకాండులగు దీపాల పిచ్చయ్య శాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తి.కం.తిరువేంగడాచార్యులు మున్నగువారి అభినందనల కన్నివిధాల అర్హులైనారు శ్రీ రామసుబ్బయ్యగారు.

అచ్చుతప్పులు అతి తక్కువగ నుండి చక్కగ ముద్రింపబడుట మెచ్చుకొనదగినది.

ఆసక్తులు, జిజ్ఞాసువులు తప్పక చదువదగిన గ్రంథము.

— *శ్రీ చరణ్.*

——— * ———

FORE WORD

Dr. K.C. VARADACHARI, M.A.Ph.D.

SRI RAJA GRIHA,
B.G. CAR STREET,
TIRUAPTI
Date : March 17th, 1969

Dear Sir,

I thank you very much for sending me your two volumes of Brahma jijnasa for opinion and foreword, through Mr.V.K.Raja Gopal Aiyangar, Advocate, Chittoor. I must confess that on persuing your first part, which you sent earlier I feel that one who is an advaitic scholar should attempt to write on the volumes. My own work has been confined to Visistadvaita and though on the

general phenomenal stand points there cannot be difference between the Several schools of Vedanta on the ultimate questions, there serious differences. The concept of a undifferentiated one substance as Self is not accepted by the Visistaadvaitan.The nature of Bhakti again is some thing that comes after knowledge not as a preparation for it Saranagathi is a means for direct intuition of God but it is not so mainly as it is intended to be a means to seek the favour of God to save the individual from misery, fear and so on. The attainment of the Brahmic condition is not anything more than Samipya and Sannidhya. Your acquaintance with the general points of view of Visistadvaita and saranagati or prapatti is very helpful.

I fully appreciate the standpoint of the Achala to which the Advaita of Sankara leads according to you, I also appreciate your view that fourth way of direct mergence of God is not to be considered to be a kind of utkranthi but realisation here itself, for then both space and time and all differences vanish or melt away leaving the Brahman alone. The motion less experience is according to you Turiyatita beyond the Turiya of the Mandukya-which you equate with Sankara's Advaita experience. It is something that is Nirguna. Your fine advocacy of this view-similar to some similar doctrines of Akal (Timeless), Akas (Spaceless) may be the high water mark of Yoga of the transcendental kind. It is something that stands apart from even the texts of the Srutis I believe that you must have a gleam of this experience or are on the brink of it.

Your work be welcomed by scholars who have carefully s tudied the Advaitic texts and have practised the Sandhana that leads to the Achala-anubhava.

While I fell honoured by your request I feel that I am hardly capable of doing justice to this exposition by way of appreciation or evaluation. Your deep sincerety and piety will be amply repaid. What we do require today is not the reading of the old texts alone, but the quest to realise their truths or prove them. That is why a

man like Ramana was accepted but it would require that every one should not only admire and worship such men but themselves undertake this heroic (dhira) method of proving within themselves the truths of the Srutis or the transcendentalists.

May God bless you with the realisation.

With best whishes,

Yours sincerely,

(Sd.) K.C. VARADACHARI.

—— * ——

ఆచార్య (ప్రొఫెసర్) డాక్టర్ క్రొత్త సచ్చిదానంద మూర్తిగారు బ్రహ్మజిజ్ఞాస ప్రథమ - ద్వితీయ భాగములపై వ్రాసిన అభిప్రాయము.

SRI VENKATESWARA UNIVERSITY.

Professor,
K. Satchidananda Murthy,
Vice-Chancellor.

Tirupathi - 517502
Andhra Pradesh.
18 th January, 1976.

Dear Shri Ramasubbaiah,

I have received copies of your Brahma-Jijnasa, 2 pts. Thank you very much.

I have read a few paragraphs here and there and I am happy to note that you have expounded Vedanta in the traditional way in clear Telugu.

I hope many Mumukshus are reading it and are being profited.

Yours Sincerely,

(Sd.) K. SATCHIDANANDA MURTHY.

—— * ——

(పై అభిప్రాయమునకు ఆంధ్రానువాదము)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము

ఆచార్య,
కె. సచ్చిదానందమూర్తి,
వైస్-ఛాన్సలర్.

తిరుపతి-517502,
ఆంధ్రప్రదేశ్
18 జనవరి 1976

ప్రియమైన రామసుబ్బయ్యగారూ,

మీ 'బ్రహ్మజిజ్ఞాస' గ్రంథముయొక్క రెండు భాగములు చేరినవి. అనేక వందనములు.

అక్కడక్కడ కొన్ని ప్యారగ్రాఫ్‌లను చదివినాను. అందు మీరు వేదాంతమును సంప్రదాయ విధమున విస్పష్టమైన తెనుగులో వివరించినారు. ఈ విషయము నాకు చాలా అనందమును తృప్తిని కలిగించినది.

అనేక ముముక్షువులు దీనిని చదివి, లాభపడ గలరని అశపడు చున్నారు.

సహృదయముతో,

(సం.) కె. సచ్చిదానందమూర్తి.

---*---

రాణి లలితాదేవిగారి (సంత్ జ్ఞానేశ్వరుల గీతా వ్యాఖ్యానమగు 'జ్ఞానేశ్వరి'ని ఆంధ్రభాషలో అనువదించిన వారు) ప్రథమ - ద్వితీయ భాగములపై అభిప్రాయము.

RANI J. LALITA DEVEI, B.A.,

Phone : 34288
"DURGA NIVAS"
11-4-169/1 Red Hills
Hydrabad - 4 (A.P.)

శ్రీ శ్రీ రామసుబ్బయ్యగారికి అతివినయముతో నమస్కరించి వ్రాయుట ఇది కదా.

మీరు కడు ప్రేమతో దయతో పంపిన బ్రహ్మజిజ్ఞాస పుస్తకములను భక్తి విధేయతలతో చదివి ఆనందించితిని. శాస్త్రశోధన మరియు అనుభవ జ్ఞానములతో సులభశైలిలో విపులముగా ఈ పుస్తకములందు వ్రాసి ఆంధ్రజాతికి మీరు చేసిన సేవ కడు ప్రశంసనీయము. మీ విమర్శ గ్రంథ ప్రమాణములు ఆత్మజ్ఞానము కొరకు పాటుపడు తెలుగుజాతికి చాలా తోడ్పడును. జ్ఞానమూర్తులగు మిమ్ములను జ్ఞానరూపి యగు భగవంతుడు ఆయురారోగ్యములను ప్రసాదించి రక్షించుగాక.

ఇట్లు మీ సోదరి,

J. Lalita Devi.

కృతజ్ఞత

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు (Vice-Chancellor) ను విశ్వవిద్యాలయ వేదాంతమహాచార్యులు (Professor)గా పని చేసిన వారును, ఆగు డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తిగారితో నాకు ముఖ పరిచయమైనను లేదు. "బ్రహ్మజిజ్ఞాస ప్రథమ, ద్వితీయ భాగములకు వారి అభిప్రాయమును తెలియజేయుడని విజ్ఞప్తి చేయుచు కాపీలను వారికి పోస్టుద్వారా పంపితిని. వారు దయతో వాటిని అచ్చటచ్చట చదివి వారి అభిప్రాయమును పంపిరి. తదుపరి యీ తృతీయభాగమునకు తొలిపలుకును వ్రాయుడని వారిని అభ్యర్థించితిని. వారు దయతో నావిజ్ఞప్తిని మన్నించి అనతికాలమునకే తొలిపలుకును (Foreword) వ్రాసి పంపించిరి. వారికి కృతజ్ఞుడను.

తెనుగు విజ్ఞాస సర్వస్వమునందు "దర్శనములు, మతములు" అను ఏడవ సంపుటమునకు ఆచార్య డాక్టర్ క్రొత్త సచ్చిదానందమూర్తి గారు సంపాదకులు. ఆ కార్యము సామాన్యులు చేయగలది కాదు. వీరు భారతీయ దర్శనములనే గాక ప్రపంచము నందలి సమస్త దర్శనములను ఆకళించుకొన్న మహామేధావులు. నానాదేశ సంచార మొనర్చి అన్య మతములకు అన్యసంస్కృతులకు చెందిన గొప్ప తత్త్వవేత్తలతో ప్రగాఢమైత్రిని సంపాదించి వారి వివిధ భావములను, వివిధానుభవములను తెలిసికొని సమ్యక్‌దృష్టి నలవఱచుకొనినవారు. వర్తమానకాలమునందుండు విఖ్యాత తత్త్వవేత్తలలో వీరొకరు. వీరు తొలిపలుకు వ్రాయుటయు అదృష్టముగ భావించుచున్నాను.

నేను కర్నూలులో ఉండిన కాలమునందే తృతీయ భాగమును ఒక విధముగా పూర్తిచేసితిని. కర్నూలు నుండి కావలికి వచ్చి సుమారు రెండున్నర సంవత్సరము లైనది. ఈ సమయములో గ్రంథముద్రణమునకు ప్రయత్నించితిని. కావలిలో పుస్తకములు ముద్రించు సదుపాయములు లేవనిరి. నెల్లూరులో విచారించితిని. అచ్చటను సరిపడలేదు. ఒకనాడు మిత్రు లిరువురు నావద్దకు వచ్చిరి. వారిలో ఒకరు బహుగ్రంథకర్తలు, ఆంధ్ర ఆంగ్ల భాషలయందు పండితులు, ఆంధ్ర సాహిత్య అకాడమీ

కార్యవర్గ సభ్యులునగు శ్రీమరుపూరు కోదండరామిరెడ్డిగారు, రెండవవారు "నవయుగం" పత్రికా సంపాదకులు, పరోపకారులు సగు జి. ఆర్. కృష్ణమూర్తిగారు. వారిని "తగిన ప్రింటింగ్ ప్రెస్ మీకు తెలిసిన దేదైన ఉన్నదా"యని అడిగితిని. వారిలో శ్రీ కోదండరామిరెడ్డిగారు - మద్రాసులో ఫ్రీడమ్ ప్రెస్ అధికారి తమ మిత్రుడని, గ్రంథమును వారివద్ద అచ్చువేయించుట మంచిదని సలహా ఇచ్చిరి. ప్రూఫులను సహితము తామే దిద్దియిచ్చెదమని చెప్పిరి. వారు చెప్పినట్లు చేసితిని. సుమారు సగము గ్రంథము వఱకు శ్రీ రెడ్డిగారే ప్రూపులు దిద్ది యిచ్చిరి.

అప్పటికి నా ఆరోగ్యము కొంచెము బాగుపడినందున తక్కిన గ్రంథమునకు ప్రూఫులను నేనే దిద్దుకొంటిని. శ్రీ కృష్ణమూర్తిగారు వారి కార్యార్థమై మద్రాసుకు పోయినపుడంతయు ఫ్రీడమ్ ప్రెస్ నకు పోయి వారిని తొందఱ పెట్టి గ్రంథముద్రణము పూర్తి అగునట్లు తోడ్పడిరి. వారికి నా కృతజ్ఞత తెలుపుకొనుచున్నాను. వీరిని, ఫ్రీడమ్ ప్రెస్ వారిని భగవంతుడు ఆశీర్వదించుగాక!తృతీయ భాగమునకు తొలిపలుకును, అభిప్రాయమును, పరిచయవాక్యమును వ్రాసి యిచ్చిన పెద్దలకు కృతజ్ఞతతో నమస్కరించుచున్నాను.

ప్రస్తుత నివాసము : కావలి   గ్రంథకర్త

1-9-76

---*---

SRI VENKATESWARA UNIVERSITY.

Professor,
K. Satchidananda Murthy,
Vice-Chancellor,

Tirupathi - 517502
Andhara Pradesh
29 th July 1976

FOREWORD

I have cursorily glanced through Shri M. Ramasubbaiah's Brahma-Jijnasa, Part III. In this book he has expounded the six 'Astika darsanas', religious systems like Saiva, Sakta, and Vaishnava, as well as Buddhism and Jainism, and his last chapter deals with the Nastika and materialistic systems.

Books of this sort in Telugu are very few. So the author's attempt is commendable. He has studied some of the traditional and modern literature on this subject. In this concluding sections of the chapters he has tried to review and criticise other philosophies and religions from the standpoint of Vedanta. As usual with most modern Indian scholars, he believes all the 'astika' systems and the Indian religious schools can be ultimately reconciled, as they culminate in Vedantic truths.

Written in clear and lucid prose, the book is a worthwhile addition to the meagre religio-philosophical literature in Telugu.

(Sd.) K.S. MURTHY
(K. SATCHIDANANDA MURTHY)

(ఇందుకు ఆంధ్రానువాదము)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము

ఆచార్య (ప్రొఫెసర్)
కె.సచ్చిదానందమూర్తి,
వైస్ ఛాన్సలర్,

తిరుపతి,
ఆంధ్రప్రదేశ్,
29 జూలై 1975.

అవతారిక

శ్రీ. ఎం. రామసుబ్బయ్యగారు వ్రాసిన బ్రహ్మజిజ్ఞాస మూడవ భాగమును జిజ్ఞాసతో ఆసక్తితో అక్కడక్కడ పరికించినాను. ఇందు వీరు ఆరు ఆస్తిక దర్శనములను, శైవము శాక్తము వైష్ణవము మొదలగు

మతశాఖలనే గాక బౌద్ధము జైనములను గూడ వివరించియున్నారు. చరమ ప్రకరణమున నాస్తికము-భౌతిక వాదము మొదలగు సిద్ధాంతములను పరిశీలించియున్నారు.

తెనుగులో ఇటువంటి గ్రంథములు చాల తక్కువ;

కాబట్టి ఈ గ్రంథకర్తగారి ప్రయత్నము ప్రశంసనీయము. వీరు ఈ విషయసంబంధమైన సంప్రదాయిక వాఙ్మయమునే గాక అధునాతన గ్రంథములను గూడ చదివియున్నారు. చరమాధ్యాయమునందు, వీరు వేదాంతదృష్టితో ఇతర తత్త్వములను మతములను సమీక్షించి విమర్శింప ప్రయత్నించియున్నారు. ఇప్పటి ఆధునిక భారతీయ పండితు లందరివలెనే, వీరును సమస్త భారతీయ ఆస్తికదర్శనములు, హిందూ సంప్రదాయములు అన్ని గూడ చివరకు సమన్వయ పరుపబడగలవని విశ్వసిస్తున్నారు. ఎందుకంటే వీటి అన్నిటికీ వేదాంత సత్యములే గమ్యము లగుచున్నవి.

ఈ గ్రంథము సరళము, స్వచ్ఛమునైన గద్యంలో రచింపబడి యున్నది. ఇప్పుడు ఆంధ్రంలో ఉన్న ఏ కొద్ది మత-వేదాంత గ్రంథములతో చేర్చబడుటకు దీనికి అత్యంత యోగ్యత గలదు.

(సం) కె. యస్. మూర్తి.
(కె. సచ్చిదానందమూర్తి)

గ్రంథకర్త విజ్ఞప్తి

ఈశ్వరానుగ్రహమున తృతీయభాగము యొక్క ముద్రణము పూర్తి అయినది. ప్రథమ భాగము 1967 వ సంవత్సరమునందును, ద్వితీయ భాగము 1969 వ సంవత్సరము నందును ముద్రింపబడినవి. ప్రథమ, ద్వితీయ భాగములు వ్రాసిన వెంటనే శ్రీ శివరామదీక్షితుల అచలబోధకు

సంబంధించిన గ్రంథభాగమును కూడ వ్రాసితిని. దానిని తృతీయ భాగమని, మూడవ సంపుటముగా ముద్రింపదలచితిని గాని శివరామ దీక్షితులవారి అచల వేదాంతమును గుఱించి తెలుపుటకు ముందు షడ్దర్శనములు, షణ్మతములను గుఱించి తెలిపిన నేను చెప్పదలచిన దంతయు చెప్పినట్లగునని యీ భాగమును వ్రాసితిని. గ్రంథము పెద్దదగుటవలన ఒక సంపుటముగా ముద్రించిన బాగుండదని షడ్దర్శనములు, షణ్మతములను వేఱుచేసి దీనిని తృతీయభాగముగను, సంత్జ్ఞానేశ్వరుల యొక్కయు, శివ రామదీక్షితుల వారియొక్కయు దర్శనములను నాలుగవ భాగముగను ముద్రింపదలచితిని. ఈ భాగము నందలి దర్శనములు మతములు పాఠకమహాశయులకు సులభగ్రాహ్య మగునట్లు చేయవలయు నన్న ఒక్కొక్క దర్శనమునకు ఒక్కొక్క మతమునకు ఒక్కొక్క గ్రంథమును వ్రాయవలసి యుండును.

ఇదివఱకు పెద్దలు కొందఱిట్లే వ్రాసి యున్నారు. కాని కొందఱు అరుదుగా అన్నింటిని కలిపి ఒక గ్రంథమునందే చెప్పియున్నారు. శ్రీశంకరభగవత్పాదులు, మాధవ విద్యారణ్యులు ఇట్టి గ్రంథములు రచియించి యున్నారు. ఆధునికులలో కీ॥శే॥ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఆంగ్లమున "ఇండియన్ ఫిలాసఫీ" అను గ్రంథమును వ్రాసిరి. దానిని శ్రీ బులుసు వేంకటేశ్వర్లు, ఎం.ఏ., గారు చక్కగా ఆంధ్రీకరించిరి. ఇందుకు వీరికి ఆంధ్రులు ఋణపడియున్నారు. క్రీ॥శే॥ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము' మూడు సంపుటముల వఱకు ప్రకటించిరి గాని అందు దర్శనములను మతములను వేఱుచేయలేదు. అది ముముక్షువులకు అంత ప్రయోజనకారి కాదు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షులుగాను, పద్మభూషణ్ మోటూరు సత్యనారాయణ. డాక్టర్ వి. సుబ్బారెడ్డిగారలు కార్యదర్శులుగాను ఏర్పడిన తెనుగు భాషాసమితివారు వెలువరించిన విజ్ఞాన సర్వస్వమునందు ఆచార్య డాక్టర్ క్రొత్త సచ్చిదానందమూర్తిగారి సంపాదకత్వమున వెలువడిన దర్శనములు, మతములు అను ఏడవ సంపుటము ప్రయోజనకారి యని చెప్పవచ్చును.

వీరు గాక మఱి కొందఱు పెద్దలు దర్శన గ్రంథములు రచియించిరి. షడ్దర్శనములలో పూర్వ మీమాంసా దర్శనము తప్ప తక్కిన అయిదు దర్శనములకు పండిత శ్రీ గోపదేవ్‌గారు తెనుగు వ్యాఖ్యలు రచియించి వేఱు వేఱు గ్రంథములుగా ముద్రించి ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైరి. పై గ్రంథముల యందు మత ప్రసక్తి లేదు. పైన చెప్పిన గ్రంథముల రచనా విధానమునకును, 'బ్రహ్మ జిజ్ఞాస' రచనా విధానమునకును భేదమున్నది. ఈ గ్రంథమును ఆరంభమునుండి చదివినవారికి దీని ప్రత్యేకత తెలియగలదు. ఈ భాగమును వ్రాయుట నావంటి అల్పజ్ఞునకు అసాధ్యమని తొలుత తలచితిని గాని యీ క్రింది అంశము నా స్మృతికి వచ్చి యీ రచనకు ప్రోత్సాహ మిచ్చినది.

పూర్వము శౌనకాది మహామునులు సూతమహర్షిని భాగవత పురాణము వినిపింపుమని కోరిరి. సూతమహర్షి తన అసమర్థతను వారి కెఱిగించియు, ఇట్లు చెప్పిరి -

చ॥ "క్రమమున మింటికై యెగయు గాక విహంగము మింటి దైనపా
రము గననేర్చునే, హరి పరాక్రమ మోపిన యంత గాక స
ర్వము వివరింప నెవ్వడు ప్రవర్తకుడౌ మునులార! నాదు చి
త్తమునకు నెంత గానడె దప్పక చెప్పెద మీకు నంతయున్."

(ఆంధ్రభాగవతము 1-415)

ఇందలి భావమిది : దోమ మొదలు గరుత్మంతుని వఱకు ఱెక్కలు గల ప్రాణులు ఆకసమునందు సంచరించు చున్నవి. అవి యెవ్వియు ఆకసముయొక్క పారమును చూడ లేదు. చూడజాలవు. వాటి వాటి శక్త్యనుసారము బయలున తిరుగుచున్నట్లే మహాత్ములనేకులు భగవంతుని గుఱించి చెప్పిరి. కాని, పూర్ణముగ భగవంతుని గుఱించి యెవరును చెప్పలేరు. చెప్పలేమని యూరకుండలేదు. అట్లే నాకు తోచినంత చెప్పుదునని సూతమహర్షి చెప్పెను.

మహర్షులే తమ అసమర్థతను వెల్లడించియు అంతటితో నూరకుండక పరతత్త్వమును గుఱించి అనేక విధములు చెప్పియుండుటవలననే వారి అనంతర తరముల వారమగు మనము భగవద్విషయమైన జ్ఞానము స్వల్పము నైనను కలిగియున్నాము. అట్లు వారు చేయక యుండిన మనము అజ్ఞానాంధ కారమున నుండియుందుము కదా?అని తలచి నా వంటివాడు తోచినంత మాత్రమైన చెప్పుటలో తప్పు లేదని ధైర్యముతో భగవంతునిపై భారము వైచి యీ భాగమును వ్రాసితిని. నేనీ కార్యమున నెంతవఱకు కృతార్థుడ నైతినో యీ తృతీయభాగమును చదివిన పెద్దలే నిర్ణయింపగలరు. పెద్దలు ఇందలి గుణములను గ్రహించి తప్పులను మన్నింతురని ప్రార్థన. లేదా నా తప్పులను దయతో నాకు తెలిపిన సవరించుకొని నా కృతజ్ఞత తెలుపుకొందును.

అచ్చు తప్పులు స్వల్పముగా ఉండినను అవి చాల స్వల్పమైన వగుటచే సరియైన అర్థము చేసికొని చదువుకొనుట కెట్టి కష్టమును ఉండదు. కనుక అట్టివాటి విషయమున కూడ పాఠక మహాశయులు నన్ను మన్నింతురని ప్రార్థన.

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

విన్నపము

పరమేశ్వరానుగ్రహమున ఈ 'బ్రహ్మజిజ్ఞాస' రచన సంపూర్ణ మయినది. ఈ గ్రంథము రచించుటకు గల కారణము తెలుపునపుడు నన్ను గుఱించి ంత చెప్పుకొనుట ఆవశ్యకమై యున్నది.

పరమార్థ చింత

నాకు బాల్యముననే వేదాంతమును తెలిసికొనవలెనను నిచ్ఛ కలిగెను. డపజిల్లా కమలాపుర వాస్తవ్యులు బ్రహ్మశ్రీ విద్యానంద కైప శేషయ్యగారి రిచయభాగ్యము లభించెను. వీరు గొప్ప మేధావులు, కవులు, పండితులు, హ్మవిదులు. అన్ని మతములకంటె అద్వైతమే శ్రేష్ఠమైనదని వారు నాకు ోధించిన మహనీయులు. దురదృష్టవశమున ఆ పిమ్మట కొలది కాలముననే ారు కైవల్యమును చెందిరి. ఇది ఇప్పటికి సుమారు 43 సంవత్సరముల ందటి మాట.

తరువాత కొంతకాలమునకు చిన్నతనమున నాకు గల వైరాగ్యము, త్మవిచారము సన్నగిల్లెను. లౌకికములగు వ్యాసంగము లెక్కువయ్యెను. లుగు నీడలతో జీవితమునందు నాకు 45 సంవత్సరముల వయస్సు డచెను. నా యేకైక పుత్రునకు వివాహము చేసి నాకుమార్తెను, భార్యను తని సంరక్షణకు ఒప్పగించి ఏ యాశ్రమమునందైన జీవిత శేషమును డుపనెంచితిని. తానొకటి తలచిన దైవమొకటి తలచునన్న సామెత నాయెడ ార్థకమయ్యెను.

వ్యాధి

నా కుమారునికి వివాహము చేసిన నాలుగు మాసములకే 1949వ ంవత్సరమున డిశెంబరు నెలలో నేను జబ్బుపడితిని. ఆ వ్యాధినుండి ప్పటికిని పూర్తిగా విముక్తి పొందలేదు. వైద్యులు నరముల దౌర్బల్యమనిరి.

దాని లక్షణములివి : సుమారు అఱగంటకంటె ఎక్కువకాలము కూర్చుండలేను. సుమారేబది గజములు నడచినంత మాత్రముననే అధిక శ్రమ కలుగును. ఒక పంక్తి అక్షరములు చదివినను, వ్రాసినను అంతటితో ఏపని చేయుటకును శక్తి యుండదు. ఒకగంటసేపు గ్రంథమును వినుటకైనను శక్తి లేకుండును. సుప్రసిద్ధ వైద్యులచే చికిత్స పొందితిని. లాభమేమియు లేకపోయెను. ఇదియును ఒకవిధముగ నామేలునకే యనుకొంటిని. ఎట్లనగా: బడికిపోవుట మాని యథేచ్ఛగా తిరుగుచుండు బాలుని, వాని తండ్రి పట్టితెచ్చి స్తంభమునకు కట్టివేసి పుస్తకము వాని చేతికిచ్చి చదువుమని దండించినట్లు, చిన్నతనమున నాకున్న ఈశ్వర చింతనమును, వైరాగ్యమును పోగొట్టుకొని లౌకిక విషయ లాంపట్యమున తిరుగుచుండునట్టి నేను ఆత్మలాభము పొందలేదని తలచి నా యిష్ట దైవమగు శ్రీరామచంద్రుడు నన్నిట్లు వ్యాధితో కట్టివైచెనని తలచితిని. ఈ స్థితి నాకు మిగుల కష్టమయినను ఇదియే నాకు సంసార తరణోపాయ మని తలచి అన్ని చింతలు వదలి ఆత్మవిచారమునందే కాలము గడుపుచుంటిని. అట్లే సుమారు తొమ్మిది సంవత్సరములు గడచిన పిమ్మట నాకు కొంతశక్తి కలిగెను.

గ్రంథ రచన

అట్టి స్థితిలో ఈ గ్రంథము వ్రాయవలెనను సంకల్పము కలిగెను. ఇందువలన నేను అధ్యాత్మ విషయములను మననము చేసికొనుటకును, సంస్కృతమున పాండిత్యము లేని నావంటి జిజ్ఞాసువులకు సులభముగా వేదాంత విచారము చేసికొనుటకును ప్రయోజనకారిగా నుండగలదని తలచితిని. స్వయముగ వ్రాయుటకు నాకు శక్తి లేనందున లేఖనమునకు ఇతరుల సహాయ మవసరమయ్యెను. నేను గ్రంథము ఆశువుగా చెప్పుచుండగా తీరిక కలిగినపుడు చి|| సౌ|| నా కుమార్తె, చి|| నా కుమారుడును, వ్రాయుచుండిరి. ఇట్లుండ నా కుమారుడు న్యాయవాదివృత్తి వదలి ఉద్యోగమున ప్రవేశించెను. గిద్దలూరునకు కుటుంబ సహితముగ పోయితిమి. గిద్దలూరునుండి పుంగనూరునకును, అచ్చటనుండి నెల్లూరునకు బదిలీయయ్యెను. చిత్తుప్రతియందు కొన్ని విషయములు పూరింపవలసి యుండెను. భగవదనుగ్రహమున నాకు మఱికొంత ఆరోగ్యము కలిగెను. గ్రంథమునం దచ్చటచ్చట శ్లోకములు, పద్యములు వ్రాయుటకు, శ్లోకముల సంఖ్యలు

చేయుటకు స్థలము వదలియుంటిని. వాటిని పూరించుటకు కావలసిన గ్రంథము అన్నియు నావద్ద లేకుండెను. నెల్లూరులో తిక్కన గ్రంథాలయమున కొన్ని గ్రంథములు లభించుటచే నా కార్యము సులభమయ్యెను.

ఆంధ్రప్రదేశమున అచలవాద మచ్చటచ్చట ప్రచారమునందున్నది. అచలబోధ అద్వైతమునకంటె పై మెట్టని అచలవాదులు చెప్పుదురు. అచలవాదులు కాని కొందఱు పండితులు సహితము అట్టి అభిప్రాయమే కలిగియున్నారు. అచలవాదముయొక్క స్వరూపము మొదట నేవిధముగ నుండి యెట్టి పరిణామము నొంది యిప్పటి స్వరూపము ధరించినదో ఆ వివరమును నాకు తెలిసినంతవఱకు ఈ గ్రంథముయొక్క తృతీయభాగమున FNలో వివరించితిని. అద్వైత మిట్టిదని తెలిసిన యెడల అచలమతమును సులభముగ తెలిసికొనవచ్చును. ఆ కారణమువలన అద్వైత సిద్ధాంతమును తెలుపు ప్రకరణములు ప్రథమ భాగమనియు, తరువాత అనుష్ఠాన మార్గమును తెలియజేయు జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగములు నాలుగును ద్వితీయ భాగమనియు, అచల బోధను తెలుపు ప్రకరణములు తృతీయ భాగమనియు - ఈ గ్రంథమును మూడుభాగములు చేసితిని.

కొన్ని కారణములవలన గ్రంథమంతయు ఒక్కసారి అచ్చువేయించుటకు వీలుపడనందున ప్రథమభాగమును మాత్రమే ప్రస్తుతము అచ్చు వేయించితిని. ఈశ్వరానుగ్రహ మున్నచో ద్వితీయ, తృతీయ భాగములు రెండును ఒక్క సంపుటముగనో లేక వేఱు వేఱుగ రెండు సంపుటములుగనో అచ్చు వేయించదలచితిని. వేదాంత గ్రంథము వ్రాయుట నావంటివానికి తలకు మించిన పనియని నాకు బాగుగ తెలిసియుండియు నే నీ కార్యమునకు పూనుకొంటిని. ఇది భగవంతుని ప్రేరణయని అనుకొంటిని. ఈశ్వరుడే నానోట ఈ గ్రంథమును పలికించెనని నా నమ్మకము. ఈ ప్రథమభాగము వ్రాయునపుడు తృతీయభాగమున వ్రాయవలసిన అచలవాదమును మనస్సులో నుంచుకొని వ్రాయుటవలన కొన్ని కొన్ని ఘట్టములను కొంత హెచ్చుగ వ్రాసితిని. అచలబోధ యిట్టిదని ఈ భాగమును చదివిన పాఠకులకు స్థాలీపులాక న్యాయము (కుండెడు అన్నము ఉడికినదా లేదా అని ఒక మెతుకును పట్టిచూచి తెలిసికొనునట్టి పద్ధతి) ననుసరించి తెలియజేయుటకుగాను ఈ భాగమునం దచ్చటచ్చట పుటలయొక్క క్రింది భాగము (Foot Notes) లో

అచలమత స్థాపకులగు శివరామ దీక్షితులవారి వాక్యములను కొన్నింటి నుదాహరించితిని.

నా ప్రార్థన మన్నించి శ్రమయని తలంపక, ఈ గ్రంథమును చదివి అభిప్రాయములను వ్రాసియిచ్చిన పూజ్యులును, తత్త్వవిదులును నగు పండితులకు కృతజ్ఞతా పూర్వక వందనము లర్పించుచున్నాను.

ఈ గ్రంథ రచనకు సహాయపడిన గ్రంథములయొక్క పట్టిక నొక దానిని ఇచట చూపితిని. తద్గ్రంథ కర్తలకును, ప్రకటన కర్తలకును నాకృతజ్ఞతను తెలుపుచున్నాను.

పండితులకు విన్నపము

ఈ గ్రంథమునందింకను గల అజ్ఞాన కృతములగు దోషములను పొరపాటున కలిగిన దోషములను, మన్నించి పండితులు దయతో నాకు తెలిపిన యెడల కృతజ్ఞతతో వందన పూర్వకముగ గ్రహించి మఱియొక ముద్రణమునందు సవరించుకొందును.

పరాభవ ఫాల్గుణ శుద్ధ 3 లు
14-3-1967.

ఇట్లు
గ్రంథకర్త

ద్వితీయ ముద్రణము

ఈశ్వరానుగ్రహమున 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ భాగము 1967 వ సం|| మార్చినెల యందును, ద్వితీయ భాగము 1969 వ సం|| ఏప్రెల్ నెలయందును, తృతీయ భాగము 1976 సం|| సెప్టంబరు నెలయందును చతుర్థభాగము 1980 వ సం|| జూలై నెలయందును ముద్రింపబడినవి.

ఈ గ్రంథమంతయు నాలుగు భాగములు, పదునాఱు ప్రకరణములు 314 అధ్యాయములు, (ఉపోద్ఘాతములు, పలువురి అభిప్రాయములు గాక) గ్రంథభాగము మాత్రము సుమారు 2200 పుటలకు అయినది. గ్రంథమంతయు షోడశ ప్రకరణములు కలదగుటవలన ఈ గ్రంథమునకు 'వేదాంత షోడశి' అను నామాంతరము చెల్లును.

ఈ భాగము ప్రథమ ముద్రణమున చాల అచ్చుతప్పు లుండినవి. వాటిని నీ ముద్రణమునందు సవరించితిని. ఐనను ప్రూఫులు దిద్దునప్పుడు పొరపాటున నిలిచిన అక్షర లోపములు మొదలగు స్వల్పదోషములు కొలదిగా నిందును కలవు. అవి అంతగా పాటింపదగినవి కాకపోయినను సవరణ పత్రమున వాటిని చూపితిని. అందును చూపక జారిపోయిన తప్పులున్న పాఠక మహాశయులను మన్నింపగోరుదును. ప్రథమ ముద్రణమున విపులముగా చర్చించియుంటిని. ప్రస్తుతము వాటియందు కొంత చేర్చి వ్రాసితిని. అవియు కొంచెమే కాని, క్రొత్త అధ్యాయములుగాని క్రొత్త సిద్ధాంతములు గాని యిందు చేర్చలేదు.

ప్రథమ భాగము వెలువడిన ఒక సంవత్సరమునకే దాని ప్రతులు అయిపోయినవి. అప్పటినుండి పలువురు జిజ్ఞాసువులు ప్రతులకొఱకు ఉత్తరములు వ్రాయుచుండిరి. వ్రాసిన వారికెల్ల, నావద్ద ప్రతులు అయిపోయినవి అని బదులు వ్రాయుచుంటిని. ద్వితీయ ముద్రణమును చేయింపుడని కొందఱు కోరుచుండిరి. కాని గ్రంథమంతయు పూర్ణముగ వెలువడినగాని ఈ భాగమును రెండవమాఱు ముద్రించుటకు నా కిష్టము లేదు. ఇందుకు ద్వితీయ భాగమును, ఈ భాగముయొక్క ద్వితీయ ముద్రణమును ఒకసారి సాగించుటకు నా అనారోగ్యము, ధనాభావమే కారణములు. వర్తమానకాలమున గ్రంథ రచనమునకంటె గ్రంథమును అచ్చువేయించుట మిగుల కష్టము. ధనమున్నను

ప్రెస్సువారి సహకారము ఉండదు. ప్రస్తుతము ఎటో వ్యయప్రయాసలతో గ్రంథమంతయు (నాలుగు భాగములు) అచ్చువేయించితిని - శ్రీహరికృప.

ఇప్పటికి ద్వితీయ భాగముయొక్క ప్రతులుకూడ దాదాపు అయిపోయినవి. కనుక ప్రస్తుతము 1-2 భాగములు పునర్ముద్రణము చేయించవలెనని సంకల్పము కలిగెను. కాని చిరకాలమునుండి నన్ను వీడకయుండు నరముల దౌర్బల్యమను వ్యాధికితోడు ఎడమకంట శుక్లము ముదిరినది. ఆ కన్ను ఆపరేషను చేయించుకుంటిని. కంటిచూపు పోయినది.

(ఒంటి కంటిచూపు, అదియును పూర్తిచూపు కాదు. వయస్సు నాకిప్పుడు 77 సంవత్సరములు)

ఈ చతుర్థ భాగము ముద్రణము పూర్తి అయిన వేంటనే "శ్రీరామావతార రహస్యము" అనుగ్రంథమును వ్రాయదలచి కొంతవరకును వ్రాసితిని. ఇప్పుడు కంటిచూపు తగ్గినందున దానిని పూర్తి చేయగలనో చేయలేనో చెప్పలేను.

ఈ భాగము ప్రథమ ముద్రణముయొక్క ఉపోద్ఘాతమున బ్రహ్మజిజ్ఞాస మూడు భాగముల గ్రంథమనియు అందు తృతీయ భాగము అచలబోధను తెలుపునట్టి దనియు వ్రాసితిని. ద్వితీయ భాగముయొక్క రచన ముగిసిన వేంటనే రామడుగు శివరామ దీక్షితుల అచల మతబోధకు సంబంధించిన గ్రంథ భాగమును చిత్తుప్రతిని వ్రాసియుంటిని. దానిని తృతీయ భాగముగా ముద్రింపదలచితిని. కాని, దీక్షితులవారి అచల బోధను చక్కగా అవగాహనము చేసికొనవలెనన్న పాఠకుల కందఱకు మఱికొంత వేదాంత విషయము తెలిసియుండిన మంచిది. కనుక షడ్దర్శనములు, షణ్మతములు - వీటిని గుఱించి తెలుపుట మంచిదని వాటిని వ్రాసి తృతీయ భాగమనియు, అచలబోధను తెలుపు గ్రంథ భాగమును చతుర్థ భాగమనియు ఆ విధముగా 3-4 భాగములు రెండు సంపుటములుగా ముద్రించితిని.

'బ్రహ్మజిజ్ఞాస' రచన ప్రారంభించునపుడు నాశరీరోపాధి యేస్థితితో నుండెనో యీ భాగములో ప్రథమ ముద్రణముయొక్క ఉపోద్ఘాతమున తెలిపియుంటిని. అప్పటిలో కొందఱు మిత్రులు సన్నిహితులు "ఇతడేమి ఈస్థితిలో గ్రంథమును వ్రాయుటేమి" అని సంశయించిరి. వారి భావమును నా యెదుట ప్రకటించిరి. గ్రంథమంతయు వ్రాయగలనను నమ్మకము నాకును

లేదు. ఈశ్వరానుగ్రహమున్న అసాధ్య మేమున్నది! అనారోగ్య మెక్కువైనపుడు గ్రంథ రచన నిలిచిపోవుటయు, కొంచె మారోగ్యము కలిగినపుడు కొంత భాగము ఆశువుగా చెప్పుచు నావారిచేత వ్రాయించుటయు, కూర్చుండుటకు శక్తి కలిగినపుడు కొంత స్వయముగా వ్రాయుటయు - ఈ విధముగా గ్రంథము పూర్తి అయినది.

గ్రంథమును వ్రాసి అచ్చు వేయించుటకు పూర్వము పెద్దల కెవరికైన చూపుట కొందఱికి అలవాటు. నేనీ గ్రంథమును సరిచూచి ఇమ్మని యెవ్వరికిని చూపలేదు. భగవంతునిపై భారము వైచితిని గనుక తప్పో - ఒప్పో వ్రాసిన దానిని ప్రచురించితిని. తప్పులను పెద్దలు మన్నింతురని నమ్ముచున్నాను.

కృతజ్ఞత

ఈ గ్రంథముయొక్క ప్రథమ ద్వితీయ భాగముల పునర్ముద్రణలో తిరుమల తిరుపతి దేవస్థానమువారు ద్రవ్య సహాయ మొనర్చిరి. ఈ విషయమున భగవంతుడగు శ్రీ వేంకట రమణస్వామి వారికిని తి. తి. దేవస్థానపు కార్య నిర్వహణాధికారి శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఎ.ఎస్. గారికిని, పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, ఎం.ఎ., బి.ఇడి. గారికిని, సప్తగిరి పత్రికా సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు, ఎం.ఎ. గారికిని, కమిటి సభ్యులు శ్రీ ధూళిపాళ అర్కసోమయాజులు, ఎం.ఎ. గారికిని నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను.

సర్వే జనాః సుఖినో భవంతు
పరమేశ్వరార్పణమస్తు
శుభమస్తు

ప్రస్తుత నివాసము
చిత్తూరు

ఇట్లు
గ్రంథకర్త

పరిచయము

"నలుసులు రాకుండ ననల తేనియ దీసి
త్రావి త్రావించు దార్శనికుని నుడుపు"

అని ఆచార్య రాయప్రోలు సుబ్బరావు -డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిని గురించి చేసిన మదింపు అప్పటంగా మజ్జిబోయిన రామసుబ్బయ్యగారి పట్ల సరిపోతున్నది. తెనుగు లిపిలో వేదాంత గ్రంథాలున్నవిగాని, తెనుగుభాషలో చాలా తక్కువ. దేవభాషలో చెప్పిన దేవరహస్యాలు మానవులకు అందజేయరాదని కాబోలు స్థానిక భాషలలో వేదాంత గ్రంథాలు తక్కువగా వెలువడినవి.

మొట్టమొదటిసారిగా సంస్కృతేతరభాషలలో భగవద్గీత వ్యాఖ్యానం వచ్చినది-మహారాష్ట్ర భాషలో అయినట్లున్నది . దీనిని విజ్ఞానజ్యోతి జ్ఞానదేవుడు ఆత్మానుభూతిలో చిన్నతనాననే వెలువరించినారు. ఈ జ్ఞాని 1296 లో జీవ సమాధి పొందినారు. ఈ కాలం మన తిక్కన సోమయాజి-ఎఱ్ఱాప్రెగ్గడల సందుకట్లు.

తెనుగులో సీతారామాంజనేయ సంవాదం పద్యరూపంలో నున్నందున సామాన్యులకు అందుబాటులో లేకున్నది. అందినా - అది ఒక శాఖ దర్శనాన్ని చెప్పినదేగాని భారతీయ సమగ్ర వేదాంత తత్త్వాల జోలికి పోలేదు. సాధారణంగా పండితుల వ్రాత, వారి ప్రవచనాలు పారిభాషిక పదజాల పంకిలంలో కుత్తుకబంటి కూరుకొనిపోయి ఉండడంవల్ల విన్న వారికి ఎండమావుల నీరుగానే జ్ఞానపిపాసను తీర్చలేక పోవుచున్నవి.

తెనుగులో తత్త్వ గ్రంథాలు

మొదట నీ సమగ్ర తత్త్వచరిత్ర సర్.సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి భారతీయ తత్త్వశాస్త్రమును బులుసు వారి ఆంధ్రానువాదం ద్వారా తెలుసుకోగలిగినాము. ఆ తర్వాత ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర చరిత్రవలన వివిధ దర్శనముల చరిత్ర తెలియవచ్చినది. ఈ సంకలనము కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖవారిచే మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ప్రోద్బలంతో

చేయబడినది. ఈ ఆంగ్లమూలానికి ఆంధ్రానువాదం సరిపెల్ల విశ్వనాథ శాస్త్రి చేయగా, హైదరాబాద్ సారస్వత పరిషత్తువారు ప్రచురించినారు. ఇది ప్రపంచ వివిధ తత్త్వముల వివరణ-సమన్వయాలతో కూడుకొని యున్నది. జిజ్ఞాసువులకు ఎంతో ఉపయోగకారి.

వీటి తర్వాత చెప్పదగినది బహుజనోపకారి అయినది. వివిధ విషయమహోదధి అనదగినది శ్రీ రామసుబ్బయ్య బ్రహ్మజిజ్ఞాసయే. మొదటి రెండుభాగాలు సామాన్య పాఠకునికి హిందూతత్త్వ జ్ఞానానికి విపులదృఢ అస్త్రభారం కుదుర్తున్నది.

బ్రహ్మజిజ్ఞాస

పూర్వం ఒక్కొక్క సాధకుడు స్వీయానుభవాలతో ఒక దార్శనిక శాఖను చీలదీసేవాడు. దానికి ఒక ప్రవక్త, ఒక దేవత, ఒక సిద్ధాంత గ్రంథము, వీటికి మూలమ్మైన పురాణము పుట్టింపబడి మన షడ్దర్శనాలు తామరతంపరలైపోయినవి. ఒక్క అద్వైతమతమునందే ఎన్నో అవాంతరభేదాలు.

వీటి అన్నిటి తత్త్వము - మతము - పురాణములను విప్పిచెప్పి సామాన్యునికి వేదంతజ్ఞానం ప్రసాదించగలిగిన సమగ్ర మత, తత్త్వగ్రంథము ఈ బ్రహ్మజిజ్ఞాస! తత్త్వబాహుళ్యాన్ని తెలుసుకోను ఎక్కడికెక్కడికో పోవలసిన పనిలేకుండా రామసుబ్బయ్యగారు ఆ విజ్ఞానమణులను ఏరి సానలు బెట్టి ఒకేచోట కుప్పలుబోసి ఆ జ్ఞానజ్యోతిలో ఎరుక కలిమిని తెనుగువారిని పొందమంటున్నారు. ఈయనది సంప్రదాయకదృష్టి. ఈ చూపుతోనే మన మతాల స్వరూపాలను వర్ణించి, పోల్చి, భేదాలు ఎత్తిచూపి సమన్వయం చూపి హిందూ వేదాంతసారాన్ని అంతా ఒక గిన్నెలో బోసి గ్రోలమంటున్నారు.

రచనావైదగ్ధ్యం

తత్త్వజ్ఞాన సముపార్జనాసక్తులు మన శాస్త్రాలను, స్మృతులను, పురాణాలను వాటి సారాన్నంతా ఇందు చూడగలరు. ఈ సేకరణ

చాలమందికి అలవిగానిపని. దీని ప్రత్యేక విశేషమేమంటే-ఇందు ఉదాహరించిన వివిధ శాస్త్రసూత్రాలు, శ్లోకాలు, పద్యాలు రామసుబ్బయ్యగారి నాలుకమీదనే లాస్యం చేస్తుంటవి. ఆధారణ స్ఫురణల వైశాల్యగభీరతలు ఆశ్చర్యజనకాలు. తడువుకోకుండా తడబడకుండా తాను వ్రాసిన మూడుభాగాల విషయం కర్కశ క్లిష్టభాషా దారిద్ర్యాన్ని ఎరుగని విస్పష్ట విపుల సరళ సజీవభాషలో చెప్పుతుంటారు. అట్లే వ్రాసినారు. వీరు భావం భాష ఊట కాలువ నీళ్ళవలె తేరి ఉంటవి. ఇట్టి ఘనతరమైన వైజ్ఞానిక దుస్తరకర్మ (Intellectual feat) అపూర్వమైనది. ఇదంతా ఒక పూర్వజన్మ విద్యావిభవం అనాల!

వివరణప్రజ్ఞ ఈ వ్రాతలలో మొదటి విశేషం. భాష తనంతనే వెదుకుకొని వచ్చి బంతిలో కూర్చుంటుంది. ఈయన ఇంగ్లీషులో పండితులై యుండినచో అఖిలభారత మహాతత్త్వవేత్త - గ్రంథకర్త అయి ఉండేవారు. తన వాదాన్ని పురాణాలద్వారా సమర్థించడం నేటి హేతువాదులకు కొందరికి నచ్చకపోయినా రామసుబ్బయ్యగారి విషయపరిజ్ఞానానికి ముగ్ధులు కాకతప్పదు. ఆధునికదృష్టి కొరతబడినా, పురాణవాఙ్మయ నిష్ణాతులైన ఛాందసుల పిడివాదము వీరికి లేదు. అత్యధిక సంఖ్యాకులకు ఆమోదకరమైన ఉదారాశయాలు వివరణలు ఇందు మెండుగా గలవు. చదివినది అర్థం చేసుకొని అనుభవానికి తెచ్చుకొన్నారు కాబట్టి యీ వివరణలో ఇంతటి స్పష్టత-కాంతి చేకూరినది. ఈ కారణంవల్లనే అన్ని రుచులవారికి ఈ రచన ఒక మృష్టాన్నంగా ఉంటున్నది. అరకొర లేకుండా ఆరగించి, తేపవలసినదే.

రచయిత వంశాదులు

ఇంతటి ఈ చదువుల కుప్ప వినమ్రులు, వినీతులు, ఒకరిని గూర్చి దురుసుమాట అనలేరు. జ్ఞానసముపార్జనంలో తృప్తిపడని జ్ఞానపిపాస గలవారు. ఇంతకూ ఆయనకు బడి చదువు లేదు-మత్సరులైనందున బోద్దల ప్రాపు లేదు. లౌకిక కార్యకలాపాలలో ఉండే, భూతల జీవితం గడుపుతూనే ఈ ఆధ్యాత్మిక సంపదను చేకూర్చుకొని,

ఇతరులకు దానం చేస్తున్నారు. సరసమిత్రులు. ప్రేమించి ప్రేమింపబడుతారు.

"అంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు కాద"నే దానికి ఇప్పుడు ఆ అప్పకవి లేడు కాబట్టి-నాలుకతో వద్దంటూనే చేతులతో కులాలను ప్రోత్సహిస్తున్నారు. కాబట్టిన్నీ ఈ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు యాదవ కులీనుడని చరిత్రకుగా చెప్పుకోవలసి వస్తున్నది. ఈ మట్రి పోలేదు - వస్తూనే ఉన్నది. విద్యాశిలాలతో కొమ్మలు రెమ్మలు పూలతో పరిమళించే యీయన వంశ చరిత్ర కొంత చెప్పుకొందాం.

1904 సంవత్సరం మార్చి 27-వ దినాంకమున ఈ గ్రంథకర్త జన్మించినారు. చాంద్రమానం ప్రకారం. అదిక్రోధి (యీయనపట్ల ఆదిలో క్రోధమే చూపినది) చైత్రశుద్ధ ఏకాదశి. ఏకాదశి కాబట్టి జగజ్జనని జ్ఞానకలశంతో ఇంటి కడపలో ప్రత్యక్ష మైనట్లున్నది. పుట్టిందీ - ప్రాతకడపలోనే! తండ్రి సుబ్బయ్యగారు. 1918లో స్వర్గస్థులైనారు. మరి రెండేళ్ళకు తల్లి లక్ష్మమ్మగారు దివిలో భర్తను చేరబోయినారు. నాయనమ్మ ఓబుళ్ళమ్మగారు ఏ అండాలేని యీ మనుమని (శ్రీ రామసుబ్బయ్యను) తన రెక్కలక్రిందకు తీసుకొని పెద్దజేసి 1921లో 17వ ఏట పెండ్లి చేసినారు. ఈయన అర్ధాంగిగా నోచుకొన్నవారు నరసమ్మగారు.

తండ్రికి కొద్దిపాటి సేద్యపునేల ఉండినా, లోకల్ బోర్డు కాంట్రాక్టరైనా ఆర్థికంగా కుటుంబం బాగా రెక్కో లేదు. మిత్తి కనిపెట్టుకొనే ఉండి, రామసుబ్బయ్యగారిని సాకి సంతరించిన పితామహినిగూడ పెండ్లి అయిన రెండేండ్ల లోపలనే మ్రింగినది.

భక్తిజ్ఞానం

చిన్ననాటినుండి రామసుబ్బయ్యగారికి శ్రీరామచంద్రుడు ఇష్టదేవత. ఆ కోడెప్రాయంలోనే దైవచింత - పురాణ - వేదాంత శ్రవణాలయందు ఆసక్తి కలిగి భక్తి వైరాగ్యాలకు ఆయన మానసంలో అంకురార్పణ చేసినది. పూర్వపుణ్య పరిపాక రూపంలో అవి ఎదుగుచూ వచ్చినవి. కడపయందలి శ్రీరామకృష్ణ సమాజ మందిరములో వివేకానంద

పుస్తకభాండాగారం ఉండేది. అందలి ఆధ్యాత్మిక గ్రంథపఠనంతో పాటు అప్పుడప్పుడు జరిగే మహోపన్యాసాలు విని, ఆత్మవిద్యా పరాయణమైన రామసుబ్బయ్యగారి మనసు జ్ఞానకాంతులతో నిండిపోతుండెడిది. ఈయన ఆ సమాజ కార్యవర్గసభ్యుడు-ఆనరరీ లైబ్రేరియన్‌గా కొంత కాలముండడము వల్ల ఆ సదవకాశంతో విద్యాలత బాగా ఎగబ్రాకినది. సంసారిగదా - జీవన భరణ భారాన్ని తగ్గించుకొనేదానికి జవిళీ వ్యాపారం బెట్టినారు. నమ్మిన ఇలవేల్పు రామచంద్రుని కరుణాకటాక్ష వృష్టి వర్షించి జ్ఞానలక్ష్మి, సంపల్లక్ష్మి సస్యాలు ఏపుగా ఎదిగినవి.

మనసును కుదుటబెట్టిన జబ్బు

ఇంతలో 1949లో రామసుబ్బయ్య జబ్బునపడినారు. అది మంచాన పడవేసినదేగాని మతిని చెడగొట్టలేదు. చదువుకు నిలకడ, తీరిక దొరికినవి. ఆధ్యాత్మిక గ్రంథపఠనము దైవచింత రెపరెప ఎదిగి, మనసును లోపలికి మళ్ళించి, ఇంతటి దార్శనిక విద్యాపండితునిగా జేసినది-వ్రాత కుదిరినది. చదువుకొన్నదానిని మరచిపోని ధీశక్తి యీ 73 ఏట గూడ చెక్కుచెదరకుండా ఉన్నది. కీర్తి - ఆత్మశాంతి - సంతాన సౌభాగ్యం బాగా ఇచ్చి దేవుడు, ఆరోగ్యాన్ని తన పిడికిటే పట్టుకొన్నాడు. కాని శారీరక యాతనల పాల్జేయలేదు.

కవితాగుణం

వేదాంతగ్రంథ పరంపరా సికతాతలాలలో కవితా స్రవంతి ఇగ్రింకిపోవడం సహజం, కాని రామసుబ్బయ్యగారితో కవిత్వము జాలువారింది. భక్త్యావేశాన్ని మేనంతా మొలకలెత్తించుకొని ఇష్టదైవం శ్రీరాముని ప్రశంసాపద్యసుమాలతో అర్చించినారు. ఆ శతకంలో రెండు పద్యాలు చూడండి.

సీ|| "కన్నతండ్రీ !నన్ను గరుణం జూడుము వేగ
నీకృపలే కొక్క [illegible]మైన
నిలువంగ జాలను [illegible] డుము
ప్రతికాల [illegible]

జాలక శ్రమచేతఁ-జాల డస్సితినయ్య
అలమట దీర్పవే-యమర వంద్య
తప్పులున్న వటంచుఁ-దండింపఁ దలఁచితే
శరణార్థి యెట్లు శి -క్షకును దగును?

"నన్ను శరణం బటంచును -నిన్ను సర్వ
పాపములనుండి బాపుదుఁబార్థ"యనుచు
బలుక వే తొల్లి యదుకుల -ప్రభుఁడ వగుచు
జయము శ్రీరామ! దేవతా-సార్వభౌమ!"

సీ|| "ఆయువా వృక్షశా - ఖాగ్ర చంచల పత్ర
జలబిందు వట్లెప్డు -జారిపోవు
మానసేంద్రియములా - మాయాపరీవృత
బంధజాలమునుండి - పాయలేవు
జీవితమా దుఃఖ - భావనా బహుళమై
యల్ప సుఖాభాస - మగుచునుండె
బ్రాఙ్గని పుణ్యమా - పరికింప నదినాకు
నేమున్నదో యేమొ - యెఱుంగ లేను

జిత్తగింపుము నేఁజేయు-చిన్నమనవి
యంత్య కాలంబులోన నా - యండనుండి
యాదరింపుము సకలలో - కాధినాథ!
జయము శ్రీరామ!దేవతా - సార్వభౌమ!

దేవుని ఒకమారు దబాయిస్తారు, ఇంకొకమారు వేడుకొంటారు. ఒకసారి కర్తవ్యాన్ని గమనం చేస్తూ వివిధ రసాలతో సీసపద్యాలు వ్రాసినారు.

సంతానభాగ్యం

రామసుబ్బయ్యగారు సుకృతి ప్రేమించి ఆదరించి సేవించే సంతానం-కందగడ్డవలె చక్కటి పిలకలుబెట్టి సంతోషపెట్టుచున్నది.

కుమారుడు శ్రీరాములుగారు మహాగుణవంతుడు - విద్యాపరుడు - న్యాయతీర్పరియై అసిధారావ్రత చర్యగా సబ్ జడ్జిపదవిని పాలిస్తున్నాడు. ఈయన సతీమణి గోవిందమ్మగారు భాగ్యశాలి. కలకలలాడే సంతానాన్ని చూచుకొంటూ, భర్తను ప్రేమించి ఘనపరుస్తూ సంస్కారితమైన ఆ గృహవాతావరణంలో అత్తమామల సేవిస్తున్నది. శ్రీ రామసుబ్బయ్య కూతురు సౌ॥భా॥ సుభద్రమ్మ, బి.ఎ., బి.ఇ.డి., అయి అధ్యాపకురాలుగా బిడ్డలతో ఉద్యోగియైన భర్త శ్రీ బింగి రామసుబ్బయ్యతో సుఖముగా నున్నది.

వీరి ఇంట ఎలపాది విద్యాగంధము పరిమళిస్తున్నది. తండ్రికి తాతకు సుఖశాంతుల నిచ్చేది యీ చదువుల సిరియే!

శ్రీరాములుగారి సంతానం

ప్రథమ పుత్రుడు చి॥ రామప్రసాద్ డాక్టర్ పట్టంబొంది, బైలదిల్లనిలో కిరందుల్‌లో పనిచేస్తున్నాడు. రామప్రసాద్ కర్నూలు న్యాయవాది శ్రీ మేకల చిన్న సుబ్బన్న (డి.సి.సుబ్బన్న) రత్నమ్మగార్ల పుత్రిక చి॥సౌ॥ రామసుబ్బమ్మను ఉద్వాహమాడినారు. (వీరికొక పుత్రిక. పేరు చి॥ రాధిక.); పెద్దకూతురు చి॥సౌ॥ రాజ్యలక్ష్మి, బి.ఎస్.సి., ప్యాసై బ్యాంకు ఉద్యోగి-గుమ్మా కృష్ణమూర్తిగారిని ఉద్వాహమై సంతానవతియై పండంటి కాపురంతో ఆనంద మనుభవిస్తున్నది. (వీరి కుమారుని పేరు చి॥రామచరణ్); రెండవ కుమారుడు చి॥ రామకిశోర్ నిన్న మొన్ననే బి.కాం. ఉత్తీర్ణుడైనాడు. చి॥ విజయకుమార్, చి॥శారద చి॥ శర్వాణి - కాలేజిచదువులలో ఉన్నారు. చి॥ మజుల గాయత్రి హైస్కూల్ విద్యార్థినులు.

నిండు ఆరోగ్యంతో విద్యాబుద్ధులతో ఈ కుటుంబము అభివృద్ధ్యున్ముఖమై పరిచితులకు గూడ ఆనందాన్ని గూరుస్తున్నది. తాత ఆధ్యాత్మిక విభూతే వీరి రక్షణ కవచముగా జీవనయాత్రలు గడుపగలరు.

అపర్ణ (సం) మరుపూరు కోదండరామిరెడ్డి.
జేమ్స్ గార్డెన్, నెల్లూరు
23-8-1976.

తృతీయభాగమును గురించి పండితాభిప్రాయములు
మహాకవి - విద్వాన్ - బ్రహ్మశ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారి అభిప్రాయము

బ్రహ్మ విద్యా విశారదులు శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్య మహాశయులకు వినతిపూర్వక విజ్ఞప్తి...

ఆర్యా!

మీరు ప్రీతి పూర్వకముగా నొసగిన మీ "బ్రహ్మజిజ్ఞాస" తృతీయభాగము చదివి యానందించినాను. మీకు నాయెడల గల ప్రేమాభిమానములకు అత్యంతము కృతజ్ఞుడను.

వేదాంత శాస్త్రమున మీరార్జించిన పరిపూర్ణ విజ్ఞానమును జిజ్ఞాసు లోకమున కందించుటలో మీరు కైకొన్న శ్రద్ధ బహుధా ప్రశంసనీయము.

కేవలాంధ్రులకు అందుబాటులో లేని షడ్దర్శనములను విశద వివరణములతో కరతామలక మొనరించినారు.

మఱియు షణ్మతములను పేర్కొని, అందు వైదికము లేవో-అవైదికము లేవో విశదీకరించుటయే కాక మతముల వలన సమాజమునకు కలుగు లాభములు-నష్టములు కూడా తెలియజెప్పినారు.

వేదాంత విషయములందును, మతముల విషయమునను సామాన్య లోకమునకు కలుగు సందేహములను మీరే సూచించి వాటికి తగు ప్రమాణములతో సముచిత సమాధానములు పొందుపఱచినారు.

మీ విమర్శనదృష్టి సునిశితము. మీ సిద్ధాంతములు అప్రతిహతములు. ఉదాహరణకు, "బౌద్ధమతము అవైదికము కాదు; బుద్ధుడు నాస్తికుడు కాడు. బౌద్ధమతమున కాలక్రమమున మార్పు లేర్పడినవి. అది గమనింపక శ్రీ శంకరులు 'అది అవైదికమత' మనుకొని, ఆమతమును ఖండించినారు." కాలక్రమమున బౌద్ధమతమున కలిగిన మార్పులను శ్రీ శంకరులు

తెలిసికొనుటకు వారికి వారి కాలమున సరియైన ఆధారములు లేకపోయినవి అన్న సిద్ధాంత మొక్కటిచాలు.

ఒకచోట మీరు - "దేవుడున్నాడని, దేవునికొఱకై నేనీపని చేయుచున్నానని చెప్పి పరమతములవారి కుత్తుకలు నఱికించిన రాతిగుండె గల ఆస్తికుని కంటే సర్వభూతములను ప్రేమించినవాడును, ఒక క్షుద్రజీవియగు గొఱ్ఱె కాలు విరిగి నడువలేక బాధపడుచుండుట చూచి సహింపలేక భుజముపై వేసుకొని పాదరక్షలు సహితము లేక యెండలో చాల దూరము నడచివచ్చిన కరుణామూర్తియు దీనబాంధవుడు నునగు నాస్తికుడే భగవంతునకు మిక్కిలి ప్రియుడు" అన్నారు.

ఇది సువర్ణాక్షరములతో లిఖింపదగిన వాక్యము. బుద్ధుడు నాస్తికు డనుకొనువారికి కనువిప్పు.

అయ్యా, మీ గ్రంథ మొక మహాసముద్రము. అందు అనర్ఘములైన యిట్టి వాక్యరత్నము లెన్నోయున్నవి. వాటి నన్నిటిని ఎత్తి చూపుట సాధ్యము కానిపని.

ఎక్కువ వ్రాత లెందుకు? మీ గ్రంథము ఆత్మతత్త్వ జిజ్ఞాసువులకు మహోపకారకము. అట్టి గ్రంథమును రచించిన మీ ప్రతిభావ్యుత్పత్తులు, మీ లోకోపకార పరాయణత విద్వద్వినుతి పాత్రములు.

మకాం. శ్రీశైలము,
14-8-76.

ఇట్లు, భవదీయుడు,
(సం) దీపాల పిచ్చయ్య శాస్త్రి.

(పూర్వోత్తర మీమాంస విశారద-బాలవ్యాస)
బ్ర. శ్రీ స్వయంపాకుల వేంకటశేషశాస్త్రిగారి సమీక్ష

కస్తూరిదేవి నగర్,
నెల్లూరు.

శ్రీ రామసుబ్బయ్యగారు అసంఖ్యాకములగు భేదతత్త్వ ఉపాసనా ప్రతిపాదకుల మూల సూత్రములను వారి ప్రమాణములను సేకరించి ఈ పుస్తకమును వెలువరించుట యెంతయో ముదావహము. లోకమునకు మహోపకార మొనరించినట్లైనది. ఇట్టి ఈ పుస్తకము అవసరమని నా యభిప్రాయము. ఆయా మతోపాసకుల మనఃఫలకమున సంశయములు గోచరించినపుడు సత్యాసత్యముల నిటువంటి గ్రంథములద్వారా నిర్ణయించుకోగలరు. ఈ గ్రంథమున మతతత్త్వ నిర్ణయములను శ్రీ రామసుబ్బయ్యగారు వివరించుటయందు లోకోపకారమైన గొప్ప కృషి చేసిరి. ఈ గ్రంథమున శ్రీ రామసుబ్బయ్యగారు అనేక ప్రమాణములు, వారి వ్యాఖ్యానములు, వారి భేదాభిప్రాయములు వివరించుటలో శంకరాద్వైత సిద్ధాంతమునే స్థిరపరచినట్లు సూచితమగును. శాక్తేయమున శైవమున వీరి కృషి అపారమైనదిగ తోచుచున్నది. ముముక్షువులకు వ్రాయునపుడు భిన్న మతస్థులకు, భిన్నోపాసకులకు ఏ భాగమున నేకాభిప్రాయమో, ఏ భాగమున ఏకాభిప్రాయము కుదురదో - ఆ విషయము లన్నింటిని చక్కగ వివరించిరి.

న్యాయసూత్రములను తొలుదొల్త పేర్కొని గౌతమకాణాదుల సిద్ధాంతమును, అణువాదము నిరూపించుటయేగాక, జన్మరాహిత్య మెట్లు కలుగును. ఆత్మ నిత్యత్వము. జీవునకు కర్మఫలప్రాప్తి; జన్మాంతర ప్రాప్తి జగత్కారణకర్త; ప్రపంచోత్పత్తి; శబ్దసంయోగ విభవము - మున్నగు విషయములు విభవముగ వ్రాసిరి. వైశేషిక మతమున షట్పదార్థవాదము, వేదాంతనైయాయికుల మతమునకు పరస్పరము గల భేదనిరూపణము; వైశేషిక దర్శనమున సిద్ధాంతమును సమగ్రముగ నుపపాదించిరి.

మరికొన్ని చోట్ల శాక్తేయ, వామాచార, సమయాచార భేదములు సులభముగా వివరింపబడినవి. శ్రీ శంకరుల వారి గాణాపత్యాది షణ్మతస్థాపనకు కారణమైన ప్రమాణములు సులభముగ వివరింపబడినవి. కాపిల సాంఖ్య వేదాంతములయొక్క విభేదములును ప్రకృతి తత్త్వ సంఖ్యావివరణమును, మరికొన్ని చోట్ల పారిభాషిక సిద్ధాంతములు వివరించిరి. ఈ గ్రంథమున వీరి బుద్ధి వైశద్యము, మేధాసంపత్తి, పరిశ్రమ, పెద్దల శుశ్రూష, గురుకృప గోచర మగుచున్నవి. ఇట్టి గ్రంథము ముముక్షువులకు ఆవశ్యకమని తలంచెదను.

మంగళం మహత్.

అఖిల ఆంధ్ర సాధు పరిషద్ అధ్యక్షులు, గీతావాణి సంపాదకులు, భూమానందాశ్రమాధిపతులు అగు ప॥ప॥ శ్రీరామకృష్ణానందస్వాములవారి అభిప్రాయము. గండీక్షేత్రము - కడప జిల్లా.

మానస సరోవరవిహారి హంసరాజముబోలె "బ్రహ్మజిజ్ఞాసా"ప్రస్రవణ ప్రవణులు శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్య రచించిన "బ్రహ్మజిజ్ఞాస" తృతీయభాగమును శ్రద్ధాతత్పరతలతో పఠించినాను. ప్రథమభాగము, ద్వితీయభాగము తర్వాత యిది తృతీయభాగము. నాల్గవభాగ మొకటి ముందు రానున్నట్లు రచయిత సూచించినారు.

వీరి అగాధ పరిశ్రమకు హృదయం చకితమైంది.శాస్త్ర పారావారాన్ని ఆపోశనం పట్టిన అపర అగస్త్యుడా అనిపించింది. ఆంధ్రుల పాలిటికి నాలుగు వేదాలవంటి జ్ఞానభండారములను ప్రసాదించిన అభినవ వ్యాసులా అని అంతరాత్మ పలికింది. వారే స్వయముగా వ్రాసుకొన్నట్లు పరమేశ్వరానుగ్రహసిద్ధికి వీరి రచనలు సజీవ దృష్టాంతాలు.

వేదవిచారంతో ప్రారంభించి అద్వైత వేదాంతాన్ని సాంగోపాంగంగా ప్రథమభాగములో వివరించారు. జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ,

భక్తియోగ, ప్రపత్తియోగములనే అయిదు ప్రకరణాలతో ద్వితీయభాగము ఆధ్యాత్మిక వివిధ విషయ రత్నాకరమై వెలసింది.

ఇది తృతీయభాగము. దీనిలోనూ అయిదు ప్రకరణాలు. ఆరువందలకు పైగా పుటలు. షడ్దర్శన విచారము ప్రథమ ప్రకరణము. వైష్ణవ శైవ శాక్తాది మతములను గురించినది రెండవ ప్రకరణము. జైనమతమును గుఱించి మూడవ ప్రకరణము. బౌద్ధమత విచారముతో నాల్గవ ప్రకరణము. చార్వాక లోకాయతకాది నాస్తిక భౌతికమతములతో ఐదవ ప్రకరణము.

ఇదే తృతీయభాగము. ఈ "బ్రహ్మజిజ్ఞాస" గ్రంథమునకు చతుర్థభాగ రూపమున ముందు రాబోవు గ్రంథములో అచలమతమును గురించిన విషయ విచారము చేర్చబడునట. అస్తు.

ఈ విధమగు గ్రంథము ఆంధ్రభాషలో ఇదే మొదటిదని తలుస్తాను. తెలుగు భాషీయుల కిది బ్రహ్మవిజ్ఞాన సర్వస్వము. వీరి ఆగాధ శాస్త్ర పరిశ్రమను చెప్పుటకు మాటలు చాలవు. రచయితకు ఇష్టదైవమగు శ్రీరామచంద్ర మహా ప్రభువు వీరికి ఇతోధిక ఆయురారోగ్యములను ప్రజ్ఞాప్రాభవములను ప్రసాదించి అవశిష్ట గ్రంథమును పఠించు భాగ్యమును ప్రసాదించి అవశిష్టగ్రంథమును పఠించు భాగ్యమును ఆంధ్రజాతికి లభించునట్లు అనుగ్రహించుగాక అని ఆశిస్తున్నాను.

ఇట్లు సాధువిధేయుడు,

26-8-1976. (సం) శ్రీరామకృష్ణానందస్వామి.

—— * ——

డా. దివాకర్ల వేంకటావధాని, ఎం.ఎ.(ఆనర్స్)పి.హెచ్.డి.
పూర్వాంధ్రశాఖాధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయము,
హైదరాబాదు-27.

శ్రీయుతులైన రామసుబ్బయ్యగారి సన్నిధికి అనేక నమస్కారములు చేసి వ్రాయు విన్నపములు.

తమరు దయతో పంపిన బ్రహ్మజిజ్ఞాస యందలి మూడవ భాగమును శ్రద్ధాభక్తులతో చదివితిని. భారతీయ సంస్కృతీ వల్లరికి మూలములు వేదములు. వాని ననుసరించి పెక్కు స్మృతులు దర్శనాదులు ఉద్భవించినవి. వాని నన్నిటిని చదివి భారతీయ పూర్వవైభవమును గ్రహించుట పలువురకు సాధ్యము కాని పని. అసలన్నిగ్రంథము లున్నవని ఎఱిగిన వారి సంఖ్యయే చాలా తక్కువ.

భారతదేశమున ఆస్తికమతములే కాక నాస్తికమతములు కూడ బయలుదేరియుండుటచే వాని వాని కనుగుణముగా పెక్కు దర్శనములు, ధర్మగ్రంథములు రచియింపబడినవి.తమ గ్రంథము ఆ మతముల యొక్కయు, వానికి సంబంధించిన దర్శనాది గ్రంథముల యొక్కయు, స్వరూప స్వభావములను అరటి పండొలిచి చేతికందించినట్లు ఆంధ్రపాఠకుల కందించుచున్నది.

ఈ గ్రంథమును రచియించుటలో తాము పరిశీలించిన గ్రంథములు, విమర్శలు తమ పాండిత్యమునేగాక నిరంతర పరిశ్రమను కూడ చాటుచున్నవి. ఏ విషయమును చెప్పినను దానిని సమర్థించుటకై తాము పెక్కు ప్రమాణములను చూపియున్నారు. తా మెడనెడ ఉద్ధరించిన స్మృత్యుపనిషద్దర్శన ధర్మపథమహాభారతాది గ్రంథములందలి భాగములు తమ సర్వోతోముఖమైన కృషిని చెప్పక చెప్పుచున్నవి. తా మెడనెడ మహాతాత్త్వికులని పేరువడ్డ మనీషుల అభిప్రాయములను గూడ సానుభూతితో విమర్శించి యున్నారు. ప్రతి ప్రకరణము చివర తా

మొసంగిన సింహావలోకన పూర్వకమైన సంగ్రహపరిశీలనము పాఠకులకు చదివిన విషయము నింకొకసారి మననము చేసికొనుట కవకాశము కల్గించుచున్నది. ఇక గ్రంథమునందలి మూడు భాగములను కలిపినచో నది భారతీయ తత్త్వశాస్త్ర విజ్ఞానకోశమని చెప్పదగియుండును. తమ భాష సర్వత్ర స్పష్టము, సుబోధమునై యున్నది. అచ్చటచ్చట దొరలిన వ్యాకరణ ముద్రణ స్ఖాలిత్యములను సులభముగా సవరించుకొనవచ్చును. నిజమునకు తమ గ్రంథముపై నభిప్రాయ మొసగు నధికారము నాకు లేదు. శ్రద్ధతో చదివి అనేక విషయములను గ్రహించితిని గావున భక్తితో తమకు జోహారు లర్పించుచున్నాను.

చిత్తగించవలెను.
విధేయుడు,
(సం) దివాకర్ల వేంకటావధాని.

(BIBLIOGRAPHY)

ఉదాహృత గ్రంథములు, వాటి వివరము

గ్రంథనామములు	— గ్రంథకర్తలు / ముద్రాపకలు / అనువాదకులు
ఋగ్వేదము	— పురాణ వాచస్పతి బంకుమల్లె మల్లయ్య శాస్త్రిగారు అనువాదకులు
సామవేదము	— "
కృష్ణయజుర్వేదము	— శ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారు
(న్యా.సూ)న్యాయ సూత్రములు	— పండిత గోపదేవుగారి వ్యాఖ్య
(వై.సూ)వైశేషిక సూత్రములు	— "
(సా.సూ)సూత్రములు	— "
(పా.యో.సూ)పాతంజలి యోగ సూత్రములు	— శ్రీ వివేకానందస్వాములవారి వ్యాఖ్యానమునకు శ్రీ రామకృష్ణ మఠము వారి ఆంధ్రానువాదము
(సాం.కా)సాంఖ్యకారికలు	—
సాంఖ్యభాష్య సారసంగ్రహము	— శ్రీ తాలు శేషాచలరావు
న్యాయకుసుమాంజలి	— ఉదయనాచార్యుల రచనలకు శ్రీ పేరి లక్ష్మీనారాయణ శాస్త్రి గారి అనువాదము
(బ్ర.సూ)బ్రహ్మసూత్రములు	— శ్రీ శంకరభాష్యమునకు శ్రీ పురాణపండ మల్లయ్య శాస్త్రిగారి అనువాదము
కళ్యాణకౌముది	— శ్రీ రా లింగన సోమయాజులు
శ్రీ భాష్యము	— అనువాదకులు శ్రీమాన్ కం.శేషాచార్యులు

ఉపనిషత్తులు:

(ఛాం) ఛాందోగ్య; ముండక; బృహదారణ్యక; అథర్వశిఖ; కేన; స్కంధ, సీతా; గణపతి; ధ్యానబిందు; సరస్వతి రహస్య; త్రిపుర; సూర్య; అథర్వణ శిరః; బ్రహ్వృచ; తైత్తిరీయములు.

గీతలు :

భగవద్గీత

గణేశగీత(గ.గీ.)

శివగీత; దేవీగీత;

పురాణములు :

పద్మ పురాణము

శ్రీమదాంధ్ర భాగవతము	— శ్రీ బమ్మెర పోతనామాత్యులు
శ్రీ భాగవతము	— శ్రీజనమంచి వేంకట సుబ్రమణ్యశర్మ
ఆంధ్ర శివ పురాణము	— శివ శ్రీ ముదిగొండ నాగేశ్వర కవి
దేవీ భాగవతము	— శ్రీ తిరుపతి వేంకటకవులు
ఆంధ్ర భాగవతము	— వచనము శ్రీ సరిమొల్ల విశ్వనాథ శాస్త్రి
ఆంధ్ర వరాహ పురాణము	— నంది మల్లన్న, ఘంట సింగయ్య
"బ్రహ్మాండ పురాణము	— కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మ
"లలితోపాఖ్యానము	— "
శ్రీ కృష్ణావతార తత్త్వము	— "
(నై.సి)నైష్కర్మ్యసిద్ధి	— శ్రీ సురేశ్వరాచార్యులు (వావిళ్ళ)
షడ్దర్శనములు	— శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రి
(భా.త.)భారతీయ తత్త్వశాస్త్రము	— డా॥శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల ఇండియన్ ఫిలాసఫీకి శ్రీ బులుసు వేంకటేశ్వరులవారి ఆంధ్రానువాదము
(వి.స.)విజ్ఞాన సర్వస్వము	— 7వ సంపుటము ప్రో:డా॥కొత్తసచ్చిదానందమూర్తి (సంపాదకులు)గారు
ఆంధ్ర మహా భారతము	— కవిత్రయము వారిది
(సి.శి.)సిద్ధాంత శిఖామణి	— ఈశ్వర సత్యనారాయణశర్మగారి ఆంధ్రవివృత్తి
బసవపురాణము పండితారాధ్య చరిత్రము	— పాల్కురికి సోమనాథకవి
శివతత్త్వసారము	— మల్లికార్జున పండితారాధ్యులు
సౌందర్యలహరి	— లక్ష్మీధర వ్యాఖ్యానమునకు ఆంధ్రీకరణము
ఆంధ్ర లలితాత్రిశతీభాష్యము	— శ్రీ శంకరాచార్యుల భాష్యమునకు శ్రీ గడిపాటి కృష్ణమూర్తిగారి అనువాదము
లలితా సహస్రనామములు	—
కామకలావిలాసము	— శ్రీ పుణ్యానంద మునీంద్ర విరచితమునకు శ్రీ.సి.రామమూర్తిగారి అనువాదము

దక్షిణామూర్తి స్తోత్రము	-	వావిళ్ళ వారిది
దుర్గాసప్తశతి	-	వావిళ్ళ వారిది
(వే.పం) వేదాంత పంచదశి	-	వావిళ్ళ వారిది
జైన ధర్మము	-	శ్రీ వీరచంద్ గారి ఉపన్యాసమునకు ఆంధ్రానువాదము
లలిత విస్తరము	-	శ్రీ.తి. రామచంద్ర. బు. వేంకటరమణయ్య గారల అనువాదము
గౌతమబుద్ధ చరిత్రము	-	శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు
బుద్ధ చరిత్రము	-	అశ్వఘోషుని గ్రంథమునకు కీ.శే॥ తిరుపతి వేంకటేశ్వరుల పద్యానువాదము
బుద్ధ చరిత్రము }	-	వచనానువాదము డా॥ దివాకర్ల వేంకటావధాని
(ధ.ప) ధమ్మపధము }	-	
ఆళవందారు స్తోత్రము }	-	వావిళ్ళ వారివి
అభినవభారతి	-	శ్రీ పోణంగి అప్పారావుగారి ఆంధ్రీకరణము
మాండూక్యకారికలు	-	శ్రీ గౌడ పాదాచార్యులు
బైబిల్		

శ్రీ

విషయసూచిక

తృతీయభాగము-మొదటి ప్రకరణము-షడ్దర్శనములు

రెండవ ప్రకరణము - మతములు

మూడవ ప్రకరణము - జైనమతము

నాలుగవ ప్రకరణము - బౌద్ధమతము

ఐదవ ప్రకరణము - నాస్తిక - భౌతికమతములు

ఓమ్
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మజిజ్ఞాస

తృతీయభాగము :
షడ్దర్శన షణ్మత సార సంగ్రహము

మొదటి ప్రకరణము - షడ్దర్శనములు

శ్లో॥ "చిత్సదానంద రూపాయ సర్వధీ వృత్తిసాక్షిణే।
నమో వేదాంత వేద్యాయ బ్రహ్మణే ఽనంతరూపిణే॥"

(1) ఆరంభము

జిజ్ఞాసువు : అయ్యా! మొదట నేను తమ సన్నిధికి వచ్చినప్పుడు సత్య వస్తువెట్టిదో తెలుపుమని కోరితిని. తదుపరి అచలబోధ యెట్టిదో తెలుపుడని ప్రార్థించితిని. తొలుత నాకు అద్వైతమును వివరించితిరి. పిమ్మట పరబ్రహ్మప్రాప్తికి సాధనములగు (ఉపాయములగు) జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగ, ప్రపత్తుల నుపదేశించితిరి. బోధ దృఢపడుటకు నింకను నేను వినవలసిన విషయములు కలవేని అనుగ్రహించి ఆనతిండు.

వేదాంతి : మన పూర్వులు అధ్యాత్మ విషయమై చేసిన కృషి అపారమైనది. మన దేశమున అనేక దర్శనములు, మతములు వెలువడినవి. అన్నింటికిని వేదములే మూలమని పెద్దలందురు. నీకు దర్శనములను గుఱించియు, వివిధ మతములను గుఱించియు దిఙ్మాత్రముగ నెఱింగింతును.

(2) వేదములు

వేదములను గుఱించి యిదివఱలో కొంత చెప్పియుంటిని, అయినను నిచ్చట కొంత చెప్పుట అవసరమే. ఋగ్యజుస్సామాథర్వ(ణ)ము లనునవి నాలుగు వేదములు. వేదముల ఉత్పత్తిని గుఱించి పూర్వకాలము నుండియు దర్శనకారులు భిన్నాభిప్రాయములను వెలిబుచ్చిరి.

వేదములు ఈశ్వరకృతములని న్యాయ, వేదాంత, సాంఖ్య, యోగ దర్శనములు చెప్పును. వేదములు ఈశ్వర కృతములు కావనియు, అవి మహర్షి కృతము లనియు వైశేషిక దర్శనము చెప్పును. మీమాంసకులు, వేదములు ఈశ్వర కృతములుగాని, ఋషిప్రోక్తములు గాని కావనియు, అవి నిత్యములు, స్వతస్సిద్ధములు అని చెప్పుదురు. శైవ వైష్ణవ మతములు వేదములు అపౌరుషేయము లని అంగీకరించును. వైదిక మతమునుండి వేఱుపడిన జైనబౌద్ధములు వేదములను పౌరుషేయములనును. ఆధునిక దార్శనికులలో ఆర్యసమాజ స్థాపకులగు మహర్షి దయానంద సరస్వతి స్వాములవారును, శ్రీ అరవిందయోగియు వేదములు అపౌరుషేయముల (ఈశ్వర కృతముల)ని అంగీకరింతురు. తక్కిన వారు పౌరుషేయము లందురు.

కృష్ణద్వైపాయన మునీంద్రులు వేదములను విభజించిరని చెప్పుదురు. ఆ కారణమున వారిని 'వేదవ్యాసుడ'ని పిలుతురు. వేదములయం దుపయోగించిన భాష ప్రాచీన సంస్కృతము. దానిని ఛంద (గీర్వాణ) మందురు. ఇప్పటి సంస్కృతమును చదివిన వారికి ఆ భాష బోధపడదు. అందువలన యాస్కాచార్యులు వేదములకు 'నిరుక్త' మను నిఘంటువును వ్రాసిరి. దానిని బట్టియే స్కంధస్వామి ప్రభృతులు ఋగ్వేదమును వ్యాఖ్యానించిరి. ఉద్భటాచార్యులు, మాధవాచార్యులు (శ్రీ విద్యారణ్య స్వామి), మహీధరాచార్యులు, శ్రీ సాయన పండితులు వేదములకు భాష్యములును రచియించిరి. వీరిలో సాయన మాధవులు సోదరులు, ఆంధ్రులు.

యజుర్వేదము వచనరూపములోను తక్కిన వేదములు పద్యరూపము లోను ఉన్నవి. ప్రతి వేదము సంహితము లనియు, బ్రాహ్మణము లనియు రెండు విధములు. బ్రహ్మణము లన్నియు వచనరూపములు. సంహితములయందు దేవతలస్తుతి గలదు. బ్రాహ్మణములయందు. యాగముల విధులు, నిషేధములు గలవు.

బ్రాహ్మణములకును ఉపనిషత్తులకును మధ్యకాలమున ఆరణ్యకములు రచియింపబడిన వనియు, అవి తైత్తిరీయ, ఐతరేయము లనియు అందురు. ఆరణ్యకము లనగా : గ్రామములకో, పట్టణములకో అనతిదూరమున తరచుగా జనసమ్మర్దము లేనిచోట గురువులు ఆశ్రమములను నిర్మించుకొని శిష్యులకు వేదరహస్యములను బోధించుటకు తగిన ప్రశాంత ప్రదేశములందు చెప్పబడినవి.

ఋగ్వేదము అష్టకములు, అధ్యాయములు, వర్గములు, మండలములు, అనువాకములు, సూక్తములు, మంత్రములుగా విభజింపబడినది. మంత్రములే ఋక్కు లనబడును.

ఋగ్వేదము "**అగ్నిమీళే పురోహితం! యజ్ఞస్యదేవ మృతి జమ్ హోతారం రత్నధాతవమ్**" అని అగ్ని దేవతాస్తుతితో ఆరంభింపబడుట వలన ప్రపంచమున కనబడు స్తవము లన్నింటిలో నిదియే మొదటి దని చెప్పవచ్చును. "**అక్షరాణామకారో ఒస్మి**" (గీత 10-33) - అక్షరములలో అకారము నేనై యున్నాను అని భగవంతుడు చెప్పినట్లు ఋగ్వేదము అకారముతో ప్రారంభింపబడినది. ఇందు అగ్నిని, ఇంద్రుని, మరుత్తులను, ఋభువులను, ఉషస్సును, రుద్రుని విష్ణువును - మొదలగు దేవతలను ఋషులు స్తుతించిరి.

యజుర్వేదము యజ్ఞమున కుపయుక్తమగు పదార్థములను స్తుతించినది. కృష్ణయజుర్వేదము యజ్ఞమునకు పనికి వచ్చు మోదుగ కొమ్మను ప్రథమమున స్తుతించినది.

సామవేదము - ఇది వేదములలో కెల్ల ఉత్తమ మయినది. "**వేదానాం సామ వేదో ఒస్మి**" (గీత. 10-22) అని భగవద్వాక్యము గదా! ఇందలి

మంత్రములు గేయములు. దీనిని అందఱు కలసి గానము చేయుదురు. భగవంతుడు "సామగానలోలుడ" ని ప్రతీతి. ఋగ్వేద యజుర్వేదములలోని కొన్ని మంత్రములు సామవేదమున చేరినవి. సామవేదము పూర్వార్చితమని, ఉత్తరార్చిత మని రెండు భాగములు. అందు పూర్వార్చితము సామసంహిత. అది అపౌరుషేయ మనియు, ఉత్తరార్చితము పౌరుషేయ మనియు చెప్పుదురు.

అథర్వవేదము భగవద్గీత రచియింపబడిన కాలమునకు వేదములలో చేర్చబడియుండినట్లు కనబడదు. **"ఋక్సామ యజు రేవ చ"** (గీత. 9-17) ఋగ్వేద యజుర్వేద సామవేదములే పేర్కొనబడినవి. అథర్వవేదమున వ్యాధుల నిరోధము, భూతావేశము, బ్రహ్మరక్షస్సులను పారద్రోలుట, స్త్రీ పురుష వశీకరణము, శత్రుసంహారమున కుపయుక్తమగు మంత్రములు గలవు. అంతమాత్రమే కాదు. మానవుడు కోరెడు కోర్కెలను సాధించు జపహోమాదులును కలవు. ఈ వేదము ఆర్యులు ఈ దేశమునకు రాక పూర్వమే యిందలి ఆర్యేతర జాతులకు చెందియుండినదనియు, దానిని వేదములలో చెర్చుటకు తొలత నిష్టపడక పిమ్మట వేదములలో చేర్చి వేదములు నాల్గని రనియు చెప్పుదురు.

కొన్ని విభిన్న జాతులు ఒకచో కలసి అన్యోన్యసామరస్యముతో ఒకరితో నొకరు కలసిపోయి జీవించినపుడు వారి భిన్న సంస్కృతులును కలసిపోవుట సహజము.

వేదములవంటి ప్రాచీనములును, మహిమాన్వితములును నగు గ్రంథములు భూమిపై లేవనుట అతిశయోక్తి కాదు. భారతీయ దర్శనముల కన్నింటికి వేదములే మూలము. వేయేల సమస్త మానవులకును గల జ్ఞాన విజ్ఞానములకు సహితము వేదములే మూలమని పెద్దలందురు. వేదములయందలి యర్థమును సంపూర్ణముగ తెలిసినవా రెవ్వరును లేరు.

వేదైశ్చ సర్వైరహ మేవ వేద్యో
వేదాంతకృద్వేదవిదేవ చాహమ్| (గీత. 15-15)

సర్వ వేదములచే నెఱుగదగిన వాడను, వేదములను చేసిన వాడను, వానిని తెలిసిన వాడను నేనే (అహం+ఏవ=నేను మాత్రమే) అని చెప్పుటవలన వేదార్థములను పూర్ణముగ నెఱుగుట మానవులకు దుర్లభమని విదిత మగుచున్నది. వేదములు చదువుటకును వాటి అర్థమును తెలిసికొనుటకును భూమిపై పుట్టిన ప్రతినరునకును అధికారము కలదు. ఈ వేద విజ్ఞానమును ప్రపంచమునకు పంచుటయే వేద ఋషుల అభిప్రాయము. వేదములను తెనుగు లిపిలో వ్రాసి వాటికి తాత్పర్యములు వ్రాసిన వారిలో పురాణవాచస్పతి బిరుదాంకితులును, విశాలహృదయులును నగు బ్రహ్మశ్రీ బంకుపల్లె మల్లయ్యశాస్త్రి గారికిని, బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారికిని ఆంధ్రలోకము ఋణపడి యున్నది. వారు తెనుగువారికి చేసిన ఉపకారము మహాగణనీయ మైనది.

ఋగ్వేద పీఠికయందు మల్లయ్య శాస్త్రిగారు స్త్రీ శూద్రాదులు వేదములు చదువ వచ్చునని చెప్పుచు నిట్లు వ్రాసిరి :"వింటే సీసము పోయమన్నారు గాని చదివితే పోయమ"నలేదందురు. అదిగాక వేదములలో వారు (స్త్రీ శూద్రాదులు) చదువగూడదని ఒక్క వాక్యమునైన తీసి యెవరైన చూపితే నా మతమును మార్చుకొందును" అని వ్రాసిరి.

(3) అన్వీక్షికి - దర్శనములు

వేదములకు తరువాత ఉపనిషత్తులును, దర్శనములును మిక్కిలి ప్రధానము లైనవిగా మన దేశమున గణన కెక్కినవి. ప్రపంచము నందనేక దర్శనములు, అనేక మతములు వెలసినవి. ప్రపంచము మాట కేమి, మన దేశమునందే పెక్కు దర్శనములు, పెక్కు మతములు పుట్టినవి. ఏ దర్శనమునకు చెందిన వారాయా దర్శనమును తక్కిన వానికంటె శ్రేష్ఠమని చెప్పుకొందురు. అది సహజమే. అట్టి విశ్వాసమున్ననే వారికి వారి దర్శనమునందు భక్తి గలిగి దానిని ఆదర్శముగా గైకొని యుత్తీర్ణు లగుదురు. అట్టి విశ్వాసము (నమ్మకము, శ్రద్ధ) లేకున్న ప్రయోజనము సిద్ధింపదు. తమ దర్శనము (మతము) నిర్దుష్ట మైనదని నిరూపించుటయే గాక ఇతర దర్శనముల (మతముల) యందుగల

దోషములను చూపిన గాని స్వీయదర్శనమునందు భక్తి దృఢపడదని పరమత (దర్శన)ములను ఖండించుట ఒక విధిగా పూర్వదార్శనికులు భావించి వారివారి దర్శనములయందు ఇతర దర్శనములను ఖండించిరి. కాలము మారినందున ఇతర దర్శనములను ఖండించుటకు బదులు గౌరవించుట యుక్తము.

ఒక సంఘమునకు చెందిన మానవులు సామాన్యముగ వారి పూర్వులనుండి పారంపర్యముగ వచ్చిన ఆచారములను పాటించి నడచుకొనుచుందురు. అనేకులు వారి ఆచారముల యందలి మంచి చెడ్డలను గుఱించి చర్చింపక అట్టి ఆచారములకు మూలకారణములను తర్కించి విచారింపక, పూర్వాచారములనే చర్వితచర్వణముగ అనుష్ఠించు చుందురు. కాని కొందఱు అట్లు గాక వారాచరించు కార్యములను గుఱించి ఆలోచింతురు. కొందఱు కేవలము సుఖముకొఱకు మాత్రమే ప్రయత్నింపక సంఘశ్రేయమునకో, వారికి తెలియని యేదో యొక ఫలము లభించుననియో త్యాగము చేయుచుందురు.

ప్రపంచమున ఏది సత్యమో? ఏది అసత్యమో తెలిసికొనుట యెట్లు? ఏది సత్యమైనను, ఏది యసత్యమైనను ప్రపంచమున జన్మించిన ప్రతి ప్రాణియు మరణించుచున్నది గదా! మరణ మన నేమి? స్థూల శరీర నాశముతో సర్వము నశించునా? మర్త్యునియందు నాశ రహిత పదార్థ మేదైన గలదా? ఉన్నచో దాని నెట్లు తెలిసికొనవలెను? ఈ మొదలగు ప్రశ్నలు (సంశయములు) కలుగు చుండును. వీటికి సమాధాన మెట్లు లభించును? ఈ విధముగ మానవుని జీవిత పరమార్థ తత్త్వమును విచక్షణ పూర్వకముగ అన్వేషించి తెలిసికొనుట "అన్వీక్షికి" అనబడును "అన్వీక్షికి" యన "ప్రమాణ ప్రమేయ సంశయాది స్వరూప వివేచన క్షమంబగు న్యాయవిద్య" అనియు "ప్రత్యక్షాగమావిరుద్ధంబగు అనుమానంబు వస్తుస్వరూపంబును బోధింపఁజాలి యుండు. ఇది యే అన్వీక్ష (అను + ఈక్ష = ప్రత్యక్షము ననుసరించునది) యనబడును. ఈ అన్వీక్షను ప్రధానంబుగా నిరూపించునది అన్వీక్షికి యనబడును. ఇదియే న్యాయశాస్త్రంబు. ఇయ్యది ప్రమాణంబులం బట్టి వస్తుతత్త్వంబు నిర్ణయించుచుండు" (న్యాయ,ద. 1-1).

"ప్రత్యక్షము, ఆగమము అను ప్రమాణములద్వారా ఈక్షింపబడు దానిని మరల చూచుట అన్వీక్ష యనబడును. అన్వీక్షతో ప్రవర్తించునది అన్వీక్షికి" అని యందురు, "అన్వీక్షికీ" అనియును వ్రాసిరి.

"అన్వీక్షికి" క్రీ.పూ. 6-వ శతాబ్ది వఱకు ప్రత్యేక శాస్త్రముగ అభ్యసించుచు వచ్చినట్లు పెద్దలందురు. అన్వీక్షికి తర్కమని (Logic అని) కొంతవఱకు చెప్పవచ్చును. కాని తరువాత కౌటిల్యుని కాలమునాటికి పూర్వ మీమాంసా సాంఖ్య శాస్త్రములు అన్వీక్షికి యను నామమున పిలువబడు చుండినట్లు శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ గారు వ్రాసిరి. "అన్వీక్షికి" దర్శనముల ఉత్పత్తికి దారితీసినది.

"దర్శ్యతే తత్త్వమనేన" తత్త్వబోధకము లగునవి దర్శనములు. దృశిర్ = ప్రేక్షణే అను ధాతువునకు కర్మార్థములో చూపునది అనియును భావార్థములో చూచుట యనియును అర్థము.

"దృశ్యతే అనేన ఇతి దర్శనమ్" అనగా దేనివలన చూడబడునో అది దర్శనము అని యర్థము. " దేనివలన చూడబడునో" అనునప్పుడు చూడబడునది యేది? అను ప్రశ్న కలుగుచున్నది. ఈ ప్రశ్నకు అనేక విధములుగ సమాధానము చెప్పవచ్చును. కాని సరియైన సమాధానము ఇట్లుండవలెను- నేనెవడను? నా నిజమైన స్వరూపమేమి? నశించు స్వభావముగల యీ దేహమున నాశరహిత పదార్థ మేదియైన గలదా? ఈ విశ్వమునకు కర్త యొకడు కలడా? ఉన్నచో అతనికిని మర్త్యునకును గల సంబంధమేదైన గలదా? ఈ విధముగా సవిమర్శక అవలోకనము (చూపు) దర్శన మనబడును. దీనిని తత్త్వజ్ఞాన మనియు చెప్పుదురు. చార్వాక దర్శనములు తప్ప భారతీయ దర్శనములు నిశ్శ్రేయసమునే బోధించుచున్నవి.

దర్శనములు కేవల ప్రత్యక్షానుమానములపై మాత్రమే ఆధారపడునవి కావు. దర్శనములకు అంతర్ద్రష్టలగు మహనీయుల అనుభవము (శ్రుతులు),

వాటిపై చేయబడిన వ్యాఖ్యానములు ముఖ్యాధారములై యుండును. సత్య మగు వస్తువును గుఱించి తెలిసికొనుటకు నెట్టి ప్రమాణములును సహాయపడలేవు. కాని, అవి కొంతవఱకు మాత్రము మనల నామార్గమున తీసికొనిపోయి వదలును. తరువాత మన అనుభవమే గమ్యస్థానమును చేర్చును. దర్శనములు మతసంబంధమైన మూఢ విశ్వాసములకు చోటివ్వవు. విజ్ఞాన దర్శనము (Science), మతదర్శనము, ధర్మదర్శనము (Law) మొదలగునవి దర్శనములని చెప్పబడినను మన భారతీయ దార్శనికుల దృష్టిలో మానవుడు ఐహిక సుఖములనుండి విరక్తుడై పరమోత్కృష్టమగు శాంతిని పొందుట యెట్లో ఆ మార్గమును (ఉపాయమును) తెలియజేయు దానినే దర్శన మందురు. అయితే దేవుడు, జీవుల పునర్జన్మ, అనునవి లేవని చెప్పు చార్వాక సిద్ధాంతమును సహితము దర్శనములలో చేర్చి చెప్పుదురు. కాని అది యుక్తము గాదు. మన వారు దర్శనములను వైదికములని, అవైదికములని రెండు వర్గంబులుగ విడదీయుదురు. వైదికదర్శనము లివి :

(1) గౌతమ ఋషి న్యాయదర్శనము, (2)కాణాద ఋషి వైశేషిక దర్శనము, (3) కపిల ఋషి సాంఖ్యదర్శనము, (4) పతంజలి ఋషి (పాతంజల) యోగదర్శనము, (5) జైమిన్యాచార్యుల పూర్వమీమాంసా దర్శనము (6) బాదరాయణాచార్యుల వారి వేదాంత (ఉత్తరమీమాంస) దర్శనము - వీటినే షడ్దర్శనము లందురు.

అవైదికదర్శనములు :(1) చార్వాకము, (2) బౌద్ధము, (3) జైనము, (4) అర్హతము, (5) దిగంబరము, (6) సౌమము అని కొందఱును, (1) చార్వాకము, (2) జైనము, (3) వైభాషికము (4) సౌత్రాంతికము. (5) యోగాచారము, (6) మాధ్యమికము అని కొందఱును చెప్పుదురు. ఈ పైచివరి నాలుగును బౌద్ధములు. దర్శనములయందు మొదట చెప్పబడు న్యాయదర్శనమును గుఱించి సంగ్రహముగ చెప్పెదను.

(4) న్యాయదర్శనము

అక్షపాదగౌతము డను ఋషి న్యాయసూత్ర గ్రంథమును* రచించెను. వీరు మిథిలాప్రాంతమువారు, వీరిని క్రీ.పూ. 4వ శతాబ్దివారని కొందఱును, క్రీస్తు తరువాతి శతాబ్దమువారని కొందఱును చెప్పిరి. న్యాయసూత్రములకు భాష్యమును రచియించిన వాత్స్యాయనుడు క్రీ.పూ. [illegible] శతాబ్దివాడని కొందఱును క్రీ.శ. 350 నాటివాడని కొందఱును చెప్పిరి. తరువాత క్రీ.శ. 6వ శతాబ్ది వాడగు ఉద్యోతకరుడు న్యాయభాష్యమునకు న్యాయ వార్తికమును రచియించెను. క్రీ.శ. 840 ప్రాంతమున నుండిన వాచస్పతి మిశ్రుడు న్యాయవార్తిక తాత్పర్యటీక అనుదానిని రచియించెను. తరువాత వచ్చినవారు: జయంతభట్టు భాస్వరజ్ఞుడు, ఉదయనాచార్యులు మొదలగు అనేకులు పెక్కు గ్రంథములు రచియించిరి. వీరిలో ఉదయనాచార్యులను పూర్వనైయాయికులలో కడపటి వాడని అందురు. వీరు రచియించిన 'న్యాయకుసుమాంజలి' ప్రసిద్ధి కెక్కినది. న్యాయమతము పుట్టిన భూమి మిథిలాప్రాంతము. క్రీ,శ, 15వ శతాబ్దివఱకు మిథిలాప్రాంతము న్యాయమునకు కేంద్రముగా ఉండి అవల వంగ దేశమునందలి నవద్వీపమునకు మారినది.

న్యాయ మనగా : ఒక విషయములో ప్రవేశించి పరిశీలించుట అనియు, మనస్సు ఒక నిర్ణయము చేయుటకు నెడి తోడ్పడునదే అది న్యాయమనియు నిర్వచనము చేసిరి. న్యాయమునకు తర్కవిద్య, వాదవిద్య, అన్వీక్షికి, హేతువిద్య, ప్రమాణశాస్త్రము - అను నామాంతరములు కలవు. సత్యము తెలిసికొనుటకు వాదము తోడ్పడును. వాదము ఉపనిషత్తులకు సమ్మతమే! ఛాందోగ్యశ్రుతి వాదమును 'వాకోవాక్య' మని పేర్కొన్నది. కఠోపనిషత్తు 'నైషా తర్కేణ మతిరాపనేయా' అనగా అప్తుడు చెప్పగా తెలిసి కొనవలెనేగాని తర్కమువలన తెలియదు- అని తర్కమును పేర్కొన్నది. లోకవ్యవహారమునందు న్యాయమును

---

* న్యాయదర్శనము అయిదు అధ్యాయముల గ్రంథము. ఒక్కొక్క అధ్యాయము రెండు ఆహ్నికములుగా విభజింపబడినది. మొత్తము గ్రంథమున 515 సూత్రములు గలవు.

పదమును తరచుగ ఉపయోగింతుము. ఎవడైన అధర్మము చేసినను అసత్య మాడినను, అది న్యాయము కాదని అందుము. ధర్మాధర్మములను గాని సత్యాసత్యములను గాని నిర్ణయింపుమని కోరునపుడు, న్యాయము, చేప్పుమందుము. సారాంశ మేమన : న్యాయమనగా - సత్యనిర్ణయమునకు తోడ్పడు వాదమని అర్థము. న్యాయదర్శనము శాస్త్రములకు శాస్త్రమని ప్రసిద్ధి. దీనిని తర్కశాస్త్రమందురు. అంతమాత్రమున న్యాయదర్శనము కేవల తర్క మనరాదు. వేద ప్రమాణమును అంగీకరించుట వలనను, పరమపురుషార్థమగు మోక్షమును గుఱించి చెప్పుటవలనను, ఇది తత్త్వశాస్త్రమును మతసంబంధ మైనదియునునై యున్నది.

న్యాయ, వైశేషికదర్శనములు రెండును ఒకప్పుడు ఒకే దర్శనముగా ఉండినట్లును, తరువాత కొంత కాలమునకు ప్రత్యేక దర్శనములుగా విడిపోయి ప్రసిద్ధి చెందినట్లును కొందఱందురు, న్యాయదర్శనము ప్రథమ దర్శనమని కొందఱును, అట్లుకాదు వైశేషిక దర్శనమే ప్రథమదర్శనమని మఱి కొందఱును, అభిప్రాయపడిరి. అనేక అంశములయందు రెండు దర్శనములును ఏకాభిప్రాయమునే వ్యక్తపరచినవి. న్యాయదర్శనము ప్రమాణములను గుఱించి విస్తరించి చెప్పగా, వైశేషికము ప్రమేయములను గుఱించి విస్తరించి చెప్పినది.

ప్రమాణములు

న్యాయదర్శనము ప్రతిపాదించిన ప్రమాణాది షోడశపదార్థములు-

(1) **ప్రమాణములు** (2) **ప్రమేయములు** (3) **సంశయములు** (4) **ప్రయోజనము** (5) **దృష్టాంతము** (6) **సిద్ధాంతములు** (7) **అవయవములు** (8) **తర్కము** (9) **నిర్ణయము** (10) **వాదము** (11) **జల్పము** (12) **వితండము** (13) **హేత్వాభాసములు** (14) **ఛలము** (15) **జాతులు** (16) **నిగ్రహస్థానములు.** **(న్యా.సూ. 1-1-1)**

ఈ ప్రమాణాది షోడశపదార్థముల తత్త్వమును పూర్ణముగా నెఱుగుటవలన మోక్షప్రాప్తి యగునందురు. వీరు ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము (వేదము)- ఈ నాలుగును జ్ఞాన ప్రమాణములుగా

అంగీకరింతురు. ప్రత్యక్షాది ప్రమాణములను గుఱించి పూర్వము చెప్పియుంటిని* కనుక యిచ్చట అవి చెప్పనవసరము లేదు. ముఖ్యముగా ప్రమాణములను గుఱించి విపులముగా చర్చించుటచే న్యాయదర్శనము ప్రమాణశాస్త్ర మైనది. జ్ఞానమునకు సాధనము లగునవి ప్రమాణము లనబడును. జ్ఞానమునకు విషయము లైనవి అనగా జ్ఞానముచేత నెఱుగ బడునవి ప్రమేయము లనబడును. వీరు వేద ప్రమాణ మంగీకరింతురు. వేదములు ఈశ్వరకృతములని వీరి విశ్వాసము. పైన చెప్పిన ప్రమాణముల చేత తెలియబడునవి ప్రమేయములు, అవి 12:

ప్రమేయములు

(1) **ఆత్మలు** (2) **శరీరములు** (3) **ఇంద్రియములు** (4) **అర్థములు** (5) **బుద్ధి** (**జ్ఞానము**) (6) **మనస్సు** (7) **ప్రవృత్తి** (8) **దోషములు** (9) **ప్రేత్య భావము** (10) **ఫలము** (11) **దుఃఖము** (12) **అపవర్గము.**

(న్యా.సూ. 1-1-9)

వీటి వివరము :

1. **ఆత్మలు : సూ|| ఇచ్ఛాద్వేష ప్రయత్న సుఖదుఃఖ జ్ఞానానాత్మనో లింగమ్** (న్యా.సూ. 1-1-10)

తా|| ఇచ్ఛ (కోరిక), ద్వేషము, ప్రయత్నము, సుఖము, దుఃఖము, జ్ఞానము - అను నీ యాఱును ఆత్మ యున్న దనుటకు ప్రమాణములు. అనగా - ఇవి ఆత్మగుణము లని భావము.

ఆత్మ కలదనుటకు హేతు వేమన :

సూ|| " దర్శన స్పర్శనాభ్యామేకార్థ గ్రహణమ్" (న్యా.సూ. 3-1-1)

---

* బ్రహ్మజిజ్ఞాస ప్రథమ భాగము 2-38 వ అధ్యాయమునందు ప్రత్యక్ష, అనుమాన శబ్ద ప్రమాణములను గుఱించి చెప్పియుంటిని. తక్కిన ప్రమాణము లన్నియు పై మూడింటిలో చేరినవే.

తా|| మనము దేనిని కంటితో చూచితిమో దానిని స్పృశించు చున్నామని యందుము. కనుక, నేత్రేంద్రియ త్వగింద్రియముల కంటె భిన్నమైన కర్త యుండవలెను. అతడే ఆత్మ.

మనము పూర్వానుభవమును స్మరింతుము. ఇది స్మృతి. ఇట్టి స్మృతి కాశ్రయ మొకటి యుండవలయును. అదియే ఆత్మ. స్మృతి ఆత్మగుణము. ఆత్మ అనిత్యముగాని క్షణికముగాని అయినచో మనకు ప్రత్యభిజ్ఞయే కలుగదు. "ఇదియే నేను పూర్వము చూచిన యిల్లు" అనునప్పుడు పూర్వము చూచిన ఆత్మయు, ఇప్పుడు ఆ యింటిని చూచుచున్న ఆత్మయు ఒక్కడే కావలయును. కనుక ఆత్మ నిత్యము. ఆత్మ విభువు (అనంతము), నిరవయవము. ఆత్మలు సృష్టింపబడినవి కావు. (న్యా.సూ. 3-1-14)

మఱియు, అప్పుడు జన్మించిన శిశువు ఒకప్పుడు నవ్వును, మఱియొకప్పుడు ఏడ్చును. హాసము, రోదనము, కంపము అను నీ భావములు హర్ష, భయ, శోకములు అంతరంగమున కలుగక పైకి కనబడవు. హర్ష భయ శోకాదులు ఇష్టానిష్టవస్తుప్రాప్తి వలన గాని, వాటి స్మృతివలనగాని కలుగును. అప్పుడు గాని, కొలది దినముల క్రిందట గాని పుట్టిన శిశువునకు అట్టి అనుభవము లేదు. అట్టి అనుభవము లేకున్న ఆ శిశువునకు హర్షభయకంపనాదు లెట్లు కలుగును? అప్పుడు జన్మించిన శిశువు తల్లిచనుబాలు త్రాగును. ఇది శిశువునకు నెవరు నేర్పిరి? అది శిశువు యొక్క గుణమనుటకు వీలు లేదు. కోరికలు గుణములు కావు. సూదంటు రాయికడకు నినుపముక్క స్వభావముగా పోవునట్లు శిశువు మాతృ స్తన్యమునకై ప్రాకులాడు నని రాదు. ఏలయన, శిశువు జడద్రవ్యము కాదు. ఇది మానవులయందే కాదు, అరణ్యమునందు పుట్టిన జింకలు దుప్పులు మొదలగు జంతుసంతానముకూడ పుట్టగనే మాతృక్షీరమును గ్రోలుచున్నవి. ఈ జ్ఞానమెట్లు కలుగును? ఆ శిశువు పూర్వ జన్మానుభవమును నీ జన్మమున స్మరించుటచే కలుగును. ఇంతకంటె నితర కారణములు లేవు. కనుక ఆత్మ నిత్యము.

(న్యా.సూ. 3-1-18)

2. **శరీరము : సూ|| "చేష్టేంద్రియార్థాశ్రయః శరీరమ్"**
(న్యా.సూ. 1-1-11)

చేష్టాదుల కాశ్రయ మగునది. ఇది పుట్టునది. గిట్టునది. ఇది పృథ్వీ సంబంధమైన ద్రవ్యాణువులు ఎక్కువగాను తదితర భూతాణువులు తక్కువగాను నేర్పడినది.

3. **ఇంద్రియములు : సూ|| "ఘ్రాణ రసన చక్షుస్త్వక్ శ్రోత్రాణీంద్రియాణి"** (న్యా.సూ. 1-1-12)

ఆత్మ గంధాదులను వేటిద్వారా గ్రహించునో అవి ఇంద్రియములు. ఇవి ఘ్రాణము , జిహ్వ, నేత్రము, త్వక్కు, శ్రోత్రము.

4. **అర్థములు : సూ|| " గంధ రస రూప స్పర్శ శబ్దాః పృథివ్యాది గుణాః తదర్థాః"** న్యా.సూ. (1-1-14)

తా|| పృథివి మొదలగు పంచభూతముల గుణములు - గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము, ఇవి బాహ్యేంద్రియములకు అర్థములు, అనగా విషయములు.

5. **బుద్ధి (జ్ఞానము): సూ|| "బుద్ధి రుపలబ్ధిర్ జ్ఞానమిత్యనర్థాంతరమ్"**
(న్యా.సూ. 1-1-15)

తా|| బుద్ధి, ఉపలబ్ధి, జ్ఞానము (జ్ఞప్తి) నీ మూడు శబ్దములకు నీ శాస్త్రము ఒకటే అర్థమును బోధించును. అనగా నీ మూడును పర్యాయపదములు.

బుద్ధి ద్రవ్యము కాదు. జ్ఞానక్రియకు కర్త కాదు. బుద్ధి ఆత్మయొక్క గుణము. **సూ|| "శరీర గుణ వైధర్మ్యాత్"** (న్యా.సూ. 3-2-53) బుద్ధి శరీర గుణము కాదు. - ఏల యన? శరీర మున్నను ఒకప్పుడు జ్ఞానము లేక పోవుట వలనను శవమునకు జ్ఞానము లేకపోవుటవలనను, యోగికి సమాధియందు జ్ఞానము లేకుండుటవలనను - జడమగు శరీరమునకు జ్ఞానమున్నచో సకల జడద్రవ్యములకు జ్ఞానముండవలయును. బుద్ధి మనోగుణము కూడ కాదు.

సూ|| "యుగ పత్ జ్ఞేయానుపలబ్ధేశ్చన మనస" (న్యా.సూ. 3-2-19) జ్ఞానము మనోగుణ మగుచో జ్ఞానమునకు మనస్సు ఆశ్రయ మగుచున్నది. అట్లయినచో సర్వేంద్రియ విషయజ్ఞానము ఒకే క్షణమున కలుగవలసి యుండును. అట్లు కలుగుట లేదు. కనుక, జ్ఞానము మనస్సుయొక్క గుణము కాదు. జ్ఞానము ఇంద్రియముల యొక్కగాని యింద్రియార్థముల యొక్క గాని గుణము కాదు. ఏలయన? ఇంద్రియములు నశించిన జ్ఞానము నశింపవలసి యుండును. అట్లుండుట లేదు. నేత్రములతో రూపములను చూచినవాడు నేత్రములు నశించిన తరువాత అవి ఉన్నకాలమున చూచిన వస్తురూపములను స్మరించు చున్నాడు. అట్లే యింద్రియార్థములు (ఘటాపటాదులు) నశించినపుడు జ్ఞానము నశింపవలసి వచ్చును. అట్లగుట లేదు. ఎదుట నున్న ఘటము నశించినను ఘటము నశించిన దను జ్ఞాన ముండును. (న్యా.సూ.3-2-18)

అదృష్టవంతమగు ఆత్మ, మనస్సుతో సన్నికృష్టమై ప్రయత్నించినపుడు ఇంద్రియముల ద్వారా విషయములతో సన్నికర్ష మేర్పడి జ్ఞానోత్పత్తి కలుగుచున్నది. వేఱొక విధముగా జ్ఞానము కలుగదు. (న్యా.సూ. 3-2-21). ఆత్మ, మనస్సు, ఇంద్రియములు వీని సన్నికర్షమువలన జ్ఞానోత్పత్తి కలుగునని చెప్పబడలేదు, (న్యా.సూ.3-2-22). ఇట్లు కలిగిన జ్ఞానము స్థిరమైనదా? యనిన అది అనిత్యము; మేఘమండలమున చంచలమగు విద్యుల్లతలవలె వచ్చుచు పోవుచుండును. (న్యా.సూ. 3-2-17) రెండు క్షణములు మాత్రమే యుండి మూడవక్షణమున నశించును, (న్యా.సూ. 3-2-42). జ్ఞాన నాశనమునకు కారణమేమన- మనము ఘటమును చూచినపుడు మనకు ఘటజ్ఞానము కలుగును. పటము (వస్త్రము)ను చూచినపుడు పటజ్ఞానము కలుగును. అప్పుడు తొలుత చూచిన ఘటజ్ఞానము నశించును. తొలుత చూచిన ఘట జ్ఞానము నశింపనిదే పటజ్ఞానము కలుగదు. దీనికి కారణము ఒక జ్ఞానమునకు విరుద్ధమగు మఱియొక జ్ఞానము పుట్టుటయే, (న్యా.సూ. 3-2-24)

6. మనస్సును గుఱించి యిట్లు చెప్పుదురు : **సూ|| "యుగపత్ జ్ఞానానుత్పత్తి ర్మనసో లింగమ్."**

(న్యా.సూ. 1-1-16)

తా॥ మనస్సు కలదనుటకు ప్రమాణమేమి? మన నిత్యానుభవమే మనస్సు కలదని నిరూపించును. బయట నున్న వస్తువులతో నింద్రియములకు, నింద్రియములతో ఆత్మకు, పరస్పర మొకదానితో మఱియొక దానికి సంబంధ ముండినను ఒక్క సారిగా నింద్రియార్థముల అన్నింటియొక్క జ్ఞానము ఆత్మకు కలుగక పోవుటయు, క్రమముగా కలుగు చుండుటయు మన అనుభవము. కనుక, అట్టి క్రమబుద్ధిని కలిగించుటకు ఆత్మకు - నింద్రియములకు మధ్య మఱియొక సాధన ముండక తప్పదు. అట్టి సాధనమే మనస్సు.

మనస్సు జడము - **సూ॥ "యథోక్త హేతుత్వాచ్చాణు"**

(న్యా.సూ. 3-2-59).

ఈ సూత్రమునందు మనస్సు అణువని చెప్పబడి యున్నను కొందఱు వ్యాఖ్యాతలు అణుశబ్దముయొక్క అర్థమును" మధ్యమ పరిమాణ' మని అనేక హేతువులు చూపి చెప్పిరి. కాని, మనస్సు అణుపరిమాణము నిరవయవము అని సూత్రకారుల అభిప్రాయ మందురు. అట్లనుటకు కారణమేమన? మనస్సు ఒక యింద్రియముతో కలిసి యున్నపుడు ఇంకొక యింద్రియముతో దానికి సంబంధ ముండదు. అప్పుడు ఆత్మకు ఆ యింద్రియార్థ సంబంధమగు జ్ఞానము మాత్రమే కలుగును. తక్కిన యింద్రియార్థ సంబంధమగు జ్ఞానము కలుగదు. ఒక్కొక్క సమయమున సర్వేంద్రియార్థ జ్ఞానము కలిగినట్లు తోచినను, అది యథార్థము కాదు. మనస్సు ఒక యింద్రియమును వదలి యింకొక యింద్రియముతో సంబంధము కలిగించుకొనుటకు విద్యుద్వేగముతో దాని వ్యాపారము జరుగును గనుక, సర్వేంద్రియార్థజ్ఞానము ఒకే సమయమున కలిగినట్లు మనకు తోచునందురు. మనస్సు శరీర మంతటను వ్యాపించియుండుట యథార్థమేని మనకు సర్వేంద్రియార్థ జ్ఞాన మొక్క సమయముననే కలిగియుండును. అట్లు లేదు కనుక, మనస్సు అణువే.

మనస్సు నిత్యమైనది. అనగా ప్రళయమున నశింపదు. కాని తత్త్వజ్ఞానము పొందిన ముక్తాత్మలయందు మనస్సు నశించును. ప్రతి

ఆత్మకు ఒక విశిష్టమగు మనస్సుండును. మనస్సు నశించిన దనగా - ఆ జీవుడు నశించెనని కేవలాత్మమాత్రమే శేషించెనని చెప్పవలయును. అట్లగుటచే జీవుడున్నంతవఱకు మనస్సుండును, మనస్సున్నంత వఱకు జీవుడుండును. ఈ విధముగా చూచినచో జీవునకును, మనస్సునకును అంతగా భేదమును పాటించుటకు వీలులేదు. పూర్వసర్గమున జీవులు చేసిన కర్మ ఫలితముగా శరీరము కలుగుచున్నది. ఆ విధముగనే సూక్ష్మ భూతములనుండి మనస్సు కలుగుచున్నది. (న్యా.సూ. 3-2-60, 61, 66) అదృష్టము వలననే శరీర మేర్పడును. అదృష్టమువలననే మనస్సునకు శరీరసంబంధ మేర్పడును. మరణకాలమున దేహమును విడిచి పునర్జన్మమునకు పోవునది మనస్సే. మనస్సు ఆత్మకును బాహ్య జగత్తునకును సంధానమును కలిగించుటకు ఆత్మకు జ్ఞానమను పుత్రుని ప్రసాదించుచున్నదని చెప్పవచ్చును.

7. **ప్రవృత్తి** : మనోవాక్కాయములచే చేయబడు వ్యాపారము, లేక, కర్మ ప్రవృత్తి యనబడును. (న్యా.సూ. 1-1-17). అనగా కాయిక, వాచిక, మానసికములగు పుణ్యాపాపకర్మలు ప్రవృత్తి అనబడును.

8. **దోషములు** : రాగ ద్వేషములు మొదలగునవి దోషములు. (న్యా.సూ. 4-1-3) మొదలగునవి అనగా :- కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర, మాయా, దంభాదులు.

9. **ప్రేత్యభావములు** : సూ|| **"ఆత్మనిత్యత్వే ప్రేత్య భావ సిద్ధిః"** (న్యా.సూ. 4-1-10)

తా|| ప్రేత్యభావ మనగా - చచ్చి మరల పుట్టుట. జీవుడు నిత్యమై నందున చనిపోయిన వాడు పూర్వశరీరమును విడిచి మఱియొక శరీరమును గ్రహించుట యనునది సిద్ధించును. అట్లు కాదేని అనిత్యమగు శరీరము నశించుటతో జీవుడు కూడ నశింపవలసివచ్చును. అట్లు కాదని యిదివఱకే నిరూపింపబడెను.

10. **ఫలము** : సూ|| "సద్యః కాలాంతరే చ ఫలనిష్పత్తేః సంశయ" (న్యా.సూ.4-1-44)

కర్మ చేయగనే నశించుచున్నది. కాని, కర్మకు సంస్కారములు కలిగి అవి వాసనారూపమున నశియింపక యుండును. కొన్ని కర్మలకు వెంటనే వానిఫలము కలుగును. కొన్ని కర్మలకు ఫలము కాలాంతరమున గాని, లోకాంతరమునగాని, జన్మాంతరమునగాని కలుగును - బియ్యము, నీరు, నిప్పు - వీటివలన అన్నము వెంటనే చేయుదుము. ఇది సద్యః ఫలము. పైరుపెట్టిన కొన్ని మాసములకు దానిఫలము లభించును. ఒక విత్తనమును భూమిలో నాటి నీరు పోసి జాగ్రత్తగా కాపాడుచుండిన అది వృక్షమయి పండ్లు కాయుట కాలాంతరఫలము. (న్యా.సూ.4-1-47)

మానవుడు చేయు కర్మలయందు కొన్ని నిషిద్ధకర్మలు - అవి - వ్యభిచారము, సురాపానము, చౌర్యము, మొదలగునవి. వీటివలన పాపము కలుగును. మరణానంతరము నరక ప్రాప్తి. కొన్ని విహితకర్మలు-ధర్మము, అహింస, పరోపకారము, వాపీకూప తటాకాది నిర్మాణము మొదలగునవి. వీటివలన పుణ్యము కలుగును. మరణానంతరము స్వర్గప్రాప్తి. ఈ ద్వివిధకర్మల సంస్కారములు అదృష్టరూపమున ఆత్మయందు జనించును. ఆత్మ నిత్యము కనుక అదృష్టము, ఫలోదయ పర్యంతము నిత్యమై ఆత్మయందే యుండును. అనగా - కర్మకును దాని ఫలమునకును మధ్య అదృష్ట ముండును. అదృష్ట మనగా - మన నేత్రములకు గోచరింపక ఫలము నొసంగునది యని అర్థము. అదృష్టము దేశకాల పరిస్థితుల ననుసరించి కర్తకు ఫలము (భోగము) నొసంగుచుండును. లేదా- ఈశ్వరుడు అదృష్టము నాధారము గైకొని ఫలము నొసంగుచుండును. అదృష్టము నంగీకరింపకున్నచో మన మనుభవించు సుఖదుఃఖములకు దేవుడు కారణమని చెప్ప వలసి వచ్చును. అది మూర్ఖపద్ధతి. దేవు డేల కొందఱికి సుఖమును మఱికొందఱికి దుఃఖమును నిచ్చును?

11. దుఃఖము : సూ|| "వివిధ బాధానాం యోగాత్ దుఃఖమేవ జన్మోత్పత్తిః" (న్యా.సూ. 4-1-55)

తా|| నానావిధ బాధలకు సాధన మగుటవలన జన్మమే దుఃఖము, జన్మరాహిత్యమే దుఃఖరాహిత్యము.

12. **అపవర్గము** : పై సూత్రమునందు జన్మమే దుఃఖమని చెప్పియున్నందున జన్మ రాహిత్యమే అపవర్గము. **సూ|| "దుఃఖ, జన్మ, ప్రవృత్తి, దోష, మిథ్యా జ్ఞానానామూత్తరోత్తరాపాయే, తదనంతరాపాయా దపవర్గః"** (న్యా.సూ. 1-1-2)

తా|| 1.దుఃఖము 2. జన్మము 3. ప్రవృత్తి (ధర్మాధర్మములను కర్మలు) 4. దోషములు (రాగ ద్వేషములు) 5. మిథ్యాజ్ఞానము,* ఇందులో కడపటి దగు మిథ్యాజ్ఞానము, ఆత్మ మొదలు అపవర్గమువఱకును నీ మధ్యగల సమస్త ప్రమేయముల యందును అనేక విధముల కలుగుచుండును. మిథ్యాజ్ఞానము (అహంకారము) జననమరణరూప సంసార కారణమగుట వలన దానిని తత్త్వజ్ఞానముచే నశింపజేసిన యెడల రాగద్వేషములను దోషములు నశించును. అవి నశించిన ప్రవృత్తి నశించిన పునర్జన్మ నశించును. జన్మ నాశనముతో సంపూర్ణ దుఃఖ నాశన మగునని ఋషి గ్రంథారంభమున రెండవ సూత్రముననే చెప్పియున్నాడు.

"తత్త్వజ్ఞానము మిథ్యాజ్ఞానమువలె నశింపదు" (న్యా.సూ. 4-2-34) తత్త్వజ్ఞాన మనగా - వెనుక చెప్పిన ప్రమాణ ప్రమేయములను గుఱించిన సంపూర్ణ వివేకము. భేదబుద్ధియే మిథ్యాజ్ఞానము, ధర్మానుష్ఠానమున ఆత్మస్వరూపమును తెలిసికొను వివేకము కలుగును. దానివలన భేదబుద్ధి నశించి యథార్థ జ్ఞానము కలుగును. యథార్థజ్ఞాన మనగా - బుద్ధిచే గ్రహించుట మాత్రమే కాదు, జీవితానుభవమునందు అది స్థిరపడవలయును. స్వార్థము పూర్తిగా నశింపవలయును. అది సిద్ధించుటకు సమాధికూడ అవసరము.

సూ|| "సమాధి విశేషాభ్యాసాత్" (న్యా,సూ, 4-2-36)

తా|| సంప్రజ్ఞాత (నిర్విచార) సమాధి సభ్యసించుటవలన (సిద్ధించుట వలన) తత్త్వజ్ఞానము దృఢపడును - విషయములయందు విరక్తి

---

* మిథ్యాజ్ఞానము 1. నిమిత్తము. 2. నైమిత్తికము అని రెండు విధములు. 1. దేహమే నే ననుకొనుట నిమిత్తమిథ్యాజ్ఞానము. 2. అన్నపానాదులు భార్యాపుత్రాదులు సుఖ సాధనములను భావము నైమిత్తిక మిథ్యాజ్ఞానము.

కలుగుటవలనను యమ నియమాది అష్టాంగ యోగము నభ్యసించుట వలనను సమాధి సిద్ధించును, యమాదులు నేనిదివఱలో యోగశాస్త్రము నందు చెప్పినవే.*

ముక్తస్థితి - మోక్షస్వరూపమును గుఱించి న్యాయము ఇట్లు చెప్పినది-
సూ|| "సుషుప్తస్య స్వప్నాదర్శనే క్లేశాభావవ దపవర్గే"

(న్యా.సూ. 4-1-63)

తా|| సుషుప్తిని (గాఢనిద్రను) పొందిన వ్యక్తికి స్వప్నము లేనందున క్లేశాభావ మగునట్లు అపవర్గ ముండును. అనగా - మోక్షము గాఢ సుషుప్తివంటిది. అందు జ్ఞానముగాని ఆనందముగాని లేదనిభావము. ఈ స్థితియందు అదృష్ట ముండదు.

సూ|| "తదభావ శ్చాపవర్గే" (న్యా.సూ. 4-2-42).

ఇంతటితో ద్వాదశ ప్రమేయములను గుఱించిన వివరము సంగ్రహముగా చెప్పితిని. న్యాయదర్శనమును ఆరంభించుచు గౌతమఋషి మొదటి సూత్రమునందు ప్రమాణాది షోడశ పదార్థములను చెప్పియున్నారు. మనమింతవఱకు ప్రమాణ ప్రమేయముల రెండింటిని మాత్రమే విచారించితిమి. తక్కిన సంశయాది (14) పదార్థము లన్నియు ప్రమాణముననో, ప్రమేయముననో చేరిపోవును. కనుక, వాటిని వేఱుగా విచారింపవలసిన అవసరము లేదు. తర్కమును తెలిసికొన గోరువారికి అవి ఉపయోగకరములు; ముముక్షువునకు అవసరముండదు. కనుక, వాటిని వదలి యీశ్వరుని గుఱించియు; ప్రపంచోత్పత్తి, ప్రళయముల గుఱించియు విచారించుట ముముక్షువుల కావశ్యకము. కనుక ఆ యంశముల నిట విచారింతము.

ఈశ్వర విచారము

సూ|| "ఈశ్వరః కారణమ్ పురుషకర్మా ఫలస్యదర్శనాత్"

(న్యా.సూ. 4-1-19)

---

* బ్రహ్మజిజ్ఞాస ద్వితీయ భాగమున రాజయోగ ప్రకరణమునందు యమాదులను గుఱించి చెప్పియుంటిని.

తా|| జీవులు తాము చేయు శుభాశుభ కర్మలకు తగిన ఫలము ననుభవించుచున్నారు. అట్టి కర్మఫలముల నొసంగువాడు ఈశ్వరుడు. లోకమున కొందఱు దుర్మార్గులు సుఖమును, సత్పురుషులు దుఃఖమును అనుభవించుచున్నారు. అట్లనుభవించుటకు కారణమేమి? వారువారు వారివారి పూర్వ జన్మములయం దాచరించిన శుభాశుభ కర్మల నాధారముగా నీ జన్మమున వారికి దేశకాల విశేషముల నపేక్షించి వారి అదృష్టానుసారము తగిన ఫలము నిచ్చువాడు ఈశ్వరుడు. అదృష్టము కలదు కదా, ఈశ్వరునితో పని యేమి? అనిన, అదృష్టము, కర్మ-ఇవి జడములు, ఏ జీవునకు నే జన్మమున నెట్టి సమయమున నెట్టి ఫలముల నొసంగ వలయునను జ్ఞానము అల్పజ్ఞులగు జీవులకు గాని జడములగు అదృష్టాదులకు గాని లేదు. అట్టి కార్యము చేయదగినవాడు సర్వజ్ఞుడు కానిదే అ కార్యము సాధ్యము కాదు. సర్వజ్ఞుడైనంత మాత్రమున చాలదు. సర్వశక్తిమంతుడై యుండవలయును. అట్టివాడు శాశ్వతుడై యుండవలయును. ఈ లక్షణములు గలవాడు ఈశ్వరుడని పై కారణములను బట్టి నిర్ణయింప నగును.

ప్రపంచోత్పత్తి

పరమాణువులు : దృశ్యమాన మగు జగత్తు ఎట్లు కలిగినది? ఈ ప్రశ్నమునకు నైయాయికుల సమాధానమిది:- లోకమున కనబడు జడద్రవ్యము లన్నియు సావయవములు. ఒక జడద్రవ్యమును తీసికొని దానిని ముక్కలు చేయుచు పోయిన కడపట అది అణువు లగును. దేనిని పగుల గొట్టుటకు (భేదించుటకు) సాధ్యపడదో అది పరమాణువు. పరమాణువులు అభేద్యములు. ఏలయన? దానికి అవయవములు లేవు. అవయవములు గల ద్రవ్యములు పుట్టినవి. కనుక, అవి నశించుచున్నవి. ఆ ధర్మము ననుసరించి దేనికి జన్మము లేదో దానికి నాశనము లేదు. (న్యా.సూ. 4-2-14) కనబడు సావయవమగు జగత్తు ప్రళయమున నశించి, (నామరూపములు కోల్పోయి) పరమాణువు లగును. పరమాణువులు ప్రళయమున చలనము లేక యుండును. అది విశ్రాంతిస్థానము. సావయవ ప్రళయమేగాని సంపూర్ణ ప్రళయము లేదు.

సర్గారంభమున నీశ్వరుడు అదృష్టము నాధారముగా గొని జగత్తును సృజించును. అప్పుడు విడివిడిగా చలనము లేక యున్న పరమాణువులకు అదృష్టపురస్సరమగు నీశ్వరేచ్ఛచే చలనము కలుగును. రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుక మనబడును. **సూ|| "పరం వా త్రుటేః"** (న్యా.సూ. 4-2-15) గవాక్షాది రంధ్రములనుండి ప్రసరించు సూర్యకిరణము లలో నెగురుచుండు దుమ్ము రేణువు 'త్రసరేణు' వనబడును. దానినే 'త్రుటి' యందురు. ఈ త్రుటికి కారణము ద్వ్యణుకము. ఈ ద్వ్యణుకములు ఒండొంటితో కలిసి మహద్రూప మేర్పడును. మహత్పరిమాణమునకు కారణము ద్వ్యణుకములోని అణుత్వము గాక బహుత్వసంఖ్య యందురు. పరమాణువు నిష్ప్రదేశము. వీరి మతమునందు అవయవి, అవయవములు, భిన్నములు. పరమాణువులు అవయవులు, మహద్రూపములు అవయవములు.

నిత్య వస్తువులు

ఈశ్వరుడు, ఆత్మలు, అణువులు, అదృష్టము, ఆకాశము, దేశము, కాలము - ఇవి నిత్యమైనవి. ఇందులో మొదటి నాలుగింటిని గుఱించి తెలిసికొంటిమి. అపవర్గమున అదృష్ట ముండదు. ఆకాశాదులను గుఱించి తెలిసికొనవలసి యున్నది.

ఆకాశము : సూ|| "శబ్దసంయోగ విభవాచ్చ సర్వగతమ్"
(న్యా.సూ. 4-2-19)

శబ్దము ఆకాశము నందంతటను ఉండును. ఆ విధముగనే శబ్దాశ్రయ మగు ఆకాశము యొక్క సంయోగము సర్వమూర్త ద్రవ్యములకు ఉండును. కనుక ఆకాశము విభువు. అది సర్వగత మనుట సర్వాంతః ప్రవేశమువలన కాదు. ఆకాశమునకు అవయవములు లేవు. లోకమున స్పర్శము గల ద్రవ్యము గతిగల మఱియొక ద్రవ్యముచే నెదుర్కొనబడి వెనుకకు మరలును. జలము స్పర్శగల దగుటచే నావచే నెదుర్కొనబడి వెనుకకు మరలును. నావను ముందునకు పోనివ్వక ఆపును. ఆకాశము అవ్యూహాది గుణములు లేనిది. (న్యా.సూ. 4-2-20) శబ్దము అస్పర్శ మైనను అది అనిత్యమే. ఏలయన ప్రయత్నముచే పుట్టుచున్నది.

దేశము : ఇదియు విభువే. తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణము అను దిక్కులు వ్యావహారికమే.

కాలము : ఇది భూత భవిష్య ద్వర్తమానములని వ్యవహారముకొఱకు విభజించు కొనుచున్నాము. వాస్తవముగా కాలమునం దట్టి విభాగము లేదు. కాలము విభువు.

న్యాయదర్శనముయొక్క సంగ్రహ రూప మిదియే.

జిజ్ఞాసువు : అయ్యా! న్యాయ దర్శనమున గల 515 సూత్రముల యందు ఒక్క సూత్రమున (4-1-19) మాత్రమే యీశ్వరప్రసక్తి చేయబడినది. అదియును నీశ్వరుడు పురుషులకు (జీవులకు) కర్మ ఫలము నొసంగువాడే యనిరి గాని జగదుత్పత్తి స్థితి వినాశములకు కర్తయని చెప్పబడలేదే?

వేదాంతి:- జీవులకు కర్మ ఫలము నొసంగవలయునన్న వారికి భోగసాధన మగు దేహ ముండవలయును. దేహనిర్మాణమునకు కావలసిన అణు సముదాయ ముండవలయును. భోగ్యపదార్థము లుండవలయును. ఇవన్నియు సమకూర్చుట వలన జగదుత్పత్తి చేయుటయే కదా? కనుక, జగదుత్పత్తికి పరమకారణము ఈశ్వరుడే యని వేఱుగా చెప్ప నవసరము లేదని దర్శనకారుల అభిప్రాయమై యుండును.

న్యాయసూత్రములయందు నీశ్వరుని గుఱించి విస్తరించి చెప్పక పోయినను తదనంతర నైయాయికులు విస్తరించి చెప్పిరి. నాకు తెలిసినంత వఱకు నీశ్వరాస్తిత్వమును పెక్కు రీతుల స్థిరపరచిన న్యాయాచార్యుడు ఉదయనాచార్యులు. వీరు "న్యాయ కుసుమాంజలి" అను గ్రంథమును రచియించిరి. (వీరు క్రీ.శ. 1163 నాటివారు) ఆ గ్రంథమునందు పంచస్తబకములు గలవు. గ్రంథకర్త అయిదు విప్రతి పత్తుల (విరుద్ధజ్ఞానముల) నూహించుకొని ఒక్కొక్క స్తబకమున నిరీశ్వర వాదములగు 1. చార్వాక 2. మీమాంస 3. సౌగత 4. దిగంబర 5. సాంఖ్య-వాదములను క్రమమున అయిదు స్తబకములయందు ఖండించి,

ఈశ్వరాస్తిత్వ స్థాపన మొనర్చిరి. ఈ విషయమున వారి గ్రంథము చాల ప్రశంసింప దగినది. ఉదయనాచార్యులు గొప్ప శివభక్తులు. ప్రతి స్తబకాంతమున శివస్తుతి చేసిరి.

జిజ్ఞా : అయ్యా! నాకు కొన్ని సంశయము లున్నవి. నివర్తింప వేడుచున్నాను.

వేదాంతి : న్యాయ, వైశేషిక దర్శనములకు పెక్కు అంశములయందు సామ్య మున్నది. నీకు వైశేషిక దర్శనమును వినిపించెదను. పిమ్మట నీ సంశయములను దెలుపుము; వాటిని తొలగించుటకు యత్నింతును.

(5) వైశేషిక దర్శనము

వైశేషిక సూత్రములు ఈ దర్శనమునకు ముఖ్య గ్రంథము.* దీని కర్త కాణాద ఋషి. వీరిని కణభోజి లేక కణభక్షకుడు అనియు పిలుతురు. వీరి మొదటి పేరు కశ్యపుడట. వైశేషిక దర్శనమునకు శాస్త్రరూపము నిచ్చినవి. వైశేషిక సూత్రములే. ఈ దర్శనమును ఔలూక్యదర్శన మనియు అందురు. కాణాదఋషి బుద్ధభగవానునకు పూర్వికుడును అక్షపాద గౌతమ ఋషికి తరువాతి వాడును అయియుండ వచ్చునని కొందఱును, వైశేషిక సూత్రములు జైన, బౌద్ధ మతములకంటెను న్యాయ దర్శనము కంటెను పూర్వమును, బ్రహ్మసూత్రములకు సమకాలికములును నైయుండ వచ్చునని కొందఱును, క్రీ.పూ. 4వ శతాబ్దికి చెందినవని మఱి కొందఱును చెప్పుదురు. పరమాణువులయందు పరస్పర భేదమును తెలియ జేయు ఒకానొక విధమగు విశేషము (ధర్మము) కలదని అంగీకరించుట వలన నీ దర్శనము న్యాయ దర్శనము కంటెను విశేషమైనదియు, అధికయుక్తి యుక్తమైనదియు నగుటచే వైశేషిక దర్శన మనుపేరు కలిగినదట. ఈ శాస్త్రమునే తర్క శాస్త్రమనియు పిలుతురు.

వైశేషిక సూత్రగ్రంథమున నీశ్వర ప్రసక్తి లేదు. తదనంతరము

* ఈ గ్రంథము పది అధ్యాయములు గలది. ఒక్కొక్క అధ్యాయము రెండు ఆహ్నికములుగా విభజింపబడినది. గ్రంథమున మొత్తము 372 సూత్రములు గలవు.

ఈ మతమును విస్తరింప జేసిన ప్రశస్తపాదు లనువారును, ఆయన తరువాతి వారును, ఈశ్వరాస్తిత్వము నంగీకరించిరి. ఈశ్వరాస్తిత్వమును అంగీకరించిన పిమ్మట నీశ్వరుడు జగత్తునకు పరమకారణ మనియు, పరమాణువులు ఉపాదాన కారణమనియు, అదృష్టమును ఆధారముగా నీశ్వరుడు జగన్నిర్మాణమును జేసెననియు చెప్పిరి.

ప్రశస్తపాదాచార్యులు వైశేషిక సూత్రములకు "పదార్థ ధర్మసంగ్రహ" మను భాష్యమును రచియించి, వైశేషిక సూత్రములయందు చెప్పబడని యీశ్వరప్రసక్తి అందులో చొప్పించినారు. కాణాదఋషి ప్రోక్తమగు సూత్రములయందు కొన్నింటిని ప్రశస్తపాదులు తమ భాష్యమున చూపియుండ లేదు. ఆ కారణమున అట్టి సూత్రములు ఆయన కాలమున ఉండి యుండవని కొందఱు సందేహింతురు. వీరి భాష్యము సూత్రముల యందలి మతము ననుసరింపక స్వతంత్రముగా రచియింపబడి యున్నదనియు, దానిని భాష్యమనుటకంటె ప్రశస్తవాదుల స్వతంత్ర గ్రంథమనుట యుక్తమనియు పండితుల యభిప్రాయము. ప్రశస్తపాదులు క్రీ.శ. నాలుగవ శతాబ్ది వారు. వారి అనంతరము వైశేషికదర్శనము (తత్త్వము) పైన గ్రంథములను రచియించిన వారు ప్రశస్తపాదులనే అనుకరించిరి. ఈశ్వరాస్తిత్వమును అంగీకరింపని మతము (తత్త్వము) లోప భూయిష్టమనియు, అట్టిది నాస్తిక మనియు, పండితులు వాదించుటచే ఆ లోపమును పూరించి, వైశేషికము లోకుల విమర్శకు గుఱికాకుండ చేయుటకై అనంతర వైశేషిక తత్త్వవేత్తలు ఆ విధముగా నీశ్వరాస్తిత్వమును అంగీకరించిరని తోచును. వైశేషిక దర్శనమునకు రావణ భాష్య ముండెనట. అది యిప్పుడు లభింపదు. చైనావారును జపానువారును దానిపై పెక్కు వ్యాఖ్యానములు రచియించిరట.

సూత్రకర్త "అథాతో ధర్మం వ్యాఖ్యాస్యామః" అను సూత్రముతో గ్రంథమారంభించిరి. అనగా : ధర్మమును నిరూపించుచున్నామని చెప్పి తరువాత సూత్రమున అట్టి ధర్మము అభ్యుదయమును, నిఃశ్రేయమును ప్రాప్తింప జేయునదని నిరూపించిరి. అట్టి ధర్మమునకు వేదములే ప్రమాణములని 3వ సూత్రమున చెప్పిరి. వైశేషిక తత్త్వము వలన

మన యెదుటనున్న పదార్థములను గుఱించిన సవిమర్శ జ్ఞానమును లోకులకు ప్రసాదించుట ద్వారా మిథ్యాజ్ఞానమును నివర్తింపజేయగల తత్త్వజ్ఞానమును ప్రసాదింప గలమని ఋషి తొలుత పదార్థ విచారమునే చేసెను.

షట్ పదార్థ వాదము

ప్రపంచమున గల భావపదార్థములను వీరు ఆఱు విధములుగ విభజించిరి. (1) ద్రవ్యము (2) గుణము (3) కర్మము (4) సామాన్యము (5) విశేషము (6) సమవాయము - (వై.సూ. 1-1-4) తరువాత వచ్చిన వైశేషికులు అభావమును కూడ చేర్చి ఏడనిరి.

పదార్థమనగా : ఒక పదముయొక్క తెలిసికొనదగిన యర్థము. పై ఆఱుపదార్థములను ఋషి రెండు విధములుగ విభజించెను. ఎట్లన: సూ|| "అర్థ ఇతి ద్రవ్యగుణ కర్మసు" (వై.సూ. 8-2-3) ద్రవ్యగుణకర్మలు మూడును అర్థశబ్దముచేత చెప్పబడెను.* సామాన్య, విశేష, సమవాయములు మూడును ఉపార్థములు. కాణాదఋషిగాని, ప్రశస్త పాదాచార్యులుకాని అభావమును నేడవ పదార్థముగా అంగీకరింప లేదనియు, శ్రీధరులు. ఉదయనాచార్యులు శివాదిత్యుడును అభావమును నేడవ పదార్థముగా అంగీకరించిరనియు పండితులందురు.

సూ|| "క్రియాగుణవత్ సమవాయి కారణ మితి ద్రవ్యలక్షణమ్"

(వై.సూ. 1-1-15)

తా|| క్రియావత్త్వము, గుణవత్త్వము, సమవాయ కారణత్వము అను మూడును ద్రవ్యలక్షణములు.** అనగా - ద్రవ్యము క్రియను, గుణమును, సమవాయమును తనలో నిముడ్చుకొని యున్నదని తాత్పర్యము- ద్రవ్య, గుణ, కర్మలు, వేఱు వేఱుగా నుండుటే గాక

---

* ఇతర దర్శనములయందు ముఖ్యముగా వేదాంత దర్శనమునందు "అర్థము" లనగా జ్ఞానేంద్రియ పంచకముచే మన మెఱుగు శబ్దాదులని యర్థము.

** దేనివలన ఒక వస్తువును ఇతర వస్తువులనుండి వేఱు చేయబడి గుర్తింప వీలగునో దానిని లక్షణ మందురు.

అన్యోన్యాశ్రయములై సామాన్య విశేష సంబంధము కలిగి యున్నవనిరి. ద్రవ్యరహితమగు గుణకర్మలు లోకమున లేవు. గుణసంబంధము లేని ద్రవ్యమును మనమూహింప జాలము. ఆకారణమున, బౌద్ధులు "మనము చూచునవి గుణములేగాని ద్రవ్యమనునది లేనే లే"దనిరి. గుణద్రవ్యములు వేఱువేఱని వైశేషికులు నిర్ణయించిరి. ద్రవ్యము గుణములు భిన్నములైనచో అవి వేఱు వేఱుగా మన కేల కనపడ వన - వాటి మధ్యగల సమవాయ సంబంధము వలన నని సమాధాన మిచ్చిరి. కాని, ద్రవ్యోత్పత్తి కాలము నందే ద్రవ్యముతో పాటు గుణములు ద్రవ్యమునం దుద్భవింపలేదనియు, ద్రవ్యోత్పత్తి అయిన తరువాత ద్రవ్యముతో గుణములకు సంబంధము కలిగినదనియు వీరు చెప్పుదురు. అట్లు చెప్పుటవలన వస్తువు (ద్రవ్యము) యొక్క పరమార్థ స్వరూపము (అసలు స్వరూపము) గుణరహితమైన దొకటియు, గుణములతో కూడిన రూప మొకటి అనియు, రెండవది మొదటిదానికంటె భిన్నమైన దనియు, ఇట్లు ద్రవ్యములు రెండు విధములని చెప్పవలసి వచ్చెను.

ఇంకొక విధముగా ద్రవ్యములు (1) సావయవములు (2) నిరవయవములు - అని రెండు విధములు (1) సావయవములు నిత్యములు కావు; ఉత్పత్తి వినాశములు కలవి. స్వతంత్రము లైనవి కావు. అనగా: మఱియొక దానిపై ఆధారపడి యుండునవి. (2) నిరవయవములు పరమార్థనిత్యములు, స్వతంత్రమైనవి.

ద్రవ్యములు

(1) పృథివి (2) జలము (3) అగ్ని (4) వాయువు (5) ఆకాశము (6) కాలము (7) దిక్కు (దేశము) (8) క్షేత్రజ్ఞుడు (ఆత్మ లేక ప్రత్యగాత్మ) (9) మనస్సు. (వై.సూ. 1-1-5)

పైన చెప్పబడిన నవవిధద్రవ్యములలో మొదటి మూడును అనిత్యములు. వాయువు మొదలు ఆఱు ద్రవ్యములును నిత్యములు. వాయువు, ఆకాశము, కాలము, దిక్కు - ఈ నాలుగు ద్రవ్యములును మహాప్రళయ పర్యంత ముండును. మనస్సు మోక్షపర్యంత ముండును.

కనుక ఇవి వ్యావహారిక నిత్యత్వము కలవే. పృథివ్యాదులకు మూలకారణ మగు పరమాణువులును, ఆత్మలును పరమార్థ నిత్యములు. ఈశ్వరు నంగీకరించిన మతమున నీశ్వరుడును పరమార్థ నిత్యత్వము కలవాడే.

ద్రవ్యము ప్రత్యక్షము. గుణకర్మలు ప్రత్యక్షములు కాకపోయినను ద్రవ్యాశ్రయ మగుటవలన ప్రత్యక్షాధీన ప్రత్యక్షములు, (వై.సూ. 8-1-1) వాయువు, ఆకాశము, కాలము, దిక్కులు, అణుసముదాయము, జీవాత్మ, మనస్సు, అనుద్రవ్యములు ప్రత్యక్షములు కావు (వై.సూ. 8-1-2).

ఆత్మలు, ఆకాశము, దిక్కులు, కాలము - ఇవి విభువులు మనస్సు అణువు (వై.సూ. 7-1-22 నుండి 25 వఱకు).

"సర్వ మూర్తద్రవ్య సంయోగిత్వం విభుత్వం" లేక "సర్వవస్తు బహిరంతర్వర్తమానత్వం విభుత్వం" - అన్ని వస్తువుల లోపల వెలుపల నుండుట విభుత్వము. మూర్త ద్రవ్యము లన్నింటితో సంబంధించి యుండుట విభుత్వ మనబడును.

ద్రవ్యములు మూర్తములని అమూర్తములని రెండు విధములు. క్రియాగుణము గల ద్రవ్యములు మూర్త ద్రవ్యములు. అవి భూజలాగ్ని వాయువులు, తక్కినవి అమూర్త ద్రవ్యములు.

గుణములు

(1) రూపము (2) రసము (3) గంధము (4) స్పర్శము (5) సంఖ్య (6) పరిణామము (7) పృథక్త్వము (8) సంయోగము (9) వియోగము (10) పరత్వము (11) అపరత్వము (12) బుద్ధులు (జ్ఞానములు) (13) సుఖము (14) దుఃఖము (15) ఇచ్ఛ (16) ద్వేషము (17) ప్రయత్నములు (వై.సూ.1-1-6)

సూత్రమునందు 'చ' కార ముండుటవలన (1) గురుత్వము (2) ద్రవత్వము (3) స్నేహము (4) సంస్కారము (5) ధర్మము (6) అధర్మము (7) శబ్దము - అను ఏడును చేర్చిన గుణపదవాచ్యములు (24) యిరువదినాలుగు. వీటితో లఘుత్వము చేర్చిన 25.

విశేష గుణములు : (1) రూపము (2) రసము (3)గంధము (4) స్పర్శము (5) స్నేహము (6) సాంసిద్ధిక ద్రవత్వము (7) శబ్దము (8) బుద్ధి (9) సుఖము (10) దుఃఖము (11) ఇచ్ఛ (12) ద్వేషము (13) ప్రయత్నము (14) ధర్మము (15) అధర్మము (16) భావనాఖ్య సంస్కారములు. ఈ గుణములు గల ద్రవ్యములు ఇతర ద్రవ్యముల నుండి వేఱుపరచి చూపబడును.

ఋషి గుణలక్షణములను ఈ క్రింది విధముగ చెప్పియున్నాడు :

సూ॥ "ద్రవ్యాశ్రయ గుణవాన్ సంయోగ విభాగేష్వకారణ మనపేక్ష ఇతి గుణలక్షణమ్." (వై.సూ. 1-1-16)

తా॥ గుణము ద్రవ్యమును విడిచి స్వతంత్రముగా ఉండదు. అది ద్రవ్యమాధారముగా కలది. తనకు (గుణమునకు) గుణములు లేనిది. సంయోగవియోగములు కలిగించుట యందు స్వతంత్ర కారణము కానిది. (అనగా : సంయోగ వియోగములు కలిగించుట కర్మయొక్క కార్యము, గుణమున కట్టి సంబంధము లేదు) గుణము జాతిమత్త్వము కలది.

గుణముల యొక్క వివరము : నిత్య ద్రవ్యములయందు నిత్యగుణములు, అనిత్య ద్రవ్యములయందు అనిత్య గుణములు ఉండును.

1. రూప 2. రస 3. గంధ 4. స్పర్శములు క్రమముగా నేత్ర, జిహ్వా, ఘ్రాణ, త్వక్కులను నింద్రియములచే తెలియబడును. **5. సంఖ్య**- ఒకటి రెండు అను లెక్కల యొక్క వ్యవహారమునకు కారణ మగునది. ఇది నిత్య పదార్థమగు ఏకత్వమున నిత్యము. అనిత్యగతమగు తక్కిన సంఖ్యయం దనిత్యము. **6. పరిణామము** - ఇది ద్రవ్యము లన్నింటి యందును ఉండును. ద్రవ్యము అణువుగనో, మహత్తుగనో, హ్రస్వముగనో, దీర్ఘముగనో ఉండుట. **7. పృథక్త్వము** - ద్రవ్యభేదమును తెలుపును. **8. సంయోగము** - సర్వవ్యాప్తములగు వస్తువులతో కలుగదు. ఏలయన? అవి ఒకప్పుడు పృథక్త్వము కలిగియుండలేదు. రెండు భిన్నవస్తువులు కలియుటే సంయోగము. సంయోగమువలన సంయోగము కలుగవచ్చును.

ఎట్లన? మనమొక చేతితో మామిడి పండును పట్టుకొని యింకొక చేతిలోని కత్తితో ఆ మామిడి పండును కోసిన యెడల, కత్తికి మామిడి పండుకు సంయోగము. ఆసంయోగముతోనే హస్తమునకును ఫలమునకును సంయోగము కలిగినట్లని అర్థము. **9. విభాగము** -కలిసియుండు రెండు వస్తువులయందు నేదైన ఒక వస్తువునకు చలనము కలిగినను, లేదా రెండింటికి చలన మేర్పడినను, వియోగము సంభవించును. **10. 11. పరత్వము - అపరత్వము** - ఇవి దేశ కాలముల యందలి దూరత్వమును, సామీప్యమును తెలుపునవి. **12. బుద్ధి** - సమస్త వ్యవహార జ్ఞానమునకు కారణ మగునది. **13. సుఖము** - ధర్మాచరణము వలన కలుగు అనుకూలము. **14. దుఃఖము** - అధర్మము వలన కలిగిన ఫలము తనకుప్రతికూలముగా తోచునట్టిది. **15. ఇచ్ఛ** - లభింపని పదార్థమునందు కలుగు కోరిక. **16 ద్వేషము-క్రోధము. 17. ప్రయత్నము-కృతి (చేత).**

సంఖ్యాగుణ పరీక్ష

జిజ్ఞాసువు : వైశేషికులు సంఖ్యను సంయోగ విభాగములను గుణములలో చేర్చినట్లు చెప్పితిరి. తదనంతర వైశేషికులు అభావమును నేడవపదార్థ మనిరని చెప్పితిరి. దయ యుంచి వీటిని, వివరముగా తెలుప గోరెదను.

వేదాంతి : వారిమతము ననుసరించి సంఖ్యాగుణము అన్ని ద్రవ్యములలోను ఉండును. ద్రవ్యములు కొన్ని నిత్యములని, మఱికొన్ని అనిత్యములని చెప్పియుంటిని గదా! నిత్య ద్రవ్యములయందుండు నేకత్వ సంఖ్యాగుణము నిత్యము. అనిత్య ద్రవ్యములలో ఉండు నేకత్వ సంఖ్యాగుణము అనిత్యము. కార్యద్రవ్యము అనేక కారణద్రవ్యములచే నేర్పడును. అనేక అవయవముల (కారణముల) వలన అవయవి (కార్యద్రవ్యము) యేర్పడుచున్నది. అవయవిని చూచినపుడు అనేక అవయవముల మాట (బహుత్వ సంఖ్యాజ్ఞానము)ను మరచి యేకత్వ సంఖ్యాగుణమునే చూచుచున్నాము.

అనగా - అవయవములు అవయవిగా నేర్పడునప్పుడు వాటి అనేకత్వమును పోగొట్టు కొనునని తాత్పర్యము. ఉదాహరణమునకు - అనేక తంతువులు చేరి వస్త్ర మగును. ఇచట అనేక తంతువులు కారణద్రవ్యము; వస్త్రము కార్యద్రవ్యము. వస్త్రమును మనము ఏకత్వ సంఖ్యా గుణముగనే దర్శించు చున్నాము. ఒక్కొక్క తంతువును చూచిన నేకత్వసంఖ్యా గుణభావన కలుగుచున్నది. విడివిడిగా తంతువులను చూచిన అనేకత్వ భావన కలుగుచున్నది. కాని ఆ తంతువులు వస్త్రమైనపుడు మనము తంతువులు అనేకములను జ్ఞానమును మరచి యేకత్వగుణమునే (వస్త్రమునే) దర్శింతుము. వస్త్రములు రెండయిన రెండు వస్త్రము లందుము. ఏలయన? రెండు వస్త్రములును సజాతీయములు ఒక వస్త్రమును, ఒక ఘటమును చూచి చెప్పునపుడు అవి విజాతీయ భేదము కలవి కనుక వాటిని ద్విత్వసంఖ్యతో (రెండు అని) చెప్పక ఒక పటము ఒక ఘటము అని యందుము.

ఇందువలన తేలిన సారాంశ మేమన - ద్విత్వాది సంఖ్యలు అన్యద్రవ్యము నపేక్షింపక కలుగవు. కనుక అవి అంతటను అనిత్యములే. ఏకత్వజ్ఞానము అన్యద్రవ్యాపేక్ష లేనిది; కనుక అది అంతటను నిత్యమే. ఒక పరిమితమైన సంఖ్యలో వస్తువులున్న రెండు, మూడు, నాలుగు అను జ్ఞానము కలుగును. వస్తువుల సంఖ్య నియమితము కానపుడు అనేకత్వ, లేక బహుత్వ సంఖ్యా జ్ఞానము కలుగును. బహుత్వమున ద్విత్వాది సంఖ్యలు అంతర్భూతములే.

సంయోగ - విభాగజ పరీక్ష

సంయోగ వియోగములని గుణములయందు 8-9 సంఖ్య గల గుణములుగా చెప్పబడినవి. అందు సంయోగము మూడు విధములు. విభాగము మూడు విధములు. సంయోగ విభాగములను గుఱించి తెలిపెదను. సూ|| "అన్యతరకర్మజ ఉభయ కర్మజః సంయోగ జశ్చ సంయోగః" (వై.సూ.7-2-9). సూ|| "ఏతేన విభాగో వ్యాఖ్యాతః" (వై.సూ. 7-2-10) అని పై రెండు సూత్రముల ద్వారా సంయోగ విభాగములను వివరించిరి.

(1) **అన్యతరకర్మజ సంయోగము :** ఒక చెట్టుపై ఒక పక్షి వ్రాలినచో చెట్టుతో పక్షికి సంయోగ మేర్పడును. ఇచ్చట క్రియారహితమైన దానితో క్రియాయుక్తమునకు సంయోగము కలిగినది. పక్షి చెట్టునుండి లేచి పోయిన చెట్టునకును పక్షికిని విభాగ మేర్పడినది. దీనిని అన్యతరకర్మజ విభాగ మనిరి.

(2) క్రియావంతములగు రెండు ఋషభములు పోట్లాడినవి. రెండింటి తలలు ఒక దానితో ఒకటి కలిపి ఢీ కొనినవి. దీనిని ఉభయకర్మజ సంయోగ మందురు. అవి రెండును పోట్లాటను మానుకొని పోయినచో రెండింటి వలనను విభాగ మేర్పడును. ఈ విభాగమును ఉభయ కర్మజ విభాగ మందురు.

(3) **సంయోగజ సంయోగము** - హస్తమునకు వృక్షముతో సంయోగము కలిగినపుడు శరీరముతో వృక్షమునకు కలిగిన సంయోగము- హస్తము చెట్టునుండి తీసినచో వృక్షహస్త విభాగమే కాక వృక్షమునకు, శరీరమునకు విభాగ మేర్పడినది. పై రెండు విభాగములు క్రియవలన నేర్పడినవి. ఈ విభాగము క్రియవలనగాక విభాగమువలన నేర్పడినందున విభాగజ విభాగమని చెప్పిరి.*

సూ|| "ఏతేన విభాగో వ్యాఖ్యాతః" (వై.సూ. 7-2-10)

యీ విధముగనే వియోగ వ్యాఖ్యానము కూడ చేయబడి నట్లెంచవలెను.

అభావము

కణాదఋషి అభావమును ఒక స్వతంత్రపదార్థముగా అంగీకరింప లేదు. ప్రాగభావమును మాత్రమే అంగీకరించినాడు. (వై.సూ. 9-1-1). ప్రాగభావమనగా కార్యోత్పత్తి కంటె పూర్వ మున్నస్థితి. ప్రధ్వంసాభావ మనగా కార్యము మఱియొక కార్యమునకు కారణము కాక అది పూర్తిగా

* మూడవది యగు విభాగజ విభాగమును అయిదు విధములని శాస్త్రకారులు పెంచి వ్రాసిరి. అవి మన కంత అవసరము లేదని వ్రాయనైతిని.

విడి పోవుట లేక నశించుట. శుద్ధాభావ మనునది అర్థరహితము. నాలుకతో మాటలాడుచు "నాకు నాలుక లేదనుట" వంటిది. మిగిలిన అభావము లన్నియు భావసంబంధములే. ప్రాగభావమునకు ఆది లేదు, అంత మున్నది. వస్తువు పుట్టగనే ప్రాగభావము నశించును. ప్రధ్వంసాభావమునకు ఆది యున్నది కాని అంతము లేదు. నశించిన దానికి మరల నాశన మెచటి నుండి వచ్చును?

న్యాయదర్శనమున 2-2-8 నుండి 2-2-12వ సూత్రము వఱకును అభావమును గుఱించిన చర్చ జరిగెను. ఒక గురువు కడకు వేదాది గ్రంథములు హస్తమున నుంచుకొనిన శిష్యులు కొందఱును, అవి లేని శిష్యులు కొందఱును వచ్చిరి. గ్రంథములు హస్తములందు లేని వారిని పిలుచుకొని రమ్మని గురువు సంరక్షకు నాజ్ఞాపించెను. అతడు వారిని గురువుకడకు పిలుచుకొని పోయెను. ఇట జరిగిన దేమి? హస్తమున గ్రంథాభావము గలవారు అలక్షితులు. అట్టి వారిని లక్షితులనుండి వేరు చేసి తెలిసికొనుటకు అభావము తోడ్పడినది. కనుక అభావము ఒక ప్రమాణమై ప్రమేయమును గుర్తించుచున్నదని చెప్పిరి.

తక్కిన అభావములు అనేకములన్నను అవి తర్కము కొఱకు నేర్పడినవే గాని అర్థశూన్యములు. వంధ్యాపుత్రుడు, శశవిషాణము, గగనకుసుమము - ఇత్యాదులు అత్యంతాభావములు. స్వవిరుద్ధ భావములు.

ద్రవ్యగుణ విచారమును ముగించుటకు ముందు అణువులయందలి గుణములు న్యాయ వైశేషిక సిద్ధాంతముల ననుసరించి యెట్టి మార్పు చెందునని చెప్పబడెనో ఆ విషయ మెఱిగింతును.

పాకజ గుణోత్పత్తి విచారము : సూ|| **"రూపాది పరావృత్తి హేతు తేజః సంయోగః పాకః".**

తా|| రూపాది గుణములు మార్పు చెందుటకు కారణమగు అగ్ని సంయోగము పాక మనబడును.

అగ్నిసంయోగమువలన వస్తువులలో గుణములు మారిపోవును.

అట్లు మారిపోవు క్రమపద్ధతిలో న్యాయ వైశేషికమతముల మధ్య భేదమున్నట్లు చెప్పుదురు. పాకము అవయవి (కార్యద్రవ్యము)లో కలుగునని న్యాయమతము. వారి యీ సిద్ధాంతమును పిఠర పాకమందురు. వారి వాదమిట్లుండును :

మట్టితో చేయ బడిన కుండ మొదలగు పాత్రలు ఆవములో పెట్టి కాల్చినపుడు ఆ పాత్రలలో మొదట నున్న రంగు మొదలగు గుణములు నశించి వాటి స్థానమున క్రొత్త గుణములు ఏర్పడును. అట్లేర్పడుటకు కారణము పాకము. కాల్చుటకు ముందు మట్టి పాత్రలయందున్న పరమాణువుల మధ్య బెజ్జములు (సన్నటి ఛిద్రములు) ఉండును. ఆ బెజ్జములలో అగ్ని జ్వాల ప్రవేశించి ఆ పాత్రలలోని రంగు మొదలగు గుణములను నశింపజేసి వాటి స్థానమున క్రొత్తరంగును నూతన గుణములను కలిగించును. ఆ విధముగా పాత్రలలోపల వెలుపల పక్వమై అణువులు నశింపక గట్టిపడి దట్టమై ఛిద్రములు లేని వగును. **ఇది అవయవిలో పాక మేర్పడుట,** రంగు మార్పు ఘటమునందును ఘటాణువులయందును ఒకే కాలమున జరిగినందున మునుపు అనగా కాల్చుటకు పూర్వము చూచిన ఘటమే "ఇది" యనుట స్పష్టము. దీనినే ***పిఠరపాక క్రియ*** యందురు.

వైశేషికులు ఇట్లు చెప్పుదురు :

సూ|| "అప్సుతేజసి వాయౌచ నిత్యాః ద్రవ్య నిత్యత్వాత్" (వై.సూ. 7-1-4)

తా|| జలాగ్ని వాయుభూత ద్రవ్యము నిత్య మగుటవలన వాటి గుణములును నిత్యములు -

సూ|| "అని త్యేష నిత్యాః ద్రవ్య నిత్యత్వాత్" (వై.సూ.7-1-5)

తా|| ఆశ్రయ ద్రవ్యము అనిత్యమైనచో అందలి గుణములు సైతము అనిత్యములే.

సూ|| "కారణగుణ పూర్వకాః పృథివ్యాం పాకజాః" (వై.సూ.7-1-6).

తా॥"అవయవియైన భూమియందు పాకమువలన కలిగిన రూపాది గుణములు అవయవికారణములగు అవయవముల (పరమాణువుల) యొక్క గుణములు కారణ మగుచున్నవి".

కుండ అవములో పెట్టి కాల్చిన పిమ్మట నల్లగా ఉండిఉండిన పచ్చికుండ యెఱ్ఱగా మారును. ఈ మార్పు అవయవి (కుండ)లో సాక్షాత్తుగా జరుగదు. పచ్చికుండ యే పరమాణువులచేత చేయబడెనో ఆ అణుసముదాయ మంతయు పాకము వలన కుండనుండి యెగిరిపోయి వాటియొక్క రంగు మొదలైన గుణములు మార్పు చెంది క్రొత్త అణుసముదాయ మేర్పడి వాటివలన నూతన ఘటము ఉత్పన్న మగుచున్నది. అనగా - మనము పూర్వము ఆవమునందుంచిన ఘటము ఇది కాదని అర్థము. పరమాణువులయందు ద్వ్యణుకము వఱకు నశించుటచేతను, పరమాణువులకు నాశనము లేనందునను, పరమాణవులయందు ఘటమును కాల్చుటకు ముందున్న నల్లరంగు పోయి యెఱ్ఱరంగు ఏర్పడును. ఇట్లు అవయవిలో పాకమేర్పడక ***అవయవముల (పరమాణువుల) లోనే పాక మేర్పడుటచే వీరిది "పీలుపాక సిద్ధాంత" మందురు.*** పీలు అనగా అణువు.

ఇంతటితో ద్రవ్యగుణముల వివరము పూర్తియైనది. అనంతరము కర్మపరీక్ష చేయుదము.

కర్మ - అనగా క్రియ.

సూ॥ **"కార్యవిరోధి కర్మ"** (వై.సూ. 1-1-14)

తా॥ విభాగమును పుట్టించిన పిమ్మట, ఉత్తర సంయోగమును కలిగించి నశించుచున్నది. కనుక కార్యవిరోధి యని చెప్పబడెను

సూ॥ **"ఏకద్రవ్యమగుణం సంయోగ విభాగేష్వనపేక్షకారణ మితి కర్మలక్షణమ్".** (వై.సూ. 1-1-17)

తా॥ ఒక్క ద్రవ్యమే ఆశ్రయముగా గలదియు, గుణమున కాశ్రయము కానిదియు, సంయోగవియోగముల పుట్టించుటలో (తనకంటె వెనుక

పుట్టిన) ఇతర కారణముల నపేక్షింపక స్వతంత్ర కారణ మగునట్టి లక్షణము గలది కర్మ. ఇది యొక "స్వతంత్ర పదార్థము".

ఒక కర్మవలన సంయోగ విభాగ వేగములు నేర్పడుచున్నందున వీటి మూడింటికి కర్మ సమాన కారణము. ఎట్లనగా : మనము ఒక వస్తువును పైకి విసరిన, అది విసరుటకు ముందున్న 'క' అను చోటునుండి 'గ' అను చోటునకు పోవును. ఆ ద్రవ్యమునకు 'క' అను చోటుతో విభాగమును 'గ' అను చోటుతో సంయోగమును కలుగును. పైకి విసరి వేయుట వలన "వేగము" అను సంస్కారము ఏర్పడును.

(వై.సూ.1-1-20)

కర్మలు అయిదు విధములు. (1) ఉత్ క్షేపము (ఊర్ధ్వచలనము) (2) అవక్షేపము (అధశ్చలనము) (3) ఆకుంచనము (4) గమనము (5) ప్రసారము. ఇవన్నియు చలనాత్మకములే.

సామాన్యము, విశేషము -

సూ|| "సామాన్యం విశేష ఇతి బుద్ధ్యపేక్షమ్," (వై.సూ.1-2-3)

ఋషి సామాన్యము, విశేషము అను రెండు పదార్థములను ఒక సూత్రమునందే చెప్పియున్నందున మనము కూడ ఆ రెండింటిని కలిపి విచారింతము.

సామాన్యవిశేషములు రెండును అనువృత్త వ్యావృత్త రూపబుద్ధి లక్షణములు. ద్రవ్య, గుణ, కర్మలలో ఉండునది ఒక సామాన్యమే . అనగా - ద్రవ్యము ఉన్నది, గుణము ఉన్నది, కర్మ ఉన్నది- అని వాటిసత్తా (ఉనికి లేక, కలిమిని)ను బోధించుబుద్ధి అనువృత్తబుద్ధి. ఇది సత్తాసామాన్యత. ఈ సత్తాసామాన్యము ద్రవ్య, గుణ, కర్మల స్వరూపముకంటెను వేఱగు నొక పదార్థము. అట్లు కాకున్న మనకు 'సత్' అను సమానాకారత గల జ్ఞానమును, అట్టి వ్యవహారమును, సిద్ధించి యుండదు. ఇట్టి బుద్ధికి ఆధార భూతమగు పదార్థమే సామాన్యము

అనగా- భిన్న భిన్న ద్రవ్యములు ఒకే జాతికి చెందిన వని చెప్పునట్టి సామాన్య మొక స్వతంత్ర పదార్థము.

ద్రవ్యమునుబట్టి చూచిన "ఇది ద్రవ్యము", గుణము కాదు, కర్మ కాదు అనియును; అట్లే గుణముబట్టి చూచిన "ఇది ద్రవ్యము కాదు, కర్మ కాదు" అనియును; కర్మను బట్టి చూచిన "ఇది ద్రవ్యము కాదు, గుణము కాదు" అను నిట్టి బుద్ధియే వ్యావృత్త బుద్ధి. ఇట్టి బుద్ధికి ఆలంబన భూత మగుపదార్థము విశేష మనబడును.

సంయోగము

సమవాయము - ద్రవ్యము, దాని గుణము వేఱువేఱని యిదివఱలో చెప్పితిని, అవి వేఱువేఱుగా నేల కనిపించ వనిన? వాటి మధ్య గల సమవాయ మనబడు సంబంధమును బట్టి అట్లు కనిపింపవు. సమవాయమును గుఱించి ఋషి యిట్లు చెప్పెను :

సూ॥ " ఇహేద మితి యతః కార్యకారణయోః సమవాయః"

(వై.సూ.7-2-25)

తా॥ నూలుపోగులయందు వస్త్రమను జ్ఞానము దేని వలన కలుగు చున్నదో దానినే సమవాయ మందురు.

విడిపోవుటకు వీలు లేని రెండు వస్తువుల మధ్య గల సంబంధము సమవాయము. ఇది కార్యకారణ సంబంధము. పటము (వస్త్రము)నకు కారణము తంతువులు (నూలుపోగులు). తంతువుల యొక్క కార్యము పటము. పటతంతువుల మధ్య గల యీ సంబంధమే సమవాయము. సమవాయ సంబంధము గల రెండు వస్తువులను వేఱు చేయుటకు వీలులేదు. వేఱుచేసినయెడల అసలు వస్తువే నశించును. నూలుపోగుల నన్నింటిని వేఱు వేఱుగా చేసిన వస్త్రమనునది లేదు. సత్తా ద్రవ్యాదులకంటె భిన్న పదార్థమని యిది వఱలో చెప్పబడెను. అట్లే సమవాయము కూడ నితర పదార్థములకంటె భిన్నమైనది. వైశేషిక

దర్శనమున "ద్రవ్యత్వ, గుణత్వ, కర్మత్వము" అనునవి ద్రవ్యగుణ కర్మలకంటె వేఱైనవి, (వై.సూ. 1-2-11 నుండి 16 వఱకు)

ఒక పదార్థమునందు మఱియొక పదార్థము ఏదో యొక సంబంధముతో ఉన్నది. వస్తువు మఱియొక వస్తువుతో సంయోగము కలిగినపుడు ఆ సంబంధము సంయోగ సంబంధ మనబడును. ఒక చెట్టుపై ఒక పక్షి కూర్చుండి యుండును. చెట్టునకు ఆ పక్షితో గల సంబంధము సంయోగ సంబంధము. అవి రెండును విడిపోవును. పక్షి చెట్టునుండి లేచి పోయినను ఆ రెండును వేఱు వేఱుగా ఉండునేగాని, అందులో నే యొక దానికిని ఆ వియోగమువలన స్వరూపనాశనము కాదు. వాటి సంబంధము నిత్యము కాదు, బాహ్యము. సమవాయ సంబంధము నిత్యము, ఆంతరంగికము; అంతమాత్రమే కాదు అన్యోన్యాశ్రయము. రెండు వస్తువులు ఇచట ఐక్యము నొందును. ద్రవ్యము మొదలగు ఇతర అయిదు పదార్థముల యందు ఆఱవదియగు సమవాయ మున్నది. ఇంకొక విశేషమేమన :

సూ|| "కారణమితి ద్రవ్యే కార్య సమవాయాత్" (వై.సూ.10-2-1)

తా|| ద్రవ్యమునందు మాత్రమే సమవాయ కారణమనెడి జ్ఞానమును, వ్యవహారమును కలుగును. గుణకర్మాదులయందు కలుగదు.

వైశేషికుల మతమున సమవాయము కేవలము బుద్ధిగమ్యమే గాని ప్రత్యక్షము కాదు, (వై.సూ.7-2-27) నైయాయికుల మతమున ప్రత్యక్షము.

ఇంతటితో షట్పదార్థ విచారము పూర్తి అయినది. షట్పదార్థముల యందు ద్రవ్యము మొదటిది. ద్రవ్యము తొమ్మిది విధములని వాటిని గుఱించి సంగ్రహముగా విచారించితిమి. నవవిధద్రవ్యములలో ఆత్మ ముఖ్యమగుటచే ఆత్మను గుఱించిన విచారము సయితము చాల ముఖ్యమగుట వలన నిచట ఆత్మ పరీక్ష చేయుట పునరుక్తి కానేరదు.

ఆత్మ పరీక్ష

నైయాయికులు చెప్పిన ఆత్మకును వైశేషికులు చెప్పిన ఆత్మకును భేదమంతగా లేదు. వైశేషికులు ఆత్మ రెండు విధములనిరి. (1) మనోవిశిష్టమగు ఆత్మ (2) కేవలాత్మ. ఇది మనస్సంబంధము లేనిది. ఆత్మవిభువైనను దేహమునందున్న ఆత్మ ప్రత్యగాత్మ యనబడును. ఆత్మ ప్రత్యక్షము కాదు.

సూ|| "యజ్ఞదత్త ఇతి సన్నికర్షే ప్రత్యక్షాభావాత్ దృష్టం లింగం న విద్యతే". (వై.సూ.3-2-6)

తా|| యజ్ఞదత్తాదుల శరీరము ప్రత్యక్ష మయినట్లు ఆ శరీరాధిష్ఠాత యగు ఆత్మను గుర్తించు ప్రత్యక్ష ప్రమాణము ఏమియు లేదు- అట్లయిన ఆత్మ కలదనుటకు ప్రమాణము ఏమి?

సూ|| "తస్మాదాగమికః" (వై.సూ. 3-2-8)

వేదములయందును, ఉపనిషత్తులయందును ఆత్మ శబ్దము ప్రయోగింపబడియున్నది. కొంత చర్చ జరిగిన అనంతరము అనుమానాగమముల రెంటివలనను, ఆత్మ యెఱుగబడుచున్నదని స్థిరపఱచిరి (వై.సూ. 3-2-18) మన అనుభవమును బట్టి చూచిన ఇంద్రియముల వలన "నేను వాసన చూచుచున్నాను. నేను వినుచున్నాను" అను నీ యనుభవజ్ఞానమునకు ఆశ్రయమేదియో అదియే యాత్మయనియు (వై.సూ. 3-1-2) మఱియు "నేను" "నేను" అను అహంశబ్దవాచ్యమగు వస్తువేది?

సూ|| "అహమితి శబ్దస్య వ్యతిరేకాన్నాగమికమ్" (వై.సూ. 3-2-9)

అహం - "నేను" అను శబ్దము పృథివ్యాది భూతములకంటె భిన్నమగుటవలన అగమ సిద్ధమైన ఆత్మ "నేను" అను శబ్దముచే వ్యవహరింపబడు ఆత్మకే చెందినదని యూహింప వలయును అని చెప్పియుండియు యోగులకు మాత్రము యోగమువలన ఆత్మ ప్రత్యక్షమే యని చెప్పబడెను.

సూ|| "ఆత్మన్యాత్మమనసోః సంయోగ విశేషాదాత్మ ప్రత్యక్షమ్".
(వై.సూ. 9-1-11)

తా|| ఆత్మయందు, ఆత్మ మనస్సులకు యోగము వలన సిద్ధించిన సంయోగ విశేషమువలన ఆత్మసాక్షాత్కార మగును - ఇట్లు చెప్పుటవలన యోగులు కాని వారికి అట్టిది కలుగదు. అట్టి వారు పైన చెప్పినట్లు (3-2-18) వేద ప్రామాణ్యముచేతను, అనుమానము వలనను మాత్రమే ఆత్మను గుఱించి తెలిసికొనవలయును.

ఆత్మ పరమార్థనిత్య మైనది. అవి అనేకములు. వీటికి ప్రళయము నందును నాశనము లేదు. ఆత్మలు విభువులు, వేదాంతులు ఆత్మకు జ్ఞానము 'స్వరూపమ' ని యందురు. వైశేషికులు దాని నంగీకరింపక జ్ఞానము ఆత్మకు గుణమందురు. గుణమనగా - ఆత్మయందెల్లప్పుడు ఉండునది కాదు. కొన్ని సందర్భములయందు మాత్రమే జ్ఞానము ఆత్మ యందు పుట్టుచున్నది. ఆత్మ విజ్ఞానమును పోషించు నందురు. ఆత్మలు సహజముగా జడములు. వచ్చుచు పోవుచుండునట్టి అగంతుక జ్ఞానము కలవి. ఒక జీవాత్మకు మఱియొక జీవాత్మకు మధ్య భేద మున్నది. ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము మొదలగునవి ఆత్మ గుణములు-

ఇందులో ఆత్మను గుఱించి చెప్పక వదలి యుండిన విషయములు న్యాయదర్శనమునందు చెప్పియుండిన వాటి నిచట అనుసంధించు కొనవలెను-

మనస్సు - మనస్సును గుఱించి నైయాయికులు చెప్పిన దానికిని వైశేషికుల మతమునకును భేదము లేదు. మనస్సు ఆత్మ నంటుకొని యుండును. ఇది పరమాణురూప మైనది. (వై.సూ. 3-2-1) ఇది జడము. ఇది దేనిని కూడ పుట్టింపదు. ఒక్కొక్క జీవాత్మకు ఒక్కొక్క మనస్సుతో సంబంధ ముండును. జీవు డొక దేహమును విడిచి మఱియొక జన్మమెత్తినను పూర్వజన్మ సంబంధమగు మనస్సే జీవుని వెన్నంటి యుండునని చెప్పుదురు. పర్యవసానమున మనస్సే జన్మ పరంపరలను

బొందుచున్న దని చెప్పినను సరిపోవును. ముక్తపురుషుని మరణానంతరము మనస్సు నశించును. అంతపర్యంతము అది నిత్యమే.

బుద్ధి (జ్ఞానము) - నైయాయికులు చెప్పిన దానికంటె వైశేషికులు జ్ఞానమును గుఱించి భిన్నముగా చెప్పలేదు.

సూ|| "ఆత్మేంద్రియార్థ సన్నికర్షాత్ యన్నిష్పద్యతే తదన్యత్|"

(వై.సూ. 3-1-19)

తా|| ఆత్మ మనస్సుతోను, మనస్సు ఇంద్రియములతోను, ఇంద్రియములు గంధాది యింద్రియార్థములతోను సన్నికర్షణము కలిగినపుడు (సంబంధించినపుడు) పదార్థజ్ఞానము కలుగుచున్నది. ఇట్లు కలుగు జ్ఞానము ఆత్మస్వరూపమునకంటె భిన్నమైనది.

బుద్ధి, జ్ఞానము, ఉపలబ్ధి, ప్రత్యయము - అనునవి పర్యాయపదములు, అనుభూతి, స్మృతి అని బుద్ధి (జ్ఞానము) రెండు విధములు. అందు అనుభూతి విద్య, అవిద్య - అని రెండు విధములు, న్యాయదర్శనమున చెప్పిన విధముగనే తక్కిన యంశముల నూహింపవలెను.

అదృష్టము - దీనిని న్యాయదర్శనమునందు చెప్పినట్లె చెప్పుదురు. అదృష్టము జీవులవలనను, ద్రవ్యములవలనను పుట్టి సృష్టివిధానమును ఒక పద్ధతిలో కొనసాగించుటకు సహాయపడును. జీవులను వారి పూర్వజన్మ కర్మఫలమును అనుభవింపజేయును. అది జీవుల శుభాశుభ కర్మలవలన కలిగిన సంస్కారరూపమున ఆత్మయం దుదయించి ఆత్మయందే యుండును. అది జీవుల విశ్రాంతికొఱకు పరమాణువులు విడిపోవునట్లు చేయును. అది ప్రళయము. అప్పుడు అణువులు చలనము లేనివై యుండును. సర్గారంభమున అదృష్టము వీటిలో ఒక దానితో ఒకటి కలియునట్లు చేయును.

వైశేషిక దర్శనమునందలి అనేక లోపములను పూరించుటకు అదృష్టము తోడ్పడును. క్లిష్ట సమస్యలకు (ప్రశ్నలకు) సరియైన సమాధానము తోచనప్పుడు అదృష్టమును ఆధారముగా గైకొని సమస్యలను

పరిష్కరింతురు. అయస్కాంత సన్నిధికి సూచి యేల పోవును? ఊడగ చెట్టు నుండి క్రింద రాలి పడియుండు దాని విత్తనములు ఉరుము ఉరమగనే యెగిరిపోయి ఆ వృక్షమున కేల అంటుకొనును? ఇట్టి ప్రశ్నలకు "అదృష్టమువలన" అని సమాధాన మిత్తురు. ఈశ్వరాస్తిత్వము అంగీకరించినపిదప కూడ వీరు ఈ అదృష్టమును వదలిపెట్టలేదు. సృష్టి మొదలగునవి యీశ్వరుడు అదృష్టశక్తి ద్వారమున చేయునని అదృష్టమును ముందిడుకొనియే యుండిరి.

పరమాణువులు

నైయాయికులవలెనే వైశేషికులును పరమాణువాదులు. జగత్తునకు ఉపాదాన కారణము పరమాణువు; ఇవి నిరవయవులు, నిత్యములు. ప్రళయమునందు నశింపవు, కనుక పరమార్థనిత్యములు. పారిమాండల్య ప్రమాణము గలవి. అనగా : పొడవు గాని వెడల్పుగాని లేక ఒక ప్రదేశమును మాత్రము ఆక్రమించి యుండునవని అర్థము. అతిసూక్ష్మము లని భావము. ఇవి నాలుగు విధములు : కొన్ని స్పర్శ రూప రస గంధ గుణములు కలవి. వీటి పరస్పర సంయోగము వలన పృథ్వీభూతము కలిగినది. స్పర్శ రూప రస గుణములు గల పరమాణువుల పరస్పర సంయోగము వలన జలభూతము కలిగినది. అట్లే స్పర్శరూప గుణములు గల పరమాణువుల వలన అగ్ని భూతము కలిగినది. స్పర్శ గుణము మాత్రమే గల పరమాణువులవలన వాయు భూత మేర్పడినది. ఆకాశమునకు పరమాణువులు లేవు. అది నిత్యము.

పైన చెప్పిన పృథివ్యప్తేజోవాయు పరమాణువుల వలన ఘ్రాణ, జిహ్వా, చక్షుః, త్వగింద్రియములు కలిగి గంధాదుల నెఱుగుచున్నవి. కర్ణ (శష్కులి) రంధ్రమునందున్న ఆకాశమే శ్రోత్రేంద్రియము. ఇది శబ్దము నెఱుగుచున్నది. శబ్దము నిత్యము కాదు. ఏలయన? అది ప్రయత్నమువలన పుట్టుచున్నది. పుట్టునది గిట్టును. పృథ్వీపరమాణువుల యందు అగ్నివలన కొన్ని గుణములు మారును; తక్కిన భూత పరమాణువులయందిట్టి మార్పు కలుగదు. నైయాయికుల పరమాణువుల

యందు గుణభేదము లేదు, అవి అన్నియు ఒక్క విధమైనవే. నైయాయికుల మతమున పరమాణువున యందున్నట్లు చెప్పని ఒకానొక విధమగు విశేషము వీరి పరమాణువుల యందున్నట్లు చెప్పబడి యున్నందున నీ దర్శనము వైశేషిక దర్శనమని ప్రసిద్ధి చెందిన దందురు.

పరమాణువు మన నేత్రమునకు గోచరము కాదు. రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుక మగును (ద్వికము Diads). ఇదియు అగోచరము. ఇట్టివి మూడు కలిసిన త్ర్యణుకము, (త్రికము అని కొందఱందురు). "త్రిక" మనగా అణుత్రయమే యని కొందఱందురు. ఇందు మహత్పరిణామ మేర్పడును. మహత్పరిమాణమునకు అందలి అణుద్వయము కారణము గాక వాటి బహుత్వసంఖ్య యని వీరి మతము. నైయాయికులు కూడ నీ విధముగనే అంగీకరించిరని చెప్పి యుంటిని. నాలుగు ద్వ్యణుకములు కలవి చతురణుకము. ఇవి యొక దానితో ఒకటి కలిసి పైన చెప్పినట్లు భూతము లేర్పడినవి. పరమాణువులు స్వభావముగ చలనరహితములు. ఇవి పారిమాండిల్యము లని మన మూహించుకొనవలెను.

అసత్కార్యవాదము - నైయాయికులు, వైశేషికులు అసత్కార్యవాదులు. సాంఖ్యులు వేదాంతులు సత్కార్యవాదులు.

అసత్కార్యవాద మిట్లుండును - ప్రతి కార్యపదార్థము తన యుత్పత్తికి పూర్వము 'అసత్' ఉనికి లేనిదై యుండును. కార్యమేర్పడుటకు ముందు దాని యునికి అభావ మైనందున దానిని "ప్రాగభావ" మందురు. కార్యోత్పత్తితోపాటు ప్రాగభావము నశించును. దీనినే ఆరంభవాద మందురు. కార్యము ఒకప్పుడు పుట్టి యింకొకప్పుడు నశించును. కనుక, దీనికి ఆద్యంతములు కలవు. నూలుపోగులు కారణము; దాని కార్యము వస్త్రము, మట్టి కారణము, దాని కార్యము కుండ, వస్త్రము ఘటము వాటి యుత్పత్తికిముందు క్రమమున తంతువులయందును, మృత్తిక యందును నున్న వస్త్రఘటములవలన నెట్టి ప్రయోజనము మనకు సిద్ధించు చున్నదో అట్టి ప్రయోజనము తంతువుల వలనను మృత్తిక

వలనను నేల సిద్ధింపదు? వస్త్రము, ఘటము వాటి వాటి యుత్పత్తికి పూర్వమవి తంతువులయందును మృత్తికయందును లేవు. కారణ వ్యాపారము వలన అవి క్రొత్తగా కలిగినవి. నైయాయికులు "కార్యము దాని యుత్పత్తికి పూర్వము సత్తు కాదు; అసత్తు కాదు" అందురు. (వై.సూ. 4-1-49-50)

సత్కార్యవాద మిట్లుండును : ఉత్పత్తికి పూర్వమే కార్యమునకు ఉనికి (సత్) ఉండును. మట్టి, కుండకు ఉపాదాన కారణము. మృత్తిక యొక్క కార్యము ఘటము, ఘటము తన యుత్పత్తికి పూర్వమే, కారణమగు మృత్తికయందున్నది. "ఘటము నుండి నీరు తెచ్చినట్లు మృత్తికనుండి నీరు తేగలవా?" అని అసత్కార్యవాది అడిగిన ప్రశ్నమునకు సమాధానము ఘటాదులు వాటి యుత్పత్తికి పూర్వము వ్యవహార రూపమున నుండక కారణరూపమున వ్యక్తము గాని స్థితిలో ఉండును. అవి విశేష నిమిత్త కారణముల వలన వ్యక్తమైనప్పుడు జలాహరణాది కార్యముల కుపయుక్తము లగును కావున తన యుత్పత్తికి (అభివ్యక్తికి) పూర్వము కార్యము కారణమున (సద్ భావమున) ఉండియుండక పోయిన యెడల సర్వకార్యములు సర్వపదార్థములనుండి ఉత్పత్తి చేయజాలియుండము. అట్లు చేయుటకు సాధ్యము కాదు. మృత్తికనుండి ఘటమును ఉత్పత్తి చేయగలము గాని వస్త్రమును ఉత్పత్తి చేయజాలము. తంతువు నుండి వస్త్రమును ఉత్పత్తి చేయుదుము గాని ఘటము నుత్పత్తి చేయలేము; ఇదియే సత్కార్యవాదము.

ప్రమాణములు

వైశేషికదర్శనము నవమాధ్యాయ ప్రథమాహ్నికమున నీ విషయము చర్చించబడెను. వీరు ప్రత్యక్షము, అనుమానము, ఆర్షము (వేదము)- అను మూడు విధములగు జ్ఞాన ప్రమాణముల మాత్రమే అంగీకరింతురు. న్యాయదర్శనము ప్రమాణములను విస్తరించి చెప్పగా వైశేషికము ప్రమేయములను విస్తరించి చెప్పినది. దీనియందు ముఖ్యముగా ప్రత్యక్షాను మానములు పరిశీలింప బడినవి. న్యాయ దర్శనమున చెప్పిన

"ఉపమానము" ను వీరంగీకరింపలేదు. అంతేగాక ఉపమానము, అర్థాపత్తి, అభావము, సంభవము. ఐతిహ్యము అను నీ ప్రమాణములు అనుమానమున అంతర్భాగము లనిరి (వై.సూ. 9-2-5)

ధర్మ సూత్రము

సూ|| "యతోఽభ్యుదయనిఃశ్రేయససిద్ధిః స ధర్మః" (వై.సూ. 1-1-2)

అభ్యుదయ నిఃశ్రేయస్సును కలిగించునది ధర్మము. అభ్యుదయము ఇహలోక పరలోక సౌఖ్యములను కలిగించును. నిఃశ్రేయస మనగా - మోక్షము. (అభ్యుదయ మనగా తత్త్వజ్ఞానమని ఉదయనాచార్యులు చెప్పిరి) మోక్షసాధనమునకు ధర్మానుష్ఠాన మవసరము. ధర్మానుష్ఠానమునకు ఫలము తత్త్వజ్ఞానము. తత్త్వజ్ఞానమునకు ఫలము మోక్షము. యమనియమాదులు కూడ మోక్షసాధనములే.

వేదములు - ఈశ్వరుడు

వేదములు మంత్ర ద్రష్టలగు ఋషులచేత రచియింపబడినవని యీ క్రింది సూత్రమువలన తెలియవచ్చును.

సూ|| "బుద్ధి పూర్వావాక్ప్రతిర్వేదే" (వై.సూ. 6-1-1)

తా|| వేదములయందుగల వాక్యరచనయు రచనయే కనుక మహామేధావులగు మహర్షులచే బుద్ధి పూర్వకముగ రచియింపబడినవని తలంపవలయును.

సూ|| "బుద్ధి పూర్వో దదాతి" (వై.సూ. 6-1-3)

వేదముల యొక్క జ్ఞానము బుద్ధి పూర్వక మనియే తాత్పర్యము.

పై సూత్రము నందున్న "బుద్ధి పూర్వకము" అనుపదమునకు "ఈశ్వరుని బుద్ధి పూర్వకమ"ని కొందఱు వ్యాఖ్యాతలు "ఈశ్వర" శబ్దమును చేర్చి చెప్పిరి. వేద కర్తయు, జగత్కర్తయు అగు ఈశ్వరు డొక డున్నాడని గాని లేడని గాని చెప్పక తటస్థభావము వహించిన కాణాద ఋషి

వేదములు ఈశ్వరకృతములని తలంచి యుండెననుట యెట్లు సరిపడును?

సూ|| "సంజ్ఞా కర్మత్వస్మ ద్విశిష్టానామ్ లింగమ్." (వై.సూ. 2-1-18)

తా|| నామక్రియలు అనువాక్యములు విశేషజ్ఞులగు పెద్దలచే చెప్పబడిన వనుటకు హేతువు.

వేదములు ఈశ్వరకృతములని ఋషి అభిప్రాయ మైనచో ఆ విషయము స్పష్టముగా నేల చెప్పియుండదు? అది గాక ఋషి యీశ్వరాస్తిత్వమును బహిరంగముగ ఆయన సూత్రములలో నెచ్చటను అంగీకరించి యుండలేదు. ఈ క్రింద నుదాహరించు రెండు సూత్రముల నాధారముగా గొని యీశ్వరాస్తిత్వమును ఋషి యంగీకరించినట్లు కొందఱు వ్యాఖ్యాతలు చెప్పుదురు అవి యివి :

సూ|| "తద్వచనా దామ్నాయస్య ప్రామాణ్యమ్" (వై.సూ. 1-1-3)

సూ|| "తద్వచనా దామ్నాయస్య ప్రామాణ్యమ్" (వై.సూ. 10-2-9)

పై రెండు సూత్రములు వేఱు వేఱు ప్రకరణములయందున్నను రెండును ఒకటే సూత్రము. చర్విత చర్వణమే. వీని యర్థమును కొంద ఱిట్లు చెప్పుదురు.

తద్వచనాత్ = ధర్మమును యథా స్వరూపముగా చెప్పుటవలన. ఆమ్నాయస్య = వేదములకు, ప్రామాణ్యమ్= ధర్మము నందు ప్రామాణ్యా మున్నది. సూత్రమునందలి, "తద్ వచనాత్" అను దానిలో "తత్" = ఆత్మ ప్రత్యక్షము చేసికొని అతీంద్రియ జ్ఞానమును పొందిన యోగుల (ఋషుల) అనుభవమువలన చెప్పిన వాక్యములు వేదములు కనుక అవి ప్రామాణ్యములని అర్థము. ఈ అర్థము సరిపోవుచున్నది. యోగులకు ఆత్మయు, ద్రవ్యాంతరములు, వాటి గుణములు, అదృష్టము మొదలగునవి ప్రత్యక్షములని కాణాద ఋషి చెప్పియున్నందున. (వై.సూ. 9-1-12 నుండి 15 వఱకు) ఈ యర్థము చక్కగా సరిపోవును.

మఱికొందఱు పై సూత్రమునందున్న "తత్" శబ్దమునకు, తత్ =

ఈశ్వరుని యొక్క వాక్యము లగుటచే వేదములు ప్రమాణమని, ఈశ్వర ప్రస్తావన ఒక్క 'తత్' శబ్దముచేత స్థాపింప యత్నించిరి. గ్రంథమునం దెచ్చట నైన ఋషి యీశ్వరుని గుఱించి చెప్పియుండినచో అట్టి ఆధారమును గైకొని "తత్" అనగా వెనుక చెప్పబడిన యీశ్వరుని వచనములని అర్థము చెప్పిన యుక్తమగును. సూత్రకారుని అభిమత మేమనునది ప్రధానముగాని మన అభిప్రాయమును (పాఠకులు, లేక వ్యాఖ్యాతల అభిప్రాయమును) అందు చొప్పించుట యుక్తము కాదు.

అపవర్గ పరీక్ష

జిజ్ఞాసువు : అయ్యా! వైశేషికము ననుసరించి యోగమన నేమి? ప్రారబ్ధము నశించిన ముక్తపురుషుడు మరణానంతరము పొందు స్థితి యెట్టిది?

వేదాంతి : ఈ యంశమును నైయాయికుల వలెనే వీరును చెప్పిరి.

సూ|| "తదనారంభ ఆత్మస్థే మనసి, శరీరస్య దుఃఖాభావః స యోగః"

(వై.సూ. 5-2-16)

తా|| దృష్ట శ్రుతములయందు కోరికలను విడిచిన యోగికి నెట్టి చింతయు లేనందున, మానసిక కర్మ యేర్పడ కుండుటచే ఆత్మ సాక్షాత్కారము కలుగును. తత్ఫలితముగా సమస్త దుఃఖములకు కారణమగు తృష్ణ విడువబడుటచే దుఃఖాభావము కలుగును - కర్మారంభములేని మనస్సు ఆత్మయందే స్థిరపడుట యెట్టిదియో, అదియే యోగమందురు.

ముక్తస్థితి యెట్టిదనగా -

సూ|| "తదభావే సంయోగ భావోఽ ప్రాదుర్భావశ్చ మోక్షః"

(వై.సూ. 5-2-18)

తా|| ఇదివఱలో (వై.సూ. 1-1-4) చెప్పినట్లు ద్రవ్య, గుణ, కర్మాదుల సాధారణ విశేష ధర్మముల నెఱుగుట వలన మిథ్యాజ్ఞానము నశించి

తత్త్వజ్ఞానము కలిగియుండుట వలనను, యమ నియమాదుల అభ్యాసము వలన, సమాధి సిద్ధించి యుండుటవలనను సంచిత, ఆగామికర్మలు నశించును. మరణముతో ప్రారబ్ధము సయితము నశించుటచే పునర్జన్మ లేదు.

జన్మమే దుఃఖహేతు వగుటవలన జన్మరాహిత్య రూపదుఃఖ రహితస్థితి అపవర్గము. తేజము లేక పోవుట యనునది యేదియో అదియే అంధకారమని (వై.సూ. 5-2--20) వైశేషిక మతము. సారాంశమేమన- కేవల సద్రూపమే అపవర్గము.

బ్రహ్మసూత్రములయందలి విమర్శ

వైశేషిక దర్శనమును బాదరాయణాచార్యుల వారు బ్రహ్మసూత్రముల యందు విమర్శించిరి. శ్రీ శంకరుల వారు వారి భాష్యమున 2-2-11 వ సూత్రము మొదలు 2-2-17 వఱకు గల సూత్రములకు వ్రాసిన భాష్యమునందు విమర్శించి యున్నారు. వారి విమర్శ సంగ్రహముగా చెప్పిన నీ క్రింద చెప్పిన విధముగా ఉండును.

పారిమండల్యములగు (అంతటను గుండ్రముగా నుండు లేక పరిమితి కలిగియుండు) పరమాణువులవలన హ్రస్వములును, దీర్ఘము లును, మహత్తును అగు త్ర్యణుకము కలుగదు. (బ్ర.సూ. 2-2-11) పరమాణువుల సంయోగము సమవాయ సంబంధమని వైశేషికులు చెప్పిరి. సమవాయ సంబంధ మైనచో అనవస్థాదోషము సిద్ధించును. (బ్ర.సూ 2-2-13) పరమాణువులు ప్రవృత్తి స్వభావము గలవియా? నివృత్తిస్వభావము గలవియా? ఉభయస్వభావము గలవియా? అనుభవ స్వభావము గలవియా? అని వికల్పించి, ప్రవృత్తి స్వభావము కలిగిన వైనచో నెప్పటికిని ప్రళయము కలుగుటకు వీలులేదు. నివృత్తి స్వభావము కలిగిన వనినచో సృష్టి జరుగుటకు వీలులేదు. ఉభయస్వభావముల కలిమి పరస్పర విరోధ మగుటవలన నసంభావ్య మగును. రెండు స్వభావములు లేని వైనప్పటికిని అదృష్టశక్తి కారణముచే రెండును కలపనిన అదృష్టము నిత్య సన్నిహితమే

కనుక నిత్య ప్రవృత్తి కలుగును. అప్పుడు ప్రళయ ముండుటకు వీలు లేదు. కనుక పరమాణు కారణవాద ముపపన్నము కాదు. (బ్ర.సూ. 2-2-14)

మఱియు, రూపాది గుణములు గల పరమాణువుల వలన పృథ్వీ జలాగ్ని భూతములు కలిగినవని వైశేషికులు చెప్పుదురు. లోకమున స్థూలమునకు కారణము సూక్ష్మము. రూపాదులు స్థూలములు, సావయవ ములు, కనుక అవి యనిత్యము లగుటచే వాటికి కారణము లగు పరమాణువులు కూడ అనిత్యములే కావలయును (బ్ర.సూ. 2-2-15) పరమాణువులు పరిచ్ఛిన్నములు కనుక సావయవములు. అవి యెనిమిది కాని పదికాని యెన్ని దిశలుండునో అన్ని అవయవము లుండును. లోకమున పరిచ్ఛిన్నమైన దేదియు నిత్యము కాదు. - ఏ విధముగ చూచినను వైశేషికదర్శనము ముముక్షువుల సంశయమును నివర్తింప గలుగు సంపూర్ణ తత్త్వశాస్త్రము కాదు. వైశేషికుల మతము నందు జ్ఞానమువలన ముక్తి కలుగునను సిద్ధాంత మొక్కటే వేదాంతు లంగీకరింతురు. వారి మిగత వాదమేదియు వేదాంతు లంగీకరింపరు.

జిజ్ఞా : బ్రహ్మసూత్రములలో వైశేషికతత్త్వమును ఖండించిరిగాని న్యాయదర్శనము నేల విమర్శింప లేదు?

వేదాంతి : కారణము తెలియదు. "నైష తర్కేణ" అను సూత్రమున విమర్శింతును.

న్యాయ వైశేషిక తత్త్వ పరిశీలనము

జిజ్ఞాసువు : నైయాయికులు, వైశేషికులు ఆత్మ లనేకము లనిరి. అది యెట్లు సమంజస మగును. ఆత్మ విభువనునప్పుడు అది ఒక్కటియే కావలెను గదా?

వేదాంతి : న్యాయ వైశేషికులు మాత్రమే కాదు, వేదాంతులు తప్ప తక్కిన దార్శనికు లందఱు ఆత్మ లనేకము లని చెప్పిరి. వేదాంతులు ఆత్మ యేకము (అద్వితీయము) అనిన నేకాత్మ వాదమును వైశేషికులు ఈ క్రింది రెండు సూత్రములయందు నిరాకరించిరి.

సూ|| "వ్యవస్థాతో నానా","శాస్త్రసామర్థ్యాచ్చ". (వై.సూ. 3-2-20,21)

ఆత్మ యేకమైన సుఖదుఃఖములు ఒకరికి కలిగిన అందఱుకును కలుగ వలయునట. ఈ ప్రశ్నకు సమాధాన మిది :

వేదాంతుల మతమున సుఖదుఃఖములు ఆత్మ ధర్మములు కావు. ఆత్మ నిర్గుణము. సుఖదుఃఖములు మనోధర్మములు. ఆత్మ ఒక్కటైనను జీవుల నేకులు. ఒక్కొక్క శరీరమునందును ఒక్కొక్క మనస్సుండును. కనుక ఆయా శరీరధారులకు కలుగు సుఖదుఃఖములు ఆయా శరీరము నందున్న మనస్సే అనుభవించును. ఈ సమాధానముతో వారు తృప్తి చెందవచ్చును. శ్రుతులయందు జీవాత్మ లనేకము లని చెప్పబడియున్నదే గాని ఆత్మకు నే లక్షణములు గలవని వేదాంతులు చెప్పిరో అట్టి ఆత్మ లనేకములని చెప్పియుండ లేదు. న్యాయ వైశేషిక దర్శనములందును పరమార్థమున ఆత్మ ఒక్కటే అనిన, అట్టి సిద్ధాంతమే తర్కమున నిలువ గలదు గాని అనేకాత్మవాదము నిలువదు. జీవు లనేకులను వాదము నిలుచును. న్యాయ వైశేషిక దర్శనము లైనను జీవునకును ఆత్మకును భేదమును చూపియే యున్నవి.

న్యాయ వైశేషిక తత్త్వములు మోక్ష ప్రతిపాదకములు కాక పోవుటకు, వారు ఉపనిషత్ప్రతి పాదక మగు **"ఏకమే వాద్వితీయం బ్రహ్మ"** అను ఏకైక శుద్ధ చైతన్యమును పూర్తిగా వదలివేసి అందుకు వ్యక్తిగత చైతన్యము వస్తునానాత్వమును చెప్పియుండుటే గొప్ప లోపము. బౌద్ధులయందు విజ్ఞానవాదు లైనను వ్యక్తిగత విజ్ఞానమును అంగీకరించినను (సమష్టిరూపమగు) ఆలయ విజ్ఞాన మొకటి కలదనిరి. ఆత్మ అఖండజ్ఞాన స్వరూపము కాదేని ప్రత్యభిజ్ఞ యెట్లు కలుగును? పూర్వదృష్ట వస్తు స్మరణము మనకుండుటే విజ్ఞానమున కేకత్వము నిత్యత్వము కలదని మన అనుభవమే నిరూపించుచున్నది. విజ్ఞానము క్షణికమైనచో నశించిన విజ్ఞానము నెఱిగిన నిత్య (సాక్షి) విజ్ఞాన మొకటి యుండవలయును కదా? అట్టి సాక్షి వారి మతమున లేదు. అదియును గాక జీవితములోని వివిధానుభవములకు ఏకత్వమును [illegible]

దాత్మయని వారంగీకరించి యున్నారు. (న్యా.సూ. 3-1-1) అంతవఱకును వారి వాదము సమంజసము గనే యున్నది. ఆత్మ విజ్ఞానస్వరూప మైనప్పుడే అట్టి శక్తి ఆత్మ యందుండును. సహజముగ జడమగు ఆత్మకు (ఆగంతుక విజ్ఞానము గల ఆత్మకు) అట్టి సామర్థ్యము ఉండజాలదు.

జిజ్ఞా : అయ్యా! వారి మతము ననుసరించి సుషుప్తి యందు ఆత్మకు విజ్ఞానము లేక పోవుటకు కారణమేమి?

వే : నైయాయికాచార్యుడగు ఉదయనాచార్యుడు న్యాయ కుసుమాంజలియందు ఇట్లు సమాధాన మిచ్చిరి - సుషుప్తికాలమున మనస్సు పురీతత్తునందు (ప్రేగునందు) ఉండును గనుక అప్పుడు మనస్సు జ్ఞానమును పుట్టించుటకు వీలులే దనిరి - కాని అది సరికాదు. మనస్సు పురీతత్తునం దున్నను అచటను ఆత్మ కలదు గదా? వారు జ్ఞానోత్పత్తిని గుఱించి చెప్పిన దేమన :"ఒక వంక ఆత్మతోను, మఱియొక వంక యింద్రియార్థ సంబంధము గల యింద్రియములతోను మనస్సునకు సన్నికర్షణ కలిగినపుడు జ్ఞానము పుట్టుచున్నది" (న్యా.సూ. 3-2-21; వై.సూ. 3-1-19) అని చెప్పిరి - ఇది ప్రత్యక్ష జ్ఞానము, అనుమానాది జ్ఞానములు మనస్సుతో ఆత్మకు సన్నికర్షణము కలిగినపుడు పుట్టుచున్నవి. సన్నికర్షమనగా నేమి? = సమీపించుట; చేరువగుట- అనియే కదా అర్థము? మనస్సుతో ఆత్మకు సన్నికర్షము కలుగవలయునని యెవరు సంకల్పించిరి? సంకల్ప మనునది చేతనుని కార్యము గదా? వారి మతము ననుసరించి అదృష్ట ప్రేరితమై ఆత్మ సంకల్పించె ననిన మనస్సు, ఆత్మ, అదృష్టము జడములే. జడ ద్రవ్యములయందు చేతనుని సహాయము లేకనే సంకల్పము కలిగెననుట యింతవఱకు వినియుండలేదు. ఈశ్వర సంకల్పమువలన అట్టి సన్నికర్షము కలిగెనందురా? అట్లు వారెచ్చటను చెప్పియుండ లేదు.

జిజ్ఞా : అయ్యా! న్యాయ వైశేషిక తత్త్వములు రెండును ఆత్మను ద్రవ్యములలోను, జ్ఞానమును గుణములలోను చేర్చిరి. అవి రెండును

ప్రమేయములే. ప్రమేయమును తెలిసికొను ప్రమాత యొక డుండ వలయును; వారి మతమున అట్టి ప్రమాత యెవ్వడు? ఆత్మయా? జ్ఞానమా? మనస్సా? అవన్నియు ప్రమేయములే. ప్రమాత లేని ప్రమేయ మెట్లుండును? ఉండిన ఆ త్రిపుటి యుండవలయును. లేని యెడల నేదియు ఉండదు.

వేదాంతి : సూ॥" ప్రమేయా చ తులా ప్రామాణ్యవత్"

(న్యా.సూ. 2-1-16)

అను సూత్రవ్యాఖ్యాన సందర్భమున చర్చించి ఆత్మపదార్థము జ్ఞాన విషయ మైనపుడు ప్రమేయ మనబడుననియు, అదియే ఉపలబ్ధి (జ్ఞానము) యందు ప్రమాత యనియు చెప్పిరి. చూచువాడు తాను చూచు వస్తువునకంటె భిన్నుడని అజ్ఞులైనను ఎఱుగుదురు.

జిజ్ఞా : నైయాయికులు వైశేషికులు సూక్ష్మశరీరము నంగీకరింతురా?

వేదాంతి : అంగీకరింపరు. వారు సూక్ష్మ దేహమునకు బదులు మనస్సు నంగీకరింతురు. వేదాంతుల పంచీకరణమును వారు త్రోసివేసిరి. పంచీకరణము సాధ్యపడదని (వై.సూ. 4-2-2) చెప్పిరి.

జిజ్ఞా : ప్రమాణ ప్రమేయముల జ్ఞానము కలిగిన అపవర్గము కలుగునని న్యాయమును; షట్ పదార్థజ్ఞానము కలిగిన అపవర్గము సిద్ధించునని వైశేషికమును, చెప్పియున్నవి గదా? ఈశ్వరాస్తిత్వము నంగీకరించిన వారి తదనంతర తత్త్వవేత్తలు ఈశ్వరుని ఆ మతములో చొప్పించుట వలన కలుగు లాభమేమి?

వేదాంతి : నీ వన్నట్లు మొదట, నైయాయికుల ప్రమేయములయందు గాని, వైశేషికుల షట్ పదార్థముల యందు గాని, యీశ్వరు డొకడు కాడు. ఈశ్వరుని వైశేషికులు మొదటనే బుద్ధి పూర్వకముగ త్రోసివేసిరి.

* బ్రహ్మజిజ్ఞాస ప్రథమ భాగము రెండవ ప్రకరణమున "(16) కాపిల సాంఖ్యము" అను అధ్యాయమునందు సృష్టిక్రమమును. ద్వితీయ భాగము రెండవ ప్రకరణమున (రాజయోగ ప్రకరణమున) (3) సాంఖ్యము - యోగము అను అధ్యాయమునందు సాంఖ్యమును గుఱించి కొంత చెప్పియుంటిని.

అనంతరము ఈశ్వరాస్తిత్వమును అందు చొప్పించినను తృప్తికరముగా లేదు. కాని ఆ తదనంతర తత్త్వవేత్తలు గొప్ప శివభక్తులని తోచుచున్నది.

(6) సాంఖ్య దర్శనము

వేదాంతి : సాంఖ్యుల సృష్టి క్రమవిధానమును సాంఖ్యయోగ దర్శనములకు గల సన్నిహిత సంబంధమును, మొదలగు సాంఖ్యతత్త్వము లోని అంశములు కొన్నింటిని ఇదివఱలో చెప్పియుంటిని.* అయినను ఇచ్చట మఱికొంత వివరించెదను, శ్రద్ధతో ఆలకింపుము.

ప్రపంచ సృష్టి విధానమునందు ఇరువది నాలుగు తత్త్వములు గలవని లెక్కించువారు కనుక వీరికి సాంఖ్యులని పేరు కలిగిన దందురు. మఱియు సాంఖ్య మనగా సమ్యఖ్యాతి- సరియైన జ్ఞానమును కలిగించు శాస్త్రము కనుక దీని కాపేరు? కలిగిన దందురు. భగవద్గీత యందలి రెండవ యధ్యాయమునకు సాంఖ్యయోగ మని పేరిడిరి. కనుక "సాంఖ్య" మనగా లెక్కపెట్టుట యను అర్థము కాదని, తత్త్వవిచారమని గీతాకారుని మతము. కపిల మహర్షి సాంఖ్య దర్శనమునకు కర్త యగుటచే సాంఖ్యము "కాపిల సాంఖ్య" మని ప్రసిద్ధి.** కాపిల సాంఖ్య మనుటవలన గీతాకారుని సాంఖ్యతత్త్వము ఇది కాదని అర్థమగును. ఇచట మనము సాంఖ్య మనిన కాపిల సాంఖ్యమనియే అర్థము చేసికొనవలయును.

ప్రస్తుతము మనకు లభించు సాంఖ్య శాస్త్రములయందు ఈశ్వర కృష్ణ విరచితమగు సాంఖ్య కారికలు # ప్రాచీనమయిన గ్రంథము. ఇది క్రీ.శ. మూడవ శతాబ్దికి చెందిన దందురు. కపిల మహర్షి ప్రణీతములని చెప్పబడు సాంఖ్య సూత్రములు, (సాంఖ్య ప్రవచన సూత్రములు)

** సాంఖ్యదర్శన మనబడు (సాంఖ్య సూత్రములు) గ్రంథము ఆఱధ్యాయములు కలిగియున్నది. అందు 526 సూత్రములు కలవు.

ఈశ్వరకృష్ణ విరచిత సాంఖ్య కారికలు 72 కలవు. అందులో 68 కారికల యందు తత్త్వము చెప్పబడినది. తక్కిన కారికలు సాంఖ్యాచార్యుల గురుపరంపరను, సాంఖ్యతత్త్వముయొక్క గొప్పతనమును చెప్పినవి.

సాంఖ్యదర్శన మని చెప్ప బడును. ఇది క్రీ.శ. 14-వ శతాబ్దికి చెందియుండ వచ్చునందురు.

ప్రకృతి - దాని సంతానము

ప్రకృతి త్రిగుణాత్మకము (సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములు కలది) స్వయంభువు. స్వతంత్రమైనది. ఇదియే జగత్కారణము కారణ మెప్పుడును కార్యమును విడిచి యుండదు. ప్రపంచమున గల ప్రతిపదార్థము మూడు గుణములయొక్క సముచ్చయము. ప్రకృతి గుణములు మూడును విచిత్రమయినవి. ఒక దాని స్వరూపము మఱియొక దానికి లేదు; మూడింటిలో ఒక దానికి మఱియొకటి విరుద్ధమే. అయినను అవి కలసి ఒక దానికొకటి ఆశ్రయములు, సహాయకములునునై, పని చేయుచుండుట చాల చోద్యము. అందులో సత్త్వగుణము స్ఫటిక మణివలె స్వచ్ఛమై నిర్మలముగ ప్రకాశించును. పురుషుని చిత్తమునకు ఏకాగ్రత కలిగించి సుఖముతోను యథార్థజ్ఞానముతోను చేర్చును. ఇది పురుషునిచే ఫలరహితముగ పుణ్యకర్మల చేయించును. రజోగుణము లోభమును, ప్రవృత్తిని, విషయముల యందభిమానమును, అహంకారమును కలిగించును. తమోగుణము మోహమును, విపరీత జ్ఞానమును, అవధానము మొదలగువాటిని పుట్టించును. పూర్వజన్మ కర్మవలనను మనము భుజించెడు ఆహార పానీయముల వలనను మూడు గుణములలో ఏదైన ఒకటి హెచ్చై తక్కిన రెండింటిని అణచియుంచును. ఏది పైకొని యుండునో వ్యక్తియందు దాని సంబంధమగు భావములును వాటి ననుసరించిన కర్మలు వ్యక్తమగు చుండును. మూడు గుణముల యొక్క సామ్యావస్థ ప్రకృతి. అదియే ప్రధానము.

సృష్టికి పూర్వము త్రిగుణములు సమానస్థితి యందుండినవి. వాటి సామ్యావస్థ చెడుటతోడనే సృష్టి ఆరంభమై అనేక గుణములు, నామరూప ప్రపంచము, వ్యక్తావ్యక్తములైన ఇరువది నాలుగు తత్త్వములైనవి. సమస్తనామ రూప ప్రపంచము ఇరువది నాలుగు తత్త్వములనుండి కలిగినదే.

ఇరువది నాలుగు తత్త్వము లివి :

సూ|| "సత్త్వరజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః - 1
ప్రకృతే ర్మహాన్ - 1. మహతో ఉహంకారః - 1
అహంకారాత్ పంచతన్మాత్రాణి ఉభయ మింద్రియం - 16
తన్మాత్రేభ్యః స్థూలభూతాని - 5
పురుషః - 1. ఇతి పంచవింశతి ర్గణః" (సాం.సూ. 1-61)

1. మూల ప్రకృతి, 2. మహాతత్త్వము ఇదియే మొదట పుట్టినందున ఇది జగత్తునకు బీజము. ఇదియే బుద్ధి.

బుద్ధి

సూ|| "అధ్యవసాయో బుద్ధి|" (సాం.సూ. 2-13)
సూ|| "తత్కార్యం ధర్మాది||" (సాం.సూ. 2-14)

తా|| ఇది యిట్లే అను నిశ్చయాత్మక వ్యాపారము బుద్ధి యొక్క లక్షణము. దాని వ్యాపారములు ధర్మాదులు- ఆదులనగా (1) ధర్మము (2) జ్ఞానము (3) వైరాగ్యము. కాని, ఈ బుద్ధి తత్త్వమే రజోగుణముతో గాని తమోగుణముతో గాని సంబంధము కలిగినచో పైన చెప్పిన ధర్మాదులకు విపరీతమగు కార్యములు చేయించును. అవేవన:- అధర్మము, అజ్ఞానము, తృష్ణ (సాం.సూ. 2-15) బుద్ధి యింద్రియముల ద్వారా పని చేయునేగాని స్వయముగా పని చేయ లేదు. బుద్ధి నుండి అహంకారము పుట్టినది.

అహంకారము

సూ|| "అభిమానో అహంకారః" (సాం.సూ. 2-16)

"నేను" అను అభిమానమే అహంకారము.

కా|| సాత్త్విక ఏకాదశకః ప్రవర్తతే వైకృతా దహంకారాత్|
భూతాదే స్తన్మాత్రః స తమస్ తైజసాదు భయం|| (25)

తా॥ అహంకారము నుండి ద్వివిధ సృష్టి కలిగెను. వైకృత మనెడి సాత్త్వి కాహంకారమునకు పదునొకండింద్రియములు పుట్టినవి. తైజస మను తామసాహంకారమునకు భూతాదులగు పంచతన్మాత్రలు కలిగినవి- రజోగుణము సాత్త్విక తామసములకు తోడ్పడుటచే వాటి కాసృజనశక్తి కలిగిన దందురు. (ఏకాదశేంద్రియము లనగా పంచజ్ఞానేంద్రియములు, కర్మేంద్రియ పంచకము, మనస్సు) ఇంతటితో పందొమ్మిది తత్త్వములైనవి. పంచతన్మాత్రలనుండి పంచభూతములు కలిగినవి. వీటితో చేరి తత్త్వములు (24) ఇరువది నాలుగైనవి. వీటిలో ప్రకృతులు వికృతులు అని రెండు విధములు.*

మొదటి ప్రకృతి మూలప్రకృతి. మూలప్రకృతి గాక బుద్ధి అహంకారము, పంచతన్మాత్రలు ప్రకృతి వికృతులు. అనగా మూల ప్రకృతికి వికృతులు; ఏకాదశేంద్రియములకు స్థూల భూత పంచకమునకు ప్రకృతులు, అట్లగుటవలన ప్రకృతి వికృతులను నామము వాటికి కల్గెను. ఏకాదశేంద్రయములు మహాభూతములు వికృతులు, వీటివలన మఱే తత్త్వములును కలుగ లేదు. కనుక, వికృతు లయ్యెను.

---

* అచట వ్రాసిన ప్రకృతి వికృతుల వివరము ఈ క్రింది కనబరచిన విధమును చూచిన సులభముగా అర్థమగును.

1. మూల ప్రకృతి

↓

(ఇవి ప్రకృతి వికృతులు=అవిశేషములు)	(ఇవి వికృతులు = విశేషములు)
2. బుద్ధి	9. మనస్సు
3. అహంకారము	10. నుండి 14. జ్ఞానేంద్రియ పంచకము
4. నుండి 8. వఱకు శబ్దస్పర్శ రూపరస గంధములను పంచతన్మాత్రలు	14. నుండి 19. కర్మేంద్రియ పంచకము
	19. నుండి 24. వఱకు స్థూల భూత పంచకము

పురుషుడు ప్రకృతికాదు, వికృతియు కాదు. ఈ విధానము ప్రకృతి వికృతి వర్గమును తెలియజేయునదే గాని సృష్టిక్రమము తెలియ జేయునది కాదు.

ప్రకృతి 23 తత్త్వములను సృష్టించినను, లేక యిరువదిమూడు తత్త్వములుగా పరిణమించినను మూల ప్రకృతి నశించుటగాని, తగ్గి పోవుట గాని లేదు. అదియే యిందున్న చోద్యము. లోకమున భౌతిక పదార్థమునుండి కొంత ద్రవ్యము లేక శక్తి నశింపకనే మఱియొక దానిని సృష్టింప జాలదు. కాని సాంఖ్యుల మూలప్రకృతి యెప్పటివలెనే విభువు, క్షయరహితమునై యున్నది. జడమగు ప్రకృతి చేతనుని సహాయము లేకనే క్రియాకారిణి కాలేదు. కనుక అట్టి స్వతంత్రవస్తువుయొక్క తోడ్పాటు అవసరమైనది. ప్రకృతి యొక్క యీ వ్యాపారము పురుషనిమిత్తమే కాని (పురుషుని భోగమోక్షముల కొఱకే) ప్రకృతికి స్వార్థమేమియు లేదు.

పురుషుడు

పురుషుడు : ఇతడు పైన చెప్పిన యిరువది నాలుగు తత్త్వములలో చేరిన వాడు కాడు. ప్రకృతివలెనే యితడును అనాది. ఇతడు స్వతంత్రుడు, నిర్గుణుడు, నిష్క్రియుడు, చేతనుడు. నైయాయికులు వైశేషికులు చెప్పినట్లు జ్ఞానమతని గుణము కాదు. స్వరూపము, సాక్షి, ఇతడు ప్రకృతియు కాడు. వికృతియు కాడు. ఇట్టి పురుషులు అనేకులు.

సూ|| "పురుష బహుత్వం వ్యవస్థాతః|" (సాం.సూ. 6-45)

ఇచట పురుషుడనగా జీవుడని కొందఱు అభిప్రాయపడి జీవులనేకులే గాని పురుష డొక్కడేయని సందేహింతురు.

సూ|| ద్వాభ్యామత్యు విరోధాత్ న పూర్వ ముత్తరం చ సాధకాభావాత్|"
(సాం.సూ. 6-48)

అను సూత్ర భాష్యమున ఆత్మలు అనేకములని చెప్పబడెను. పురుషుడు విభువా? అణువా? మధ్యమ పరిణామమా? అను విషయమై విస్పష్టమగు చర్చ జరుగ లేదు. మనకు లభ్యమగునట్టి సాంఖ్య గ్రంథములయందు అతి ప్రాచీనములని చెప్పబడిన ఈశ్వర కృష్ణుని కారికలు 72 మాత్రమే. అందులో 11, 17, 18, 19, 42, 55, 56, 63 లో మాత్రమే పురుషుని గుఱించిన ప్రస్తావనము కలదు. అందులోను 11-వ కారిక,

కా|| త్రిగుణ మవివేక విషయః సామాన్య చేతనం ప్రసవధర్మి
వ్యక్తం తథా ప్రధానం తద్విపరీత స్తథా చ పుమాన్|

తా|| మూడు గుణములు కలది. వివేకము లేనిది. విషయ సంబంధమైనది. అచేతనమైనది. ప్రసవధర్మము కలది. (పుట్టించు స్వభావము కలది) వ్యక్తమైనది. - ఇట్టిది ప్రధానము. దీనికి విపరీత మయినవాడు పురుషుడు.

ఒక్క కారికయందె ప్రకృతి పురుషుల యిరువుర స్వరూపమును వర్ణింపబడెను. ఇచట ప్రకృతి లక్షణములను జెప్పి తద్వ్యతిరేక లక్షణములు గలవాడు పురుషు డనుటచే క్రమముగా పె చెప్పిన వాటికి వ్యతిరేకలక్షణము లెట్టివన : పురుషుడు గుణరహితుడు జ్ఞానస్వరూపుడు, విషయసంబంధ రహితుడు, తెలిసికొనువాడు (చైతన్యస్వరూపుడు), పుట్టించు వాడు కాడు, (క్రియారహితుడు) అవ్యక్తుడు అని అర్థము - అనగా నివి పురుషుని లక్షణములు. గుణములు కాదు.

ఇచట పురుషుడు ఒక్కడా? అనేకులా? అని గాని విభువా? లేక, అణువా? మధ్యమ పరిమాణము గలవాడా? అనిగాని విశదపరుపలేదు.

17-వ కారిక యందు, ఏ హేతువులను చూపి పురుషుని అస్తిత్వమును చెప్పబడెనో ఆ హేతువులు పై సంశయములను అనగా- పురుషుడు విభువా? కాడా? అను మొదలగు సంశయములను నివారింప లేవు. 18, 55, 56వ కారికలయందు జీవులను గుఱించి చెప్పబడెను. 19-వ కారికయందు పురుషుడు సాక్షియని మాత్రమే చెప్పబడెను. 63-వ కారిక పురుషుని నిర్గుణత్వమును గుఱించి చెప్పెను.

42-వ కారిక యందు విభుత్వమును గుఱించి చెప్పబడినను, అది పురుషుని గుఱించి చెప్పునది కాదు. కనుక పై ప్రశ్నములకు సమాధానము లభింప లేదు. సూత్రములయం దేమున్నదో విచారింతము.

సాంఖ్య సూత్రముల ప్రథమాధ్యాయమున 19వ సూత్రమున పురుషుని కూటస్థ నిత్యత్వములు మొదలగునవి చెప్పి 138వ సూత్రమున పురుషుని

కలిమిని గూర్చి పురుషుడున్నట్లు ఎల్లరు అంగీకరించిన విషయమే. కనుక దానిని గుఱించి సాధింప నవసరము లేదనిరి - 139,140 సూత్రములయందు శరీరాదులకు పురుషుడు వ్యతిరిక్తుడని యున్నది. 141-వ సూత్రమున త్రిగుణాత్మక ప్రకృతిని గుఱించి చెప్పి అట్టి గుణములకు వ్యతిరేకి పురుషుడని చెప్పబడెను. 142-వ సూత్రమున రథమున రథికుడున్నట్లు శరీరాదులకు పురుషు డధిష్ఠాన మనియు, శరీరాదులు అధిష్ఠేయములనియు చెప్పబడెను.

సూ॥ "జడ ప్రకాశాయోగాత్ ప్రకాశః॥" (సాం.సూ. 1-145)

పురుషుడు ప్రకృతికి సంబంధించిన ప్రకాశము కలవాడు కాడని జ్ఞానైక స్వరూపుడని అర్థము. జ్ఞానము పురుషునకు స్వరూపమే. గుణముగాని, ధర్మము గాని కాదని (సాం.సూ. 1-146) సూత్రమున వివరించి, శ్రుతి పురుషుడు సంగరహితుడని చెప్పిన దానిని స్మరించి పురుషునికి గల సాక్షిత్వము సుషుప్తియందును గలదని (సాం.సూ. 1-148) చెప్పి; **సూ॥" జన్మాది వ్యవస్థాతః పురుష బహుత్వమ్"** (సాం.సూ. 1-149) అను సూత్రమున పురుషులనేకు లని చెప్పిరి. తరువాత 150-వ సూత్రము మొదలు 159-వ సూత్రము వఱకు పురుష నానాత్వమును స్థిర పరచుచు "పురుషుడొక్కడే" అను అద్వైత సిద్ధాంతమును విమర్శించిరి. తరువాత సూత్రము ఈశ్వరుని గుఱించిన విచారముతో ప్రారంభింపబడెను. ఇందులో పురుషుని పరిమాణ మెట్టిది? అను విచారము లేదు.

కాని, సాంఖ్య సూత్రములయందు పురుషుడు "విభువు" అని స్పష్టముగా చెప్పక పోయినను పురుషుని గుఱించి చెప్పిన వాక్యసముదాయమును. మొత్తము సాంఖ్య తత్త్వమును పరిశీలించితిమేని పురుషులు "విభువులు" అనియే సిద్ధాంతమగును. పురుషులు అణువులని గాని, మధ్యమ పరిమాణము కలవారని గాని చెప్పితిమేని అట్టిది సాంఖ్య తత్త్వమునందలి యితర .అంశములతో అతుకదు. డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వారి భారతీయ తత్త్వశాస్త్రమునందలి సాంఖ్య ప్రకరణమున నిట్లు చెప్పిరి. "పురుషుని పరిమాణము పరిచ్ఛిన్నము

గాదు. పరిచ్ఛిన్నమైనచో భాగపరికల్పితము, నాశనము కలదియు నగును. పురుషు డణుస్వరూపి గాదు; అయినచో సర్వశరీరావస్థానుభవ శక్తి యుండకుండును." (పుట- 61) ఆ ప్రకరణమునందే వారే మఱియొక చోట "పురుషుడు చలింపడు; కాని దేహము స్థలాంతరమునకు పోవుచుండును." (పుట-68) "అనంత సంఖ్య గల పురుషులు, విశ్వవ్యాప్తి కలిగి, చేతన స్వరూపులైనను సర్వవస్తువులను సర్వ కాలములలో బ్రకాశింప జేయుట లేదు; ఏలయన - వాని స్వభావము సంగరహితము. అందుచే వస్తురూపము నొందుట కవకాశము లేదు. తనకు చెందిన బుద్ధులయందే ప్రతిఫలించును గాని, యితరములయందు గాదు. ఏది కాదో అది మన కగోచరము."

కొందఱు పండితులు పురుషులు విభువు లనియే చెప్పిరి. మఱికొందఱు పురుషుని పరిమాణమును మాత్రము చెప్పక వదలివేసిరి. సాంఖ్య దర్శనమునకు తెనుగున వ్యాఖ్యానమును రచియించిన దర్శనాచార్య పండిత శ్రీ గోపదేవ్ గారు - **సూ|| "పారంపర్యేణ తత్ సిద్ధౌ విముక్తి శ్రుతి|"** (సాం.సూ. 6-58) అను సూత్రమునకు వ్రాసిన వ్యాఖ్యానమున " సాంఖ్య మతమున పురుషు డణువు; కూటస్థ నిత్యుడును. అందువలన నతనిలో గతి యుండదు" అని వ్రాసిరి. "విజ్ఞాన సర్వస్వ" మను గ్రంథమునకు సంపాదకులును విఖ్యాత దర్శనాచార్యులును పండిత గోపదేవ్ గారి సాంఖ్య దర్శనమునకు తొలిపలుకును రచించిన వారును అగు క్రొత్త సచ్చిదానందమూర్తిగారు విజ్ఞాన సర్వస్వమునందు, సాంఖ్య దర్శనమున ఆత్మను గుఱించి యిట్లు వ్రాసిరి :

"పురుషులు చేతన తత్త్వములు, నిత్యులు, విభువులు, నిర్వికారులు, చలనాదిరహితులు. చైతన్యము వారి స్వరూపము; ధర్మము కాదు." (పుట-117)

కనుక ఆత్మ (పురుషుడు) విభువనియే సాంఖ్య తత్త్వముయొక్క సిద్ధాంతమని తోచును. ప్రకృతి తన యెదుట చేయు వ్యాపారమంతయు తానే చేయుచున్నట్లు పురుషుడు భ్రమించుటచే సుఖదుఃఖములయందు తగులుకొని బద్ధ దగుచున్నాడు. ఇదియే బంధము. త్రాడునకు గుణమని

నామము కలదు. ఇచట గుణములు పురుషుని బంధించు దారము లనిన అర్థము సరిపోవును. వాస్తవమున పురుష డెప్పుడును ప్రకృతిచేత బంధింప బడలేదు. జపాకుసుమ సాన్నిధ్యమున స్ఫటికము రక్తిమ కలిగియుండునట్లు కర్తగా భోక్తగా, బద్ధుడుగా కనబడుచున్నాడు (సాం.సూ. 6-28) అద్వైతులు చెప్పు ఆత్మ ఏకము, అద్వితీయము. సాంఖ్యులు చెప్పు పురుషులు అనేకులు. ఆత్మకును, జీవునకును, అద్వైతులు భేదము చెప్పునట్లు సాంఖ్యులును పురుషునకు జీవునకు భేదము చెప్పుదురు.

సూ|| "విశిష్టస్య జీవిత్వ మన్వయ వ్యతిరేకాత్|" (సాం.సూ.6-63) అన్వయ వ్యతిరేకముతో అహంకార విశిష్ట పురుషుడే జీవుడని పిలువ బడును.

అహంకార మున్న చోట జీవభావ ముండును. బుద్ధియందు ప్రతి ఫలించిన పురుషుని ప్రతిబింబమే జీవుడని వ్యవహారము. అదియే అహంకారము. అహంకారము లేనిచోట జీవభావ ముండదు.

ప్రకృతి పురుష వివేకమే జ్ఞానము. అట్టిది కలుగ నంతవఱకు,

సూ|| "అవివేకాచ్చ ప్రవర్తనా మవిశేషాణామ్.|" (సాం.సూ. 3-4)

తా|| ప్రకృతి పురుష వివేకము లేనంత వఱకు ప్రకృతి స్థూల శరీరమును నిర్మించుచుండును.

సూ|| "సప్తదశైక లింగమ్|" (సాం.సూ. 3-9). ఏకాదశ ఇంద్రియములు, పంచతన్మాత్రలు, అహంకారముతో కూడిన బుద్ధి - యీ పదియేడును చేరి లింగశరీర మగును. ఇట్టి లింగశరీరము ప్రతిపురుషునకు ఒక్కొక్కటి ఉండును, స్థూల శరీరనాశముతో లింగశరీరము నాశ్రయించియున్న పురుషుడు పునర్జన్మను నొందుచున్నాడు.

జ్ఞాన ప్రమాణములు

వీరు ప్రత్యక్ష అనుమాన శబ్ద ప్రమాణముల మూడింటిని అంగీకరింతురు. ఉపమానము, అర్థాపత్తి ప్రమాణములు పై మూడింటిలో

కలవందురు. వీరు వేద ప్రమాణ మంగీకరింతురు. (సాం.కా. 4)(సాం.సూ 1-88) వేదములు అపౌరుషేయములు. (సాం.సూ. 5-46) ఏలయన?

సూ|| "ముక్తా ముక్త యోరయోగ్యత్వాత్|" (సాం.సూ. 5-47)

తా|| ముక్త పురుషులు నిస్సంగులు కనుక వేదములు రచియింపరు. బద్ధజీవులు సర్వజ్ఞులు కారు కనుక వారు వేదరచనకు సమర్థులు కారు. అంతమాత్రముచేత వేదములు నిత్యములు కావనిరి. (సాం.సూ. 5-59) ఏలయన? అవి యీశ్వరునివలన కలిగినవని మన మూహించు చున్నాము. కనుక, పుట్టినవి గిట్టుట స్వాభావికములు. అయినను వేదములు స్వతః ప్రమాణములు. (సాం.సూ. 5-51)

సూ|| జ్ఞానాన్ముక్తిః (సాం.సూ. 3-23). జ్ఞానముతో ముక్తి కలుగుచున్నది. జ్ఞానమనగా : తాను ప్రకృతి కంటె భిన్నుడనని, అకర్తనని యెఱుగుటయే. పురుషుని భోగము కొఱకే (లాభముకొఱకే) ప్రకృతి జగన్నాటకమును పురుషుని యెదుట ప్రదర్శించుచున్నది. - పురుషునకు జ్ఞానము కలిగిన తోడనే ప్రకృతి ఆతని యెదుట నటించుట మానివేయును. ఆ స్థితి పురుషుడు స్వస్వరూప జ్ఞానము కలిగియుండుట. అప్పుడు లింగదేహము నశించును. అంతటితో పునర్జన్మ లేదు. అదియే ముక్తి; అది కేవలము సత్ - చిద్రూపము మాత్రమే.

ఒక్క అద్వైత మతమునందు తప్ప తక్కిన విశిష్టాద్వైతాదిమతముల యందు సాంఖ్యము ప్రవచించిన ద్వైతభావము స్పష్టముగనో అస్పష్టముగనో కనబడుచున్నది. కనుకనే సాంఖ్యమునకు భారతీయ తత్త్వశాస్త్రములయందు అద్వైతమునకు తరువాత అంతటి గౌరవము కలదు.

బ్రహ్మసూత్రములయందు సాంఖ్యతత్త్వమును గురించిన విమర్శ

బాదరాయణాచార్యుల వారు బ్రహ్మసూత్రముల ద్వితీయాధ్యాయ ద్వితీయ పాదమున (2-2-1 నుండి 2-2-10 వరకు గల సూత్రముల యందు) సాంఖ్యమతమును విమర్శించిరి. శంకరుల వారు తన భాష్యమున నీ మతమును నీ క్రింది విధముగ ఖండించిరి.

సాంఖ్యులు జగత్కారణమగు ప్రకృతి జడమని చెప్పిరి. లోకానుభవమును బట్టి జడములగు రథమృత్తికాదులు ప్రవృత్తి లేనివై యున్నవి. చేతనుని సహాయమున అవి ప్రవృత్తి కలవియై యున్నవి. లేక చేతనుని సాన్నిధ్యమున అవి ప్రవృత్తి కలవి యగుచున్నవి. అయస్కాంత సాన్నిధ్యమున ఇనుమునకు ప్రవృత్తి కలిగినట్లు, పురుష సాన్నిధ్యమున ప్రకృతి యందు ప్రవృత్తి కలుగుచున్న దనిరి. సాంఖ్య మతమున ప్రకృతికి ప్రవృత్తి వలన ఫలమేమియు లేదనియు, పురుషుని భోగ మోక్షములకొఱకే ప్రకృతి వ్యాపారము చేయుచున్నదనియు చెప్పిరి. అది సరికాదు. ఏలయన? పురుషుని భోగముకొఱకే' ప్రకృతి' ప్రవర్తించెనేని పురుషునకు దుఃఖ మనునది లేక సుఖము మాత్రమే యుండవలెను. అట్లుండుట లేదు. ప్రకృతి ప్రవృత్తికి ఫలమును, పురుషునకు అపవర్గమును (మోక్షము) కలిగించుటయే యనిన అది (మోక్షము) పురుషునకు ప్రకృతి ప్రవృత్తికి పూర్వమే యున్నది. కనుక, ప్రకృతి తనకొఱకు గాని పురుషునికొఱకు గాని ప్రవర్తించు ననిన సరిపడదు.

అది గాక ప్రకృతి పురుషులవలన ప్రపంచము కలిగిన దనుటకు గ్రుడ్డి వానిపై కుంటి వాడు కూర్చుండి మార్గమును చెప్పుచుండగా గ్రుడ్డివాడు నడచుచుండుటచే నిరువురు యాత్రచేసిరని దృష్టాంతము చెప్పిరి. ఈ దృష్టాంత మిచట సరిపడదు. ఏలయన- కుంటి వాడు చూపుగలవాడు, మాటలాడు వాడు కనుక గ్రుడ్డి వానికి దారిచూపగలిగెను. పురుషు డన్ననో నిర్గుణుడు, నిష్క్రియుడు. కనుక వీ రిరువుర మధ్య సంధాన కర్త మరియొకడు కావలసియుండును. అట్టి వాడు (ప్రాచీన) సాంఖ్యమతమున లేడు.

సాంఖ్యదర్శనము నందు ప్రథమాధ్యాయము నందే సాంఖ్యులు 20 నుండి 24-వ సూత్రము వఱకును, ఆ అధ్యాయమందే 150 మొదలు 159 వఱకును, మఱియు పంచమాధ్యాయమునందును, అద్వైతమును (బ్రహ్మసూత్రమును) విమర్శించిరి.

(7) యోగదర్శనము

యోగమును గురించి ఇదివఱలో చెప్పియుంటిని.* యోగతత్త్వము సనాతన మైనది. ఉపనిషత్తులయందు కలదు. పతంజలి మహర్షి వారికంటె పూర్వము నందున్న యోగతత్త్వముతో వారి అనుభవములను చేర్చి యోగసూత్రములను గ్రంథమును రచియించిరి. ఇది క్రీ.పూ. 200 సంవత్సరములనుండి క్రీ.శ. 300 మధ్య కాలమున నుండునని పండితులు చెప్పుదురు. పతంజలికృత మగుట వలననో, వారి శిష్యులు రచియించుట వలననో ఈ సూత్రములకు "పాతంజల యోగ సూత్రము" లనియు, యోగమునకు "పాతంజల యోగ" మనియు పేర్లు వచ్చినవి.

యోగమనగా : చిత్తవృత్తుల నిరోధమని యోగశాస్త్రము చెప్పినను (పా.యో.సూ. 1,2); యోగశబ్దమునకు ఉపాయము, ప్రయత్నము, కలుపుట, చేర్చుట మొదలగు అర్థములు అనేకములు గలవు. చిత్తవృత్తి నిరోధమే యోగ శాస్త్ర ప్రయోజనము. సాంఖ్యయోగములు ఒకే మతమునకు చెందినవనియు, సాంఖ్యమతము సిద్ధాంత భాగమనియు, యోగము దాని అనుష్ఠాన భాగమనియు కొందఱు చెప్పుదురు. పూర్వసాంఖ్యులు నిరీశ్వరవాదులు. యోగులు ఈశ్వరాస్తిత్వ మంగీకరింతురు. ఇది ముఖ్య భేదము.

సాంఖ్యులు చెప్పు బుద్ధి, అహంకారము, మనస్సు అను నీ మూడింటిని యోగులు చిత్తమని వ్యవహరింతురు. చిత్తము జడమైనది. జడమైన ప్రకృతి వలన కలిగినది. పురుషసాన్నిధ్యమున పురుషుని ఛాయ చిత్తముపై పడుటచే అది చైతన్యవంత మగును. అందువలన చిత్తము ఇంద్రియముల ద్వారా యేపదార్థముతో సంబంధము కలిగియుండునో ఆ పదార్థరూపమును పొందును. దానినే చిత్తవృత్తి యనియు, వృత్తి యనియు అందురు. ఉదాహరణమునకు - నేత్రేంద్రియము ద్వారా చిత్తము ఘటమును చూచినపుడు పురుషుని సాన్నిధ్య ప్రభావమున

* 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయ భాగమున 'రాజయోగమను' ప్రకరణమున యోగమును గుఱించి విపులముగ చెప్పియుంటిని. కనుక ఇచ్చట దిఙ్మాత్రముగ చెప్పుచున్నాను.

చిత్తము ఘటాకారమును పొందును. ఇట్టి వృత్తులు సూక్ష్మములై సంస్కారము లగును. తిరిగి యీ సంస్కారముల వలన వృత్తులు కలుగుచుండును.

ఇట్లు సంస్కారములు, వృత్తులు అను నీ సుడిగుండమున తగులు కొన్న పురుషునకు జన్మపరంపరలు కలుగుచుండును. వృత్తి యొక్క ఆకారము పొందని చిత్తము అనగా - ఏ రూపమును పొందని చిత్తము పురుషుని స్వరూపమువలె నుండును. అది చిత్తమునకు సహజస్థితి. ఇది అష్టాంగయోగమువలన సిద్ధించును. అష్టాంగ యోగమనగా: ఎనిమిది అంగములు గలది.

అవి - యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు (పా.యో.సూ. 2-29). వాటి వివరము :

1. యమము : (1) ఏ ప్రాణిని ఏ విధముగను నొప్పింపకుండుట, (2) సత్యమునే పలుకుట, (3) దొంగిలింప కుండుట, (4) బ్రహ్మచర్యము, (5) ఇతరుల నుండి దేనిని గాని ఉచితముగా గైకొనకుండుట. (పా.యో.సూ.2-30) **2. నియమము** : (1) పరిశుభ్రత కలిగియుండుట, (2) సంతోషము, (3) తపస్సు, (4) వేదాంత గ్రంథములను చదువుచుండుట, (5) ఈశ్వర ప్రణిధానము. (పా.యో.సూ. 2-32). **3. ఆసనము** : స్థిరమై సుఖమును కలిగించునట్టిది. (పా.యో.సూ. 2-46) **4. ప్రాణాయామము:** ప్రాణనిరోధము (పా.యో.సూ.2-49). **5. ప్రత్యాహారము:** శ్రోత్రాది ఇంద్రియములను శబ్దాదులయందు ప్రవర్తింప కుండ జేయుట (పా.యో.సూ. 2-54) **6. ధారణ** : చిత్తమును లక్ష్యమునందు నిలుపుట (పా.యో.సూ. 3-1) **7. ధ్యానము** : ధారణ యెడతెగక తైలధారవలె కొంతవఱకు నిలుపుట. (పా.యో.సూ. 3-2) **8. సమాధి** : రూపమును విడిచి అర్థమును మాత్రమే భాసింప జేయుచున్న సమాధి యగును. (పా.యో.సూ. 3-3) దీనివలన అవిద్య, సంస్కారములు అస్మితము మొదలగునవి నిగ్రహింపబడును. దానినే యోగులు కైవల్య మందురు.

అప్పుడు చిత్తము ప్రపంచ సంబంధమును వదలుకొని యుండును. సాధకుని కట్టి స్థితి కలిగించుటయే యోగశాస్త్రము యొక్క లక్ష్యము. చిత్తము నట్టి సహజస్థితికి గొనిపోవుటకే అష్టాంగ యోగములను, ఉపాయములను కనుగొనిరి. సమాధియందు చిత్తము సహజస్వరూపమున ఉండును. అట్టి స్థితిని చిత్తనాశనమని కూడ చెప్పుదురు. వృత్తులు నశించిననే సమాధి యగును. అప్పుడు పురుషుడు తన సహజ స్వరూపమును చిత్తమునందు తాను తిలకించును. చిత్తముతోడి సంబంధము తొలగిపోవును. జీవిత మంతయు నెడతెగకుండ సమాధి యందుండుట సాధ్యము కాదు. కాని సమాధి పలుమారులు నభ్యసించుచు ఎక్కువ కాలము సమాధియందే గడుపువారు మరణానంతరము తిరిగి జన్మింపరు. ఇట్టి స్థితి నొందుట సాధకునకు యోగము వలననే కలుగును. యోగమునకు వైరాగ్యము. ఈశ్వర ప్రణిధానము అవసరము. ఈశ్వర ప్రణిధాన మన - ఈశ్వరోపాసన. ఉపాసన యన ప్రణవోపాసనయే.

సాంఖ్య యోగ దర్శనములు రెండును ద్వైతమును బోధించును. ప్రధానము యొక్కయు, జీవులయొక్కయు వారి స్వరూపమును గుఱించియు, సిద్ధాంతమును గుఱించియు, మోక్షమును గుఱించియు రెండు దర్శనములును ఏకాభిప్రాయము కలిగియున్నవి. ఇరువురును ప్రకృతి పరిణామవాదులు. సాంఖ్యులు జ్ఞానమువలన ముక్తి కలుగు నందురు. యోగులు ముక్తికి సాధనము జ్ఞానమే గాక అష్టాంగయోగమును కూడ అభ్యసింపవలయు నందురు. అష్టాంగ యోగము శ్రుతి సమ్మతము. వీరు చెప్పు పురుషులు నిర్గుణు లనుట వేదాంతులకు సమ్మతము కాని ఇచ్చట పురుషు లనేకులు వేదాంతుల (అద్వైతుల) ఆత్మ యేకము. అద్వైతుల వలననే వీరును అవిద్యవలన దేహాత్మభ్రాంతి కలిగిన దందురు.

సూ॥ ద్రష్టృదృశ్యోపరక్తం చిత్తం సర్వార్థమ్। (పా.యో.సూ. 4-22)

తా॥ చిత్తమునకు ఒక వైపున దృశ్య ప్రపంచము ప్రతి ఫలించు చున్నది. వేఱొక వైపున ద్రష్టయగు పురుషుడు ప్రతిఫలించుచున్నాడు. ఈ విధముగా చిత్తమునకు సర్వవిషయములను గ్రహించు శక్తి గలదు.

సూ|| విశేష దర్శిన ఆత్మ భావనా నివృత్తిః| (పా.యో.సూ. 4-24)

తా|| పురుషుడు చిత్తము కానేరడను వివేకమువలన యోగి ముక్తు డగును. కైవల్య మనగా ప్రకృతి బంధము నుండి విడివడుటయే. లేక, ప్రకృతి తన నాట్యమును పురుషుని యెదుట ప్రదర్శింపకుండుట. అట్టి వానికి పునర్జన్మ లేదు.

బ్రహ్మసూత్ర భాష్యమునందలి యోగ ప్రత్యుక్త్యధికరణమున శ్రీ శంకరులు యోగమతమును ఖండించిరి. (బ్ర.సూ. 2-1-3). ఖండించిరనగా అష్టాంగ యోగములు జ్ఞానమునకు సాధనములుగా వేదము సమ్మతించును గనుక గ్రాహ్యమనియు, వేదసమ్మతముగాని తక్కిన సిద్ధాంతము అగ్రాహ్యమనియు వ్రాసిరి. వైదిక శాఖలన్నియు యోగదర్శనము నందలి చిత్తనిరోధ రూపమగు సాధనమును కొలదిగనో, గొప్పగనో ఆచరణయం దుంచుచున్నవి.

యోగ శాస్త్రములయందు బాదరాయణాచార్యుల వేదాంతమును ఖండించుటకు అద్వైతమునే అనువదించి కొన్ని యంశములు ఖండించిరి. భోజరాజు అనువారు వ్రాసిన 'వృత్తి' యందును తదితర గ్రంథముల యందును అద్వైతమునే ఖండించిరి.

(8) పూర్వమీమాంసాదర్శనము

మీమాంసాదర్శనమును సూత్రములుగా రచియించిన వారు జైమిన్యా చార్యులు. ఈ గ్రంథము క్రీ.పూ. 4-వ శతాబ్దమునకు చెందిన దందురు. జైమినిముని కృష్ణద్వైపాయన మునీంద్రుల శిష్యులలో నొకరని వాడుక. కాని ఆ జైమిని మహర్షి వీరికంటె భిన్నులని నా అభిప్రాయమేగాక పలువుర అభిప్రాయముగూడ. జైమిని మీమాంసాసూత్రములు క్రీ.పూ. 4వ శతాబ్దమునకంటె ప్రాచీనములు కావని పండితుల అభిప్రాయము. *మీమాంసా సూత్రములకు శబరస్వామి విరచిత భాష్యము ముఖ్యమైనది.

* పూర్వమీమాంస సూత్రగ్రంథము ద్వాదశాధ్యాయములు గలది. అందు అఱువది పాదములు గలవు. ఒక్కొక్క పాదమున్ను అధికరణములుగా విభజింపబడినది. అట్టివి 894. వాటియందు 2745 సూత్రము లుండవచ్చును. - చర్చించు

వీరు క్రీ.పూ. 1వ శతాబ్దికి చెందినవారు. శబర స్వామికి పూర్వముకూడ భర్తృమిత్రుడు, భవదాసు, హరి, ఉపవర్షుడు మున్నగు వారి భాష్యము లుండెనని చెప్పుదురు. బోధాయనులు మీమాంసాసూత్రములకు వృత్తిని రచియించిరి. వీరు క్రీ.పూ. 4వ శతాబ్దికి చెందిన వారట. వీరికి ఉపవర్షుడని, శబర స్వామి అని నామాంతరము లున్నట్లు కొందఱు చెప్పుదురు. శబర స్వామి వీరు కారని, శబర స్వామి వ్రాసిన భాష్యమునకు బోధాయనుడు వృత్తి వ్రాసిరని, ఉపవర్షుడే బోధాయనుడని యందురు.

క్రీ.శ. 7వ శతాబ్దికి చెందిన కుమారిలభట్టు శబర భాష్యమునకు గొప్ప వ్యాఖ్యానమును రచియించిరి. అది 'శ్లోకవార్తికము', 'తంత్రవార్తికము', 'టుప్టీక' అని మూడు భాగములు గలది. క్రీ.శ. 650 కి చెందిన ప్రభాకరుడు శబర భాష్యమునకు శ్రీ కుమారిలభట్టు రచియించిన వ్యాఖ్యానమునకంటె వేఱుగ "బృహతి" అను వ్యాఖ్యానమును రచించిరి. (వీరిని ప్రభాకర మిశ్రుడని కూడ పిలుతురు). ఆ కారణమున మీమాంస భాట్టము, ప్రభాకరము - అని రెండు ప్రస్థానము లయ్యెను. ఆ తరువాత మీమాంసా శాస్త్రముపై అనేక గ్రంథములు వెలువడినవి.

విశిష్టాద్వైత మతోద్ధారకులలో నొకరగు శ్రీ వేదాంత దేశికులను నామాంతరముగల వేంకటనాథాచార్యులవారు "సేశ్వర మీమాంస" అను గ్రంథమును వ్రాసి మీమాంసా శాస్త్రమును వేదాంతముతో సమన్వయము చేయుటకు ప్రయత్నించిరి.

వేదములు స్వతః ప్రమాణములు

వీరి సిద్ధాంతము దిఙ్మాత్రముగ చెప్పవలయునన్న ఇట్లుండును:- వేదములు నిత్యములు, అపౌరుషేయములు. సర్వజ్ఞుడైన పురుష డెవ్వడైన వాటిని రచియించి యుండ వచ్చునను, వైశేషిక మతమును వీరంగీకరింపరు.

విషయము, సంశయము పూర్వపక్షము, సిద్ధాంతము, ప్రయోజనము, అనునవి కలిగియుండునది అధికరణ మనబడును. సంకర్షణకాండమని మరి నాలుగధ్యాయముల గ్రంథము కలదు. అదియు జైమిని విరచితమయ్యెనేని (అట్లనువారు) మీమాంసా గ్రంథమును షోడశలక్షణీ యందురు. సంకర్షణకాండను వదలిన 12 అధ్యాయముల గ్రంథమును ద్వాదశలక్షణీ యందురు.

వీరు చెప్పున దేమన :- సర్వజ్ఞుడగు పురుషుడు ఈ కాలమున గాని, పూర్వకాలమున గాని లేడు. ఏ విధముగను మానవుడు సర్వజ్ఞుడు కాజాలడు. వేదములు ఈశ్వర నిర్మితములు కావు. అసలు ఈశ్వరుడను వాడొక డున్నాడని వీరొప్పుకొనరు. ఈశ్వరుడు లేనిచో ప్రపంచమెట్లు కలిగినదను ప్రశ్నకు వీరిచ్చు సమాధాన మేమన, ప్రపంచ మొకప్పుడు కలిగినది కాదు. ఎవరి చేతను సృష్టింప బడినది కాదు. ఇది శాశ్వతముగా నిట్లే యుండును. ఈశ్వరు డొక్కడు కలడనుటకు ప్రమాణ మేమియు లేదు. ఒక వేళ ఈశ్వరుడు కలడని అంగీకరించినను అతనికి సర్వజ్ఞత్వ ముండదు, ఆయనకు నోరు లేదు, కనుక వర్ణముల నుచ్చరింపలేడు. వేదములు అతీంద్రియార్థ విషయములను బోధించుచున్నవి. అవి యెప్పటికిని స్వత స్సిద్ధముగనే యున్నవి. అవి ప్రమాణాంతరముల నాధారముగా గొని పురుషులచే రచింపబడినవి కావు. కనుకనే, పరమ ప్రమాణములు.

త్రయీధర్మము, దాని ప్రాచీనత

వేదములయందు చెప్పబడిన ధర్మమునకే 'త్రయీధర్మ' మని ప్రాచీన నామము. వేదోక్తములగు యజ్ఞములను ఏ కాలమునందు ఏవిధముగ చేయవలెనను విధానము (విధాయకమును), విపులముగ బ్రాహ్మణములను గ్రంథముల యందు చెప్పబడినది. కాని వేఱు వేఱు బ్రాహ్మణములయందు యజ్ఞవిధులను వేర్వేఱు విధమున చెప్పియుండుట వలన అందులో నేది గ్రాహ్యము, ఏది అగ్రాహ్యము అను సంశయము కలుగును. ఇట్లు వేర్వేఱు బ్రాహ్మణముల యందు చెప్పబడిన పరస్పర విరుద్ధమగు విధులకు ఏక వాక్యత ఘటింపజేసి అందులో గ్రాహ్యములైన వాటిని నిరూపించి జైమిన్యాచార్యులు మీమాంసా సూత్రముల రచియించిరి.

అంత మాత్రమున ఈ శాస్త్రము జైమిన్యాచార్యులే మొదట కనిపెట్టి రచియించినది కానేరదు. వారికి పూర్వులే కొందఱు అనగా : ఆత్రేయ, ఆశ్మరథ్య, కాష్ణాజిని, బాదరి, ఐతిశాయన, కాముకాయన, లాబుకాయన,

ఆలేఖన, కాశకృత్స్నాదులు రచియించి యుండిరి. అవి ప్రస్తుతము లభింపవు; ఖిలమైనవి. జైమిన్యాచార్యులు ఈ పూర్వరచనలను మననము చేసి తమ ప్రజ్ఞావిశేషమువలన సూత్రగ్రంథమును రచియించి యుందురు.

ఈ మతము ఈశ్వరునితో సంబంధము లేని విధముగ రూపొందినది. యజ్ఞఫలప్రాప్తికి పరమేశ్వరునితో సంబంధము లేదు. కర్మయే ఫలము నిచ్చును. కర్మ ఫలము నిచ్చునది అపూర్వము.

ద్రవ్యములు

ఈ మతమున కుమారిల ప్రభాకరు లిరువురు ప్రసిద్ధులు. ఇరువురకు పెక్కు అంశములపై వైరుధ్య మున్నది. కుమారిలుని మతము ననుసరించి పదార్థములు భావములు, అభావములు - అని రెండు విధములు. అందు భావపదార్థములు ఆఱు :

(1) ద్రవ్యము, (2) గుణము, (3) కర్మ, (4) సామాన్యము, (5) శక్తి. అభావమును చేర్చిన ఆఱగును.

ప్రభాకరమతమున పదార్థములు ఎనిమిది:- పైన చెప్పిన అయిదును అంగీకరించి వాటితో సాదృశ్యము, సంఖ్య, సమవాయము అను మూడును చేర్చి యెనిమిది అన్నారు. అభావమును త్రోసివేసిరి.

పైన చెప్పిన పదార్థములలో 1.2.3 లను న్యాయదర్శనము చెప్పిన రీతిగానే వివరించిరి. 4 వది సామాన్యము. ఇది ప్రతివ్యక్తిలోను కనబడును, ఇది యథార్థ మైనది. 5 వది శక్తి, నైయాయికులు శక్తి నంగీకరింపరు. అంగీకరించిన వారి ఆరంభవాదము నిలువదు. ద్రవ్యగుణకర్మ సామాన్యములు. దేనివలన వస్తువులకు కారణమగునో దానినే శక్తి యందురు.

ప్రభాకరుడు ప్రత్యేకముగా చెప్పిన సాదృశ్యము, సంఖ్య, సమవాయము లలో సాదృశ్య మనునది జాతులకు చెందినది. సంఖ్య, సమవాయములను గుఱించి ప్రభాకర కుమారిలుల యందు భేద మున్నది. వైశేషికులు సంఖ్యను గుణములలో చేర్చిరి. సమవాయమును గుఱించి న్యాయ వైశేషికుల పద్ధతియే అనుసరింపబడెను.

కుమారిలుడు చెప్పిన అభావములు నాలుగు విధములు : (1) పూర్వము (2) పరము (3) పూర్ణములు (4) అన్యోన్య సంబంధములు - ప్రభాకరులు అభావమును అంగీకరింప లేదు. అభావము వస్తువుయొక్క స్థాన మాధారముగా కలదే గాని స్వతంత్రము కాదు. దానిని పదార్థాంతరముగ అంగీకరింపక అధికరణాత్మక మనిరి.

భాట్టమతము ననుసరించి ద్రవ్య భేదములు పదునొకండు. ద్రవ్య భేదములు : (1) పృథివి (2) జలము (3) తేజము (4) వాయువు (5) ఆకాశము (6) ఆత్మలు (7) మనస్సు (8) దేశము (9) కాలము (10) తమస్సు (చీకటి) (11) శబ్దము.

ప్రభాకరులు పై వాటిలో మొదటి తొమ్మిది ద్రవ్యములను మాత్రమే అంగీకరించి కడపటివగు తమస్సు, శబ్దములను త్రోసివేసిరి. న్యాయ వైశేషిక తత్త్వములు తేజో ఉభావమే తమస్సనిరి గాని తమస్సును ద్రవ్యభేదమని దాని అస్తిత్వమును అంగీకరింపలేదు. వైశేషికులు, వేదాంతులు శబ్దమును గుణములలో చేర్చిరి గాని ద్రవ్యముగా అంగీకరింపరు. మీమాంసకులు తక్కిన యంశములయందు చాలవఱకు న్యాయ వైశేషిక తత్త్వముల ననుసరించిరి; పంచభూతములు వాటి గుణములను ఎఱుంగుదుము. కనుక, ఆత్మను గుఱించి విచారించుట యుక్తము.

ఆత్మ : భాట్టమతము ననుసరించి ఆత్మ సంపూర్ణముగ జడ స్వరూపము కాదు. జడబోధాత్మక స్వరూపము. అనగా : ఆత్మబోధ (జ్ఞాన) విశిష్టమైన దని తాత్పర్యమును చెప్పిరి. ఆత్మ కర్త, కర్మ రెండును. ఆత్మ తెలిసికొను కర్త, తెలియబడు విషయము. ఆత్మ పరిణామము పొందుచుండును. అయినను అది నిత్యమైనదే. ఆత్మలు విభువులు అనేకములు. ఆత్మలు బుద్ధీంద్రియ శరీరములకంటె భిన్నమైనవి. ఆత్మయను ద్రవ్యమునకు జ్ఞానము గుణము; లేక , ఆత్మజ్ఞాన విశిష్టమైనది. ఆత్మ సర్వవ్యాపియైనను కర్మ చేయగలదు. ఆత్మాస్తిత్వము అనుమానముచే తెలియబడుచున్నది. ఆత్మాస్తిత్వమును స్థిరపరచుచు నైయాయిక, వైశేషిక

తత్త్వములు చూపిన హేతువులు పూర్వ మీమాంసకులకు అంగీకారమే. సుఖదుఃఖాది ధర్మములు ఆత్మకు చెందినవే గాని శరీరేంద్రియాదులవి కావు. ఆత్మ అంతఃకరణము ద్వారా వృత్తిగా మారును.

ఆత్మను గుఱించి ప్రభాకర వాదమును వివరింతును :

ప్రభాకర మతమున ఆత్మ జడము. ఆత్మ జ్ఞానము కాదు. జ్ఞానమునకంటెను భిన్నము. ఆత్మ తనను తానుగాని యితరమును గాని యెఱుగదు. జ్ఞానము చేత ఆత్మ యెఱుగబడును. జ్ఞానము స్వయంప్రకాశము. ఆత్మ కర్త, భోక్త; అది సమస్త వస్తు విషయమగు జ్ఞానమునందును ప్రకటమగును. ఆత్మ కర్మ కాదు. ఆత్మేతరము లగున వన్నియు కర్మలు. అనగా - జ్ఞానమునకు విషయములు. ఆత్మ కర్తయు, కర్మయు అని కుమారిల భట్టు చెప్పిన దానిని ప్రభాకరుడు ఖండించినాడు. ఒకే క్రియయందు నే పదార్థముగాని తానే కర్తయు కర్మయు కావు. ఆత్మ పరిణామి కాదు, పరిణామ మంగీకరించిన ఆత్మకు నాశన మంగీకరింపక తప్పదు. ఆత్మ నిత్యమని ప్రభాకర, కుమారిలు లిరువురు అంగీకరింతురు.

ఆత్మ దేహేంద్రియాదులకంటె అత్యంత భిన్న మైనదని జైమిని సూత్రముల యందు స్పష్టముగ చెప్పియుండ లేదనియు, భాష్యకారులు చెప్పిరనియు, కొందఱు పండితు లందురు. ఆత్మ దేహేంద్రియాదులకంటె భిన్నమని స్పష్టముగ చెప్పక పోయినను చెప్పినట్లే తలంపవలయును. **"జ్యోతిష్టోమేన స్వర్గ కామో యజేత"** అను వేద వాక్యమువలన జ్యోతిష్టోమము చేసిన వ్యక్తి స్వర్గమునకు పోవు ననిన, ఈ శరీరముతో స్వర్గమును పొందలే డనునది అందరెఱింగినదే. కనుక, శరీరమునకంటె భిన్నమగు ఆత్మ స్వర్గమును చేరు ననుట సిద్ధాంతము.

ఆత్మ ముక్తదశయందును జడ రూపమే. ఈ మతము నందు జీవుడు వేఱు, ఆత్మ వేఱు - అను వ్యవహారము లేదు. జీవుడే ఆత్మ. ఆత్మ మానస ప్రత్యక్షమని భాట్టమతము, ఆత్మ అహంప్రత్యయ గమ్యమని ప్రభాకరమతము. ఆత్మలనేకములను మొదలగు అంశములు భాట్టమతమున చెప్పిన రీతిగనే ప్రభాకరు లంగీకరింతురు.

గుణములు

1. రూపము, 2. రసము, 3. గంధము, 4. స్పర్శము, 5. సంఖ్య, 6. పరిమాణము, 7. సంయోగము, 8. విభాగము, 9. పరత్వము, 10. అపరత్వము, 11. గురుత్వము, 12. ద్రవత్వము, 13. స్నేహము, 14. బుద్ధి, 15. సుఖము, 16. దుఃఖము, 17. ఇచ్ఛ, 18. ద్వేషము, 19. ప్రాకట్యము, 20 ధ్వని, 21. సంస్కారములు - ఇవి భాట్టమతము ననుసరించినవి. ప్రభాకర మతమున "సంఖ్య" ను వదలిరి కనుక 20 గుణములను అంగీకరించిరి- పైన చెప్పిన యిరువది యొక్క గుణములు వైశేషిక దర్శనమునందు చెప్పినవే. వైశేషికులు వీరికంటె ఎక్కువగా గురుత్వము, ధర్మము, అధర్మము అను మూడు గుణము లంగీకరించిరి. భాట్టులు శబ్దమును, తమస్సును, ద్రవ్యములలో చేర్చగా; ప్రభాకరులు శబ్దము ఆకాశముయొక్క గుణమనియు, తమస్సు (చీకటి) అను పదార్థము లోకమున లేదనియు త్రోసి వేసిరి. భాట్టమతమున ఆకాశము, వాయువు, కాలము, దిక్కు అనునవి ప్రత్యక్షములు. ప్రభాకర మతమున అనుమాన ప్రమాణముచే తెలియబడునవి.

శబ్దముయొక్క నిత్యత

ఈ మతమున శబ్దార్థ సంబంధము కృత్రిమము కాదు. నిత్యము శబ్దముచే చెప్పబడు వస్తువులు నిత్యములే. అక్షరముల కూర్పునుబట్టి శబ్దమును బట్టి అర్థమును ఏర్పడుచుండును. ఒక అక్షరమును విని తరువాత అక్షరమును విని నప్పుడు మొదట వినిన అక్షరముయొక్క సంస్కారము చిత్తమున నుండి, అట్లే అ న్ని యక్షరముల సంస్కారము వలన చివరి యక్షరము వినినంతనే అర్థము స్ఫురించును. భాట్టమతమున ధ్వని, శబ్దము అని రెండు విధములు. ప్రభాకరులు ధ్వనిలేదు, అదియు శబ్దమే యందురు శబ్దము మనచే ప్రయత్న పూర్వకముగ నుచ్చరింప బడుననియు ఉచ్చరించిన మఱుక్షణముననే అది నశించుననియు మన మెఱుగుదుము.

అట్టి శబ్దము సత్యమెట్లగునన్న ప్రశ్నకు వీరి సమాధాన మిది :

మన మేశబ్ద ముచ్చరించినను అది అదివఱకున్నదే. మనము

క్రొత్తగా సృష్టించుట లేదు. పూర్వమున్న దానినే అభివ్యక్తము చేసితిమి. ఉదాహరణమునకు - "స్వామి" అని అంటిమేని అది అవ్యక్తావస్థయందిది వఱకున్న దానినే ప్రయత్నముచే వ్యక్తము చేసితిమి. అది వెంటనే నశించిన దనగా అవ్యక్తస్థితికి చేరిన దనియే గాని నశింపలేదు.

జ్ఞానము

జ్ఞానము : భాట్టమత మిట్లుండును :

జ్ఞానము ఆత్మ ప్రవృత్తిచే కలుగు సంచలనము. జ్ఞానము వలన బాహ్యవస్తు వివేకము కలుగును. వృత్తి అనగా - అంతఃకరణము ద్వారా ఆత్మవిషయాకారమును పొందుచున్నదని యర్థము. వేదాంతుల ఆత్మవలే మీమాంసకుల ఆత్మ నిర్వికారి కాదు. మన మొక వస్తువును చూచిన మఱియొక వస్తువుగా భావింపుమని వీరందురు. అద్వైతులు చెప్పు రజ్జు సర్పభ్రాంతిని వీరంగీకరింపరు.

అనగా - రజ్జువును చూచిన సర్పమను మిథ్యాజ్ఞానము కలుగదు. ఒక జ్ఞాన క్రియలో నాలుగంశము లున్నవి. (1) జ్ఞాత (తెలిసికొనువాడు), (2) జ్ఞేయము (తెలియబడునది), (3) జ్ఞానకరణము (జ్ఞానమును పుట్టించు సాధనములు), (4) జ్ఞాతత (జ్ఞానము) అనగా : జ్ఞాతకు జ్ఞేయమునకు సంబంధము చేకూర్చునది . కాని, ఈ మతమున జ్ఞాతృజ్ఞేయ సంబంధము వలన జ్ఞానము పుట్టునట. జ్ఞానము మనస్సుచేత ఎఱుగబడదు. అనుమానింపబడును. సర్వజ్ఞానములు స్వతః ప్రమాణములని అంగీకరించిరి.*

ప్రభాకరవాదులు జ్ఞానమును గుఱించి యిట్లు చెప్పుదురు : జ్ఞా తృ జ్ఞాన, జ్ఞేయములను త్రిపుటి యేక కాలమున తెలియును. "అహం" శబ్ద వాచ్యమగు ఆత్మ ప్రతిజ్ఞానక్రియ యందును మనస్సంయోగ

* ప్రామాణ్యములు రెండు విధములు : (1) పరతఃప్రామాణ్యము (2) స్వతః ప్రామాణ్యము - (1) తన ప్రమాణతను స్థాపించుటకు వేఱొక ప్రమాణమును కోరునది పరతఃప్రామాణ్యము. (2) తన ప్రమాణత్వమును స్థాపించుటకు మఱియొక ప్రమాణమును కోరనిది స్వతఃప్రామాణ్యము.

ద్వారమున తెలియబడుచున్నది. స్మరణము అనుమానములయందు విషయము ప్రత్యక్షము కాదు. అనగా - అనుమాన విషయము పరోక్షము కాని, విషయ మిచట ప్రత్యక్షము కాదు, కాని, పరోక్షజ్ఞానము ప్రత్యక్షమే. అనగా - అనుమాన స్మరణములయందు విషయము ఎట్టి జ్ఞానముచే ఎఱుగ బడుచున్నదో, అట్టి జ్ఞానము మాత్రము ప్రత్యక్షమే అని అర్థము. జ్ఞానము జ్యోతి స్స్వరూపము. అట్లగుటచే జ్ఞానమును తెలియ జేయుటకు వేఱొక సాధనము (జ్ఞానము) అవసరము లేదు. చిత్తముగాని, విషయములు గాని స్వయంజ్యోతులు కావు. కనుక, వాటిని ప్రకాశింప జేయుటకు జ్యోతి అవసరము. అట్టి జ్యోతియే జ్ఞానము. ఒక జ్ఞానవృత్తి మఱియొక జ్ఞానవృత్తికి తెలియబడదు.

జ్ఞానము ప్రామాణికము అప్రమాణికము - అని రెండు విధములు: ప్రత్యక్షము ప్రామాణికము. స్మృతి ప్రామాణికము కాదు. జ్ఞానమంతయు స్వతఃప్రామాణికము. శుక్తిని (ముత్యపు చిప్పను) ఎండలో చూచి "ఇది రజతము"(వెండి) అని తలతుము. ఇచట విపర్యయ (భ్రాంతి) జ్ఞానము కలిగినదని వేదాంతుల మతము. ఇందుకు భిన్నముగ వీరు (ప్రభాకరులు) ఇట్లు చెప్పుదురు : "ప్రత్యక్షాది ప్రమాణజ్ఞానము కొంత యథార్థము, కొంత యథార్థము కాదు." అని దార్శనికు లందఱు అంగీకరించిన యంశమే. కుమారిలుడు కూడ అంగీకరించి యున్నాడు. వీరు (ప్రభాకరులు) మాత్రము జ్ఞానమంతయు యథార్థమని వాదించుదురు.

ఎట్లనగా - మన చిత్తము నెదుట ఏది ప్రదర్శింపబడునో అది జ్ఞానము. ముత్యపు చిప్పను చూచిన సమయమున మనచే అంతకు పూర్వము ఎప్పుడో చూడబడిన రజతము మన చిత్తము నెదుట ప్రదర్శింపబడినది. అట్టి దానిని "ఇది వెండి" అని చెప్పితిమి గాని, ఎండలో ఉన్న ముత్యపు చిప్పను "వెండి" అని చెప్పుట కాదు. "ఇది" అనగా చిత్తము నెదుట ఉన్నదని అర్థము. ప్రస్తుతము బయట చూచుచున్న శుక్త్యంశమును, ఇదివఱలో చూచి .యుండి యిప్పుడు స్మరించుచున్న రజతాంశమును ఒక్క భావమున కలిపివేసితిమి. ఇచట భ్రమ లేదు. ఏలయన? బయట నున్న శుక్తి మనస్సున గోచరింపలేదు.

అనగా - మనస్సున దాని ముద్ర పడలేదు. మనస్సున రజతాంశమే ముద్రితమై యున్నది. శుక్త్యంశము నేత్రమునకు మాత్రమే గోచరించినది. ఇచట జరిగిన దేమి? దృష్టస్మృతములను వివేకింప లేక ఒకటిగా కలిపి వేసితిమి. దీనినే అఖ్యాతి యందురు. చూడబడినది యొకటి - స్మరింపబడినది వేఱొకటి. విపర్యయ జ్ఞానమునకు అసంపూర్ణ జ్ఞానము కారణము. అజ్ఞానము కారణము కాదందురు.

మసక చీకటిలో రజ్జువును చూచి సర్ప మనుకొందుము. ఈ సర్పము అసత్తు కాదు. మనకు కనబడున దంతయు సత్య మనలేము. ఇచట సర్పముగా కనబడునది రజ్జువే. ఇదియే నైయాయికుల అన్యథా ఖ్యాతివాదము. భాట్టులు అన్యథాఖ్యాతివాదులు.

మనస్సుతో ఆత్మకు సన్నికర్షము కలిగినపుడు ఆత్మ జ్ఞానక్రియకు కారణ మగుచున్నది. అయితే ఆత్మ మనస్సంయోగము ఏ కారణమున కలుగుచున్నది? అనిన (1) పూర్వజన్మమున జీవుడాచరించిన కర్మ ఫలానుగుణముగ అదృష్టము (అపూర్వము) చేత ప్రేరేపింపబడి ఆత్మమనస్సంయోగము కలుగుచున్నది. (2) "ఆత్మచేత నిశ్చితమైన మానసిక వ్యాపారము వలననైనను ఆత్మమనస్సంయోగము కలుగుచున్నది. విషయములతో సంబంధము గలిగి ఇంద్రియములతో సంయోగము పొందిన మనస్సు ఆత్మతో సన్నికర్షము కలుగుటవలన ఆత్మకు బాహ్యప్రపంచ జ్ఞానము కలుగుచున్నది. కేవల సుఖదుఃఖాదుల యందు ఆత్మకు మనస్సుతో మాత్రమే సంబంధ ముండును."

యోగులు తమ యోగశక్తిచే అతీంద్రియ జ్ఞానసంపన్నులై భూతభావి కాలములయందున్న వస్తువులను దర్శింతురని దార్శనిక తత్త్వవేత్త లనేకు లంగీకరింతురు. మనలో అనేకులట్టి యోగశక్తి గలవారితో సంభాషించి యోగులకట్టి శక్తి కలదని చూచి యుంటిమి. మీమాంసకులు ఈ యంశము నంగీకరించిన వేదములట్టి యోగులచే రచియింపబడినట్లు అంగీకరింపవలసి వచ్చునని వారి భయము. భూత భవిష్య ద్దూరస్థ విషయములకు వేదమే ఆధారము లందురు.

స్వప్నములు పూర్వ వాసనా ఫలితములై యుదయించు ననియు, అప్పుడు ఆత్మతో మనస్సునకు సంబంధము కలిగి యుండుననియు, స్వప్నరహిత గాఢ సుషుప్తియందు ఆత్మకు మనస్సుతో వియోగ ముండుననియు ప్రభాకరమతము. సుషుప్తియందు ఆత్మ తన శుద్ధ అచిత్ స్వరూపమును పొందుటచే స్వప్నము లుండవని కుమారిలమతము.

పూర్వమీమాంసా తత్త్వమున, ప్రపంచము సత్యము. బాహ్య పదార్థములు యథార్థములే. అవి యింద్రియ మనస్సన్నికర్షము ద్వారా ఆత్మకు ప్రత్యక్ష మగుచున్నవి. తక్కిన అనేక విషయములయందు వీరు న్యాయ వైశేషికుల ననుసరించిరి.

జ్ఞానప్రమాణములు

జైమిన్యాచార్యులు ప్రత్యక్ష, అనుమాన, శబ్దములను మూటినే ప్రమాణములుగ అంగీకరించిరి. ప్రభాకరులు ఉపమానము, అర్థాపత్తిని చేర్చి అయిదనిరి. కుమారిలభట్టు అనుపలబ్ధిని చేర్చి ఆఱు ప్రమాణము లనిరి* (1) **ప్రత్యక్షము** : సాక్షాత్ప్రతీతి. ఇది ఇంద్రియ విషయసంయోగము కలుగును. (2) **అనుమానము** : ఏవేని రెండు వస్తువులు నియతముగ ఒక దానిని విడిచి మఱియొకటి ఉండవను దృఢ నిశ్చయము కలిగియున్నప్పుడు ఆ రెండింటిలో నేదేని ఒకటి ప్రత్యక్షమై మఱియొకటి అప్రత్యక్షము కాగా, కనబడని రెండవది అచట కలదను జ్ఞానము అనుమానము. (3) **వేదము** : (4) **ఉపమానము** : రెండు వస్తువుల సామ్యనిర్ణయము. (5) **అర్థాపత్తి** : ఒక ప్రత్యక్షభూతార్థము. (మనకు కనబడుచున్న ఒక విషయము). ఇంకొక అప్రత్యక్ష భూతార్థముయొక్క అనగా : కనబడని దానియొక్క సహాయము లేనిదే వివరించుటకు వీలులేనపుడు ఆ స్వీకరింపబడిన అప్రత్యక్ష భూతార్థమునకు అర్థాపత్తియని పేరు. ఉదాహరణమునకు - దేవదత్తుడు పగలు భోజనము చేయడు కాని బలిష్ఠముగా నున్నాడు. ఆతడు బలిష్ఠుడుగా నుండుటకు పగలతడు

---

* భారతీయ దార్శనికులు ఆఱు ప్రమాణములనే గాక 7. సంభవము. 8. ఐతిహ్యము. 9. చేష్ట. 10. పరిశేషము అను వాటితో పదిప్రమాణముల నంగీకరించిరి.

భోజనము చేయకుండుటచే గాదు; భుజింపని వాడు బలిష్ఠుడు కాలేడు. భుజింపకుండుట, బలిష్ఠుడుగా నుండుట - అను నీ రెండును పరస్పర విరుద్ధములు. ఇట్టి విరుద్ధమును తొలగించుటకు దేవదత్తుడు రాత్రి భుజించునని గ్రహింపవలెను. ఇట్లు గ్రహించిన అప్రత్యక్ష భూతార్థమే అర్థాపత్తి. (6) **అనుపలబ్ధి** : భూమిపై ఒక ఘటము లేకుండినయెడల ఘటము గ్రహించబడకుండుటకు దాని లేమిమే కారణము. ఇట్లు ఘటము లేదను జ్ఞానము కలుగుటకు అనుపలబ్ధి యందురు. ఇది అభావము వంటిది.

సృష్టి - ప్రళయము

కల్పాంతమున ఈశ్వరుడు ప్రపంచమును లయమొనర్చి తిరిగి పునస్సృష్టి చేయునని చెప్పు ఇతర దార్శనికుల వాదమును ప్రభాకరు డంగీకరింపడు. ప్రపంచమునందే పరిణామము, ప్రళయము - అనునివి రెండును నిత్యమై యున్నవి. ప్రపంచములో కొంత భాగమునకు మాత్రము లయోత్పత్తు లున్నవిగాని ప్రపంచము మొత్తమునకు సర్గప్రళయములు లేవందురు. కనుక జగత్తు మిథ్య కాదు. సత్యము. న్యాయవైశేషికులవలెనే మీమాంసకులును అణువాదులు. వీరి అణువులు నైయాయికులు చెప్పునట్టి "తృటి" లేక "త్ర్యణుకము" వంటివి.

ధర్మము, కర్మము

మీమాంసకుల మతమునందు ధర్మానుష్ఠానము ముఖ్యము. ధర్మము వేదమునందు చెప్పబడినదేగాని యితరమును ధర్మముగా గౌరవింపరు. వేదవిహితమైన కర్మానుష్ఠానమే ధర్మము. ఎంతటి శ్రమకోర్చియైనను వేదవిహిత కర్మానుష్ఠాన మొనర్పవలయును. కాని, అందఱికిని వేదాధికారము లేదు. ద్విజుల కున్నది. నిషాదులు యజ్ఞము చేయవచ్చు నట.

శాస్త్రకర్త శాస్త్రమును, **సూ|| 'అథాతో ధర్మజిజ్ఞాసా'** అను సూత్రముతో ప్రారంభించిరి. ధర్మమనగా నేమి? దానిని తెలిసికొనుటెట్లు? ఈ ప్రశ్నలకు వారు చెప్పిన దేమన : వేదమువలననే ధర్మమిట్టిదని తెలియవలెను.

వేదవిహితము గానిది ధర్మమని అంగీకరింపకూడదు. వేదములు విధించి నట్లు కర్మలను నాచరింపవలెను. ధర్మమనునది పురుషుని యొక్క కర్మాచరణమువలననే యేర్పడును. ధర్మము వలననే పురుషునకు ఇహమును, నిశ్శ్రేయస్సును (మోక్షము) లభించును. వేదములు కర్మవలననే మోక్షము లభించునని కర్మనే బోధించుచున్నవి. జ్ఞానమును బోధించుట లేదు. ఒక వేళ తత్త్వజ్ఞానము వలన మోక్షము కలుగునని అంగీకరించినను కర్మసహిత జ్ఞానముచే మాత్రమే మోక్షము కలుగవలెనని, కేవల జ్ఞానముచే మోక్షము సిద్ధింపదని వీరి వాదము.

వేదములయందు విధివాక్యములు, మంత్ర వాక్యములు కలవు. విధివాక్యముల కంటె మంత్రవాక్యములే అధికముగ నున్నవి. విధివాక్యము లనగా "నీవు దీనిని చేయుము" అని ఆదేశించుట. "**జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత**" స్వర్గమును కోరువాడు జ్యోతిష్టోమ యాగమును చేయవలయును.

స్వర్గమనగా : ఉపనిషత్తులయందును, పురాణాదుల యందును చెప్పినట్లు ఈ లోకమున పుణ్యమాచరించిన వారు మరణానంతరము దేవతలుండు లోకమునకు పోయి అచ్చట పుణ్యఫలమును అనుభవించు టకు తగిన దేవతా దేహములు ధరించి సుఖము ననుభవించుటకు తగిన లోకము. పుణ్యము క్షీణింపగనే అనుశయముతో తిరిగి భూలోకమున జన్మింతురు - మీమాంసకులు చెప్పు స్వర్గ మట్టిది గాదు. వారు 'స్వర్గ' శబ్దమునకు "లోకోత్తర సుఖ" మని అర్థము. అదియే వారి మోక్షము. ఈ విధముగ వేద వాక్యములకు యథేచ్ఛగా వ్యాఖ్యానము చేయుట వేదములు అప్రమాణ మనుటయే అని వేదాంతు లాక్షేపింతురు.

అపూర్వము

సాధారణముగ కర్మను చేసిన వెంటనే దాని ఫలితము కలుగదు. కాలాంతరమున కలుగుచున్నది, కర్మ క్షణికము. అది చేయగనే నశించును. అట్టి క్షణికమగు కర్మ కాలాంతరమున నెట్లు ఫలము నిచ్చును? అను ప్రశ్నకు కర్మఫలము నిచ్చుటకు అధికారి యీశ్వరు డొక్కడున్నాడని

వేదాంతు లందురు. మీమాంసకుల మతము ననుసరించి అట్టి యీశ్వరు డొకడు లేడు. అందువలన క్షణికమగు కర్మ కాలాంతరమున ఫలమును నెట్లివ్వగలదు? ఇందులకు సమాధానము వారిట్లు చెప్పుదురు : ప్రతి కర్మయందును సూక్ష్మమగు నొక శక్తి గలదు. అది కర్మవలన పుట్టు విశేషము. లేదా, కర్మయొక్క సూక్ష్మమగు ఉత్తరరూపము. ఇది ఫలము నిచ్చును, లేదా ఫలమునకు ముందుండు అవస్థ. కర్మకు ముందు ఇది యుండదు. కనుక దీనికి 'అపూర్వ' మని పేరిడిరి. నైయాయికులు "అదృష్ట" మన్నదే వీరు చెప్పునట్టి - అపూర్వము. అపూర్వము కర్తయందు సూక్ష్మముగా దాగియుండి అనుకూలపరిస్థితులు కలుగగనే అనగా సమయము చిక్కగనే కర్తకు ఫలము నిచ్చి తాను నశించుచున్నది; ఫలము నిచ్చు పర్యంతము పురుషుడు ఎన్ని జన్మము లెత్తినను అపూర్వము నశియింపక కర్తయందు దాగి యుండును. అందువల్ల సహితము మీమాంసకులకు ఈశ్వరుడొక డున్నాడని అంగీకరింప వలసిన అవసరము కలుగలేదు. అయితే యిట్టి అపూర్వ మొకటి కలదనుటకు ప్రమాణమేమి? అనిన- అర్థాపత్తి అను ప్రమాణముచేత అపూర్వము నంగీకరింపలేదు. అతని వాదమిది : సర్వవ్యాపియైన కర్త (ఆత్మ) యందు అపూర్వ మెచట నుండును. ఉండుటకు వీలు లేదు. అదిగాక ఆత్మ సర్వవ్యాపి యగుటచే క్రియాహీనుడు. కర్త చేయు యజ్ఞాదికర్మల యొక్క ఫలమును సాధించునట్టి శక్తి కర్తయొక్క పరిశ్రమలోనే యున్నది. కాని కర్తలో ఉండుటకు వీలు లేదు. పరిశ్రమకర్తయందొక కార్యమును (శక్తిని) పుట్టించును. దానికి ప్రభాకరుడు "నియోగ" మని పేరిడెను.

మంత్రములు - దేవతలు

డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు "పూర్వ మీమాంస ప్రత్యక్షముగ బహుదేవతారాధనమును పరోక్షముగ నాస్తికమునునై యున్నది" అని చెప్పిరి. (భా.త.6-1). వేదములయందు చెప్పబడిన దేవత లెవ్వరు? వారు పురాణములలో చెప్పబడిన దేవత లేనా? యాగమనగా ఒక దేవత నుద్దేశించి హవిస్సు (ద్రవ్యము)ను అగ్నియందు వదలుట. ఇంద్ర దేవతాకమగు దధియాగమున "ఇంద్రా యేదం న మమ" = ఇది

"ఇంద్రునకు నాకు గాదు" అని హోమము చేయబడును. ఇచ్చట ఇంద్రశబ్దమునకు బదులు ఇంద్రుని పేర్లలో "దేవేంద్ర", "సురనాథ" మొదలగు నామములు ఇంద్రునకు ఉండినను అట్టి పర్యాయశబ్దముల (నామముల) ఉపయోగింపరాదు. అనగా **"శక్రా యేదం న మమ"** అనకూడదు. ఈ శాస్త్రప్రకారము శబ్దమునకే దేవతా తత్త్వము గాని శబ్దవాచ్యమగు అర్థమునకు (దేవతావ్యక్తికి) కాదు. ఈ విధముగ ఇంద్రాది దేవతా వ్యక్తులయందు గౌరవము చూపక శబ్దమునకంటె నధికముగ అర్థరూప దేవతలు లేరని సిద్ధాంతము చేసి యున్నారు. కుమారిలభట్టు, ప్రభాకరభట్టు లిరువురు దేవతలకు దేహమున్నట్లు అంగీకరింపరు. ఇందువలన బహుదేవతారాధన మనునది సహితము నామమాత్రమే అగుచున్నదని కొందఱందురు. కాని ఇది చాల జటిలమగు విషయము. వేదములయందు దేవతలకు శరీరము లున్నట్లు ఊహించుటకు తగిన ఆధారము లున్నవి. అందులో కొన్నింటిని ఇచ్చట ఉదాహరింతును.

ఋగ్వేదము ద్వితీయాధ్యాయమున సూ. 20. ఋభుదేవతల స్తుతి యందిట్లున్నది. (195)

"ఋభువులు ముసలితల్లిదండ్రులను యౌవనవంతులుగ జేసిరి. (198) వీరు త్వష్టయొక్క శిష్యులు (దేవతల యొక్క చెక్కడపు పనివాడు త్వష్ట). చమస = సోమపానము చేయుటకుగా గఱ్ఱతో చేసిన పాత్ర. "ఋభువులు" (తాము మర్త్యుల మయ్యును) చమసాది పాత్రలు చేయుటవల్ల దేవతలయి దేవతలతో పాటు యజ్ఞభాగమును పొందిరి. (202) సామవేదము 922వ సూక్తమున ఇంద్రునకు మీసము లున్నట్లు చెప్పబడినది. కొన్ని స్థలములయందు ఇంద్రశబ్దము బ్రహ్మమునకు పర్యాయముగ ప్రయోగింపబడినది. ఐనప్పటికిని దేవతలు వ్యక్తులు కారని చెప్పుటకు సాహసింపలేము. దేవతల రూపముతో వచ్చి హవిర్భాగములు గైకొన్నట్లును సోమపానము చేసినట్లును కలదు. మీమాంసకులు దేవతలు దేహము లున్నట్లు అంగీకరించిన దేహధారు లెల్లరు నశించువారే కనుక వారికిని నాశనము కలదను భయమువలన వారికి దేహములు లేవనిరి. ఈ విషయము బాదరాయణాచార్యులవారు

బ్రహ్మసూత్రములయందు దేవతాధికరణమున (బ్ర.సూ. 1-3-26 నుండి 33 సూత్రములయందు) వ్రాసిరి. దీనికి శ్రీ శంకరులు విపులమగు భాష్యమును వ్రాసియున్నారు. ఇందు దేవతలకు దేహములు (విగ్రహములు) కలవని వేద శాస్త్ర పురాణాదుల నుండి అనేక ప్రమాణములు చూపిరి. ఈ యంశము చాల గంభీరమైనది. దీనిని కూలంకషముగ చర్చించుట కిచ్చట వీలు లేదు. బ్రహ్మసూత్రముల యందలి దేవతాధికరణమున చూడవలెను. ఈ యంశము మఱియొకసారి చర్చింతును.

కర్మ చేసిన వెంటనే నశించునది కాదు. ఇది వేదాంతు లంద ఱంగీకరింతురు. అపూర్వము కలదని అంగీకరింపరు. ఈ యంశ మిదివఱకే చెప్పితిని. కర్త కర్మఫలమునుండి తప్పించుకొనుటకు మార్గమేది? కర్మఫల మనుభవించుట అనునది ఒకటి. శాస్త్రములయందు చెప్పిన విధముగ పాపమునకు ప్రాయశ్చిత్తము చేసికొనుట రెండవ పద్ధతి. ఈ విధముగ అనుభవించుట ప్రాయశ్చిత్తము అను నీ రెండు మార్గములు తప్ప మూడవ మార్గము లేదందురు. ఇందుకు ఒక ఐతిహ్యము కలదు.

ప్రాయశ్చిత్తము

జైమినీయ సూత్రములకు భాష్యములు రచించిన కుమారిల భట్టాచార్యులు జైనమతమును ఖండించుటకు ఉద్దేశించి జైనగురువుల నాశ్రయించి వారి మత రహస్యముల నన్నింటిని గ్రహించి జైనమతమును ఖండించిరి.* ఇందువలన వారు తాము గురుద్రోహము చేసినట్లు తలంచిరి. గురుద్రోహ పాతకమువలన కలిగిన ఫలమును అనుభవింపనిదే ముక్తి లేదని తలచి ధర్మ శాస్త్రములయందు చెప్పిన విధమున తుషాగ్నియందు దగ్ధమై పాపమును నశింపజేసికొని ముక్తులైరట. అనగా వరిపొట్టుతో కంఠమువఱకు శరీరము కనపడకుండు నంతటి పెద్దరాశి వేయించుకొని దానికి నిప్పంటించుకొనిరి. అగ్ని పొట్టును నెమ్మదిగ కాల్చుచు చుట్టును వ్యాపించి తుదకు మెల్లమెల్లగ శరీరమును కాల్చి వేసెను. ఇది మహాదారుణమైన మరణము. జ్వలించుచున్న మంటలలో ప్రవేశించి

* ఇది బౌద్ధగురువుల నాశ్రయించి బౌద్ధమతమును ఖండించిరని కొందఱందురు.

మృతినొందుటకంటె ఇది అనేక వేల రెట్లు అధికమగు బాధ ననుభవింప వలసి వచ్చును. ఇట్టి దుర్మరణమునకు సంతోషముగ భట్టుగారు అంగీకరించిరనిన వీరికి కర్మ సిద్ధాంత మందుగల నమ్మకము ఎంత ప్రగాఢమైనదో మనమూహింప వచ్చును.

కొందఱు మీమాంసకులు చెప్పిన మోక్షోపాయములు

జైమిన్యాచార్యులును, శబరుడును మోక్షప్రసక్తి యెత్తలేదట. వేదవిహిత కర్మానుష్ఠానమువలన జీవుడు స్వర్గమునకు పోయి అచ్చట సుఖింతురని చెప్పిరి. కాని ఆ సుఖము (స్వర్గము) సహితము అనిత్య మగుటవలన అది పరమ పురుషార్థము (సత్యము) కాదని ప్రభాకరుడు మొదలగు వారు అనేక మార్పులు చేసి తుదకు ముక్తిని అంగీకరించిరి. పునర్జన్మ రాహిత్యమే మోక్షము. అది సిద్ధించుటకు వీరు చెప్పు ఉపాయమిది : కర్మలు నాలుగు విధములు. నిత్య, నైమిత్తిక, కామ్య, నిషిద్ధములు.

(1) నిత్యకర్మ అనగా : స్నాన సంధ్యావందనాది కర్మలు. ఇవి చేయక పోయినచో ప్రత్యవాయము కలుగును. చేయుట వలన పుణ్యముగాని పాపముగాని కలుగదు. కనుక దీనిని మోక్షార్థి యగువాడు విడువక చేయవలెను.

(2) నైమిత్తిక కర్మ : ఇది ఆయా నిమిత్తములందు చేయునట్టి కర్మ, అనగా కాలిలో ముల్లు విరిగిన దానిని తీసికొనుట. ఇట్టివి నైమిత్తికములు. వీనిని చేయక పోయినచో బాధ కలుగును. చేయుట వలన పుణ్యముగాని, పాపము గాని సిద్ధించదు. కనుక, మోక్షార్థి వీనిని చేయుట వలన తప్పులేదు.

(3) కామ్యకర్మ : వేదములయందు చెప్పిన యజ్ఞాది కర్మలు "**యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి**" = "జీవించి యున్నంత కాలము అగ్నిహోత్రము చేయుము." ఈ కర్మను ఫలాపేక్షతో చేసిన యెడల పుణ్యము కలుగును. పుణ్యము వలన స్వర్గము సిద్ధించును. స్వర్గానంతరము మరల జన్మించ వలసి వచ్చును. కనుక మోక్షార్థి యగువాడు ఫలాపేక్ష లేక కర్మల నాచరింపవలెను. అట్లాచరించిన పాపముగాని పుణ్యముగాని కలుగదు కనుక, స్వర్గనరకములుగాని, పునర్జన్మగాని దీనివల్ల సిద్ధించదు.

(4) **నిషిద్ధకర్మ** : సురాపానము, పరాంగనా సంగమము మొదలగునవి. ఇవి చేసినచో మరణానంతరము నరకము (నరకమనగా దుఃఖము), అనంతరము హీనయోను లందు జన్మించుట. కనుక మోక్షార్థియగువాడు దీనిని వదలవలెను. దీనిని వదలుటవలన పుణ్యముగాని, పాపముగాని కలుగదు.

ఇట్లు చేసిన కర్తకు పుణ్యాపాపములు లేవు. కనుక స్వర్గనరకములు గాని పునర్జన్మకాని ఉండవు. అదియే మోక్షము - అని వీరందురు, కాని వేదాంతులు దీనికి ఈ క్రింది ఆక్షేపణ చెప్పుదురు :

వేదాంతులు చేసిన విమర్శ

ప్రతి పురుషునకు సంచితకర్మ యెంతయో యుండును. అది అనేకకోట్ల జన్మములయందు ఆర్జింపబడినది. జీవుడు అందు కొంత భాగము గైకొని యీ జన్మము నెత్తుచున్నాడు. ఆ కర్మయే (అట్లు గైకొన బడిన కర్మయే) ప్రారబ్ధము. అది యీ జన్మమున అనుభవించిన నశించును. మీమాంసకులు చెప్పునట్లు ఈ జన్మమున సంచిత కర్మయందు చేరుటకు కొత్తగా ఆర్జించిన కర్మ యేమియు లేక పోవచ్చును గాని, సంచిత కర్మరాశినుండి ప్రారబ్ధరూపమున గైకొనిన కొంత కర్మ పోను, మిగిలియున్న సంచితకర్మ యేవిధముగ నశించునో వీరు చెప్పలేరు. సంచితకర్మ అనేక జన్మలెత్తుటకు చాలినదిగా నుండును. అందు కొంత భాగమే కదా ప్రారబ్ధరూపమున ఈ జన్మమును కలిగించినది, ఇట్టి ప్రారబ్ధరూపమున చేకూరిన కర్మ పోను మిగిలిన సంచితకర్మ యెట్లు నశించును? ఇట్లుండగా మీమాంసకునకు మోక్షమెట్లు సిద్ధించును?

"**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం**" (గీత. 4-19) శుభాశుభ కర్మలు సర్వము జ్ఞానమను అగ్ని చేత దహింపబడు చున్నవి. "**జ్ఞాన నిర్ధూత కల్మషా**" (గీత 5-17) జ్ఞానముచేత పోగొట్టబడిన పాపములు గలవాడు అను నీ వాక్యములు మీమాంసకులు విశ్వసింపరు, మఱియు భగవంతుని శరణుపొందిన సర్వపాపములు నశించునను (గీత 18-66) గీత వాక్యమును సహితము మీమాంసకు లంగీకరింపరు. పై యంశమును విమర్శించుచు సురేశ్వరాచార్యుల వారిట్లు చెప్పిరి :

వాక్య, "న శక్యతే ప్రతిజ్ఞాతుం యావజ్జీవం కామ్యాని ప్రతిషిద్ధాని చ కర్మాణి న కరిష్యామీతి. సునిపుణానామపి సూక్ష్మాపరాధ దర్శనాత్"

(నై.సి. 1-217)

తా॥ ఈ లోకమున గొప్ప పారమార్థికులైన వారు సహితము బ్రతికి యున్నంత వఱకు కామ్య నిషిద్ధ కర్మలు చేయమని ప్రతిజ్ఞ పట్టినను అది నెరవేరదు. ఏలయన, శ్రౌత స్మార్తకర్మలు చేయుచున్నప్పుడు మిక్కిలి సూక్ష్మములగు అశాస్త్రీయ కృత్యములు సంభవించును.

నైమిత్తిక కర్మలు అనగా కాలిలో ముల్లు విరిగిన తీసి కొనుట. వ్యాధి వచ్చినప్పుడు ఔషధ సేవ చేయుట, మొదలగు కర్మలయందు మనకు తెలియక గాని తెలిసిగాని నిషిద్ధకర్మలు చేయుట విధిగా తటస్థింపవచ్చును.

వా॥ ప్రమాణాభావాచ్చ॥ (నై.సి. 1-218)

తా॥ ముముక్షువు కామ్య నిషిద్ధకర్మలు త్యజించిన ముక్తి కలుగునని శ్రుతి స్మృతులలో నెచ్చటను చెప్పి యుండలేదు.

జైమిని మీమాంసామతమును బ్రహ్మసూత్రముల యందు బాదరాయణాచార్యుల వారును, భాష్యమున శ్రీశంకరాచార్యులవారును ఖండించిరి. దాని సారాంశమిట్లుండును:-

సూ॥ "ఫలమత ఉపపత్తేః॥" (బ్ర.సూ. 3-2-38)

తా॥ కర్మ చేయబడిన మరుక్షణముననే నశించు చున్నది. కర్తకు కర్మ చేసిన ఆ క్షణముననే దాని ఫలము అనుభవింపబడుట లేదు. కర్త కాలాంతరమున కర్మ ఫలమును అనుభవించుచున్నాడు. అంతవఱకు కర్మ ఫలమెచ్చట దాగియుండును? దానిని మీమాంసకులు అపూర్వ మనునొకటి కలదని అది కర్మఫలము నొసంగునని చెప్పిరి. అపూర్వము కర్తకు కర్మఫలము నొసంగునని వేదముల యందెచ్చటను చెప్పియుండలేదు. ప్రత్యక్షాది ప్రమాణములచేత గాని అపూర్వము తెలియబడుట లేదు. అయినను "అర్థాపత్తి" అను ఒక ప్రమాణమును

కల్పించిరి. వారు చెప్పునట్టి అపూర్వము అచేతనము. దానికి తారతమ్య జ్ఞానము లేదు. అనగా : కర్త చేసిన యీ కర్మకు ఇట్టి ఫలమాత డనుభవింపవలెను అను జ్ఞానముగాని, ఒకానొక సమయమునందు (జన్మమందు) చేసిన కర్మకు మఱియొక సమయమునందు (ఇంకొక జన్మమందు) ఫలము నివ్వవలెనను వివేకముగాని దానికి లేదు. ఇట్టి కార్యము సర్వజ్ఞుడగు చేతనునికే సాధ్యము. అట్టి చేతనుని సహాయమున అపూర్వము కర్మఫలము నొసంగుచున్న దనినచో - అప్పుడు చేతనుడే కర్మ ఫలము నొసంగుచున్న దనినచో - అప్పుడు చేతనుడే కర్మ ఫలప్రదాతయై యుండ అపూర్వముతో పనియేమి? కనుక సర్వజ్ఞుడగు ఈశ్వరుడే కర్మ ఫలప్రదాత యను వేదాంతుల మతమే సమంజసము. పూర్వమీమాంసకుల మతము సరికాదు.

జిజ్ఞాసువు : కుమారిలభట్టు హిందు (వైదిక) మతమును ఉద్ధరించుటకై అవతరించిన వారని ప్రతీతి కదా? అట్టి వారు వరిపొట్టుతో కాల్చుకొని దుర్మరణము పొందుటేల? వారు చేసిన గురుద్రోహము పోగొట్టుటకు మార్గాంతరము లేదా?

వేదాంతి : కలదు. భట్టుగారు కర్మ సిద్ధాంతులు, జ్ఞానమును గాని, ఉపనిషత్తులను గాని, తుదకు భగవద్గీతనుగాని వారు ప్రమాణముగా గైకొనరు. గీతయందు **"జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం"**. (గీత 4-19) = "జ్ఞానమను అగ్నిచేత దహింప బడిన సకల శుభాశుభ కర్మలుగల పురుషుడు" అనియు; **"జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా"** (గీత. 4-37) = "జ్ఞానమనెడి యగ్ని సమస్తకర్మలను భస్మముగా చేయుచున్నది" అనియును; **"జ్ఞాననిర్ధూత కల్మషా"** (గీత. 5-17) "జ్ఞానముచేత పోగొట్ట బడిన పాపము గలవారు" అనియును గీతావాక్యము లున్నవి. మఱియును

> **"భిద్యతే హృదయ గ్రంథి శ్ఛిద్యంతే సర్వ సంశయా।**
> **క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"**
>
> (ముండకోపనిషత్తు 2-2-8)

అపరావరమును (ప్రత్యగభిన్న పరబ్రహ్మమును) తెలిసికొన్నంతనే హృదయ గ్రంథులు విడిపోవుచున్నవి. సంశయములు నివృత్తి యగుచున్నవి. కర్మలు నశించుచున్నవి. అను శ్రుతివాక్యములయందును వీరికి గౌరవము లేదు. ధర్మశాస్త్రముల యందును పంచమవేదమగు మహాభారతము నందును, ధర్మాచరణము చేత పాపమును నశింపజేయవచ్చునని చెప్పబడినది. మహాభారతము నందలి ఉద్యోగ పర్వమున సనత్సుజాత మహర్షి ధృతరాష్ట్రునకు చేసిన ఉపదేశమునందు-

"ధర్మేణ పాపం ప్రణు దతీహ విద్వాన్
ధర్మో బలీయానితి తస్య విద్ధి." (సనత్సుజాతీయము 2-24)

ధర్మరూపమైన కర్మచేత పాపము నశింపజేయుచున్నాడు. పాపములకంటె ధర్మము బలవత్తర మైనదని తెలియుము.

పైన చెప్పిన శ్లోకమునకు శ్రీ శంకరుల వారు వ్రాసిన భాష్యమునందు-

"పుణ్యేన పాపం వినిహత్య పశ్చా
త్సంజాయతే జ్ఞాన విదీపితాత్మా."

ఈశ్వరార్పిత బుద్ధిచే పుణ్యకర్మ లాచరించిన వాడు పాపములను నశింపజేసిన వాడై, పరిశుద్ధమగు అంతః కరణము గలవాడై (జ్ఞానముచే శుద్ధమైన ఆత్మ కలవాడై) పరమాత్మను పొందుచున్నాడు - అని చెప్పిరి.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥"
(గీత. 18-66)

అని భగవంతుడు శరణాగతిని గుఱించి చాటి చెప్పెను. ఇందువల్ల భట్టుగారు నాస్తికులో, ఆస్తికులో విజ్ఞలోకము తీర్మానింతురు గాక. భట్టుగారు తుషాగ్నిలో మృత్యు ముఖమున నుండగా శ్రీ శంకరులు వారి కడకు పోయి భట్టుగారి శిష్యులవలన జరిగిన సంగతి విని భట్టుగారితో "అయ్యా! నేను మీతో వాదించి మీకర్మ సిద్ధాంతమును ఖండింపదలచి మిమ్ములను వెదుకుచు మీరిచట నుందురని విని

యిచటి కరుదెంచితిని." అని చెప్పగా; భట్టుగారు శంకరుల వారితో నిట్లు చెప్పిరి: "నే నీ స్థితిలో మాటలాడ జాలను. నాశిష్యుడు మండన మిశ్రుడను నతడున్నాడు. అతనితో మీరు వాదింపవచ్చును"- అని చెప్పి దివంగతులైరి. శ్రీశంకరులు మండనమిశ్రునితో వాదించి వాదమున అతని నోడించి అతనిని తమ శిష్యునిగా స్వీకరించి సన్న్యాసము నిచ్చి అతనికి సురేశ్వరాచార్యులని నామకరణము చేసిరి. శంకరుల వారు భరత ఖండమున నెలకొల్పిన నాలుగు మఠములలో ఒకటియగు శృంగేరి మఠమునకు శ్రీ సురేశ్వరాచార్యుల వారిని అధిపతిగా (తమ ప్రతి నిధిగా) చేసిరని చరిత్రవలన తెలియుచున్నది. భట్టుగారు అగ్నిప్రవేశము చేయకపూర్వమే శంకరుల వారితో భట్టుగారికి సమావేశమై యుండిన భట్టుగారును మండన మిశ్రులవలెనే శ్రీ శంకరుల శిష్యులై సన్న్యసించి లోకోపకారము చేసి యుండెడివారు. తుషాగ్నిలో మరణించు దుర్దశ వారికి తప్పియుండెడిది. దైవఘటన మా విధముగా ఉండియున్నందున శిష్యుడైన మండన మిశ్రునకు కలిగియుండిన అదృష్టము భట్టుగారికి లేక పోయినది.

(9) వేదాంతదర్శనము

వేదాంతదర్శనము సమస్తదర్శనములకంటె శ్రేష్ఠమైనది. వేదాంతము లను ప్రశంసించుచు ఒక ప్రాచీన కవి యిట్లు చెప్పియున్నాడు.

శ్లో॥ "తావద్గర్జంతి శాస్త్రాణి జంబుకా విపినే యథా।
న గర్జతి మహాశక్తిః యావద్వేదాంత కేసరీ॥"

తా॥ ఎంత పర్యంతము సింహము గర్జించకుండునో అంత వఱకే అరణ్యమందు నక్కలు కూయుచుండును. సింహగర్జన వినిన వెంటనే జంబుకము లన్నియు కూయుట మానును. ఆ విధముగనే వేదాంత సింహము గర్జించగనే తక్కిన శాస్త్రములను జంబుకము లన్నియు మౌనము వహించును.

వేదాంతశాస్త్రము నిశ్శ్రేయస్సును (శాశ్వత ఫలమును) ప్రసాదించును. కనుకనే దీనికి గౌరవము. వేదాంతమునకు ఉత్తరమీమాంస యనియు,

బ్రహ్మమీమాంస యనియు పేర్లు. మీమాంస యనగా చర్చ. వేదాంతమును తెలియజేయు గ్రంథములు - ప్రస్థాన త్రయము. ఇందులో ఒక ప్రస్థానము ఉపనిషత్తులు. ఇవి సుమారు 200 గలవు. కాని ముక్తికోపనిషత్తు 108 ఉపనిషత్తుల నామములను పేర్కొన్నది. ఇందులో లేని యుపనిషత్తులు ముఖ్యమైనవి కావు. ఏలయన ఉపనిషత్తులను పండితులు గౌరవించుట వలన రాను రాను ప్రతి మతమునకు చెందిన వారును వారి మతములు ఉపనిషత్తులకు సమ్మతమైనవని లోకులను నమ్మించుటకై వారి సంప్రదాయమునకు చెందిన అంశములను పొందుపరచి ఉపనిషత్తులను పేర గ్రంథములు రచియించుచు వచ్చిరి. అందువలన ముక్తికోపనిషత్తు వాటిని పరిశీలించి యోగ్యమైన వాటిని 108 మాత్రము పేర్కొన్నది. అందులోను మొదటి ప్రస్థానము పది ఉపనిషత్తులు. ఇవి చాల ముఖ్యములు. ఇవి : (1) ఈశ (2) కేన (3) కఠ (4) ప్రశ్న (5) ముండక (6) మాండూక్య (7) తైత్తిరీయ (8) ఐతరేయ (9) ఛాందోగ్య (10) బృహదారణ్యకములు - రెండవ ప్రస్థానము భగవద్గీత. మూడవప్రస్థానము బ్రహ్మసూత్రములు. ఈ మూడును చేరి ప్రస్థానత్రయమని అందురు. ప్రస్థానమనగా శాస్త్రము.

దశోపనిషత్తులయందు బ్రహ్మమును, జీవుని, జగత్తును గుఱించిన తత్త్వవిచారము చేయబడినది. అందు విద్యలనబడు ఉపాసనలు కూడ కలవు. అవి సగుణ బ్రహ్మోపాసన లైనను మానవునకు చిత్తశుద్ధిని కలిగించుట ద్వారా శాశ్వతపదమును పొందుటకును, సత్యమును కనుగొనుటకును మార్గమును చూపును. అందు నిర్గుణబ్రహ్మోపాసనలు కూడ గలవు.

భగవద్గీత సర్వోపనిషత్తుల యొక్క సారము. అదియును ఉపనిషత్తని పేర్కొనబడినది. బ్రహ్మవిద్యా ప్రతిపాదక మగునట్టిది. గీత రచియింపబడిన కాలమున భారతదేశమునందున్న ఆధ్యాత్మిక దర్శనము లన్నియును గీతయందు సమన్వయము చేయబడినవని పెద్ద లందురు. గీతాశాస్త్రము వంటి పరిపూర్ణగ్రంథము భూమియం దింతవఱకు పుట్టి యుండలేదని మహాత్ముల అభిప్రాయము.

దశోపనిషత్తులు నిర్గుణ బ్రహ్మవిచారమును, నిర్గుణ బ్రహ్మోపాసనలను అచ్చటచ్చట సగుణ విద్యలను (ఉపాసనలను) చెప్పియున్నను అవి మానవునకు పూర్ణముగ తృప్తి నొసంగజాలవని తలచబడెను. ఏలయన - సర్వశక్తియుతుడును, సర్వజ్ఞుడును, ఆశ్రితజన కల్పవృక్ష మనదగిన సర్వేశ్వరు డొకడు ఉపాసనకొఱకు మానవకోటికి అవసరమై యున్నాడు. "నీవు నన్ను శరణుబొందుము. నిన్ను సర్వపాపములనుండి ముక్తుని గావించెదను. దుఃఖింపకుము." అని అభయహస్తమును చూపు పురుషోత్తముడు ప్రథమమున గీతయందే మనకు కనబడుచున్నాడు. అంతటితో భగవద్గీత పూర్ణ గ్రంథమైనది. ఉపనిషత్తులయందు గల ఈ లోపమును భగవంతుడగు కృష్ణద్వైపాయన మునీంద్రుడు గీతను రచియించుటచే తీర్చెను.

భిన్నభిన్నములగు ఉపనిషత్తులు భిన్నభిన్న కాలముల యందు పుట్టినవై (లేదా వారిచేత గానము చేయబడినవై) భిన్నాభిప్రాయములకు అవకాశ మిచ్చునవిగా నున్నవి. అనగా - ఒక శ్రుతియందు జీవుడు పరబ్రహ్మమున కంటె భిన్నుడనియు, మఱియొక శ్రుతియందు అభిన్నుడనియు - ఇట్లు పరస్పర భిన్న మతములను తెలుపుచున్నట్లు కనబడుచున్నవి. శ్రుతులు ఈశ్వర వచనము లనియు, లేదా, పరమేశ్వర తత్త్వము నెఱిగిన ఋషులకు అతీంద్రియ జ్ఞానముచే స్ఫురించిన వనియు నమ్మియున్న వారికి భిన్న భిన్న శ్రుతులయందు భిన్న భిన్నములుగా తోచుచున్న మతములయందు నేది గ్రహ్యము, ఏది అగ్రాహ్యము అను ప్రశ్న కలుగుచున్నది. ఋషులందఱు బ్రహ్మజ్ఞులే కనుక వారేకాలమునకు ఏ దేశమునకు చెందిన వారైనను వారి అనుభవము ఒక్కరీతిగనే యుండవలయు ననియు, వారందఱు ఏకాభిప్రాయమునే వెలిబుచ్చియుందు రనియు మన నమ్మకము.

కాని శ్రుతుల యందలి పరస్పర విరోధ వాక్యములకు సమన్వయ మెట్లు? వీటికి ఏకవాక్యత (ఒకటే తాత్పర్యమని) సాధించుట యెట్లు? ఇది సామాన్యమైన కార్యము కాదు. సర్వోపనిషత్తుల సారమును చక్కగా నెఱిగినట్టియు, బ్రహ్మనుభవము కలిగి నట్టియు, మహాపండితు డైనట్టియు

ఒక మహావ్యక్తికి మాత్రమే యిది సాధ్యము. అంతమాత్రమే కాక ఉపనిషద్వాక్యములకు ఏక వాక్యత ఘటించుచు వాటిని సూత్రములుగా రచియించుట యన్న మఱియు దుర్ఘటమైన కార్యము. దీనిని బాదరాయణాచార్యులవారు సాధించిరి. గీతయందు,

శ్లో॥ ఋషిభిర్బహుధా గీతం ఛందోభి ర్వివిధైః పృథక్।
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతు మద్భి ర్వినిశ్చితైః॥ (గీత. 13-5)

తా॥ తత్త్వస్వరూపము భిన్నభిన్న ఋషులచేత భిన్నభిన్న శ్రుతులయందు విభిన్న రీతులుగ చెప్పబడినట్లు కనబడుచున్నది. వీటియందలి పరస్పర భిన్నములగు విషయములు హేతువంతములును నిశ్చయాత్మకములును నగు బ్రహ్మసూత్రములచేత సమన్వయము చేయబడెను.

ఇచట బ్రహ్మసూత్ర పదమునకు బాదరాయణకృత బ్రహ్మసూత్ర గ్రంథమని శ్రీ రామానుజాచార్యాదులగు కొందఱు భాష్యకారులు వ్రాసిరి. "బ్రహ్మ సూత్రము"ల యందున్న **"స్మృతేశ్చ"** (బ్ర.సూ. 1-2-6), **"అని చ స్మర్యతే"** (బ్ర.సూ. 2-3-4-5) మొదలగు కొన్ని సూత్రములకు అచట భగవద్గీత ఉదాహరింపబడినట్లు వ్రాసిరి. ఇట్లు వ్రాయుటవలన భగవద్గీత రచియింపబడి నట్లు వ్రాసిరి. ఇట్లు వ్రాయుటవలన భగవద్గీత రచియింపబడిన తరువాత బ్రహ్మసూత్రములు వ్రాయబడినవా? లేక బ్రహ్మసూత్ర రచనానంతరము గీత వ్రాయబడినదా? అను ప్రశ్న కలుగుచున్నది. శ్రీ శంకరులవారు ఈ చిక్కు కలుగునని **'స్మృతేశ్చ'** (బ్ర.సూ. 1-2-6) అను సూత్రమునకు 'భగవద్గీత' అని వ్రాసి గీతయందలి పై శ్లోకమునందు చెప్పిన "బ్రహ్మసూత్రపదైశ్చైవ "పరబ్రహ్మము బోధించు సూక్తులని" అని చెప్పి యీ చిక్కులో పడకుండ తప్పించుకొనిరి. శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ గారు గీతారహస్యమందలి పరిశిష్ట ప్రకరణమునందు "గీతలు - బ్రహ్మసూత్రములు" అను విషయము చర్చించుచు ఈ పైశ్లోకము బాదరాయణుల బ్రహ్మసూత్రానంతరము గీతయందు చేర్చియుందు రనియు ఆ కారణమున గీతయందలి పై

శ్లోకమునందున్న "బ్రహ్మసూత్ర పదై శ్చైవ" అను వాక్యమునకు బాదరాయణాచార్య కృత బ్రహ్మసూత్రము లనియే అర్థము చెప్పవలె ననియు అభిప్రాయపడిరి.*

శ్రీకృష్ణద్వైపాయన మునీంద్రులును, బాదరాయణాచార్యులవారును భిన్న వ్యక్తులు. బాదరాయణాచార్యులవారి కంటె పూర్వమే ఉపనిషద్వాక్యములకు సమన్వయము చేయవలయునను ప్రయత్నము బహుశః జరిగియుండ వచ్చును. బ్రహ్మసూత్ర గ్రంథమందు ఆశ్మరథ్య, కాశకృత్స్న, ఔడులోమి, బాదరిమతములను బాదరాయణాచార్యులవారు పేర్కొని యున్నారు. ఈ బ్రహ్మసూత్రములనే వేదాంత సూత్రము లనియు, శారీరక మీమాంసా సూత్రము లనియు, పిలుతురు. వేదాంత గ్రంథములయందు దీనికి గల గౌరవము అపారము. ఈ గ్రంథమున వేదాంత దర్శనమునందు దోషములు చూపిన అన్య (దర్శన) మతముల వారికి తగు సమాధాన మొసగి యుండుటే గాక అన్యమతముల యందలి వేద విరుద్ధములగు అంశములు సహేతుకముగ ఖండింపబడినవి.

ప్రస్థాన త్రయమందు చెప్పబడిన విషయమే వేదాంతము. ప్రస్థాన త్రయమునకు విరుద్ధమైన మతము వేదాంతము కాదు. అది వేద బాహ్యము. ఈ విధమగు అభిప్రాయము (ఒక పద్ధతి) భారత దేశమునందు స్థిరపడినందున తమ మతము వేదాంతమని చెప్పగోరువారు ప్రతిమతకర్తయును తాను చెప్పునట్టి సిద్ధాంతము ప్రస్థాన త్రయమునకు

---

* శ్రీ లోకమాన్య తిలక్ మహాశయులు ఈ యంశమున వారి యభిప్రాయ మిట్లు చెప్పిరి. "మహాభారత గ్రంథ మతి విస్తీర్ణమగుటచే బాదరాయణులయొక్క సమయమునను దానిలోనున్న కొన్ని భాగములు లుప్తములుగాని, విస్థలితములు గానివి యై యుండవచ్చును. కావున నాకాలమందు లభించిన మహాభారతముయొక్క భాగములను శోధించి యెక్కడెక్కడ గ్రంథము సందేహముగ నుండునట్లుగాని, లేక యపరిశుద్ధమని కాని లేక యపూర్ణమని కాని గాన్పించినదో, యక్కడక్కడ నెల్ల దానిని శుద్ధముగా గాని, పూర్ణముగ గాని చేసి యనుక్రమణికలు మొదలైనవన్నియు గూర్చి బాదరాయణాచార్యులు వారీగ్రంథమును పునరుజ్జీవితముగ జేసినారని, కాని లేక దానిని ప్రకృత స్వరూపముతో వ్రాసినారని కాని మా యభిప్రాయము." (గీ.ర.పుట. 735)

సమ్మతమని నిరూపించవలసి వచ్చినది. అట్లగుటచే శ్రీశంకరులవారు తమ అద్వైతమే ప్రస్థానత్రయమందు చెప్ప బడినదని నిరూపించుచు ప్రస్థానత్రయమునకు అద్వైత పర్యాయములగు భాష్యములను రచియించిరి. విశిష్టాద్వైతమత సంప్రదాయ ప్రవర్తకులగు శ్రీ రామానుజాచార్యులవారు, ఉపనిషత్తులను విడిచి భగవద్గీతకు, బ్రహ్మసూత్రములకు భాష్యమును రచించిరి. కాని శ్రీమద్రామానుజుల అనంతరము వారి శిష్యపరంపరకు చెందిన శ్రీమాన్ రంగరామానుజుల వారు ఉపనిషత్తులకు మాత్రము భాష్యములను రచియించిరి. ద్వైతమతాచార్యులగు శ్రీమధ్వాచార్యుల వారును తమ మతమే ప్రస్థాన త్రయమునకు సమ్మతము అని ప్రస్థాన త్రయము పై తమ మతానుకూలములగు భాష్యములు రచియించిరి. శ్రీశంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వస్వాములను ఆచార్యత్రయ మందురు. త్రిమతాచార్యు లనియు, భాష్యకారులనియు పిలుతురు.

త్రిమతాచార్యులు గాక వీరి అనంతరము వచ్చిన ఆచార్యులందఱు కూడ అదేవిధముగ తమ తమ మతములె ప్రస్థాన త్రయమునకు సమ్మతము లైనవని నిరూపించుటకై భాష్యములు రచియించిరి. వీరిలో కొందఱు దశోపనిషత్తులకు మాత్రమే భాష్యములను రచియించిరి. ఇట్లు భాష్యము వ్రాసిన వారందఱు దర్శనాచార్యులు, మతాచార్యులని పేరొందిరి. శ్రీశంకరాచార్యుల వారిని వదలిన శ్రీరామానుజ, శ్రీమధ్వ, శ్రీనింబార్క, శ్రీవల్లభ, శ్రీకృష్ణచైతన్యులు - వీరైదుగురును వైష్ణవ మతమునకు చెందిన వారు, వీరిలో శ్రీ రామానుజాచార్యులవారు తక్కిన వారికి చాలవఱకు మార్గదర్శకులని చెప్పవచ్చును. వైష్ణవ మతములయందు వీరందరికి ఆమోద యోగ్యములగు తాత్త్వికాంశములు కొన్ని గలవు. వీరిలో పరస్పర భేదము చాల స్వల్పము. శ్రీరామానుజ శ్రీమధ్వాచార్యు లిరువురును వైకుంఠవాసి యగు శ్రీమన్నారాయణుడు పరతత్త్వ మనియు, ఆయన శక్తియే ఆయన భార్యయగు లక్ష్మియని చెప్పుదురు. తక్కిన ఆచార్యులు ముప్వురు శ్రీకృష్ణుడు పరతత్త్వ మనియు, ఆయన భార్యయగు రాధ ఆయన శక్తి యనియు చెప్పుదురు.

పైన చెప్పిన వారు గాక శివాద్వైతులగు నీలకంఠాచార్యులవారును, శివ విశిష్టాద్వైతులగు శ్రీపతి పండితులును బ్రహ్మసూత్రములకు

భాష్యములు రచియించిరి. వీరును, శ్రీ బసవేశ్వరులును శివుడు పరతత్త్వ మనియు, ఆయన భార్యయగు పార్వతి ఆయన శక్తి యనియు చెప్పుదురు.

శ్రీభాస్కరాచార్యులు, శ్రీవిజ్ఞానభిక్షువు - వీరిరువురు భేదాభేద వాదులు. వీరిరువురు బ్రహ్మసూత్రములకు భాష్యములు రచియించిరి.

బ్రహ్మసూత్రములకు, భగవద్గీతకు భాష్యము రచియించిన వారు అనేకులు గలరు.

బ్రహ్మసూత్రములకు శాంకరభాష్యమునకు పూర్వమే కొన్ని భాష్యము లుండినవి. మధ్వాచార్యులవారి భాష్యమునకు పూర్వము ఇరువది యొక్క భాష్యము లుండినట్లున్నది. అటుపిమ్మట నెన్నియో భాష్యములు, వ్యాఖ్యానములు రచియింపబడినవి. తమ మతము వేదాంతమతమని చెప్పుకొను సమర్థులగు పండితులు "బ్రహ్మసూత్రములు" తమ మతమునే ప్రతిపాదించుచున్నదని ప్రపంచమునకు నిరూపింప దలచిరని బోధపడుచున్నది.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ప్రస్థానత్రయమునకు ఆంగ్ల భాషయందు భాష్యమును రచియించి దర్శనాచార్యులను ఖ్యాతిని పొందియున్నారు. వీరి దర్శనమును "రాధాకృష్ణ దర్శన" మని యందురు.

మహాత్మాగాంధి, శ్రీఅరవిందయోగి, శ్రీరవీంద్రమహాకవి, శ్రీవినోబాభావే గార్లను సహితము దర్శనాచార్యులని చెప్పుదురు. వీరు కర్మ యోగులు, కాని వీరిలో నెవ్వరును ప్రస్థాన త్రయమునకు భాష్యము రచించియుండ లేదు. శాస్త్రోక్తముగా చెప్పవలయునన్న ప్రస్థాన త్రయమునకు భాష్యము వ్రాసిన వారే దార్శనికులని ప్రతీతి. మహాయోగి పుంగవులగు అరవిందులు వారి జీవిత కాలమందు నెక్కువ భాగము ఆధ్యాత్మికానుభవమునందు (యోగమునందు) గడపినవారు. గీతకు భాష్యమును, మఱికొన్ని గ్రంథములును రచియించిరి. శ్రీఆనంద కుమార స్వామిగారును, శ్రీభగవాన్ దాసుగారును పెక్కు వేదాంత గ్రంథములను ఆంగ్ల భాషయందు రచియించిరి. తక్కిన వారు కర్మయోగులు. సురేంద్రనాథ దాసగుప్తగారు సమగ్ర భారతీయ చరిత్రమును వ్రాసిరి.

ప్రస్థాన త్రయమునకు స్వతంత్రభాష్యము వ్రాయుట సామాన్యకార్యము కాదు. దీనికి రమణ మహర్షులవలె కేవల ఆధ్యాత్మికానుభవ ముండిన చాలదు. పూర్ణానుభవము లేక పోయినను మహాపండితుడు గొప్ప ప్రతిభాశాలియై వైదిక విజ్ఞానమును సంపూర్ణముగ ఆకళించుకొన్న వారుగను ఉండవలయును.

జిజ్ఞాసువు : శ్రీశంకర, శ్రీరామానుజాదులగు ఆచార్యులు తమ మతమే వేదాంతమని అందురు గదా? పరస్పర విరుద్ధములగు మతము లన్నియు వేదాంతము లెట్లగును? అందులో ఏదియో ఒకటి మాత్రమే వేదాంతము కావలయును గదా?

వేదాంతి : ఇది సరియైన ప్రశ్నయే. వేదాంతుల ప్రతిపక్షులగు ఇదివఱలో నేను చెప్పిన న్యాయదర్శనాది దర్శనకారులు తమ దర్శనము లైదింటియందును వేదాంతమతమును నిరసించిరి. బాదరాయణాచార్యుల వారు బ్రహ్మసూత్రముల యందలి రెండవ, మూడవ అధ్యాయములయందు న్యాయదర్శనాదులను ఖండించిరి. వేదాంత దర్శనమునకు వేదాంత సూత్రములు (బ్రహ్మసూత్రములు) రచియింప బడినట్లే; తక్కిన దర్శనములకు ఆయా దర్శన కారులచే ఆయా సూత్రములు రచియింపబడినవను విషయము నీ వెఱిగినదే. ఆయా సూత్రకారులు తమ దర్శనముకంటె భిన్నమగు నితర దర్శనములను వారి సూత్ర గ్రంథములయందు ముఖ్యముగా వేదాంతదర్శనమును (బాదరాయణ కృత బ్రహ్మసూత్రములను) ఖండించిరి. ఖండనముకొఱకు వారి సూత్ర గ్రంథములయందు వేదాంత మిట్టిదని అనువదించిరి. అట్లు అనువదింపబడిన వేదాంతము శ్రీశంకరాద్వైతమే. కనుక ఆయా దర్శనకారుల మతము ననుసరించి వేదాంతమనగా అద్వైతమే అని తెలియుచున్నది. అద్వైతులకు ప్రతిపక్షులగువారే అద్వైతము వేదాంతమని అంగీకరించి యున్నందున శ్రీబాదరాయణకృత బ్రహ్మసూత్రములయందు ప్రతిపాదింపబడిన మతము అద్వైతమే యనియు, అదియే వేదాంతమనియు తక్కిన విశిష్టాద్వైతాది మతములు వేదాంతములు కావనియు, అద్వైతుల వాదము.

లోకమునందు సహితము వేదాంతమనగా : అద్వైతమే అని సామాన్యముగ అర్థము చేసికొందురు. 'నూనె' అనునప్పుడు నువ్వులనుండి తీసినదే నూనె, ఇతరములగు వేరుశనగ, వేప, కానుగ, కుసుమ మొదలగు విత్తులనుండి తీసిన తైలములను వేరుసెనగనూనె, వేపనూనె, కానగనూనె, కుసుమనూనె అని ఆ నూనె యే విత్తనములనుండి తీయబడునో ఆవిత్తుల నామముతో చేర్చి చెప్పుదురు. అట్లే పాలు అన్నప్పుడు ఆపదము ఆవుపాలకే వర్తించును. గేదె, ఒంటె, మేక - మొదలగు జంతువులనుండి పిదికిన పాలను గేదెపాలు, ఒంటెపాలు, మేక పాలు అని ఆయా జంతువుల నామములతో చేర్చి వాడుదురు. అట్లే వేదాంతమన్న శంకరాచార్యుల వారి అద్వైతమనియే అర్థము చేసికొందురు. కాని తక్కినవి వేదాంతములు కావని నా భావము కాదు. వాటిని కేవల వేదాంతశబ్దముచే వాడక "విశిష్టాద్వైత వేదాంతము", "ద్వైతవేదాంతము" అని వ్యవహరింప వచ్చును.

శ్రీమద్రామానుజాదుల మతమే వేదాంతమని బ్రహ్మసూత్రములకు వారి వారి మతానుసారమగు భాష్యములు రచియించినందున, అవియు వేదాంతమను మహావృక్షము యొక్క వేఱువేఱు శాఖలని అంగీకరించినందు వలన వచ్చిన నష్టమేమియు లేదు. అద్వైత విశిష్టాద్వైత దర్శనములను గుఱించి యిదివఱలో చెప్పి యుంటిని.*

జిజ్ఞాసువు:- ఐనను మరల తమవలన సంగ్రహముగ వినవలెనని కుతూహల మున్నది అనుగ్రహించి ఆనతిండు.

(10) అద్వైతము (వేదాంతము)

వేదాంతి : అద్వైతమనగా రెండు కానిది. భేద నిరసనమే అద్వైతశబ్దమందలి భావము. అద్వైతము ఏకత్వవాదము కాదు. ఏకత్వ వాదమనగా - కార్యము కారణము ఒక్కటే యని చెప్పుట. శ్రీ జ్ఞానేశ్వరుల మతమువంటిది. బ్రహ్మమే జగద్రూపమున పరిణమించె ననుట. ఇందులో మాయయొక్క ప్రసక్తి లేదు. ఇదియే ఏకత్వవాదము.

* ఈ గ్రంథము ప్రథమభాగమున అద్వైతమును, ద్వితీయ బాగమున విశిష్టాద్వైతమును చెప్పితిని.

వేదాంతులు ఉపనిషత్తులను ఈశ్వరవచనములుగా గౌరవింతురు. శ్రుతులు, ఆత్మ - పరబ్రహ్మశబ్దములు సమానార్థములుగా (పర్యాయ శబ్దములుగ) చెప్పినవి. అతీంద్రియ జ్ఞానులగు ఋషులు శ్రుతులను వినిరి. లేదా, అందలి అర్థమును తెలిసికొనిరి. బ్రహ్మాండము (ప్రపంచము) సూక్ష్మముగ పిండ (శరీర) రూపమున నున్నదని తెలిసికొనిరి. ప్రపంచము నందును, ప్రపంచమునకంటె వెలుపలను నే సత్య పదార్థమున్నదో అదియే పరబ్రహ్మమనియు, అదియే శరీరమునందున్న ఆత్మయనియు తెలిసికొని, ప్రపంచము శరీరము - అను నీ రెండును వికారము లగుట వలన నివి నిత్యములు కావని పరబ్రహ్మము (ఆత్మ) ఒక్కటే నిత్యమని తెలిసికొని **"సర్వం ఖల్విదం బ్రహ్మ", "నేహ నానాస్తి కించన"** అంతయు బ్రహ్మమే కొంచెమైనను వేఱు లేదు అని సిద్ధాంతము చేసిరి.

పరబ్రహ్మము ప్రత్యక్ష అనుమాన ప్రమాణములచేత తెలియబడదు. కాని శబ్దము (ఆప్తవాక్యము) వలన అవిద్య తొలగి బ్రహ్మపరోక్షజ్ఞానము కలుగుచున్నది. కనుక శబ్ద ప్రమాణముచే (శ్రుతి వాక్యములచే) బ్రహ్మము తెలియబడునని చెప్పిరి. ప్రపంచమునందు గల గ్రంథములలో వేదములు శ్రేష్ఠమయినవి. వేదములయందు ఉపనిషత్తులు శ్రేష్ఠములు. అందు దశోపనిషత్తులు శ్రేష్ఠతరములు. అందు మహావాక్యములు శ్రేష్ఠతమములు. అవి "**తత్త్వమసి**" మొదలగునవి.* మహావాక్యములు ఆత్మ - బ్రహ్మలకు అభేదము చెప్పును.

తత్త్వమసి (తత్+త్వం+అసి) = అది నీవై యున్నావు. (అదియే నీవు) అని దాని యర్థము. ఇందులో 'త్వం' శబ్దార్థమును గుఱించి విచారింతము. "త్వమ్" అనగా : నీవు లోకమునందు "నేను" అని చెప్పునప్పుడు దేని నుద్దేశించి "నేను" అని చెప్పుచున్నావో దానినే యెదుటి వానియందు "నీవు" అని చెప్పుచున్నావు. ఆ "నీవు" ఎవరు? అనునదే "త్వమ్" శబ్దవిచారము.

---

* ఈ గ్రంథము ప్రథమ భాగమునందలి రెండవ ప్రకరణమున 42 తత్త్వమసి మహావాక్య విచారము, 43 మహా వాక్య విచారము - అను రెండు అధ్యాయముల యందు ఈ యంశము విపులముగ చర్చించి యున్నాను.

'నీవు' అనునది ఏకవచనము. 'నీవనగా' శరీరమా? శరీరము కాదు. ఏలయన శరీరము అనేక పదార్థముల సముదాయము. అందులో సప్తధాతువులు కలవు. వాటిలో నీ వేదియు కాదు. అన్నియు కలిసిన సమష్టిరూపము నీవు కాదు. 'ఇది గోడ' , 'ఇది గ్రంథము' అని నీవు వాటిని ఎట్లు తెలిసి కొనుచున్నావో, అట్లె నీ శరీరమును కూడ తెలిసికొను చున్నావు. గోడ, గ్రంథము - అనునవి నీ వెట్లు కాదో అట్లె నీ శరీరము సహితము నీవు కావు. నేత్రాది ఇంద్రియములు రూపాదులను గ్రహించుచున్నవి, అట్టి యింద్రియములు సహితము నీవు కావు. ఏలయన? అవి అనేకములు, నీవు ఏకము. ఇంద్రియములు స్వతంత్రముగ వాటి కార్యములను చేయలేవు. వాటికి శక్తి ఇచ్చునది వేఱొకటి కలదని స్వానుభవమువలన విదిత మగుచున్నది. అవి గాఢనిద్రయందు లేవు. నీ వున్నావు. కనుక ఇంద్రియములు నీవు కావు. ప్రాణము నీవా? అనిన దానికి జ్ఞానము లేదు కనుక అది నీవు కావు. అంతఃకరణము (మనో బుద్ధి చిత్త అహంకారములు) నీవా? అనిన అది సుషుప్తి యందు కనబడదు. అప్పుడును నీ వున్నావు. కనుక అంతఃకరణము నీవు కావు.

అయితే నీ వెవరు? ఇవి అన్నియు తెలిసికొనుచు వీటి వ్యాపారము లకు సాక్షియై యున్నవాడవే నీవు. నీవు నిన్నను, నేడును ఒక్క రీతిగానే యున్నావు. రేపును ఇట్లే ఉండగలవు. శరీరమువలె నీవు పుట్టిన వాడవు కావు. మాతృగర్భముననుండి బయట పడినప్పుడు శరీరము జేనెడు, బెత్తెడు మాత్రమే యుండును. క్రమక్రమముగ పెరిగి పెద్దది యగును. పుట్టి నప్పుడు శరీరమున లేని దంతములు, మీసములు మొదలగునవి తరువాత కలుగుచున్నవి. అవి కాలక్రమమున కలుగుచు తుదకు వార్ధక్యమున కేశములు పలితములై, పండ్లూడిపోయి శరీరము చిక్కి ముడుతలు పడును. ఇట్టి మార్పునే వేదాంత పరిభాషయందు 'వికారము' లందురు.

నీకు నెప్పటికిని వికారము .లేదు. బాల్యమునందున్న నీవే యౌవనమునందును, వార్ధక్యమునందును మార్పు లేక యున్నావు. పుట్టిన ఏ పదార్థమున కైనను తెలిసికొను శక్తి లేదు. (జ్ఞానము లేదు). కనుక

సర్వమును తెలిసికొను సాక్షి అగు నీవు ఒకప్పుడును పుట్టిన వాడవు కావు. పుట్టుక లేదు. కనుక పెరుగుట లేదు. పెరుగుట లేదు గనుక నాశనము కూడ లేనివాడవే. చావు పుట్టుకలు లేని వానికి పెరుగుట మొదలగు వికారములు (మార్పులు) లేవు. సారాంశ మేమనగా - నీవు వికారరహితుడవు. కనుక నీ స్వరూపము త్రికాలాబాధితమగు సత్యమే. సత్య మగునదే జ్ఞానము, సత్యజ్ఞాన స్వరూపుడవై నిర్వికారుడ వగుట వలన ఆనందరూపుడవే నీవు. సారాంశ మేమన నీవు సత్య జ్ఞానానంద స్వరూపుడవు - అనునది యే 'త్వం' శబ్దార్థ విచారము.

తత్ శబ్ద విచారము : తత్ అనగా అది. తత్ అనగా శ్రుతులయందు చెప్పబడిన "విజ్ఞాన ఘన ఏవ" అది దట్టమగు జ్ఞానము. లేక జ్ఞానమే స్వరూపముగా గలది - అను మొదలగు వాక్యములు, శ్రుతులు పరబ్రహ్మమున కే లక్షణములు చెప్పినవో అవి అన్నియు త్వం శబ్దవాచ్యుడగు నీకు కలవు.

'అసి' శబ్దవిచారము : 'తత్త్వమసి' మహావాక్యము లోని అసి అను పదమునకు 'అయి ఉన్నావు' లేక "అదియే నీవు" అని యర్థము; అనగా: శ్రుతులు నిత్య సత్యమగు ఏ పరబ్రహ్మమును బోధించినవో ఆ పరబ్రహ్మమే నీవై యున్నావు అని తాత్పర్యము.

ఈ విధముగ తత్త్వమసి శబ్దార్థవిచారముచేత నేను ఈ శరీరాదులలో ఏదియు కానని, పరబ్రహ్మమే నేనని ఆత్మ పరమాత్మల తాదాత్మ్యముచే **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** ఇది అంతయు బ్రహ్మమే **'నేహ నానాస్తి కించన'** = ఇంకేదియును లేదు అను దృఢనిశ్చయము కలుగ లేదు. అంతయు బ్రహ్మమే యైనయెడల కనబడు ప్రపంచము మాట ఏమిటి? నామరూపములు గల ఈ నానాత్వము ఎట్లు కలిగెను? అను నది ప్రశ్న.

ఇందుకు సమాధానము - పరబ్రహ్మమునందు పరబ్రహ్మమునకంటె వేఱుగాని, వేఱు కాదనిగాని, ఉన్నదని గాని, లేదనిగాని చెప్పుటకు వీలులేక (అనిర్వచనీయ మగు) మాయ గలదు. ఏవిధమునను ఇట్టిదని

చెప్పుటకు వీలు లేనందున మాయను అనిర్వచనీయ మనిరి. మాయ యందు త్రిగుణములు (సత్త్వరజస్తమోగుణములు) కలవు. శుద్ధమైన సత్త్వగుణము వృద్ధిలో ఉన్నప్పుడు మాయకు 'మాయ' యనియే పేరు. సత్త్వగుణము కొంత శుద్ధతను కోల్పోయి నప్పుడు అవిద్యయను నామముచే పిలిచిరి. మాయయొక్క ఈ ద్వివిధ భేదములను తెలిసికొనుటకు గాను రెండు నామముల నుపయోగించిరి. కాని ప్రాచీన వేదాంతగ్రంథముల యందు మాయ, అవిద్య, అజ్ఞానశబ్దములను పర్యాయపదములుగనే ఉపయోగించిరి.

మాయ కధిష్ఠానము (ఆధారము) బ్రహ్మము. మాయయొక్క పై రెండువిధములయందు మొదటిది విక్షేపశక్తితో కూడినది. ఇందు ఆవరణమను అజ్ఞానము లేనందున దీనిని విద్య యందురు. రెండవదియగు అవిద్య విక్షేప, ఆవరణ శక్తులతో కూడినది. ఇట్లు విద్యావిద్యలను నామములు ఒక్క మాయకే పర్యాయపదము లైనవి.

(1) మాయయందు ప్రతిఫలించిన పరబ్రహ్మము యొక్క ప్రతిబింబము (2) మాయ, (3) మాయ కధిష్ఠాన మగు బ్రహ్మము- ఇవి మూడును కలసి ఈశ్వరు డనబడును. ఆవరణ రహితు డగుటవలన ఈశ్వరుడు సర్వజ్ఞుడు. (1) అవిద్య యందు ప్రతిఫలించిన పరబ్రహ్మ ప్రతిబింబము, (2) అవిద్య, (3) వీటి కాధారమగు (అధిష్ఠానమగు) బ్రహ్మము - ఈ మూడును కలిసి జీవుడని పిలువ బడును. మాయా విద్యలను ఉపాధులవలన పరబ్రహ్మమే ఈశ్వర, జీవ భావములతో తోచుచున్నది. ఈశ్వరునియందు ఆవరణ శక్తి లేనందున ఆయనకు అజ్ఞానము లేదు. విక్షేపశక్తి కలదు గనుక నేనే నానారూపములును పొందుదును గాక అని సంకల్పించుకొని జగద్రూపు డగుచున్నాడు. విక్షేప ఆవరణ శక్తులు రెండును గల అవిద్యోపాధికుడు అగు జీవుడు తాను పరబ్రహ్మమని తెలిసికొనలేక మోహము నొందుటయే గాక పరబ్రహ్మము నందు లేని ప్రపంచమును ఉన్నట్లు చూచుచున్నాడు.

అనగా : పరబ్రహ్మమునే ప్రపంచరూపమున చూచుచున్నాడు. పరబ్రహ్మము- ప్రపంచము అను రెండు కలవనుట భ్రాంతి మాత్రమే

యని బోధించుటకు రెండు కాదు, ఉన్నది ఒక్క బ్రహ్మమే అని తెలియజేయు "అద్వైత" మను సార్థక నామ మీ మతమునకు కలిగినది. మసక చీకటిలో త్రాటిని చూచి సర్పమని భ్రమింతుము. ఎండలో ముత్యపు చిప్పను చూచి వెండియని భ్రమించుచున్నాము. త్రాడు, పాము అను రెండు పదార్థములు లేవు. ఉన్నది ఒక్కటే. కనుకనే ఒకటి కనబడినపుడు మఱియొకటి కనబడదు. బ్రహ్మమునే భ్రాంతివశమున నానావిధ నామరూపములతో చూచుచున్నాము. ఇట్టి భ్రాంతి నశించుటకు ముముక్షువు ఈ క్రింది విధముగ కృషి చేయవలయును.

సాధనచతుష్టయశక్తి గల ముముక్షువు బ్రహ్మజ్ఞానియైన గురువును చేరి ఆయన దయకు పాత్రుడై వేదాంత శ్రవణము చేయవలయును. శ్రవణమువలన మననము, దానివలన నిదిధ్యాసయు కలుగును. నేను పైన చెప్పిన రీతీగా "ఇది ఆత్మ కాదు", "ఇది ఆత్మకాదు" అని అనాత్మను త్రోసి వేసి ఆత్మ నెఱుంగ వలయును. ఆత్మానాత్మ విచారమువలన అవిద్య నశించి సంయక్ జ్ఞానము కలుగును. తత్త్వమస్యాది మహావాక్య శ్రవణమువలన తానే బ్రహ్మ మని తనకంటె అన్యమేమియు లేదని బ్రహ్మత్మైక్యబోధ కలుగును. దీనినే తత్త్వజ్ఞాన మందురు. అంతటితో అట్టివానికి సంసారము నశించును. సంసారము నశించుననగా తిరిగి జన్మింపడు.

ఆత్మానాత్మ వివేకము అవిద్యను నశింప జేసి ఆత్మ స్వరూప నిరూపణము చేయగలుగునే కాని ఆత్మయే పరబ్రహ్మమను జ్ఞానమును కలిగింపనేరదు. ఆ కార్యము "తత్త్వమసి" మహావాక్యార్థ శ్రవణమువలననే కలుగును. ఇదియే "తత్త్వమసి" మహావాక్య శ్రవణములవలన కలుగు ఫలము. ఇట్లే **"అయమాత్మా బ్రహ్మ"** = ఈ ఆత్మయే బ్రహ్మము, **"ప్రజ్ఞానం బ్రహ్మ"** = తెలిసికొనుచున్న సాక్షియగు జ్ఞానమే పరబ్రహ్మము, **"అహం బ్రహ్మాస్మి"** = నేను బ్రహ్మమే అయియున్నాను - అను మహావాక్యముల అర్థము జీవాత్మ పరమాత్మలకు ఐక్యమును బోధించుచున్నది. ఇది శ్రీ శంకరుల వారి అద్వైతము.

శంకరులవారి అనంతరము అద్వైత సిద్ధాంతమునందు మార్పులు కలిగినవి. అవి కొంతవఱకు అద్వైతేతరుల ఆక్షేపణలకు సమాధానములు గను, అద్వైతమునకు బలము చేకూర్చు విధముగను ఉన్నవని పెద్దలందురు. శ్రీ శంకరుల వారి శిష్యులలో ఒకరగు శ్రీ పద్మ పాదాచార్యులు శంకరుల వారి బ్రహ్మసూత్ర భాష్యమునందలి మొదటి ఐదు సూత్రముల భాష్యమునకు "పంచపాధిక" అను పేర విపులమగు వ్యాఖ్యానమును రచియించిరి. 13వ శతాబ్దపు పూర్వ భాగమున నుండిన ప్రకాశాత్ములను వారు "పంచ పాధిక" కు "పంచ పాధికా వివరణ"మను విపుల వ్యాఖ్యానమును పొందుపరచిరి.

9వ శతాబ్దమున వాచస్పతి మిశ్రులనువారు శంకరుల బ్రహ్మసూత్ర భాష్యమునకు "భామతి" అను విపులమైన టీకను రచియించిరి. వీరి మతమునకు, శాంకర మతమునకు స్వల్పభేదమున్నది. ఆ భేదము ప్రధానాంశముపై కాదు. జీవేశ్వరస్వరూప నిర్వచనము నందుండు భేదము. వీరివాదమును అవచ్ఛేదవాదమందురు. దీనిని గుఱించి అచల వేదాంతము చెప్పునప్పుడు చెప్పెదను.

అద్వైతులలో ప్రతిబింబవాదులు కూడ గలరు. అవిద్యయందు ప్రతిఫలించిన ఈశ్వరుడే జీవుడను మతము, శాంకర మతమున అవిద్యయందు ప్రతిఫలించినది బ్రహ్మ చైతన్యమే గాని ఈశ్వరుడు కాదు.

పై రెండు మతములు సరికావని దృష్టి - సృష్టి వాదమను మఱియొక శాఖ బయలు దేరినది. వీటిని గుఱించి ముందు విస్తరించి చెప్పెదను.

(11) సూత్రయుగము

జిజ్ఞాసువు : అయ్యా! నా యందనుగ్రహముతో దర్శనములు ఆఱును సంగ్రహముగ చెప్పితిరి. అన్నియు విన్న పిదప నాకొక సంశయము కలిగినది. ఆఱు దర్శనములకు ఆయా దర్శనకారులు సూత్ర గ్రంథములను రచియించిరి. ఆఱుగురు సూత్రకారులు ఏకకాలమున ఒకచోట సమావేశమై తమతమ మతములను చర్చించి సూత్రగ్రంథముల రచియించి యుండిరా?

అటుకానిచో ఒకరి సూత్రగ్రంథమునందు తక్కిన దర్శనములను గూర్చిన విమర్శ యెట్లుండును? శ్రీ బాదరాయణకృత బ్రహ్మసూత్రములందు వైశేషికాది మతముల ఖండనముండిన యెడల వేదాంత దర్శనము తక్కిన దర్శనముల తరువాత రచియింపబడి యుండు ననవలెను గదా! అదియే సరియైన, తక్కిన సూత్రగ్రంథముల యందు వేదాంత బ్రహ్మసూత్ర దర్శన విమర్శ ఉండుట యెట్లు సంభవించినది?

వేదాంతి : ఏ సూత్రకారు డైనను ఆమత సంబంధమగు సూత్ర గ్రంథమును రచియించి అప్పటి నుండి ఆ మతప్రచారమును సాగించుటకు ఆరంభించి యుండలేదు. షడ్దర్శనములను గుఱించిన సూత్రగ్రంథములు అఱును రచియించుట కెంతో కాలము పూర్వమే ఆయా దర్శనతత్త్వములు వ్యాప్తి చెందియున్నవి. "సూత్రగ్రంథకర్తలు తత్త్వస్థాపకులుగాని, మూలపురుషులు గాని కారు. కేవల సంకలనకర్తలు మాత్రమే" అని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు చెప్పిరి. ఉదాహరణమునకు సాంఖ్యదర్శనమును గుఱించి చెప్పెదను. సాంఖ్యమత ప్రవక్త కపిల మహర్షి. భగవద్గీత రచింపబడిన కాలమున కంటె పూర్వపు వాడు. వారు సాంఖ్యమును శిష్యులకు బోధించిరే గాని గ్రంథ మేదియు వ్రాసినట్లు నిదర్శనము లేదు. ఇప్పుడు మనకు లభ్యమగు సాంఖ్యకారికలు ప్రాచీనము లైనవి. అంతకంటెను ప్రాచీన గ్రంథము లభింపలేదు. పిమ్మట బౌద్ధుల కాలమున కపిల మహర్షి ప్రణీతమని చెప్పబడు సాంఖ్యసూత్రములను గ్రంథము రచియింపబడినది. కారికలయందు లేని ఈశ్వర ప్రస్తావనము అందు గలదు. ఆ గ్రంథకర్త కపిల మహర్షి యందుగల భక్తి చేతనో, సాంఖ్య మతము కపిల ఋషి ప్రోక్తమగుట వలననో, ఆ మహర్షియే సూత్రములను రచియించినట్లు చెప్పిన ఆ గ్రంథమునందలి గౌరవముచే లోకులు తన్మతావలంబు లగుదురనియో- "కాపిల సాంఖ్య సూత్రములు" కపిల ఋషి ప్రోక్తములని వ్రాసెను.

జైమిని, గౌతమ, కాణాదాది ఋషులు చాల ప్రాచీన కాలమునకు చెందిన వారే. వారు వారి మతమును ప్రచారమునకు తెచ్చిన తరువాతనే సూత్రగ్రంథములు వెలువడినవి. తొలుత ఎవరో ఒకరు తమ మతమును

సూత్రములలో క్లుప్తముగా చెప్పిరనిన ఆమతమున కొక గౌరవము. ఏలయన, సూత్రము ఎట్లుండవలెనో యీ క్రింది శ్లోకమున చెప్పబడినది.

శ్లో|| అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతోముఖమ్ |
అస్తోభ మనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః ||

తా|| సాధ్యమైనంత వఱకు తక్కువ అక్షరములు కలిగి (క్లుప్తములై) అసందిగ్ధమై, సమస్త మత విషయ మందు చెప్పబడినదై, (విశ్వతో ముఖమై) శ్రేష్ఠమైనదై, నిర్దోషమైనదై సూత్ర ముండవలెనని సూత్రకారులు చెప్పుదురు.

కనుక సూత్రరచనము గౌరవప్రద మైనదని ఆ కాలమున తలచిరి. అట్టి గౌరవము తమకును దక్కవలెనని తక్కిన వారు సూత్రరచనమును సాగించిరి. షడ్దర్శనముల సూత్రగ్రంథముల రచనము కొన్ని శతాబ్దములు పట్టియుండవచ్చును. ఆ కాలమును సూత్రయుగమని పండితులు వక్కాణించిరి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు సూత్రయుగారంభము క్రీ పూ 200 సంవత్సరమునుండి ఆరంభమై క్రీ.శ. 200 సంవత్సరముల వఱకు సాగియుండవచ్చు ననిరి. ఎట్లయినను బౌద్ధమతము ప్రారంభమైన పిమ్మటనే సూత్రయుగ మారంభ మైనదని చెప్పవచ్చును. ప్రతిదర్శనా చార్యుడును కొలదిగనో, గొప్పగనో బౌద్ధమతమును విమర్శించెను. ప్రతి దర్శనకర్తయు నితరుల దర్శనములను మనస్సులో ఉంచుకొని సూత్రరచన చేసెను.

బ్రహ్మ సూత్రములు (వేదాంత సూత్రములు) బాదరాయణాచార్య కృతములే యైనను కృష్ణద్వైపాయన మునీంద్రుని మతమునే బాదరాయణుల వారు కొంత మార్చియుండ వచ్చునని నా సంశయము.

పై కారణముల వలన ప్రతిదర్శన గ్రంథమునందు తదితర దర్శనముల ఖండన ముండుట తటస్థించినది.

(12) తాత్పర్యలింగములు

జిజ్ఞాసువు : శ్రీ శంకరాచార్యాదులు ప్రస్థానత్రయమునకు భాష్యములు రచియించిరి గదా! ఒకరు చెప్పిన అర్థమును తక్కిన వారు అంగీకరించుట

లేదే? ముఖ్యముగ బ్రహ్మసూత్రములకు ప్రతివారును తాము చెప్పిన అర్థము సరియైన దనుచున్నారు. తాత్పర్యనిర్ణయము ఈ విధముగ చేయ వలయునను ఒక విధాన మేమియు లేదా?

వేదాంతి : ఉన్నది. ఒక ప్రకరణమునకు గాని ఒక గ్రంథమునకు గాని యీ క్రింది గుర్తులను (పరీక్షలను) మనస్సున నుంచుకొని తాత్పర్యము చెప్పవలెను.

శ్లో॥ ఉపక్రమోప సంహారా వభ్యాసో ఽపూర్వతాఫలమ్ |
అర్థవాదోపపత్తీచ లింగం తాత్పర్య నిర్ణయే ||

తా॥ 1. ఉపక్రమోపసంహారములు, 2. అభ్యాసము, 3. అపూర్వము, 4. ఫలము, 5. అర్థవాదము, 6. ఉపపత్తి- ఈ ఆఱును తాత్పర్యలింగములు. **ఉపక్రమోప సంహారములు :** ఏదైనను ఒక విషయమును మనస్సులో ఉంచు కొని గ్రంథమును వ్రాయుదురు. అట్టివారు ఏ ఉద్దేశ్యముతో గ్రంథము నారంభించిరో ఆ ఉద్దేశ్యముతోనే ఆ గ్రంథము పరిసమాప్తి చేయబడెనా? లేదా? అని చూడవలెను. ఉదా : యుద్ధవిముఖుడైన అర్జునుని యుద్ధమునకు ఆయత్తము చేయుటకై గీత ఆరంభింపబడెను. గీతాశాస్త్ర మంతయు ముగిసిన పిమ్మట 'ఓ కృష్ణా! నా మోహమంతయు నశించినది. నీవు చెప్పినట్లు నేను యుద్ధమును చేయుదును'- అని అర్జునుడు అంగీకరించుటచే ఉపక్రమోపసంహారములు గీతాగ్రంథమునందు చక్కగా కుదిరినవని తాత్పర్యము.

అభ్యాసము : గ్రంథకర్త చెప్పిన వాక్యములనే బోధయొక్క దార్ఢ్యముకొఱకు పలుమాఱు చెప్పుట. గీతయందు 'ఓ అర్జునా! యుద్ధము చేయుము. ఫలాపేక్ష లేక. కర్మలు చేయుము' - అను నీ విషయములు పలుమాఱు చెప్పబడెను.

అపూర్వత : ఏ గ్రంథతాత్పర్యమును మనము పరిశీలింతుమో, ఆ గ్రంథమందు నే దేని అపూర్వత గలదా? యని పరిశీలింపవలెను. అపూర్వత అనగా ఇదివఱకు ఏ గ్రంథమునందును చెప్పని విషయము, లేదా ఆ విషయము అది వఱకే చెప్పబడినను, బోధనాపద్ధతి యందు అపూర్వత.

4. **ఫలము** : గ్రంథమును చదువుటవలన కలుగు ఫలము.

5. **అర్థవాదము** : చెప్పదలచిన విషయమునందు పాఠకుల చిత్తము హత్తుకొనునట్లు చేయుటకు, లేదా ఆ విషయమునందు పాఠకులకు భక్తి కలుగునట్లు చేయుటకు ఫలమును అధికముగ స్తుతించుట. వేదాంత గ్రంథములయందు సామాన్యముగ అర్థవాద ముండదు. భాగవత పురాణము నందలి గజేంద్ర మోక్షణమను కథను చదివిన వారికి భగవంతుడు "గజ తురగ స్యందనములు కైవల్యంబు" ను ప్రసాదించునని చెప్పునట్టి వాక్యములు అర్థవాదములు. వేదాంత శాస్త్రములయందు అర్థవాదమును ప్రరోచన వాక్యము లందురు.

6. **ఉపపత్తి** : గ్రంథ తాత్పర్య మిట్టిదని నిశ్చయించుటకు గ్రంథస్థ విషయమును బాధించునట్టి ప్రమాణములను దాచక చూపించి సాధక ప్రమాణములచేత వాటిని ఖండించి శాస్త్రానుసారము గ్రంథాభి ప్రాయమును స్థిరపరచుట. ఇచట ప్రమాణము లనగా ప్రస్థాన త్రయము మొదలగు పూర్వ గ్రంథములనుండి వాక్యముల నుదాహరించి అవి యే గ్రంథమునుండి గైకొనబడినవో చూపించుట.

ఈ విధముగా ప్రస్థాన త్రయమునకు తాత్పర్యమును నిర్ణయింప వలెను. ఉపనిషత్తులకు భాష్యములు వ్రాయుట కష్టమగుటచే విజ్ఞాన భిక్షువు మొదలగు కొందఱు బ్రహ్మసూత్రములకు మాత్రమే భాష్యములు రచియించిరి. మఱికొందఱు భగవద్గీతకు మాత్రమే భాష్యము రచియించిరి. ఎవరి భాష్యము షడ్విధ తాత్పర్యలింగములకు సరిపోవునను చర్చ వ్యర్థ ప్రయాసతో కూడినదని యనిపించును. వారి వారి పూర్వజన్మ వాసన ననుసరించి వారివారికి ఆయా అర్థములు తోచినవి. వారి వారికి తోచిన విధమున వారు భాష్యములు రచియించిరి.

(13) సింహావలోకనము - సంగ్రహపరిశీలనము

జిజ్ఞాసువు : అయ్యా! నాయందనుగ్రహ ముంచి షడ్దర్శనములను సంగ్రహముగా చెప్పితిరి. వాటిని మఱి యొకసారి సింహావలోకనము చేసి, యేదైన నిదివఱకు చెప్పక వదలి యుండిన యంశమును బోధపఱచి దృఢపడుటకై చెప్పుదురని ప్రార్థన.

వేదాంతి : దర్శనము లాఱును వింటివి. దర్శనకారులు భిన్న భిన్న కాలములకును, భిన్నభిన్న దేశములకు (ప్రాంతములకు)ను చెందిన వారును, భిన్న భిన్న దృక్పథములు కలవారును, భిన్న భిన్న లక్ష్యములు కలవారును అయియుండియు అందఱును వేద ప్రామాణ్యవిషయమున నేకీభవించిరి. కాని, వేదముల యుత్పత్తి వాటి యోగ్యత మొదలగు కొన్ని విషయములయందు అందఱును నేకీభవింప లేదు.

వైశేషికులు వేదములను మహర్షి ప్రోక్తము లనిరి. న్యాయ, సాంఖ్య, యోగ, వేదాంత దర్శనములందు వేదములు ఈశ్వరకృతములని చెప్పబడెను, పూర్వమీమాంసకులు వేదములు పౌరుషేయములుగాని, యీశ్వరకృతములుగాని కావని, అవి నిత్యములును స్వతఃప్రమాణములును స్వతంత్రములును అని చెప్పిరి.*

షడ్దర్శనములయందు అందఱును ఏకీభవించిన యంశమేమన : ఆత్మలు విభువు(లు) అని చెప్పిరి. సాంఖ్య యోగదర్శనముల ప్రకారము ఆత్మలు అణువులని ఆదర్శనకారులు చెప్పినట్లు కొందఱు చెప్పుదురు. ఇటీవల దర్శన గ్రంథములు రచియించిన కొందఱు పెద్దలు సాంఖ్య, యోగదర్శనముల యందు ఆత్మయొక్క పరిమాణమును గుఱించి అణువని కాని, విభువని కాని, మధ్యమ పరిమాణమని గాని చెప్పక ఆత్మయొక్క యితర లక్షణములను మాత్రమే చెప్పి వదలివేసిరి.

ఆత్మ యేకమని వేదాంతులును, అనేకములని తదితర దార్శనికులును భిన్నాభిప్రాయములను వ్యక్తపరచిరి. కాని, వీరందఱును ఉపనిషత్తుల ప్రమాణ మంగీకరించిన వారే. అయినను శ్రుతులయందు ఆత్మ యేకము అద్వితీయమని "**ఏ కాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మ సవిజ్ఞేయః**"

* సామవేదము పూర్వార్చిత మనియు, ఉత్తరార్చితమనియు రెండు భాగములు గలదు. అందు పూర్వార్చితము అపౌరుషేయమనియు, ఉత్తరార్చితము పౌరుషేయ మనియు- సామ వేదమును తెనుగులిపిలో వ్రాసి టీకను రచియించిన పురాణవాచస్పతి బ్రహ్మశ్రీ బంకుపల్లె మల్లయ్య శాస్త్రిగారు సామవేదమున వ్రాసియున్నారు.

(మాండూక్యశ్రుతి) అని ఆత్మ యేకము అద్వితీయ మని చెప్పిన శ్రుతి వాక్యములకు వేదాంతేతర దార్శనికులు సమాధానము చెప్పవలసియున్నందున వారు- ఆత్మ యేకము, అద్వితీయము అను వాక్యములను శ్రుతులు జాతిపరముగా చెప్పిన వాక్యము లనియు, అందువలన ఏకవచన ప్రయోగములు చేసినవనియు, శ్రుతియొక్క భావమునకు విపరీతముగ కృత్రిమార్థమును చెప్పి సరిపెట్టుకొనిరి.

డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు సాంఖ్యము నందున్న అనేకాత్మవాదమును విమర్శించుచు ఇట్లు వ్రాసిరి-

"పురుషుడు గుణరహితుడు, అవిభక్తుడు, అవినాశి, అచలుడు, నిష్క్రియుడు, సుఖదుఃఖాది భావవికార శూన్యుడు. పరివర్తన శీలమంతయు ప్రకృతికే చెందును. పురుషులలో భేదముండుట కెట్టి యాధారమును లేదు. పురుషు లందరకు చేతనత్వము, సర్వవ్యాపిత్వము సమానమై భేదము లేశమాత్రమును లేనప్పుడు, పురుషు లనేకు లనుట హేతు విరుద్ధము. భిన్నతాశూన్యమగు ననేకత్వ మర్థరహితము."

(భా.త.అ. 126,127 పుటలు సాంఖ్యతత్త్వము)

ఈ విమర్శ సాంఖ్య, పాతంజల యోగులకే గాక తక్కిన అనేకాత్మ వాదులగు నైయాయికాదులకును వర్తించును. ఏకాత్మవాదులగు అద్వైతులపై తదితరుల విమర్శ యేమన : "ఆత్మ యొకటియే యైన ఒకడు మృతిబొందిన అందరు మృతి చెందరా?" అన్నది. ఇది, హేతు విరుద్ధము, అవిచారమూలము. అద్వైతులు, జననమరణాదులు దేహములకే వర్తించునుగాని ఆత్మకు వర్తింపవని" చెప్పియే యుండిరి.

షడ్దర్శనములందు రెండు వర్గము లున్నవి. (1) ఆత్మలు జడమను వారొక వర్గము, (2) ఆత్మ(లు) శుద్ధజ్ఞానస్వరూపమని చెప్పువారు వేఱొక వర్గము. న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంసాదర్శనములు ఆత్మలు జడములని చెప్పినవి. జడము లనగా జ్ఞానహీనములు, వీరు భౌతిక వాదులు. వీరి మతము ననుసరించి జ్ఞానము ఆత్మలకు ఆగంతుకగుణము. ఆత్మకు సుఖదుఃఖాది గుణము లేగాక జ్ఞానమును ఒక గుణమనిరి.

సాంఖ్య, యోగ, వేదాంతదర్శనములు ఆత్మ(లు) శుద్ధ చైతన్య స్వరూపములని చెప్పినవి. సాంఖ్యదర్శనము లోకమునకు చేసిన యుపకార మేమన - కేవల భౌతిక వాదులగు న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంసావాదుల వాదములను వెనుకకు త్రోసి వేసి అధ్యాత్మతత్త్వమును లోకమున విస్తరింప జేసినది. సమస్తజడ (భౌతిక) ద్రవ్యములనుండి ఆత్మను (పురుషుని) వేఱుచేసి చూపినది. కాని, సాంఖ్యము సహితము సంపూర్ణ చైతన్యవాదము కాదు. జడచైతన్యముల ద్వైతవాదము. సాంఖ్యము అనేకాత్మవాదమునకు మారుగ నేకాత్మ వాదమును అంగీకరించి యుండిన వేదాంతమునకు మిక్కిలి సమీపవర్తియై యుండెడిది. ఆత్మస్వరూప నిర్వచనమున వేదాంతులు "ఆత్మ సచ్చిదానందరూప" మనిరి. సాంఖ్యులు, యోగులు "ఆత్మలు సత్ చిత్ స్వరూపము గల" వనిరి. న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంసా దర్శనములు "ఆత్మలు ముక్త దశయందును కేవల సద్రూపములు మాత్రమే" యని చెప్పినవి.

ఆత్మలు జడములు, అనేకములు - అను దార్శనికుల వాదమును శ్రీ శంకరులు బ్రహ్మసూత్రభాష్యమున నిశితముగ ఖండించిరి. సామాన్య మానవుని బుద్ధికి సహితము ఆత్మలు జడములు, అవివేకములు అను వాదము యుక్తముగా తోచదు. ఆత్మకు, జ్ఞానమునకు గల సంబంధమును గుఱించి ఆత్మలు జడమను వారిట్లు చెప్పిరి : "మనస్సుతో ఆత్మకు సన్నికర్షము కలిగినప్పుడు ఆత్మయందు జ్ఞానము పుట్టును". ఇది అసంగతము. అచేతనము చైతన్యమునకు కారణము కాజాలదు. చేతనము (చైతన్యము) అచేతనమునకు కారణము కావచ్చును. లోకమున ఉత్పత్తి కలదేదియు చైతన్యము (జ్ఞానము) కాదు, అట్లే అయినచో మనయెదుట గోచరించు నట్టియు, గోచరింప నట్టియు స్థూల సూక్ష్మ పదార్థజాత మంతయు జ్ఞానము కలిగి తనను తానెఱుగుటయు, అన్యము నెఱుగు నట్టిదియుగా నుండవలయును. అట్లుండుట లేదు. అట్లున్న లోకమున జడము - చైతన్యము అను రెండు కలవను ప్రతీతియే యుండును. ఆత్మకు ప్రజ్ఞానమునకు గల సంబంధము వస్తువునకును, దాని గుణమునకును గల సంబంధము వంటిదని నైయాయికులును,

విశిష్టాద్వైతులును చెప్పువాదమును శ్రీ శంకరులు ఎట్లు ఖండించిరో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వారి భారతీయ తత్త్వశాస్త్రము నందలి అద్వైత ప్రకరణమునందు చెప్పిన దానిని నిచట సంగ్రహించి చెప్పెదను.

ఆత్మకు జ్ఞానమునకును గల సంబంధము ఒక ద్రవ్యమునకును దాని గుణమునకును గల సంబంధము వంటిదైన పక్షమున ఆత్మకు జ్ఞానముతో గల సంబంధము భేదమో, అభేదమో అయి యుండవలయును. లేదా, భేదాభేద సంబంధమైన కావలయును. ఆత్మకు జ్ఞానము స్వభావముగ భిన్నమైనదైనచో అప్పుడు వాటి మధ్యగల సంబంధము ద్రవ్యగుణసంబంధ మనుటకు వీలులేదు. లోకమున రెండు స్థూలవస్తువులకు సంబంధ ముండిన ఆ సంబంధము సమవాయ సంబంధమో, సంయోగ సంబంధమో అయియుండవలయును. ఆత్మ, జ్ఞానము - అను రెండును స్థూలవస్తువులు కావు. ఆత్మకు జ్ఞానమునకు సమవాయ సంబంధ మున్నదని చెప్పెదరేని యీ సమవాయము ఆత్మ కన్వయింప వలయును. ఆత్మకును జ్ఞానమునకు సంయోగ సంబంధ మంగీకరించెదరేని అనంతముగా అన్య సంబంధము ఆత్మ కన్వయింపవలెను. ఇందువలన అనవస్థాదోషము వచ్చును. ఆత్మకును జ్ఞానమునకును అభేదమును చెప్పెదరేని ఒక దాని కొకటి గుణమని యెట్లు చెప్పనగును? అభేదమును చెప్పినచో ఆత్మ జ్ఞానస్వరూప మగును; గుణము కాదు. భేదాభేదమును చెప్పవచ్చునా యనిన ఒకే వస్తువునకు మఱియొక దానితో భేదాభేదమును చెప్పుట అన్యోన్యవిరుద్ధ మగును - కనుక, వేదాంతములు చెప్పినట్లు "ఆత్మ యన్నను జ్ఞానమన్నను ఒక్కటే. జ్ఞాన మెప్పుడును సత్పదార్థమే. సత్తు గానట్టి జ్ఞానము గాని, జ్ఞానము కానట్టి సత్తుగాని లేదు".

అద్వైతులు (వేదాంతులు) ఆత్మ యేకమని చెప్పుదురుకదా? ఒకడు ముక్తుడైన అందరును ముక్తులు కావలదా? అను వేదాంతేతరుల ప్రశ్నమునకు ఇది వఱకే సమాధన మిచ్చితిని. వేదాంతము ననుసరించి

ఆత్మ నిర్వికారి. అంతఃకరణము ఆత్మచైతన్య ప్రతిబింబమువలన జీవభావమును బొందును. అంతఃకరణము విషయాకారమును బొంది (జ్ఞాన) వృత్తిరూపమును బొందును. ఏయుపాధి నశించునో ఆజీవుడు ముక్తుడగును. ఆత్మకు బంధమోక్షములు లేవు - మీమాంసకుల (భాట్టము) మతమును అంతఃకరణముద్వారా అత్మ వృత్తిగా మారు నందురు. దీనివలన ఆత్మకు వికారము సంభవించును. వికారము (మార్పు) గల దానికి నాశనము తప్పదు. కనుక ఇట్టి మతములు సరికావు.

సృష్టివిధానము - పరమాణువాదము

పరమాణువాదులలో భారత దేశమునందు కాణాదఋషి ముఖ్యుడు. పశ్చిమ ఖండమునందును, భారత దేశమునందును నించు మించుగ ఒకేకాలమున అనగా క్రీ.పూ. 5వ శతాబ్దమునందు పరమాణు పరిజ్ఞాన మంకురించిన దందురు. వేదములయందును,ఉపనిషత్తుల యందును, అణు ప్రసక్తి కలదు. ఈ విధముగా చూచినచో పశ్చిమ దేశమందలి భౌతిక తత్త్వవేత్తలయందు ఈ భావ మంకురింపక ముందే భారతీయులు ఈ విజ్ఞానమును ఎఱిగి యుండిరని చెప్పవచ్చును. యూరపు ఖండమున మొదట డెమొక్రిటస్ మొదలగువారు బోధించిరి. ఎపిక్యూరస్ అనునతడును; అతని అనుయాయులును పరమాణువులకు "ఆటామ్స్"(Atoms) అను పేరిడిరి. అదియే నేటికిని వాడుకలో నున్నది. ఆధునిక యుగములో నీ సిద్ధాంతమును పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో వివరించిన వారు 'జాన్ డాల్టన్' అను ఆంగ్లేయుడు, (1801). అప్పటి నుండి యీ సిద్ధాంతమును 'డాల్టన్ పరమాణు సిద్ధాంత' మందురు. ఇప్పుడు అణువు లనగా విద్యుద్రేణు సముదాయము.

భారతీయుల అణుశాస్త్రమునకును గ్రీకుల అణుశాస్త్రమునకును చాలా భేదమున్న దందురు. గౌతమ కాణాదులు ఈ అణువాదమును శాస్త్రీయ మొనర్చుటలో దీనిని పరమపురుషార్థమగు మోక్షముతో ముడిపెట్టిరి. పాశ్చాత్యులు దీనిని కేవల భౌతిక వాదముగనే సృష్టించిరి.

గౌతమ ఋషి ప్రమేయములు 12 అనిరి. కాణాద ఋషి షట్పదార్థములనే చెప్పిరి. ఆధునిక భౌతికతత్త్వజ్ఞులు 92 తత్త్వములు గలవనిరి. ఇటీవల మఱికొన్నింటిని కనిపెట్టిరని వింటిని. రసాయనికముగా విశ్లేషణ (Analysis of light) చేయుటకు వీలుగాని స్వతంత్ర పదార్థములను 'తత్త్వము' లనిరి. వీటి సంయోగమువలన నేర్పడిన పదార్థములను యౌగికము లందురు.

మన దేశమున ఏసిద్ధాంతము, ఏవిద్య, ఏకళ యుద్భవించినను దాని పర్యవసానము భగవంతునితోనో ముక్తితోనో సంబంధ ముండునట్లు చేసిరి. ఆ విధముగనే గౌతమాదులు వారి దర్శనములయందు చెప్పిన తత్త్వమునకు ముక్తియే పరమావధియని నిర్ణయించిరి.

షడ్దర్శనములయందు సృష్టి విధానమును గుఱించి భిన్నాభిప్రాయములు కలవు. న్యాయ వైశేషిక పూర్వమీమాంసావాదులు అణువాదులు, పరమాణువులు జగత్తునకు ఉపాదానకారణ మనువారు. ఈ అణువాదులలో పరమాణు స్వరూపములను గుఱించి భిన్నాభిప్రాయము లున్నవని చెప్పి యుంటిని. ఒక విచిత్రమేమన, ఎవరు జడాత్మవాదులో వారే పరమాణు కారణవాదులు. (జైన బౌద్ధ మతప్రసక్తి యిచట లేదు) అన్యులు కారు. ఇందులో కొంత మార్పేమనగా. పూర్వమీమాంసకులు ప్రపంచముయొక్క సంపూర్ణ సృష్టిలయములు అంగీకరింపరు.

న్యాయ తత్త్వజ్ఞులు న్యాయసూత్రరచన చేయు కాలమునకు ఈశ్వరాస్తిత్వము నంగీకరించి యుండినను సృష్టితో ఈశ్వరునకు గల సంబంధము నామమాత్రమే. పై మూడు దర్శనములు జడాత్మవాదులు గనుక కేవల భౌతికవాదు లనుటకు సందేహము లేదు. ఊర్ణనాభి తనయందుండి వెలువడు తంతువులకు తాను ఉపాదాన కారణమును, నిమిత్తకారణము నగు నట్లు ఈశ్వరుడు జగత్తునకు నిమిత్తోపాదాన కారణమని శ్రుతులు చెప్పియుండినను వాటిని వారు లక్ష్యపెట్టలేదు.

సాంఖ్య, యోగదర్శనములు రెండును ప్రకృతి పరిణామవాదములు. పరమాణు కారణవాదముకంటెను ప్రకృతి పరిణామ వాదమే యుక్తియుక్తముగను, సమంజసముగను విశేషవ్యాప్తిలోను ఉన్నది.

అద్వైతేతరులందఱు ఏదోయొక విధముగ జగత్తు సత్యమని అంగీకరించిరి. అద్వైతులు కనబడుచున్న ప్రపంచమును పూర్తిగా శూన్యమని త్రోసి వేయక, ప్రపంచము వ్యావహారిక సత్యమే గాని పారమార్థిక సత్యము కాదనిరి. ఊర్ణనాభినుండి తంతువులు ఉత్పన్నమగు నట్లు సగుణ బ్రహ్మము (ఈశ్వరుడు) నుండి జగత్తు కలిగిన దనియు, ఆవిధముగ సగుణ బ్రహ్మమే జగత్తునకు ఉపాదాన నిమిత్తకారణ మనియు, శ్రుతులు చెప్పిన దానిని అంగీకరించిరి.

ముక్తికి సాధనములు

న్యాయ, వైశేషిక, సాంఖ్యదర్శనములు ప్రపంచోత్పత్తికి మూల భూతములగు పదార్థములను గుఱించిన జ్ఞానమే మోక్షసాధన మనిరి. యోగులు జ్ఞానమునే గాక అష్టాంగ యోగములు ముఖ్యము లనిరి. న్యాయ వైశేషికులు సమాధియొక్క ఆవశ్యకతను గూడ గుర్తించిరి. పూర్వమీమాంసకులు పదార్థజ్ఞానమే గాక కర్మయే ముక్తిసాధన మనిరి. వేదాంతులు ఆత్మానాత్మ వివేకము, ఆత్మైక్యబోధ ముక్తికి కారణ మనిరి. ముక్తియని వ్యావహారికముగా చెప్పుటయే గాని వేదాంతమునందు బంధమోక్షములు రెండును మిథ్య, అవిద్యవలన కల్పింపబడినవి.

బుద్ధి - జ్ఞానము

నైయాయికులు, వైశేషికులు, పూర్వమీమాంసకులు - అనువారి మతమున బుద్ధి యనునది జ్ఞానమే. "బుద్ధి","జ్ఞాన" శబ్దములు పర్యాయ పదములు. వీరిమతమున బుద్ధి ద్రవ్యము కాదు. ఆత్మయొక్క గుణము. ఎవరెవరు "ఆత్మలు జడములు" అని చెప్పిరో వారి వారి మతము ననుసరించి బుద్ధి (జ్ఞానము) ద్రవ్యముగా కాక గుణములలో చేరును. న్యాయ వైశేషికులు చెప్పిన జ్ఞాన లక్షణములు సామాన్యముగ ఒక విధముగానే యున్నవి. పూర్వమీమాంసకుల యందలి రెండు శాఖల వారును ఆత్మలను గుఱించిగాని, జ్ఞానమును గుఱించిగాని సంపూర్ణమగు చర్చను జరుపక ఒక నిర్ణయమునకు రాలేక వీటి విషయమై వేదాంతులకే వదలిరని ఆదర్శనములను పరిశీలించిన పెద్దలు చెప్పిరి. రెండు శాఖల

వారిలో ఒకరు ఆత్మప్రవృత్తిచే కలుగు సంచలనమే జ్ఞానమనిరి. మఱియొకరు జ్ఞానము స్వయంజ్యోతి యనిరి. కాని జడాత్మవాదు లందఱు జ్ఞానమునకు పుట్టుట గిట్టుట యున్నట్టు అంగీకరించిరి. ఏలయన సుషుప్తియందు జ్ఞానము లేదను కారణమును చూపింతురు. ఇది సరికాదు.

వేదాంతు లిట్లందురు : జ్ఞానమునకు జనన మరణము లున్నట్లు కనబడినను వాస్తవముగ అవి లేవు. సుషుప్తియందు అంతఃకరణము ద్రవీభూత మయినందున దాని స్వరూపమునందు మార్పు కలిగినది. అప్పుడు అవిద్య అంతఃకరణమును కప్పివేసినది. కాని, దానిని చూచు నిత్యసత్య మగు సాక్షిజ్ఞాన మున్నది. దీపము లేని ఒక గదిలో చిమ్మ చీకటిలో మనము వస్తువులను చూడజాలము. అంత మాత్రముచేత చూచువాడు లేడనిగాని, మనకు కన్నులు లేవని గాని, మన కన్నులకు చూచునట్టి శక్తి నశించెనని గాని చెప్పుదుమా? కనుక సుషుప్తియందు సాక్షిజ్ఞాన మున్నది. ఇంద్రియముల వ్యాపారము లేదు. కనుక విషయములు లేవు. దానిని జ్ఞానభావమని భావింపదగదు.

సాంఖ్యయోగ దర్శనములయందు బుద్ధి వేఱు, జ్ఞానము వేఱు. కేవల బుద్ధి జడము, దానియందు పురుషుని ప్రతిబింబము పడినపుడు అదియే జ్ఞానమగును. పురుషుడు శుద్ధ చైతన్య స్వరూపుడు. పురుషుని ఛాయ బుద్ధియందు పడుటచే బుద్ధియందు కలుగు జ్ఞానమును, పురుషుని స్వరూప జ్ఞానమును ఒక్కటి కావు; బుద్ధి వృత్తులు మారుచుండును. వృత్తికి సంబంధించిన విషయమును జ్ఞానమునుండి వేఱు చేసిన అప్పుడు వృత్తి చైతన్యమును, ఆత్మ చైతన్యమును భిన్నములు కావు. సాంఖ్యము నందు బుద్ధి విభువు, ఏకము. అహంకారము బుద్ధి జన్యము, ఇది విభువు కాదు అనేకము. సాంఖ్యదర్శనము నందలి బుద్ధివంటిదే యోగదర్శనమున చిత్తము. కాని, సాంఖ్యులు బుద్ధి అని చెప్పినను మనస్సు చిత్తము అహంకారము వేఱువేఱు తత్త్వములుగా అంగీకరింతురు.

యోగులు మొత్తము అంతఃకరణము నంతయు చిత్తము క్రింద చేర్చి చిత్తము ఏకము, విభువు అని చెప్పిరి. యోగులకు అతీంద్రియ జ్ఞానమున్నట్లు అంగీకరించిరి. సాంఖ్యులు ఈ యంశమును అంగీకరింప లేదు. సర్వ వ్యాపియగు ప్రకృతి ప్రథమ సంతానమును సాంఖ్యులు మహత్తనియు, వ్యక్తి గతమైనప్పుడు అంతఃకరణములో ఒక భాగమగు మహత్తును బుద్ధి యనియు చెప్పినట్లే యోగులు చిత్తమును (1) కారణచిత్తము (2) కార్యచిత్తము - అని రెండుగా విభజించిరి. చిత్తము సర్వవ్యాపియని సాంఖ్య మంగీకరింపదు.

అవిద్య

అవిద్య యనునది మాయయొక్క రూపాంతరము. సచ్చిదానంద స్వరూపుడైన ఆత్మ సంసారబంధమున తగుల్కొనినట్లు చూపునదే అవిద్య, గౌతమ, కణాద, కపిల, పతంజలి, జైమిని, బాదరాయణాచార్యాదులు ఏదో యొక రూపమున అవిద్య నంగీకరించిరి. సాంఖ్యయోగతత్త్వజ్ఞులు పంచ అవిద్యలను పేర్కొనిరి*. మీమాంసకులు అవిద్యనే విపర్యయ జ్ఞానమందురు. విపర్యయ జ్ఞానముకు అవిద్యగాక వేఱొక కారణమేమున్నది? అద్వైతమునందు అవిద్య ఆత్మాశ్రితము, అనాది, భావరూపము. అద్వైతులవలెనే సాంఖ్యులు యోగులు అవిద్య కాది లేదనియు అంత మున్నదనియు అంగీకరించిరి. అవిద్యను గుఱించి ముందు ఇంకను చెప్పవలసిన ఆవశ్యకత యున్నందున ఇచట యింతవఱకే చెప్పితిని.

ఈశ్వర విచారము

కణాద, కపిల, జైమిని ఋషులు - ఈశ్వరా స్తిత్వమును అంగీకరింప లేదు. వీరు ఈశ్వరుడు లేడని చెప్పలేదనియు, ఈశ్వరాస్తిత్వమును

---

* సూ|| "విపర్యయ భేదాఃపంచ" (సాం.సూ. 3-37) వివేకమునకు వ్యతిరేకమైనది విపర్యయము. విపర్యయము అయిదు విధములు. 1. అవిద్య, 2. అస్మితము, 3. రాగము, 4. ద్వేషము, 5. అభినివేశము. దీనినే మార్పులేకుండ యోగము - సూ|| **అవిద్యాస్మితా రాగ ద్వేషాభినివేశాః పంచక్లేశాః** (పా.యో.సూ. 2-3), "**తస్యహేతు రవిద్యా**" (పా.యో.సూ. 2-24)

గుఱించి తటస్థభావము వహించిరనియు కొందఱందురు. కాని యీ వాదమునందు పటుత్వము లేదు. మిగుల స్వల్ప విషయముల గుఱించి వాదోపవాదములు చేసిన వీరు ఈశ్వరప్రసక్తి యెత్తనపుడు ఈశ్వరుడు లేడనియే వీరిమతము. కాని, తదనంతరము వీరు ఈశ్వరాస్తిత్వమును అంగీకరించిరి. పతంజలి అంగీకరించిన యీశ్వరుడు జగదుత్పత్తి స్థితి లయములకు కర్తగాడు. ఆశ్రితరక్షకుడు, దుష్టశిక్షకుడును కాడు. ఆయన మోక్షదాతయు కాడు. ఈశ్వరుని స్మరించుట వలన యోగసిద్ధికి అంతరాయములు కలుగకుండ ఆయన సహాయము చేయును. "సహాయ" మనగా మన మాయన ధ్యానాదుల నూతగా గొని యోగమును సాధింతుమని చెప్పినచో ఈశ్వరునకు ఏ దోషమును అంటదు. ఆయన సదా ముక్తుడు. పురుషు లందఱికంటెను విలక్షణుడగు పరమపురుషుడు. "సర్వజ్ఞత్వ మాతనియం దమితముగా నుండును" (పా.యో.సూ. 1-25), "అతడు గురువులకు గురువు" (పా.యో.సూ. 1-26), "ఓంకార మాతని నామధేయము" (ప్రా.యో.సూ. 1-27).

నైయాయికుల ఈశ్వరుని గుఱించి విచారింతము - ప్రళయమున చలనము లేక పడియున్న అనాదులగు పరమాణువులకు అదృష్ట సహాయమున ఈశ్వరుడు చలనము కలిగించును. అంత పరమాణువులు ఒండొంటితో సంయోగమును పొంది ప్రపంచోత్పత్తి చేయును. జీవుల భోగముకొఱకు ప్రపంచ మవసరము కదా? ప్రపంచమున వారి వారి అదృష్టానుసారము ఆయా జీవులకు దేహము లేర్పడు చుండును. వారి మతము ననుసరించి అంతకంటె నీశ్వరునితో జగత్తునకుగాని జీవులకు గాని ప్రయోజనము లేదు.

ఈశ్వరాస్తిత్వము నంగీకరించిన వారిలో వేదాంతులు ముఖ్యులు. వేదాంతము ననుసరించి మాయోపాధియందు ప్రతిఫలించిన బ్రహ్మ చైతన్యమే యీశ్వరుడు. ఆయన జగదుత్పత్తి స్థితి లయకారకుడు. సర్వజ్ఞత్వ, సర్వశక్తిత్వ, సర్వవ్యాపకత్వములు గలవాడు. జీవుల హృదయాంతరాళమున నుండి వారి కర్మానుసారము వారిని ప్రేరేపించి వారిచే కర్మలు చేయించువాడు. ధర్మగ్లాని కలిగినపుడు అవతరించి ధర్మము నుద్ధరించి అధర్మము నణచువాడు. ఆశ్రితవత్సలుడు, అనాథ

రక్షకుడు. భక్తుల మొఱ విని ప్రసన్నుడగువాడు. ఇట్టి వాడని యిదివఱకు చెప్పియుంటిని. బోధదార్ఢ్యము కొఱకు మరల చెప్పితిని.*

మొదట ఈశ్వరాస్తిత్వము నంగీకరింపక పిమ్మట అంగీకరించిన సాంఖ్య, వైశేషిక, పూర్వమీమాంసా దర్శనములుగాని; ఈశ్వరాస్తిత్వమును తొలుతనే అంగీకరించిన న్యాయ, యోగ దర్శనములుగాని; వేదాంతులవలె నీశ్వర తత్త్వమును గుఱించి సమగ్ర వివరమును నిచ్చియుండ లేదు. వేదాంతము విశేష వ్యాప్తిగాంచుటకు గల కారణములలో నిది యొకటి.

వేదములు

పూర్వమీమాంసకులు వేదములను గొప్ప చేసి యీశ్వర భావమును అణగద్రొక్కి నాస్తికులైరి. వేదముల నుచ్చరించుటకు నీశ్వరునకు నోరు లేదనిరి. సర్వజ్ఞుడు, సర్వశక్తియునగు నీశ్వరుడు నోరులేకనే మాటలాడ గలడు. మన పురాణాదులయందు అశరీరవాణి పలికినట్లు అనేక సందర్భములయందు చదివియున్నాము. ఋషులు సమాధియందు నీశ్వర వాణిని వినియే యుపనిషత్తులను రచియించిరని పెద్దలు చెప్పుదురు. దేవకీ వసుదేవులను రథముపై కూర్చుండబెట్టుకొని కంసుడు సారథ్యము చేయుచుండ "ఓరీ! కంసా! వీరికి పుట్టిన అష్టమ గర్భమువలన నీవు మృతిచెందుదు" వని ఆకాశవాణి పలికి నట్లు భాగవత పురాణమునందు చదివియుంటిమి. అదియే యీశ్వర వాణి, కాకున్న భవిష్యత్కాల గర్భమున నున్న రహస్యము జడమగు బయలు ఎట్లెరుగ గలదు? బయలునకు నోరు గలదా? మన దేశము నందే గాక యితర దేశములయందును యోగులు, భక్తులు దైవ వాణిని విని యున్నట్లు బైబిల్ ప్రాత - క్రొత్త నిబంధనల యందున్నది. అంతదూర మెందుకు- శ్రీ గురునానక్ గారు ఒక దినము ' రావీ' నదిలో స్నానము చేయుచుండ " నీవు నా నామ మహిమను లోకమునకు చాటుము" అను ఈశ్వర వాణిని వినెనట. వేదాంతులు వేదముల విషయమై కొంతవఱకు మాత్రమే పూర్వ మీమాంసకులతో నేకీభవింతురు.

---

* ఈశ్వరాస్తిత్వ లక్షణములను గుఱించి 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ భాగము 12వ అధ్యాయమునందు ద్వితీయ భాగమున అచ్చుటచ్చుటను చెప్పియుంటిని.

వేదాంతు లిట్లందురు : వేదమనగా - అనాది యగు విజ్ఞానము. వేదములయందు సృష్టికి సంబంధించిన శాశ్వత సూత్రములు కలవనియు, అవి మానవ మానసమునుండి వెలువడినవి గాక దేవుని యొక్క మానసమునుండి వెలువడిన వనియు చెప్పుదురు. వేదములయందలి వాక్యములు నిత్యములైనవి కావు. కాని, వాటి యర్థము మాత్రమే నిత్య మయినది. ప్రళయమున వేదములు సూక్ష్మాకృతి నొందుచుండును. అనగా - ఆకాశాది భూతములవలె అవ్యక్తస్థితి నొంది అదృశ్యమై యుండి ప్రతి కల్పారంభమునందు అవి ఋషులచే కల్పింపబడును. అనగా - అభివ్యక్తము చేయబడును. ప్రపంచమున కొన్ని వస్తువులు తాత్కాలికముగ వ్యావహారిక నిత్యము లైనవి; కొన్ని పరమార్థ నిత్యము లైనవి. అవి : అవిద్య, కాలము మొదలగునవి. కాని, యివి పరబ్రహ్మమువంటి పరమార్థ నిత్యములు కావు. ఇవి మాయాజన్యము లగుటచే అనిత్యములు. అవిద్య నశియింపగనే యివియు నశించును. అంతవఱకు అవి నిత్యములే. ప్రళయమున నశింపవు. అట్టివాటిలో చేరినవే వేదములని అద్వైతుల మతము. వేదాంతుల యీ వాదములో నితర దార్శనికులు చెప్పిన అభిప్రాయము లన్నియు కొంత సామరస్యముతో నిమిడి యున్నవి.

లింగ దేహము

స్థూలశరీర నాశనానంతరము మిగిలి యుండున దేమి? అను ప్రశ్న ప్రతిముముక్షువు నెదుట పర్వతశిఖరమువలె నిలిచియుండును. ఇది చాల ముఖ్యమైన దగుటచే దీనిని గుఱించి పలువురు శ్రద్ధ వహించిరి. న్యాయ వైశేషిక తత్త్వములు ఇట్లు చెప్పినవి : స్థూలశరీరము నశింపగనే అందున్న అణుప్రమాణము గల మనస్సు ఆ శరీరమును విడిచి అదృష్టముచే వేఱొక మాతృగర్భమును బ్రవేశించును. వేదాంతుల సూక్ష్మ శరీరమునకు మారుగ మనస్సే ఆపని చేయునని అర్థము. మనస్సు ద్రవ్యములలో ఒకటి; ప్రళయమునందును నశింపదు. పురుషుడు ముక్తు డైనంతనే నశించును.

సాంఖ్యు లిట్లందురు : మరణానంతరము మృతదేహమును వదలి వేఱొక జన్మమెత్తి నూతన శరీరమును ధరించునది లింగ దేహము. (లింగశరీము). ఏకాదశేంద్రియములు, పంచతన్మాత్రలు, అహంకారముతో కూడిన బుద్ధి మొత్తము పదునేడును కలిసి లింగదేహము. (సాం.సూ.3-9)

యోగులిట్లందురు : చిత్తమే స్థూల శరీరమును వదలి జన్మాంతరము పొందుచుండును, చిత్తము రెండు విధములు : 1. కార్యచిత్తము, 2. కారణచిత్తము. పురుషు లెందఱో అన్ని చిత్తము లుండును. మరణ సమయమున దేహమును వదలి పునర్జన్మము నందలి దేహమును పొంది ఆ దేహమును ధరించునది కార్యచిత్తము. దీనియందే మనో, బుద్ధి, చిత్త, అహంకారములు ఇమిడియున్నవి.

పూర్వ మీమాంసకులు లింగ దేహము నంగీకరింపరు. న్యాయ వైశేషిక తత్త్వములవలెనే మనస్సే మరణకాలమున స్థూలదేహమును విడిచి దేహాంతరమును పొందునందురు.

వేదాంతు లిట్లు చెప్పుదురు : సూక్ష్మభూత పంచీకరణమువలన అంతఃకరణ మేర్పడినది. స్థూల దేహమున సూక్ష్మశరీరము ఇమిడి యున్నది. సూక్ష్మ శరీర వివర మిట్లు చెప్పిరి: 1. జ్ఞానేంద్రియ పంచకము. 2. కర్మేంద్రియ పంచకము. 3. ప్రాణపంచకము. 4. పంచతన్మాత్రలు (సూక్ష్మ భూతములు) 5. బుద్ధి. 6. అవిద్య.7. కామము. 8. కర్మము - ఈ యెనిమిది పురముల మొత్తము సముదాయము సూక్ష్మ శరీరము; స్థూల దేహ నాశనానంతరము లోకాంతర, జన్మాంతరములను బొందున దిదియే. జీవుడు ముక్తుడైన యీ శరీరము నశించును. అంత పర్యంతము నశింపదు.

మోక్షము - అపవర్గము

పైన చెప్పిన లింగశరీరాదులు ప్రళయ కాలమునందును నశింపవు. మోక్షస్థితియందు నశించును. అప్పుడు ఆత్మ(లు) స్వస్వరూపముతో దృశ్యసంబంధము లేక యుండును. న్యాయ వైశేషిక పూర్వమీమాంసా దర్శనములు చెప్పిన మోక్షస్థితి కేవల సన్మాత్రమే, జ్ఞానముగాని

ఆనందముగాని యుండదు. ఆ స్థితిలో ఆత్మ(లు) గొప్పశిల (ల) వంటిది(వి) అని చెప్పవచ్చును. ఆస్థితిలో ఆత్మకు తానున్నాననిగాని ప్రపంచ మున్నదనిగాని నశించినదని గాని తెలియదు. జ్ఞానముండదని పర్యవసానము. "వేదాంతుల కారణశరీరము, లేక ఆనందమయ కోశము, లేదా, గాఢ నిద్రయే వీరి మోక్షస్థితి" యని కొందఱందురు. ఇచట ఒక సంశయము కలుగుచున్నది. వేదాంతుల ననుసరించి నిద్రలో సాక్షి చైతన్య మున్నది. మనుష్యుడు నిద్రనుండి జాగ్రదవస్థకు వచ్చినపుడు "నేను హాయిగా నిద్రించితిని, అప్పుడు నిద్రలో నాకేమియు తెలియ లేదు" అని చెప్పును. ఏలయన, ఆస్థితిని ఎఱిగిన సాక్షియే (జ్ఞానమే) దానిని తెలిసికొన్నది. కనుక, నైయాయికాదుల మోక్షస్థితి నిద్రతో పోల్చుటకు వీలు లేదు. వారి మోక్షస్థితి యందు సాక్షి లేదు. నైయాయికాదుల మోక్షస్థితి కేవల సన్మాత్రమే యని యెట్టి అనుభవము చేత నెవ్వరు చెప్పగలిగిరి? ఆసన్మాత్రస్థితి చూచిన సాక్షి యెవరు?

వేదాంతము ననుసరించి చూచినను, మన అనుభవమును బట్టి చూచినను, సుషుప్తియందు జ్ఞాన మున్నది గాని విషయముల నెఱింగెడి మానసేంద్రియములగు సాధనములు లేకపోవుటచేతను, వాటిచే నెఱుగ బడెడి విషయములు లేనందునను, నేమియు లేదనుచున్నాము. కాని, ఆ యేమియు లేని స్థితి నెఱింగెడు శుద్ధజ్ఞాన స్వరూపుడగు సాక్షి యున్నాడు. సాక్షిచే త్రివిధావస్థలు నెఱుగ బడుచున్నవి. కనుక సుషుప్తితో నైయాయి కాదుల ముక్త స్థితిని పోల్చకూడదు. అది ఒక శిలవంటిది.

ఒకానొక గ్రంథకర్త న్యాయ, వైశేషిక, పూర్వమీమాంసకుల మోక్షస్థితి మూర్ఛరోగి మూర్ఛనొందిన స్థితి వంటి దనెను. జీవిత కాలమంతయు కష్టపడి, శాస్త్రాధ్యయన మొనర్చి, గురువులను సేవించి, యింద్రియములను లౌకిక సౌఖ్యముల దెసకు పోనివ్వక అరికట్టి, దేహసౌఖ్యములను విడనాడి, అనేక విధములగు కాయక్లేశముల కోర్చి, యజ్ఞయాగాదులచే ద్రవ్యనాశన మొనర్చుకొని, తుదకు మూర్ఛరోగమువంటి ముక్తిని సంపాదించుకొనుటయే పరమ పురుషార్థమా? అది అపవర్గమా? అట్టి మోక్షము నొందుటకంటె బృందావనమున నక్కయై పుట్టుట మంచిదని విమర్శించెను.

సాంఖ్యయోగ దర్శనములు చెప్పిన ముక్తిస్థితి సత్ చిద్రూపమైనది. వారి ఆత్మలు సత్- చిత్ స్వరూపములు. ఆస్థితియందు వారి కానందము లేదు. ఆనందము ప్రకృతికి చెందిన దట. ముక్తస్థితియందు పురుషులకు ప్రకృతితో సంబంధ ముండదు కనుక ఆనందము పురుష స్వరూపము కానందున వీరి మోక్షస్థితి ఆనందరహిత మనిరి.

వేదాంతుల మోక్షస్థితి సచ్చిదానంద స్వరూపము. వేదాంతము ననుసరించి బంధమోక్షములు రెండును భ్రాంతి, అవిద్యాకల్పితములు. ఆత్మానాత్మ వివేకము కలిగి ఆత్మయే పరమాత్మయని తెలిసికొనినంతనే బంధము భ్రాంతిజన్యమని తెలిసికొని రజ్జువును చూచి సర్పమని భ్రమించినట్లు; ఆత్మయగు తాను అవిద్యావశమున దేహేంద్రియాది సంఘాతమని భ్రమించితినని, అవిద్య నశింపగా తాను సచ్చిదానంద స్వరూపుడగు పరబ్రహ్మమే యని నిశ్చయము కలవాడై స్వస్వరూప సంధానమున నుండుటయే ముక్తి. వేదాంత (అద్వైత) దర్శన మొక్కటే ముముక్షువులకు సంపూర్ణతృప్తి నొసంగజాలియున్నది. తక్కిన దర్శనముల కాశక్తి లేదు.

షడ్దర్శనముల వివేకమువలన ఫలమేమి?

జిజ్ఞాసువు : వేదాంతదర్శన మొక్కటి అధ్యయనము చేసిన చాలదా? అదొక్కటియే మోక్షమార్గమును చూపజాలినదై యుండ తక్కిన దర్శనములను పఠించుటవలన ఫలమేమి? తక్కిన దర్శనములు రచియించినవారు ఋషులని చెప్పుదురు కదా? ఋషు లెందులకు ఉపనిషన్మార్గమును వదలి పెడత్రోవల పోయిరి?

వేదాంతి : నీవన్నట్లు ముముక్షువు వేదాంతదర్శన మొకటి పఠించిన చాలును. మానవుడు జననమరణ రూపసంసారమునుండి బయటపడుటకు తగిన యుపాయమును వేదాంతము తప్ప ఇతర దర్శన మేదియు సూటిగా చూపజాలక పోయెనని పెద్దల యభిప్రాయము. అయినను నితర దర్శనకారులు వారికాలమున వారున్న దేశమున ఆకాలమున ప్రబలియుండిన విచక్షణా రహితమగు మూఢాచారములను నిర్మూలించుటకును బౌద్ధ, జైన, నాస్తికాది (చార్వాకాది) మతములనుండి హిందూ

సంఘము నుద్ధరింపవలయునను లోకకల్యాణ వాంఛ వారి మనముల యందిడుకొని, అట్టి లక్ష్యమును చేరుటకు కావలసిన తాత్త్విక సిద్ధాంతము లను రూపొందించుకొని సూత్రరచన చేసిరని మన మూహింపవచ్చును. కాని, ఆనాటికే విజ్ఞులయొక్క మన్ననలను పొందిన ప్రాచీనోపనిషత్తుల యందుండెడి పరమార్థ తత్త్వమును ఉపేక్షించు శక్తి ఆదర్శనకారులకు లేదు. వారు, ఉపనిషత్తులయందలి యేదో ఒక వాక్యమునుండి యెట్టివారైనను తమకనుకూలమగు అర్థమును లాగవచ్చును. ఉదాహరణమునకు : ఆత్మ యేకము, అద్వితీయ మని దశోపనిషత్తులు ఏకవాక్యతగా చెప్పియుండినను అవి జాతిపరములైన వాక్యములని వేదాంతేతరులు తాత్పర్యమును చెప్పిరి. కొందఱు బ్రహ్మసూత్రములు తమ మార్గమునే బోధించు చున్నవని భాష్యములు వ్రాసిరి. నే నిదివఱకు షడ్విధ తాత్పర్య లింగములను గుఱించి చెప్పితిని గదా. వాటికి సరిపోవునట్లు ఉపనిషత్తులకును, బ్రహ్మసూత్రములకును గీతకును తాత్పర్యమును అద్వైతులు చెప్పిన విధముగ నితరులు చెప్పలేదు.

కాని, తక్కిన దర్శనములు కేవల వ్యర్థములైన వని చెప్పుట అనుచితము. అవి మన విజ్ఞానమును అనేక విధముల పోషించినవి. మోక్షసౌధమును ప్రవేశింపవలయునన్న ముముక్షువు న్యాయతత్త్వము మొదలు వేదాంతము వఱకును ఆఱు సోపానములను అధిరోహించి కడపటి వేదాంత సోపానము నధిరోహింపగనే మోక్షసౌధమున ప్రవేశించు చున్నాడు.

ప్రస్తుతము ప్రచారమునందున్న న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంసా, వేదాంతదర్శనముల క్రమమును, వాటి యోగ్యత ననుసరించి చెప్పినవని నాకు నమ్మకము లేదు. ఒక దర్శనముకంటె మఱియొకటి ఏకోత్తరోత్తర శ్రేష్ఠములను నభిప్రాయముతో చెప్పినట్లయిన వాటిక్రమము ఒక దానిపైన ఒకటిగా న్యాయ, వైశేషిక, దర్శనములను చెప్పిన తరువాత, పూర్వమీమాంస చెప్పి; పిమ్మట సాంఖ్య యోగములను కడపట వేదాంతమును చెప్పవలయును. కొంద ఱిట్లు చెప్పుదురు:- పూర్వమీమాంస, ఉత్తర మీమాంస (వేదాంతము)- అనునవి రెండును ఒకేదర్శనము యొక్క పూర్వోత్తరభాగము లనియు, ఒక గ్రంథమునందలి

ఓమ్
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మజిజ్ఞాస

తృతీయ భాగము

రెండవ ప్రకరణము - మతములు

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై|
తం హ దేవ మాత్మబుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే." *

(1) ప్రారంభము

జిజ్ఞాసువు : అయ్యా! మీ అనుగ్రహమున వైదిక దర్శనములనబడు షడ్దర్శనములను సంగ్రహముగ తెలిసి కొంటిని. మన దేశమున పెక్కు మతములు కలవు. అందు కొన్ని పుట్టినవి. కొన్ని విదేశీయములు. ఆరంభమున మత మెట్లు కలిగినది? మతమనగా నేమి? మన దేశమునందే పుట్టిన మతములు వైదికములని, అవైదికములని భిన్నములుగ చెప్పుచున్నారే, ఏవి వైదికములు? ఏవి అవైదికములు? మానవ సమాజమునకు మతమువలన లాభనష్టములు రెండును కలిగినవా? మతముతో అవసరము లేకయే మానవుడు సంఘమున జీవింప లేడా? ఈ విషయము లన్నియు అనుగ్రహించి విపులముగ బోధింపుడు.

(2) మతములు

మతమనగా : "ఆత్మసందర్శనమే, భగవత్సాక్షాత్కారమే నిజమైన మతము. మిగిలిన దంతయు మతసన్నాహమే కాని, మతము కానేరదు.

---

* కల్పాదియందు ఏ పరమేశ్వరుడు బ్రహ్మదేవుని పుట్టించి అతనికి వేదములను ప్రసాదించెనో బుద్ధి సాక్షియగు అట్టి పరమేశ్వరుని మోక్షార్థినై నేను శరణు పొందుచున్నాను.

ఉపన్యాసములు వినుటయు మతసాధనములు కాని మతము కానేరదు" అని శ్రీవివేకానందస్వాములవారు చెప్పిరి. (పా.యో.సూ. 1-49 వ్యాఖ్య)

మతము మానవసంఘమున ఎట్లు కలిగినదో? ఎప్పుడారంభమాయెనో తెలిసికొనుట కష్టము. దీనిని తెలిసికొనుట కనేకులు ప్రయత్నించి భిన్నాభిప్రాయములను వ్యక్తపరచిరి. పండితులయందీ విషయములో గల భేదాభిప్రాయములను రెండు వర్గములుగా గైకొనవచ్చును. పశ్చిమ ఖండము నందలి అర్వాచీన పండితులను, వారి ననుసరించెడి భారతీయ పండితులను ఒక వర్గముగను; భారతీయులయందు ప్రాచీనులను, ప్రాచీనమతావలంబులమని చెప్పుకొను అధునాతనులను వారలను ఇంకొక వర్గముగను గైకొనవచ్చును. **మొదటి వర్గము వారిట్లు చెప్పుదురు :**

ఆదిమ నరులు దిగంబరులును, మాంసాహారులుగా ఉండి అడవి మృగములవలె జీవించుచు, చెట్లపై నివసించుచు, ఒక సంఘముగా నేర్పడక ఎవరికివారే బ్రతుకుచు నుండెడి వారు. అట్లు కొంతకాలము గడచిన పిమ్మట కొన్నితరముల వారు ప్రకృతి సిద్ధమగు శీతోష్ణముల బాధకు సహించలేక ఆకులు, చెట్లనుండి తీసిన నారపట్టలు శరీరమునకు చుట్టుకొని కొండగుహలయందు నివసించుచుండిరి. వారికి స్త్రీ - పురుష సంబంధమగు ఒక నియతి (ధర్మము) లేక మృగములవలె సంతతిని పుట్టించుచుండిరి. అప్పుడు వారికొక భాష లేదు. ఒకరి అభిప్రాయములు ఒకరు తెలుసుకొనుటకు ధ్వనులను, సంజ్ఞలను సాధనములుగా నుపయోగించిరి. ఇట్లున్న నరులు కాలక్రమమున క్రమముగా నాగరికులైరి. ఇది డార్విన్ పరిణామ వాదమునకు సరిపోవును.

కాలక్రమమున అట్టి సంఘమునందు మతమిట్లు కలిగిన దందురు: నరుడు ప్రకృతిశక్తులను అనగా - పైనున్న మేఘముల గర్జనములను, వర్షమును, మెరుపులను, తుఫానులను, భూకంపములను, అగ్ని పర్వతములను చూచి చకితుడై వాటిని గురించి ఆలోచించుట ద్వారా తమకు కనబడనట్టిదియు, తెలియబడనట్టిదియు అగు మహత్తరశక్తి యొకటి ఎచ్చటనో కలదని, ఆశక్తి తలచుకొన్నచో నరులను, సమస్త ప్రపంచమును నాశనము చేయగలదని తలంచిరి. ముఖ్యముగా మృతుడైన

నరుని గుఱించి యోచింపసాగిరి. చనిపోయిన వారి శరీరమందు చేష్టలుండవు. ఉచ్ఛ్వాసనిశ్వాసము లుండవు. అది క్రమముగా ఉబ్బి దుర్గంధ పూరితమై నశించును. అట్టిది చూచినపుడు వీనియందలి చైతన్య మేమైనది? అను ప్రశ్న కలుగును. ఇట్టి సంఘటనలు కూడ మానవుని వివేచనా శక్తిని మేల్కొలిపినవి.

ఇట్టి జ్ఞానము వారికి అంకురించుటతోడనే మొట్ట మొదటిసారి ఒక విధమైన ఈశ్వరభావన కలిగి అదియే మతోత్పత్తికి అంకురమై యుండవచ్చును. తాము భావించెడి అట్టి శక్తియొక్క దయను సంపాదించవలెనను అభిలాష కలిగి అట్టి శక్తిని గుఱించిన వివిధ భావపరంపరలు తుదకు ఈశ్వరాస్తిత్వమును, నైతిక ధర్మపథమును, సమాజస్థాపనమును - అను నీ మూడును నేకరూపు దాల్చినవి. అప్పుడే ఒక మతస్వరూపము ఆవిర్భవించి యుండవచ్చును. అయితే పిరికివాని యొక్క ఊహాజనిత ప్రపంచమునుండియే మతముద్భవించిన దనుట యుక్తము కాదు. ఏ విధానము ననుసరించినను మతము ఈ కాలమున కలిగినదని నిర్ణయింప లేము. కనుక, మత మనాది యని చెప్పినను బాధ లేదు.

రెండవవర్గము వారిట్లు చెప్పుదురు :- భగవంతుని ముఖమునుండి వేదము లావిర్భవించెను. వేదముల ననుసరించి సృష్టి జరిగెను. కల్పాదియందు భగవంతునిచేత సృష్టింపబడిన నరులు సర్వోత్తములు, సర్వజ్ఞులు, దీర్ఘాయుష్మంతులు; (అనేక వేల సంవత్సరములు జీవించిన వారు) తేజోవంతులు. వీరినే ప్రజాపతులని, మనువులని పురాణములు పేర్కొన్నవి. వీరి అనంతరము వీరికి జన్మించిన వారు క్రమక్రమముగా ఒక్కొక్క తరమునకును తమ పూర్వులయందున్న గొప్పతనమును కాలము గడచిన కొలదియు కోల్పోవుచు వచ్చిరి. ఈ విధముగా ఇప్పటి సంఘ మేర్పడెను. ఈ పద్ధతి సరియైనదైన మతము, అనాది యని చెప్పవలెను.

యూదుల బైబిల్ (పాతనిబంధన) పై రెండు సిద్ధాంతములను కొంచె మించు మించుగా ఆమోదించునట్లున్నది. బైబిల్ కథనము ఈ క్రిందివిధముగా ఉన్నది :

దేవుడు సృష్టించిన తొలినరుడు 'ఆదాము' (Adam) దేవుని స్వరూపము వంటి వాడు. ఆయన 930 సంవత్సరములు జీవించెను. అతనికి 'హవ్వ' (Eve) యందు షేతు పుట్టెను. షేతు 912 సంవత్సరములు బ్రతికెను. షేతు కుమారుడు ఎనోషు 905 సంవత్సరములు బ్రతికెను. ఇతని కుమారుడు కెయినాను 910 సంవత్సరములు బ్రతికెను. ఈ విధముగ దీర్ఘాయుష్మంతులు పుట్టినట్లు కలదు. కాని వీరు మన పురాణాదులయందు చెప్పినట్టి ప్రజాపతులవంటి తపస్సంపన్నులు, మహిమాఢ్యులు కారు. ఆదిదంపతులగు ఆదాము హవ్వలు (Adam and Eve) మాత్రము 'మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్షఫలము' లను తినుటకు పూర్వము (దాంపత్య సుఖ మెఱుగుటకు పూర్వము) కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య, దంభ, దర్పాదులను దుర్గుణములుగాని; మైత్రి, దయ, మొదలగు సుగుణములుగాని లేక శీతోష్ణాదులను లెక్క చేయక కేవల ముదరపోషణముతో బాలకులవలె హాయిగా కాలము గడిపినట్లు ఊహింపనగును. మంచి చెడ్డలను నిచ్చు ఫలములను ఆదాము దంపతులు భుజించిన పిమ్మట వారి ప్రవృత్తి మారిపోయెను. వారికి పుట్టుకతో వచ్చిన గుణములు పోయి క్రొత్త గుణములు వచ్చెను.

ఆదాము దంపతులకు కయీను, హేబెలు అను కుమారులు కలిగిరి. అందులో జ్యేష్ఠుడగు కయీను హేబెలును కారణము లేకనే హత్య చేసెను. దేవుడైన యెహోవా "హేబెలు ఎక్కడ?" అని కయీనును అడిగినప్పుడు "నాకు తెలియదని" కయీను అబద్ధ మాడెను. దేవుడు స్వహస్తములతో నిర్మించిన ఆదాము దంపతులు పరిశుద్ధులు. వారికి కయీనువంటి అనృతవాదియు, నరహంతకుడును ఎట్లు కలిగెను? కయీను పూర్వజన్మవాసనలు ప్రేరేపింపగా అట్టి పాపము చేసె ననుటకు వారు పూర్వజన్మ సిద్ధాంతమును అంగీకరింపరు కదా? కాని యీ యంశము ఇచట చర్చింప దగినది కాదు. ఇచట కావలసిన దేమన :

హేబెలు మరణానంతరము ఆదాము దంపతులకు షేతు పుట్టెను. ఆ తరువాత ఆదాము దంపతులకు కుమారులు, కుమార్తెలు కలిగిరి.

షేతుకు సంతానము కలిగెను. అప్పటికి హవ్వయు, ఆమెకు కలిగిన కుమార్తెలు తప్ప అప్పటికి ప్రపంచమున స్త్రీలు పుట్టియుండలేదే? - షేతుకు భార్య యెక్కడిది? బహుశః షేతు తన చెల్లెంద్రయందు ఒకతెను కలిసినప్పుడుగాని తల్లియగు హవ్వయందుగాని అతనికి సంతతి కలిగియుండును. సోదరుని సోదరుడు నిష్కారణముగ హత్యచేయుటయు, ఏకగర్భసంజాతులగు సోదరీ సోదరులు వివాహ మాడుటయు అడవి మృగములయొక్కయు, పశువులయొక్కయు ప్రవృత్తిని తెలుపుచున్నది.

ప్రస్తుతము మన కీచర్చతో నిమిత్తమేమన? ఇప్పటి కంటె సృష్టి ఆరంభదశయందు భూమి సారవంతముగా నుండి ఫలములు, శాకములు, ధాన్యాది ఆహారపదార్థములు మిక్కిలి సారము గలవి యైనందున ఆ కాలము నరులు వాటిని భుజించి దీర్ఘాయుష్కులు, బలిష్ఠులు, మేధావులునై యుండి రేమో అనిపించును. బైబిల్ నందలి పై కథనము ప్రాచీన, అర్వాచీన సిద్ధాంతములకు మధ్యవర్తిగా నున్నది.

ముఖ్యముగ మానవునికి దేవునితో సంబంధమును కలిగించునట్టి విధానము (సాధనము) తెలుపునదే మతమని చెప్పవచ్చును. కాని, దేవుని అస్తిత్వ మంగీకరింపని బౌద్ధులు మొదలగువా రవలంబించినది మతము కాదా? అనిన అదియును మతమే. 'ఎవరి కేది సమ్మతమో అది వారి మతమని' సామాన్యమగు అర్థము. దేవుని అస్తిత్వ మంగీకరింప కున్నను, జీవితమొక బంధమనియు, దానినుండి విముక్తి పొందవలయు ననియు, లేదా, మానవుని ప్రస్తుతదశకంటె గొప్పదశను (దివ్యత్వమును) పొందుటకు సంప్రదాయ సిద్ధమగు సాధనము, అనుష్ఠానము, ఆచారము, మొదలగు వానియందు విశ్వాసమును కలుగజేసి వాటిని అనుభవములో పెట్టించుట ద్వారా సాధకుని ముక్తస్థితికి (లేక, దివ్యత్వమునకు) చేర్చునట్టి మార్గము మతము. మానవ సంఘమున తొలుత మతము ఎట్లు కలిగినది? అను ప్రశ్న కఠినమైనదే. శ్రీ వివేకానంద స్వాములవారు ఈ విషయమై యిట్లుచెప్పిరి :

"మతము"ను గూర్చిన ప్రథమ జ్ఞానాంకురము స్వప్నముల ద్వారమున వెలువడుట సహజమని నాకు తోచుచున్నది. అమృతత్వమును గూర్చిన ప్రథమ భావనకూడ స్వప్నద్వారముననే లభింపవచ్చును."

ఇది చాల సమంజసమైన యూహయని నా యభిప్రాయము. ఏలయన? నిద్రించిన వాడొకడు వానికి గల బాహ్యప్రపంచ సంబంధమగు జ్ఞానమును వదలి మృతునివలె పడియుండును. వానికి స్వప్నము కలిగిన అది బయటివారికి తెలియదు. వాని శరీరమా కదలదు. స్వప్న ప్రపంచమున వాడు నానావ్యవహారములు చేయుచుండును. దీనినిబట్టి మానవుడు మరణించిన పిమ్మట కూడ స్వప్నములో కనబడినట్టి సూక్ష్మశరీరమువంటి శరీర మొకటి కలదని భావించుట సహజము. కొన్ని స్వప్నముల ఫలితములు నిద్రనుండి మేల్కొన్న వెంటనే జాగ్రదవస్థయందు కనబడుటయు, కొన్ని కాలాంతరమున ఫలితముల నిచ్చుటయు మొదలగు ఇట్టి అనుభవములు- మానవ శక్తికి అందని ఒకానొక అజ్ఞాతశక్తియొక్క యునికిని స్థిరపరచుచున్నవి.

మృతులైనవారు సూక్ష్మశరీరములతో ఉందురని, వారి ఆశీర్వాదము తమకు లభింపవలెనని మృతులైన వారి బంధువులు మృతుల నారాధించుట - అను ఒక ఆచారము ప్రారంభమైనది. ఇదియే పితృపూజ, పితృదేవతారాధన. దీనివలన మతము మఱికొంత స్వరూపము ధరించినది. మృతులైన వారిలో కొందఱు జీవించియున్న వారియందు ప్రవేశించి (ఆవేశించి) తమకు గల కోరికలను తెలిపి తమ బంధువులవలన అట్టికోరికలు తీర్చుకొనుటయు, కొందఱు భవిష్యత్తును తెలుపుటయు, కొందఱు మహిమలను చూపుటయు అను నిట్టివి మతమును వర్ధిల్లజేసినవి.

ముఖ్యముగా ఈశ్వరభావము పెంపొంది మానవుడు ఈశ్వర భక్తి ప్రేరితుడై యీశ్వరారాధన చేయుచుండిన దినములలో భగవదావేశములు (మానవునియందు దేవు డావేశించుట) అప్పుడప్పుడు కలుగుచు మానవు లకు కలిగెడి కష్టములకు నివారణోపాయములను సూచించుచుండినట్లు మతగ్రంథములయందు ప్రాచీన కాలమున నుండియు కనబడుచున్నది.

మతము ప్రతివ్యక్తికి అవసరము. మతమును విడిచి మానవుడు జీవించుట కష్టము. మతప్రమేయము లేని రష్యా మొదలగు దేశములు కలవు గదా? వారు సుఖజీవనము చేయుచుండలేదా? అను ప్రశ్న కలుగును. రష్యా మొదలగు దేశములయందు మతము లేదని చెప్పగూడదు. వారు పూర్వమున్న మతమును విడనాడినను పూర్వ సంప్రదాయములను పూర్తిగా వదలియుండ లేదు. ఇప్పుడు వారవలంబించు సోషలిజమో, లేక కమ్యూనిజమో వారి మతము.* ఎవరికి ఏది సమ్మతమో అది వారిమతమని చెప్పితిని కదా. భవిష్యత్తున దీనియందును మార్పు రావచ్చునేమో. ఎవరు చెప్పగలరు?

మతమువలన కలుగు లాభములు : మతము మానవునకు శక్తిని, తృప్తిని నిచ్చి పుణ్యమును; భక్తిని వృద్ధిపొందించి; తోడిమానవుని సోదరునివలె ప్రేమించి; సేవించు నట్లు చేయునని శ్రీరామకృష్ణపరమహంస యొక్కయు, శ్రీ వివేకానంద స్వామివారి యొక్కయు ప్రవచనములు.

మానవసంఘము వర్ధిల్లుటకు గల కారణములయందు ముఖ్య కారణము మతము. దుష్కృత్యములు చేయకుండ మానవుని అదుపులో నుంచి కాపాడునది మతమే. ఎట్లన : సామాన్య మానవునకు సదసద్వివేచన జ్ఞాన ముండదు. ధర్మనిర్ణయము చేయలేడు. ఒక కుటుంబమునందు గల సోదరీసోదరులును, మాతాపుత్రులును, అన్యోన్యకామ తంత్రములయందు ప్రవర్తింపకుండ జేసినది మతమే. మతము లేని యెడల పశువులు. మృగములు, పక్షులవలె మానవులు ప్రవర్తించి యుందురు. అనేక యుగములయందలి అనుభవమును బట్టి యేది దురాచారమో, యేది సదాచారమో - సంఘమునకు ఆదేశించి దురాచారములయందు భయమును, సదాచారములయందు భక్తిని కలుగునట్లు వాస్తవిక వైజ్ఞానిక

---

* రష్యాలో క్రైస్తవమత మున్నది. క్రైస్తవము సామ్యవాదమును అంగీకరించినది. బైబిల్ క్రొత్తనిబంధన "అపోస్తలుల కార్యములు" 4-5 అధ్యాయములయందు సామ్యవాదము క్రైస్తవములో నెట్లు ప్రారంభింపబడినదో చూడవచ్చును. వర్తమానకాలమున రష్యాప్రజలలో నీశ్వరాస్తిత్వము నంగీకరించినవారు అరుదని వినుచుందుము.

విషయములతో కొన్ని అవాస్తవములగు కల్పనలు చేసి సంఘమును తీర్చిదిద్దినది మతమే. ఒకానొకడు శాస్త్రములు చదువక పోయినను స్వర్గనరకములను చూడక పోయినను, వాటియందు విశ్వాసము కలిగియుండుటకు హేతువు వారవలంబించిన మతమే.

సాంఘిక జీవనమునందు భోజ్యాభోజ్యములను నిర్ణయించి శాసించినది మతమే. హిందువులు గోమాంసభక్షణమును, ముసల్మానులు సూకరమాంస భక్షణమును నిషేధించుటకు మతమే కారణము. అట్లుగాక ప్రతివాడును వాటియొక్క గుణాగుణములను పరిశీలించి, అనుభవ పూర్వకముగ నిషేధించి యుండలేదు. మతము చెప్పినది, కనుక నిషేధించిరి. మతమును విడిచి మానవుడు జీవింప లేడు. ఒక మతమునకు చెందిన మానవుడు సామాన్యముగా తనమతము వారియందు సౌభ్రాతృత్వము కలిగియుండును. ఒక మతమునకు చెందిన వారు భిన్న భిన్న జాతుల వారైనను, భిన్న భిన్న దేశములకు చెందిన వారైనను వారందరు ఒక్కచో కలిసినప్పుడు తాము భిన్న దేశములకు, భిన్న జాతులకు చెందిన వారమను సంగతిని మఱచి పరస్పర సోదర భావమును పెంపొందించు కొందురు. ఆయా సంఘముల యొక్క మనుగడ, లేక వారియొక్క ప్రవర్తన సామాన్యముగా వారవలంబించిన మతమును అనుసరించియుండును. కానీ మతము దురభిమానము చేత కలుషితము కాకుండ నుండవలెను.

మతమువలన కలుగు నష్టము : మతమువలన మానవ సమాజము నకు కలుగు లాభముల గుఱించి చెప్పితిని. అంతమాత్రమున మతమువలన కీడు కలుగలేదని తలపరాదు. మతముపేరిట, దేవుని పేరిట మానవులు చేసిన దుష్కృత్యము లిన్ని యని వర్ణింప సాధ్యము కాదు. తమ మతమునకు చెందిన వాడు కాడన్న కారణముచే సోదర మానవుని ధన, మాన, ప్రాణములను హరించి, వారి స్త్రీలను మానభంగ మొనర్చి వివిధ హింసలకు గుఱిచేసి యున్నారు. ఆస్తిక మతములకు చెందిన రెండు భిన్న మతములవారి మధ్య సంఘర్షణ జరిగినపుడు "మా దేవుడు గొప్పవాడో మీ దేవుడు గొప్ప వాడో యుద్ధమే నిర్ణయించు"

నని ఘోరయుద్ధములు చేసిరి. వారి దేవుడు గొప్పవాడని అంగీకరింపని యితర మతముల వారిని కన్నులు తీయించిరి. తమతో మతవాదమునకు ఢీకొన్న వారిని బలవంతు లగువారు నాలుకలు కోయించిరి. తమ దేవుని కొఱకును, తమ మతానుయాయులను తృప్తిపఱచుట కొఱకును, దారిదోపిడులు చేసి, పరుల ధనమును హరించిరి. ఈ పని తప్పు కాదనియు దేవుడు దీనికి సంతోషించు ననియు గ్రంథములయందు వ్రాయించిరి, వ్రాసిరి. తమ మతమున ప్రవేశింపనొల్లని వారిని ఏనుగులచేత త్రొక్కించిరి. ఇంత కంటెను దారుణకృత్యము లెన్నియో జరిగెను. ఒక్క మాటలో చెప్పవలయునన్న - మతదురభిమానము కారణముగ భూమిపై కలిగినంత రక్తపాతము మఱి యే యితర కారణముల వలన కలుగలేదని చెప్పవచ్చును.

పరమత నిర్మూలమునకై యుద్ధమునందు మరణించినవాడు జీవిత కాలములో నెన్ని పాపములు చేసినను దేవునికి అత్యంత ప్రీతి పాత్రుడని పామరులకు నమ్మకము కలిగించిరి. కొందఱు రాజులు మతమను నెపము పెట్టి తమ సామ్రాజ్య దాహమును మానవ రుధిరపానముచే తీర్చుకొనిరి. మాయావులు, వేషధారులు నగు వ్యక్తులు మతమని, దేవుడని, అమాయకుల మోసగించి అధఃపతితుల చేసిరి. మతముపేరుతో మన దేశము రెండుగా విభజింపబడిన సమయమున జరిగిన ఘోర పాప దురంతములు అంతకుపూర్వము ఎప్పుడును జరిగియుండలేదని మన కనుభవమే. మానభంగ మొనర్పబడిన స్త్రీలు కొందరగ్నిలో పడి మృతినొందిరి. కొందఱు బావిలో దుమికి మరణించిరి. కొందఱు తమ శీలమును కాపాడుకొనదలచి ముందే ఆత్మహత్యలు గావించుకొనిరి. కొందఱు కన్యలు అపహరింపబడి, బ్రతికియుండియు వారి కత్యంత ప్రేమాస్పదులగు తల్లితండ్రుల నుండియు, బంధుజనముల నుండియు శాశ్వతముగ వేఱుగావింపబడిరి.

అవి అన్నియు చూచిన కొందఱు దేవుడు లేడని నిశ్చయించుకొనిరి. ఉండినచో నాతడేల యివి యన్నియు చూచు చుండియు ఉపేక్షించు ననిరి. దేవుడున్నను అతడు తమసంగతిని పట్టించుకొనడని కొందఱు

నిశ్చయించిరి. ఈ కారణముల వలన కొందఱు సజ్జనులు మతమనిన అసహ్యించుకొనిరి. కొందఱు దేవుని మాటయే యెత్తక మౌనము వహించిరి. వీరందఱును నాస్తికులు కారు. గత చరిత్ర వారి నిట్లు విరక్తుల చేసినది. పాకిస్తాన్ ఏర్పడినపుడు జరిగిన దురంతములను ఏ కవి వర్ణింపగలడు?

కొందఱు తమ మతమును బలవంతముగా నితరులపై రుద్దుటకు కత్తిని ఝుళిపించి 'నా మతమును గైకొందువో మృత్యువును కోరుకొందువో తేల్చివేయుము' నిరి. అందుకు సమాధానముగా కొందఱు మృత్యువునే గైకొనిరి. మఱి కొందఱు మతమును మార్చికొని బ్రతికిరి. కొందఱు అధికారమును, ధనమును చూపి అన్యమతములవారిని తమ మతమునందు కలుపుకొనిరి. కాని, యిందులోని విచిత్ర మేమనగా: ఇతరులను తమ మతమున ఏ విధముగా చేర్చుకొన్నను తాము చేయు ఈ కార్యము పతితుల నుద్ధరించుటకే యనియు, ఇది ఒక విధముగా భగవంతుని సేవయే యనియు వారు నమ్మిరి, నమ్ముచున్నారు కూడ. భౌతిక విజ్ఞానము మానవుని చంద్రలోకమునకు గొని పోయి తిరిగి భూలోకమునకు తెచ్చిన యీ కాలమున కూడ మత దురభిమానము నశింప లేదు. ఈ కారణములవలన మంచి చేసిన మతమే దురభిమాన పిశాచగ్రస్తమై మానవునిచేత పైశాచిక కృత్యములు చేయించుచున్నది.

కనుక మతము మంచి చెడుగులను రెండును కలిగించును. మత దురభిమానమును వదలిన మతము మంచి ఫలితమునే యిచ్చును. మత దురభిమానమును వదలని మతము పాపఫలితమునే యిచ్చును.

హిందూమతమునకు చెందిన రాజులయందు పెక్కండ్రు అన్యమతమునకు చెందిన తమ ప్రజలయందు ద్వేషభావము వహింపక సమబుద్ధిని చూపిరి. బౌద్ధమతావలంబులగు రాజులు కూడ చాలవఱకు మత సహనమునే వహించిరి. ముసల్మానులయందు అరుదుగా అక్బర్ చక్రవర్తి వంటి వారు కలరు. తక్కిన పాదుషాలు, నవాబులు మతదురభిమానులై ప్రజలను హింసించిరి.

(3) మతములు - వాటిని పోషించిన గ్రంథములు

వేదములయందలి యజ్ఞయాగాదులను (కర్మకాండను) విస్తరింప జేసిన "బ్రహ్మణముల"ను, జ్ఞానకాండమునకు చెందిన ఉపనిషత్తులను, వాటి నాధారముగ వెలువడిన దర్శనములను దిఙ్మాత్రముగా విచారించితిమి. మఱియు, మతమనగా ఏమి? అదెట్లు కలిగినది? దాని వలన మానవ సంఘమునకు కలిగిన లాభనష్టము లేవి? మొదలగున వన్నియును సంగ్రహముగ తెలిసికొంటిమి. మన దేశమునందు పుట్టిన మతము లన్నియు వైదికములే వైదికమహావృక్షము నుండి కలిగిన మతశాఖ లేవేవి? అను అంశము విచారింప వలయును. దర్శనములు ఆఱు అన్నట్లే మతములు సహితము ఆఱైనవి. అవి యివి :

వైష్ణవము, శైవము, శాక్తము, గాణాపత్యము, కౌమారము, సౌరము. (కౌమారమునకు బదులు కాపాలిక మని కొందఱు వ్రాసిరి. అది యుక్తము కాదని నా అభిప్రాయము) ఇందులో వైష్ణవముతప్ప తక్కినవి శైవశాఖ యొక్క ఉపశాఖలని చెప్పవచ్చును. వైష్ణవము విష్ణుపారమ్యమును తెలుపును. అనగా విష్ణుదేవుడే పరతత్త్వమనియు, ఆయనకు సముడుగాని ఆయనకంటె అధికుడగు దేవుడుగాని, దేవతగాని లేడ (లేద) ని తెలుపునట్టిది. అట్లే శైవము శివపారమ్యమును తెలుపును. శాక్తేయము శక్తిని పరతత్త్వమని చెప్పును. గాణాపత్యము గణపతి పారమ్యమును తెలుపును. కౌమారము సహితము పై విధముననే కుమారస్వామి పరదేవతయని చెప్పును. సౌరము అనగా; సూర్యుడే పరదేవతయను మతము.

సూర్యుడు సృష్టి స్థితి లయకారుడనియు చెప్పుదురు. ఆయన అగ్ని తత్త్వమగుటవలన శైవమతముయొక్క ఉపశాఖయనియు, విష్ణుదేవుడు సూర్యమండలాంతర్గతుడని చెప్పుటవలన ఈ మతము వైష్ణవమునకు ఉపశాఖయనియు చెప్పుదురు. ఇవియే షణ్మతములు. ఇవి వైదికములు.

జైన, బౌద్ధములు అవైదికములని యందురు. అవి యెంతవఱకు సత్యమో ఆ మతములను గుఱించి చెప్పునపుడు పరిశీలించ వచ్చును.

వేదములు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఆగమములు, పురాణములు, ఇతిహాసములు. మొదలగునవికూడ వైదిక మతమును పోషించునవి. ఉపనిషత్తులు తత్త్వజ్ఞానమును బోధించినను అచ్చటచ్చట మత సంపర్కముకూడ కలిగి యున్నవి.

ఆగమము లనగా : ఏ యే దేవతల కెట్టి దేవాలయములు నిర్మింప వలయునో, దాని వాస్తువిధాన మెట్టిదో, దేవాలయ నిర్మాణమున కుపయో గించు శిలలు, దారువులు, ఇటుకలు, గచ్చు మొదలగునవి యెట్లుండ వలయునో, వాటిని ఉత్పత్తిచేయు విధమెట్లో; దేవాలయ ప్రాకార, గోపుర, కల్యాణ మండప, గర్భాలయాదులు ఎట్లు నిర్మింప వలయునో తెలియ జేయును. దేవాలయములయందు ప్రతిష్ఠించు ఆయా దేవతావిగ్రహములు, లేక శివలింగములు ఎట్టివిగా ఉండవలెనో; ఆగమ మంత్రములచే ఆ దేవతలను విగ్రహమునందు నివసించునట్లు ఆవాహనము చేసి (ఆహ్వానించి) ప్రతిష్ఠించు విధానమును తెలియజేయును. అట్లు దేవతా ప్రతిష్ఠ జరిగిన పిమ్మట ఆమూర్తిని దేవతాబుద్ధితో చూడవలెను. శిలాదృష్టితో చూడరాదు. ఆయా దేవతలకు ఆగమోక్త విధమున నిత్య కైంకర్యములు అనగా: అభిషేకము, వస్త్రధారణము, నైవేద్యము, పుష్పమాల్యాదులతో అలంకరించుట, మంత్రములతో పుష్పములతో పూజించుట మొదలగు విషయములను ఆగమములు విధించును. ఇందలి మంత్రతంత్రములకు వేదములే మూలమందురు. ఆగమములందు అవైదికములు కూడ కలవందురు.

దేవతలు మంత్రములచే ఆహ్వానింపబడి (ఆవాహనము చేయబడి) విగ్రహములయందు ప్రవేశింతురు. కనుక దేవతాగమమును తెలుపునవి యగుటవలన వీటిని ఆగమములని, సంహితలని అందురు. మఱియు ఆగత,గత, మత శబ్దముల ఆద్యక్షరములు ఒక దానిప్రక్క నొకటి చేర్చి పలికిన 'ఆగమ' శబ్దమగుచున్నది. అనగా : ఆగతాగత మత విషయములు వివరించునవి కావున ఆగమములని పేరు. ఆగమ శబ్దమునకు అనేకార్థములను చెప్పుదురు.

వైష్ణవము, శైవము, శాక్తము అని ఆగమములు మూడు విధములు. శాక్తేయ ఆగమములను తంత్రము లందురు. గాణాపత్య, భైరవాది తంత్రములును మఱికొన్ని కలవు. దక్షిణ భారతమున వైష్ణవ శైవాగమము లును, ఉత్తర భారతమున తంత్రములును ఎక్కువ ప్రచారములో ఉన్నవి. ఆగమములయందు విగ్రహ ప్రతిష్ఠయేగాక చక్ర (యంత్ర) ప్రతిష్ఠయు కలదు. శ్రీ చక్రము, దుర్గాయంత్రము మొదలగునవి. ఆగమోక్త ప్రకారము ఉద్ధారము చేసి ఆయా దేవతలను యంత్రము నందుండు నట్లు ఆహ్వానింతురు. అట్టి యంత్రపూజ దేవతా పూజయే.

పురాణము లనగా నేవి? అవి ఎన్ని? పురాణము యొక్క లక్షణము ఈ క్రింది విధముగా చెప్పిరి.

శ్లో|| **"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వన్తరాణి చ|**
వంశానుచరితం చేతి లక్షణానాం తు పఞ్చకమ్"||

1. సర్గము, 2. ప్రతిసర్గము, 3. వంశము, 4. మన్వంతరములు, 5. వంశాను చరితములు అను ఐదులక్షణములు పురాణములయందు కానవచ్చుటచే "పురాణం పంచలక్షణమ్" అని ప్రసిద్ధి కలిగినది.

1. **సర్గము అనగా :** కల్పము యొక్క ఆరంభదశ. సృష్టికి ఆరంభము లేదు. మహాభూతములు నశించిన (లయమయిన) పిమ్మట తిరిగి కల్పము ఆరంభమగుట సర్గము.

2. **ప్రతిసర్గమనగా :** చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడును, ఆయనచే పుట్టింపబడిన ప్రజాపతులును సృష్టిచేసిన విధము.

3. **వంశమనగా :** దేవదానవదైత్య గంధర్వాది వివిధ భేదసృష్టియొక్క వివరము; బ్రహ్మర్షి దేవర్షి గణముల యొక్క ఉత్పత్తి.

4. **మన్వంతరము లనగా :** అందు పదునలుగురు మనువులయొక్క ఉత్పత్తియు వారి పరిపాలన కాలమును, మొదలగు వర్ణనలు ఉండును.

5. **వంశానుచరితము లనగా :** సూర్యచంద్రాన్వయముల యందు పుట్టిన మహారాజుల చరిత్రములును అందు వర్ణింపబడియుండును.

ధర్మాత్ములు వర్ధిల్లుటయు, దుష్టులైన రాజులు పతితు లగుటయు, వారి చరితములయందు కానవచ్చును.

భాగవత పురాణము దశలక్షణములను చెప్పెను.

"దశలక్షణంబు లెవ్వియనిన : సర్గంబును, విసర్గంబును, స్థానంబును, పోషణంబును, ఊతలును, మన్వంతరంబులును, వంశానుచరితంబులును, నిరోధంబును, ముక్తియు, ఆశ్రయంబును నన బది తెఱంగులయ్యె"
(ఆంధ్ర.భాగ.ద్వి. 259)

(1) **సర్గము** : మహదహంకార పంచతన్మాత్రలు. గగనాది పంచ భూతముల సృష్టి భగవంతునినుండి కలుగుట. (2) **విసర్గము:** విరాట్పురుషుని వలన బ్రహ్మదేవుడు కలిగి చరాచర సృష్టి చేయుట. (3) **స్థానము:** భగవంతుడగు హరి దుష్టశిక్షణ చేయు జయము. (4) **పోషణము:** శ్రీహరి భక్తపోషణము చేయుట. (5) **ఊతలు** : కర్మ వాసనలను గుఱించి చెప్పుట. (6) **మన్వంతరములు:** శ్రీహరి కృపతో, ఆయన భక్తులు లోకపాలక విభూతి మహిమలను పొంది వారి ధర్మములను విస్తరింపజేయుట. (7) **ఈశాను కథలు:** శ్రీహరి అవతారములను విస్తరించి చెప్పుట. (8) **నిరోధము:** సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడు యోగనిద్రారతియందున్న సమయమున అఖిల జీవులు సమస్తవ్యాపార శూన్యులై యుండుట. (9) **ముక్తి:** జీవుడు భక్తి మార్గమున కృతార్థుడై శ్రీహరి రూపమును బొందుట. (10) **ఆశ్రయము:** ఉత్పత్తిలయాదులు ప్రకాశించుటకు ఆశ్రయ మయినది.

ఈ విధముగా పురాణాదులయందు వైదిక ధర్మము పోషింపబడినది. పురాణములను లాక్షణికులు మిత్రసమ్మితములుగా పరిగణించిరి. అనగా: స్నేహితుని మేలుకోరి అతని మిత్రుడు ధర్మములను బోధించునట్లు బోధించు నట్టివి యని తాత్పర్యము.

పురాణములు అతి ప్రాచీనములని కొందఱు చెప్పుదురు. పురాణమను పేరు ప్రాచీనమను అర్థమును సూచించును. కొందఱు

ఇవి వేదములకంటె ముందే పుట్టినవగుట వలన వీటికి పురాణములని పేరు కలిగినదని చెప్పుదురు. కాని యీనిర్ణయము చారిత్రకాధారములపై చేసినది కాదు. ప్రరోచనార్థకములని నా అభిప్రాయము. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు పురాణయుగము క్రీస్తునకు పూర్వము ఆఱువందల సంవత్సరముల నుండి క్రీస్తు పుట్టిన వెనుక రెండు వందల సంవత్సరములవఱకు ఉండవచ్చునని వారి "భారతీయ తత్త్వశాస్త్రము" నందు చెప్పిరి. అనగా : వేదయుగము అంతరించిన వెంటనే పురాణ యుగము ఆరంభమైనదని వారి భావము. పురాణముకంటె కొంచెము ముందే మహాభారతము, హరివంశము రచియింపబడి యుండవచ్చును.

పురాణములు పదునెనిమిది. వాటి క్రమమును, అవి శైవ వైష్ణవాది యే యే మతములకు చెందినవియు, వాటి శ్లోకసంఖ్యయు, ఈ క్రింది విధముగా నుండును.

(1) బ్రహ్మపురాణము 10000. (2) పద్మపురాణము 55000. (3) విష్ణుపురాణము 23000. (4) శివ పురాణము 24000). (5) (శ్రీ దేవీ) భాగవతము 18000, శ్రీమద్భాగవతము 18000. (6) భవిష్యత్ పురాణము 14500. (7) నారద పురాణము 25000. (8) మార్కండేయ పురాణము 8000. (9) అగ్ని పురాణము 15400. (10) బ్రహ్మవైవర్తపురాణము 18000. (11) లింగ పురాణము 11000. (12) వామనపురాణము 10000. (13) స్కాంధపురాణము 81100. (14) మత్స్యపురాణము 14000. (15) కూర్మపురాణము 17000. (16) వరాహ పురాణము 25000. (17) గరుడ పురాణము 19000. (18) బ్రహ్మాండ పురాణము 12000. దేవీభాగవత, శ్రీమద్భాగవతములలో ఒక దానిని వదలిన మొత్తము పురాణముల శ్లోకసంఖ్య నాలుగులక్షలు.

కొందఱు శివపురాణమును వదలి దాని స్థానమున వాయుపురాణ మును చెప్పుదురు. పెక్కండ్రు శివ పురాణమునే అష్టాదశపురాణములో చెప్పియున్నారు. శ్రీమద్భాగవతము అష్టాదశపురాణములో చేరునని కొందఱును, అట్లు కాదు దేవీభాగవతము చేరునని కొందఱును అందురు.

భాగవతపురాణమును దేవీభాగవతమును సమాన శ్లోకసంఖ్యగలవియే* ఈ పురాణములయందు 4,9,11.13, 14, 15వ పురాణములు తామసములు - 1,6,8,10, 12, 18వ పురాణములు రాజసములు- తక్కిన - 2,3,5,7,16,17వ పురాణములు సాత్త్వికములు.

ఉపపురాణములు 18. (1) సనత్కుమార (2) నారసింహ (3) స్కాంధ (4) శివధర్మ (5) దుర్వాస (6) నారద (7) కాపిల (8) వామన (9) ఔశనస (10) బ్రహ్మాండ (11) వారుణ (12) కాలికా (13) మాహేశ్వర (14) సాంబ (15) సౌర (16) పారాశర (17) మారీచ (18) భార్గవములు అని కొందఱును, (1) నారసింహ (2) నందీశ్వర (3) సాంబ అను ఈ మూడే ఉపపురాణములని కొందఱును చెప్పుదురు.

జిజ్ఞాసువు : అయ్యా! భాగవతపురాణము అష్టాదశ పురాణములలో చేరదనియే మీ యభిప్రాయమా?

వేదాంతి : మనకావిచారముతో పనిలేదు. అయినను సూక్ష్మముగా చెప్పెదను. భాగవతమునందలి వేదాంతము నవీన (అర్వాచీన) మైనది. వల్లభ, నింబార్క, కృష్ణ చైతన్యులు అను ముగ్వురును భాగవతమును సర్వోత్తమ గ్రంథముగా భావించుటవలనను, ఇతర పురాణములను ప్రమాణముగా అంగీకరింపక పోవుటవలనను, దీనికి కలిగిన గౌరవమును బట్టి భాగవతము ప్రత్యేక గ్రంథమనియే నా యభిప్రాయము.

పురాణములు వేదోపబృంహితములు అనగా: వేదములయందు చెప్పిన అర్థమునే సామాన్యులకు తత్త్వము సులభగ్రాహ్య మగునట్లుగను, పామరులకు మనోరంజకములగు ఇతిహాసములతోను, కల్పితగాథలతోను, వైదిక మతధర్మమును బోధించునవి. మహాభారతము వీటన్నిటికి శిరోమణి వంటిది. మహాభారతమువంటి యితిహాసము ప్రపంచమున నింతవఱకు రచింపబడలేదని శ్రీ లోకమాన్యతిలక్ గారు గీతారహస్యము నందు చెప్పిరి. ఇందులో లేశమైనను అతిశయోక్తి లేదు. పురాణములు

* శ్రీ భాగవతము పురాణ మొకటి కలదు. అది అష్టాదశ పురాణములలోనిదని అందురు.

మతధర్మములు బోధించుటయేగాక ఉపనిషత్తులయందలి నిగూఢతత్త్వము లను సుబోధక మగునట్లు చేసినవి.

మహాభారతమునందును, పురాణములయందును శివుడు త్రిపుర సంహార మొనర్చినట్లు చెప్పబడిన కథ తాత్త్వికాంశములయొక్క రూపకల్పనయే. అచట త్రిపురములనగా : మనకు గల స్థూల, సూక్ష్మ, కారణశరీరములు. ఈ శరీరత్రయమును దగ్ధమొనర్చినవాడు శివుడని కథ బోధించును.

మన గ్రంథములయందేగాక గ్రీకుల పురాణగాథల యందును నిట్టి కథలు గలవు. అందు ఒక కథ యిట్లున్నది:- ఒక భయంకర సర్పమునకు మూడుతలలు ఉండినవట. అందు ఒకటి మేకతల, ఇంకొకటి పెద్దపులితల, మఱియొకటి నిప్పులుగ్రక్కు పాముతల. ఒక యువకుడు తెల్లని రెక్కలు గల గుఱ్ఱము నెక్కి ఆ భయంకర సర్పము యొక్క మూడు శిరములను ఖండించి, ఆ దేశపు రాజపుత్రికను వివాహమాడెనట. కథయందు చెప్పిన పక్షములు గల శ్వేతాశ్వమే బ్రహ్మజ్ఞానము. (తత్త్వజ్ఞానము) మూడు శిరములుగల సర్పమే అవిద్య. దానివలన తోచు మూడు శరీరములే మూడు శిరములు. రాజపుత్రికను వివాహమాడుట యనగా: అవిద్యను నాశనమొనర్చి మోక్షలక్ష్మిని చేపట్టుట.

వేదములయందు చెప్పబడిన వృత్రుడు వ్యక్తి కాడు. పురాణముల యందు చిత్రకేతుడను గంధర్వుడు పార్వతీ దేవి శాపమున త్వష్టచేయు యజ్ఞమున వృత్రాసురుడై పుట్టి యుద్ధమున ఇంద్రునిచే చంపబడినట్లు చెప్పబడినది. ఇట్లే వేదముల యందలి, అనేక విషయములు పురాణములయందు కథలుగా చెప్పబడినవి.

పురాణము లన్నియు పంచలక్షణములను ఆచరించినను ఒక పురాణమునందు చెప్పిన విషయములనే యితర పురాణములు కొన్ని చెప్పియున్నవి. కాని, ఒక పురాణమునందు చెప్పని విషయములు వేరొక పురాణమునందు గలవు. అదియునుగాక ఒక పురాణమునందు సూక్ష్మముగ సంగ్రహముగ చెప్పిన యంశమును వేఱొక పురాణము

విస్తరించి చెప్పుటయేగాక పై పురాణమును చదువునపుడు కలుగు సంశయములను సయితము నివారించినవి. హరివంశమునందును, విష్ణుపురాణమునందును చెప్పిన శ్రీ కృష్ణగాథలు భాగవతమున లేవు. బ్రహ్మవైవర్త పురాణమందు చెప్పిన గోలోక ప్రస్తావన భాగవతమున లేదు. శ్రీమద్రామాయణమున శృంగబేరి గ్రామాధిపతియగు గుహుడను నిషాదుని పూర్వచరిత్రము శివపురాణమునందు గలదు రామాయణము నందు లేదు. నలదమయంతుల పూర్వజన్మ వృత్తాంతము శివ పురాణమున కలదు, మహాభారతమున లేదు.

ఇంతేగాక ఒక పురాణమునందలి దోషములను ఇంకొక పురాణము చక్కదిద్దినట్లు పెక్కు సందర్భములయందు కానబడును. ఒక పురాణముయొక్క ప్రశస్తిని వేఱొక పురాణము తగ్గించిన సందర్భములు సహితము కలవు. ఉదాహరణమునకు: భాగవత, విష్ణుపురాణములయందు శ్రీ హరి నరసింహావతారమెత్తి హిరణ్యకశిపుని చంపినట్లున్నది. నరసింహస్వామిని శివుడు శరభ రూపమున శిరఃఖండనము చేసినట్లు శివపురాణమున కలదు.

స్కాంద పురాణము పురాణములలో కెల్ల పెద్ద గ్రంథము. ఇది శివునివలన కుమారస్వామి (స్కందుడు) విని భృగుమహర్షికి చెప్పెను. ఈ పురాణము శతకోటి శ్లోకములు కలద్తై యుండగా వ్యాస మహర్షి దీనిని కుదించిరట. ఈ పురాణము శైవమైనను వైష్ణవ ధర్మమును సహితము చెప్పినది. ఇందులో బ్రహ్మ, విష్ణు, శివ, భాస్కరుల మహిమలు, జగత్సంహార కథనమును కలదగుటచే ఇవియే పంచలక్షణములని చెప్పబడెను. తక్కిన పురాణములయందు అన్వయించు పంచలక్షణము కంటె ఇవి భిన్నములు.

స్కాందమున భరతఖండమున గల ఉత్తమములగు శైవ వైష్ణవాది పుణ్యక్షేత్రములయొక్కయు, పుణ్యతీర్థముల యొక్కయు మాహాత్మ్యము వర్ణింపబడినది. శైవమయ్యును వైష్ణవులు సయితము దీనిని గౌరవింతురు. ఇందులో లేని పుణ్యక్షేత్రములు గౌరవింపబడవని అనేకులు తమకు

అభిమానమగు స్థలపురాణములను పుణ్యక్షేత్ర పుణ్యతీర్థముల మహిమలను వ్రాసి యిందు ప్రక్షిప్తము గావించి రనునది నిజము. ఉపపురాణముల యందు ఒక్క స్కంధపురాణము గలదు. అది సంహితాత్మకము. అందులో తత్త్వజ్ఞాన బోధకములేగాక పుణ్యతీర్థ (క్షేత్ర) మహిమలును కలవు.

కాని, పురాణములయందు, వాటి రచనాకాలమందు కాకపోయినను తరువాతి కాలమున కొంత మాలిన్యము ప్రవేశించినది. బౌద్ధయుగమునందు అట్టి మార్పులు జరిగి యుండవచ్చును. వేదములయందు, వేదములు శూద్రాదులు చదువకూడదను నిషేధము ఎచ్చటను లేదు. పురాణములు ఈ అంశమును అతి కఠినముగను, నిర్దాక్షిణ్యముగను, వేదవిరుద్ధముగను విస్తరించి చెప్పినవి. వైదికమతము ప్రపంచ వ్యాప్తము కానున్న సమయమున ధర్మశాస్త్రములయందలి వర్ణవ్యవస్థకు సంబంధించిన సంకుచిత భావములను పురాణములు గ్రహించి వైదికమత ధర్మము వ్యాప్తిచెందకుండ నిరోధించినవి. వర్ణవ్యవస్థ శృంఖలములు లేని బౌద్ధజైనమతముల యందు హిందువులకు ద్వేషమును కలిగించి వారి బుద్ధిని వక్రమార్గమునకు త్రిప్పినవి. ఇందుకు నిదర్శనముగా కొన్ని గాథలున్నవి.

వేదధర్మావలంబులగు రాక్షసులను సన్మార్గముల నుండి దుర్మార్గ వర్తులుగా చేయుటకు విష్ణుదేవుడే గౌతమబుద్ధుడుగా అవతరించి రాక్షసులను వేద బాహ్యులనుగా చేసి నిర్మూలించినట్లు గాథలు కల్పించిరి. అంగపుత్రుడగు వేనుడను రాజును ధర్మ భ్రష్టునిగా చేయుటకు విష్ణువు జినుడై (దిగంబరుడై)వచ్చి నాస్తికమతమును బోధించినట్లు కలదు. శుక్రాచార్యులు తపమున కేగియుండు సమయమున బృహస్పతి శుక్రరూపమున వచ్చి ధర్మాత్ములును, వేదధర్మావలంబులును నగు రాక్షసులను నాస్తికమార్గమునకు త్రిప్పెనని పద్మపురాణము చెప్పినది. ధర్మోద్ధరణమునకై భగవంతుడు అవతరించునుగాని ధర్మాత్ములను ధర్మవిరుద్ధమార్గమున నడిపించుటకు అవతరించునా? ఇచ్చట రాక్షసు లనబడు వారలెవ్వరు? ఆర్యేతరులలో కొందఱిని రాక్షసులనియు,

కొందఱిని దేవతలనియు గాథలయందు వర్ణించిరి. ఆర్యులయందు తప్ప ఆర్యేతరుల జాతులయందు వర్ణవ్యవస్థ లేదు.

పురాణములయందు చెప్పబడిన దేవతలు వేరు; ఉపనిషత్తుల యందును, వేదములయందును వర్ణింపబడిన దేవతలు వేరు. పురాణముల యందలి దేవతలు అత్యధిక శక్తిసంపన్నులైన నరులే. మానవులతో వారును సంబంధబాంధవ్యములు కలిగియుండిరి. ఒకానొక కాలమున టిబెట్ (త్రివిష్టపము) స్వర్గముగాను, ఇంకొక కాలమున ఉత్తర ధృవభూమిని (మేరువును) స్వర్గముగాను పూర్వులు భావించినట్లు బోధపడును.

ఏమైననేమి బౌద్ధమహాంబుధి పొంగివచ్చినపుడు హిందూమతము నిలుచుటకు ద్వీపములవలె మహాభారతము, రామాయణము, పురాణములు ఆశ్రయమిచ్చి రక్షించినవని చెప్పవచ్చును.

(4) విశిష్టాద్వైతము - (శ్రీవైష్ణవము)

జిజ్ఞాసువు : అయ్యా! విశిష్ణాద్వైతమును గుఱించి కొంత వినియుంటిని, అయినను మరల వైష్ణవ శైవమతముల నన్నింటిని సంగ్రహముగా ఆనతిండు.

వేదాంతి : విశిష్టాద్వైతము (1) ఉపనిషత్తులు, (2) వైష్ణవాగమములు, (3) ఆళ్వారుల ప్రబంధములు (నాలాయిరం) - అను మూడింటివలన నేర్పడిన మతతత్త్వము. నాథముని, యామున, రామానుజులు - ఈ ముువ్వురును పై మూడింటివలన విశిష్టాద్వైతమును స్థాపించిరి. 1. తత్త్వము. 2. హితము. 3. పురుషార్థము (ఉపాయము) అని యీ సిద్ధాంతమును మూడు విధములుగా విభజించి తెలుసుకొనవలెను.

తత్త్వము : తత్త్వము మూడు విధములు 1. ఈశ్వరుడు, 2. జీవుడు, 3. ప్రకృతి- జీవునకు 'చిత్తు' అని, ప్రకృతికి 'అచిత్తు' అని నామాంతరములు కలవు. ఈశ్వరుడు ఉపనిషత్తులయందు చెప్పబడు పరబ్రహ్మము లేక పరతత్త్వము - ఈ మూడు తత్త్వములు ఏకముగా గణింపవలయు ననునదే ఈ మతమునందలి విశేషము.

తత్త్వముల వివరములు : (1) ఈశ్వరుడు : శ్రీ శంకరాచార్యులవారు చెప్పు శబలబ్రహ్మము [మాయయందు ప్రతిఫలించిన బ్రహ్మచైతన్యము] కాదు. నిర్గుణుడు కాడు. ఈ మతము ననుసరించి ఈశ్వరుడు హేయగుణములు లేని వాడు. కనుక ఉపనిషత్తులు ఈశ్వరుని 'నిర్గుణుడ'ని చెప్పిన వందురు. ఈశ్వరుడు సగుణమూర్తి, అనగా : ప్రకృతి గుణములగు సత్త్వము, రజస్సు, తమస్సు అను గుణములు కలవాడని అర్థము కాదు. అనంతకల్యాణగుణుడని అర్థము. జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, తేజఃశక్తులను షడ్గుణములు పూర్ణముగ కలవాడు. ఈ షడ్గుణములకు 'భగమ'ని పేరు. ఇది కలవాడు కనుక ఈశ్వరుని భగవంతుడందురు. ఈశ్వరుడు సర్వవస్తువులకు ఆత్మ. సర్వము ఈశ్వరునకు శరీరము. పైన చెప్పిన చిదచిత్తులు రెండును ఈశ్వరునకు శరీరము. ఈశ్వరుడు శరీరి. ఆయనకు చిదచిత్తులు విశేషము. ఈశ్వరుడు విశేషి. ఆ కారణము వలన ఈశ్వరుడు చిదచిద్విశిష్టుడు. చిదచిద్విశిష్టమగు బ్రహ్మ మొక్కటే [ఏకమే]. కనుక విశిష్టాద్వైతమని యీ మతమునకు పేరు.* ఇందువలన **"ఏకమే వాద్వితీయం బ్రహ్మ".**

"ఏకం సద్విప్రా బహుధా వదన్తి", "సర్వం ఖల్విదం బ్రహ్మ" "నేహ నా నాస్తికించిన", అను అద్వైత ప్రతిపాదికములగు శ్రుతి వాక్యములకు ఈ సిద్ధాంతము విరుద్ధము కాదు. ఆశ్రుతి వాక్యములు గౌణములని వీరు త్రోసివేయుదురు. ప్రకృతియు, జీవులును ఈశ్వరునికి శరీరమైనచో వాటికికలుగు దోషములు శరీరియగు ఈశ్వరునికి అంటవా?

---

* భారతీయ తత్త్వవేత్తల మార్గము ననుసరించి క్రైస్తవులును తమ మతమున తత్త్వజ్ఞానమును ప్రవేశ పెట్టిరి. దేవుని పూర్ణత్వమును గురించి యిట్లు చెప్పుదురు: 1. పిత (దేవుడు) 2. పుత్రుడు (క్రీస్తు) 3. పరిశుద్ధాత్మ (స్పిరిత్తుసాంక్తు)- ఈ ముగ్గురును వేఱు వేఱు తత్త్వములైనను ఏకమే. ముగ్గురియందు నే ఒక్కరు తక్కిన యిరువురకంటె భిన్నులుగాని, అధికులుగాని కాదు. ఈ భిన్నత్వమందు ఏకత్వము అతిరహస్యము, మనబుద్ధి కందదందురు. బైబిల్‌లోని అనేక చోట్ల క్రీస్తు, మానవుడు - దేవుడుకూడ అని చెప్పియున్నారు. ఇదియు ఒకవిధమగు అద్వైతమే. "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడై యుండుగాక" అని యున్నది. (పౌలు II కొరింథీయులకు 13-14)

అనిన అంటువు. అదియే ఈశ్వరుని యందలి గొప్పతనము. మనయందు సయితము శరీరధర్మములు శరీరియగు ఆత్మ నంటవు కదా? ఈశ్వరుడు జ్ఞానస్వరూపుడు. ఆయన ధర్మభూత జ్ఞానము కలవాడు. ఈ జ్ఞానమునకు సంకోచ మనునది ఎప్పుడును కలుగదు. ఈశ్వరుడు శరీరి, తక్కిన రెండు తత్త్వములు ఆయన శరీరమని చెప్పుటవలన, (నీసంబంధమువలన) బ్రహ్మమునకు ఏకత్వమున నానాత్మమును సిద్ధించుచున్నది. ఎట్లనగా:

నీ శరీరమునందు జీవుడున్నాడు. జీవుడు లేక పోయిన శరీరము నిలువదు, నాశన మొందును. శరీరమునందున్న జీవుడు (ఆత్మ) శరీరి. ఇదే విధముగా అణుప్రమాణము గల ఆత్మయందు అంతర్యామి రూపమున సర్వేశ్వరు డున్నాడు. అప్పుడు సర్వేశ్వరునకు ఆత్మ శరీర మగును. ఈశ్వరుడు శేషి. జీవుడు ఆయనకు శేషభూతుడుగ నుండును. ఆత్మ చిత్తు, భగవంతునకు శరీరము అచిత్తు. ఈ చిదచిత్తులు రెండును పైవిధముగ భగవంతునకు శరీరములై యున్నవి. భగవంతుడు శరీరి, ఈ చిదచిత్తులకు నియామకుడు, ప్రభువు, ఈశ్వరుడు, చిదచిత్తులు- ఈ మూడు తత్త్వములకు గల సంబంధము అపృథక్సిద్ధ సంబంధ మందురు. చిదచిత్తులు భగవంతునకు విశేషము లగుటచే భగవంతుడు చిదచిద్విశిష్టుడు. ఈ మూడు తత్త్వములు కలిసియే పురుషు డందురు.

ఇందుకొక దృష్టాంతము : ఒక మామిడి పండును గైకొనుము. దానిపైన చర్మము, లోపల గుజ్జు, దానిలోపల విత్తనము - (బీజము) ఈ మూడును ఒక దానికంటె మఱియొకటి భిన్నము. కాని, మూడును ఒక మామిడి పండే. ఇచట భిన్నత్వమునందు ఏకత్వము. ఏకత్వమునందు భిన్నత్వము. మానవ శరీరము (పిండము) బ్రహ్మాండముయొక్క అల్పరూపము. (Micro Model) సూక్ష్మము. ఇట్టి చిదచిత్తులతోడి సమస్త బ్రహ్మాండమును ఆయన విశ్వరూపము (Macro-Model). ఇట్లనుటవలన అద్వైతులు చెప్పునట్లు వ్యష్టియొక్క సమష్టిరూపము (రాశి) ఈశ్వరు డనుటను వారంగీకరింపరు.

జిజ్ఞాసువు : అయ్యా! శేష శేషిభావమును గుఱించి యిదివఱలో కొంత చెప్పియుంటిరి. దానిని మరల వినవలెనని యున్నది. అనుగ్రహింపుడు.

వేదాంతి : నీ శరీరము నీకు భోగసాధన మైనది. నీవు ఆత్ముడవు. నీ వేది అనుభవింప వలయు నన్నను అవయవములచే ఇంద్రియముల ద్వారా అనుభవించుచున్నావు. నీవు వాటికి స్వామివి. నీవు శేషివి, నీ కవి శేషభూతములై యున్నవి. అవి యేమి చేసినను నీకొఱకే. వాటికి స్వార్థము లేదు. అట్లే యెవని లీలావిలాసముకొఱకు మాత్రమే లీలావిభూతి యందలి చిదచిత్తులు ఏర్పడి యున్నవో; ఆ స్వామియొక్క భోగము కొఱకే యవి యున్నవిగాని వాటికొఱకు కాదు. సహస్రశీర్షుడగు అనంతుని శేషుడందురు. అతడు భగవంతునకు ఎట్లు భోగ్యమై యున్నాడో యామునాచార్యుల వారు ఇట్లు చెప్పిరి :

శ్లో॥ **నివాస శయ్యాసన పాదుకాంశుకో-**
పధాన వర్షాతప వారణాదిభిః ।
శరీరభేదై స్తవశేషతాజ్గతై
ర్యథోచితమ్ శేష ఇతీర్యతే జనైః॥ (శ్రీ ఆళవందారుస్తోత్రము 40)

తా॥ శేషుడు తన శరీరమును ఒక్కొక్కప్పుడు గృహముగను, శయనమందిరముగను, పడక గను, ఆసనముగను, పాదుకలుగను, వస్త్రముగను, దిండుగను, ఛత్రముగను అవసరము ననుసరించి భగవంతుడగు స్వామికి కైంకర్యవృత్తి భేదములు కలుగునట్లు చేయు చున్నందున అనంతుని శేషుడని లోకులు కొనియాడుచున్నారు. ఇదియే శేషభావము. ఇందులో స్వార్థము లేశమాత్రమును లేదు. అంతయు స్వామి కైంకర్యమే.

(2) జీవుడు:- జీవులనేకులు. అణురూపులు, చిత్స్వరూపులు, ధర్మభూతజ్ఞానము కలవారు. ధర్మిజ్ఞానము గల జీవులయొక్క

ధర్మభూతజ్ఞానముచే శరీరమునం దొకచోట (హృదయ పద్మమున) నుండియు శరీరము నందంతటను జరుగు విశేషములను గ్రహించుచుందురు. ఎట్లన:- దీపము ఇంటిలో ఒక చోటనుంచిన దాని కాంతి యింటియందంతటను వ్యాపించునట్లు; జీవుడు దేహమునందొక చోటనున్నను అతని ధర్మభూతజ్ఞానము దేహమంతటను వ్యాపించును. జీవుని స్వరూపజ్ఞానము [ధర్మిజ్ఞానము] దీపశిఖవంటిది. ధర్మభూతజ్ఞానము దీపముయొక్క వెలుగువంటిది. వీరు జ్ఞానానందస్వరూపులైనను భగవంతునివలె పరిపూర్ణ జ్ఞానానంద స్వరూపులు కారు. జ్ఞాతృత్వము, స్వయం ప్రకాశత్వము, ధర్మిధర్మ భూతజ్ఞానములకు సమానమే యైనను, ధర్మభూతజ్ఞానము శబ్దాది విషయముల నెఱుగుట అధికము. ఐతే ధర్మభూత జ్ఞానము తనను తానెఱుగ లేదు. ధర్మభూతజ్ఞానము అప్పుడప్పుడు సంకోచము పొందుచుండును. ధర్మిజ్ఞానమునకు సంకోచ మెప్పుడును ఉండదు. ధర్మ భూతజ్ఞానము సంకోచ మొందుటే జీవునియందు గలుగు వికారము. ఇది లేక పోయిన జీవుడు నిర్వికారుడని చెప్పవచ్చును. అద్వైతుల ఆత్మ వేఱు, జీవుడు వేఱు. విశిష్టాద్వైతులయందు జీవుడన్నను ఆత్మ యన్నను ఒక్కటే.

జీవులు (1) నిత్యులు (2) ముక్తులు (3) కేవలులు(4) ముముక్షువులు (5) బద్ధులు - అని అయిదు విధము లుందురు. నిత్యులనగా వారు ఎప్పుడును బద్ధులు కారు. వారిజ్ఞానము ఎప్పుడును సంకోచ మొందక ప్రకాశించు చుండును. (2) ముక్తులనగా బద్ధులుగా ఉండి భక్తి ప్రపత్తులను సాధనములచే భగవదనుగ్రహము పొందిన వారు. (3) కేవలులనగా ప్రకృతి బంధముననుండి విడివడి శరీరోపాధు లేవియు లేక కేవల జీవమాత్రులుగా శాశ్వతముగా ఉండువారు. వారి ఆనందము అల్పము. (4) ముముక్షువులనగా మోక్షముగోరి పాటుపడువారు. (5) బద్ధులనగా సంసారమునందు చిక్కుపడి శరీరమే తామనుకొని అవిద్యావశులైన వారు- వీరిని గుఱించి యిదివఱలో (బ్రహ్మజిజ్ఞాస

ద్వితీయ భాగమున ప్రపత్తి ప్రకరణమున) విపులముగా చెప్పియున్నందున నిచట నింత మాత్రము చాలును.

(3) ప్రకృతి :- ఇది పైన చెప్పిన త్రిగుణములు ఎల్లపుడు కలిగియుండును. ఎల్లప్పుడు వికారముల [కూర్పుల] ను పొందుచుండును. ప్రకృతి, జీవులు అను రెండు తత్త్వములకు ఈశ్వరుడు ఆత్మ. కాని ఆ రెండింటికిని ఈశ్వరునితో వేఱుపాటు కలదు. ప్రకృతి అవ్యక్తస్థితియందు మూడు గుణములు సామ్యస్థితి యందుండును. దానిని లయమందురు. ఈశ్వరేచ్ఛచే గుణములు మూడును సమస్థితిని వీడి హెచ్చుతగ్గు లగును. అదియే సృష్టి [సర్గము] ప్రారంభము. మొదట మహత్తు కలుగును. దానికి అహంకారము, సాత్త్వికాహంకారమువలన మనస్సు, జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము, క్రమముగా ఒక దాని తరువాత నొకటి కలుగును. ఇది ఆధ్యాత్మ విషయము- తామసాహంకారము వలన సూక్ష్మభూత పంచకమును, వాటినుండి పంచీకరణము వ్యక్తమై స్థూల భూత పంచకము కలుగును. ఇది ఆధి భౌతికము - పంచీకరణ మేర్పడిన పిమ్మట హిరణ్యగర్భుడు లోకములను సృష్టించును. జీవులు వారి వారి కర్మానుసారము శరీరములు ధరింతురు. అనగా : బ్రహ్మదేవుడు సృష్టించును.

ఈశ్వరునకు సూక్ష్మ చిదచిద్విశిష్టుడని, స్థూల చిదచిద్విశిష్టుడని ద్వివిధావస్థలను చెప్పుదురు. ప్రకృతి మూడు గుణములు సామ్యస్థితిని చెందినపుడు చిదచిత్తులు సూక్ష్మముగా నుండుట లయమందురు. ఆలయము ఈశ్వరునికి కారణావస్థ. ఈశ్వరేచ్ఛచే చిదచిత్తులు స్థూలపరిణామము నొందుట సృష్టి యందురు. ఇది ఈశ్వరుని కార్యావస్థ. అనగా : సూక్ష్మ చిదచిద్విశిష్టుడు కార్యబ్రహ్మము. కార్యకారణావస్థలు రెండును ఒకే సత్పదార్థముయొక్క భిన్న రూపములు; జగత్తునకు నిమిత్తకారణము, ఉపాదానకారణము కూడ. కనుక అన్ని ప్రత్యయములు

సత్యమే. ఇది సత్ ఖ్యాతి నంగీకరించిన మతము. జగత్తుయొక్క సృష్టి స్థితి లయములు ఈశ్వరుని యొక్క లీల. తత్త్వమును గుఱించి చెప్పితిని. రెండవదియగు హితమును చెప్పెదను.

హితము :- అర్థపంచకము. (1) పరస్వరూపము [బ్రహ్మస్వరూపము] (2) స్వస్వరూపము [జీవుని స్వరూపము] (3) పురుషార్థస్వరూపము [ఫలస్వరూపము] (4) ఉపాయస్వరూపము (5) విరోధిస్వరూపము [మోక్షమునకు విరోధమగు వాటిస్వరూపము] - వీటినిగుఱించిన జ్ఞానమే అర్థపంచకము - పరస్వరూపమును గూర్చియు, స్వస్వరూపమును గుఱించియు చెప్పితిని.

పురుషార్థ మనగా :- ఇతర మతములవారు ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములని చెప్పుదురు. వీరు కైవల్యమును మరియొక పురుషార్థముగ చేర్చిరి. కైవల్యమనగా జీవుడు, ప్రకృతి బంధములనుండి విడివడి స్వస్వరూపముతో కేవలుడై యుండుట. అచట జీవునకు దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి - మొదలగు సాధన లేమియు ఉండవు. కేవలుడై యుండును. పూర్ణజ్ఞానానందములు లేక పోయినను కొంతవఱకు జ్ఞానానందస్వరూపుడై ఉండును. ఇది మార్పులేని శాశ్వత [నిత్య] స్థితి. మోక్షమనగా: భగవత్ప్రాప్తి. వైకుంఠమున భగవంతునితో చేరి పరిపూర్ణానందము ననుభవించుట - వైకుంఠమున నిత్యసూరులతోను ముక్తపురుషులతోను, శ్రీమన్నారాయణరూపుడై ఆడుచు పాడుచు నైరమ్మదీయమను అమృత సరస్సును, చింతామణి నిర్మితమగు భగవంతుని సౌధమును, ఎన్ని కోట్లకల్పములు దర్శించినను తనివితీరని లక్ష్మీనారాయణుల దివ్యసౌందర్యమును దర్శించుచు ఉండుట. ఇదియును శాశ్వత [నిత్య] స్థితి. ఇట్లు మోక్ష మనుదానిని కైవల్యమని, భగవత్ప్రాప్తి యని రెండుగా విడదీసిరి.

ఉపాయ స్వరూపము - కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తి, ఆచార్యాభిమానములను పంచవిధోపాయములచేత బ్రహ్మప్రాప్తి కలుగుట. ఇందు కర్మ, జ్ఞానములు భక్తికి సాధనములు, భక్తి ప్రపత్తులు భగవత్ప్రాప్తికి ఉపాయములు.

ఈ మతమున మూడురహస్యములు కలవు* (1) తిరుమంత్రము, [నారాయణ అష్టాక్షరీ మంత్రము] (2) ద్వయము, (3) చరమశ్లోకము [గీత. 18-66 శ్లోకము] ఈ రహస్యత్రయమును వాటి అర్థమును గురుముఖమున నెఱుగవలయు నందురు.

అప్రాకృతద్రవ్యము :- నిత్యవిభూతి-అది శుద్ధసత్త్వము. ముక్తజీవులకు, నిత్యసూరులకు, భగవంతునకు భోగభూమియగు వైకుంఠ మదియే. దీనిని పరమాకాశ మందురు.

విశిష్టాద్వైతులు మాయను, అవిద్యను అంగీకరింతురు. జీవునకు స్వస్వరూపజ్ఞానము కలుగకుండ చేయగల శక్తి అవిద్యకు కలదు. నేను ఈశ్వరునకు శేషభూతుడనను జ్ఞానము మఱచియుండుటయే అవిద్య. మాయ ఈశ్వరునియొక్క జ్ఞానశక్తి. ఈ శక్తి జీవునకు లేదు. ఇది సర్వలోకమును భ్రమింపజేయగలదు.

వీరు ప్రత్యక్ష, అనుమాన, శబ్దము లను మూడింటినే ప్రమాణములని అంగీకరించిరి. అందు శబ్దప్రమాణము శ్రుతివాక్యరూపముగా ఉండుటవలన పరమ ప్రమాణమని అంగీకరించిరి.

ఈ మతమునందు వడగల [ఉత్తరాది శాఖ] తెంగల [దక్షిణాదిశాఖ] అను రెండు శాఖలు గలవు. వీరి మధ్య పదునెనిమిది అంశములలో భేదాభిప్రాయములు కలవు.** అందులో ఒకటి లక్ష్మీదేవిని గుఱించినది.

శ్రీదేవి [లక్ష్మీదేవి] సర్వేశ్వరుడగు శ్రీ మన్నారాయణుని భార్య, ఈమె ఈశ్వరకోటికి చెందినదని యీశ్వరునినుండి యీమెను వేఱు చేయుటకు

* ఈ రహస్యత్రయమును గుఱించి 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయ భాగమునందలి అయిదవ ప్రకరణమున విపులముగ చెప్పియున్నాను.

** ఈ అష్టాదశ భేదములను బ్రహ్మజిజ్ఞాస రెండవభాగము అయిదవ ప్రకరణమున చెప్పియున్నాను.

వీలు లేదని వడగలవారి మతము. జీవకోటికి చెందినదని తెంగలవారి మతము. ఈమె కరుణాస్వరూపిణి. జగన్మాత. అపరాధులగు జీవులమీద సర్వేశ్వరునకు కోపము రాకుండ క్షమింపజేయగలదు. లక్ష్మీదేవి పురుషకారము లేనిదే జీవులయెడ సర్వేశ్వరునికి కృప కలుగదను నీ యంశములను ఉభయులు అంగీకరింతురు. మోక్షమును ప్రసాదించు అధికారము ఈశ్వరునికి మాత్రమే కలదనియు, లక్ష్మీదేవికి లేదని తెంగలశాఖవారును; మోక్షమివ్వగలదని వడగల శాఖవారును చెప్పుదురు. ఒకప్పుడు లక్ష్మీదేవి పురుషకారము లేకయే సర్వేశ్వరు డనుగ్రహించును.

కాలము :- కాలము సత్త్వశూన్యము. ఇది జడము విభువు. పరిమితి లేకుండుట వలన నిత్య మందురు. ఈశ్వరునకు సృష్టి సాధనముగా ఉండును.

వీరు ' తత్త్వమసి' అను మహావాక్యమునకు అర్థము ఇట్లు చెప్పుదురు. తత్ = అది [బ్రహ్మము] త్వమ్ = నీయొక్క [జీవునియొక్క]; అసి= ఆత్మగా ఉన్నది. అనగా: అది ఆత్మగా కలవాడవు. శరీరాత్మ భావనచే జీవునకును, ఈశ్వరునకును తాదాత్మ్యము చెప్పుదురు. తక్కిన మహావాక్యముల యొక్క అర్థము ఈ విధముగనే చెప్పుదురు.

శ్రీవైష్ణవులయందు పాంచరాత్రులని వైఖానసులని రెండు శాఖలు గలవు. ఇరువురకు ప్రత్యేకమగు ఆగమములు కలవు. వైఖానసాగమములు భోగమోక్షముల రెంటిని బోధించుననియు; పాంచరాత్రాగమమార్గము కేవలభోగమును, స్వర్గమును మాత్రమే కలిగింప జాలియున్నది గాని మోక్షప్రదము కాజాలదనియు వైఖానసాగమము చెప్పును. వైఖానసులును విశిష్టాద్వైతులే. వీరు తాము శ్రీరామానుజ సంప్రదాయమునకు చెందిన వారము కామనియు, తాము బ్రహ్మసంప్రదాయమునకు చెందిన వారమనియు చెప్పుదురు. బ్రహ్మపుత్రుడు విఖనసుడను మహర్షియొక్క సంతతివారట. శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమున వైఖానసులను ఋషులు తపమాచరించుచున్నట్లు కలదు. వీరు తిరుమలయందు వేంచేసియున్న వేంకటేశ్వర స్వాముల వారికి అర్చకులు.

బ్రహ్మసూత్రములకు శ్రీరామానుజుల వారు 'శ్రీభాష్య' మను పేర విశిష్టాద్వైత పర్యాయమగు గొప్ప భాష్యమును రచియించిరి. శ్రీశంకరాచార్యుల కంటెను పూర్వులగు బోధాయన, శ్రీవత్స టంకాదులు శ్రీరామానుజుల వారికి మార్గదర్శకులైరట. బోధాయనులు పూర్వమీమాంసా దర్శనమునకు భాష్యము రచియించిరి. బ్రహ్మ సూత్రములకు వృత్తిని రచియించిరట. వారి వృత్తి నాధారముగా గొని శ్రీ రామానుజులవారు శ్రీ భాష్యమును రచియించిరందురు. ఈ మతమునకు న్యాయమతముతోను, పూర్వమీమాంసతోను చాలదగ్గర సంబంధము కలదు.

శ్రీరామానుజ దర్శనమునందుగల విశేష మేమన- శ్రీశంకరులవలె అభేదమును గాని, శ్రీమధ్వాచార్యులవలె భేదమును గాని, తదితరులవలె భేదాభేదమునుగాని,యాదవ మిశ్రులవలె బ్రహ్మపరిణామమునుగాని అంగీకరింప కుండుట.

శ్రీ వైష్ణవము :- పాంచరాత్రాగమములయందు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధములని నాలుగు వాసుదేవ వ్యూహములు. అనగా: వికారములు లేని అవస్థావిశేషములు చెప్పిరి. వాసుదేవుడే పరబ్రహ్మము. ఆయన యందుండి సంకర్షణుడు [జీవుడు]ను, సంకర్షణునినుండి ప్రద్యుమ్నుడు [మనస్సు] ను, ప్రద్యుమ్నునినుండి అనిరుద్ధుడు [అహంకారము] ను కలిగినట్లు చెప్పుదురు. ఈ చతుర్వ్యూహములే సమస్తవిశ్వము. మఱియు, వాసుదేవుడనగా: శ్రీకృష్ణభగవానుడు. సంకర్షణుడు- శ్రీకృష్ణ భగవానుని సోదరుడగు బలదేవుడు, సృష్టికి ప్రథమదశ, ఇతడు సంసారబంధమునుండి ముక్తిపొందించును, తత్త్వశాస్త్రానుసారము బుద్ధి [మహత్] ప్రద్యుమ్నుడు - శ్రీకృష్ణభగవానుని పుత్రుడు, తత్త్వరీతి ననుసరించి మనస్సు. అహంకారము అనిరుద్ధుడు. శ్రీకృష్ణ భగవానుని మనుమడు. ఇతడు శరీరాభిమానమును వృద్ధి చేయువాడు. ఏకాంతికభక్తి నవలంబించి దాని ఫలమును పొందుటకు అనిరుద్ధుడు కర్తయని అందురు. చతుర్వ్యూహములకు పరమునందు పరవాసు దేవుడను పరతత్త్వము కలదని కొందరందురు.

ఈ పంచరాత్ర సిద్ధాంతమును బ్రహ్మసూత్రముల యందు బాదరాయణాచార్యులవారును, భాష్యమునందు శ్రీ శంకరాచార్యులును నీ క్రిందివిధముగా ఖండించిరి:-

సూ|| ఉత్పత్త్యసంభవాత్ [బ్ర.సూ.2-2-42] అను సూత్రభాష్యమున జీవునకును ఉత్పత్తి చెప్పుట సరికాదు. ఉత్పత్తి నంగీకరించిన నాశన మంగీకరింపవలసి వచ్చును. అట్లంగీకరించిన ముక్తికొఱకు చేయు ప్రయత్నము వ్యర్థము.

సూ|| న చ కర్తుః కరణమ్ [బ్ర.సూ.2=2-43] జీవునినుండి మనస్సు కలిగినదని చెప్పుట యుక్తము కాదు.

జీవునకు మనస్సు సాధనము కనుక కర్తనుండి కరణములు కలుగుట లోకానుభవ విరుద్ధము. గొడ్డలితో చెట్లను నఱక వలసివచ్చిన సాధనమగు గొడ్డలి మనుష్యునినుండి కలుగుట లేదు కదా? ఇదిగాక- ఒక కరణము పుట్టించుటకు సాధనము కావలసినయెడల దానిని పుట్టించుటకు మరియొక సాధనము కావలసివచ్చును. అప్పుడు అనవస్థ సిద్ధించును. కనుక జీవున కుత్పత్తి లేనట్లే. జీవుని యందుండి మనస్సుగాని దాని నుండి అహంకారముగాని ఉత్పత్తి అయినట్లు చెప్పుట యుక్తము కాదు.

వాసుదేవాదులు నలువురును సమానముగ జ్ఞానైశ్వర్యశక్తి బలవీర్యతేజములు గల వారలైనందున ఒకరితోనే కార్యమగుచుండగా. తుల్యధర్మములు గల నలువురితో నిమిత్తమేమి? అని [బ్ర.సూ.2-2-44 సూత్రమున] ప్రశ్నించిరి.

మఱియు, జ్ఞానైశ్వర్యాదులు వాసుదేవుని గుణములని యొకచోటను, ఇవియన్నియు వాసుదేవుడే యని మఱియొక చోటను చెప్పిరి. ఇవి పరస్పర విరుద్ధము. ఇదిగాక శాండిల్యుడను ఋషి నాలుగు వేదములందును శ్రేయోమార్గమును గనుగొన లేక ఈ శాస్త్రము జదివెను అను మొదలగు వేదనింద కాన్పించుటవలన వేదప్రతిషేధము గలదు.

[బ్ర.సూ. 2-2-45] మఱియు నీ మతము శ్రుతులయందు కనబడదని చెప్పిరి.

ఈ విమర్శకు శ్రీవైష్ణవులు చెప్పునట్టి సమాధాన మేమన:- "నేనే వాసుదేవుడను; సంకర్షణుడను,ప్రద్యుమ్నుడను, అనిరుద్ధుడను. ఈ నలువురు సమానులే యని జ్ఞాని యెఱుగుచున్నా డనియు, వాసుదేవాదులయందు ఒకరినుండి మఱియొకరికి యుత్పత్తి లాక్షణిక" మనియు సవరించుకొందురు.

(౫) ద్వైతము - మధ్వాచార్యులు

పూర్ణప్రజ్ఞులు, ఆనందతీర్థులను నామాంతరములు గల మధ్వాచార్యులవారు దక్షిణ కెనరాకు చెందిన ఉడిపికి సమీపమున వేలి గ్రామమున [పాకక్షేత్రమున] సదాచార సంపన్నులైన వేదవతీ మధ్యగేహభట్టులను బ్రాహ్మణ దంపతులకు జన్మించిరి. వీరి జననము క్రీ.శ.1169 అని కొందఱును, 1199 అని కొందఱును వ్రాసిరి. వీరు పూర్వము స్మార్తులు [అద్వైతులు]. మధ్వాచార్యులవారికి తల్లితండ్రులిడిన పేరు "వాసుదేవుడు". వీరు బాల్యముననే [11 వ యేటనే] సన్న్యసించి పూర్ణప్రజ్ఞులను నామమును గ్రహించిరి. మొదట మధ్వాచార్యులవారు తోటన్ తిల్లా అనువారివద్ద విద్య నేర్చిరి. వీరి వేదాంతగురువు అద్వైతియగు అచ్యుత ప్రేక్ష్యులను వారు. వీరి మత మిట్లుండును :-

ఈశ్వరుడు హరి శ్రీమన్నారాయణుడు సర్వోత్తముడు. ఆయనకంటె అధికు లెవ్వరును లేరు. ఉపనిషత్తులు చెప్పు బ్రహ్మపదవాచ్యు డాయనయే. ఆయన సత్యసంకల్పుడు. సర్వాంతర్యామి. ఆయనకొక దివ్యదేహము కలదు. సంకల్పమాత్రమున లోకములు సృజించును. పోషించును. లయ మొనర్చును. శిష్టరక్షణమునకై అప్పుడప్పుడు అవతారముల నెత్తును. అనంతకల్యాణగుణుడు. చిదానందస్వరూపుడు. ఆయన తానిట్టివాడనని యెఱుగును. విగ్రహములయందు సూక్ష్మముగా నిలిచియుండును. ఈయన భార్య లక్ష్మీదేవి. జీవకోటిలో చేరినది. సృజనశక్తి. నిత్యముక్తురాలు. బ్రహ్మము అనిర్వాచ్యమని చెప్పు శ్రుతి వాక్యములకు

బ్రహ్మమును గుఱించి చెప్పుట కష్టమని వీరు తాత్పర్యము చెప్పుదురు. ఈశ్వరుడు (బ్రహ్మము) భావాతీతుడు. వేదములను చక్కగా అర్థము చేసికొనగలిగిన వారు ఈశ్వరుని స్వభావ మెఱుగగలరు. కాని, ఈశ్వరుని సంపూర్ణముగ నెఱుగుటకు నెవ్వరికిని సాధ్యపడదు. ఈశ్వరుడు జగత్తునకు ఉపాదాన కారణము కాదు, మూలకారణము. ఈశ్వరుడు జగత్తునకును, జీవులకును నియామకుడు. వాయుదేవుడు ఈశ్వరుని కుమారుడు. ప్రాణదేవతద్వారా ఈశ్వర కృప బొందవచ్చును. లక్ష్మీదేవియు, వాయుదేవుడును, ఈశ్వరునిపై ఆధారపడిన వారే. లక్ష్మీదేవి సచేతన ప్రకృతి. ప్రకృతి యొక్క అధిష్ఠాన దేవత.

జీవులు :- జీవులనేకులు. జీవులణుమాత్ర స్వరూపులు. వారికి జ్ఞానము గుణము. దేహమునం దొక చోటనుండియే దేహమునందలి వివిధ భాగములనుండు వేదనము నెఱుగుదురు. జీవులు చిదానంద స్వరూపులు. కాని తామిట్టివారమని యెఱుగరు. జీవులు మూడువిధములు:- నిత్యముక్తులు, ముక్తులు, బద్ధులు.

(1) నిత్యముక్తులు. వీరు లక్ష్మీదేవి, వాయుదేవుడు మొదలగువారు. వాయుదేవుడు జీవోత్తముడు.

(2) భగవదనుగ్రహమున సంసారమునుండి తరించిన వారు ముక్తజీవులు.

(3) సంసారము నందున్నవారు బద్ధజీవులు

ఇంతవఱకును విశిష్టాద్వైతమున చెప్పినట్లే యున్నది. కాని, యీ మూడవవర్గమును మధ్వాచార్యులవారు రెండు తెగలుగ విభజించి, (౧) ముక్తికి యోగ్యులు, (౨) ముక్తికి అయోగ్యులు అని భేదమేర్పరచిరి. అయోగ్యులయందు కొందఱు నిత్యసంసారమునందును, కొందఱు నిత్యనరకమందును నివాసులు. ఇట్లు కొందఱు నిత్యనరకమునందును, నుందురని వైదికమతశాఖలకు చెందిన యే సంప్రదాయమువారును అంగీకరింపరు. వేదములయందుగాని, ఉపనిషత్తులయందుగాని, దీని

కాధారములు ఉన్నట్లు వారు చూపలేదు. నిత్యనరకమును క్రైస్తవ, ఇస్లామ్ మతము లంగీకరించినవి. ఈ విషయమున ఆ రెండు మతములతో వీరికి ఏకీభావము ఎట్లు కలిగినదో తెలియదు. దేవుని కుమారునిద్వారా దేవుని కృపకు పాత్రులగుదురన్న భావము క్రైస్తవమతమునుండి గైకొనబడినదనుట యుక్తము గాదు. శైవమతమందు పార్వతీ దేవియు, వైష్ణవమున లక్ష్మీదేవియు, రాధయు పరమేశ్వరుని అనుగ్రహమునకు జీవులను పాత్రలనుగా చేయుదురను వాదము అనాదిగా మన దేశమున కలదు.

జిజ్ఞాసువు :- అయ్యా! నిత్యసంసార, నిత్యనరకములను మాటలు విన్న నాకు భయమగుచున్నది. నిత్యసంసార మనుమాట యటుండనిండు. నిత్యనరకమున నుండునట్టి జీవులెట్టి పాపముల నాచరించి యుందురు?

వేదాంతి :- మానవుడు నిత్యనరకమున పడుటకు తగినంత పాపమును చేయజాలడు. లోకమునందలి సమస్త ప్రాణులను అతిక్రూరముగా వధించినను లేక హింసించినను, నిత్యనరకము సంభవించదు. నిత్యనరకావాసమున చేర్చగల పాపము చేయుటకు సాధ్యము గాదు. ఒకడు ఒకకోటి సంవత్సరముల కాలమో, బ్రహ్మకల్ప పర్యంతమగు కాలమో, కోటికోట్ల బ్రహ్మకల్పముల పర్యంతమగు కాలమో నరకము నందుండు ననిన దాని కర్థమున్నది. 'నిత్య' మను దానిలో కోటికోట్ల బ్రహ్మకల్పముల కాలము కూడ స్వల్పమే. కనుక, నిత్య [శాశ్వత] నరకావాస మనుమాట కర్థము లేదు. నిత్య నరకమునందున్న *జీవులు ఎట్టిపాపమును చేయకయే స్వతస్సిద్ధముగ అనాదినుండియు నరకము నందున్నారనియు, వారెప్పటికైనను నట్లే యుందురనియు, అది భగవంతుని యిచ్ఛ యనియు చెప్పిన సృష్టికర్తయగు ఈశ్వరునికంటె పాపము చేసినవా డెవ్వడును లేడని చెప్పవచ్చును.*

వీరిమతమున ఒక జీవునకును, ఇంకొక జీవునకును మధ్య గల తారతమ్యము ఆగంతుకము గాదు. జీవు లనాదులు. తారతమ్యము

అనాదియే. జీవులు ముక్తులైన పిమ్మట కూడ తారతమ్య ముండును. జీవులందఱు నిత్యులే. వీరు పంచభేదములను పాటింతురు.

"సత్యం భిదా, సత్యం భిదా, సత్యం భిదా
జీవేశ యోర్భిదా చైవ జీవ భేదః పరస్పరమ్।
జడేశ యోర్జడానాం చ జడజీవభిదా తథా
పంచభేదా ఇమే నిత్యాః సర్వావస్థా మనిత్యశః॥"

తా॥ (1) జీవేశ్వరులమధ్య భేదము (2) జీవులమధ్య పరస్పరభేదము (3) జడమునకు ఈశ్వరునకు మధ్య భేదము (4) ఒక జడవస్తువునకు ఇంకొక జడవస్తువునకును మధ్యభేదము. (5) జీవులకును, జడవస్తువులకును మధ్య భేదము. ఈ పంచభేదములు నిత్యములు, అనగా: ఈ నిత్యభేదము సంసారదశయందు, మోక్షదశయందు సయితముండును. అందువలన ఈ మతమునకు ద్వైతమత మనియే కాక తారతమ్య మతమని, భేదమతమని పేర్లు.

జీవేశ్వరులమధ్య భేదమును అంగీకరించిన మతముల వారు కొందఱు కలరు. జీవులయందు పరస్పర భేదమును అంగీకరించినవారు వీరొక్కరే యై యుందురు. జీవునకును, జీవునకును మధ్య ప్రధానభేదము అద్వైతులేగాక విశిష్టాద్వైతులు సయితము అంగీకరింపరు. ద్వైతమతమునందు అనంతకోటి జీవ రాశియందు ఒక్కొక జీవునకును మధ్యగల భేద మెట్లు తెలియవచ్చునో బోధపడదు. అంతఃకరణములు అనేకములు. జీవుల కర్మానుగుణముగ వారివారి అంతః కరణములయందు సూక్ష్మముగ ఉన్న సంస్కారములు వాసనలవలన భిన్నభిన్న దేహములు [జన్మములు] కలుగుచున్నవి. ఇట్టి ఉపాధి భేదమువలన జీవులయందు భేదము కనబడునేగాని నిరుపాధిక మైన స్థితి యందు జీవులందఱును సమానులే [భేదము లేనివారే] అని అద్వైతులేగాక మఱికొందఱు సయితము అంగీకరింతురు. అద్వైతమునందు అనేక జీవు లనునది వ్యావహారికమే.

ఒక జడవస్తువునకును, మఱియొక జడవస్తువునకును మధ్య భేదమును చెప్పిరి. వస్తువుల వేఱుపాటే భేదము. అనగా : రెండు వస్తువులలో మొదటివస్తువు రెండవ వస్తువు కాదని నిర్ణయము. ఆ రెండింటి మధ్యగల భేదము తెలిసికొన్న గాని వేఱుపాటును గ్రహింపజాలము. వస్తువులమధ్య వేఱుపాటును తెలిసికొన్న గాని భేదమును గ్రహింపలేము. ఇందువలన అన్యోన్యాశ్రయ దోషము కలుగును అని అద్వైతుల ఆక్షేపణ.

వస్తువులను మనము ప్రత్యక్షజ్ఞానముచే తెలిసికొను చున్నాము. కనుక అది మిథ్య గాదు. వస్తువు ప్రత్యక్ష మయినప్పుడే వాటియందు గల పరస్పర భేదము తెలియవచ్చుచున్నదని మధ్వాచార్యులవారి సమాధానమై యుండును. మఱియు వీరిట్లు చెప్పుదురు.

'విశ్వం సత్యమ్' : జగత్తు సత్యము. భ్రాంతి కాదు. వేసవి కాలమున నదీజలము ప్రవహింపక గ్రీష్మాంతమున మరల జలము ప్రవహించునట్లు కల్పారంభమున ఈశ్వరుడు తిరుగా సృజించుచున్నాడు. ప్రకృతి జగత్తునకు ఉపాదానకారణము. అవ్యక్త మూలప్రకృతినుండి కలిగిన మహత్తు మొదలగు ఇరువదినాలుగు తత్త్వములును ప్రళయమున మూలప్రకృతియందు సూక్ష్మరూపమున నుండును. సృష్టికాలమున జీవుల కర్మానుసారము ఇవి వారికి దేహాదులను చేకూర్చును. ఈశ్వరుడు సర్వస్వతంత్రుడు. జీవుల పూర్వకర్మ ననుసరించి వారిని కర్మలయందు ప్రేరేపించును. జీవులు సంపూర్ణ స్వతంత్రులు కారు. ఈశ్వరాధీనులు. ఈశ్వరుడు కారణము లేకయే కొందఱకు మోక్షమును, కొందఱకు దుర్గతిని కలిగించును. ఈశ్వర ప్రేరణ లేనిదే జీవులకు ఆయనపై భక్తి కలుగదు.

అద్వైతులవలెనే వీరును ప్రత్యక్ష, అనుమాన, శ్రుతి ప్రమాణముల నంగీకరింతురు. అందు శ్రుతికి ప్రాముఖ్య మిచ్చెదరు.

మధ్వాచార్యులవారు ప్రస్థానత్రయమునకు భాష్యములు వ్రాయుటయే గాక ద్వైతమతమును బోధించు పెక్కు గ్రంథములు రచియించిరి. వీరు గొప్ప శరీరబలము కలవారు. మల్లయుద్ధమునందు ప్రవీణులు.

ద్వైతదర్శనమునకు వీరే ప్రథమాచార్యులు కారు. వీరికి ముందును ద్వైతమతము కలదు. కపిల, పతంజలి మహర్షులు ద్వైతులే. బ్రహ్మసూత్రములకు భాష్యమును రచియించిన విజ్ఞానభిక్షువు మొదలగు వారు కొందఱు ద్వైతులే. కాని వారి ద్వైతమునకును, శ్రీమధ్వాచార్యుల ద్వైతమునకును భేదము కలదు. ప్రకృతి అవ్యక్త రూపమునుండి ఈ జగద్రూపముగా పరిణమించుటకు ఇరువదినాలుగు మార్పులను [పరిణామములు] పొందినదను సాంఖ్యులయొక్క ఇరువదినాలుగు తత్త్వములను వీరంగీకరింతురు. పతంజలిమహర్షి అష్టాంగ యోగమును కూడ వీరంగీకరింతురు.

మధ్వాచార్యులవారు గొప్ప పండితులు, మహామేధావులు. ఆయన ప్రతిభావిశేషముతో ప్రస్థానత్రయమునకు, ద్వైతపర్యాయమగు భాష్యమును రచియించిరి. బ్రహ్మసూత్రములకు వీరు వ్రాసిన భాష్యమునందు పురాణములనుండి ఎక్కువగా ప్రమాణములను గైకొనిరి. శ్రుతుల ప్రమాణములను అరుదుగా వీరుపయోగించిరి.

వీరు బ్రహ్మసూత్రమునకు భాష్యమును రచియించుటకు పూర్వమే ఇరువదిఒక్క భాష్యములు బ్రహ్మసూత్రములకు వ్రాయబడి యుండెనని, **("ఏకవింశతి కుభాష్యదూషకం బ్రహ్మసూత్రగణ భాష్యమద్భుతం")** ఇదివఱలో బ్రహ్మసూత్రములకు రచియింపబడిన యిరువదిఒక్క కుభాష్యములను దూషించుచు అద్భుతమగు భాష్యమును వ్రాసినట్లు మధ్వచార్యులవారే చెప్పియున్నారు.

ప్రస్థానత్రయమునందలి యీ క్రింది వాక్యములు వీరికి ముఖ్యప్రమాణములు:-

"ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వ జాతే"

[ముండక 3-1-1]

ఒక చెట్టుపైన అందమైన రెక్కలు గల రెండు పక్షులు అత్యంత స్నేహముతో జంటగా నున్నవి.

" **ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ**"| [గీ. 15-16]

లోకమునందు క్షరుడు, అక్షరుడు అను నిరువురు పురుషులు కలరు అని గీతయందును;

సూ|| **భేదవ్యపదేశాచ్చ**| (బ్ర.సూ.1-1-17)

జీవునకును, ఆనందమునకును, (బ్రహ్మమునకు) భేదము చెప్పబడినదని బ్రహ్మసూత్రములను - ప్రమాణములుగ చూపుదురు. పైన చెప్పబడిన భేదవాక్యములు పారమార్థిక భేదమును చెప్పునవి కావనియు, వ్యావహారిక భేదమును మాత్రమే చెప్పుననియు, అవిద్యవలన బ్రహ్మమే జీవరూపమున తోచుచున్నాడనియు అద్వైతుల సమాధానము. మధ్వాచార్యులవారి భేదవాదమును శ్రీశంకరానుయాయులు పూర్తిగా త్రోసివేయలేదు. వ్యావహారికముగా భేదము సత్యమే అని అంగీకరించి పారమార్థికముగ భేదము నిత్యము కాదని భేదవాదమును ఖండించిరి. పంచభేదములు కలుగుటకు మధ్వాచార్యుల వా రీకారణమును చెప్పుదురు:-

దేశకాలముల శక్తివలన భేదములు కలుగును. దేశకాలములు సావయవములు; కాని అవి పూర్ణములు, అవి సావయవము లగుటవలననే వానిలో కొన్ని భాగములను చూచి 'అచ్చట' 'ఇచ్చట' అనియును, 'ఇప్పుడు" అప్పుడు' అనియును తెలిసికొని వాటిచే అవి పూర్ణములని మన మూహించు కొనుచున్నాము.

"తత్త్వమసి" మహావాక్యమునకు తత్+ త్వం+ అసి= తత్త్వమసి (అది నీవైతివి) అను శ్రుతికి మధ్వాచార్యుల వారు ఇట్లు అర్థమును చెప్పుదురు :- " స **ఆత్మా తత్త్వమసి**" దానిని, స ఆత్మ+ అతత్+ త్వమసి అని విడదీసి ఆత్మ నీవు కాదు; తత్త్వం = తస్య త్వం - అనగా :- నీకంటె భిన్నమైన సంబంధుడవుగా నీవున్నావు, వాడే నీవు కావు అని అర్థము చెప్పిరి. ఇచ్చట ఆత్మ యనగా ఈశ్వరుడని వీరి

అర్థము. "**స దేవ సౌమ్యేదమగ్ర ఆసీత్**" (ఛాం.6-2-1-2) మొదట సత్తు (బ్రహ్మము) మాత్రమే యుండెను. "**ఏకమే వాద్వితీయం బ్రహ్మ**" (ఛాం.6-2-2) ఆ బ్రహ్మము, ఏకము అద్వితీయమైనది. "**సర్వం ఖల్విదం బ్రహ్మ.**"

(ఛాం.3-14-1) సర్వమును ఆబ్రహ్మమే. " **నేహ నానాస్తి కించన**" (బృహదా. 4-4-19; కఠ. 4-11) అంతకంటె వేఱేదియును లేదు, ఇత్యాది అద్వైతపరములగు శ్రుతి వాక్యములను గౌణములని, అట్టి శ్రుతి వాక్యములను ప్రమాణముగా గైకొనరాదని చెప్పిరి. ప్రత్యక్షముగ జీవుడు కించిద్జ్ఞత్వాది గుణములు కలవాడని అనుభవమే చెప్పుచుండగా శ్రుతి అభేదమును చెప్పినదని తలచరాదు. కనుక, పై అభేదశ్రుతులు అర్థరహితములని మధ్వాచార్యులవారి వాదము. ధర్మాధర్మముల నెఱుగుటకు వేదమే ప్రమాణమని వీరంగీకరించిరి.

మోక్షము :- శ్రీరామానుజులవారి సిద్ధాంతము ననుసరించి- ఈశ్వరునకు జగత్కర్తృత్వము, లక్ష్మీపతిత్వము తప్ప మోక్షదశయందు జీవేశ్వరులు సమానులే. జీవులందఱు మోక్షదశయందు సమానులే యనియు, ఆనందానుభూతి యందును ముక్తజీవులందఱు సమానులే యనియు, ముక్తికి అర్హత లేని జీవులు లేరనియు వారు చెప్పిరి. కాని మధ్వాచార్యులవారు దానిని అంగీకరించ లేదు. అవిద్యాసంబంధము నుండి జీవుడు విడువబడిన వాడై తనకు నియతమగు స్వరూపానందము ఆవిర్భవించుటయే మోక్షమని మధ్వాచార్యుల వారు చెప్పిరి.

అనగా:- ముక్తజీవుల సుఖానుభూతియందు భేదము కలదని వీరి మతము. ఇట్టి మోక్షస్థితికి సాధనము సర్వదేవోత్తముడు విష్ణుదేవుడే యను అచంచల భక్తితో ఆయనను సేవించుట, ఆయన పుత్రుడగు వాయుదేవుని ద్వారమున ఆయన అనుగ్రహమునకు పాత్రుడగుట. అట్టి ముక్తి సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య భేదములచే చతుర్విధము లనిరి.

ఈ ద్వైతమునకు ప్రథమాచార్యుడు బ్రహ్మదేవుడట. అందువల్ల ఈ సంప్రదాయమును బ్రహ్మసంప్రదాయ మందురు. ఆంజనేయులు, భీమసేనులు, మధ్వాచార్యులు - వాయుదేవుని అవతార మందురు*

ఈ సంప్రదాయమువారు విష్ణుదేవుడు పరతత్త్వమని అంగీకరించినను శివద్వేషులు కారు. శివకేశవ హిరణ్యగర్భులు క్రమముగ శ్రీశంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వాచార్యులుగా అవతరించిరని ప్రతీతి.

ఆంధ్రప్రదేశమందు ఈ మతము బ్రాహ్మణులయందు మాత్రమే ప్రచారములో నున్నది. అద్వైత, విశిష్టాద్వైత మతములవలె బ్రాహ్మణేతరులు ఈ మతమును స్వీకరించి నట్లు లేదు. లేక బ్రాహ్మణేతరులకు ఈ మతమున ప్రవేశము ఇవ్వలేదని చెప్పవచ్చును.

మధ్వాచార్యుల వారు వారి వేదాంత గురువగు అచ్యుత ప్రేక్ష్యులను ద్వైతిగా మార్చి వారి మతమును వీరు గైకొనిరి. అదియే ద్వైత సంప్రదాయముల వారికి నేటికిని మూలపీఠముగా నున్నది. మధ్వాచార్యుల వారు ఉడిపిలో శ్రీకృష్ణాలయము కట్టించి అందు శ్రీకృష్ణ విగ్రహము ప్రతిష్ఠించిరి. ఉడిపి యీ సంప్రదాయము వారికి కేంద్రము. మధ్వాచార్యులవారి అతి మానుష మహిమలను గూర్చి వారి చరిత్ర చెప్పును. వీరు మహాభక్తులు. వీరు ఆసేతు హిమాచలము పర్యటనము చేసి కడపట బదరికాశ్రమమునకు పోయి అందే క్రీ.శ. 1303లో ముక్తి చెందిరని చెప్పుదురు. ఉడిపియందే ముక్తి నొందిరని కొందఱందురు.

మధ్వాచార్యులవారి అనంతరము ఈ మతమును వ్యాప్తి చేసినవారిలో జయతీర్థులు ఒకరు. వీరు మధ్వాచార్యుల బ్రహ్మసూత్రాది భాష్యములకు న్యాయసుధ, న్యాయకల్పలత, చంద్రిక, ప్రమాణపద్ధతి మొదలగు

---

* శ్లో॥ ప్రథమో హనుమానామ ద్వితీయో భీమసేనకః।
పూర్ణప్రజ్ఞ స్తృతీయస్తు భగవత్కార్య సాధకః॥

గ్రంథములను రచియించిరి. తరువాత ఈ సంప్రదాయమందు జన్మించినవారిలో వ్యాసరాయలు ముఖ్యులు. వ్యాసరాయ స్వామి అనియు [వ్యాసతీర్థులనియు] వీరిని పిలుతురు. వీరిని ప్రహ్లాదుని అవతారమని అందురు. వీరు శ్రీకృష్ణదేవరాయల సమకాలికులని చరిత్ర చెప్పును. చంద్రిక, తర్క తాండవము,న్యాయామృతమను గ్రంథములు రచియించిరి. వీరు మహాపండితులు. "న్యాయామృతము" నందు అద్వైత మతఖండన చేసిరట. మధుసూదన సరస్వతి. "అద్వైతసిద్ధి" యం దీన్యాయామృతమును ఖండించిరి.

వ్యాసరాజస్వామివారి అనంతరము జన్మించి ప్రసిద్ధి కెక్కినవారు వీణా వేంకటేశస్వామివారు. వ్యాసతీర్థులే వీరుగా అవతరించిరని వారి భక్తుల నమ్మకము. వీరు సన్న్యసించిన పిమ్మట శ్రీ రాఘవేంద్రస్వాములను పేర ప్రసిద్ధులైరి. కర్నూలుజిల్లా ఆదవాని (ఆదోని) తాలుకాలోని సుప్రసిద్ధ క్షేత్రమగు మంత్రాలయమునందు ఇప్పటికి సుమారు 300 సంవత్సరముల క్రిందట వీరు సజీవముగా బృందావనమున ప్రవేశించిరట. వీరు చాల మహిమలు చూపినట్లు వీరి చరిత్ర చెప్పును. వ్యాధిగ్రస్తు లగువారు ఇప్పటికిని మంత్రాలయమునకు పోయి స్వామివారిని సేవించి కృతార్థు లగుచున్నట్లు ప్రసిద్ధి. ఒక సందర్భమున స్వామివారు బృందావనమునుండి బయటికి వచ్చి మరో ప్రభువుతో సంభాషించి తిరిగి బృందావనము ప్రవేశించినట్లు ఐతిహ్యము కలదు. వీరు శ్రీమధ్వ, శ్రీజయతీర్థస్వాముల గ్రంథములకు సరళ టీకలు రచియించిరి.

వీరి మతమునందు సన్యాసాశ్రమము స్వీకరించిన వారిని తీర్థులని పిలుతురు. ఆనందతీర్థులు, వ్యాసతీర్థులు మొదలగు నామములు ఈ సంప్రదాయ గురుపరంపరకు చెందిన వారివి.

జిజ్ఞాసువు :- అయ్యా ఈ మతవిషయమున నాకు కొన్ని సంశయములు కలుగుచున్నవి. మనవి చేయుదును.

(1) ఈశ్వరుడు సర్వవ్యాపి అనగా అపరిచ్ఛిన్నుడు. జీవజగత్తులు ఆయన కాకపోవుటచే ఆయన అపరిచ్ఛిన్నతకు భంగము కలుగును.

ఈశ్వరుడు పరిచ్ఛిన్నుడైనయెడల అనంతకోటి పరిచ్ఛిన్న వస్తువులలో ఆయన ఒకడేగాని నిత్యుడు కాడు. పరిచ్ఛిన్న మేదియు శాశ్వతము కాదు. ఈశ్వరుడు ఒక ఖండవస్తువని అంగీకరించి నట్లయినది కదా?

(2) జీవేశ్వరు లిరువురు చిదానంద రూపులే. కాని తాను చిదానందరూపుడని ఈశ్వరు డెఱుగును; జీవులెఱుగరు. మోక్షదశయందు జీవులు తాము చిదానంద రూపులమని యెఱుగుదురు. ఎఱుగరనిన అది మోక్షము కానేరదు. కనుక ముక్తజీవులకు ఈశ్వరునకు స్వరూపమునందు కొంత సామ్యమున్నది. అయితే జీవులు అణుమాత్రులు. ఈశ్వరాంశమని యేల చెప్పకూడదు. అప్పుడు సంపూర్ణభేదము లేదు కదా?

(3) ఈశ్వరునకు కొందఱు జీవులయెడ నిర్హేతుక కరుణయు, కొందఱియెడ దయ లేకుండుటయు ఈశ్వరుని యొక్క పక్షపాతబుద్ధిని తెలియజేయుట లేదా?* అట్టి వాడు కరుణామయు డెట్లగును? అట్లయినచో వేదధర్మమును అనుష్ఠించు టెందులకు?

(4) జీవులు సత్త్వాది గుణములను బట్టి వారిలో తారతమ్య మేర్పడినది, అన్నప్పుడు సత్త్వాది గుణములు ప్రకృతి సంబంధములు గలవి. సృష్టికి పూర్వమే గల జీవులకు ఆ గుణములవలన స్వాభావిక భేదమెట్లగును?

(5) భేద మనునది భావపదార్థమా? అభావమా? భావాభావమా? భావపదార్థమే యన్న విషయాపేక్ష లేకనే మనకు తెలియబడవలెను. విషయాపేక్ష లేని భేదము తెలియబడలేదు గదా? అభావమైనయెడల అది నిత్యమెట్లగును? భావాభావ మనునది పరస్పర విరుద్ధము కనుక అసంభవము. ఇట్టి భేదము సర్వావస్థలయందును సత్యమెట్లగును?

---

* ఈశ్వరుని నిర్హేతుక కరుణను గుఱించి ఈ గ్రంథమునందలి 2-5-22 విశేషానుగ్రహమను అధ్యాయమున విపులముగ చర్చించియుంటిని.

(6) భేదము సర్వావస్థలయందు నిత్యమే యైన యెడల సుషుప్తి, [గాఢనిద్ర] సమాధి-యీ రెండింటియందు భేదప్రపంచము లేక పోవుటకు కారణమేమి? అప్పుడు భేదమును చూచు నింద్రియ మనోబుద్ధులు లేవు కనుక భేద ప్రపంచ ముండినను నీ వెఱుగవైతివని చెప్పుదు రేని భేద ప్రపంచము మన యింద్రియ మనోబుద్ధులపై ఆధారపడినదని అంగీకరించినట్లే కదా? ఇట్టి భేదము సత్య మెట్లగును?

వేదాంతి :- నీవడిగిన ప్రశ్నముల కన్నింటికి ద్వైతులు సమాధానము చెప్పియున్నను, అవి నీకు సంతృప్తి నివ్వజాలవని నానమ్మకము. ఇట్టి చిక్కులు మున్ముందు పొడచూపగలవని ఊహించియే శ్రీమద్రామానుజుల వారు చిదచిద్విశిష్టుడు బ్రహ్మమనిరి. నింబార్కులు చైతన్యస్వాము లిరువురు భేదాభేదమును అంగీకరించివలసి వచ్చెను. వల్లభాచార్యులవారు మాయావాదమును పరిహరించి అద్వైతమునే అంగీకరింపవలసి వచ్చెను. ద్వైతమునందు పొడసూపిన యీ చిక్కుల గుఱించి వీరందఱు చక్కగా విచారించిన వారే. శ్రీనింబార్కుల మతమును గుఱించి తెల్పెదను; వినుము.

(౬) ద్వైతాద్వైతము - నింబార్కరాచార్యులు

నింబార్కరాచార్యులవారు ఆంధ్రులు. గోదావరీ తీరమున సుదర్శనాశ్రమమున జన్మించి, బళ్ళారి జిల్లాలోని నింబార పురములో నుండిరని చెప్పుదురు. వీరు శ్రీరామానుజుల అనంతరమును, శ్రీమధ్వాచార్యులకు పూర్వమును ఇంచు మించుగా 11వ శతాబ్దమున జీవించిన తెలుగు వైష్ణవ బ్రాహ్మణులని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పిరి. కాని, 13వ శతాబ్దము తరువాతి వాడని శ్రీమోటూరి సత్యనారాయణగారు మొదలగు పండితులు చెప్పిరి. 14వ శతాబ్దము కడపట ఉన్నట్లు డాక్టర్ దాస్‌గుప్తాగారి అభిప్రాయము. నింబార్కరులు బ్రహ్మసూత్రములపై "వేదాంత పారిజాత సౌరభ" మను భాష్యమును

రచియించిరి. 'సవిశేష నిర్విశేష కృష్ణస్తవరాజ' మను గ్రంథమును రచియించిరి. 'మాధ్వముఖమర్దన' మను గ్రంథము వీరు రచియించిన దేయని కొందఱందురు. ఇవిగాక పదిశ్లోకములలో వీరి మతమంతయు సంక్షిప్తముగా వ్రాసిరనియు చెప్పుదురు. వీరిమత మిట్లుండును:

పరబ్రహ్మమునకు మూడురూపములు గలవు :- 1. ఈశ్వరుడు [బ్రహ్మము]. 2. ప్రకృతి. 3. జీవులు. బ్రహ్మము పరుడు, అంతర్యామి అను రెండురూపములు గలవాడు. ఈ రెండును సమానమైనవి, ఒక దాని నొకటి గ్రసించవు. ప్రపంచము బ్రహ్మ పరిణామము. పరరూపము ప్రపంచమున కంటె భిన్నము. అంతర్యామి రూపముతో అభిన్నుడు. సాలెపురుగు, దానియందుండి వెడలిన దారమునకు అది నిమిత్తకారణమును ఉపాదానకారణమును అయినట్లే ఈశ్వరుడు జగత్తునకు నిమిత్తోపాదాన కారణములు రెండునై యున్నాడు. ఆయన ప్రపంచరూపమున పరిణమించినను ప్రపంచమునందలి వికారములు ఆయన కంటవు. ఏలయన - ఆయన ప్రపంచముకంటె అతీతుడు. అణువు కాడు, సర్వవ్యాప్తి స్థూల సూక్ష్మరూపమగు సృష్టి ఆయనయొక్క స్వగత భేదములే. ఆయన జ్ఞానరూపుడు. ఆయన జ్ఞానము అపరిచ్ఛిన్నము. జీవజగత్తులను నియమించు నియామకుడు. నిర్వికారుడు. పర అపర రూపములు రెండును ఆయనవి. కనుక ఆయన సగుణుడు, నిర్గుణుడుకూడ. పరబ్రహ్మమే శ్రీకృష్ణుడు. ఆయనకు సములుగాని, అధికులుగాని లేరు. ఆయన క్షరాక్షరముల కంటె అతీతుడగు పురుషోత్తముడు. బ్రహ్మము వినా ప్రపంచము లేదు. ప్రపంచము వేఱని చెప్పిన పరమేశ్వరుడు సర్వవ్యాపియను వాక్యమునకు అర్థముండదు. శ్రీరామానుజులవలెనే భేదాభేద శ్రుతులను రెండింటిని గౌరవించిరి. కాని, ఈశ్వరుడు చిదచిద్విశిష్టుడను శ్రీరామానుజుల మతమును వీరంగీకరింపరు.

జీవుడు :- జీవాత్ము లనేకములు. వీరు నిత్యులు. అణుపరిణామము గలవారు. జ్ఞానస్వరూపులు. శ్రీరామానుజ, శ్రీమధ్వాచార్యులు చెప్పునట్లుగనే

జీవుడు శరీరమునందొక చోట నుండియు తన ధర్మభూత జ్ఞానముచే శరీర మంతటను వ్యాపించి సుఖదుఃఖములు ఎఱుగుచున్నాడు. అహంకారము మొదలు దేహాంత పర్యంతము గల సంఘాతమునందు జీవుడేదియు గాడు. జీవుడు జ్ఞానస్వరూపుడే గాక జ్ఞానమునకు ఆశ్రయుడు. అనగా జీవుడు జ్ఞాత ధర్మి; అతని ధర్మము జ్ఞానము. జీవుడు భోక్త. జగత్తు భోగ్యము. జీవుడు బ్రహ్మము యొక్క అంశమే. ఎన్నడును భగవంతునితో పూర్తిగా ఒక్కటి కాడు. చెట్టునకు దానిఫలమునకు ఎట్టి సంబంధమో; ఈశ్వరునకు, జీవులకును అట్టి సంబంధమే. ఫలమునే వృక్షమని చెప్పరాదు కదా? అందువలన జీవులు ఈశ్వరునితో ఒకవిధముగ భిన్నులు, ఇంకొక విధముగ అభిన్నులునై యున్నారు. అభిన్నస్వరూపము స్వాభావికము. భిన్నత్వము ఉపాధివిశేషము వలన కలిగినది. బ్రహ్మము అంశి. జీవుడు అంశము. అందువలన ఈ మతమునకు భేదాభేదవాదమని పేరు. అవిద్యామూలమున జీవులు సంసారమున బంధింపబడిరి.

అచిత్తు, లేక జగత్తు :- బ్రహ్మము కారణము, జగత్తు కార్యము. బ్రహ్మము నియంత, జగత్తు నియామకము. అచిత్తు మూడు విధములు. (1) ప్రాకృతము :- అనగా ప్రకృతివల్ల ఉత్పన్న మయినది. ప్రకృతి సత్త్వరజస్తమోగుణాత్మకము.

(2) అప్రాకృతము :- అచిద్రూపము. అనగా: ప్రకృతి వలన కలిగినది కాదు. రామానుజులవారు చెప్పిన శుద్ధ సత్త్వమువంటిది. వైకుంఠమందలి సృష్టి శుద్ధతత్త్వములో చేరును.

(3) కాలము :- ఇది అప్రాకృతము. అచిద్రూపము. బ్రహ్మముచే ప్రేరేపింపబడిన ప్రకృతి ప్రపంచమునకు ఉపాదాన కారణము అగును. జగత్తంతయు హరిమయము కనుక ప్రపంచము నిత్యము, భ్రాంతి కాదు. జగత్తు కార్యము. బ్రహ్మము కారణము. జగద్బ్రహ్మల మధ్యకూడ భేదాభేద సంబంధమే.

స్వరూపముచే జీవబ్రహ్మలకు భేదమున్నను అభేదముకూడ గలదు. కార్యము కారణము, అంశము - అంశి కేవలము భిన్నములు కావు. అనగా:- భేదము ఎట్లు సత్యమో అభేదముకూడ అట్లె సత్యము. సముద్రమునకు దాని కార్యమగు అలకును భేదము. అభేదమునుకూడ ఉన్నట్లు రెండును స్వాభావిక సత్యములు. సమాన సత్యములు. కార్యకారణములు. అంశము, అంశి కేవలము భిన్నములు కావు. కేవలము అభిన్నములును కావు.

మోక్షము:- పరమాత్మతో జీవాత్మ స్వభావమునందును; గుణములయందును సామ్యము పొందుట, ఇట్టి మోక్షము బ్రహ్మము కారణముననే కలుగును. మోక్షోపాయములు, లేక, మోక్షసాధనములు ఈ క్రింది వివరింప బోవునట్లు ఆఱువిధములు:-

(1) కర్మ:- కేవల కర్మ జ్ఞానమును వికసింపజేయును. కాని, యిది మోక్షమునకు సాక్షాత్ సాధనము కాదు. జ్ఞానమును కలిగించుటద్వారా పరంపరా సాధనము.

(2) జ్ఞానము లేదా విద్య:- బ్రహ్మజ్ఞానమువలననే మోక్షము సిద్ధించును. జ్ఞానమునకు కర్మ అంగము.

(3) ఉపాసన లేదా ధ్యానము:- ముముక్షువు పరమాత్మభావమును పొందిన పాపరహితమగు తన ఆత్మనే ఉపాసింపవలయును. ఏ ఇతర ప్రతీకమును గాని ఉపాసించ కూడదు. ఈ అభేదోపాసన అద్వైతులు చెప్పు అహంగ్రహోపాసన వంటిది.

(4) భక్తి :- శ్రీమద్రామానుజులవారు భక్తి, ఉపాసన రెండును ఒకటే నన్నారు. నింబార్కరులవారు ఒకటి కావన్నారు. ముముక్షువునకు ఈశ్వరునియందు గల పరమ ప్రేమయే భక్తి. రామానుజులవారి భక్తి ధ్యానరూప మైనది; నింబార్కరులవారి భక్తి ఈశ్వరానుగ్రహమున మాత్రమే సిద్ధించును. ఈశ్వర కరుణవలన సాధకునకు "నేను దరిద్రుడను" అను భావము స్థిరపడును. దీనివలన భక్తి కలుగును.

(5) ప్రపత్తి:- వీరి ప్రపత్తి విశిష్టాద్వైత ప్రపత్తి వలెనే యుండును. విశిష్టాద్వైతుల ప్రవృత్తి గుఱించి వినియున్నావు.*

(1) గురూపసత్తి :- ఈశ్వరునకు సాధకునకును మధ్యవర్తి గురువు. గురువునకు ప్రపత్తి చేయవలయును. ఆచార్యుని గుఱించి ప్రపత్తి చేసినవానికి మోక్షము తప్పక లభించును. అనగా : జీవుడు గురునిద్వారా ఈశ్వరుని పొందుచున్నాడు. విశిష్టాద్వైతులు కర్మ, జ్ఞానము, భక్తి, ప్రపత్తి, ఆచార్యసేవ అను అయిదు మోక్షోపాయములు చెప్పుదురు. కొన్ని అంశములలో నీ మతమునకు విశిష్టాద్వైతముతో సన్నిహితత్వము కలదు. ఈ మతమునకు శ్రీరామానుజుల ప్రథమ గురువైన యాదవప్రకాశుల మతముతో కూడ కొంత సామ్యము కలదు.

జిజ్ఞాసువు :- యాదవప్రకాశుల వారి మతమెట్లు ఈ మతముతో సరిపడును. ఆయన బ్రహ్మపరిణామవాది కదా?

వేదాంతి :- యాదవప్రకాశులవారి మతమునందు బ్రహ్మ మొక్కటియే సత్యము. బ్రహ్మమే ఈశ్వర, జీవ, జగత్తులుగా పరిణామము చెందెను. సమస్తము బ్రహ్మము యొక్క కార్యభూతము. కార్యకారణములకు భేదమును అభేదమును కూడ సత్యమే కదా? మఱియు ఆయన కర్మజ్ఞానమునకు సముచ్చయ మంగీకరించిరి. యాదవప్రకాశుల అద్వైతము శాంకరమతము వంటిది కాదు. అద్వైతులగు యాదవప్రకాశులు తమ శిష్యుడగు శ్రీరామానుజులకు శిష్యులైరనిన కొందఱకు ఆశ్చర్యము కలుగును. శ్రీరామానుజుల మతమునకును యాదవప్రకాశుల మతమునకును విశేష భేదము లేదు. కనుక యాదవప్రకాశులు విశిష్టాద్వైతము స్వీకరించుటలో ఆశ్చర్యపడ నవసరము లేదు.

శ్రీనింబార్కరులు శ్రీకృష్ణుని పురుషోత్తమునిగను, ఆయన శక్తియగు రాధను ఆయన భార్యగను ఆరాధించిరి. శ్రీకృష్ణుని మాధుర్యరూపునిగను, రాధను ప్రేమరూపురాలినిగను భావింతురు. నింబార్కరులు జీవితము

* బ్రహ్మజిజ్ఞాస ద్వితీయభాగమున 'ప్రపత్తి' ప్రకరణమునందు చూడవలెనని విజ్ఞప్తి.

నందు అధికభాగము ఉత్తరప్రదేశములోని మధురవద్దనున్న బృందావనములో గడిపిరి. ఈ మతమునకు చెందిన వారు ఉత్తరప్రదేశ్‌లోను, బెంగాల్‌లోను, ఒరిస్సాలోను ఉన్నారు.

ఈ మతము పూర్వము అశ్మరథ్యాచార్యులను వారి అద్వైతముతో సరిపోవును. బ్రహ్మసూత్రములయందు "ప్రతిజ్ఞాసిద్ధేర్లింగ మాశ్మరథ్యః" [బ్ర.సూ.1-4-20] అను సూత్రమున ఈ మతము అనువదింపబడి శాంకరభాష్యమున ఖండింపబడినది. ఆశ్మరథ్యాచార్యుల మతమునకూడ నిట్లే "యథా ప్రదీప్తా త్పావకా ద్విస్ఫులింగాః" [ముండక శ్రుతి 2-1] అగ్ని నుండి మిణుగురులు బయలు వెడలి నట్లు బ్రహ్మమునుండియే వెలువడిన జీవులకు బ్రహ్మముతో, కార్యకారణములకు భేదాభేద మున్నట్లు సర్వకాల సర్వావస్థలయందు భేదా భేదము స్వాభావికముగనే ఉన్నదని చెప్పియున్నారు.

పరస్పర విరుద్ధములగు భేదాభేద లక్షణములు ఏకకాలమున నుండుటకు వీలులేదని తరువాత సూత్రమున ఔడులోమ్యాచార్యుల మతమును అనువదించి దానిచే బాదరాయణులవారు ఈ మతమును ఖండించిరి. ఎట్లనగా: "ఉత్క్రమిష్యత ఏవం భావాదిత్యౌడులోమిః" [బ్ర.సూ.1-4-21].

తా|| జీవుడు ముక్తుడగు పర్యంతము పరమేశ్వరుని కంటె భిన్నుడై యుండును. జ్ఞానాదులచే శుద్ధుడై దేహాదుల పరిత్యజింప బోవునపుడు పరమేశ్వరుడగును. అనగా: జీవేశ్వరులకు ఒక కాలమునందు భేదమును వేఱొక కాలమునందు అభేదమును చెప్పిరి. ఆ కారణమున శ్రుతులు భేదకాలము నందును ఔపచారికముగ అభేదము చెప్పును. శ్రీ బాదరాయణ, శ్రీ శంకరాచార్యుల వారలకు పై రెండు మతములును సమ్మతములు కావు. కావున తరువాత సూత్రమున శ్రీ కాశకృత్స్నాచార్యుల మతమును అనువదించి పై రెండు మతములను ఖండించిరి. ఎట్లనగా:

ఫలాపేక్ష కలదు. ఇది సాయుజ్యఫలము నిచ్చును. అంబరీషాదులు దీనిని అనుసరించిరి. రెండవది ఫలాపేక్ష లేనిది; స్వతంత్రము. ఫలము భగవంతునితో అభేదము - దీనికి దృష్టాంతము గోపికల మధుర భక్తి. విశిష్టాద్వైతులు కైవల్యమును కోరక వైకుంఠ ప్రాప్తిని కోరునట్లే వీరును ముక్తికంటెను శ్రీ కృష్ణపరమాత్మసేవ, ఆయన లీలలో పాల్గొనుట శ్రేష్ఠమని తలతురు.

భగవదనుగ్రహమును "పోషణ" మందురు. అదియే ముక్తికి మార్గము. ఈ సంప్రదాయమువారు తమది 'పుష్టి మార్గ' మను నూతన సిద్ధాంతమని చెప్పుదురు. శ్రీకృష్ణుడు ప్రభువు. ఆయన గోపీ జనవల్లభుడు. ఆయనకు సర్వమును సమర్పించి సేవించువారు పుష్టికి అర్హులు. ఈ జీవులందఱు గోపికలు. ప్రతి సాధకుడును తానొక గోపికనని విశ్వాసము. కృష్ణుని "గోవర్ధన నాథుడని"," నాథ్‌జీ","పూర్ణ పురుషోత్తము" డని పిలుతురు. కృష్ణ భక్తులు శరీర పతనానంతరము గోలోకమున కృష్ణసాయుజ్యమును పొందుదురు.

నింబార్కురు, వల్లభాచార్యు లిరువురు ఆంధ్రులై యుండియు,వారి మతము ఆంధ్ర దేశమునందుగాక అన్యత్రా వ్యాపించినది. నది తాను పుట్టిన దేశవాసులకు ఉపయోగకారి కాకున్నను, ఎచ్చటనో ఒకచోట అది ప్రవహించిన ప్రాంతమువారు దాని లాభమును పొందునట్లు శ్రీ నింబార్కురు, శ్రీ వల్లభాచార్యుల మతములు ఆంధ్రేతర ప్రాంతమున వర్ధిల్లినవి. శ్రీ వల్లభాచార్యులవారి గ్రంథములు సంస్కృతమునందు గలవు. అవి వ్రజ, గుజరాతీ, ఆంగ్లభాషలయందు అనువదింపబడినవి. ఆంధ్రుల దురదృష్టమున ఆంధ్రభాషయం దింతవఱకు ఆ గ్రంథములు అనువదింప బడలేదు.

(ఠ) అచింత్య భేదాభేదవాదము - శ్రీ కృష్ణచైతన్యులు

శ్రీ కృష్ణచైతన్యులను గౌరాంగ దేవుడని పిలుతురు. వీరు వంగ దేశమునందలి నవద్వీపమున క్రీ.శ. 1485 లో జన్మించి క్రీ.శ. 1533 లో పూరి జగన్నాథ క్షేత్రమున పరమపదించిరి. వీరు శ్రీకృష్ణావతారమని

ప్రసిద్ధి. వీరు గొప్ప పండితులు. వీరొకదినము ఒక గదియందు శయనించి యుండిరట. ఆ సమయమున వీరి భక్తులు కొందఱు ఆ గది తలుపులు తెరచి లోన ప్రవేశించుచుండగా చైతన్య స్వాముల వారి శరీరమునుండి గొప్ప తేజస్సు వెడలి గదియంతయును ప్రకాశింప జేయుచుండుట చూచిరట.

వీరి మతము రాధ- కృష్ణుల యెడ భక్తి కలిగి యుండుట. ఈ సంప్రదాయమును 'గౌడీయ వైష్ణవ' సంప్రదాయ మందురు. ఈ సంప్రదాయమునకు చెందిన స్వాములను' గోస్వాము' లందురు. శ్రీమద్రామానుజుల వారి శ్రీవైష్ణవమునకు, వీరి వైష్ణవమునకు కొంత భేదమున్నది. శ్రీ రామానుజుల వారి అనంతరము వచ్చిన యితర మతాచార్యులు రామానుజుల వారి తత్త్వశాస్త్రమునుండి అనేకాంశములను గైకొనిరి. రామానుజుల వారికి అనంతరము వచ్చిన దార్శనికు లందరికిని రామానుజమతము కొంత బలమును చేకూర్చినది.

శ్రీమద్రామానుజులు, శ్రీ నింబార్కరులు చెప్పినట్లె చైతన్యులును 1, ఈశ్వరుడు 2, జీవులు 3, జగత్తు 4, జ్ఞానశుద్ధ సత్త్వములను స్వరూపశక్తి 5, కాలము- అను నీ పంచ తత్త్వములను అంగీకరింతురు.

ఈశ్వరునితో జీవజడములకు భేదాభేద సంబంధ మున్నది. ఈ సంబంధము నిత్యమయినది. శక్తి శక్తము. శక్తిగల పదార్థము శక్తము. శక్తి చేయు కార్యము శక్తములకు వేఱని లోకమునందు ప్రతీతి.

ఇంకొక విధముగా చూచిన శక్తికిని శక్తమునకు అభేదము. శక్తము దాని యందలి శక్తి - యివి రెండును ఒకటే, రెండు కాదు. కాని, ఇంకొక విధముగా ఇవి రెండు ఒకటి కాదు. శక్తిశక్తములకు గల భేదాభేద సంబంధము వంటిదే ఈశ్వరునకు జీవజగత్తుతో గల భేదాభేద సంబంధము. ఇది లోకమున సాధ్యము కాదే? భేదమోఅభేదమో యేదో ఒకటే ఉండవలయును గదా? అనిన ఆ భేదాభేదము మన చిత్తమునకు అందునది కాదు. దానిని మనబుద్ధి ఊహింపజాలదు, చింతింపజాలదు. కనుకనే అచింత్య భేదాభేదమని యీ మతమునకు పేరిడిరి.

ఈశ్వరుడు అద్భుత శక్తి సంపన్నుడు. అనగా - అచింత్య శక్తి. (చింతించుటకు శక్యము కాని శక్తిసంపన్నుడు)

ఆయన స్వేచ్ఛతో జగద్రూపమున పరిణమించెను. ఈశ్వరుడు జగద్రూపమున పరిణమించినను ఆయన నిర్వికారతకు లోటు కలుగదు. ఇందుకు వీరొక దృష్టాంతము చెప్పుదురు. ప్రకృతి సంబంధమైనను చింతామణి అర్థులు కోరిన పదార్థములను సృష్టించి యిచ్చును. కాని దాని యాకృతి యథావిధిగా ఉండును. అట్లే అచింత్యశక్తి సమేతుడగు ఈశ్వరునకు వికారము సంభవించదు. ఆయనయే పర (జీవ) అపర (ప్రకృతి లేక జగత్తు) రూపుడాయెనని గీత ఏడవ అధ్యాయమునందు చెప్పబడినది. ప్రకృతికే శక్తియని పేరు.

ఈశ్వరుడు నిర్గుణుడు కాడు. నిరాకారుడు కాడు. ఆయన సగుణ సాకారమూర్తి, ఇంకొక విధముగా నిర్గుణుడు, సగుణుడు కూడ. సగుణమూర్తి జగద్రూపమున పరిణమించును. అది మారుచుండును. మూలరూపమగు నిర్గుణము మారదు. ఈశ్వరుని కనేక రూపము లున్నవి. అన్ని రూపముల కంటెను ఉత్తమ మైన రూపము కృష్ణుని రూపము. ఆయన పరమేశ్వరుడు. భగవంతుడు ఐశ్వర్య, వీర్య, యశః, శ్రీ, జ్ఞాన, వైరాగ్యములు కలవాడు. ఆయనకు చిన్మయ- జీవ-శక్తులను మూడు శక్తులు గలవు. చిన్మయశక్తిచే సంకల్పము వలన జగత్తును సృష్టించును. లేక జగద్రూపముగ పరిణమించును. జీవశక్తిచే జీవులను పోషించును. ఉత్తమ శక్తి రూపము హ్లాదినీరూపము. ఆయన భార్యయగు రాధాదేవి పరమానందస్వరూపిణి.

జీవులు అణుమాత్రులు. జ్ఞానస్వరూపులు. దేహము నందొక చోట నుండియే దేహమంతటను వారి జ్ఞానము వ్యాపించియుండును. ఈశ్వరునికంటె వీరు భిన్నులు. ఇంకొక విధముగ అభిన్నులు. మాయామోహితులైన జీవులకు ఈశ్వర సంబంధమైన జ్ఞానము లేదు. అట్టి జ్ఞానము కలుగుటకు వేదవేదాంతములయందలి అర్థ మెఱుగవలెను. వేదములు నిత్యములు. అవి స్వతఃప్రమాణములు. బ్రహ్మసూత్రములును, భాగవత పురాణములును చాల ముఖ్యమైనవి.

జగత్తు సత్యము, భ్రమ కాదు. ఇది జ్ఞానానందముల రూపము. భగవత్కృపవలన (భక్తి) కలుగును. ముక్త జీవులు ఈశ్వరధామమున ఈశ్వరసాన్నిధ్యమున నివసింతురు. అట్టి వారు తిరిగి పుట్టరు. సాధారణ భక్తి సాధకుని హృదయము నందు భగవంతునిపై ప్రేమను కలిగించును. అది చిత్తమునందు భావము నుత్పత్తి చేయును. భావము ముదిరి ఘనీభవించిన ప్రేమ యగును. రాధాదేవిని ప్రేమించి భజించుటవలన ఈశ్వరానుగ్రహము కలుగును. దాని వలన ఈశ్వర సాక్షాత్కారము కలుగును.

శ్రీ రామానుజ, శ్రీమధ్వ మతముల ననుసరించి భగవంతునకును జీవులకును మధ్య సంబంధము స్వామి- భృత్య సంబంధము వంటిది. ఆ సంప్రదాయములయందు జీవులు ఈశ్వరునియందు భయము, గౌరవము కలిగియుందురు. అది దాసభావము గల భక్తి. నింబార్కరు వల్లభ చైతన్యుల సంప్రదాయముల యందు భక్తి, ప్రేమ, వాత్సల్యము, సఖ్యము మొదలగు భావములు మానవ స్వభావానుగుణముగ నుండును.

ఒక విశేషమేమన :- శ్రీ వల్లభ, శ్రీచైతన్యస్వాము లిరువురకును వయోభేద ముండినను సమకాలికులు. శ్రీవల్లభులు పశ్చిమ భారత దేశమునను, శ్రీచైతన్యులు తూర్పు భాగమునను ఒకే కాలమున వారివారి మతములు బోధించిరి. వీరి మతమున భేదమున్నను వీరిరువురు రాధాకృష్ణ భక్తి నంగీకరించిరి. రాధాకృష్ణులు గోలోకము నుండి అవతరించిరని ముక్త పురుషులు గోలోకము చేరుదురని ఏకాభిప్రాయమును వెల్లడించిరి.

శ్రీ నింబార్కరాచార్యులు ఈశ్వర జీవ జగత్తులకు నిత్యభేదాభేదమును చెప్పిరి. శ్రీ చైతన్యులును దాని నంగీకరించిరి. వీరు ఈ విషయమున క్రొత్తగా చెప్పిన దేమియును లేదు. "అచింత్య" భేదాభేదమని మాత్రము చెప్పిరి. శ్రీ నింబార్కరులు వైకుంఠవాసింకుగు శ్రీమన్నారాయణుడు, ఆయన భార్య లక్ష్మీదేవి భూమియందు రాధాకృష్ణులుగా అవతరించిరని చెప్పిరి. చైతన్యుల వారు గోలోకవాసులగు రాధాకృష్ణులే భూలోకమున రాధాకృష్ణులుగా అవతరించిరని చెప్పిరి.

ఈ మతము స్వల్ప మార్పులతో శ్రీ నింబార్కరు, శ్రీమద్రామానుజుల మతములనుండి రూపొందింపబడి నట్లున్నది. చైతన్యులవారి మతమున క్రొత్తయేమన :- శక్తి - శక్తములకు భేదాభేదములను ఆధారముగ ఈశ్వరునకు ఆయన సృజన శక్తికిని అచింత్య భేదాభేదమును సమర్థించిరి.

శ్రీ కృష్ణచైతన్యులవారు ప్రస్థానత్రయములో దేనికిని భాష్యమును వ్రాయలేదు, అయినను వీరు గొప్ప భక్తిమతమునకు ఆచార్యు లయిరి. 18వ శతాబ్దములో నుండిన శ్రీబలదేవ విద్యాభూషణులు ఈ సంప్రదాయమునకు చెందిన వారు, వారు 'బ్రహ్మసూత్రము' లకు 'గోవింద భాష్య' మను పేర భాష్యమును వ్రాసిరి. చైతన్యులవారి శిష్యులగు రూపగోస్వామి, సనాతన గోస్వామి అను వీరిరువురు మహాభక్తులు. వీరిరువురు జన్మచే హిందువులై యుండి పిమ్మట ఇస్లాం మతమును స్వీకరించిరి. తిరిగి వీరిని చైతన్యస్వాములు తమ మతములోనికి గైకొనిరి. శ్రీకృష్ణ చైతన్యులు వర్ణభేదములు అప్రధానములని విశాల హృదయమును వ్యక్తపఱచిరి. వీరియందు గల గొప్పతన మేమన :- ముసల్మానులను సహితము తమ శిష్యులనుగా చేర్చుకొనుట. వీరి శిష్యులలో నొకరగు ముసల్మాను ఫకీర్ హరిదాసు అను పేర విఖ్యాత పురుషుడయ్యెను.

(౯) రాధా - కృష్ణ అవతారతత్త్వము

జిజ్ఞాసువు :- అయ్యా! నింబార్కరు, వల్లభ, చైతన్యులు రాధాకృష్ణ భక్తిని పెంపొందించినారని చెప్పితిరే, ఈ రాధాదేవి ఎవరు? ఈమెను గుఱించి భాగవత పురాణమునందు ఒక వాక్యమైనను చెప్పియుండలేదే.

వేదాంతి :- నిజమే. శ్రీ కృష్ణభగవానుని చరిత్ర విస్తరించి చెప్పిన బ్రహ్మపురాణము, విష్ణుపురాణము, హరి వంశము, మహాభారతములయందు రాధాదేవి ప్రసక్తియే లేదు. గోపాల తాపిన్యుపనిషత్తు బృందావనమును, సుదామునిని, గోపికలను, రుక్మిణి దేవిని పేర్కొన్నది. ప్రత్యేకముగా రాధానామమును ఉచ్చరించలేదు. గోపిక లన్నపుడు అందులో రాధాదేవి కలసియున్న దనుకొనవలెనేమో చెప్పలేము. గోపికలు శ్రుతులని ఆశ్రుతియందు చెప్పబడినది. కృష్ణోపనిషత్తు గోపికలను పేర్కొన్నది;

అందును రాధానామము లేదు. బ్రహ్మవైవర్త *బ్రహ్మాండ, పద్మ, దేవీభాగవత పురాణములయందు రాధాదేవి ప్రసక్తి కలదు.

కీర్తిశేషులు కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారు కృష్ణావతార తత్త్వమను గ్రంథమును రచియించిరి. అందు రాధాదేవిని గుఱించి రాధాదేవి వాక్యములుగా ఇట్లు వ్రాసిరి :-

"..... నా నామ వ్యుత్పత్తి దెల్పెద. ఆలకింపుము. చాల దినముల క్రిందట భాండీర వనమున వటవిటపి మూలమున నందుడు నన్నుం గాంచెను. వ్రజేశుడు నన్ను నిర్బంధ పూర్వకముగ నడిగెను. అతని కెఱిగించి యుంటిని; మరల జెప్పెద ఆవధరింపుము. నేనే రాధికను. రాపాణకామినిని నేనే. రాపాణుడు శ్రీ హర్యంశ సంభూతుడు, పార్షద ప్రవరుడు- రాశబ్దము మహావిష్ణువాచకము. ఎవని లోమములయందు విశ్వము లుండునో యతడే మహావిష్ణువు. విశ్వప్రాణులయందును ధా శబ్దము ధాత్రీ యను మాతృవాచకము. విశ్వప్రాణులకు విశ్వమునకు ధాత్రిని మాతను నేనే. మూల ప్రకృతి యన్న నీశ్వరి యన్న నేనే కావున రాధానామము నాకు బ్రసిద్ధమైనది" (కృ.త.9, - 28,29 పుటలు)

రాధాదేవి ప్రేమస్వరూపిణి. " సకలకామంబులను రాధించుటంబట్టి రాధానామ మామెకు బ్రసిద్ధమైనది" ఆనందరూపిణి కృష్ణునకు నిత్యానపాయిని. కృష్ణుడు పరమాత్మ. ఆయన శక్తి రాధాదేవి. ఉపనిషత్తులయందు చెప్పుదురో ఆమెయే రాధాదేవి. గోపికలు జీవులు. రాధాకృష్ణు లిరువురును అభిన్నులు. ఇంకొక విధముగా భిన్నులు. చంద్రుడు చంద్రిక; అగ్ని. తేజములవలె విడదీయుటకు సాధ్యము కాని వారు.

---

* రాధాకృష్ణులను గుఱించి చెప్పిన పురాణములలో ముఖ్యమైనది- బ్రహ్మవైవర్తపురాణము. ఇది వ్యాస (కృష్ణద్వైపాయన) విరచితమని కొందఱు చెప్పుదురు. ఇప్పుడున్న యీ బ్రహ్మవైవర్త పురాణము వ్యాసవిరచితము కాదనియు, వ్యాస విరచితమైన బ్రహ్మవైవర్త పురాణము నశించిన దనియు, ఇప్పటి బ్రహ్మవైవర్త పురాణము తరువాత నెవరో రచియించిరనియు కొందఱందురు. అదేవిధముగా కొందఱు శ్రీమద్భాగవతము వ్యాసవిరచితము కాదనియు బోపదేవ విరచిత మనియు చెప్పుదురు.

సృష్టికి మునుపు శ్రీకృష్ణుడొక్కడే యుండెను. ఆయన యందుండియే రాధాదేవి ఆవిర్భవించెను. పరబ్రహ్మము నందుండి మాయ వ్యక్తమైనదని చెప్పిన శ్రుతి వాక్యములకు ఇది సరిపోవును. వీరికి గోలోకమును, అచ్చట బృందావనమును, గోవులను, గోపికలను, గోలోకము అందున్నవన్నియు నిత్యములే. సకల బ్రహ్మాండములు నశించినను ఇవి నశింపవు. గోలోకము వైకుంఠముకంటె పైలోకము.

లోకములు సృష్టింపవలెనను సంకల్పముతో కృష్ణుడు జ్ఞాన, ఇచ్ఛా, క్రియాశక్తులను; బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను; సరస్వతీ, లక్ష్మీ, పార్వతీ దేవులను సృష్టించెను. బ్రహ్మ లోకములు సృష్టించుటకును, విష్ణు దేవుడు వాటిని పోషించుటకును, ఈశ్వరుడు లయ మొనర్చుటకును కృష్ణుని చేత నియమింపబడిరి. బ్రహ్మ లోకములను సృష్టించెను.

శ్రీకృష్ణునితో సమానుడుగాని, అధికుడుగాని అగు దేవుడు లేడు. లక్ష్మీపతియగు విష్ణుదేవుడు ఆయన తరువాత పూజనీయుడు. కొందఱు కృష్ణుడే విష్ణువని చెప్పుదురు. ఇరువురకు అభేదమని కొన్ని సందర్భములయందు గలదు. త్రిమూర్తులు శ్రీకృష్ణభగవానుని ఆజ్ఞాబద్ధులు. ముక్తిని ప్రసాదించుశక్తి శ్రీకృష్ణస్వామికే గాని యితర దేవతలకు నెవ్వరికిని లేదు. మోక్షకామి రాధాకృష్ణులను సేవించవలెను. రాధాదేవిని విడిచి కృష్ణునిగాని, కృష్ణుని విడిచి రాధాదేవిని గాని సేవించకూడదు. ఇరువురిని సేవించిననే ఫలము కలుగును.

భక్తానుగ్రహముకొఱకును, దుష్టశిక్షణముకొఱకును బ్రహ్మాదులచే ప్రార్థింపబడి రాధాకృష్ణులు భూలోకమున అవతరించిరి. గోలోకమునందు వలెనే యిచ్చటను బృందావనమున గోవులు, గోపకులు, రాధాకృష్ణులు విహరించిరి. కృష్ణుడు యశోదాగర్భ సంజాతు డైనట్లు ఆధారములు శివ, పద్మపురాణములలో కలవు* భాగవతాది పురాణములలో దేవకీగర్భ సంజాతుడని చెప్పబడెను. ఈ కారణముల వలన కృష్ణులు ఇరువురా?

---

* ఇవి యేసందర్భమున ఆయా పురాణములయందు చెప్పబడెనో ఆవివరము ఈ గ్రంథముయొక్క ద్వితీయ భాగమున ప్ర-4, అధ్యా- 17న చిత్తగించవలెను.

లేక ఒకరా? యను ప్రశ్న పండితులకు కలిగినది. కీర్తి శేషులు సర్ ఆర్.జి.రామకృష్ణ భండార్కర్ గారు కృష్ణులిరువురని ఒక గ్రంథమునందు వ్రాసిరట.

రాధాదేవి నందుని మిత్రుడగు భానునామధేయుడగు ఒక గోపపుంగవుని కుమార్తెయని చెప్పబడెను. రాధాదేవి జన్మస్థానము ఇప్పటి వర్షణాగ్రామము. వృషభానునకు యజ్ఞశాలయందు భాద్రపద శుక్ల అష్టమి దినమున రాధాదేవి జన్మించినట్లు పద్మ పురాణమునందు కలదు. భానుడను గోపుడే వృషభానుడై యుండవచ్చును.

కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారి కృష్ణావతార తత్త్వమునందు రాధాదేవి తల్లినిగుఱించి యిట్లు చెప్పియున్నారు:-

"వృషభానుని భార్య కళావతి సుబలరాజ పుత్రిక. కళావతి పితృదేవతలకు మానస పుత్రిక. యోషాభూషణ మనం జెల్లు. అట్టి సాధ్వియు దుర్వారంబగు దుర్వాసుని శాపంబు గాంచె. ఆ శాపంబు లోకోపకారము సేయ నీయ బడియె. దానం జేసి కళావతీ నామంబున నందవ్రజంబున బుట్టువుం గాంచియున్నయది." (కృ.తి. Iపుట 100)

గోలోకమున శ్రీ కృష్ణ పార్షదులలో నొకడగు శ్రీ ధాముడను గోపపుంగవుడు ఒక కారణమున రాధాదేవిని "భూలోకమున జన్మింపుమని, శ్రీకృష్ణునితో నూఱు సంవత్సరములు నీకు వియోగము కలుగు గాక యని," శపించెను. శ్రీ కృష్ణునకంటె ముందే రాధాదేవి భూలోకమున జన్మించెను. మఱికొన్ని సంవత్సరములకు శ్రీ కృష్ణభగవాను డవతరించెననియు, సంవత్సరము వయస్సుగల శ్రీ కృష్ణ భగవానుని రాధాదేవి యెత్తుకొని ఏకాంతమున లాలించుచుండ శ్రీకృష్ణ భగవానుడు షోడశవర్ష ప్రాయుడైనట్లు కనబడెనని ఆ సమయముననే (ఏడాది వయస్సుననే) రాధాకృష్ణుల కడకు బ్రహ్మదేవు డరుదెంచి వారికి వివాహాము చేయించెనని పురాణము నందు కలదు.

జిజ్ఞాసువు :- రాధాకృష్ణులగురించి భాగవతము ప్రవచింపకుండుటకు కారణమేమి?

వేదాంతి :- ఎప్పటి మాటయో యెందులకు. వర్తమానకాలమున కొన్ని నిఘంటువులయందు -"రాధ - 1. ఒక గొల్లస్త్రీ. 2. కర్ణుని పెంపుడు తల్లి." అని వ్రాసియున్నారు. అష్టాదశపురాణములలో ప్రసిద్ధికెక్కిన కొన్ని పురాణములయందు రాధాదేవి శ్రీకృష్ణుని భార్యయని చెప్పి యున్నను, ఇప్పటి పండితులు ఆ విధముగా వ్రాసియుండ కుండుటకు కారణమేమో తెలియదు. శ్రీకృష్ణుడు క్షత్రియుడని రాధాదేవి క్షత్రియకన్య కాదని వారికి వివాహ మైనట్లు వ్రాసిన వర్ణసంకరమును ప్రోత్సహించి నట్లగునని వారి యభిప్రాయమై యుండునేమో.

ఇంకొక విషయమును చెప్పెదను వినుము. హరివంశము పురాణము లన్నింటికన్నను ప్రాచీనమైనది. అందులో ఒక కథ యిట్లున్నది:-

విదేహరాజ్యమునందలి మిథిలా నగరమునందు నందుని బావ మరిది (యశోదాదేవి సోదరుడు) అగు కుంభనామధేయుడను గోపకుడుండెను. అతని ధర్మపత్ని ధర్మద. వీరు ఐశ్వర్యవంతులు. విస్తారముగా గోధనము కలవారు. పూర్వము విష్ణుదేవునిచే చంపబడిన కాలనేమి యొక్క పుత్రు లేడుగురు శ్రీ కృష్ణభగవానునిపై పగ దీర్చుకొనుటకు కుంభుని మందయందు ఏడు వృషభములై పుట్టి ప్రజలను బాధించుచుండిరి. వాటిచే బాధితులైన ప్రజలు వాటివలన కలుగు ఉపద్రవమును ఆ దేశపు రాజున కెఱింగించిరి. ఆరాజు కుంభుని పిలిపించి "నీ వా వృషభములను అదుపులోనికి తీసికొని రాలేక పోయిన నిన్ను నా రాజ్యమునుండి బహిష్కరింతు" నని చెప్పెను. కుంభుడు ఈ మాటలు విని సప్తవృషభములను కట్టివేయ గల సమర్థుడగు గోపాలునకు సర్వలక్షణ సంపన్నయగు తనపుత్రిక నీళాదేవి నిచ్చి వివాహము గావింతు నని చాటెను. కృష్ణభగవాను డామెను చేపట్టుటకై వచ్చి వృషభసప్తకమును సంహరించి నీళను శాస్త్రోక్తముగా వివాహమాడెను.*

* ఆంధ్ర హరివంశము పూర్వభాగము ఆ-6 లో 120 నుండి 174 వఱకు.

అప్పటికి భగవానునకు భాగవత పురాణకథ ననుసరించి వయస్సు సుమారు ఆఱు సంవత్సరము లుండవచ్చును. లేదా మఱియొక పద్ధతి ననుసరించి సమారు పదునేను పదునాఱు సంవత్సరములు ఉండవచ్చును. భాగవతము ననుసరించి భగవానునకు మధురానగర ప్రవేశ కాలమునకు పదునొకండు సంవత్సరముల ప్రాయము. శ్రీ S.N.K బీజార్కరు గారి లెక్కప్రకారము పదునాఱు సంవత్సరములు పూర్తియైనది. శ్రీ S.N.K. బీజార్కరుగారి లెక్క ప్రకారము భగవానుడు పదునాఱవయేట రాధాదేవిని వివాహమాడిరని చెప్పిరట. ఇది సరియైనచో భగవానునకు ఇది రెండవ వివాహమని చెప్పవచ్చును. నీళాదేవి వివాహము భగవానుని కాళీయమర్దనము- గర్దభాసుర సంహారము- గోవర్ధనగిరి ధారణము- మొదలగు లీలలకు పూర్వమే జరిగినట్లు హరివంశము నందున్నది. భాగవతపురాణము రాధా, నీళల నామములైనను స్మరించ లేదు. నీళాదేవి సోదరుడగు సుదాముని పేరు భాగవతమున కలదు.

హరివంశమునకు తరువాత బహుకాలమునకు రచియింపబడిన భాగవతాది కొన్ని పురాణములయందు నీళాదేవి కథ యింకొక విధముగా మార్పుచెందెను. ఎట్లనగా :- కోసలదేశపు రాజగు నగ్నజిత్తు మందలో సప్తవృషభము లుండెను. అవి ప్రజలను పీడించుచుండెను. వాటిని కట్టివేసిన వీరునకు తన కుమార్తెయగు నాగ్నజిత్తిని ఇత్తునని ఆ రాజు ప్రకటించెను. రాజపుత్ర లెందఱో వచ్చి ఆ వృషభసప్తకముచే భంగపడిరి. అది విని శ్రీకృష్ణభగవానుడు వాటిని మర్దించి నాగ్నజిత్తిని వివాహమాడెను.** అప్పటికి భగవానుడు రుక్మిణిని జాంబవతిని, సత్యభామను, కాళిందిని, మిత్రవిందను వివాహమాడి యుండెను. నాగ్నజితీదేవి ఆఱవ భార్య. తరువాత భద్ర, లక్షణాదేవుల వివాహముతో అష్టభార్యలైరి.

పూర్వమొకప్పుడు భారతము, హరివంశము రెండును చేరి మహాభారతమని వ్యవహారమం దుండినట్లును, తరువాత కొంత

** ఆంధ్రభాగవతము దశమస్కంధము - ఉత్తరభాగము.

కాలమునకు హరివంశము వేఱుచేయబడి భారతమే మహాభారతమని విఖ్యాతి గాంచినట్లును, పండితు లనేకుల నిశ్చయము. మహాభారత హరివంశములు బుద్ధభగవానునికి పూర్వమే యుండిన వనుటను ఎవ్వరును సందేహింపరు. బుద్ధదేవుని తరువాత రచియింపబడిన పురాణములయందు ఇట్టి మార్పు చేయించియుందు రనుట ఆశ్చర్యమును కలిగింపదు. బౌద్ధులు వర్ణవ్యవస్థను నిరాకరించిరి. మౌర్యవంశము నందలి కడపటి వాడగు 'బృహద్రథుని' హత్య గావించి అతని సేనానియగు పుష్యమిత్రుడు చక్రవర్తియయ్యెను.

అతడు బ్రాహ్మణ కులజుడు. అతని కాలమునందు వర్ణవ్యవస్థ కఠినముగ పాటింపబడెను. అందులకై ధర్మశాస్త్రములయందును, పురాణములయందును చాలమార్పులు పుష్యమిత్రుడు చేయించె నందురు. అట్టిమార్పులలో సప్తవృషభములను గుఱించి హరివంశమునందలి నీళాదేవికథ భాగవత పురాణమున నాగ్నజితీదేవి కథగా మారియుండునని నా అనుమానము. అట్లే పాద్మ, బ్రహ్మవైవర్త పురాణములయందున్న రాధా వివాహము తక్కిన పురాణములయందు వదిలి వేసి యుందురు. హరివంశ, భాగవత పురాణములయందలి సప్తవృషభముల కథలను చదివిన హరివంశ కథ సహజమని తోచును. ఆళ్వారులు నీళాదేవిని స్మరించిరి. సీతోపనిషత్తు నీళాదేవిని పేర్కొన్నది. గోదాదేవి (అండాళమ్మ గారు)రచియించిన "తిరుప్పావై"లో నీళను, గోపికలను ఎక్కువ స్మరించిరేగాని భగవానుని తక్కిన భార్యల ప్రసక్తియే లేదు. రుక్మిణీదేవి ప్రసక్తి స్వల్పముగా గలదు. భగవానుడు రుక్మిణీదేవిని వివాహ మాడునప్పటికి స్వామికి ముప్పది ఆఱు సంవత్సరములని పండితులు గణించిరి. ఇంత వయస్సు వచ్చువఱకు భగవానునకు వివాహము కాలేదా? నాగ్నజితీదేవి వివాహము స్వామియొక్క నలువది రెండవ యేట జరిగెనని చెప్పుదురు. ఈ రెండు కథలలో నేది సరియైనదో విజ్ఞులు నిర్ణయింతురు గాక!

జిజ్ఞాసువు :- మహాభారతమునందు గోలోక ప్రసక్తి కలదా?

వేదాంతి :- కలదు. రాధాకృష్ణుల ప్రసక్తి లేదు. మహా భారతాంతర్గత ఆనుశాసనిక పర్వమునందు ఇట్లున్నది :-

పూర్వము విశ్వకర్మ తపస్సు చేయుచు యజ్ఞము నిమిత్తమును, మోక్షముకొఱకును అమృత స్వరూపిణియు, కామరూపిణియునగు "సురభి" యను కన్యను, మహాతేజోమయుడగు పురుషుని తన మనస్సుచే సృష్టించెను. బ్రహ్మదేవు డచటి కరుదెంచి ఆ పురుషునకు మార్తాండు డను నామము నిడి మార్తాండునితో బ్రహ్మదేవుడు ఇట్లనెను:-" మార్తాండుడా! (=దుఖములేని వాడా!) నీ వీసురభిని గూడుము. మీకు కలుగు సంతానమును గోవులందురు. అవి యజ్ఞమునకు సహాయమగు పాల నివ్వగలవు. నా లోకము (బ్రహ్మలోకమగు సత్యలోకము) నకంటె పైన గల గోలోక మందు మీరును మీ సంతానమును నివసించునట్లు వర మిచ్చితిని" అని చెప్పిపోయెను.

సురభి మార్తాండులు గోలోకమున ప్రవేశించిరి. వారికి తొలుత ఏకాదశ రుద్రులు జన్మించిరి. పిమ్మట వారికి (సురభి మార్తాండులకు) సౌరభేయులను గోవులు జన్మించెను.

పర్యవసానమును మన మీ విధముగా నూహింప వచ్చును. విశ్వకర్మయే పరమేశ్వరుడు, మార్తాండుడు అనే గోలోక వాసియగు కృష్ణుడనియు, సురభినే రాధాదేవి యనియు మహాభారత రచనానంతరము రచియింపబడిన పురాణముల యందు రాధాకృష్ణులే పరతత్త్వమని మార్పుచెంది యుండును. ఏది యెట్లున్నను గోలోకమును సత్యలోకమునకంటె పైన ఉన్నట్లు మహాభారత మంగీకరించినది. మోక్షముకొఱకు సురభిని సృజించె ననగా మోక్షదాయిని భగవతి రాధయు. దుఃఖము లేని వాడు (నిత్యానందస్వరూపుడు) కృష్ణుడు అని భావము. ఇట్టి తత్త్వము ననుసరించి చూచిన సురభి, మార్తాండులు శివ శక్తివంటి వారు. వీరినే రాధాకృష్ణుల జంటగా రూపొందించియుందురు. ఈ క్రింది విషయమును గమనించిన ఈ భావము దృఢమగును.

రాధాకృష్ణుల గుఱించి శ్రీ భాగవతము* నందిట్లున్నది:- కైలాసమున ఉమామహేశ్వరులు ఒక దినమున నిష్టాగోష్ఠిలో నున్న తరి శివుడు పార్వతీ దేవి సౌందర్యమును చూచి ముగ్ధుడై స్త్రీజన్మ మెంతయు శోభన ప్రదమని తలచి తాను స్త్రీగా జన్మించుటకును, పార్వతీ దేవి పురుషుడై పుట్టుటకును వాంఛించెను. అట్టి తన యభీష్టమును తీర్పుమని శివుడు పార్వతీ దేవిని ప్రార్థించెను. ఉమాదేవి శివుని ప్రార్థన అంగీకరించి దుష్టుల సంహరించుటకై పార్వతీదేవి దేవకీ గర్భమున శ్రీ కృష్ణ భగవానుడై యవతరించెను. శివుడు వృషభాను పుత్రికయగు రాధాదేవిగా అవతరించెను. శివుని అష్ట ప్రకృతులును రుక్మిణి మొదలగు శ్రీ కృష్ణుని అష్ట భార్యలై జన్మించిరి. విష్ణుదేవుని ఒక అర్ధాంశమున బలరాముడు, ఇంకొక అర్ధాంశమున అర్జునుడు కలిగిరి. ఇందు వైష్ణవ శైవ శాక్తముల కలయిక కలదు.

శ్రీ కృష్ణస్వామి లలితాదేవి యని కీర్తిశేషులు శ్రీ కళాప్రపూర్ణ కావ్యస్మృతితీర్థ జనమంచి శేషాద్రి శర్మగారు "శ్రీకృష్ణావతారతత్త్వము" నందు చెప్పి అందు కాధారముగా పద్మపురాణమునందలి యీ క్రింది శ్లోకమును ఉదాహరించిరి.

"సత్యయోషిత్స్వరూపో ఽహం యోషిచ్చాహం సనాతనీ|
అహం చ లలితాదేవీ పుం రూపా కృష్ణవిగ్రహా||"
ఆవయోరంతరం నాస్తి సత్యం సత్యం హి నారద||"

(పద్మపురాణము - పాతాళఖండము 75- వ అధ్యాయము.)

నారదా! లలితాంబిక యన నేనే. పురుష రూపమున నుండునపుడు నన్ను శ్రీకృష్ణు డందురు. స్త్రీ రూపమున నున్నపుడు లలితాంబ యందురు. ఇది సత్యము. సత్యము. భేదము లేదు - అని నారదునకు శ్రీ కృష్ణభగవాను డుపదేశించినట్లు కలదు. పైన చెప్పిన శ్రీ భాగవతములోని యంశమును పద్మపురాణము దృఢపరచినది. శాక్తేయమునకు ప్రసిద్ధి చెందిన వంగదేశమున (బంగాళమున) వైష్ణవము నందు శాక్తేయము కలియుట

---

*"శ్రీభాగవతము" ను బ్రహ్మశ్రీ కావ్యపురాణతీర్థ జనమంచి వేంకట సుబ్రమణ్యశర్మగారు అంధ్రీకరించిరి. మూలమూ వ్యాసవిరచితమని చెప్పబడినది.

అబ్బురము కాదు. శివుడు రాధాదేవి యగుటయు, పార్వతీదేవి శ్రీకృష్ణుడగుటయు అను నీ యెత్తుగడలోనే మధుర భావ మిమిడి యున్నది. అందుచేత చైతన్యస్వామి మధురభక్తి జనుల నాకర్షించి ముసల్మానులను కొందఱనైన ఈ మతములో చేరునట్లు చేసినది.

(మధుర భక్తిని గుఱించి యిదివఱలో (ద్వితీయ భాగమున భక్తి ప్రకరణమున) చెప్పియుంటిని. ఈ కథలవలనను ఈ మతము వైష్ణవ శాక్తమని చెప్పవచ్చును.

యాదవులు - గోపకులు

శ్రీకృష్ణభగవానుడు చంద్రవంశ క్షత్రియుడగు యదురాజు వంశమునకు చెందిన యాదవుడని కొన్ని పురాణములు చెప్పినవి. యాదవులు క్షత్రియులని గోపకులు శూద్రులని కొందఱనుచున్నారు. దేవీభాగవతము చతుర్థస్కంధమున నీ చర్చ కలదు. అందు జనమేజయ మహారాజు వ్యాసభగవాను నిట్లు ప్రశ్నించెను:-

'నరనారాయణులను పురాణమునులే బదరికాశ్రమమున తపమొనరించి దేవకార్యమును సాధించుటకై కృష్ణార్జును లైరని కదా పూర్వచరితము. నిరాహారులు, జితేంద్రియులు, నిస్పృహులు, అరిషడ్వర్గమును దూలించిన వారు, జన్మాంతరముల నేల నంగీకరించిరి? బ్రాహ్మణులు తపస్సంపన్నులై పరాపదము నందక, యాదవులు పాండవులునై శూద్రక్షత్రియ జన్మముల నే దుర్గతి కారణముగ చేకొనవలసి వచ్చినది? కర్మసిద్ధాంతమునకు వారిట్లౌట విపరీతము కాదా?"

(వచన - శ్రీ దేవీ భాగవతము 4వ స్కంధము)

పై వాక్యములవలన యాదవులు శూద్రు లనియు, పాండవులు క్షత్రియు లనియు స్పష్టపరుపబడినది. అంతే కాదు. జనమేజయునకు వ్యాసభగవాను డిచ్చిన సమాధానమును సంగ్రహముగా నెఱిగింతును.

ఒకప్పుడు కశ్యపప్రజాపతి వరుణునియొక్క గోవు నపహరించెను. వరుణుడు కశ్యపుని తన గోవును తనకిమ్మని అడిగెను. కశ్యపుడు గోవు

నివ్వడాయెను. వరుణుడు బ్రహ్మ కడకేగి తన దుఃఖమెఱింగించి యిట్లనెను:-

"క్రోధమున తాను కశ్యపుని భూలోకమున గోపాల కులమున జన్మించ శపించితిని అట్లే యాతని సతుల నిర్వురను భూలోకమున జన్మించి సంతానము మృతినంద నతి దుఃఖమున మునుగుదురు. కారాగార నివాసము ప్రాప్తించు ననియు, శపించితి" నని చెప్పెను.

శ్రీవిద్యోపాసకులగు మహాపండితులకు అత్యంత ప్రమాణ గ్రంథమగు దేవీ భాగవతమున వసుదేవ శ్రీకృష్ణు లిరువురు గోపాలకులోద్భవులని స్పష్టముగ చెప్పియున్నది గాదా? రాధాదేవి శ్రీకృష్ణుని భార్యయని చెప్పుటకు అర్వాచీన, వర్తమాన పండితులలో కొందఱకు సంశయ మేల కలుగునో నాకు బోధపడదు. పచ్చిశృంగార కావ్యముల రచియించిన వారు రాధాదేవి కృష్ణుని మేనత్త యని వ్రాసిరి. అట్టి అతినీతి బాహ్యమైన వ్రాతలకు విలువ యివ్వరాదు. అవి నిరాధారమైనవి.

శివ పురాణమునందలి కోటిరుద్రసంహిత 18వ అధ్యాయము 68, 69 శ్లోకములయందు (ఆంధ్ర శివపురాణము లింగ వైభవ ఖండమునందు)ను శ్రీకరుడను గోపబాలుని కథ కలదు. ఆకథను నేనిదివఱకు చెప్పియుంటిని (బ్రహ్మజిజ్ఞాస 2-4-17) ఆ వాక్యములయందు కొన్ని వాక్యములను జ్ఞప్తికి దెత్తును.

శ్లో|| అస్యవంశే ఒష్టమో భావీ నందో నామ మహాయశాః|
ప్రాప్స్యతే తస్య పుత్రత్వం కృష్ణో నారాయణ స్స్వయం||
అనియును,

చ|| కడు బలిపాప వీడు శివు గాటపు వేడుక గొల్చి తత్కృపన్
బడసె నిటుల్ ప్రియంబుగ ప్రపంచము నందిక బెద్దయై సిరుల్
బడయు బ్రతిష్ఠ గాంచు సరివారలలో బొగడొందు బద్మనా
భుడు హరి వీని వంశమున బుట్టుక గాంచును గొన్ని నాళ్లకున్,
దేవీ భాగవతము నవమస్కంధమున ఇట్లున్నది :-

దేవి "తొలుదొల్త దేవి గోలోక కృష్ణుని రాధతో తన యంశావతారముగా సృష్టించెను. ఈతని యాజ్ఞాపాలకులై బ్రహ్మసృజన చేయుటయు, విష్ణువు పాలించుటయు, రుద్రుడు లయము చేయుటయు జరుగుచుండును"అని త్రిమూర్తులచే వారి భార్యలకంటెను రాధా కృష్ణులకు ఆధిక్య మివ్వబడినది.

గోపకులు యాదవులు ఒక కులమునకు చెందిన వారని, లేక ఒక కులమునందలి రెండు శాఖలని, రాధాకృష్ణులు దంపతులని పురాణాదులనుండి అనేక దృష్టాంతములు చూపవచ్చును. కాని యిచట ఆ ప్రసక్తి విస్తరించి తెలుపుట అప్రస్తుత మగును.

(౧౦) వైష్ణవమును పోషించిన భక్తులు.

మన దేశమున వివిధశాఖలుగా వ్యాపించిన వైష్ణవ మతమును గుఱించియు, వారి తత్త్వశాస్త్రముల గుఱించియు చెప్పితిని. వీరేగాక మఱికొందఱు భక్తులు వైష్ణవమును పోషించిరి. వారు మతకర్తలు గాకున్నను వారి బోధల ద్వారా సంఘమున విష్ణుభక్తిని పోషించిరి. వీరిలో కొందఱు తత్త్వశాస్త్రసంపన్నులు కాకపోయినను భగవంతునికి ప్రీతి పాత్రులైన మహానుభావులు. సత్యము నెఱిగిన పూజ్యులు. సామాన్య జనులలో వీరివలన కలిగిన భక్తిభావము భాష్యకారులవలన కలిగిన దానికంటే తక్కువ కాదు.

శ్రీరామానందస్వామి:- రామానందస్వాములవారు 14వ శతాబ్ద మధ్యకాలమున ఉండిరని కొందఱు చెప్పుదురు. వీరు కాన్యకుబ్జ నగరమున ఒక బ్రహ్మణదంపతులకు జన్మించిరి. సన్న్యసించిరి. వీరిమతము వైష్ణవము. సీతారాములను సేవింపవలెనని వీరు ప్రచారము చేసిరి. శ్రీరాము డాదర్శమూర్తి. సకల సద్గుణములకు నిలయము. ధర్మముయొక్క పూర్ణరూపము. అందుండియే పరమాత్మను చూడవలెను. సీత లోకమాత. స్త్రీలకు ఆదర్శమూర్తి.

రామానందస్వామివారు వర్ణభేదమును నిరసించిరి. అన్ని కులములవారును కలిసి ఒక పంక్తిగా భుజింప వచ్చుననిరి. స్వాముల వారికి తక్కువ కులముల యెడ దయ యెక్కువ. కులభేదములను ఖండించిరి. ఆయన శిష్యులలో బ్రాహ్మణులే గాక అనేక కులములకు చెందిన వారుండిరి. భక్తశిఖామణి యనదగు కబీరు స్వాములవారి శిష్యుడు. భక్తిమార్గమందు భక్తుడు భగవంతుని చేరుటను కులభేదము లడ్డురావను సత్యమును తెలిసికొన్న మహనీయులలో రామానందస్వామివా రొకరు.వీరు 111 సంవత్సరములు జీవించి లోకోపకార మొనరించి భగవదైక్యము పొందిరి.

శ్రీ కబీరు - వీరు క్రీ.శ.1455లో కాశీలో జన్మించిరని చెప్పుదురు. వీరి జన్మకాలమును గుఱించి భేదాభిప్రాయము లున్నవి.* వీరు రామానందస్వామివారి శిష్యులనుట నిర్వివాదము. వీరి తల్లిదండ్రు లెవ్వరో తెలియదు. ముసల్మాన్ దంపతులు వీరిని పెంచి పెద్దవానినిగా చేసిరట. వీరికి "లోయీరామ్","జనియా" అని యిరువురు భార్యలు. ఇరువురు పుత్రులు; ఇరువురు పుత్రికలును ఉండినట్లు చెప్పుదురు.

కబీరు గురూపదిష్టమార్గము ననుసరించి హిందూ ముస్లిం సఖ్యతను ప్రచారము చేసిరి.వీరి ఉపదేశమిది :- భగవంతునికి అనేక నామము లున్నవి. అన్నింటికంటెను 'రామ' నామము ఎక్కువ మహిమాన్విత మయినది. మానవుడు సర్వదా రామనామ స్మరణముచే, రామభక్తిచే ముక్తుడగునని చాటిరి.

కబీరుగారు "రాధాస్వామి" నామమును గుఱించి యెక్కువగా చెప్పిరని ఆగ్రాయందలి దయాళ్ భాగ్ రాధాస్వామి సంప్రదాయమునకు

---

* డాక్టరు కొత్త సచ్చిదానందమూర్తిగారు విజ్ఞానసర్వస్వము 7 వ సంపుటమున శ్రీ కబీరు క్రీ.శ.1455 నాటివాడనిరి. వి.స.6 సంపుటమున ఉభయభాషాప్రవీణ శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు శ్రీ కబీరు 1398 లో జన్మించి క్రీ. 1518 మృతినొందిరని వ్రాసిరి. కబీరు రామానందుల కాలనిర్ణయమే రామానంద కబీరుల గురుశిష్య సంబంధములలో గల వ్యత్యయ మునకు కారణమని గ్రహించగలరు. సంపా.

చెందిన పెద్దలు వారి "అమృత బచన్" అను గ్రంథమున కబీరుగారి యీక్రింది వాక్యముల నుదాహరించిరి.

"కబీర్ ధారా ఆగమకీ. సతగురు దాయిలభాయ్.
ఉలట్ తాహి సుమిరన్‌కరో, స్వామీ సంగ మిలయ్."

"అనగా సద్గురువు ఆగమ పురుషుని అనగా గమ్యమున కతీతమగు పురుషుని ధారను తమకు చూపించిరని కబీరువారు సెలవిచ్చు చున్నారు. "ధారా" ను తిరుగ త్రిప్పి దానికి "స్వామీ"ని చేర్చగా నేర్పడు శబ్దమును స్మరణ చేయుము." అని వ్రాసియున్నారు. "ధారా"ను తిరుగ త్రిప్పిన "రాధా" అగును. దానికి "స్వామీ" ని చేర్చిన "రాధా స్వామీ" అగును. రామనామమే గాక రాధాస్వామీ నామమును కూడా గొప్పగా చెప్పిరని యిందువలన విదితమగును.

కబీరు గారియందు భారతీయ తత్త్వజ్ఞానముతో చేర్చిన సాధ్యభక్తియే గాక విదేశీయుల, అనగా ఫకీర్ల మౌల్వీల భక్తితత్త్వముకూడా మిళితమైనదని తోచును. ఏమైనను కబీరుగారు గొప్ప మహనీయు లనుట నిస్సంశయము.

వీరు 'రుమైనీలు' అను పేరుతో అనేక కీర్తనలు రచియించినారు. వీరు రచియించిన గ్రంథములు చిన్నవి పెద్దవి కలసి 61 వఱకు కలవట. వాటివలన వీరి మతము మనకు తెలియుటకు అవకాశ మేర్పడినది. వీరి రచనలయందు వైష్ణవభక్తి ప్రభావమే గాక సూఫీమత ప్రభావముకూడ కలదు. వీరు విగ్రహారాధనను ఖండించిరి. వేద పాఠమువలన, గాయత్రీ జపమువలన, యజ్ఞములవలన, అసలు విషయమేదో అది తెలియదని, వాటివలన ముక్తులు కారని, రామభక్తితోనే ముక్తు లగుదురని అందురు. రామ్ - రహీం ఒక్క దేవుని పేర్లే అని బోధించిరి.

శ్రీకబీరు భగవదైక్యమును జెందిన పిమ్మట వీరి దేహమునకు దహనక్రియ జరిపిరి, ఆ బూడిదను హిందువులు ముస్లింలు గైకొనగా, హిందువులు దానిని గంగలో కలిపిరనియు ముస్లింలు దానిపై గోరి కట్టిరనియు చెప్పుదురు.

శ్రీతులసీదాసు :- వీరు క్రీ.శ. 1532 లో జన్మించిరి. రామాయణ మహాకావ్యమును "రామచరిత మానస" అను పేర హిందీభాషలో వ్రాసి లోకోపకారము చేసిరి. దీనిని "తులసీదాసు రామాయణ"మని అందురు. వీరు రామభక్తులు. రామభక్తిని ఉత్తరహిందూస్థానమున వ్యాపింప జేసిరి. కులతత్త్వమును ఖండించిరి. ధర్మవర్తనము కలిగి నీతిపథమును వీడక జీవించవలెనని బోధించిరి. వీరు 1623లో భగవదైక్యము నొందిరి.

శ్రీ తుకారాం:- వీరు పండరీనాథ్ భక్తులు. కులమున శూద్రులు. 1608-1650 మధ్యకాలమం దుండెడి వారు. శివాజీ మహారాజునకు సమకాలికులు. తుకారాం యశస్సును విని శివాజీ మహారాజు తమ ఆస్థానముకు పిలిపించి గౌరవింపదలచిరి. కాని తుకారాంగారు సన్మానములకు విముఖులైరట. వీరు మహారాష్ట్ర భాషయందు "అభంగ్"అను ఛందస్సుతో కీర్తనలు రచియించిరి. మూఢవిశ్వాసములు విడువవలెనని, సర్వమానవులయెడ సమదృష్టి కలిగి యుండవలెనని, మానవసేవయే మాధవసేవ యని బోధించిరి. మొదట బ్రాహ్మణులు వీరిని బాధించిరి. కాని, తరువాత గౌరవించిరి. మహారాష్ట్రమున అనేకులు వైష్ణవ భక్తులు జన్మించిరి. వారి యందు అధిక సంఖ్యాకులు బ్రాహ్మణేతరులు. స్త్రీలలో మీరాబాయిగారు ప్రసిద్ధులు. పై వారు కాక ఉత్తర భారతమున జయదేవుడు మున్నగు భక్తులు జన్మించి వైష్ణవమును పెంపొందించిరి.

ఆంధ్రులలో త్యాగరాజుగారు, రామదాసుగారు మొదలగు భక్తులు వారి రచనలద్వారా వైష్ణవమును పోషించిరి. వైష్ణవమత తత్త్వమును గుఱించి సంగ్రహముగ చెప్పితిని.

(౧౧) శైవము

శైవమతము చాల ప్రాచీనమైనది. ఈ మతము భరత ఖండమునందే గాక ఒకప్పుడు ప్రపంచ మంతయు వ్యాపించి యుండెనేమో యని తోచును. "శివలింగములు ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఖండాగ్గత

దేశములందు కానవచ్చిన" వని చెప్పుదురు. అవి క్రీస్తునకు పూర్వము సుమారు 3000 సంవత్సరముల నాటివని కొందఱును, 5000-6000 సం॥నాటి వని కొందఱును చెప్పుదురు. మొహెంజోదారో, హరప్పాలవద్ద త్రవ్వకములందు శివలింగములు కనబడినవి.* శైవవాఙ్మయము చాల గొప్పది.

వేదములయందు రుద్రనామము కలదు. రుద్రుని స్తుతు లనేకములు కలవు. ఋగ్వేదము ప్రథమాష్టకము తృతీయాధ్యాయము అష్టమానువాకము 38-వ సూక్తమునందు తొలుత రుద్రశబ్దము కనపడుచున్నది.

సూ॥ " సత్యం త్వేషా అమవన్తో ధన్వఞ్చి దారుద్రియాసః
మిహం కృణ్వన్త వాతామ్."

"తా॥ ప్రకాశించువారును, బలవంతులును రుద్రునిచే బాలింపబడిన వారునగు మరుత్తులు ఎడారిలో గూడ సర్వత్ర వాయువు లేని వర్షమును గలిగించుచున్నారు. ఇది సత్యము."

తరువాత 43వ సూక్తము రుద్రుని స్తుతించెను. అందు రుద్రుని సోమదేవా!' అని సంబోధించెను. అ 1 అ 8 మం1అను 16 సూ114 యందు ఋషి రుద్రునకు జటాజూట మున్నట్లును, వాయువులు రుద్రునకు కుమారులైనట్లును గానము చేసెను. ఇందు 1225 వ ఋక్కునుండి 1235 ఋక్కువఱకు స్తోత్రమునందలి సారాంశము -మమ్ముల హింసింపకుమని మృత్యు భయము నుండి రక్షింపుమని రుద్రుని కోరుచున్నారు. అందులో (1234 ఋక్కునందు) రుద్రుడు జ్ఞానకర్మలకు ప్రభువని స్తుతించిరి.

బ్రాహ్మణములయందు రుద్ర శివనామములు కలవు. మహాభారతము, హరివంశము, శ్వేతాశ్వతరోపనిషత్తు - శివునిగుఱించి చెప్పినవి. అష్టోత్తర శతోపనిషత్తులందు శైవోపనిషత్తులు పదునైదు గలవు. ఇందులో కొన్ని

---

* బసవపురాణమునకు ఉపోద్ఘాతము వ్రాసిన శివశ్రీ బండారు తమ్మయ్యగారు ఈ విషయము వ్రాసియున్నారు.

యితర అధ్యాత్మవిషయములను చెప్పినను వీటిలో శైవతత్త్వమును గుఱించిన అంశములు గలవు. పురాణములకంటె పూర్వమే రచియింపబడిన హరివంశమునందు శివారాధనము చెప్పబడినది.* దక్షిణ భారతమున శైవ బ్రాహ్మణులు సంస్కృత భాషయందును, బ్రాహ్మణేతరులు తమిళభాషయందును - శైవాగమమును (శైవమును గుఱించి) అనేక శైవగ్రంథములు రచించిరి. ఈ శైవాగమములు సుమారు నూటాతొంబై యెనిమిది కలవనియు, అందు ముఖ్యమైనవి యిరువది యెనిమిది అనియు చెప్పుదురు.

ఈ మతము ముఖ్యముగా ఆగమముపై ఆధారపడియున్నను, శివ, స్కంధ, వామన, లింగ, వాయు పద్మపురాణములు శివభక్తిని పోషించినవి. తమిళమున శివభక్తుల చరిత్రమును, శివుని స్తోత్రమును చేయుచు చెప్పిన గీతములు గల ప్రాచీన గ్రంథము - పెరియ పురాణము. ఈ మతమును పరిశీలించిన పాశ్చాత్య పండితులు దీనిని గొప్పగ ప్రశంసించి యున్నారు. దక్షిణ భారతమున 63 గురు (అరువత్తుమూవురు) శివ భక్తులు పరమాచార్యులై ఈ మతమును వ్యాప్తినొందించిరి.

శ్రీకంఠులను ఆచార్యులు బ్రహ్మసూత్రములకు శివాద్వైతపరముగ భాష్యమును రచియించిరి. వీరు 13వ శతాబ్దమునందున్నట్లు పండితుల అభిప్రాయము. వీరి కాలనిర్ణయమును గురించి పండితులయందు అభిప్రాయభేదము లున్నవి. వీరిభాష్యమునకు శ్రీకంఠభాష్యమని పేరు. దీనికి కంచి అప్పయ్య దీక్షితులవారు "శివార్కమణిదీపిక"యను వ్యాఖ్యను రచియించిరి. ఈ ఆగమములను వీరు వేదములవలె గౌరవింతురు.

---

* హరివంశమునందొక కథ యిట్లున్నది:- విషపూరితములైన ఒక కపిత్థవృక్షఫలములు భూమిపై వ్రాలి అందుండి సడలిన విషవాయువులవలన అచ్చటికి కొంత దూరమునందున్న గోకులమున నివసించు గోపబాలురకు వ్యాధులు ఎక్కువగా వచ్చుచుండెను. నందాది గోపకులు దాని కారణ మరయలేక శివుని ఆరాధించిరి. శివు డొకవ్యక్తియం దావేశించి విషపూరితమైన వెలగచెట్లను నాశనము చేసినచో వ్యాధులు నశించునని చెప్పెను. బలరామకృష్ణులు అచ్చటికేగి ఆ వెలగచెట్టును ధ్వంస మొనర్చిరి

వీటినే తంత్రము లందురు. తంత్రమనగా: జ్ఞానమును విస్తరింపజేయునది. ఇవి భోగమోక్షముల రెండింటిని కలిగించునవి. వేదములు (నిగమములు) సాధనమార్గమును చెప్పగా వాటికంటెను మోక్షమార్గమును చెప్పు ఆగమములు శ్రేష్ఠము లనియు వీరిభావము.

శైవాగమములు నాలుగు విధములు. (1) శైవము, (2) పాశుపతము, (3) సోమము, (4) లాకులము. శైవము నందు నాలుగు అవాంతరశాఖలు ఏర్పడినవి.* అవి (1) వామము:- ఇది శక్తిప్రధానము, (2) దక్షిణము:- ఇది భైరవాత్మకము, (3)మిశ్రమము:- ఇది సప్తమాతృకము, (4) సిద్ధాంతము:- ఇది శక్తివిశిష్ట శివాత్మకము. ఈ సిద్ధాంతమును ప్రతిపాదించిన కామికాగమము ఉత్తరభాగమున వీర శైవసిద్ధాంతము తెలుపబడినది.

శైవసిద్ధాంతమునందు అనేక శాఖలు కలవు. అవన్నియు మూలమున ఒక సిద్ధాంతమునకే చెందినను స్వల్పభేదములవలన వేఱువేఱు శాఖలుగా ఏర్పడినవి. సాంఖ్య సిద్ధాంతమునందు తత్త్వముల పరిణామము చెప్పినట్లే శైవమునందును తత్త్వములను చెప్పుదురు. కాని సాంఖ్యులవలె ఇరువదియైదు గాక వీరు 36 తత్త్వములను చెప్పుదురు.

ఉపనిషత్తులందు చెప్పబడిన పరబ్రహ్మము ఈ మతమున పరశివబ్రహ్మము. ఇది సంకల్పముతో కూడిన దయ్యెను. సంకల్పరహితమగు పరబ్రహ్మమునందు సృష్టిసంకల్పము ఎప్పుడు కలిగెనో అప్పుడు పరబ్రహ్మమును విడిచియుండని విమర్శశక్తి యిచ్ఛాశక్తిగా పరిణతి చెందెను. అట్టి యిచ్ఛాశక్తినుండి జ్ఞానశక్తియు, దానినుండి క్రియా శక్తియు కలిగెను. ఇచ్ఛాశక్తికి జ్ఞానశక్తి అంతరంగము, క్రియాశక్తి బహిరంగము. శివునియందు (1) సర్వకర్తృత్వ రూపశక్తి, (2)సర్వజ్ఞత్వ

* కొన్ని అగమములయందు శైవము దశవిధభేదములతో ఉన్నవందురు. (1) శైవము, (2) పూర్వశైవము, (3) మిశ్రమము, (4) శుద్ధశైవము, (5) శ్రౌతశైవము, (6) మార్గశైవము, (7) వీరశైవము, (8) సామాన్య వీరశైవము, (9) విశేష వీరశైవము, (10) నిరాచార వీరశైవము. (బం.తమ్మయ్యగారు)

రూపశక్తి, (3)పూర్ణత్వ రూపశక్తి, (4) నిత్యత్వ రూపశక్తి, (5) సర్వవ్యాపకత్వ రూపశక్తి (స్వాతంత్ర్యశక్తి) అను ఈ యైదుశక్తులు గలవు.

ఇచ్చట విమర్శశక్తి అనగా: పరశివుని మొదటి స్పందము. శివుడు ప్రకాశ స్వరూపుడు. శక్తి విమర్శ స్వరూపిణి. శక్తియందు శివుడు తన స్వరూపమును చూచుచున్నాడు. శివుని ప్రతిబింబము విమర్శ రూపశక్తియందు పడుటచే విమర్శ ప్రకాశరూపముగను, ప్రకాశము విమర్శరూపముగను నున్నట్లు తోచును. ఈ యంశము శాక్తేయమున విశదపరతురు. ఈ మతమున శ్రీ మద్రామానుజ మతమున చెప్పిన విధముగానే సూక్ష్మ చిదచిద్విశిష్టుడు శివుడు (బ్రహ్మము) కారణావస్థ, స్థూల చిదచిద్విష్టుడగు శివుడు (బ్రహ్మము) కార్యావస్థ. ఈ మతమున శివుడు బ్రహ్మము. రామానుజుల వారి మతమున బ్రహ్మము విష్ణువు. ఇది శివాద్వైతము.

వీరు ముప్పదిఆఱు తత్త్వముల గుఱించి యీ క్రింది విధముగ చెప్పుదురు :-

1. శివతత్త్వము :- పరబ్రహ్మమే జ్ఞానశక్తితో చేరి "నేను సర్వజ్ఞుడ" నను అభిమానము పొందుటచే శివతత్త్వ మనబడును. ఈ తత్త్వము సృష్టికి నిమిత్తకారణము.

2. శక్తితత్త్వము :- పైన చెప్పబడిన పరశివ బ్రహ్మమే క్రియాశక్తితో చేరి "నేను సర్వకర్తను" అను అభిమానమును పొంది శక్తి తత్త్వ మనబడును. ఈ తత్త్వమునే విమర్శ శక్తి యందురు. సర్వజ్ఞతా రూప చిచ్ఛక్తికిని, సర్వకర్తృత్వరూప ఈచిచ్ఛక్తికి ఈ శక్తి ఆశ్రయ మైనది.

3. సదాశివతత్త్వము :- ఈశక్తితత్త్వమే జ్ఞానశక్తి యందు ప్రవేశించి "అహమిదం"="నేనే యీ ప్రపంచమును" అను అభిమానమును పొంది 'సదాశివతత్త్వ' మనబడును. శివశక్తుల అంతర్మేషణము. ఈ తత్త్వమునందు ప్రపంచము సూక్ష్మరూపము పొందుటకు యత్నించిన స్థితి.

4. ఈశ్వరతత్త్వము :- ఈ శక్తితత్త్వమే క్రియాశక్తియందు ప్రవేశించి విత్తనములు మొలక లెత్తినట్లు ప్రపంచము సూక్ష్మావస్థను గూర్చి "నేనే యీ ప్రపంచమును" అను అభిమానమును పొందగ ఈశ్వరతత్త్వ మనబడును. శివశక్తుల బహిరున్మేషణము. సదాశివుని బాహ్యరూపము ఈశ్వరుడు.

5. శుద్ధ విద్యాతత్త్వము :- ఈ శక్తితత్త్వమే సముద్రమునకును, సముద్రమునందు కనబడు అలలకును అభేదమగునట్లు; "నేను" అనియెడి అహంకారమునకు "ఇది" అను ప్రపంచమునకు భేదములేని జ్ఞానము పొందినదై "శుద్ధ విద్యాతత్త్వ" మనబడును.

6. మాయాతత్త్వము :- శుద్ధ విద్యాతత్త్వముగా పరిణమించిన శక్తితత్త్వము తనయందుండి కలుగబోవు ప్రపంచమునకు నిర్మాణకారణ మగు సూక్ష్మభూత పదార్థము లందు "ఇది వేఱు" "ఇది వేఱు" అను భేదబుద్ధి కలుగుటచే మాయాతత్త్వ మనబడును. ఇదియే జగత్తునకు ఉపాదాన కారణము.

ఈ మాయ స్వరూపమును మరుగుపరచి యిక మీద కలుగ బోవు తత్త్వములకు కారణ మగుచున్నది. జడాజడములగు సర్వమును పరశివుడై యుండగా "అది" "ఇది" ఇది జడము, ఇది చైతన్యము, అను భేదమును ప్రథమమున కలుగ జేసిన దగుటచే 'మాయ' యనబడెను. భేదబుద్ధిని కలిగించుట దీని మహిమ. ఇచటినుండి శివుడు తన పంచశక్తులను సంకోచింప జేసికొనును. ఇక చెప్పబోవు 7,8,9,10,11సంఖ్యలు గల తత్త్వములు శివుని శక్తులయొక్క సంకోచ రూపములని చెప్పవచ్చును.

7. కల (కళ) ఇది మాయనుండి కలిగినది. లేదా, మాయయొక్క పరిణామము. ఇక ముందు చెప్పబోవు శివుడు (పురుషుడు) మాయచే ఆవరింపబడిన వాడై పైన చెప్పిన తన సర్వకర్తృత్వ, సర్వజ్ఞత్వ, పూర్ణ త్వ, నిత్యత్వ, సర్వ వ్యాపకత్వ శక్తులను మరచి (౧) కించిత్కర్తృత్వ, (౨) కించిద్జ్ఞత్వ, (3) అపూర్ణత్వ, (౪) అనిత్యత్వ, (౫) అవ్యాపకత్వములు

కలవాడనని బాధించుటకు హేతు వైనది కళా తత్త్వము. ఈ కళ మొదలు క్షితివఱకు గలవి పైన చెప్పిన మాయా బీజమునుండి ఉత్పన్న మైనవి.

శివుని సర్వకర్తృత్వశక్తి సంకుచిత మైనందున కించిత్కర్తృత్వ రూప శక్తియే కల (కళ) అను తత్త్వరూపమును పొందుచున్నది. జీవులు తాము సర్వశక్తులమని నమ్ముట లేదు. ఏదో కొంత శక్తి మాత్రమే తమకు కలదనుకొనును.

8. విద్యాతత్త్వము : శివుని సర్వజ్ఞాతాశక్తి సంకోచమును పొంది విద్య యైనదని కొందఱందురు. అనగా కొన్నింటిని మాత్రమే తెలిసికొనును. అన్నింటిని ఎఱుగ లేదు. బుద్ధి యందు ప్రతిఫలించిన వాటినే యెఱుగును. కొందఱు ఇది తత్త్వసాధక మందురు

9 రాగతత్త్వము : పరిపూర్ణ పరశివుని నిత్యతృప్తి పరిమిత మగుటవలన స్త్రీలు, చందనము, పుష్పములు మొదలగు వానియందు ప్రీతి కలిగినదై రాగతత్త్వ మనబడును.

10. కాలతత్త్వము :- నిత్యుడై కాలాతీతుడైన శివుని నిత్యత్వరూపశక్తి సంకుచితమై, అనిత్యత్వరూప శక్తియై, భూత వర్తమాన భావి కాలములను వ్యవహారమునకు అసాధారణ కారణమై, కాలతత్త్వ మనబడును. ఇది నిత్యము కాదు. కాలాతీతుడు శివుడు.

భావము లన్నింటికిని అవచ్ఛేదకము కలిగించును. భావములకు సకల ఆభాసములకు సంధాయక మైనది. ఇదే భూతాది అని కొంద ఱందురు.

11. నియతితత్త్వము :- సర్వవ్యాపక మయ్యును,' నీ కార్యమునుండి యీ కార్యము పుట్టుచున్నది.' 'ఇది నాయందు పుట్టినది కాదు' అని ఒక నియమము ఏర్పరచుకొనిన వ్యాపక శక్తియే నియతితత్త్వ మగును. మఱియు ప్రాణుల దేహము నందలి వివిధావయవముల ఒక క్రమము ననుసరించి యుండు నట్లు చేయు నియామక శక్తియే 'నియతి' యని యందురు.

[పురుషతత్త్వము - పురుషుడు అల్పమగు జ్ఞానానంద స్వరూపుడు. మొదట చెప్పబడిన శివుడే కల, విద్యా, రాగ కాలనియతు లను పంచకంచుకములలో ప్రవేశించి తన సర్వజ్ఞత్వాది శక్తులను సంకుచితము చేసికొని జీవ (పురుష) సంజ్ఞ నొంది యున్నాడు. త్రివిధమలములను పోగొట్టుకొని పంచ కంచుకమును విచ్ఛిన్నము చేసిన పురుషుడే శివుడగును. అంత వఱకును జీవుడు తాను అణురూపుడ నని జీవు లనేకములని భావించుచు సుఖదుఃఖముల నొందుచున్నాడు.]

12. ప్రకృతి తత్త్వము :- ఒక కార్యమునకు పూనుకొనునట్లు చేయు నిచ్ఛాశక్తి తనయందున్న జ్ఞానశక్తియందుండి క్రియ కలుగదు. క్రియవలన జ్ఞానము కలుగదు అను భేదబుద్ధికి ప్రధానమైన మాయాతత్త్వమునందు ప్రతిస్ఫురించి ప్రకృతితత్త్వ మనబడును. ఇచట ఇచ్ఛాజ్ఞానక్రియా శక్తులు సామ్యావస్థయం దుండును - ఇది సాంఖ్యులు చెప్పునట్టి మూల ప్రకృతి కాదు. దీనికి జన్మ కలిగినది.

మహత్తత్త్వము :- "ప్రకృతితత్త్వము సుఖ దుఃఖ మోహాదులకు కారణమైన సత్త్వరజస్తమో గుణములు సామ్యావస్థ యందుండుటయే మహాతత్త్వ మనబడును." (ఈ పదమూడు తత్త్వములే సృష్టికి మూలకారణములు).

(సాంఖ్యుల మతానుసారము ప్రకృతి రజస్తమోగుణాత్మకము. ప్రకృతియందుండి గుణములు కలిగినవని గాని, గుణములు మూడును వేఱు, ప్రకృతి వేఱు అని గాని వాటిని రెండు తత్త్వములుగా సాంఖ్యులు లెక్కింపరు. శైవులు ప్రకృతి వేఱు, సత్త్వాది గుణత్రయము గల మహాతత్త్వమును వేఱుగా లెక్కించిరి. కనుక,ముందు చెప్పబోవు 14వది యగు బుద్ధి తత్త్వమునకును 12వది యగు ప్రకృతికిని మధ్య మహాతత్త్వము లేక గుణత్రయము అను 13వ తత్త్వము లెక్కింప బడినదని అర్థము చేసికొనవలయును. ఇందువలన పృథ్వీతత్త్వము నుండి ఆరంభించి లెక్కించిన పురుషుడు 26వ వాడగుచున్నాడు. అట్లుగాక మహత్తు బుద్ధి తత్త్వములు ఒకటే అయినచో పురుషుడు 25వ వాడగును.

అప్పుడు సాంఖ్యులతో సరిపోవును. సాంఖ్యులు చెప్పు మూల ప్రకృతి గాని పురుషుడుగాని పుట్టినవి గావు. శైవుల ప్రకృతికి జన్మ మున్నది.

14. బుద్ధితత్త్వము :- ప్రకృతి తత్త్వరూపమైన శక్తితత్త్వమే. "ఇది ఇట్లు" అనెడి నిశ్చయము గలదై బుద్ధి తత్త్వ మనబడును.*

15. అహంకార తత్త్వము :- పైన చెప్పిన బుద్ధితత్త్వరూపమైన శక్తితత్త్వమే "నేను"-"నాది" అనెడి అహంకార మమకారములకు మూలమై అహంకార తత్త్వ మయినది.

16. మన స్తత్త్వము :- పైన చెప్పిన తత్త్వమే సంకల్పవికల్పములకు కారణమై మన స్తత్త్వ మగును.

అంతఃకరణము :- బుద్ధి, అహంకారము, మనస్సు అను ఈ మూడు తత్త్వములు శరీరము ననుసరించుటవలన అంతఃకరణ మనబడును. ఇది ఇచ్ఛాశక్తి ప్రధాన మైనది.

అద్వైత సాంఖ్యాది మతములయందు మనో బుద్ధి చిత్త అహంకారములు నాలుగును అంతఃకరణ మందురు. శైవులు చిత్తమును వదలిరి.

17. పైన చెప్పినట్లు అంతఃకరణముగా పరిణమించిన తత్త్వమే శరీరమునందు శబ్దజ్ఞానమునకు సాధనమై **శ్రోతృతత్త్వముగను,** 18. స్పర్శజ్ఞానమునకు సాధనమై **త్వక్‌తత్త్వముగను,** 19. రూపజ్ఞానమునకు సాధనమై **నేత్రతత్త్వముగను,** 20. రసజ్ఞానమునకు సాధనమై

---

* 1నుండి పురుషుడు 12 వ తత్త్వముగా అంగీకరించిన నిచట చెప్పిన ప్రకృతి 13 వ దిగను, మహత్తత్త్వము 14వ దిగను, బుద్ధితత్త్వము 15వ దిగను వ్రాయవలసి యున్నది. మహత్తత్త్వమును, బుద్ధిని వేఱువేఱుగా లెక్కించి పురుషుని తత్త్వములలో (12 వ వానినిగా) లెక్కించిన మొత్తము తత్త్వముల సంఖ్య 37 అగును. శైవగ్రంథములయందు తత్త్వములు 36 అని చెప్పియున్నందున మహత్తు బుద్ధి అను వాటిలో బుద్ధిని తొలగింప వలెను, లేదా పురుషునైనను తత్త్వములనుండి తొలగింప వలయును. నేను పురుషునికి సంఖ్య నివ్వక మహత్తు బుద్ధి అను రెండు తత్త్వములను వేఱు వేఱుగా గుర్తించినాను. కొందఱు బుద్ధిని వదలి పురుషుని తత్త్వములలో 2వ వాని గా లెక్కించినారు.

జిహ్వాతత్త్వముగను, 21. గంధజ్ఞానమునకు సాధనమై **ఘ్రాణతత్త్వముగను** పరిణమించినది. (ఇవి జ్ఞానశక్తి ప్రధానము లగుట జ్ఞానేంద్రియ పంచకము).

జ్ఞానేంద్రియ రూపముగ పరిణమించిన ఈ శివ శక్తితత్త్వమే, **22. వాక్కు, 23. పాణి, 24. పాద, 25. పాయు, 26. ఉపస్థ** - తత్త్వములుగ పరిణమించినట్లు చెప్పబడినవి. (ఇవి కర్మేంద్రియ పంచకము) ఈ విధముగా అంతఃకరణము, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియాదులుగా పరిణమించిన బుద్ధి మొదలు 13 తత్త్వములు క్రమముగ ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తి ప్రధానములుగా నున్నవి.

పైన చెప్పిన శివ శక్తితత్త్వమే జ్ఞానేంద్రియ పంచకముచే క్రమముగ తెలియబడు **27. శబ్ద, 28 స్పర్శ, 29. రూప, 30. రస, 31. గంధములుగ** పరిణమించినది, (వీటికి తన్మాత్రలు లేక సూక్ష్మ భూతములని పేర్లు).

పైన చెప్పబడిన శివశక్తితత్త్వమే క్రమముగ శబ్దాది గుణములు గల **32. ఆకాశ, 33. వాయు, 34. అగ్ని, 35. జల, 36. పృథ్వీభూతములుగ** పరిణమించినది. (ఇవి పంచభూతములు).

ఈ 36 తత్త్వములను శాక్తేయులు 25 తత్త్వములలోనే చేర్చి చెప్పుదురు. ఆ వివరము శాక్తమును గుఱించి చెప్పు సందర్భమున చెప్పుదురు. శైవుల ముప్పది ఆఱు తత్త్వములకు మూలము శైవాగమములే.

మహాభారతమునందలి అనుశాసనిక పర్వమునందు "హర సనత్కుమార సంవాదము" కలదు. అందు మహర్షి రుద్రునకు సాంఖ్యతత్త్వ ముపదేశించి నట్లున్నది. ఆ పర్వమునందే పార్వతీ పరమేశ్వర సంవాదమునందును శివుడు పార్వతీ దేవికి సాంఖ్యతత్త్వ ముపదేశించినట్లు కలదు. ఆ రెండు ఘట్టములయందును పురుషునితో చేరి సాంఖ్యులు చెప్పినట్లే యిరువది అయిదు తత్త్వములు చెప్పబడినవే గాని శైవమునందలి 36 తత్త్వముల ప్రస్తావన లేదు. దీనిని బట్టి శైవుల 36 తత్త్వముల ఉత్పత్తిక్రమము మహాభారత కాలమునాటికి ప్రచారము

నందుండలేదేమో యని తోచును. అయినను శైవుల 36 తత్త్వముల పద్ధతి త్రోసివేయవలసిన అవసరము లేదు.

శివుడే స్వశక్తి సహాయమున ఆగమములచే చెప్పబడిన ఈ 36 తత్త్వములుగా పరిణమించి నందున సర్వము శివరూపమే గాని అన్యము కాదు. శివునికంటె వేఱైన దేదియు లేనందున దీనిని శివాద్వైత మనియు, శక్తి విశిష్టుడైనందున శివవిశిష్టాద్వైత మనియు అందురు. **"సర్వం ఖల్విదం బ్రహ్మ", "నేహ నానాస్తి కించన"** అను శ్రుతి వాక్యములకు ఈ మతము సమ్మత మనియు చెప్పుదురు. శక్తి విశిష్ట శివపరబ్రహ్మము యొక్క పరిణామ రూపమై యుండుట వలన జగత్తు సత్యము, భ్రాంతి కాదు. ఘటమునకు ప్రధాన కారణము కుమ్మరి. సహాయ కారణము చక్రదండాదులు. ఉపాదాన కారణము మట్టి. ఈ విధముగనే జగత్తునకు ప్రథమ కారణము అనగా : నిమిత్తకారణము బ్రహ్మము (శివుడు), సహాయ కారణము ఆయన శక్తి, ఉపాదాన కారణము మాయ, ఈ దృష్టాంతమున ఘటమునందు కుమ్మరి వాడు లేడు. (దార్ష్టాంతికము నందట్లు గాదు. ఉప్పునీటియందు సర్వత్ర లవణముండు నట్లు జగత్తునందంతటను శివుడు నిండియున్నాడు. ప్రపంచాకారముగా నున్నవాడు శివుడే (బ్రహ్మమే).

అథర్వణ శిరోపనిషత్తు రుద్రుని పరతత్త్వముగా స్తుతించినది. అథర్వణ శిఖోపనిషత్తు శంభువును పరతత్త్వమని చెప్పినది. **"ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుం త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్"** అని కైవల్యోపనిషత్తు చెప్పినది. జీవజగత్తులు రెండును ఆయన యందున్నవి. ఆయన వాటియందున్నాడు. ఇరువురకును అవినాభావ సంబంధము. ఇరువురును ఒకటి కాదు. అద్వైతమనగా : ఏకత్వము కాదు. అవినాభావ సంబంధమని వీరు చెప్పుదురు.

జిజ్ఞాసువు :- శంకరుల అద్వైతముతో నీ మతమును సమన్వయ పరచ వచ్చునా?

వేదాంతి :- చాలా వఱకు సమన్వయము చేసి సరిచూచు కొనవచ్చును. ఎట్లన :- 36 తత్త్వములలో 1వ తత్త్వము శుద్ధ జ్ఞాన స్వరూపుడగు శివుడు అద్వైతుల నిర్గుణ సగుణ బ్రహ్మములతో సరిపోవును. 2వ తత్త్వమగు శక్తి తత్త్వము కొంతవఱకు అద్వైతుల సగుణ బ్రహ్మముతోను పోల్చవచ్చును. 3-4 తత్త్వములు అద్వైతుల హిరణ్యగర్భ, విరాట్టులతో కొంతవఱకు పోల్చవచ్చును. 5వ తత్త్వము అద్వైతుల సంయక్ జ్ఞానముతోను 6వ తత్త్వము అవిద్యతోను పోల్చుటకు వీలున్నది. 7 మొదలు 11 వఱకు గల పంచ కంచుకములు అవిద్యవంటివే లేక అవిద్య భిన్న రూపములే. 12వ తత్త్వము శక్తియొక్క (మాయయొక్క) త్రివిధ సూక్ష్మ రూపములు. 13వది యగు మహత్తత్త్వమును సాంఖ్యులును, అద్వైతులును చెప్పునట్టి జడప్రకృతి, లేక త్రిగుణాత్మిక మాయ యని భావించిన సరిపోవును. తరువాత క్రింది తత్త్వములన్నియు శైవులకు, అద్వైతులకు, సాంఖ్యులకు సమానమే. ఈ సమన్వయము కేవలకృత్రిమము కాదు. కేవల సహజమును కాదు. కళనుండి క్షితివఱకు గల తత్త్వము లన్నియు మాయాబీజమునుండి యుత్పన్న మైనవే. శాంకర మతమున చెప్పు మాయకును; శైవ, శాక్తములయందు చెప్పు 'విమర్శ' శక్తికిని చాల భేద మున్నది.

శివుడు పరమసత్యము. ఆయనకు కారణము లేదు. పరమపావనుడు. సర్వజ్ఞుడు. (1) సృష్టి, (2) స్థితి, (3) లయము, (4) జీవతిరోధాన, (5) మోక్షములను ఆయనయే చేయుచున్నాడు. ఆయన శక్తిద్వారమున పనిచేయును. ఆయన శక్తి జడము కాదు.

ఈ మతమున జీవుల సంఖ్య నియతము. వీరు పై చెప్పిన 36 తత్త్వములలో చేరిన వారు కారు. వీరు శివుని అంశము.* జడపదార్థమగు దేహనమునకంటె జీవులు భిన్నులు. జీవులకు జనన మరణములు

---

* జీవు డీశ్వరాంశ మనుటకు వీరు **'అంశో నానా వ్యపదేశాత్ (బ్ర.సూ.2-3-143), తదేక త్వత్యం యథా సుదీప్తాత్పావకాత్ విస్ఫులింగాః' (ముండక. 2-1-1)' మమైవాంశో జీవలోకే ' (గీత.15-7)** అను ప్రమాణముల నుదాహరింతురు.

లేవు. వీరు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను కలిగి యున్నారు. శివపురాణమునందు వామదేవ మహర్షికి కుమారస్వామి చెప్పిన (శక్తి విశిష్ట) శివాద్వైతము నందు శివుడే జీవుడైనట్లు చెప్పబడినది.

క|| అద్వైతము శివవాదం
బాద్వైతంబును సహింప దరయు మది మునీం
ద్రా! ద్వైతంబశ్వరము శి
వాద్వైత మనశ్వరంబు హరు వొప్పునిలన్.

గీ|| శివుడు సర్వేశ్వరుండును సర్వ కర్త
సర్వ సంవేదియు త్రిదైవ జనకు డగుణు
డరయ సచ్చిదానంద రూపాత్మ యైన
సంకుచితుడగు స్వేచ్ఛచే స్వప్రకృతికి.

"వ|| **అట్టి మాయాసంకుచిత రూపుండే పురుషుండన బరగు నాతడే కలాపంచకంబు చేత భోక్తనుగా గల్పితుండగు."** (ఆంధ్ర శివపురాణము - వాయువీయ ఖండము : అ.౧ - 90, 91, 92).

దీనివలన శివుడే స్వేచ్ఛగా సంకుచితుడై జీవరూపము నొందినట్లు తెలియవలయును. అయినను శివునకు జీవునకును వ్యావహారిక దశయందు (జీవుడు పాశబద్ధుడై యున్నపుడు) గల భేదమిట్లు చెప్పబడినది :-

పురుషుడు పంచకంచుకములు గలవాడు. అందువలన పురుషులు జ్ఞానానంద స్వరూపులైనను మూడు మలముల చేత అవరింపబడి యున్నారు. ఆ మూడు మలము లివి :- ఆణవ, కార్మిక, మాయికములు.

(1) ఆణవమల మనగా :- సర్వవ్యాపారియైన శివపరబ్రహ్మమగు తాను అణు పరిమాణము గల వాడనని తలచుట, (2) కార్మికమలము: ధర్మాధర్మరూపమైన కర్మములవలన నేర్పడినది. (3) మాయికమలము గురువు లుపదేశించిన పరమార్థమునందు బుద్ధిని చొరనివ్వక శివుని గూర్చిన జ్ఞానము కలుగకుండ చేయునది - ఈ మూడింటియందును జీవులలో కొందఱియందు ఒక మలముమాత్రమే యుండును. ఇంక

కొందఱియందు రెండును, మరి కొందఱియందు మూడు మలములును ఉండును. మొదటి వారు విజ్ఞానాకులని, రెండవ వారు ప్రళయాకులని, మూడవ వారు సకలురని పిలువ బడుదురు.

వీరు కర్మసిద్ధాంతములను ఆమోదింతురు. ఈశ్వరుడు కర్మనియతి ననుసరించి కర్మఫలమును జీవుల కొసగును. శివుడు పతి. జీవుడు పశువు. మాయ పాశము, వీరు ధర్మానుష్ఠానమునకు ప్రాముఖ్య మిత్తురు.

మోక్షము - శివుడు పరమదయాళువు. తనను చేరుటకు ప్రయత్నించు జీవుల ప్రయత్నములకు తోడ్పడును. జీవులు తన సన్నిధికి చేరవలెనని కోరుచుండును. "శివో౽హం"= నేనే శివుడను అను భావము ఎడతెగక ప్రవాహరూపమున నేర్పడి పాశమును తెంచివేయును. పాశవిముక్తుడైన జీవుడు పతితో సాన్నిధ్యమును పొందును. ఇది భక్తి (ఉపాసన) వలనను, జ్ఞానమువలనను కలుగును. శక్తి జీవునియందు భక్తి రూపమునుండి జీవుని ఈశ్వరునితో చేర్చును.

ముక్తపురుషునకు శివునితో సమానత్వము అనగా: సకల కామావాప్తి ఉండును. జగత్కర్తృత్వ పాలనత్వము లుండవు. కాని శివునివలెనే పరమానంద స్వరూపానుభూతి నొందును. అట్టి అనుభవమును నే ననుభవించుచున్నానను ఎఱుక (అహంకారము) ఉండును. అతని అహంకారము సంసారమునందున్న జీవుల అహంకృతి వంటిది కాదు.

భక్తి యెట్లు కలుగు ననుటకు శివపురాణమునం దిట్లున్నది.

గీ|| భక్తి పొడమును శివుని దీవ్యత్ప్రసాద
మున, నది జనించు శివుని ప్రభూత భక్తి,
బీజ మంకురమున నట్లు బీజమునను
నంకురము జనియించెడు నవని యందు.

తా|| విత్తునకు చెట్టును, చెట్టునకు విత్తును కలిగినట్లు శివభక్తి వలన శివుని కృపయును, శివ ప్రసాదమున శివ భక్తియు కలుగునని భావము.

భక్తులు శివసాన్నిధ్యమును చేర త్వరపడుచుందురు. ఆళ్వారులవలననే దక్షిణదేశ మందలి శివభక్తులు మనోహర గీతములచే శివుని స్తుతించిరి. దక్షిణ దేశమందలి శైవమతమునందొక ప్రత్యేకత కలదు. అచ్చట శైవ గ్రంథములు సంస్కృత భాషయందు వ్రాసిన వారు బ్రాహ్మణులు. తమిళ భాషయందు వ్రాసిన వారు బ్రాహ్మణేతరులు. తమిళమునందు వ్రాసిన వారిలో జ్ఞాన సంబంధర్, అప్పర్, సుందరమూర్తి అనువారలను త్రిమూర్తులని పిలుతురు. ఈ విషయమున శ్రీ వైష్ణవులయందలి ఆళ్వార్ల ద్రావిడవేద మనబడు నాలాయిరమును, ఆచార్యుల రచనలగు సంస్కృత గ్రంథములును స్మృతికి వచ్చును.

సంస్కృత సాహిత్యమునందలి శైవము (శివ) విశిష్టాద్వైతమనియు, తమిళ సాహిత్యమునందలి శైవము శివాద్వైతము లేక భేదాభేద సిద్ధాంత మనియు పండితు లందురు.

శైవదర్శనము చాలవఱకు రామానుజ దర్శనమును పోలియున్నది. ఇరువురిది భక్తి మార్గమే. ఈ భక్తియందు స్వల్పభేద మున్నది. సమప్రదేశమునందు ఒడుదుడుకులు లేక ప్రవహించు నది వంటిది వైష్ణవ భక్తి. పర్వత ప్రదేశముల నుండి క్రిందికి ప్రవహించు నది వంటిది శైవభక్తి. శ్రీ వైష్ణవ, శైవ దర్శనములకు చాలవఱకు సారూప్యము కలదు. కాని మతమునందు ఉభయ మతస్థులు ఒకరికొకరు ప్రత్యర్థులు. శ్రీకంఠ శ్రీరామానుజు లిరువురును బ్రహ్మసూత్రములకు భాష్యములు రచియించిరి. ఇరువురి మార్గము ఒక్కటే. శ్రీ కంఠాచార్యుల వారు శివుడు పరతత్త్వ మనిరి; శ్రీరామానుజులు విష్ణువు పరతత్త్వ మనిరి. ఇదియే భేదము. ఈ రెండు మతములను పరిశీలించిన పండితులు వీరిరువురియందు ఎవరు ఎవరిని అనుసరించిరో చెప్పుట కష్టమని చెప్పిరి.

శివ పురాణ మిట్లు చెప్పును:- సదాశివునియొక్క సహస్రాంశమున మహేశ్వరుడును, అతని సహస్రాంశమున రుద్రుడును, రుద్రుని సహస్రాంశమున విష్ణువును, విష్ణువుమొక్క సహస్రాంశమున పితామహుడును

జన్మించిరని వామదేవ మహర్షికి స్కంధు డుపదేశించినట్లు శివ పురాణమున గలదు.

కాని మహాభారతాది గ్రంథములయందు శివ, రుద్ర, మహేశ్వర శబ్దములు ఒక శివ శబ్దమునకే పర్యాయ పదములుగా (శివుని నామములుగానే) చెప్పబడినవి.

-: పాశుపత శాఖ :-

శైవశాఖలలో నిది యొకటి, కొన్ని విషయములలో శైవమున కంటె భిన్నముగ ఉండును. పాశుపత మతమునకు ప్రవర్తకుడు శివుడని మహాభారత శాంతి పర్వమున వైశంపాయనునిచే జనమేజయునకు ఏకాంతిక ధర్మములు చెప్పిన సందర్భమున చెప్పబడినది. ఇది వైష్ణవుల పాంచరాత్రాగమ సిద్ధాంతము వంటిదని పండితు లందురు. అథర్వాణశిర, అథర్వాణ శిఖ, కైవల్యశ్రుతులయందు దీని కాధారములు చూపుదురు. (దీని పరిభాష కలదు) ముఖ్యముగా శైవులకు పాశుపతాగమమే ప్రమాణము.

మహాభారత కర్ణపర్వమున శివుడు త్రిపుర సంహార మొనర్చిన కథ గలదు. అందిట్లున్నది:- దేవతలు త్రిపుర సంహార మొనర్పుమని శివుని ప్రార్థించిరి. అంత శివుడు దేవతలతో "లోకములకెల్ల పశుత్వమును, నాకు పశుపతిత్వమును కావలయును. అట్లైన పశుహననమున నాకు పాపము కలుగదు. దానికి మీ రంగీకరింపు" డనిన, దేవతలు పశుత్వమునకు శంకించి విషణ్ణులైరట. అందుకు పరమశివుడు "మీరు భయపడవలదు. పశుభావమోక్షణ విధానమును దెలిపెద" నని పాశుపత వ్రతానుష్ఠానమును వారల కుపదేశించెను. ఆ వ్రతము ద్వాదశాబ్దములు నడప వలయును. నిష్ఠానురూపంబుగా సంవత్సరముగాని, ఆఱు మాసములుగాని, రెండు మాసములుగాని, మాసంబేనియు, పండ్రెండు దినములైనను ఫలించునని చెప్పిన దేవత లంగీకరించి సమస్త జీవులకు పశుత్వంబును, శివునకు పశుపతిత్వంబును" అంగీకరించినట్లు కలదు.

ఈ మతమిట్లు చెప్పును :- ప్రతి వానికి హృదయమున సూక్ష్మశరీరము కలదు. అందు ఆశ, క్రోధము, సహనము మొదలగునవి కలవు. సకల

అనర్థములకు హేతువు ఆశ; దానిని చంపి సామాన్య జీవనమునకు అవసరమగు అన్న పానములను స్వీకరించుచు, ఈశ్వర ధ్యాన మొనరింప వలెను. దేహమునందు భస్మమును ధరించి ప్రణవమును జపించుచు ఈశ్వరుని ధ్యానింపవలెను. **"అగ్నిరిత్యాదినాభస్మగృహీత్వా నిమృజ్యాంగాని సంస్పృశే దస్మా ద్వ్రతమేతత్పాశుపతం పశుపాశ విమోక్షాయ", "అగ్ని రితి భస్మా"** *మున్నగు మంత్రములచేత భస్మము గ్రహించి దేహము నందంతటను పూసి కొనవలెను. దేహావయవము లన్నింటిని తాకవలయును. ఇందు చెప్పబడిన భస్మ ప్రశంసయు భస్మస్నానమును అనునది యొక వ్రతము. ఇది పశువును పాశమునుండి విముక్తి చేయుచున్నది అని అథర్వణ శిరోపనిషత్తు చెప్పినది.

పాశుపతులకు దైవనిర్ణయమునందు పూర్ణ విశ్వాసము. వేదాంత దర్శనము - జీవులు ఎవరు చేసిన పుణ్యాపాపముల ననుసరించి వారివారికి ఈశ్వరుడు కర్మఫలంబు నొసగునని చెప్పును. పాశుపతులు దాని కంగీకరింపరు. అందువలన వేదాంతుల కర్మ సిద్ధాంతమును వీరు పూర్తిగా అంగీకరింప లేదని విదితమగును. వేదాంతమతమును కారణమువలన కలిగినది కార్యము. జీవుడీశ్వరునిపై ఆధారపడి యుండును గనుక జీవుడు కార్యము. కార్యము త్రివిధము :- విద్య, కల, పశువు, విద్య యనగా :- ఎఱుక (జ్ఞానము), కల అనగా - జీవులపై ఆధార పడియుండు అచేతన సృష్టి, పశువు అనగా :- సంసార బద్ధుడైన జీవుడు.

దీనిని మఱియొక విధముగా చెప్పుదురు. పతి అనగా : శివుడు. పాశ మనగా : మల, కర్మ, మాయ, రోధ శక్తి అని నాలుగు విధములు 1. మలమనగా :- ఆత్మ నాశ్రయించి యుండు మాలిన్యము. 2. కర్మ- ధర్మాధర్మ రూపమైనది. 3. మాయ (అవిద్య) మూలకారణము, 4. రోధశక్తి అనగా :- వీటి వలన కలిగిన మాలిన్యదృష్టి. పశువనగా :

* పై మంత్రములు అథర్వ శిరోపనిషత్తునందు భస్మధారణము చేయు విధమును తత్ఫలమును తెలుపుచున్నవి.

సంసార బద్ధుడైన జీవుడు లేక పైన చెప్పిన పాశముచే బంధింపబడిన వాడు. ఈ మూడింటిని త్రిక మందురు. పాశుపత వ్రతానుష్ఠానమున జీవుడు శివసాయుజ్యమును బడయునని మహాభారతమునందలి అనుశాసనిక పర్వమున శివుడు పార్వతికి ఆత్మసాయుజ్యప్రాప్తి సాధనముగ పాశుపతమును ఉపదేశించినట్లు కలదు.

వీరు దినమునకు మూడు మారులు భస్మస్నానము చేయవలెను. భస్మముపై పరుండవలెను. ఉన్మత్తులవలె చరింపవలెను. బ్రహ్మచర్యముతో భిక్షమెత్తు కొని ముండిత శిరుడుగా గాని, జడలుపెంచుకొని గాని శివునియందు మనస్సు నిలిపి కపాల పాణియై యుండుట ఈవ్రతధర్మము.

-: లాకుల శాఖ :-

ఇది పాశుపతమునం దంతర్భాగము, లాకుల మనగా: చేత గద ధరించిన శివుని విగ్రహము, శివుడు కాయారోహమను స్థలమున ఒక శ్మశానమునందు ఒక శవములో ప్రవేశించి 'లకులి' అను పేర యోగివేషముతో పాశుపతము నభ్యసించి నలుగురు శిష్యులద్వారా లోకమున ప్రచారము చేసెనని చెప్పుదురు. బరోడా రాష్ట్రమునకు చెందిన దబాయి తాలూకాలో ప్రస్తుతము ' కర్వన్ ' అని పిలువబడు పట్టణమునే పౌరాణిక కవయరోహ మందురు.

పాశుపతమునం దంతర్భాగమైన గోరక్షణాది శాఖ ఒకటి ఉత్తర హిందూ స్థానమున మిక్కిలి ప్రచారము నందున్నదట.

-: సోమము :-

ఇదియును పాశుపతమునందే అంతర్భాగము.

-: భైరవ శాఖ :-

ఇది శైవశాఖలలో నొకటి, ఇట్టిదొకటి కలదని మహాభారత సభాపర్వమునందు జరాసంధుని వృత్తాంతమువలన తెలియగలదు. జరాసంధుడు భైరవపూజ చేయును. ఇతడు శివభక్తుడు. శివప్రసాదమున

శస్త్రములచేత చావు లేకుండ వరములు బడసి యుద్ధమున రాజుల ననేకుల నోడించి వారిని చెఱయందుంచి వారిలో దినమున కొక్కొక్కని చొప్పున భైరవునకు బలి సమర్పించు చుండెడి వాడు. మల్లయుద్ధమున భీమసేనుడు ఇతనిని చంపెను. మహాభారత యుద్ధకాలము నాటికే భైరవము గొప్పవారియందు సయితము ఆచరణయం దుండినది. భైరవుని భార్య చండి. ఇది మతమున, తత్త్వమున సంపూర్ణముగ అద్వైతము, దీనిని సత్త్వగుణ గరిష్ఠులగు మహాత్ములు అవలంబించిరి.

-: కాపాలిక శాఖ :-

కపాల మనగా : మనుష్యుని పుఱ్ఱె. కాపాలికులు కపాలమును మెడల ధరింతురు. కపాలమును చేత ధరించి దానిని భోజనపాత్రగా ఉపయోగింతురు. శవభస్మమును దేహమున అలముకొందురు. శవములను మలమూత్రములను కూడ భక్షింతురు.

కాపాలిక- భైరవ మతములు రెండును ఒకే విధమున జన్మించినట్లు పురాణమున కలదు. వరాహ పురాణమున రుద్రజననము, కాపాలిక వ్రత సమాచారము ఈ క్రింది విధముగ చెప్పబడినది.

బ్రహ్మకు మొదట ఐదు శిరములు ఉండినవి. మూడవ సృష్టి సమయమున బ్రహ్మదేవునుండి పింగళాక్షుడును, నీల లోహితుండును నగు రుద్రుడు జన్మించెను. అట్లు జన్మించిన రుద్రుని బ్రహ్మ తన భుజస్కంధమున నుంచుకొని భవిష్యత్తునందు నీకు 'రుద్ర', 'కపాలి' అను నామములు కలుగునని చెప్పెను. అందుకు రుద్రుడు తనను అనుచితమైన 'కపాలి' నామమున పిలిచితివని బ్రహ్మదేవునిపై కుపితుండై బ్రహ్మభుజములను త్రొక్కి బ్రహ్మదేవుని ఊర్ధ్వశిరమును ఎడమ చేతి నఖములచే త్రుంచెను. రక్తధారలు ప్రవహించుచుండ బ్రహ్మదేవుని శిరము రుద్రుని అరచేతియందు సహజముగ మొలిచినట్లు దృఢముగా అంటుకొనెను. రుద్రుడు తన హస్తమును విదిలించినను, కదిలించినను, నేలపై వేసి కొట్టినను ఆ శిరము హస్తమునుండి విడివడలేదు.

అది చూచి రుద్రుడు తాను పాపము చేసితి నని భావించి, ఆ శిరము హస్తమున నుండి జారిపడుటకు ఉపాయమును తెలుపుమని బ్రహ్మదేవుని ప్రార్థించెను. అంత బ్రహ్మదేవుడు కరుణించి "పండ్రెండు సంవత్సరములు కాపాలికవ్రత మాచరించిన ఆ శిరము నీ హస్తమునుండి విముక్తి యగు"నని చెప్పెను. రుద్రుడు మహేంద్ర పర్వతమునకు పోయెను. అచ్చట రుద్రుడు వామహస్తమున నున్న బ్రహ్మశిరమును తన కుడి హస్తము నందలి నఖములచే సగభాగము (భరిణయందు మూత తీసిన విధమున) వేరు చేసెను. మిగత సగభాగము హస్తమున కంటుకొనియె. వేఱయిన సగపాలును రుద్రుడు ముక్కలు చేసి, ముక్కలను వెంట్రుకలతో బంధించి దానిని జన్నిదము చేసి ధరించెను.

ఈ విధముగా కాపాలికాకృతి ధరించిన రుద్రుడు భూమియందలి సకలపుణ్యనదులను, పుణ్యస్థలములను గ్రుమ్మరి సేవించుచుండ అఱవయేట రుద్రుని పచ్చడము (వస్త్రము), కచ్చడము (గోచి) జన్నిదమును తొలగి భూమిపై పడిపోయెను. రుద్రుడు తిరిగి వానిని ధరింపక అట్లే తిరుగుచుండ ఎనిమిది సంవత్సరములకు రుద్రునకు తలయందున్న వెంట్రుకలు రాలిపోయెను. అతనికి బట్టతల యయ్యెను.

పండ్రెండు సంవత్సరములు పూర్తియగునప్పటికి రుద్రుడు వారణాసి కరుదెంచి అచ్చట గంగాస్నాన మాచరించెను. వెంటనే రుద్రుని హస్తమున నంటిపెట్టికొనియున్న కపాలము హస్తము నందుండి ఊడి క్రిందపడిపోయెను. బ్రహ్మకపాలము క్రిందిపడిన స్థలము 'కపాల మోక్ష' మని ప్రసిద్ధి.

మొదట వస్త్రమును, కౌపీనమును ధరించి కపాల పాణియై రుద్రుడు పరిభ్రమించుట 'మహావ్రత' మనియు, నగ్నుడై తిరుగుట 'నగ్నకాపాలిక' మనియు, బభ్రుత వహించుట (వెంట్రుక లన్నియు రాలి తల బోడియగుట) 'బభ్రు కపాల' మనియు, గంగానదీ స్నానమున కపాలమును వదిలి పరిశుద్ధు డగుట 'శుద్ధశైవం' బనియు, బ్రహ్మహత్యకు మునుపు

నీలత్వ సహితుండగుట 'కేదార వ్రతం' బనియు, సకల పాప క్షయకరంబులగు నీయైదు మహావ్రతంబులు ప్రఖ్యాతి గాంచినవి.

శివపురాణమున రుద్రుని కథ మఱియొక విధమున చెప్పబడినది:- శివుడు బ్రహ్మదేవునకు పుత్రుడనై జన్మింతునని వరమొసంగి బ్రహ్మ అళికంబున (= లలాటమున) జన్మించెను. కొంతకాలమునకు బ్రహ్మ మాయావశమున ఆ సంగతిని మరచి తానే ప్రభువునని తలచెను. అప్పుడు బ్రహ్మదేవుని నొసట రుద్రుడు జన్మించెను.* ఆ రుద్రుడు భైరవాకారుడగు పురుషుని సృజించెను. అట్లు పుట్టిన ఆ పురుషుడే బ్రహ్మపంచమ శిరమును కొనగోట చిదిమెను. అప్పుడు రుద్రుడు ఆ పురుషుని చూచి-బ్రహ్మవిష్ణువులు నీకు పూజ్యులు; వారి కపకార మాచరింప వలదనియు, విశ్వమును భరించువాడవు కనుక భైరవుడనియు, బిరుదనామముల నొసంగి లోక హితార్థము బ్రహ్మదేవుని కపాలము ధరించి కాపాలికవ్రత మాచరింపుమని ఆనతిచ్చెను. ఆ సమయమున బ్రహ్మహత్యాపాతకము భీషణాకృతితో రూపు గైకొని రుద్రుని యెదుట నిలిచెను. శివు డాబ్రహ్మహత్యకు 'కరాళి' అను నామకరణము చేసి కాళికాపురి చేరువఱకు రుద్రుని వెన్నంటి యుండుమని ఆనతిచ్చి అంతర్హితు డయ్యెను.

భైరవుడు బ్రహ్మహత్య వెంట రాగా లోకము లన్నియును తిరిగి, వైకుంఠమున కేగి అచ్చట విష్ణుదేవునిచే పూజింపబడి లక్ష్మీదేవి యొసగిన అమృతభిక్షను గైకొనియెనని చెప్పబడినది. భైరవుడిట్లు తిరిగి తిరిగి తుదకు వారణాసి యందు కపాలమోక్షమును పొందెను. ఈ కథవలన పాపము చేసినవాడు రుద్రుడు గాక ఆయన అంశమున జన్మించిన భైరవుడని తెలుపబడినది. వైకుంఠముకంటె వారణాసి పవిత్రమైనదని కథా సారాంశమేమో! కాపాలిక భైరవేశ్వరుని అతని పత్నియగు చండికను

---

* రుద్రుడు విష్ణుదేవుని ఫాలమున పుట్టెనని, విష్ణుదేవుడు అదృశ్యుడై బ్రహ్మాది దేవతలకు హితముపదేశించిన సందర్భమున చెప్పినట్లు మహాభారత శాంతి పర్వమున కలదు.

ఘోరరూపములతో ఆరాధింతురు. వీరి మతమునకు "అఘోరమత" మని పేరు. వీరు దిగంబరులు. అవకాశము చిక్కినపుడు నరబలులు ఇచ్చెదరు. కాపాలికులది క్రియాద్వైతము. ఏ పదార్థమునందును ఏవగింపు కూడదని వీరి భావము.

వీరి తత్త్వమిది :- జగత్తునకు ఈశ్వరుడు కారణ మగుటచే కార్యమగు జగత్తుఅతనినుండి అభిన్నము. మఱియొక విధముగ జగము పరిచ్ఛిన్నము. కార్యమగుటచే ఈశ్వరుని కంటె భిన్నము. అట్లగుటచే వీరిది భేదాభేద సిద్ధాంతము

-: శైవమత విమర్శ :-

బ్రహ్మసూత్ర భాష్యమున శ్రీశంకరులు శైవమతమున కొన్ని అంశములను విమర్శించిరి. శైవమునందలి కొన్ని అంశములు చాలవఱకును అద్వైతులకు సమ్మతమైనవే. అద్వైతులకు సమ్మతముగాని యంశములు మాత్రమే విమర్శించిరి. శంకరులవారి భాష్యమునందలి సారాంశమిది :-

జగదుత్పత్తికి ఈశ్వరుడు నిమిత్తకారణమని సేశ్వర సాంఖ్యులు, సేశ్వరవైశేషికులు మొదలగువారు చెప్పినట్లే శైవులు సైతము ఈశ్వరుడు నిమిత్తకారణమని చెప్పిరి. ఈశ్వరుడు జగత్తునకు కేవల నిమిత్తకారణమని చెప్పిన మతము లన్నియు వేదవిరుద్ధము లైనవి. ఏలయన నీశ్వరుడు జగత్తునకు అభిన్న నిమిత్తోపాదాన కారణమని శ్రుతులు చెప్పియున్నవి కనుక, పైమతములవారు చెప్పినట్లు ఈశ్వరునకు కేవల నిమిత్త కారణత్వ మారోపించిన, సృష్టియందున్న వైషమ్యములవలన ఆయన రాగద్వేషములు కలవాడని అంగీకరింప వలసివచ్చును. ఈశ్వరునకు మనవలెనే రాగద్వేషాదు లుండెనేని ఆయనకు ఈశ్వరత్వ ముండదు.

అనగా : అట్టివాడు ఈశ్వరుడు కాజాలడు. ఈ యంశమును

సూ॥ (పత్యు రసామంజస్యాత్) (బ్ర.సూ. 2-2-37) అను సూత్రభాష్యమున చర్చింపబడెను.

ఈశ్వరునకు ప్రధానముతోగాని, జీవులతోగాని, సంయోగ బంధముగాని; సమవాయ సంబంధము గాని నిరవయవములగు నా ముప్వురకు సంభవింపదు.

* ఈ విషయము సూ|| **"సంబంధానుపపత్తేశ్చ"** (బ్ర.సూ. 2-2-38) అను సూత్రభాష్యమున చర్చించిరి.

పరమేశ్వరునకు జీవులతోను ప్రధానముతోను సంబంధము కలదనిన అది తాదాత్మ్యరూపము, అనిర్వచనీయము కావలెను.

ఈశ్వరుడు ప్రధానమునకు ప్రేరకుడు కాడను విషయము 39, 40, 41 వ బ్రహ్మసూత్రములయందు విమర్శించిరి.

సూ|| **అంతవత్త్వ మసర్వజ్ఞతా వా** (బ్ర.సూ. 2-2-41) శైవులు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు, అనంతుడు అని అంగీకరించుచున్నారు. ఈశ్వరుడు తనయొక్కయు, ప్రధానముయొక్కయు, జీవులయొక్కయు పరిమాణమును నియమనము చేయునా? (మేర కల్పించునా?) చేయడా? అనిన-చేసినను చేయకపోయినను దోషమాపాదించును. ఎట్లన :- మేర కల్పించు పక్షమున వారి స్వరూపము పరిమితమగుచున్నది. పరిమిత పరిమాణము గల ఘటపటాదులవలె అవి నశింపక తప్పదు. ఈశ్వరుడు ప్రధాన పురుషులకు మేర కల్పింపక పోయినను వారిసంఖ్య యీశ్వరునితో చేరి ముప్వురు మాత్రమే యగుటచే వారిసంఖ్య పరిమిత మగుచున్నది. జీవుల సంఖ్య మహాంతమైనను (అనంతము కాకపోయినను) క్రమముగా నెప్పుడో ఒకప్పుడు జీవులందఱు ముక్తు లగుదురు. జీవులందఱు ముక్తులైన సంసార మంతరించును. సంసారమంతరించు ననగా-ప్రధానము నశించును. ప్రధానము జీవులు లేకపోయిన ఈశ్వరుడు దేని నధిష్ఠించును? అప్పుడు ఆయనకు సర్వజ్ఞత్వ ముండదు. ఈశ్వరునికి సయితము మేర యేర్పడును. అప్పుడు శూన్యత్వము సిద్ధించును.

శైవులు వారి భాష్యమున అద్వైతమును విమర్శించిరి.

---

* సమవాయ - సంయోగ సంబంధములను గుఱించి వైశేషిక దర్శనమునందు చెప్పియున్నాను.

(12) కాశ్మీరశైవము

కాశ్మీరశైవము శైవమునం దొక శాఖ. దీనిని 'ప్రత్యభిజ్ఞా శాఖ' యని,' శైవాద్వైత' మనియు అందురు.

జీవుడు శివునితో తాదాత్మ్యమును గుర్తించుటవలన దీని కీపేరు కలిగినది. ప్రత్యభిజ్ఞ అనగా :- గుర్తుపట్టుట. తాను శివుడై యుండియు మాయామోహితుడై కించిద్జ్ఞత్వాదులు గల జీవుడని భావించుట తప్పని తెలిసికొని శివుడనని గుర్తెఱుగుట.ఇది శాంకరదర్శనమువలె నుండును. ఈ మతమునకు ప్రత్యభిజ్ఞా సంప్రదాయమని. స్పందవాదమని, త్రికదర్శనమని పేర్లు.

ఈ సంప్రదాయమునకు వసుగుప్తుడు ప్రవర్తకాచార్యుడని ప్రసిద్ధి. వీరు క్రీ.శ. 8వ శతాబ్దమునకు చెందిన వారు. వసుగుప్తుడు ఈ మతస్థాపకుడు కాదు. శివుడు లోకోద్ధరణకై మహాదేవ పర్వతమునందలి ఒక శిలపై ఈ మతమును డెబ్బదియేడు సూత్రములుగా రచియించి తన భక్తుడగు వసుగుప్తునకిచ్చెనట. పార్వతీదేవీ సహితుడై స్వప్నమున గోచరించి సూత్రములయందలి రహస్యమును బోధించి శిలాఫలకమున ఈ మతమును సూత్రములుగా రచియించిన (చెక్కబడిన) సంగతి యెఱింగించెనట. వసుగుప్తుడు నిద్ర నుండి లేచి స్వప్న వృత్తాంతమును స్మరించి శివుడు చెప్పిన రీతిగా మహాదేవ పర్వతమునకు పోయిచూడగా అందు శివుడు చెప్పిన శిలయందున్న సూత్రములను చూచి పరమానందమున వాటిని గ్రహించి సూత్రములయందలి యర్థమును ప్రచారము లోనికి తెచ్చెను. శివునిచే రచియింపబడి నందున ఈ సూత్రములకు శివసూత్రములని పేరు.

వసుగుప్తుని అనంతరము కల్లటుడు. సోమానందులను వారిరువురు ఈ మతతత్త్వమును ప్రచారమునకు తెచ్చిరి. వారిలో కల్లటునిది

స్పందవాదము. సోమానందులది ప్రత్యభిజ్ఞావాదము. ఆచారమునందు తప్ప దర్శనమునందు రెండును ఒకే విధముగ నున్నవని పండితు లందురు. సోమానందుల శిష్యులు ఉత్పలాచార్యులు. వీరి శిష్యుడో లేక వీరి శిష్యుని శిష్యుడో సుప్రసిద్ధ పురుషుడగు అభినవ గుప్తాచార్యులు*. వీరి గ్రంథములు కాశ్మీరశైవ సిద్ధాంతమునకు గౌరవమును చేకూర్చినవని చెప్పుదురు. వీరు ఈ మతమును విస్తరింప జేసినందున వీరినే యీ మత ప్రవర్తకాచార్యు లనుకొందురు. వీరు క్రీ. శ. 11వ శతాబ్దివారని చరిత్ర కారుల అభిప్రాయము. వీరు రచించిన గ్రంథములు శంకరుల వారి అద్వైతమును పోషించినవని చెప్పుదురు. క్షేమరాజను వారు వీరి శిష్యులు. కాశ్మీరశైవమును గురించి అనేక గ్రంథములు రచియించిరి. వీరిని ఆ గురుపరంపరయందు చివరివారని చెప్పుదురు.

---

* అభినవ గుప్తాచార్యులు మహాపండితుడు. సర్వశాస్త్రవేది. మహానుభావుడని చరిత్ర చెప్పును. నాట్యశాస్త్రమునకు 'అభినవభారతి' యను వ్యాఖ్యను రచియించిరి. నాట్యశాస్త్రమును ఆంధ్రీకరించిన డా. శ్రీపోణంగి అప్పారావు M.A. గారు ఆ గ్రంథమున వీరిని గుఱించి యిట్లు వ్రాసిరి:-

"అభినవ గుప్తుని పూర్వులు అంతర్వేది (గంగాయమునల మధ్యప్రదేశము) నివాసులు వారిలో ప్రసిద్ధుడైన అత్రిగుప్తుడు లలితాదిత్యుని కాలములో (క్రీ. శ. 8వ శతాబ్ది చివరి భాగములో) అతని ఆహ్వానమును మన్నించి కాశ్మీరమునకు తరలిపోయెను. ఆ అత్రిగుప్తుని వంశమందు ఛఖులుడు (లేదా నరసింహగుప్తుడు) అను మహేశ్వరభక్తుడు జన్మించెను. ఆ నరసింహగుప్తుని పుత్రుడే అభినవగుప్తుడు. అభనవగుప్తుని తల్లి పేరు విమలకళ. అభినవగుప్తు డనునది బిరుదనామము.

ఇతడు అజన్మ బ్రహ్మచారి. యోగసిద్ధుడు. పరమమాహేశ్వరుడు........ అభినవగుప్తుడు 24 గ్రంథములను రచియించినట్లు తెలియుచున్నది. అందులో ఆఱు ఆగమములకు సంబంధించినవి. ఎనిమిది ప్రత్యభిజ్ఞాది శాస్త్రములకు సంబంధించినవి. ఎనిమిది స్తోత్రకార్యములు (భైరవస్తవాదులు), రెండు కావ్య, నాటకములకు సంబంధించినవి.

అభినవగుప్తుడు చివరిదశలో 1200 మంది శిష్యులతో స్వీయవిరచితమగు భైరవస్తవమును పఠించుచు ఒక గుహలో ప్రవేశించి అంతర్ధానము చెందెనట. నేటికిని యాత్రికులకు ఆ గుహను స్థానికులు చూపుచుందురట. డా|| కె.సి. పాండే "అభినవగుప్తుడు" అను పేర ఒక గ్రంథమును ఆంగ్లమున ప్రకటించెను. అభినవగుప్తుని చరిత్ర అందు సమగ్రముగా కలదు."

ఈ శాఖయు శైవమునందు చెప్పిన 36 తత్త్వములను అంగీకరించును.చైతన్యమైన ఆత్మ నిర్వికార మైనను స్వభావముగ స్వతంత్ర మగుటచేత తన నిర్వికారతకు భంగమురాని విధముగ విశ్వము నందంతటను సర్వ పదార్థములతో కూడియున్నది. ఆ ఆత్మయే పరశివుడు, ఈశ్వరుడు, విశ్వమయుడు. విశ్వమంతయు పరశివుని స్ఫురణము. విశ్వ మాయనలో సూక్ష్మముగ ఉండి స్ఫురణము వలన ప్రకాశ మగుచున్నది. యథార్థముగ విశ్వము విజ్ఞానమునందే ఉన్నను బాహ్యమున ఉన్నట్లు మనకు కనబడుచున్నది. శివుడే తన సంకల్పమాత్రమున జీవకోటి రూపమును ధరించును. పారమార్థికముగ జీవు లనేకులు లేరు. ఆత్మ ఏకమే. అనేక జీవరూపమున తోచుచున్న జీవుల భోగ నిమిత్తము జగమును సృజించెను. శివుని స్పందమే భేదసృష్టికి కారణము. కనుక శివునియందు కర్తృత్వ భోక్తృత్వములు రెండును కలవు,

పరమశివుడు పంచవిధ శక్తులతో కూడి విశేషరూపమున గోచరించును.పంచ శక్తులివి :- (1) చిచ్ఛక్తి* (2) ఆనందశక్తి (3) ఇచ్ఛాశక్తి (4) జ్ఞానశక్తి (5) క్రియాశక్తి. పైన చెప్పిన పంచశక్తుల యోగమున శివుడు విశ్వాకారముగ గోచరించును. పరశివ బ్రహ్మమునకును, విశ్వమునకును సంబంధమును గుఱించి అభినవ గుప్తాచార్యులు చెప్పిన దానియొక్క సారాంశము ఇట్లు చెప్పుదురు :-

దర్పణమునందు కనబడు నగరమువలె విశ్వము పరశివునియందే కలదు. బయట ఉన్నట్లు తోచును. విశ్వము భ్రాంతి కాదు, సత్యమే. ఏలయన పరశివునికంటె నిది భిన్నము కాదు.

---

* ఇచ్చట చిచ్ఛక్తి, జ్ఞానశక్తి అని చెప్పిన రెండు శక్తులు సమానార్థకములు కావు. చిచ్ఛక్తి ప్రకాశరూపము. ప్రకాశింపదగిన పదార్థము లేకున్నను స్వయం ప్రకాశమై యుండును. అద్వైతుల కూటస్థుని వంటిది. జ్ఞానశక్తి పరామర్శ రూపము. దీనికి ప్రకాశింప జేయదగిన పదార్థ ముండిననే ప్రకాశించును. ఇది వృత్తిజ్ఞానము వంటిది.

దృశ్యవస్తువునందలి మాలిన్యము దర్పణమున కంటని రీతి విశ్వమందలి మాలిన్యము పరశివుని కంటదు. ఇచట విశ్వము, అద్దము అనునివి రెండు లేవు. అద్దమునందే విశ్వము కనబడుటవలన అద్దమునకంటె వేఱైన విశ్వము లేదు. అద్దమునందు గోచరించు విశ్వము నానా నామరూపములతో గోచరించుచున్నను, అచట నానాత్వ మనునది లేదు. అట్లు గోచరించు నానాత్వము దర్పణము మాత్రమే కాని రెండవది లేదు. అందువలన ఈ మతమున ద్వైతమను మాటకు చోటు లేదు. ఉన్నదంతయు ఒక్క పరశివ బ్రహ్మమే.

శ్రీ శంకరులవారును దక్షిణామూర్తి స్తోత్రమున ఈ అర్థము నిచ్చు ఈ క్రింది శ్లోకమును చెప్పియున్నారు.

శ్లో॥ విశ్వం దర్పణదృశ్యమాన నగరీ తుల్యం నిజాన్తర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం...............

లోకమునందు బింబము ననుసరించి ప్రతిబింబ ముండును. ఈ మతమున బింబము లేదు. కేవలము దర్పణము మాత్రమే కలదు. అద్దమునందే విశ్వము కనబడుచున్నది. పట్టిచూచిన అద్దము తప్ప నింకేమియు చేతికి చిక్కదు. ఇందలి అద్భుతమగు విశేష మేమన లోకమున అద్దమునందు బింబముయొక్క రూపము ప్రతిబింబించును. బింబమునకును ప్రతిబింబమునకును రూపమున భేద ముండదు. ఈ మతమునందు బింబము లేదు. పరబ్రహ్మము బింబము కాదా? యనిన పరబ్రహ్మము నామరూపరహితము. ప్రతిబింబము అట్లే ఉండవలయును గదా! ప్రతిబింబమగు విశ్వము నామరూపాత్మకము. అంత మాత్రమే కాదు. దర్పణము పరబ్రహ్మమే.

ఇందువలననే శంకరులవారు ఇది మాయా ప్రభావమని చెప్పిరి. శైవ, శాక్త మతములయందు మాయావిద్యలను అంగీకరించిరి. కాని శంకరులవారు ఉపయోగించిన అర్థమునందు వాటిని ఉపయోగించు కొనలేదు. అవిద్యను కొంచె మించుమించుగ అదే అర్థమునం

దంగీకరించిరి. ప్రథమమున కాకున్నను కాలక్రమమున కాశ్మీరశైవము శాంకరమతమునకు మిక్కిలి సమీపవర్తి అయ్యెను. ముఖ్యముగ అభినవ గుప్తాచార్యులు కాశ్మీర శైవమును అద్వైతసమీపమునకు తెచ్చిరందురు.

శాంకరమతముతో నీ మతమునకు గల భేదమేమన :-

శ్రీ శంకరులు :- "నిర్విశేష బ్రహ్మమునే అవిద్యా దోషము వలన మనము జగద్రూపమున చూచుచున్నాము. ఆయన నిష్క్రియుడు" అని యందురు--ఈ మతమునందలి శివబ్రహ్మము కర్త. ఆయన నేత్రనిమీలనమే విశ్వలయము. నేత్రోన్మీలనమే విశ్వసృష్టి. శాంకరమతమున అది సగుణ బ్రహ్మముయొక్క కార్యము. ఈ మతమున శివబ్రహ్మము పంచకృత్య పరాయణుడు.

జీవుడు శివుడే యని గుర్తించుట మోక్షము. అట్లు గుర్తించిన పిమ్మట నీటియందు నీరు, పాలయందు పాలు కలిసి పోవునట్లు జీవుడు శివునిలో కలియును. ఇవి జ్ఞానము వలనను, భక్తివలనను కలుగును. ఇదివఱకు తెలిసిన వస్తువునే తిరుగా తెలిసికొనుట ప్రత్యభిజ్ఞ. దీనికి వీరొక దృష్టాంతమును చెప్పుదురు. ఒక స్త్రీ తాను ప్రేమించిన ప్రియుని కొఱకు విరహ మనుభవించుచున్నపుడు దూతిక ప్రేరణచే వచ్చిన ప్రియుడు సమీపవర్తియై ఉన్నంతమాత్రమున ఊరట పొంద జాలదు. ఆమె సఖివలన "ఇతడే నీ ప్రియుడు. చూడుము." అని అతనిని చూపినపుడు ప్రియుని గుర్తించి ఆనందము అనుభవించును. ఇదియే ప్రత్యభిజ్ఞ (గుర్తింపు.)

ఇందుకు యోగముకూడ తోడ్పడును. మన దేహమున మూలాధారమున నున్న కుండలినియే శక్తి. దానిని మేల్కొల్పి సుషుమ్న నుండి సహస్రారమునకు గొనిపోయి అందున్న శివునితో చేర్చుట. ఇది **శాక్తోపాయము. శాక్తదీక్ష.** గురువు శిష్యుని తన ప్రసన్న దృష్టిచే గాని, హస్తమస్తక సంయోగముచే గాని సమాధిస్థితిని పొందునట్లు చేయుట. **ఇది శాంభవదీక్ష. శాంభవోపాయము.** గురువు వలన మంత్రోపదేశ

మొంది మంత్రపూజాదులచే క్రమముగా సిద్ధి నొందుట **మంత్రదీక్ష, లేక, ఆణవోపాయము.** ఈ మూడు ఉపాయములచే సాధకుడు సిద్ధి నొందవచ్చును.

ఈ మతమున మోక్ష మనునది ఆవరణ భంగమే. దానికి భక్తి జ్ఞానములు రెండును ఆవశ్యకములే. శాంకర మతమున భక్తి వలన జ్ఞానమును, దానివలన ముక్తియు కలుగునందురు. ప్రతిభా సమున్ముఖమైన జ్ఞానమునకు "ప్రత్యభిజ్ఞ" అని పేరు. వీరి భక్తి సాధ్యభక్తి. వీరు అద్వైతులవలెనే జీవన్ముక్తి అంగీకరింతురు. పరశివుడు తన పంచముఖముల నుండి వెడలిన శివాగమములకు ద్వైతపరమగు అర్థము రాగా అద్వైత తత్త్వ ప్రచారమునకై యీతత్త్వమును ప్రకటించె నందురు. దుర్వాసఋషి దీనిని ప్రచారము చేసెనని చెప్పుదురు.

ఇదివఱలో షడ్దర్శనములను గుఱించి విచారించితిమి. అందు కొన్ని ఆత్మ చైతన్యస్వరూప మనునవి. మఱికొన్ని దర్శనములు ఆత్మలు జడము లనునవి. కాశ్మీరశైవము ఈ భిన్న దర్శనములకు సామరస్యము సాధించు నట్టిదని యీ సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. కాశ్మీరశైవమునకు ముఖ్యాధారములు తంత్రములే. ఇందులో స్పందవాదము ప్రధానమైనది. నిస్తరంగ సముద్రమునందు తరంగము కలిగినట్లును, చలనము కలిగినట్లును, ఆత్మ (పరబ్రహ్మము) యందు ఆత్మను విడిచియుండని ఆత్మశక్తి స్పందించిన దనియు, ఆ స్పందనమే పరబ్రహ్మమునందు కలిగిన మొదటి వికారమనియు అదియే విమర్శరూప పరబ్రహ్మశక్తి యనియు చెప్పుదురు.

దీనివలన ఆత్మలు జడమని చెప్పు న్యాయ వైశేషిక మీమాంసా మతముల యందలి దోషములను గమనించి ఆత్మయందు అంతర్లీన మగు విమర్శశక్తి చైతన్యరూపిణి యని కాశ్మీరశైవము చెప్పుటవలన జడ, చైతన్య దర్శనముల రెండింటికి సమన్వయమును (సంధిని) చేకూర్చి నట్లయినది. జడ దర్శనములు ఆత్మ లనేకములని చెప్పగా

ఈ దర్శనము అద్వైతులతో ఏకీభవించి ఆత్మ ఏకమని చెప్పువది. కాశ్మీర శైవము నుండియే శ్రీవిద్య (లలితాభావము) అవతరించినదని శ్రీవిద్యా సంప్రదాయజ్ఞు లందురు. ఈ విషయము శాక్తేయము చెప్పు సందర్భమున వివరింతును. కాశ్మీరశైవ, శ్రీ విద్యాసంప్రదాయ సిద్ధాంతములలో కొన్ని మార్పులను చేసి శ్రీ జ్ఞానేశ్వర మహారాజు, ఒక నూతన సంప్రదాయమును నేలకొల్పిరని నాకు తోచినది. శ్రీజ్ఞానదేవుల మతమును గుఱించి ముందు చెప్పెదను.

13 వీరశైవము (భేదాభేదము)

వీరశైవ మతోద్ధారకులు శ్రీ బసవేశ్వరులు. వీరే వీర శైవమును మొదట స్థాపించ లేదు. వీరిని, శివుని యాజ్ఞచే వీరశైవమును ఉద్ధరించుటకై అవతరించిన నందికేశ్వరుడని చెప్పుదురు. అడుగంటిపోయిన వీరశైవమును ఉద్ధరించిరి. వీరు కన్నడ ప్రాంతమున బీజాపూర్ జిల్లాలో ఇంగలేశ్వర బాగేవాడి అను ప్రదేశమున మునగవల్లి అను గ్రామమున క్రీ.శ. 1125లో బ్రాహ్మణకులమున జన్మించిరి. 1167లో శివైక్యమును చెందిరి.

వీరి తండ్రి మండంగి మాదిరాజు. తల్లి మాదాంబ. బసవయ్యగారి మేనమామయగు బలదేవుడు బిజ్జలరాజుకడ అమాత్యుడుగా ఉండెను. అతడు తన కుమార్తెయగు గంగాంబను బసవేశ్వరుల కిచ్చి వివాహము చేసెను. బసవయ్యగారి అక్కగారు నాగాంబ. ఆమె కుమారుడు చెన్నబసవయ్య. మహామండలేశ్వరుడుగా ఉండిన బిజ్జలరాజు చక్రవర్తి కాగానే సామ్రాజ్యకోశమును వృద్ధి చేయవలసియుండెను. మంత్రియగు బలదేవుడు కాలధర్మము నొందగనే బిజ్జలరాజు బసవయ్యగారిని వారి స్థానమునందు నియమించెను.

బసవయ్యగారు, రాజధానియగు కళ్యాణ కటకము నందే రాచకార్యములు చూచుకొనుచు వీరశైవ మతమును విస్తరింప జేయుచుండిరి. వీరశైవభక్తులను బిజ్జలరాజు శిక్షించెనని, శివద్రోహము జరిగెనను కోపముతో బసవేశ్వర్లు తన ప్రియశిష్యుడును, దండనాథుడును,

అగు బలదేవునిచే రాజును హత్య చేయించెను. అంతటితో బసవేశ్వర్లు కళ్యాణకటకమును వదిలి కప్పడి సంగమేశ్వరమున కరిగి అందు శివైక్యము నొందిరి. ఎవరో వీరిని హత్యచేసిరని కొందఱందురు. వీరు పుట్టగనే శివుడు (సంగ మేశ్వరుడు) జంగమరూపమున వచ్చి లింగధారణము చేసినట్లు బసవపురాణమునందు కలదు.

వీరశైవమతము శైవమతమునకు చెందిన ఒక శాఖ. ఈ సిద్ధాంతమును శక్తి విశిష్టాద్వైత మనియు, శివాద్వైత మనియు, భేదాభేద సిద్ధాంత మనియు (ద్వైతాద్వైతమని) పిలుతురు.

వీరశైవ మనగా 'వి' అను అక్షరము లింగాంగ సామరస్యరూపమైన శివ జీవైక్యమును బోధించును. అట్టి విద్యయందు రమించువారు కనుక వీరిని వీరశైవు లందురు. (సి.శి. 5-15) మఱియొక అర్థము - ఉపనిషత్తుల యందలి జ్ఞానమును తెలిసికొని దానియందు రమించునట్టియు, మంగళ స్వరూపమైన వేదాంతజన్య జ్ఞానమునందు రమించు నట్టియు భాగ్యవంతులగు శైవులే వీరశైవు లనబడుదురు. (సి.శి.5-16-17) "వి" = వికల్ప; "ర" = రహితము = వికల్పరహిత శివుని బోధించును

కనుక వీరశైవమందురు. మఱియు 'వి' అనగా శివుడు. 'శేష' అనగా జీవుడు.

ముక్తియందు వీరల యోగము అద్వైతము కనుక ఈ మతమునకు "విశిష్టాద్వైత" మని కూడ పేరు కలదు.

శివుని ఆజ్ఞచే రేణుకారాధ్యులు, * మరుడారాధ్యులు, విశ్వారాధ్యులు, పండితారాధ్యులు, ఏకోరాములు - అనువారు ఈ లోకమున జన్మించి యీ మతమును బోధించిరని చెప్పుదురు. రేణుకారాధ్యులు, ఏకోరామారాధ్యులు బ్రహ్మసూత్రమునకు భాష్యమును రచియించిరట.

---

* రేవణారాధ్యుడని కొందఱు వ్రాసియున్నారు. సిద్ధాంత శిఖామణియందు రేణుకారాధ్యుడని కలదు.

అగస్త్య మహర్షి బ్రహ్మసూత్రములపై వ్రాసిన వృత్తి నాధారముగా చేసికొని శ్రీపతి పండితులు బ్రహ్మసూత్రములకు 'సిద్ధాంత శిఖామణి' అను గ్రంథము ఈ మతమునందు పురాతనమైన గ్రంథము.

వీరశైవులు ప్రపంచసృష్టి క్రమమును గుఱించియు, ముప్పదిఆఱు తత్త్వములను గుఱించియు, శివజీవుల స్వరూపవిచారమును గుఱించియు శైవమతమునందు ఇదివఱకు చెప్పిన విధమునే అంగీకరింతురు. ఈ మతము ననుసరించి బ్రహ్మము సవిశేషము, నిర్విశేషము కూడ. శివుడే పరబ్రహ్మము. శివుని కంటె అధికుడుగాని, సముడుగాని లేడు. ఆయన అనంతుడు. ఆయనయందే శక్తి వసించును.

ఇచట "శక్తి" యనగా శివుని ఆత్మ సత్తారూపము, మాయ కాదు, ప్రకృతి కాదు, అవిద్య కాదు. శైవమునందు చెప్పిన శివుని విమర్శరూపశక్తి. 36 తత్త్వములలో రెండవ తత్త్వము. ఈమెయే "ఉమ".

శివుడు (పరబ్రహ్మము) స్వాభావికముగనే శక్తిచే విశిష్టుడు,

వీరు శివునకు, జీవునకును పారమార్థిక భేదాభేదమును చెప్పుదురు. సంసారమందు పరిభ్రమించు జీవునకు ఈశ్వరుడు ప్రేరకుడే గాక సాక్షియు నగుచున్నాడు.

జీవుడు :- జీవస్వరూపమును గుఱించి వేఱు వేఱు నిర్వచనములు చేయుదురు. వాటిని ఈ క్రింద వివరింతును.

చిత్తశక్తి విశిష్టుడైన (శివయోగముచే శుద్ధుడైన) జీవుడు అంగము. చిచ్ఛక్తి విశిష్టుడైన శివుడు లింగము. శివజీవుల ఏకత్వమే లింగాంగ సామరస్యము.

దీపము గృహము నందొక చోట నుంచినను దాని కాంతి గృహము నంతయు ప్రకాశింప జేయునట్లు అణుమాత్రమైన జీవుడు ప్రాణి హృదయ పద్మము నందుండి సర్వావయవ చైతన్యమును అనుభవించుచున్నాడు.

జీవుడు తలవెంట్రుక కొనయొక్క నూఱవవంతునకు సాటియైనంత సూక్ష్మమయిన వాడు. (సి.శి. 18-6.)

"కఱ్ఱల రాపిడిచే నగ్నికణములు పుట్టినట్లు పరశివుడు ఇచ్ఛాశక్తిని గూడుటచే కలిగిన శివాంశమే మాయశక్తి యందు ప్రవేశించి 'పురుష తత్త్వ" మని పించుకొనును అని సిద్ధాంతశిఖామణి అను గ్రంథవివృతియందు చెప్పియున్నారు.

శ్లో|| అనాద్యవిద్యా సంబంధాత్తదంశో జీవనామకః|| (సి.శి. 5-33)

అనాదియగు అవిద్యయొక్క సంబంధముచేత పరశివుని యంశయే జీవుడనబడును.

అగ్నియందుండి విస్ఫులింగములు వెడలిన రీతిగా పరబ్రహ్మము నుండియే జీవులు బయట వెడలిరని చెప్పిన ముండక శ్రుతిని (2ముండకము 1వ మంత్రమును) వీరు ఉదాహరింతురు. జీవుడు స్థూలచిదచిద్విశిష్టుడు. అతని స్థూల చిచ్ఛక్తియే కించిద్జ్ఞత్వరూపము. అతని స్థూల అచిత్‌రూపశక్తియే కించిత్కర్తృత్వరూపము. ఈ రెండు శక్తులకును ఆశ్రయమైన ఇచ్ఛాశక్తితో కూడియున్నాడు.

సంసారావస్థలో జీవులతో బ్రహ్మమునకును భేదమును, ముక్తావస్థయందు అభేదమును ఔడులోమ్యాచార్యుల మతము (బ్ర. సూ. 1-4-21) (ఇదివఱలో ఈ చర్చ జరిగినది.)

శక్తిచే పరిచ్ఛిన్నునివలె నున్న శివుడే జీవుడు. జ్ఞానానంద స్వరూపమైన నిరంజనబ్రహ్మమేదియో అదియే లింగము. తక్కినది లింగము కాదు.

గురూపదేశమున జీవభావమును విడిచి శివతత్త్వము ఎప్పు డనుభవింపబడునో అప్పుడు జీవుడు "ఆత్మ" అనబడును.

(సి.శా. 18-5)

ఈ మతమునందు "షట్‌స్థల విచారము" ముఖ్యమైనది. 'స్థల'

అనగా లోకవ్యవహారమునందు చెప్పుకొను ప్రదేశము కాదు; జగత్తున కాధారమగు బ్రహ్మము (శివుడు) స్థలశబ్దముచే చెప్పబడెను. కొన్ని గ్రంథములయందు భగవంతుని శక్తుల నుద్దేశించి 'స్థల' పద ముపయోగింపబడె నందురు. జ్ఞానులు చెప్పు జ్ఞానభూమికలతోను, యోగాభ్యాసముతోను స్థలమునకు కొంత సామ్య ముండును. ఇవి ఆఱు అంగస్థలములు. ఆఱు లింగస్థలములు. వీటియొక్క అవాంతర శాఖలతో కలసి 101 స్థలము లగును. సిద్ధాంతశిఖామణి అను గ్రంథమున వీటిని గురించి విపులముగా చెప్పబడినది.

అంగస్థలములు :- భక్త, మాహేశ్వర, ప్రసాది, ప్రాణలింగ, శరణ, ఐక్యము లనునవి ఆఱు. వీటి వివరమిది :

(వీటియందు అవాంతర స్థలముల సంఖ్యను కనబరతును. కాని వాటి వివరములకు "సిద్ధాంత శిఖామణి" ని చూడవలెను.)

1. భక్తస్థలము :- ఈ స్థలమునందు సాధకుడు శివభక్తిపరాయణుడై యుండును. (ఇవి 15) **ఇతడు భక్తుడనబడును.**

2. మహేశ్వరస్థలము :- పైన చెప్పబడిన భక్తుడు బ్రహ్మాది పదములను సహితము తిరస్కరించు వైరాగ్య సంపన్నుడైన మహేశ్వర భావమును పొందును. (ఇవి 9) **ఇతడు మహేశ్వరు డనబడును.**

3. **ప్రసాది స్థలము:-**పైనచెప్పిన మహేశ్వరుడు లింగనిష్ఠాది సాధనలతో పాపబంధము లన్నియు తొలగి నిర్మల చిత్తు డగును. **(ఇవి7) ఇతడు ప్రసాది యనబడును.**

4. ప్రాణలింగ స్థలము :- పైన చెప్పిన నిర్మల చిత్తుడయిన శివయోగి (ప్రసాది) సర్వమును శివస్వరూపముగా చూచును. (ఇవి5) **ఇతడు ప్రాణలింగి యనబడును.**

5. శరణు స్థలము :- లింగాంగ సామరస్యము కలవాడైన ప్రాణలింగి తాను భార్యననియు, శివుడు తన భర్తయనియు భార్యాభర్తల

సంబంధమునందు ఎట్టి ఆనందము గలుగునో అంతటి ఆనందమును అనుభవించువాడు. (ఇవి 24) ఇది మధుర భక్తి వంటిది. **ఇతడు శరణు డనబడును.** (సి.శి. 13-2)

6. ఐక్యస్థలము :- పైనచెప్పిన శరణుడు శివుని యందు ఐక్యమగుచున్నాడు. ఇది కడపటి స్థలము. ఇంత కంటెను పైకి పోవుట సాధ్యము కాదు. ఏలయన-'**శివో உహం**' = నేనే శివుడను అను భావము కలుగుచున్నది. కనుక, ఇది చివరిమెట్టు. * (ఇవి 4)

కర్మకాండయందు చెప్పిన విధుల ననుసరించిన ఒక భక్తుడే. (1) భక్త, (2) మహేశ్వర, (3) ప్రసాది యని పై మూడు స్థలములయందు పిలువబడెను. ఈమూడు స్థలములు కర్మను ప్రధానముగా గలవి. ఇచ్చట 'కర్మ' యనగా యజ్ఞయాగాది రూపమైన కర్మ కాదు. శివుని, శివభక్తులను పూజించుట, శివాలయ నిర్మాణము మొదలగునవి. తక్కిన ప్రాణలింగ, శరణు, ఐక్యస్థలములు మూడును జ్ఞాన ప్రధానములు.

లింగస్థలములు :- పైన చెప్పిన ఆఱు అంగస్థలముల యందలి ధర్మములు అనుష్ఠించి శివైక్యమును పొందిన శివయోగికి జీవన్ముక్తి ప్రదములైన లింగస్థలములు ఈ క్రింద చెప్పబడును :-

1. గురుదీక్షా స్థలము :- ఇందు గురుస్వరూప మెట్టిది? శిష్యుడెట్టివాడుగా ఉండవలెను? జగత్తు, జీవుడు, శివుడు, గురువు వేఱనెడి భేదభ్రాంతిని నశింపజేసి శివాద్వైత వాసన యనెడి ఉపాయమును శిష్యునకు అనుగ్రహించువాడు గురువు. (ఇవి 9)

---

* ఉపనిషత్తులందు చెప్పిన జ్ఞానభూమికకును పై షట్ స్థలములకును సామ్యమున్నది. జ్ఞానభూమికలయందు 1 నుండి 5 భూమికలు 1 నుండి 5 స్థలములతో సరిపోవును. 6,7 భూమికలు 6వ స్థలముతో సరిపోవును. - ఈ విషయము వివరముగా తెలియవలయునన్న ఈ గ్రంథము ప్రథమభాగము రెండవ ప్రకరణము 45-వ అధ్యాయము జ్ఞానభూమికలను చిత్తగింపవలెను - పైన చెప్పిన ఆఱు స్థలములయందును 44 అంగస్థలములు 57 లింగస్థలములు చెప్పబడినవి.

2. మహేశ్వర స్థలము :- నేనే శివుడనను భావమే శివత్వ మొందుటకు మూలము. తక్కిన దేదియును కాదు. భావ (ధ్యాన) కర్మలతో కూడిన జ్ఞానమే మోక్షప్రదము. (సి.శి. 16-25) (ఇవి 9)

3. ప్రసాది స్థలము :- శివయోగి శరీర మున్నను శరీరము లేనివాడు. శివలింగపూజా విషయమున దేహాభిమానము వీడుటయే కాయార్పణ మనబడును. (సి.శి. 17-22) ఈ మొదలగు విషయములు. (ఇవి 9)

4. ప్రాణలింగి :- అంతరాత్మ స్థలము, పరమాత్మ స్థలము, జీవస్వరూపము మొదలగు విచారము. (ఇవి 9)

5. శరణు స్థలము :- దీక్షాపాదోదకము, గురుహస్త శిష్యమస్తక సంయోగము. గురుడు తన తపస్సుచే ఆర్జించిన శివ తేజస్సును హస్తమస్తక సంయోగముచే శిష్యునకు సంక్రమింప జేయుట. దీనిని శక్తిపాత మందురు. ఈ మొదలగు విషయము లిందు గలవు. (ఇవి 12)

6. ఐక్యస్థలము :- జీవన్ముక్తుడగు శివయోగి యొక్క అత్యున్నతావస్థ. ఇది శివైక్యము నొందిన స్థలము. ధ్యానమునకు అందని తురీయాతీతమును గుఱించి యిందు చెప్పబడినది. (సి. శి. 20-22) అంగస్థలములయందు భక్తస్థల మనుదానికి బదులు గురుదీక్షాస్థలమని పేరు మార్చబడి తక్కిన వన్నియు లింగస్థలమందు అంగస్థలమునందలి స్థలనామములే చెప్పబడినవి.

శివుడాది, క్షితిపర్యంతము గల ముప్పదిఆఱు తత్త్వములును, శివశక్తులవలననే కలిగినవి. ఈ కారణమువలన జగత్తు మిథ్య కాదు. సత్యము. కొమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు వేఱువేఱుగా కనబడినను అవన్నియు ఒక వృక్ష మయినట్లే జగత్తు అంతయును శివుడే.

త్రివిధ లింగములు :- వీరశైవమునందు లింగములు మూడు విధము లందురు.

1. భావలింగము :- దీనిని నిష్కళ అని కూడ అందురు. బాహ్యదృష్టికి గోచరించునది కాదు. ఆంతరసంయగ్ దృష్టికి మాత్రమే గోచరించును.

2. ప్రాణలింగము :- ఇది భావగమ్యము. అనాహత చక్రము నందుండును. దీనిని గురుకటాక్షము లేని ప్రాకృత జనులు తెలిసికొనజాలరు.

3. ఇష్టలింగము :- ఇది మెడలో సర్వకాలములందు ధరించియుండవలెను. దేశ కాలాతీతుడగు శివుడు భక్తుల సౌకర్యముకొఱకు లింగరూపమున తమ దేహమును తగులుచున్నాడని తలపవలయును ఈయన అర్చించుటకు సులభుడు. ఇట్టి భావమువలన క్రమముగా భక్తి అధికమయి సాధకుడు శివునిలో ఐక్యము కావచ్చును

(సి. శి. 6-50)

ఇతర సంప్రదాయమున వారివలెనే వీరును గురువును అధికముగ గౌరవింతురు. గురువునకును శివునకును భేదము లేదందురు.

శివునకును, తనకును అభేదమును గుర్తించినప్పుడే ముక్తి కలుగును. అభేదజ్ఞానము భక్తివలన కలుగును. శక్తియే జీవునియందు భక్తిరూపమునుండి, జీవుని శివుని దశకు మరలించి శివునితో చేర్చును. వీరు సాధనకు పతంజలి మహర్షి యొక్క అష్టాంగ యోగమును కూడ అనుసరింతురు.

శివయోగి శివునియందు తాదాత్మ్యమును పొందిన వాడు కాగానే సామాన్యముగా జనులకు తోచుచుండు "నేనున్నాను" అనియెడి భావముగాని "నేను లేను" అనియెడి యభావముగాని లేక భావాభావములనుండి విడివడి యుండును. (సి.శా. 20-50)

వీరు పునర్జన్మ సిద్ధాంతమును అంగీకరింతురు.

శ్లో॥ **చోదితాః పరమేశేన స్వస్వకర్మానురూపతః,।**
స్వర్గం వా నరకం వాఽపి ప్రాణినో యాంతి కర్మిణః॥

శ్లో॥ పునః కర్మావశేషేణ జాయంతే గర్భకోటరాత్,।
జాతా మృతాః పునర్జాతాః పునర్మరణ భాజనాః,॥
భ్రమంతి ఘోర సంసారే విశ్రాంతి కథయా వినా॥
(సి.శా. 18-15. 16)

తా॥ పరమేశ్వర ప్రేరితులైన జీవులు తమ తమ కర్మానుగుణముగ స్వర్గమునో, నరకమునో పొందుచున్నారు. పిమ్మట ఇంకను మిగిలియున్న కర్మఫలమును (అనుశయమును) అనుభవించుటకు గర్భకోటరమును చేరి మరల మరల పుట్టుచు గిట్టుచు భయంకరమైన సంసారమున భ్రమించుచు విశ్రాంతి లేక యున్నారు.

ఇవి వీరశైవులు కానట్టి సామాన్యజనుల నుద్దేశించి చెప్పిన వాక్యములు. లింగధారణము చేసిన వీరశైవులకు పునర్జన్మము లేదనిరి. కాని, జీవులకు పునర్జన్మమే లేదని పునర్జన్మసిద్ధాంతమును త్రోసివేయలేదు. "సమ్యక్ జ్ఞానాగ్ని సందిగ్ధ జన్మబీజ కళేబరః" అని లెస్స అయిన జ్ఞానము (శివోఽహం అను జ్ఞానము) చేతనే జన్మబీజము దగ్ధ మగును. ఇట్టి దృష్టాంతములు మఱికొన్ని గలవు.

ఈ సిద్ధాంతము ననుసరించి మోక్ష మనగా : బ్రహ్మైక్యమే.

శ్లో॥ జలే జల మివ న్యస్తం వహ్నౌ వహ్ని రివార్పితః।
పరబ్రహ్మణి లీనాత్మా విభాగేన న దృశ్యతే॥

"నీటియందు నీటివలె, అగ్నియందు నగ్నివలెనే పరబ్రహ్మమునందు దన్ను దాను లయము చేసికొన్న శివయోగి జీవభావమునకు దూరుడై పరబ్రహ్మమునందు సామరస్య మొందినయెడల పరబ్రహ్మ స్వరూపముకంటె వేరుగా దోచబడడు. ఇదే శివాద్వైత లింగాంగ సామరస్య సిద్ధాంత పరమ రహస్యము."

ఇందుకు ప్రమాణముగా ఈ క్రింది ముండక శ్రుతిని ఉదాహరించిరి.

యథా నద్యః స్యందమానా సముద్రే।
అస్తం గచ్ఛంతి నామరూపే విహాయ॥

తథా విద్వాన్నామ రూపాద్విముక్తః।
పరాత్పరం దివ్యముపైతి దివ్యమ్॥

(ముండక. 3-2-8)

మఱియు,

సూ॥ అవిభాగేన దృష్టత్వాత్. (బ్ర. సూ. 4-4-4)

అను సూత్రముకూడ పై శ్లోక వ్యాఖ్యానమున ఉదాహరింపబడెను.

సూత్రార్థ మేమనగా :- ముక్తదశయందు జీవుడు బ్రహ్మముతో అభిన్నుడయ్యే నిలుచును అని భావము.

ఈ విషయము కఠోపనిషత్తునందు నచికేతునితో యముడు "ఓ నచికేతుడా! పరిశుద్ధ జలమునందు పైనబడిన పరిశుద్ధజలము తదభిన్నమే యగునట్లు బ్రహ్మజ్ఞాని బ్రహ్మాభిన్నుడే" యని చెప్పబడినది.

"జాగ్రత్స్వప్న సుషుప్తిభ్యః పరావస్థా ముపేయుషః,।
కిం వా ప్రమాణం కిం జ్ఞేయం కిం వా జ్ఞానస్య సాధనమ్,"॥

తా॥ జాగ్రదాది అవస్థాత్రయమును మీరి తుర్యావస్థ నొందిన శివయోగికి ప్రమాణము లేదు, ప్రమేయము లేదు, సాధనము లేదు.

"తుర్యాతీత పదం యత్తద్దూరం వాఙ్మన సాధ్వనః।,
అనుప్రవిశ్య తద్యోగీ న భూయో విశ్వ మీక్షతే ॥" (సి. శి. 20-22)

తా॥ తుర్యాతీతావస్థ యన్నది వాఙ్మనముల కందరానిది. ఆ స్థితియందు శివయోగికి స్తుతిగాని ధ్యానముగాని ఉండదు. ఆ స్థానమునందు ప్రవేశించిన మరల ప్రపంచమును చూడడు.

శ్లో॥ పరస్పర సమాపేక్ష భావాభావ వివేచనమ్।
జ్ఞానం బ్రహ్మణి యన్నావిజ్ఞానశూన్య స్థలం విదుః॥

(సి. శి. 21-54)

తా॥ "ఒండొంటి యపేక్షతోగూడిన - ఉన్నది, లేదు - అనెడి భావాభావముల భేదజ్ఞానము పరబ్రహ్మ స్వరూపుడైన యేశివయోగియం

దుండదో, అట్టివాని భేదజ్ఞాన శూన్యతను ప్రతిపాదించు స్థలమును "జ్ఞాన శూన్యస్థల" మందురు. "**జ్ఞానం బంధః" అనెడి శివసూత్రమందలి జ్ఞానపదమునకు భేదజ్ఞానమని తెలియునట్లే**, యిక్కడను జ్ఞానశూన్య స్థలమనెడి పదమునకు భేదజ్ఞాన శూన్యస్థలమని యర్థము తెలియవలెను."

మొదటి శాంకర మతముతో నీ మతమునకు కొన్ని యంశముల యందు అభిప్రాయ భేదము లున్నను పర్యవసానమున రెండును ఒక్కటియే యని యిందువలన విదిత మగుచున్నది.

బసవేశ్వరులు గొప్ప సంఘసంస్కర్తలు. కులతత్త్వమును నిశితముగ ఖండించిరి. వీరి దృష్టిలో ధనికుడు, దరిద్రుడు; పండితుడు, పామరుడు; అగ్రజన్ముడు, కడజాతివాడు; స్త్రీలు, పురుషులు - అందఱు సమానులే. అందులో ఎవరు శివభక్తులో వారు పూజ్యులు. తదితరు లందఱు సామాన్యులు. శివభక్తి రహితులు పూజార్హులు కారు. శ్రీ వైష్ణవులలో కొందఱాచార్యులు విష్ణుభక్తుడు కడజాతివాడైనను పూజింపవచ్చునుగాని అతనిచేత తీర్థప్రసాదములు గ్రహింపరాదని చెప్పుదురు. బసవయ్యగారి సిద్ధాంత మదికాదు. కడజాతి వారైనను శివభక్తుల తీర్థప్రసాదములను తీసికొనవచ్చు నన్నది వీరి సిద్ధాంతము. ఆవిధముగా వీ రాచరించిరి.

వీరి సమకాలికులగు మడివాలు మాచయ్యగారు (చాకలి), శివనాగుమయ్యగారు (హరిజనుడు) మొదలగు శివభక్తులతో కలసి సహపంక్తి భోజనము చేయుటయే కాక వారి పాదములకు సాష్టాంగ నమస్కృతులు అర్పించుటయు, వారిని తనకంటె అధికముగ గౌరవించుటయు కలదు. ఇట్టి చర్యలు వారి త్రికరణశుద్ధిని చాటుచున్నవి. బసవయ్యగారికి పూర్వమే వీరశైవ సంఘమున ఏదో ఒక విధముగ వర్ణవ్యవస్థ ఉన్నట్లే కనబడుచున్నది. దానినే వారు సంస్కరించిరి. దర్శనమును కూడ వారు సంస్కరించిరని తోచుచున్నది. వీరు రెండే కులములు కలవన్నారు. ఒకడు ప్రవర్తకుడు, ఒకడు నివర్తకుడు. ప్రవర్తకు డనగా సంసారి; నివర్తకు డనగా శివభక్తుడు. బసవయ్యగారి వాక్యములుగ

బసవపురాణము నందిట్లున్నది-

"ఎట్టి దుర్జాతిని బుట్టిన నేమి
ఎట్టును శివభక్తు డిల బవిత్రుండు
కని ప్రతిష్ఠా పూర్వకంబైన పిదప
జెనసి లింగమ కాక శిల యన జనునె."

....

"ధర 'నుమా మాతా పితా రుద్ర' యనగ
సరినొక్క తల్లి ప్రజలకు వేఱెద్ది"

బసవయ్యగారికి వారి తండ్రి ఉపనయనము చేయ యత్నింపగా బసవయ్యగారు వడుగు వలదని నిరాకరించిరి. అప్పుడు తండ్రి కుమారుల మధ్య జరిగిన సంభాషణమునందు బసవయ్యగారు తండ్రితో చెప్పిన వాక్యము లివి:-

ద్వి॥ "నిర్మితోభయ కర్మ నిర్మాలు నన్ను
గర్మాబ్ధి ముంచుట ధర్మమే నీకు?
గ్రచ్ఛఱ గన్నుల గానవు గాక
వచ్చునే బసవని వడుగు సేయంగ?
బ్రహ్మ శిరోహరు బ్రమథైక వంశ్య
బ్రహ్మ వంశ్యుండని భావించె దెట్లు?
జాతి గోత్రాతీతు సద్గురు జాతు
జాతి గోత్ర క్రియాశ్రయు జేసె దెట్టు?
లకులస్థుడై యున్న యభవుని భక్తు
నికి నే కులంబని నిర్ణయించెదవు?
కావున నెన్ని మార్గంబులను వడుగు
గావింపగా రాదు కథలేమి చెప్ప?"

ఈ విధముగా తండ్రి ఆజ్ఞను తిరస్కరించిరి. అష్టవర్ష ప్రాయముననే వీరి కిట్టి నిశ్చయబుద్ధి కలిగియుండుట వలన వీరు కారణజన్ములని చెప్పవచ్చును. భక్తిమార్గమును కులతత్త్వము కలుషితము చేయునని

బసవయ్యగారు తెలిసికొన్నంతగా ఇతర ఆస్తిక మతాచార్యు లెవ్వరును తెలిసికొనలేదని తోచును. ఈ విషయమై బసవయ్యగారు తండ్రితో చెప్పిన వాక్యములివి :-

ద్వి॥ "బ్రాహ్మ్యంబు భక్తియు బలికెదు కూడ
బ్రాహ్మ్యంబు వెఱె దర్శనమయి యుండు,
"సహజ లింగైక్యనిష్ఠా యుక్త భక్తి
బహుదేవతాసేవ బ్రాహ్మణ పథము"

ఈ విధముగా బసవయ్యగారు పురాతన సత్యమును ఉద్ఘోషించినారు. అనాదిగా యజ్ఞ-కర్మ, భక్తి అను రెండు సిద్ధాంతములమధ్య ఘర్షణ జరుగుచుండినదే. కర్మమార్గావలంబియు, బ్రాహ్మణధర్మనిష్ఠుడును నగు దక్షునకును, వర్ణభేదము లేని శివభక్తులకు (ప్రమథులకు) మధ్య జరిగిన ఘర్షణ ఫలితమే సతీదేవి దేహత్యాగమునకును, దక్షాధ్వర ధ్వంసమునకును దారితీసినది. భాగవత పురాణమునందు దక్షయజ్ఞ ధ్వంసము జరుగుటకు ముందు నందికేశ్వరునకు దక్షునకు మధ్యజరిగిన వాగ్వాదమునే బసవయ్యగారు మరల జ్ఞప్తికి తెచ్చిరి. వీరశైవులలో ప్రస్తుతము కులభేదము పాటించుచున్నారు. ఎప్పటినుండి కులతత్త్వము మరల వీరిలో ఏర్పడినదో సరిగా చెప్పలేము. బసవయ్యగారు ఏకారణముతో వర్ణభేదములను నిరసించిరో ఆ మూలసిద్ధాంతమునకే వర్ణవ్యవస్థ విరుద్ధ మయినది.

బ్రాహ్మణులు ఋషిగోత్రజులు. వీరశైవులు తాము ఋషిగోత్రజులము కామని నంది, భృంగి, వీర మొదలగు ప్రమథుల గోత్రములకు చెందిన వారమని చెప్పుదురు.

వీరశైవసంఘమున బసవయ్యగారు చేసిన మార్పులయందు ఈ క్రింద కనబరచినవి ముఖ్యములు :-

(1) ద్విజులుగాని ద్విజేతరులు గాని వీరశైవులు యజ్ఞోపవీతమును ధరింపరాదు. (2) కులభేదమును పాటింపరాదు. (3) వీరశైవులయందు స్త్రీ పురుషులు సమానముగ మోక్షార్హులు. కాన, అందఱును లింగధారణ

చేయవలెను. పురుషులు విభూతి రుద్రాక్షలు ధరింపవలయును. (4) స్థావర లింగమునకంటె జంగమలింగము (జంగము) పూజార్హుడు. (5) వేదములయందు చెప్పిన యజ్ఞయాగాదుల నాచరింప రాదు. (6) మరణించినవారి కొఱకు శ్రాద్ధాదికర్మలు చేయరాదు. ఏలయన, మరణానంతరము వీరశైవులు శివైక్యమును జెందియుందురను దృఢవిశ్వాసము వారికి కలదు. (7) పంచవిధ అశౌచములు. : [(1) కులముచేత తక్కువవాడు (హరిజనుడు) తగిలిన మైలపడినదని స్నానము చేయుటను (2) జాతాశౌచము (పురుడు) (3) మృతాశౌచము చనిపోయినపుడు కర్మలు పూర్తియగు నంతవఱకు అశుచులై యుందు రనునది. (4) స్త్రీలు ముట్టయినపుడు వారిని తగుల రాదనుట (5) అస్పృశ్యులు చూచినది, లేక, వారు ముట్టిన అన్నము ఉచ్ఛిష్టమని అశుచ మనుటను] వీటిని నిషేధించిరి. ఈ 7వ అంశము బసవయ్యగారికి పూర్వము నుండియు ఆచరణ యందున్నట్లున్నది. ఇందులో 7వ అంశమున చెప్పిన అశౌచాదులు కొన్ని లేవని బసవయ్యగారికి పూర్వమే 'సిద్ధాంత శిఖామణి' యందు 9-44-45 వ శ్లోకములలో కలదు.

(8) దేహమే దేవాలయమను భావము. (9) గురువునెడభక్తి, గురుపాదోదక తీర్థమును సేవించుట. పైన చెప్పిన అంశములలో కొన్నియైనను బసవయ్యగారికి పూర్వమే ఉండినవో, అన్నియు బసవేశ్వరులే స్థాపించిరో, లేక, కొన్నింటిని మాత్రమే వీరు సంస్కరించిరో చక్కగా చెప్పుట కష్టము.

వీరశైవము అవైదికమని కొందఱును, వైదికమని కొందఱును, భిన్నాభిప్రాయములు కలిగియున్నారు. ఇది చర్చనీయాంశము. ఆ కాలమునందలి వీరశైవులవలె గాక, యిప్పటివారు పరమతసహనమును అహింసను, శాంతిని మొదలగు వాటిని పాటింతురు.

శ్లో॥ య ఇదం శివసిద్ధాంతం వీరశైవ మతాత్మకమ్।
శృణోతి శుద్ధమనసా స యాతి పరమాం గతిమ్॥

(సి. శి. 20-181)

(14) వీరశైవములో ఆరాధ్య శాఖ

వీరశైవమునకు చెందినది ఆరాధ్యశాఖ ఒకటి. ఇది ఆంధ్ర ప్రాంతమునందే కలదు. ఈ శాఖను స్థాపించినవారు మల్లికార్జున పండితారాధ్యులవారు. వీరి జన్మస్థానము కోటిపల్లి. వీరు బ్రాహ్మణులు, వీరిది ఋగ్వేదము. గౌతమ గోత్రము. క్రీ. శ. 1090 సం|| ప్రాంతమున జన్మించిరని చెప్పుదురు. బసవేశ్వరులవారును వీరును సమకాలికులు. శివుడు తన గణాధిపతులలోని వారగు వీరిరువురను వీరశైవమును వ్యాప్తి చేయుటకై భూమియం దవతరింప జేసిరని చెప్పుదురు. వీరిరువురు ఒకే సంవత్సరము జన్మించి ఒకే సంవత్సరము లింగైక్యము చెందిరని కొందఱు చెప్పుదురు. కాని, యిరువురును ఒకే సంవత్సరమున జన్మించి రనుట చర్చనీయాంశమే. ఇరువురును ఒకే సంవత్సరమున క్రీ. శ. 1167 సం|| శివైక్యము చెందిరనుట నిశ్చయము.

పండితారాధ్యులు బసవేశ్వరులవలెనే గొప్ప భక్తులు. పండితులు శాంభవదీక్షను గైకొని వీరమాహేశ్వరాచార మార్గము ననుసరించిరి. వీరు "శివతత్త్వసారమ'ను గ్రంథమును కందపద్యములతో రచియించిరి. ఇప్పుడున్న గ్రంథము సమగ్రమైనది కాదు. 489 కందములు మాత్రమే కలవు. శివతత్త్వసారము కన్నడమున భాషాంతరీకరింప బడినది. ఆంధ్ర శివతత్త్వసారము ఆంధ్రవీరశైవ సాహిత్యమునకు ప్రాతిపదిక యని పండితు లందురు.

బసవేశ్వరులు కులతత్త్వములను నేవిధముగా నిరసించినది తెలిసిన విషయమే. వారి మతమున రెండే కులములు: ఒకటి శివభక్తుల కులము; రెండవది శివభక్తులు గాని వారి కులము. పండితారాధ్యులు వర్ణవ్యవస్థను అంగీకరించుటయేగాక బ్రాహ్మణ వర్ణాధిక్యమును సయితమంగీకరించిరి, కాని, శివభక్తుల విషయమున వర్ణవ్యవస్థను అంతగా పట్టింపు చేయలేదని వారు వ్రాసిన యీ క్రింది పద్యములను చదివిన బోధపడ గలదు.

కం॥ శివభక్తుల గని జాత్యా
ది విచారము విడువవలయు-దృఢభక్తి మెయిన్. (121) *

కం॥ కుల విద్యాచారాదులు
దలపక నీవలని భక్తి-తాత్పర్య మెదం
గల మానవుడు సమస్తము
గలవాడని పూజసేయగా వలయు శివా! (126)

కం॥ నీ నిజభక్తుం డంత్యజు
డైన బవిత్రుండు పూజ-కర్హుడు జగతిన్. (131)

కం॥ శ్వపచుండైనను శివభ
క్తిపరుండగునేని నతడు-ద్విజవర్యుండా
శ్వపచునకు కీడు శివ భ
క్తి పరాఙ్ముఖుడైన యట్టి-ద్విజుడు మహేశా! (194)

కం॥ మాలల గులజుల జేయును
బోలగ శివభక్తులైన-భువి నెఱుగరె! మా
నీలగ్రీవుడు గులజుల
మాలలగా జేయు భక్తి-మది లేకున్నన్. (471)

ఈ పద్యముల తాత్పర్యమును పరిశీలించిన వర్ణవ్యవస్థను ఒకచేతిలో గైకొని, వేఱొక చేతితో విసరిపారవేసి నట్లైన్నది. తుదకు వీరు బసవయ్యగారి మతముతో చాలవఱకు ఏకీభవించినట్లున్నది.

కాని, 287వ పద్యమున - శివుని, వేదములను, శివభక్తులను, బ్రాహ్మణులను దూషించినవాడు నరకాగ్నిని బాధల నొందునని చెప్పియున్నారు. 448వ పద్యమున శివభక్తులు చేసిన పాపములు పుణ్యము లగుననియు, శివభక్తి రహితులు చేసిన పుణ్యమైనను పాపమగుననియు చెప్పియున్నారు. శివభక్తుడు కాని వాని భార్య తన

* ఇట్టి ( )కుండలిలో వేసిన అంకెలు శివతత్త్వసారమునందలి కందపద్యముల వరుసక్రమములోని పద్యసంఖ్యను తెలుపును.

భర్తను శివభక్తునిగా మార్చలేకపోయిన వానిని వదలుట తప్పు కాదన్నారు. (231, 232, 233). రావణాసురుని శివభక్తులలో చేర్చిరి. రావణుడు వీరభక్తిచే తన తలలు తఱిగి శివుని పూజించి ఆయనచే చంద్రహాసమును, దేవేంద్రజయమును పొందెను (395). అట్టి భక్తికి ఫలము అంతమాత్రమే.

ఆరాధ్య బ్రాహ్మణులు జందెమును లింగమును కూడ ధరింతురు. కర్మలు చేయుదురు. ఇది పండిత సంప్రదాయము. బసవయ్యగారి యనుయాయులు లింగమును మాత్రమే ధరింతురు. ఇది బసవయ్యగారి సంప్రదాయము. జందెమును తీసి, కులమును విడిచి, తనతోవచ్చి కలియవలసినదిగా బసవయ్యగారు పండితులవారిని కోరిరనియు, అందుకు పండితులు

"భక్తిమీద వలపు బ్రాహ్మ్యంబుతో బొత్తు,
బాయలేను నేను బసవలింగ"

అని ప్రత్యుత్తరము పంపినట్లు చెప్పుదురు. బసవయ్యగారు పంపిన విభూతిని పండితారాధ్యులు ధరించిరనియు, వెంటనే వారికి కన్నడభాష వచ్చుటయేగాక ఆ భాషయందు కవిత్వము చెప్పగలిగిరనియు చెప్పుదురు. పండితులు బసవయ్యగారి దర్శనార్థము పోవుచుండ మార్గమున బసవయ్యగారు ఎనిమిది దినముల క్రిందటనే లింగైక్యము చెందిరని విని చింతించి వెల్లటూరులో పండితారాధ్యులవారు తమ దారపుత్రాదులతో లింగైక్యము చెందిరని చెప్పుదురు.

వీరిరువురకు సమాగమమై యుండిన వీరశైవమున రెండుశాఖలై ఉండియుండవని తోచును. వీరిరువురయందు నెవరో ఒకరు తక్కినవారి మతముతో నేకీభవించియుందురు. బహుశః బసవయ్యగారితో పండితులవారు ఏకీభవించి యుందురని నా యభిప్రాయము. ఏలన-బ[illegible]వయ్యగారు పంపిన విభూతి ధరించినమాత్రమున పండితులకు కన్నడభాషయందు కవిత్వము చెప్పగల శక్తి లభించియుండుట నిజమైనచో బసవయ్యగారి ప్రభావము పండితులను లొంగతీసికొని యుండెడిది.

బసవ సంప్రదాయమువారికి శ్రుతిస్మృతులయందు ప్రమాణబుద్ధి లేదు. పండిత సంప్రదాయమువారికి వేదశాస్త్రాదికమునందు భక్తి కలదు. బసవ సంప్రదాయము ఆంధ్ర కన్నడ దేశములయందు వ్యాపించియున్నది. పండిత సంప్రదాయము ఆంధ్రదేశమునందలి కొందఱు బ్రాహ్మణుల యందుమాత్రమే కలదు. ఈ రెండు శాఖలయొక్క తత్త్వమునందును కొలది భేద మున్నది. వీరశైవమత వ్యాప్తికి శివునిచే భూలోకమునకు పంపబడిన శివానుచరులగు నీ యిరువురయందు మతభేదము కలుగుటకు కారణమేమో దురూహ్యము.

శివతత్త్వసారమున పండితారాధ్యులు అద్వైతమును ముప్పదిఆఱు పద్యములలో తీవ్రముగా ఖండించిరి. పది పద్యములలో పశు, పాశ, పతి వివేకమును తెలిపిరి. వీరిమతము శైవమతము (శివాద్వైతము)తో గాని, బసవయ్యగారి శక్తి విశిష్టాద్వైతము (భేదాభేద సిద్ధాంతము)తో గాని పూర్తిగా నేకీభవింపదు. ఇందులో ఒకవిధమగు ద్వైతమున్నది. శివుడు జీవుడు కాడు. జీవుడు శివుడు కాడు అనునది పండితుల మతము.

కం॥ శివునకు దనువును మనమును
శివభక్తులకును మనంబు-జిత్త ప్రీతిన్
భువి విచ్చి యెల్లవారికి
శివుడను నేననక యునికి-శివభక్తి యగున్. (462)

శివుడు జీవుడు కాడని పై పద్య తాత్పర్యము. ఇది వైదిక శైవమతమునకును, పౌరాణిక శైవమునకును కూడ విరుద్ధము. ఎట్లన:-

మం॥ "స ఏవ హి పరం బ్రహ్మ తద్బ్రహ్మా హం న సంశయః।
జీవశ్శివ శ్శివో జీవ స్సజీవః కేవలశ్శివః॥"

తా॥ శివుడు పాశముచే కట్టబడియుండు నంతవఱకు జీవుడుగా నుండును. పాశమునుండి విడువబడినపుడు శివుడగుచున్నాడు - (అని శైవోపనిషత్తులలోని స్కంధోపనిషత్తు చెప్పినది.) ఆరాధ్య వీరశైవము, పౌరాణిక శైవమునకు విరుద్ధ మనుటకు వెనుక శైవమును గుఱించి

చెప్పిన సందర్భమున శివపురాణమునుండి కొన్ని వాక్యముల నుదాహరించి యుంటిని.

"తత్త్వమసి" అను మహావాక్యముయొక్క అర్థము విశిష్టాద్వైతులు చెప్పిన విధముగా వీరును చెప్పుదురు.

కం|| జీవుడు శివుడను వాక్యము
భావింపగ నైక్యమునకు -బ్రతిపాదకమే
జీవుడు నీ పశుభృత్యుడు
గావున నీవాడ వేఱు-గాదనుట శివా! (40)

కనుక వీరి మతము ద్వైతమే. బసవయ్యగారి మతము వలె భేదాభేదమతము కాదు.

శివభక్తి కలుగు విధమును నిట్లు చెప్పిరి :- వేదవిహిత కర్మానుష్ఠానము వలన జ్ఞానము కలుగును. జ్ఞానము వలన శివభక్తి కలుగును. శివభక్తి వలన పాశవిముక్తి కలుగును. ఈ యంశము శ్రీమద్రామానుజాచార్యులవారి సిద్ధాంతముతో సరిపోవును.

ముక్తి కలుగుటకు మఱియొక విధమును కూడ చెప్పిరి. ఎవరు శివుని కొలుకుగాని, శివభక్తుని కొలుకుగాని ప్రాణములు విడుతురో అట్టివారును, శివతీర్థములలో ప్రాణములు విడిచిన వారును ముక్తు లగుదురని చెప్పిరి. అట్టివారికే గాక శివలోకమును పొందిన శివభక్తులకు పితృమేధము (పరలోకవిధులు) చేయువాడు అవివేకి యనిరి.

(279 నుండు 285 వరకు)

పండితారాధ్యులవారు భక్తిభావ ముద్దీపించుట వలన వీరభావమును వహించి వీరమాహేశ్వరు డయ్యెను. శివనింద చేసినవారిని శైవులతో వాదమునందు గెలిచిన వారిని వధించుట పాపము కాదనిరి. ఇందుకు నిదర్శనముగ పండితుల జీవిత చరిత్రయందు ఇట్లు వ్రాసియున్నారు.

సనదవోలు (గుంటూరుజిల్లా తెనాలి తాలూకాలో ఉన్న చందవోలు) ను వెలనాటి చోడుడను రాజు పాలించుచుండెను. ఆ రాజు బౌద్ధుడు. అతని ఆస్థానమందు రాజగురువగు బౌద్ధాచార్యునితో పండితునకు వాదము జరిగెను.పండితులు బౌద్ధుని జయించిరి. బౌద్ధుడు పండితుని దూషించెను. ఒకనాడు బౌద్ధుడు బౌద్ధ ఆలయమున బుద్ధదేవునకు సాగిలపడి నమస్కరించు సమయమున పండితులవారి శిష్యులు ఆతనిని చిత్రవధ చేసిరి. రాజున కీవార్త తెలిసి పండితుల కండ్లూడదీయింప నుండగా పండితుల వారే స్వహస్తములతో తమ కన్నుల నూడబెరికికొనిరి. తిరిగి యెప్పటివలె పండితులకు కన్నులు మొలిచెను. ఇదీ కథ.

వీరమాహేశ్వరులు సాధారణముగా ధర్మాధర్మములను పాటింపరు. వారికి భక్తియే ప్రధానము. శివభక్తి కారణముగ వారు ఇతరులను చంపినను, చచ్చినను, ముక్తికలుగు నందురు. ఇది పూర్వకాలపువారి పద్ధతి. ఇప్పటివారు ఈ పద్ధతిని విడనాడి శాంతికాములైరి.

బసవేశ్వరులవలెనే వీరును పునర్జన్మ సిద్ధాంతము నంగీకరింతురు.

కం॥ *భువి జన్మాంతర సంప్రా*
ర వశంబున సహజభక్తి-రతి పుట్టి శివున్..............(227)

కం॥ ఫలియించు విధి నిషేధం
బుల వలనను బుణ్యపాప-ములు దత్కర్మం
బుల నగు నయ్యో లోకం
బులు భోగాయతనమున మఱియు - బుట్టగ కలుగున్. (457)

భక్తి భావమే ప్రధానము గాని బాహ్యవిధి ప్రధానము కాదనిరి. దృష్టాంతము- పువ్వుటమ్ములతో కొట్టిన మన్మథుని శివుడు భస్మమొనర్చెను. గుండ్రాళ్ళతో కొట్టిన సాంఖ్యతొండనికి ప్రత్యక్షమై మోక్షమిచ్చెను. (440) అంతరంగమున శివుని పూజించినను గుడిలో లింగమూర్తిని తప్పక పూజింపవలెను. అట్లు చేయనివాడు పాపాత్ముడు. (254, 255, 260)

తక్కిన విషయములు సామాన్యముగ బసవయ్యగారి సిద్ధాంతముల వలెనే యుండును. శివతత్త్వసారమునందలి గణాధిపుల ఆటలు 'సద్భక్తుల

మహిమ' వీటిని గుఱించిన పద్యములు చదువునపుడు ఎట్టివారికైనను శివభక్తి అతిశయించును.

శైవుల 36 తత్త్వములను వీరంగీకరింతురు. శివునికి గల నామములకు అర్థ భేదమును వివరించిరి. రజోగుణమూర్తియైన శివుడు భవుడు (81), తమోగుణమూర్తియైన శివుడు హరుడు (82), సత్త్వగుణమూర్తియైన శివుడు మృడుడు (83), నిస్త్రైగుణ్య మహత్తరరూపము శివుడు.

పర్యవసాన మేమన :- దర్శనభాగములను పరిశీలించినను మతతత్త్వములను పరిశీలించినను పూర్తిగ బసవేశ్వర వీరశైవమునకును, వైదిక శైవమునకును, పురాణశైవమునకును ఆరాధ్యుల వీరశైవము భిన్నమైనదని తోచును.

(15) శాక్తము - శాక్తాద్వైతము

శాక్తేయము శైవమతశాఖలలో ఒకటి. కానీ, ఇది షణ్మతములలో ఒకటిగా లెక్కింపబడినది. దీనిని శివ విశిష్టశాక్త మనియు, శాక్తాద్వైత మనియు చెప్పుదురు. పరబ్రహ్మము నిష్క్రియావస్థయందు శివుడనియు, ఆ బ్రహ్మమే సక్రియావస్థయం దున్నపుడు శక్తియనియు శైవమతము చెప్పును. బ్రహ్మమును స్త్రీలింగవాచకముగా చెప్పినపుడు శక్తియందురు. "శక్తి" = "బలము". సహజముగ బలము ఒక వ్యక్తిని గాని, ఒక పదార్థమును గాని ఆశ్రయించుకొని శక్తి యుండును. శక్తి బలమునకు మూర్తి. ఈ మతము ననుసరించి 'శక్తి' యని పిలువబడునది బ్రహ్మమే. శైవమతమున చెప్పిన విధముగనే యీ మతమునందును శివుడాది క్షిత్యంతము ముప్పదియాఱు తత్త్వముల నంగీకరింతురు. కనుక, శైవమున చెప్పిన 36 తత్త్వములు మఱల నిచట చెప్పవలసిన అవశ్యకత లేదు. కాని, కొందఱు శాక్తేయులు ఇరువది అయిదు తత్త్వములనే చెప్పుదురు. అవి ఏవన :- పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, మనస్సు. ఈ యిరువది ఒకటియు శాక్తములు.

మాయా, శుద్ధవిద్యా, మహేశ్వర, సదాశివులు; ఈ నాలుగు శైవములు. రెండును కలిసిన పంచవింశతి తత్త్వములు.

శైవుల 36 తత్త్వములు పై పంచవింశతి తత్త్వముల యందు అంతర్భావములని కొందఱందురు. అందువలన శైవ-శాక్తతత్త్వముల సంఖ్యయందు వైరుధ్యము లేదనిరి.*

మూర్తిరహితుడు, సర్వోపగతుడు, నిష్క్రియుడు, శుద్ధచైతన్యమూర్తియగు శివుడు (పరబ్రహ్మము) శక్తితో సంయోగము కలిగినపుడే మూర్తిమంతుడుగా, క్రియావంతుడుగా సృష్టికర్తగా మారును. సంయోగమనగా : శివుడును శక్తియు వేఱు వేఱుగా ఉండి, అట్లున్న వారిరువురు ఒకప్పుడు ఏకమగుట కాదు. పరాబ్రహ్మమగు పరమసత్త యందలి స్వతస్సిద్ధ సంచలనమగు "విమర్శ"యే శివునియొక్క శక్తి. శివుడు నిరుపాధిక బ్రహ్మమైనచో, శక్తి సోపాధికబ్రహ్మము. సంబంధ రహితుడగు బ్రహ్మమునకు ప్రథమ సంబంధము విమర్శయే.

శైవము శక్తికంటె శివునికెట్లు ఆధిక్యమును చెప్పినదో అట్లే శాక్తము శివునికంటె శక్తికి ఆధిక్యమును చెప్పినది. సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహము (మోక్షము) లను పంచకార్యములు చేయునది గనుక శక్తిని 'పంచకృత్యపరాయణి' అని అందురు. శివుడు ప్రకాశస్వరూపుడు. శక్తి శివపర బ్రహ్మమునందు విమర్శరూపశక్తిగా నున్నది. శక్తిని "ప్రకాశవిమర్శక సామరస్యస్వరూప" మని కూడ అందురు.

-: దేవియొక్క స్థూలరూపములు :-

దేవికి మూడువిధములగు రూపములు కలవు; వాటి వివరమిది:-
(1) స్థూలరూపము - అనగా కాళి, దుర్గ, లలిత, ఉమ మొదలగు రూపములు. ఇవి విగ్రహములయందు ప్రతిష్ఠించి భక్తులు పూజింతురు.
(2) సూక్ష్మరూపము- గాయత్రీ, ఏకాక్షరీ, బాలా, పంచదశీ, షోడశాక్షరీ

---

* 36 తత్త్వములను గుఱించి ఆగమములందు భిన్నాభిప్రాయము లున్నవి. గ్రంథవిస్తరభీతిచే నిట వ్రాయలేదు.

మొదలగు మంత్రరూపము. (3) పరము - ఇది శ్రీచక్రరూపము. ఇంతకంటె ఉత్తమరూపము లేదు. ఇది శివ శక్త్యాత్మకము.

(1) కాయికము (2) వాచికము (3) మానసికము అని ఉపాసనా రూపమైన క్రియలు మూడు విధములు -కాయికము పూజాదులవలనను, వాచికము జపమువలనను, మానసికము ధ్యానమువలనను ఉపాసింతురు. పై మూడు రూపములయందును మూడు ఉపాసనా క్రియలయందును మొదటినుండి ఉత్తరోత్తరము శ్రేష్ఠములు.

ఇప్పుడు దేవియొక్క స్థూలరూపములను చెప్పెదను :- మనలో మహాకాళీ విగ్రహమునో, చిత్రపటమునో చూడనివారరుదు. అచట కాళి ఆకృతి యిట్లున్నది :- ఆమె నీలవర్ణ. మహాభయంకరరూపిణి. శిరమున కిరీటమును, శశిఖండమును, శిఖిపింఛమును ఉన్నవి. జానులంబమగు ముక్త కేశము లున్నవి. లలాటమున త్రినేత్ర మున్నది. చాపబడిన రక్తజిహ్వ కలిగియున్నది. కంఠమున ముత్యాలసరములును, జానువుల పర్యంతము మానవమస్తకములచే కూర్చబడిన హారమును వ్రేలాడుచున్నవి. ఆమెకు గల చతుర్భుజములయందు-పైనున్న దక్షిణహస్తమున రక్తసిక్తమగు కొడవలి కలదు. వామహస్తమున పాశమున్నది. అధోభాగమున గల దక్షిణహస్తమున గద యున్నది. వామహస్తమున రక్తపూరిత పాత్రయు, ఛిన్నమస్తకమును కలవు. కటిప్రదేశమున ఛిన్నహస్తములు వరుసగా కూర్చబడిన మొలనూలు (కటివస్త్రము) ధరించియున్నది. హస్తముల బాహువులందు సువర్ణ మణిమయ కేయూరకంకణములు ధరించినది. పాదముల శింజీరము లున్నవి. పాదములక్రింద శివుడు చేతనరహితుడై పడియున్నాడు. శివుని వక్షస్థ్సలమును దేవి ఒక పాదముతో త్రొక్కి వేఱొక పాదము భూమిపై నుంచినది.

శవప్రాయుడైన శివునిపై నిలిచియున్న దనగా- శివునియందు నిగూఢమైయున్న శక్తి విజృంభించినది. శక్తి శివునియందుండి వెలువడిన శివుడు శవప్రాయు డగునను నర్థమును సూచించును. ఈమెనుండియే సమస్తసృష్టియు జరిగినందున శక్తి జగన్మాత. శివుడు లేని శక్తి

అసంభవము. కనుక, జగత్తునకు శివుడు సయితము కారణ మయినందున శివుడు జగత్పిత.

శ్లో॥ "వాగార్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే।
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ"॥

వాగర్థములవలె విడదీయుటకు వీలులేనివారును, లోకమునకు జననీజనకులును అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించుచున్నాను అని మహాకవి కాళిదాసు వచించిరి.

శ్రు॥ "న శివేన వినా దేవీ దేవ్యాచ న వినా శివః।
ఏతయో రంతరం నాస్తి చంద్ర చంద్రిక యోరివ"॥

శివుడు లేని శక్తిగాని, శక్తి లేని శివుడుగాని లేరు. చంద్రుడు చంద్రికవలె, వీరికి విడరాని సంబంధ మున్నది.

ఈమె స్వర్గమునుండి తన సామర్థ్యముచే సర్వమును పాలించు శక్తిగా వేదములయందు చెప్పబడిన దందురు. ఈ విధముగా దేవికి భయంకరమగు కాళీరూపమును, సౌందర్య రాశియగు లలితారూపమును కలవు. రెండురూపము లననేల! సర్వమును ఆమెయే. ఆమె యొకటి అవును, ఇంకొకటి కాదు - అని చెప్పుటకు వీలు లేక సకల జగద్రూపముగా పరిణమించి నందున జగత్తునందలి పరస్పర వైరుధ్యధర్మములు గల వివిధ రూపములతో నున్నది శక్తియే.* దేవియొక్క యితర స్థూలరూపములగుఱించి సందర్భము ననుసరించి చెప్పెదను.

"కపాలినీ పానమత్త మత్తవారణ గామినీ"
"బలిప్రియా మాంసభక్ష్యా రుధిరాసవధారిణీ"
"సదయా నిర్దయా మాయా శివా త్రైలోక్య మోహినీ"
"మహాకాళీ చంద్రవక్త్రా చండముండ వినాశనీ"
"ఉద్యానకాననావాసా పుష్పోద్యాన వనప్రియా"
"రక్తదంతా రక్తజిహ్వా రక్తభక్షణ తత్పరా"

* పరస్పర విరుద్ధధర్మములు గల దేవీరూపమును కాళీసహస్రనామము లందిట్లున్నది:-

"రక్తప్రియా రక్తతృష్టా రక్తపానా సుతత్పరా"
"విమలా లలితా చారుమందహాసా త్రిలోచనా"

దేవీ నివాసము :- పురాణములయందు బ్రహ్మకు సత్యలోకము, విష్ణువునకు వైకుంఠము, శివునకు కైలాసము నిలయములని చెప్పియున్నట్లే దేవి నివసించుటకు వైకుంఠాది లోకములకంటె పైన మణిద్వీపము కలదని చెప్పిరి. దేవీ భాగవతమునందలి ద్వాదశస్కంధమున మణిద్వీప వర్ణనము విపులముగ కలదు. అమృత సముద్ర మధ్యమందు గల మణిద్వీపమున 1. ఇనుము 2.కంచు, 3. రాగి, 4. సీసము, 5. పంచలోహమయము, 6.వెండి, 7. బంగారము, 8. పుష్యరాగము, 9. పద్మరాగము, 10. గోమేధికము, 11.వజ్రము, 12. వైడూర్యము, 13. ఇంద్రనీలము, 14. మరకతము, 15. ప్రవాళము 16. రత్నము. వీటిలో ఒక్కొక్కటితో నిర్మితమగు ఒక్కొక్క ప్రాకారములు 16 గలవనియు ఆ తరువాత చింతామణులచే నిర్మింపబడిన గృహమున బ్రహ్మ, విష్ణు, రుద్రులు ఖురమ్ములై సదాశివుడు పలకయై యున్న తొట్టియందు సహదేవుని వామాంకమున దేవి నివసించుననియు కలదు.

శ్లో॥ సుధా సిన్ధో ర్మధ్యే సుర విటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపో వనవతి చిన్తామణి గృహే।
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయాం
భజన్తి త్వాం ధన్యాః కతిచిన చిదానంద లహరీమ్॥

అని సౌందర్యలహరియందు - దేవి పైన చెప్పిన విధమున

పరమశివుని పర్యంకమున నివసించుచున్నదని శ్రీ శంకరాచార్యులవారు చెప్పిరి.

సమయ మతస్థులు (శ్రీ శంకరాచార్యులవారు సమయ మతస్థులట) ఇట్లు చెప్పుదురు :- పరాకాశమున గల బిందు మండలము పరమాత్మ 'స్వరూప' మని "ఆత్మన ఆకాశస్సంభూతః" అను శ్రుతివలన ఈ బిందువు వలన ననేక కమలములు ఉత్పన్న మైనందున ఇదియే

సర్వకారణబిందు వగుటచే ఇదియే సుధాసింధువు. దీని మధ్యమందే మణిద్వీపమునందు చింతామణి రచిత దేవీ మందిరమందు పంచబ్రహ్మలనే ఆసనముపై సదాశివుని అంకస్థలమున పరదేవత విహరించుచున్నదని అర్థము.

ఉమ :- ప్రాచీన ఉపనిషత్తులోని దగు కేనోపనిషత్తునందు ఈమె ఉమాదేవిగా గోచరించినది.

ఒకానొకప్పుడు దేవాసురులకు జరిగిన యుద్ధమునందు దేవతలకొఱకు బ్రహ్మమే జయము నొందెను. కాని, దేవతలు తామే జయించితిమని అహంకారముచే తలచిరి. అట్టి అహంకారము నణచగోరి బ్రహ్మము దేవతలయెదుట యక్షరూపమున ప్రత్యక్షమాయెను. ఆ రూప మేమైనది ఆ దేవతలకు తెలియలేదు. ఆ కనబడుచున్నదేమో తెలిసికొని రమ్మని దేవతలు మొదట అగ్ని దేవుని, తరువాత వాయుదేవుని పంపిరి. అగ్ని దేవునకు యక్షము "ఈతృణమును కాల్చు" మని గడ్డిపోచ నిచ్చెను. అగ్ని దానిని భస్మము చేయ యత్నించియు చేయలేక దేవతలకడకు పోయి "నే నా యక్షమును తెలిసి కొనలే" నని చెప్పెను. అదేవిధముగా వాయుదేవుడు వచ్చి ఆ గడ్డిపోచను కదల్చజాలక దేవతలకడ కఱిగి తన అశక్తతను తెలిపెను. అప్పుడు ఇంద్రుడే అచ్చటికి వెళ్లెను. వెంటనే యక్షము అదృశ్య మాయెను. అప్పుడే ఆ స్థలముననే ఇంద్రుడు సుందర స్త్రీరూపధారిణి యగు దేవిని (ఉమను) చూచి "దేవీ! యక్షరూపమున అగపడిన దేమి?" అని ప్రశ్నించెను. దేవి యిట్లనెను :-

"సా బ్రహ్మేతి హో వాచ బ్రహ్మణో వా ఏతద్విజయే మహీయ ధ్వమితి తతో హైవ విదాం చకార బ్రహ్మేతి." (కేన-26)

తా॥ అది బ్రహ్మమే. మీరు మీకు కలిగినట్లు తలచిన జయము ఆయనవలన కలిగినది. 'మావలన కలిగినదని' అహంకరింపవలదు - ఇందువలన తేలిన సారాంశ మేమన బ్రహ్మ సంబంధమైన శక్తి ఉమ యని సర్వమునకు బలము ఆమెయే యని శాక్తేయ మతము.

-: దేవీ తత్త్వము :-

కేనోపనిషత్తునందలి యక్షమును, ఉమను గూర్చిన కథయే దేవీ భాగవతమునందలి ద్వాదశ స్కంధమున కలదు. అందు పై శ్రుతియందు చెప్పిన యంశమే కాక ఉమాదేవి యింద్రునకు తన తత్త్వమును గుఱించి బోధించి నట్లున్నది. అందున్న విషయము సంగ్రహముగా వివరింతును. దేవి ఇంద్రునితో ఇట్లనినది :-

గీ॥ బీజములు రెండు మన్మంత్రరాజమునకు
రెండు భాగములు గల నా సృష్టి యెల్ల
జగమనుట గల్గె ద్వైవిధ్య మగణిత ప్ర
భావము బొల్చు నారెండు భాగములను.

కం॥ ఒక డలరు సచ్చిదానం
దకమై-ప్రకృతి సంజ్ఞ దగు నొక్కడు చం
ద్రికకుం జంద్రునకుం బలె
బ్రకృతికి నాకైక్య మెలయు వాసవ యెపుడున్.

(తిరుపతి వేంకటకవులు)

ఇందలి తాత్పర్యమును పరిశీలింతము :- "నా మంత్రరాజమునకు రెండు బీజములు కల"వని దేవి చెప్పినది. అందు ఒకటి "ఓం" రెండవది "హ్రీం". ప్రపంచమున నెచ్చట చూచినను భాగద్వయము కనబడుచున్నది. అందుకు కారణము పై బీజద్వయమే. "ఓం" అను బీజము **"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ"** అని సచ్చిదానంద స్వరూపమగు బ్రహ్మమును సూచించును. రెండవదగు "హ్రీం" బీజము మాయ, ప్రకృతి అను దానిని సూచించును. ఈ రెండు బీజములకు అభేదమే చెప్పుదురు. ఏలయన "హ్రీం బ్రహ్మేతి" అని వేఱొక శ్రుతి చెప్పినది. ఆ మాయ నాశక్తియే. దానికిని నాకును అవినాభావము. బ్రహ్మశబ్ద వాచ్యురాలను, మాయాశబ్ద వాచ్యురాలను నేనే. చంద్రునకు చంద్రికకు ఉన్న సంబంధమె నాకును ప్రకృతికిని గల సంబంధము.

మఱియు, దేవి యింద్రునకు ఇట్లుపన్యసించినది :- నా మాయ నిత్య. అనగా : పుట్టుక నాశనము లేనిది. గుణత్రయాత్మిక యగు మాయ యందలి త్రిగుణములవలననే దేహత్రయ మేర్పడినది. తురీయరూపము నేనే. త్రిగుణముల సామ్యావస్థ అదియే. అంతట నేను సర్వాంతర్యామి రూపిణిగా భాసింతును - "తురీయాతీతంబయిన పదము రూపరహితమైన నారూపము, పరబ్రహ్మమని దాని నందురు"

ఈ హేతువుచేత నారూపమును సగుణము, నిర్గుణమునని రెండుగా పేర్కొనుచున్నారు. నిర్గుణమున మాయకు ఖ్యాతి లేదు. మాయాయుతము సగుణము. ఆ నేను సర్వ జగత్తును సృజించి యా సృష్టిజాలమున నంతరాత్మగా ప్రవేశించి ప్రకాశింతును. జీవులయం దంతరాత్మగా నుందును. (శ్రీదేవీభాగవత వచనము)*

పైన రెండు పద్యములయందలి అర్థము కాని, ఆ పిమ్మట దేవి చెప్పిన యుపన్యాసము కాని కేనోపనిషత్తునందు చెప్పియుండలేదు. అట్లు చెప్పియుండి నట్లయిన శ్రీ శంకరాచార్యులవారి అద్వైతమునకు (బ్రహ్మవిద్యకు) బలము లేదు. ప్రాచీన దశోపనిషత్తుల తరువాత వెలువడిన శాక్తోపనిషత్తుల సారాంశమె దేవి చెప్పిన పై తత్త్వోపదేశము. ఇదియే శ్రీ విద్యయొక్క సారాంశము.

"దేవీ భాగవతము" నందలి సప్తమస్కంధమున శ్రీదేవి హిమవంతునకు తత్త్వోపదేశము చేసినట్లు కలదు. ఆ యుపదేశమునకు "శ్రీదేవీ గీతా" అని ప్రసిద్ధి. ద్వాదశ స్కంధమున నింద్రునకు ఉమ ఉపదేశించిన తత్త్వమును పైన సంగ్రహముగా చెప్పితిని. ఈ రెండింటియందు చెప్పబడిన తత్త్వమే శ్రీవిద్యయని శ్రీవిద్యావిశారదులు చెప్పుదురు. కాని, ('శ్రీ)దేవీ గీత'యందు చెప్పిన తత్త్వము చాలావఱకు శ్రీశంకరులవారు చెప్పిన అద్వైతమే. దేవీగీతయందు చెప్పిన కొన్ని వాక్యములను చెప్పెదను. **

---

* శ్రీదేవీ భాగవతమన్నను, దేవీ భాగవతమన్నను ఒక్కటే.

** అద్వైతమును ఈ గ్రంథమునందలి ప్రథమభాగమున చెప్పియున్నాను. చిత్తగింతురు గాక.

సృష్టికి పూర్వము ఏకము, అద్వితీయము, సజాతీయ విజాతీయ భేదరహితము, సచ్చిదానంద స్వరూపము, ప్రజ్ఞాన ఘనము అగు ఆత్మ మత్రమే యుండెను. అదియే బ్రహ్మము. ఆ ఆత్మకు గల స్వతస్సిద్ధమగు శక్తి మాయ యనబడును. ఆ మాయ పరబ్రహ్మమునకు చెందినదనిగాని, పరబ్రహ్మము కంటె వేఱనిగాని, ఉన్నదనిగాని, లేదనిగాని,ఉండి లేనిదని గాని, చెప్పుటకు వీలు లేని దగుటచే మాయను అనిర్వచనీయ మనియు; జీవునకు మోక్షపర్యంతము మాత్రమే స్థితి కలిగియుండునట్టి దగుటచే మిథ్యయనియు చెప్పబడెను. కనుక మాయాకల్పితమగు విశ్వము మిథ్య, సత్యము కాదు.

శ్రీవిద్యయందలి దేవి (శక్తి)యే పరబ్రహ్మము. పరబ్రహ్మముయొక్క శక్తి కనుక వారిరువురకు అభేదము. దేవి సగుణ, నిర్గుణ; ఆమె అనిర్వచనీయ కాదు. సత్యమైనది. శ్రీవిద్యయందు బ్రహ్మము శివుడు. మాయ. శక్తిశివశక్తులకు భేదము లేదు. బ్రహ్మమే స్త్రీ వాచకముగ చెప్పినచో శక్తి యనబడును. అద్వైతుల బ్రహ్మము ప్రజ్ఞానఘనము. ఉప్పుకల్లునందు ఉప్పుని రుచి తప్ప మఱియొకటి లేనియట్లు బ్రహ్మమునందు ప్రజ్ఞానము తప్ప మఱియొకటి లేదు. శ్రీవిద్యయందు శివశక్తు లిరువురు సమానులు.

శ్లో॥ శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్।
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పన్దితు మపి॥

(సౌందర్యలహరి)

తా॥ ఓ భగవతీ! శివుడు జగన్నిర్మాణశక్తితో కూడిననే జగన్నిర్మాణముకొఱకు సమర్థు డగుచున్నాడు. అలాగున శక్తియుతుడు కాడేని కదలుటకును సమర్థుడు కాజాలడు.

దీనియర్థము లోకానుభవమువలననే తెలియుచున్నది. సంతానప్రాప్తికి భార్యా భర్తల సంయోగము ఎట్లు ముఖ్యమో ఆ విధముగనే శక్తితో కూడక శివుడు ప్రపంచమును నిర్మింపలేడు.

శివుడు శక్తికి భర్తయని పురాణముల యందున్నను శాక్తేయులు శివునికంటె శక్తికే ప్రాధాన్య మిచ్చిరి. శక్తి లేని శివుడు శవమనియే వారిభావము. 'శివ' యను రెండక్షరములయందు 'శి' అనుదానియందు 'ఇ' కారమును తొలగించిన 'శ' అగును. అపుడు 'శివ' - 'శవ'యగును.

శివుడును శక్తియు ఒకరిపై నొకరు ఆధారపడి యున్నా రనుటకు ప్రమాణము :-

శ్లో॥ "అతశ్శేష శ్శేషీత్యయ ముభయ సాధారణతయా।
స్థితస్సమ్బన్ధో వాం సమరస పరానంద పరయోః॥"

(సౌందర్యలహరి 84)

తా॥ శక్తికిని శివునకును శేష శేషీ భావరూప సంబంధమును చెప్పియున్నారు. 'శేషి'యనగా : ప్రధానము, శేషి యొక్క అస్తిత్వము. ఇంకొకరిపై ఆధారపడదు. 'శేష' మనగా : అప్రధానము. దీని అస్తిత్వము శేషిపై ఆధారపడియుండును. ఇట్టి శేష, శేషీ భావము శక్తి శివుల కిద్దరికి సమానముగా కలదని తాత్పర్యము -

ఈ శివశక్తులయందు చెప్పబడిన శివుడు ప్రాచీన శ్రుతులయందు చెప్పబడిన నిర్గుణ, నిర్విశేష బ్రహ్మము కాదు. శాంకరమతము ననుసరించి నిర్విశేష బ్రహ్మము. ఎవరికిని శేషభూతుడు కాడు. అనగా శక్తిపై (మాయపై) ఆధారపడినవాడు కాడు, అద్వితీయుడు. పైశ్లోకమునందు చెప్పిన శివుడు శంకరాద్వైతమునందు చెప్పబడిన సగుణబ్రహ్మము. శక్తికిని సగుణబ్రహ్మమునకును శేష శేషీ భావము చెప్పవచ్చును.

శక్తిసంబంధమైన విద్యలు పది. వీటిని సిద్ధవిద్య లందురు.

శ్లో॥ కాళీతారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ
భైరవా ఛిన్నమస్తా చ విద్యా ధూమవతీ తథా।
బగళా సిద్ధవిద్యా చ మాతంగీ కమలాత్మికా
ఏతా దశ మహావిద్యా సిద్ధవిద్యా ప్రకీర్తితా"॥

తా॥ (1) కాళీతారా (కాళీభగవతి) (2) షోడశీ (3) భువనేశ్వరీ (4) భైరవా (5) ఛిన్నమస్తా (6) ధూమవతీ (7) బగళా (8) సిద్ధవిద్యా (సుందరీ) (9) మాతంగీ (10) శ్రీవిద్యా.

ఇందులో శ్రీవిద్య ముఖ్యము. శ్రీవిద్యయే బ్రహ్మవిద్య. కాశ్మీరము, కంచికామాఖ్య యనునవి శ్రీవిద్యకు ప్రధాన కేంద్రములు.

-: కామపీఠోత్పత్తి :-

జిజ్ఞాసువు:-అయ్యా! 'కామాఖ్య' అనగా ఏది?

వేదాంతి :- కామాఖ్యకు కామరూప తీర్థము, కామాఖ్యాపీఠము, యోని-పీఠము అని పేర్లు. శక్తి పురాణమగు శ్రీమహాభాగవతమున నీ పీఠమాహాత్మ్యమును గుఱించియు, పీఠోత్పత్తిని గుఱించియు ఇట్లు చెప్పబడినది.

దక్షయజ్ఞమున సతీదేవి తనతో తుల్యాకృతిగ నుండు ఛాయాసతిని సృష్టించి యజ్ఞకుండములో ప్రవేశింపుమని యాజ్ఞాపించి అంతర్హితురా లయ్యెను. శివుడు సతీవియోగమున దుఃఖించుచుండ దేవి ఆకసమున శివాదులగు దేవతలకు దర్శనమిచ్చి "ఛాయాసతిదేహము యజ్ఞశాలయం దున్నది. దానిని శిరమున ధరించి భూమియందు సంచరింపు" మని శివుని కాదేశించెను. "ఛాయాసతీ దేహమును చక్రముచే ఖండములుగ ఖండింపు" మని విష్ణుదేవున కాదేశించెను.

శివుడు యజ్ఞశాల ప్రవేశించి ఛాయాసతీ శరీరమును చూచి మహా దుఃఖమున ఛాయాసతీ దేహమును కౌగిలించుకొని శిరముపై నిడుకొని నాట్యము చేయుచు తిరుగుచుండెను. శివుని తాండవమును భూమ్యాదులగు భూతములు భరింపలేక పోయెను. ప్రళయ మగునేమో యని దేవతలు సయితము భయము చెందిరి. విష్ణుదేవుడు మహాదేవునకు తెలియకుండులాగున ఛాయాసతీ దేహమును చక్రముచే ఖండించుచు పోవుచుండెను. శివుడు ఒడలెఱుగక నాట్యము చేయుచుండెను. ఆవిధముగా ఛాయాసతీ దేహ ఖండములు ఎచ్చ టెచ్చట పడియెనో అచ్చటచ్చట

అయంగములు శిలారూపము లయ్యేను. అవియే శక్తిపీఠము లయ్యేను. ఛాయాసతియోని భూమిపై ఏప్రదేశమున పడియెనో ఆ స్థలము "కామాఖ్య"పీఠ మయ్యేను. ముఖ్యమైనవి అష్టాదశ సంఖ్య కలవి యయ్యేను. ప్రపంచమున గల సకల దేవీ పీఠములకంటెను కామాఖ్య శ్రేష్ఠమైనది. దేవి అచట యోన్యాకారమున శిలారూపము నొందెను.

శివుడు తన శరీరమున సతీదేవి దేహము లేదని జరిగిన సంగతి తెలిసికొని విష్ణువును "నరుడవై జన్మించి నాలాగుననే భార్యావియోగమున విలపింపు" మని శపించెను.అంత శివుడు శాంతుడై కామాఖ్యయందు తప మాచరించెను.

దేవీభాగవత సప్తమస్కంధమున ఈ కథ జనమేజయునకు వేదవ్యాసమునీంద్రుడు చెప్పినట్లు కలదు. కాని ఇచట ఛాయాసతి ప్రసక్తి లేదు. నిజమగు సతీదేవి దేహమునే శివుడు భుజమున నిడుకొని తిరుగుచుండ హరి సతీదేవి దేహమును ఎనిమిది వందల ఖండములుగ ఖండించినట్లును 800 శక్తి పీఠములు నెలకొనినట్లును చెప్పబడినది. (ఆం.దే.భా.7-844)

-: శాక్తమతశాఖలు - సారస్వతము :-

శాక్తమునందు మూడు ముఖ్యమగు శాఖలు కలవు. (1) సమయ, (2) కౌల, (3) మిశ్రమములు.

వీటి ననుసరించి శాక్తతంత్రములు (ఆగమములు) కూడ మూడు విధములు కలవు. జ్ఞాన, మోక్ష సాధనములను తెలుపునవి అయిదు. ఇవి -వసిష్ఠసంహిత, సనకసంహిత, సనందసంహిత, సనత్కుమారసంహిత, శుకసంహితలు - వీటిని శుభాగమము లనియు, సమయాచార సంహితలనియు అందురు. ఇవి ప్రస్తుతము లభింపవని యందురు. మంత్రశక్తులను పొందించునవి అఱువదినాలుగు. ఇవి కౌలమునకు సంబంధించినవి. మిశ్రమములు ఎనిమిది. ఇవన్నియు చేరి డెబ్బదియేడు తంత్రములు. (ఆగమములు.)

పైన చెప్పబడిన తంత్రములు గాక శాక్త సారస్వతమునకు శాక్తపురాణములు, ఉపపురాణములు, స్తోత్రములు, వాటిపై పండితులు చేసిన భాష్యములు, వ్యాఖ్యానములు, సహస్రనామములు, శక్త్యుపనిషత్తులగు త్రిపుర, త్రిపుర తాపినీ, దేవీ, బృహ్వాంచ, భావనా, సరస్వతీరహస్య, సౌభాగ్యలక్ష్మీ అను అష్టోపనిషత్తులును కలవు.

శాక్తము మంత్రప్రధానము. మంత్రములు శబ్దరూపములు. శక్తి నాదరూపిణి (శబ్దరూపిణి)మంత్రములు పవిత్రమైనవి. శబ్దము లనగా: ఆకాశ గుణకమగు శబ్దములు కావందురు. అవి ప్రత్యేకముగ పవిత్రము లయినవి.

"ఆనంద లక్షణ మనాహత నామ్నిదేశే|
నాదాత్మనా పరిణతం తవ రూపమీశే||"

అన్నారు మహాకవి కాళిదాసు. సృష్టి క్రమములో మొట్టమొదటిది నాదమందురు.

సమస్తవిశ్వమునకును ప్రణవము (ఓంకారము) ఆదియని, అన్ని వైదికమతములు గౌరవించినట్లే దేవీభక్తులును గౌరవింతురు కానీ, దేవీ భక్తులకు 'ఓమ్' కార మెట్టిదో 'హ్రీం' కార మట్టిది. దేవి హ్రీంకార రూపిణి. ఇందులో మూడక్షరము లున్నవి. అవేవన :-హ+ర+ఈం=హ్రీం. ఇందులో 'హ' కారము, 'ఈ' కారము కారణదేహము. అనగా జాగ్రత్స్వప్న సుషుప్తులు మూడును దేవియే యని యర్థము. ఆమెను తురీయ యని కూడ అందురు.

"ఉమా" పదము దేవీ ప్రణవమని ప్రసిద్ధి. ఓంకారమునందు అకార, ఉకార, మకారము లున్నట్లు ఉమా పదమునందును పై (అ+ఉ+మ)ముడక్షరములు ఉన్నవి. ఎట్లనగా:-

ఉ+మ్+ఆ= "ఉమా" అందురు. అందువలన దేవి త్రిమూర్త్యాత్మక స్వరూపిణి యని నిరూపణము. ఓంకారమునందున్న మూడక్షరములే వరుసక్రమము తప్పించి "ఉమా" పదమునం దున్నవి. శాక్తమునందు

తంత్ర (చక్ర) పూజయు ముఖ్యమే. శ్రీ చక్రము శివశక్త్యాత్మక స్వరూపము. శ్రీ చక్రమును పూజించిన దేవిని శివుని పూజించినట్లే. దీనికి గురువు సహాయ ముండవలయును. ఈ మార్గీయులు కొన్ని విషయములను గ్రంథములయందు వ్రాయక గోప్యముగా ఉంచుకొని యుందురు. అది వారి సంప్రదాయము ననుసరించి వారి శిష్యులకు మాత్రమే బోధింతురు.

సమయాచారమునందు "శ్రీ"విద్యోపాసకులకు ప్రవేశము కలుగును. సాధకుడు హృదయమునందలి దహరాకాశమున శ్రీ చక్రమును భావించి పూజించును. దీనినే సమయాచార మందురు.

పాతంజల యోగమార్గము శాక్తులకు ముఖ్యమయినదే. మూలాధారము మొదలు సహస్రార పర్యంతము ఆఱు చక్రములు కలవు. మూలాధారమునందలి కుండలినిని మేల్కొల్పి సుషుమ్నా మార్గమునుండి పైకి సహస్రారమునకు చేర్చిన శక్తిని శివునితో చేర్చినట్లగును.* ఇట్టి సాధకులను కౌలకు లందురు. కౌలము పూర్వకౌలమని, ఉత్తరకౌలమని రెండువిధములు. ఉత్తర కౌలము వామాచారము. భైరవ ఋషి, భైరవీ భైరవు లధిదేవతలు. ఆధారచక్రము త్రికోణము కలది. అందు బిందువు కలదు. కౌలము ననుసరించి త్రికోణమే బిందువు. వీరు త్రికోణమునందే బిందువును ఆరాధింతురు.

పూర్వకౌలులు - మూలాధారమే కులగృహమని అచటనే పూజాదికము జరుపుదురు. వీరు శ్రీ చక్రమునందలి నవయోనిని,మధ్యగత యోనిని భూర్జరపత్రమునందుగాని, బంగారు రేకు పైగాని, వస్త్రముపైగాని, పీఠముపైగాని లిఖించి పూజింతురు.

ఉత్తరకౌలులు - స్వాధిష్ఠానచక్రము (యోనిస్థానమని) కులగృహమని చెప్పుదురు. వీరు పూర్వకౌలులవలె భూర్జరపత్రాదులయందు యోనిని లిఖించి పూజింపరు. తరుణియగు స్త్రీయొక్క (సుందరియొక్క)ప్రత్యక్ష

---

* ఈ గ్రంథముయొక్క ద్వితీయ 'భాగమునందలి ' రాజయోగ ప్రకరణమున (20, 21, 22) అధ్యాయములయందు క్రమముగ షట్చక్రములు, సహస్రారము, కుండలినీ శక్తి మొదలగు విషయములు విపులముగ తెలిపియున్నందున నిచ్చట చెప్పలేదు.

యోనినే పూజింతురు. పూర్వకౌలులు ప్రత్యక్షయోనిని పూజింపరు. ఉభయకౌలుల తాత్పర్య మేమన : పరాశక్తికి నిలయము మూలాధార మైనను లేక, స్వాధిష్ఠానమైనను కావలయును గాని సమయాచారులు చెప్పునట్లు సహస్రారము కాదని వీరి మతము.

ఉత్తర కౌలుల మతానుసారము శివతత్త్వము శక్తితత్త్వమునం దంతర్భూత మగుటవలన శక్తితత్త్వముకంటె శివతత్త్వము వేఱుగా లేదందురు. ఇరువురును బాహ్యపూజనే చేయుదురు. మూలాధార కమలమునందున్న కుండలినీ శక్తికి 'కౌలిని' అని పేరు. కుండలిని యెల్లప్పుడు నిద్రించుచునే యుండును. కుండలిని బిందురూపిణి యని నిద్రించుచున్న కుండలినినే కౌలులు పూజింతురు. కుండలినిని నిద్రనుండి మేల్కొల్పుటయే కౌలుల మతానుసారము ముక్తి. కావున, కౌలులను క్షణముక్తు లందురు. ఏలయన : కుండలినికి ప్రబోధము కలిగినను మఱల వెంటనే నిద్రించును.

ఆనందభైరవీ భైరవులను త్రికోణమునందే ఉత్తర కౌలులు పూజింతురు. సాధకులు (స్త్రీ, పురుషులు)తాము ఆనందభైరవీ భైరవుల మనియే భావము కలిగి అట్టి తాదాత్మ్యముతో బిందుపూజ చేయునపుడు దిగంబరులై యుందురు. వామహస్తముతో పూజచేయుదురు. ఆ పూజయందు మదనధ్వజమును బిందుస్థానముగా భావించి మద్య, మాంస, మత్స్యముద్ర, మైథునముల (పంచ మకారముల)చే పూజించి షోడశోపచారములు చేయుదురట.

శ్రీ చక్రోద్ధారమునందు కౌల, సమయమతములకు భేదమున్నది.* కౌలులు సంహారక్రమమున శ్రీ చక్రలేఖనము చేయుదురు. సమయాచారులు సృష్టి క్రమమున శ్రీ చక్రలేఖనము చేయుదురు. మతభేద మెట్లున్నను శ్రీ చక్రము శివశక్త్యాత్మక స్వరూపము. బ్రహ్మాండ పిండాండ స్వరూపము.

---

*శ్రీ చక్రలేఖనము గుఱించిన జ్ఞానమున్ననేగాని ఆ భేదము బోధపడదు. శ్రీ చక్రోద్ధారమును గుఱించి గ్రంథవిస్తర భీతిచే ఈ గ్రంథమున నేను వ్రాయలేదు. "సౌందర్యలహరి" (విశేషార్థ సహితము టీకగల) గ్రంథమునందుగాని మంత్రశాస్త్రములయందుగాని "త్రిపురతాపినీ" ఉపనిషత్తునందుగాని, కామకలావిలాసము నందుగాని చూచి తెలిసికొనవలయునని విన్నపము.

వామాచార మనునది కొద్దిగనో గొప్పగనో అన్ని మతములయందును ప్రవేశించినది. ఇంద్రియ లాలసత్వము కలవారు వారి వాంఛితములను బహిరంగముగ (యథేచ్ఛగ) తీర్చుకొనుటకు సమాజమువలని భయమువలన దేవతాప్రసాద వ్యాజమున తీర్చుకొనుటతో వామాచారము ఆరంభమై యుండునేమో. శాక్తమతముతో వామాచారమున కున్నంత అనుబంధము ఇతరమతములతో లేదు.

శక్తికి 'పానమత్త', 'రుధిరాసవధారిణి', 'బలిప్రియా', 'మాంసభక్షా' మొదలగు నామము లుండుటవలన పంచమకారములతో (మద్య, మాంస, మత్స్య, ముద్ర, మైథునములు) దేవిని పూజించిన ఆమె సంతుష్ట యగునని వీరిభావము. దేవియందు భక్తి కలిగి పంచమకారములను ఆమెకు నైవేద్యరూపమున సమర్పించి తిరిగి వాటిని దేవీ ప్రసాదముగ స్వీకరించుటయే సాధకుని ఉద్దేశ మయినయెడల, ఒక ఉద్ధరిణిమాత్రమగు మద్యమును, స్వల్పమగు మధువును, చిన్న మాంసఖండమును, ఒక చేపను దేవికి సమర్పించి ప్రసాదముగా స్వీకరింపవచ్చును. అయిదవ 'మ' కారమును తన భార్యయందే రతి సలుపవచ్చును. ఇవన్నియు ఆయా విషయములయందలి వ్యసనముచే గాక (ఇంద్రియ తృప్తికొఱకు గాక) దేవీప్రసాదములను పవిత్రభావముతో చేసిన తప్పు లేదని నా అభిప్రాయము. ఇట్టివారు చాల అరుదు.

దేవిని నెపముగా నిడుకొని పరాంగనా సంగమము, ఒడ లెఱుంగని సురాపానము పాపహేతువులు. అట్టివాడు దేవీ భక్తుడు కాడు. విషయలోలుడు పతితుడు-పైన చెప్పిన పంచమకారములకు వామాచారులు చెప్పిన అర్థము సరి కాదని శ్రీ విద్యోపాసకులు వేఱు అర్థమును చెప్పుదురు. అందులో ఇవి యేవియు లేవు.

సమయాచారపరులు :- యోగులు జీవన్ముక్తులు, దేహభ్రాంతిని వదలిన మహనీయులు. సాదాఖ్య కళను సహస్రారమునందు భజింతురు. దహరాకాశమును శ్రీచక్రమును భావింతురు. బాహ్యపూజ చేయరు. అనగా- పూర్వ కౌలులుగాని, ఉత్తర కౌలులు గాని చేసెడు బాహ్యపూజను

వర్జింతురు. వారేమి చేసినను, అంతరంగమునందే పూజింతురు. జీవన్ముక్తులగు దేవీభక్తులు గృహస్థాశ్రమము నందున్నను, సన్న్యాసము నందున్నను వారు చేయు సమస్త కార్యములు దేవియొక్క పూజావిధానముగా భావింతురు. 'సౌందర్యలహరి' యందు "జపో జల్పం" అన్న 27వ శ్లోకమందున్న భావము :-

"ఓ తల్లి! నేను నా నోటికి వచ్చినట్లు వాగుట అంతయును నీ నామజపముగా భావింపుము. నేను చేయు హస్తవిన్యాసము మొదలుగా సర్వమును నీ ముద్రను చేయుటగా తలంపుము...... అనగా : ఇట్టి స్థితి... కలుగుటకు దేహాభిమానము నశింపవలయును. సమస్తమును బ్రహ్మార్పణ బుద్ధితో చేయవలయు"నని తాత్పర్యము.

శాక్తేయము ననుసరించి ముముక్షువు శక్తిని తెలిసి కొనుటయే జ్ఞానము. జ్ఞానమువలనను, భక్తివలనను ముక్తి కలుగును. దేవి అనుగ్రహము లేనిదే ముక్తి కలుగదు. శక్తిని తెలిసికొన్ననే శివుడు తెలియబడును. తల్లియే తండ్రిని చూపును కదా! దేవి అనుగ్రహమున భక్తునకు దేవీసాయుజ్యము లభించును. సాయుజ్య మనగా దేవియందైక్యము; ఇరువురును ఒక్కటియే యగుట. శివశక్తులకు అభేదము కనుక ముక్తజీవుడు వారిలో చేరిపోవును.

-: శక్తి (దేవి) యొక్క అవతారములు :-

శ్రీమన్నారాయణుడు లోకరక్షణార్థమై అప్పుడప్పుడు అవతరించుచుండును. దేవియు అట్లే లోకరక్షణార్థము అవతరించు చుండును. దక్షపుత్రికయగు సతీదేవిగను, హిమవంతుని తనూజాత యగు పార్వతిగను, గోపకులమున రాధాదేవిగను, గాయత్రిగను, మాతంగఋషికి శ్యామలాంబ యను పుత్రికగను అవతరించినది. ఇవిగాక కాళిక, దుర్గ, సరస్వతి మొదలగు రూపములతో దేవి ఆవిర్భవించినది. ఇట్టివి అవతారములలో గణింపరాదు. ఇవిగాక కొందఱు భక్తులు దేవి నుద్దేశించి తపమాచరించిరి. వారు కోరు ఫలములనుబట్టి వారి చిత్తవృత్తికి అనురూపమయిన రూపముతో వారికి దేవి సాక్షాత్కరించి

భక్తుల ననుగ్రహించి తిరోధాన మగుచుండును. ఇవియును అవతారములలో చేర్చదగినవి కావు. ఉదాహరణమునకు :- మహాకవి పుంగవుడగు కాళిదాసు మనోఽభీష్టము సారస్వత జ్ఞానలబ్ధి. అట్టి చిత్తవృత్తి ననుసరించి భయంకరరూపిణి యగు కాళీమాత మతంగ తనయగా దర్శనమిచ్చెను. ఆ దేవీరూపమును మహాకవి యిట్లు స్తుతించెను:-

శ్లో॥ మాణిక్యవీణా ముపలాలయంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసామ్ ।
మాహేంద్ర నీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి॥

శ్లో॥ చతుర్భుజే చంద్రకలావతంసే కుచోన్నతే కుంకుమరాగ శోణే।
పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణహస్తే నమస్తే జగదేకమాతః॥

శ్యామలాదేవి వరమున మతంగుడను మునికి కలిగిన పుత్రికయే మాతంగ కన్యయని, లఘుశ్యామ యని ప్రసిద్ధి. ఈమె సకలవిద్యారూపిణి. ఈ శ్యామలాదేవి లలితాదేవి బుద్ధినుండి ఉత్పన్నమయిన శక్తి. విష్ణుదేవునియొక్క మత్స్య, కూర్మ, వరాహ, నారసింహావతరము లిట్టివే కదా! దేవి ఆవిర్భావములలో మహాప్రసిద్ధము లయినవి రెండు; అందులో ఒకటి మహిషాసుర సంహారిణి.

-: దుర్గాదేవి :-

మహిషుడను రాక్షసుడు దేవతలను జయించి స్వర్గమును ఆక్రమించినపుడు దేవతలు త్రిమూర్తులతో మొఱపెట్టుకొనిరి. అప్పుడు రాక్షస వధోపాయము చింతించుచుండ త్రిమూర్తులనుండియు, దిక్పాలాది సకల దేవతల నుండియు వారియందున్న తేజము (శక్తి-బలము)లో కొంత భాగము వారినుండి బయలువెడలి ఒకచో చేరి మహాదివ్య తేజమై ప్రకాశింప, అట్టి దివ్య తేజమునుండి అష్టాదశబాహువులతో పరమాద్భుత తేజముతో స్త్రీమూర్తియగు దేవి ఆవిర్భవించినది. దేవతలందఱు దేవికి వారివారి ఆయుధముల నొసంగి మహిషాసురుని

సంహరింపుమని దేవిని ప్రార్థించిరి. దేవి మహిషాసురుని సంహరించి మణిద్వీపమునకు వేంచేసెను.

ఈ దుర్గయెవరు? లోకములను మోహింప జేయజాలు నట్టియు త్రిగుణాత్మకయు, దాట శక్యము కానట్టిదియు అని యేదేవినిగుఱించి భగవద్గీత సప్తమాధ్యాయమునందలి 13, 14, 15, శ్లోకములచే చెప్పబడియెనో, ఆ విష్ణు మాయయే యీ దుర్గ యని యూహింపవలయును. మఱియు శ్రీమద్భాగవతమునందలి శ్రీకృష్ణావతార ఘట్టమున ఇట్లున్నది:-

క॥ నందుని సతికి యశోదకు
బొందుగ హరి యోగమాయ బుట్టిన, మాయా
స్పందమున నొక్క యెఱుగమి
క్రందుకొనియె నూరివారి గావలివారిన్.

అని చెప్పబడిన యోగమాయయే కృష్ణసోదరియగు నీ దుర్గ, విష్ణుదేవుని ఆజ్ఞానువర్తి. విష్ణుదేవుడు దుర్గాదేవిని ఇట్లాజ్ఞాపించెను :- నీవు దేవకీదేవి సప్తమ గర్భమును రోహిణీ గర్భమునందు చేర్పుము.

క॥ నానావిధ సంపదలకు
దానకమై సర్వకామ దాయివి వగు నిన్
మానవులు భక్తి గొలుతురు
కానికలును బలులు నిచ్చి కల్యాణమయీ

వ॥ మఱియు నిన్ను మానవులు దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక,మాయ, నారాయణి, ఈశాన, శారద, అంబికయను పదునాలుగు నామంబుల గొనియాడుదు రయ్యై స్థానంబుల యందని, యెఱింగించి నియోగించినట్లున్నది - ఈ దుర్గయే యశోదాదేవి గర్భమందు జన్మించి కంసునిచే ఱాతిపై బడవేయ బడినపుడు "నేలం బడక, యవలీల నెగసి, నవ్యదివ్యమాలికా గంధబంధుర మణిహారాంబరాద్యలంకార మనోహారిణియు; గదా, శంఖ, చక్ర, పద్మ, శర, చాప, అసి, శూల ధారిణియునై, యెనిమిది కరంబుల గరంబొప్పుచు, సిద్ధ చారణ కిన్నర గరుడ గంధర్వాది సేవిత......."

బమ్మెర పోతనామాత్యులు తమ శ్రీమదాంధ్రభాగవతమును ప్రారంభించుచు "అమ్మల గన్నయమ్మ....దుర్గ మాయమ్మ" అని దుర్గా దేవిని స్తుతించిరి.

సింహవాహియగు దుర్గనే వింధ్యవాసిని దేవియందురు.

మహిషాసుర వధానంతరము - శుంభ నిశుంభులను దానవులు పుట్టి లోకములను బాధింప, దేవతాప్రార్థనమున అంబ (దుర్గా దేవి) యే చండికయై యావిర్భవించెను. ఆమెనుండియే కార్యార్థమై మహాభయంకరరూపిణి కాళికగా నవతరించి దుర్గాదేవి (చండిక లేక అంబ) పార్శ్వమున నిలిచి రాక్షసులనెల్ల సంహరించినది. ఈమెయే మహాకాళి (మహాకాలి).

మార్కండేయ మహాపురాణమున దేవీమాహాత్మ్యమును దెలుపు "శ్రీదుర్గాసప్తశతీస్తోత్రము"కలదు. ఆస్తోత్రమును "శ్రీమచ్చండికా సప్తశతీస్తోత్రము" అనియు అందురు. దేవి లోకరక్షణార్థమై మధు, కైటభ, మహిషాసుర, శుంభ నిశుంభాది దైత్యులను యుద్ధమునందు వధించి నట్లున్నది. మధుకైటభులు శ్రీమన్నారాయణునిచే వధింపబడినను దేవి వారికి దర్శనమిచ్చి వారిని మోహింప జేయుటచే నారాయణ దేవుడు వారిని వధింప గలిగెనని మధుకైటభవధ దేవివలననే కలిగినట్లు దేవీభక్తులు చెప్పుకొందురు. పై కథాభాగము లన్నియు మార్కండేయ పురాణమున చెప్పబడినట్లే దేవీభాగవతమున చెప్పబడినవి. దేవీభాగవతము నందలి ప్రథమస్కంధమున మధుకైటభ వధయు, పంచమస్కంధమున మహిషాసురాదుల వధయు చెప్పబడినది.

లలితావిర్భావ కథనముకంటె సింహవాహిని యగు దుర్గాదేవీ ప్రాదుర్భావ కథనమే పురాతన మైనది. లలితాసహస్ర నామములయందు 190వ నామము 'దుర్గా' అని యున్నది. దుర్గకు సహాయము నిలిచిన శక్తుల నామము లన్నియు లలితా సహస్రనామముల యందున్నవి. సందర్భమునుబట్టి దుర్గాదేవి, అంబ, చండిక, చాముండి, కాళి యని పిలువబడినను యశోదాదేవి గర్భమునం దవతరించిన దుర్గయే సర్వమును.

శ్లో॥ నందగోప గృహే జాతా యశోదా గర్భసంభవా।
తతస్తౌ నాశయిష్యామి వింధ్యాచల నివాసినీ॥

(దు. సప్తశతి 11-38)

-: దుర్గాదేవి మంత్రము :-

"వాగ్భవం శంభువనితా కామబీజం తతః వరమ్।
చాముండాయై పదం పశ్చా ద్విచ్చే ఇత్యక్షర ద్వయమ్॥"
"ఐం, హ్రీం, క్లీం చాముండాయై విచ్చే"

ఇది తొమ్మి దక్షరముల మంత్రము గనుక నవార్ణమంత్ర మందురు.

దీనికి కావలసిన న్యాసాదులు "దుర్గాసప్తశతి" స్తోత్రమును చూచిన తెలియగలవు.

దుర్గా దేవి వైష్ణవీశక్తి యని యెఱుగవలయును

లలితా విర్భావము రెండవది. శ్రీ తత్త్వమున "లలితా సహస్ర నామములు" ముఖ్యమయినవి. అందు దేవి సహస్ర నామములతో పిలువబడినది.

శ్లో॥ "శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ।
చిదగ్ని కుండసంభూతా దేవకార్య సముద్యతా॥"

అని ప్రారంభమున చెప్పబడినది. అనగా:-సహస్రనామముల యందు మొదటినామము 'శ్రీమాతా', చిట్టచివరినామము 'లలితా'. ఈ రెండునామములు పరమపవిత్రములు.

దేవీసహస్రనామములకు 'లలితా సహస్రనామము'లని పేరిడుటవలననే లలితానామముయొక్క గొప్పతనము ద్యోతక మగుచున్నది. కారుణ్య, తారుణ్య, శృంగార, సౌందర్య, సౌశీల్య సీమావధియు, భక్తార్తిహారిణియు, అరుణారుణయు, ప్రసాదసుస్మిత ముఖాంబుజయు, ఆనంద రూపిణియు, చంద్రమౌళియు అసదృశయు అగు లలితా దేవి ఆవిర్భావము ఇట్లు వర్ణింపబడెను:-

శ్లో॥ "ఉద్యద్భాను సహస్రాభా చతుర్బాహు సమన్వితా
రాగస్వరూప పాశాఢ్యా క్రోధాకారాంకుశోజ్జ్వలా।
మనోరూపేక్షుకోదండా పంచతన్మాత్ర సాయకా
నిజారుణ ప్రభాపూర మజ్జద్బ్రహ్మాండమండలా"॥

తా॥ సూర్యసహస్రతేజమున ప్రకాశించు నట్టియు, చతుర్భుజముల యందు (వామాధఃకరమున) క్రోధరూప అంకుశమును; (వామోర్ధ్వకరమున) మనోరూపమగు ఇక్షుకోదండమును; (దక్షిణోర్ధ్వకరమున) పంచతన్మాత్ర రూపమగు పంచపుష్పసాయకములను ధరించినట్టియు, తన అరుణప్రభాజాలముచే తడుపబడిన (పూరింపబడిన) బ్రహ్మాండము కలదియైన దేవీరూపమును బ్రహ్మదులే వర్ణింపలేరన్న కాళిదాస శంకరాచార్యాదు లెట్లు వర్ణింపగలరు ?

ప్రథమనామము 'శ్రీమాతా'. ఇందులో 'శ్రీ' అను అక్షరము గౌరవముగ చెప్పబడినది. 'శ్రీ' అన్నను దేవియేకదా? 'మాతా' అనగా తల్లి. సమస్త విశ్వమునకును తల్లి. విశ్వాతీతుడగు శివుని కర్ధాంగి. సహస్ర నామములయందు శ్రీమాతా నామమునకు తరువాత 'శ్రీమహారాజ్ఞీ' 'శ్రీమత్సింహాసనేశ్వరీ' అనునామము లున్నవి. ఇవి మూడును సృష్టి, స్థితి, లయములకు దేవి కర్తయని సూచించునని యందురు. శివుడు అభిషేకముచే తృప్తిచెందునట్లును, విష్ణువు అర్చనచే తృప్తి చెందునట్లును, దేవి సహస్రనామజపముచే సంతుష్టురా లగును. లలితాకథనము బ్రహ్మండ పురాణాంతర్గత* మగు లలితోపాఖ్యానమున కలదు. ఆ కథను సంగ్రహముగా చెప్పెదను :-

---

* బ్రహ్మండపురాణములు రెండు కలవు. ఒకటి అష్టాదశ మహాపురాణముల లోనిది. ఇది విష్ణుపురాణములలో ఒకటి; అనగా విష్ణుపారమ్యమును తెలుపునది. రెండవది ఉపపురాణములోనిది. ఇది శక్తిపారమ్యమును తెలుపును. ఇందులో లలితోపాఖ్యానము (లలితాంబికామహిమలు) లలితాసహస్ర నామములు కలవు. లలితోపాఖ్యానమును కీర్తిశేషులు కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రి శర్మగారు ఆంధ్రీకరించిరి.

-: లలితోపాఖ్యానము :-

శివుని ఫాలనేత్రాగ్నిచే మన్మథుడు భస్మమయినాడు. ఆ భస్మరాశిని గణపతి ఒక పురుషాకృతిగ నొనర్చి ప్రాణప్రతిష్ఠ చేసి వానికి శతరుద్రీయమును ఉపదేశించెను. అట్లు జన్మించిన ఆ పురుషుడు శతవాసరములు భక్తితో శతరుద్రీయమును పఠింప, శివుడు ప్రసన్నుడై వరమును కోరుమన, వాడు "వైరిబలమును అర్ధబలము నన్ను చేరునట్లును శస్త్రాదికములు బాధింపకుండునట్లు వరమి"మ్మని కోరెను. శివుడు వరముల నొసంగెను. ఈ చరితమును విని బ్రహ్మదేవుడు 'భణ్డ' 'భణ్డ' అని పలికిన కారణమున వానికి భండాసురుడను నామము ప్రసిద్ధ మయ్యెను.

కొంత మిగిలియున్న మన్మథుని భస్మరాశినుండి గణపతి మరి యిరువుర మూర్తులను సృజించెను. వారు 'విశుక్రుడు', 'విషంగుడు' అను నామముల ప్రసిద్ధులై భండాసురునికి అనుజులును, అనుచరులును అయిరి. ఈముప్పురును లోకముల బాధింపజొచ్చిరి.

జిజ్ఞాసువు :- అయ్యా! నాకొక సంశయము కలుగుచున్నది. శివుడు మన్మథుని భస్మము చేసిన కాలమున గణపతి జన్మించి యుండలేదు కదా? పార్వతీ పరిణయానంతరమే గణపతి జననము. అది నిజమైన భండాసురుని జన్మమునకు గణపతి కారణ మెట్లయ్యెను?

వేదాంతి :- బ్రహ్మాండపురాణమున లలితోపాఖ్యానమును హయగ్రీవస్వామి అగస్త్యమహర్షికి చెప్పినట్లున్నది. లలితోపాఖ్యానమునందే యీ కథ రెండుమారులు చెప్పినట్లు కలదు. ప్రథమమున - శివుడు మన్మథుని భస్మమొనర్చి తపమునకు పోయినట్లు చెప్పి,

తే|| **అంత గణనాథు డా భస్మ మచట చూచి**
చిత్రకర్ముండు గావున జెలగి దాని
నొక్క ప్రోగుగ నొనరించి యుద్యమమున
భూరి చిత్రాకృతిని నొక్క పురుషుజేసె. (1-243వ పద్యము)

తరువాత కథయందు మన్మథున కట్టి దుర్దశ కలుగుటకు కారణము వివరించి మరల పూర్వము చెప్పిన దానినే విపులముగ చెప్పునపుడు

తే॥ పలికె గంధర్వవదనుండు-పంచబాణు
డెచట శంకరు ఫాలాగ్ని నీల్గె నచట
బుట్టె దద్భస్మతలమున భూరిభయద
దానవేశ్వరు డొక్క డుద్దామభంగి. (1-821)

అని ఉన్నందున గణపతి భండాసురుని సృజించియుండుట, మన్మథుడు భస్మమైన ఆ వెంటనేగాక మరికొంత కాలము జరిగిన పిమ్మట అనగా : గణపతి జననానంతరమే భండాసురోత్పత్తి జరిగియుండునని తలపవలయును -తర్వాత కథ వినుము.

-: లలితావిర్భావము :-

భండాసురుడు దేవతలను జయించెను. సృష్టియందున్న సకల ప్రాణులను నపుంసకులనుగా చేసెను. త్రిమూర్తులే నపుంసకు లైరట. దేవతలు భండుని మారణోపాయమును తెలియక బ్రహ్మాండ కటాహమును భేదించి బ్రహ్మాండమున కావలనున్న పరమేశ్వరుని ప్రార్థించిరి. పరమేశ్వరుడు వారికి చేయదగు కార్య ముపదేశించెను. ఆ ఉపదేశానుసారము శివుడు హోత, పార్వతీదేవి యజ్ఞపత్నియై యాగము చేయ యత్నించిరి. యాగము చేయుటకు హోమకుండము కావలయును గదా? సప్తసముద్రములలో ఏడవదగు మంచినీటి సముద్రమును హోమకుండముగ చేయనెంచి, శివుడు దానియందలి జలమును శోషింపజేయుటకు యత్నించి ఫాల నేత్రాగ్ని (శాంభవాగ్ని)చే దానిని శోషింపజేసెను. అంత అది రసాతలాతి గంభీర ఖనిగా నయ్యెను.

శివుడు ఆ గుంతయందు ఉద్భిజ్జాల చతుర్థాంశమును రాశిగా పోసి సింహాసన విద్యను జపించుచు ఘోరహూంకార శబ్దమువలన ఊదబడిన శరీరము కలవాడయ్యెను. అప్పుడు ఆ చిజ్జ్వాలనుండు మూలాధారమునుండి బ్రహ్మబిల పర్యంతము మండెను. ఆ చిజ్జ్వాలనుని (సంవిజ్జ్వాలనుని) శివుడు తన ఫాలలోచనము వలన వెడలించి ఆ

మహాబిలము నందుంచి అనిలరూపధారియై, ఉద్భిజ్జాలముల కాల్చుచు ప్రజ్వరిల్లెను. ఇట్లు స్వాధానంబు చేయ, సద్విద్యాపూతంబును, చిదాత్మకంబును నగు అగ్ని ప్రజ్వరిల్లెను.

అట్లు ప్రజ్వరిల్లిన జ్ఞానాగ్నియందు సప్తసముద్రంబులును, సూర్యచంద్ర నక్షత్రములును, వ్రేల్చబడిరి. దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు, సమస్త ప్రాణులు భాండాసుర దూషితంబులగు తనువులను త్యజింపగోరి హోమకుండమున దుముకుచు నవనవోజ్జ్వల శరీరములతో తిరిగి బయటి కరుదెంచుచుండిరి. భాండాసురాది దైత్యులు ఆ మహాగ్ని యందు ప్రవేశింపక దానిని దూషించుచుండిరి. హోమకుండమున ప్రవేశింపక మిగిలియుండినవారు-వృక్షరహిత పర్వతసహితయగు భూమియు, మహాహోతయగు వాయురూప శంభుండును మాత్రమే. అంత శివుడు లలితాదేవి ప్రాదుర్భావమును గోరి ఆమెను స్తుతింప చిదగ్నికుండము నుండి లలితాదేవి ఆవిర్భవించెను.

ఆ దేవి శ్రీచక్రరూప రథమునం దాసీనయు, చతుర్భుజయు, చంద్రార్ధ రేఖాయుత దివ్యకిరీటధారిణియు, త్రినేత్రయు (ఫాలనేత్ర), నిరుపమాన సౌందర్యరాశియు, శుభ్రభూషణభూషితయు, సూర్యసమాన తేజయు, షోడశ వర్షీయయు, అమృతముచే జగమును తడుపుచున్న చూపులు గలదియు అగు లలితాంబ పాదుర్భవించి తన ఆత్మచే షోడశవర్షీయ ప్రాయుడగువాని, కోటిమన్మథుల సౌందర్యముతో మూర్తీభవించినవాని, తన కనురూపుండగు భర్తను తనయందుండి ప్రాదుర్భవింపజేసెను. ఆ పురుషుడే పరమేశ్వరుడగు కామేశ్వరుడు. అట్లు సృజించి ఆ దేవునిచే దేవి కౌగిలింపబడినదై అంకుశ, పాశ, ఇక్షుకోదండ, పుష్పబాణ పంచకమును సృష్టించి వాటిని తన హస్తచతుష్టయమున ధరియించినదై సాక్షాత్కరించెను. ఇట్లు ఆవిర్భవించిన లలితాంబకు శివుడు ఫాలభాగమున కరాంజలి ఘటించి నమస్కరించెను. శ్రుతివాక్యములతో వినుతించెను. నూతనసృష్టి ననుగ్రహింపుమని ప్రార్థించెను.

అంత లలితాదేవి కామేశ్వరునితో కూడి తన చంద్రాత్మకంబగు వామనేత్రమున బ్రహ్మను; లక్ష్మిని; సూర్యాత్మకమగు తన దక్షిణనేత్రమున విష్ణుదేవుని, పార్వతీదేవిని; అగ్నిరూపాత్మక ఫాలనేత్రమునుండి వాగ్దేవిని రుద్రుని సృజించెను. విష్ణుదేవునకు లక్ష్మియు, బ్రహ్మకు శారదయు, రుద్రునకు పార్వతియు భార్యలైరి. భండాసుర వధానంతరము లలిత మన్మథుని తిరుగ పుట్టించి రతీదేవి కొసంగెను.

సమస్తమును మాయామయమే! అద్వైతము ననుసరించి సకల దేవతామూర్తులును మాయయొక్క భిన్నరూపములే. "చిదగ్ని కుండ సంభూతా" అని యున్నది. అగ్నికుండము లోకమున కలదు. కాని చిదగ్నికుండ మనునది దృశ్యము కాదు. చిత్-అనగా పరబ్రహ్మము. ఆయన అగ్నిగుండమైన ఆయన యందుండి చిత్ అను అగ్ని, అనగా-జ్ఞానమను అగ్ని పుట్టి జ్వలించుచున్నది. అజ్ఞానాగ్నియే లలితాదేవిగాని కరచరణాదులు గల దేవతావ్యక్తి కాదు.

శక్తికి రూపము లేదు. లోకమున శక్తి అనేకవిధములుగా ఉన్నది. ఒక్కొక్కవిధమైన శక్తికి (బలమునకు లేక సామర్థ్యమునకు) మహామనీషా వంతులగు పెద్దలు ఊహించి భిన్న భిన్న విధములకు భిన్న భిన్న మంత్రములను భిన్న భిన్న స్థూలరూపములను ఉపాసన కొఱకు కల్పించి యున్నారు. దుర్గా, కాళీ, సరస్వతీ, లక్ష్మి మొదలగు దేవతల సమస్తరూపములు మాయామయములే ; వ్యావహారిక సత్యములే! పరమార్థ సత్యములు కావు. దేవికి రూపమున్నదనిన అట్టిరూపము గల శరీర మున్నదని చెప్పుటకు వీలులేదు. శరీరముండవచ్చును. లేదా, శరీర రహితముగనే రూపము సాక్షాత్కరింపవచ్చును. అది దేవతల యిచ్ఛానుసార ముండునందురు.

తాత్త్వికదృష్టితో చూచినచో బ్రహ్మాండము నందున్నట్లు, తంత్ర పురాణాది గ్రంథములయందు వర్ణింపబడిన ఆయా స్త్రీపురుష దేవత లెల్లరు మానవదేహము (పిండము) నందే ఆయా శక్తులుగా ఉన్నారు. ఉపాసకునకు వాని ఉపాస్యదేవత యెచ్చటనుండియో వచ్చి ప్రత్యక్ష

మగునన్నది కేవల వ్యావహారిక సంబంధమైన మాట. ఉపాసకుని ఉపాసనా నియమశక్తియే ఆవిధముగ ఉపాసకుని యందుండియే ఆవిర్భవించి ప్రత్యక్షమయి వాంఛితార్థముల నిచ్చును; అనగా అతని ఉపాసనారూప వృక్షమే ఫలము నొసంగును. 'ఎట్లయిననేమి పర్యవసాన మొక్కటియే.' ప్రళయములు ఆయా కాలములయందు కలుగుచుండును. శివునిచే మహాప్రళయ ముద్ధరింపబడును. విష్ణువుచే అవాంతరప్రళయ ముద్ధరింపబడును. లలితాదేవిచే కామికానామ ప్రళయ ముద్ధరింపబడును.

కామికాఖ్య ప్రళయకాల మాసన్న మయినందున ఆ కాల మహిమ తోడ్పడగా భండాసురుడు స్వర్గమును, వాని అనుజులగు విశుక్ర విషంగులు భూలోక రసాతలంబులను, ఆక్రమించి సమస్త ప్రాణులను పీడించిరి. ఆ రాక్షసత్రయము సూక్ష్మరూపమున సమస్త ప్రాణులయందు ప్రవేశించి ప్రాణుల శుక్ల శోణితములను భక్షించిరి. వృక్షములు, లతలు, పైర్లు, ధాన్యాదులు రసవిహీనము లయ్యెను. భండాసురు డొక్కచోట నున్నను వానితేజము లోకత్రయము నిండెను. కవి ఈ ఘట్టమును విపులముగ ఇట్లు వర్ణించెను : కాని నేను ఆ వర్ణనను సంగ్రహముగ చెప్పెదను :-

విష్ణుదేవుడు లక్ష్మీదేవియందు విరక్తుడై ఆమెను వదలి యోగనిద్రారతు డయ్యెనట. దేవతాస్త్రీల స్తనములు ఎండిన జిల్లేడు కాయలవలె నయ్యెనట. ఆ కాలమున లోకమున సౌహార్దభాషణములు లేవు. మందహాస మెట్టిదో యెఱుగరు. దేవతాంగనల ముఖములు వానరముఖములవలె చూచుట కసహ్యము లయ్యెననిన మానవులమాట చెప్పనేల? వృక్షములు చిగురింపవు. పుష్పములు లేవు. సంగీతము లేదు. నాట్యము లేదు. ఆకృతులు వికృతులై సహజస్వరూపమును చెడగొట్టుకొన్నవి. ఇది సంగ్రహముగా ఆ ప్రళయస్థితి.

-: లలితా భావము :-

కామికా ప్రళయమును స్థూలముగ (మఱొక విధముగ) చెప్పవలయు ననిన, నిది ఒక మహా వ్యాధి. ఒకరి నుండి క్రమముగ మఱియొకరికి సంక్రమించు నట్టిది కాదు. అందఱికిని ఒక్కసారిగా ఈ వ్యాధి సోకినది.

అది ప్రళయముకాని ప్రళయము; జీవన్మరణము ఉన్నవారి గతి యిది. ఇక నూతన సృష్టిలేదు. పూర్తిగా బీజములతోటి జీవరాశి స్వరూప నాశనము కాకుండ రక్షించుటకు అమృతము మూర్తివంతమై తన మూర్తియందుండి వెలువడు తేజఃపుంజముచే బ్రహ్మాండము నంతయు తడుపవలయును. అట్లుచేయుటకై అవతరించిన మూర్తియే అమృతమూర్తియగు లలితాదేవి. లలితానామములోనే నూతనసృష్టి సామర్థ్యభావము గోచరించును. ఇది స్థూలముగా లలితాదేవి వర్ణన.

శ్రీ శంకరులు లలితా త్రిశతీ భాష్యమున లలితానామమునకు అర్థము నిట్లు వ్రాసిరి :- **'లలితం త్రిషు సుందరమ్'** అను వచనముచే లలితమనగ - సుందరమైనది. ఆమె అత్యంత సుందరవతి అని గాని అనుపమ సౌందర్యము కలది అనిగాని అర్థము." (అం. ల. త్రి. భా. 62)

సూక్ష్మముగ పరిశీలించిన ఈ కథవలన తేలిన సారాంశమేమన - ఎవడు పరతత్త్వ మెఱుగడో వాడు షండుడు. పరతత్త్వ మెఱుగుటకు ముముక్షువు తన హృదయమునే హోమకుండముగా చేసి చిదగ్నిని (జ్ఞానాగ్నిని) ఆవిర్భవింప జేయవలయును. సకల కామవాంఛలను అందు హోమము చేయవలయును. తుదకు తనను (అహమును) కూడ జ్ఞానాగ్నిశిఖల కర్పింపవలయును. దగ్ధకర్ముడగు మహాత్ముడు కామేశ్వరీ కామేశ్వర స్వరూపుడు.

త్రిమూర్తులు, దేవతలు బ్రహ్మాండ కటాహమును భేదించి పరమేశ్వరీ సహితుడగు పరమేశ్వరుని దర్శించిరని కథలో ఉన్న దాని అంతరార్థ మేమన-బ్రహ్మాండము త్రిగుణాత్మకము; ప్రకృతి నిర్మితము; ఇందులోని వారందఱు త్రిగుణములతో కూడినవారే. త్రిగుణాతీత మయినది ఆత్మ. మాండూక్యశ్రుతి చెప్పిన రీతిగ తురీయమే బ్రహ్మము. ఆ బ్రహ్మమే (ఆత్మయే) స్త్రీవాచకముగ లలితాదేవి అనిరి. త్రిమూర్తులు సంవిదగ్నిచే తురీయమును దర్శించిరి.

మానవహృదయమే చిదగ్నికుండమని చెప్పితిని. ఇందు

కమలము మొదలు ఆజ్ఞాచక్రమువఱకు క్రమముగా భూమ్యాదులగు స్థూలసూక్ష్మ భూతములు పదియును, మనస్సుతో చేరి ఏకాదశేంద్రియములును, కలసి-ఇఱువది యొక్క (21) తత్త్వము లగుచున్నవి. ఇవియు, మాయా, శుద్ధవిద్యా, మహేశ్వర, సదాశివాత్మకములగు నాలుగు తత్త్వములతో చేరి 25 తత్త్వము లయ్యెను.

మాయాపర్యంతమయిన 22 తత్త్వములు (మాయతో కలిసి) ప్రాకృతములు. మాయయే మహేశ్వరునితోకూడి అతనికి జీవభావమును కలిగించుచున్నది. ఈ మతము ననుసరించి జీవుడు అవిద్యోపాధికుడే. శుద్ధవిద్య సదాశివుని 'సాదాఖ్యకళ' అని వ్యవహరింపబడు చున్నది. ఆ కారణమున దేవి చతుర్వింశతి (24) తత్త్వముల నతిక్రమించి పంచవింశతి (25) తత్త్వమయిన సదాశివునితో చేరిన దగుటవలన షడ్వింశతి (26) తత్త్వ మగుచున్నదని దేవీభక్తుల మతము. ఇఱువది అయిదవ తత్త్వముతో చేరిన అదియే (25వ తత్త్వమే) కావలయును గాని 26వ తత్త్వ మెట్లగునన్న ప్రశ్నకు సమాధానము- మేళన మెప్పటికిని తత్త్వాంతరమేగాని అనగా: మఱొక తత్త్వమేగాని అదియే (ముందున్న తత్త్వమే) కాదందురు. ఈ విధముగా అంగీకరించిన లలితాదేవి తురీయయే గాక తురీయాతీత యని కూడ దేవీభక్తుల మతమై యుండవచ్చును.

జిజ్ఞాసువు :- లలితాంబయే యిరువది ఆఱవ తత్త్వమైన కామేశ్వరునకు స్థాన మెచ్చట?

వేదాంతి :- చిదగ్ని కుండమున సర్వము ఆహుతి చేసి రనగా :- పృథివీతత్త్వము మొదలు సమస్తమును 'నేతి''నేతి' అని నిషేధింపగా తుదకు నిషేధావధి యగు కామేశ్వరీ సహిత కామేశ్వరుడే. **"ఏకమేవాద్వితీయం బ్రహ్మ"** అను శ్రుతివాక్యము ననుసరించి యున్నదనియు, **"సత్యం శివం సుందరం"** అను వాక్యార్థముచేత బోధింపబడుచున్నదనియు తెలియవలయును. తత్త్వములు 25, లేక 26 అను అంశమున భేదాభిప్రాయము లున్నవి. 26 తత్త్వములని కొందఱు వ్యాఖ్యాతలు చెప్పిరి. శ్రుతుల కిది సమ్మతము కాదని 'కామకలావిలాస' మను గ్రంథమున చెప్పబడినది. ఎట్లన :

"అవ్యక్తాది పృథివ్యంతము 24తత్త్వములుగాను 25పది ఆత్మగాను చూపించ బడినది. ఇందు మాయా శివతత్త్వములు అంతర్భూతములుగా నున్నవి. సర్వార్థబిందువు శివశక్తి మేళనముగ 25వదిగా ఉన్నది. ఇదియే భాగవతతత్త్వ మనిపించుకొనును. కాని, షడ్వింశమను మఱియొకటి కలదనుమాట అప్రసిద్ధముగా నున్నది. పైన దెలిపిన యంశము నిగమాగమ సిద్ధము. సకల శ్రుతి సమ్మతముగా నున్నది."

వీరి మతమే సరియైనదని మహాభారతమునందలి ఆనుశాసనిక పర్వమున సనత్సుజాత మహర్షి రుద్రున కుపదేశించిన సాంఖ్య, యోగములు తెలిపిన సందర్భమునందలి యీ క్రింది పద్యముల తాత్పర్యమువలన తెలియగలదు.

తే॥ కమలదళమున నున్న జలము విధమున
బ్రకృతినుండి తదీయ సంబంధ వికృతి
లేని తను గని వెలుగు నిర్లేప నిశ్చ
లాజరామర పదవి జీవాహ్వయుండు **(చ.ఆ. 233)**
ప్రకృతి నిట్లు వాపి పంచవింశుండు ష
డ్వింశ భావమొంది విమల శివ ని
రంజన రూపుడై వెలుగొందున
త్తెఱగు ముక్తియంద్రు దేవదేవ. (చ.ఆ. 234)

మఱియు హరసనత్కుమార సంవాదమునందు హరునకు సనత్కుమారమహర్షి తత్త్వ ముపదేశించుచు ప్రకృతివఱకు చతుర్వింశతి తత్త్వములనియు, ఆ పైనున్న తత్త్వాతీతము పంచవింశతి తత్త్వమనియు, ఆతత్త్వము 24 తత్త్వములకు అధిష్ఠానమనియు చెప్పియున్నారు. (అను. 4-175,176) కనుక పంచవింశతి తత్త్వమే కడపటిది. ఆవలతత్త్వము లేదు.

: శాక్తేయము-మాతృకా-మంత్ర-తంత్రములు :

దేవీ మంత్రమునకును, దేవికిని అభేదము. శ్రీచక్రమునకును, శివశక్తులకును అభేదము. పిండము, బ్రహ్మాండము సూక్ష్మముగ శ్రీచక్రమునందే గలవు. పై మూడింటికిని అభేదమని తాత్పర్యము.

మంత్రములు (1) వైదికములు, (2) తాంత్రికములు, (3) అపభ్రంశములు అని మూడు విధములు. వేదోక్తములు వైదికములని కొందరును, ప్రణవసహితములు వైదికములని మఱికొందరును అందురు. ఇవి జ్ఞానప్రధానము లైనవి - కామ్యప్రధానములైనవి తాంత్రికములు. ప్రణవరహితములే తాంత్రికములని కొందఱందురు-

సంస్కృతమునుండి అపభ్రష్టములై దేశభాష లోగల మంత్రములు అపభ్రంశములని పండితు లందురు. అనగా : తెనుగు, తమిళము, మలయాళము మొదలగు భాషలలోని మంత్రములు ఇట్టివి. ఇది వైదికుల భావము. కాని, అపభ్రంశము లనునవి సంస్కృతభాషతో ఎప్పుడును సంబంధము లేకనే (అనాదినుండియు) ఆయాజాతులయందు గురుశిష్య పరంపరగా వచ్చినవని నా అభిప్రాయము. ఇట్టివి పాముమంత్రము, తేలుమంత్రము మొదలగునవి. ఆ విమర్శతో మనకిప్పుడు అవసరము లేదు. ప్రస్తుతము శ్రీతత్త్వమునందలి ముఖ్యమంత్రములను, విశ్వముయొక్క సృష్టిక్రమమును తెలిసికొనుట ముముక్షువులకు ముఖ్యము.

మంత్రములయందు 'హుంఫట్' అని అంతమందు గలవి పుంమంత్రములనియు, 'స్వాహా' అని అంతమందు గలవి స్త్రీమంత్రములనియు, 'నమః' అని అంతమందు గలవి నపుంసక మంత్రములనియు చెప్పుదురు. ఇట్లే పెక్కురీతుల మంత్రములను విభాగించిరి.

-: శ్రీవిద్యావిధానము ననుసరించి సృష్టిక్రమము :-

నామరూపాత్మక సృష్టిక్రమము శ్రీవిద్యోపాసకులచే నీ క్రిందివిధముగా చెప్పబడినది :- 'కామకలావిలాస'మను గ్రంథమున ఇట్లున్నది : **"ఏకమేవాద్వితీయం బ్రహ్మ"** అని శ్రుతులు ఏపరబ్రహ్మమును గుఱించి చెప్పినవో ఆ పరమాత్మను బిందురూపమున సూచింతురు. ఈ క్రింద కనుపరపబోవు 'ప్రకాశ బిందువు' పరమాత్మ (పరబ్రహ్మము.). అయనయే సకలమునకు కారణమగును. ఆ వస్తువునకు కారణము లేదు. ప్రకాశబిందు రూప పరబ్రహ్మమునందు అంతర్లీనమై విమర్శక శక్తి కలదు.

**సూ॥ సకల భువనోదయ స్థితి లయ లీలా వినోదోద్యుక్తః।
అంతర్లీన విమర్శః పాతు మహేశః ప్రకాశమాత్ర తనుః॥**

(కా.క.వి.1)

తా॥ సకలలోకములయొక్క సృష్టిస్థితి సంహారములనెడి లీలావినోద క్రీడయందు ఉద్యుక్తు డైనట్టియు, అంతర్గతమగు విమర్శశక్తి కలిగి ప్రకాశశక్తి మాత్రమే శరీరముగా గల కామేశ్వర పరమాత్మ-పుణ్యాపురుషులను రక్షించుగాక.

ఇట్టి ప్రకాశరూప బిందువునుండి విమర్శరూప బిందువు కలిగినది.

**సూ॥ పాజయతి శక్తిరాద్యా నిజసుఖమయ నిత్యనిరుపమాకారా।
భావి చరాచర బీజం శివరూప నిర్మలాదర్శః॥**

(కా. క. వి. 2)

తా॥ ముందు పుట్టబోవు చరాచర ప్రపంచమునకు బీజము వంటిదియు, కార్యకారణరూప మైనట్టిదియు, ప్రథమ సూత్రమున చెప్పిన ప్రకాశరూప పరబ్రహ్మముయొక్క 'అహ' మాత్మక పరామర్శకు (జ్ఞానమునకు) నిర్మలదర్పణ మైనట్టిదియు, నిత్యానందరూప మైనట్టిదియు అగు పూర్వోక్త విమర్శరూప పరాశక్తికి జయము.

ప్రథమసూత్రమున చెప్పిన ప్రకాశ రూపబిందు వొకటియు, రెండవ సూత్రమున చెప్పిన విమర్శ రూపబిందు వొకటియు, ఇట్లు రెండు బిందువులు కలిగినవి. ప్రకాశబిందువు సర్వకారణ బిందువు అయినప్పటికిని జగత్కర్తృత్వము చెప్పుటకు వీలు లేదు. పరాశక్తి (విమర్శశక్తి) సంబంధము లేనిదే పరమాత్మ యేకార్యమును చేయజాలడు. విమర్శాత్మక పరాశక్తికి జగత్కారణత్వము చెప్పవలెనన్న ప్రకాశాత్మక పరబ్రహ్మముయొక్క సహాయము లేనిదే శక్తి యేమియు చేయజాలదు. ప్రకాశవిమర్శ రూప శివశక్తి ద్వయమునకు జగత్కారణత్వము చెప్పవలయునన్న ఒక చెట్టునకు రెండు విత్తనము (బీజము) లుండుట

ప్రపంచమున అసంభవము కనుక జగత్తునకు కారణాద్వయము చెప్పుట యుక్తము కాదు. కనుక జగదుత్పత్తికి పై యిరువురును కాక మూడవ కారణము కావలసివచ్చినది. ఆ కారణ మేమన?

సూ॥ స్ఫుట శివశక్తి సమాగమ బీజాంకుర రూపిణీ పరాశక్తిః।
అణుతర రూపానుత్తర విమర్శ లిపి లక్ష్యవిగ్రహోభాతి॥

(కా. క. వి. 3)

తా॥ పైన చెప్పిన ప్రకాశ (శివ) విమర్శ (శక్తి) ద్వయరూపమైన అనగా : ఇచ్ఛా జ్ఞానశక్తులయొక్క సమ్మేళనము బీజాంకురరూపమై, అత్యంత సూక్ష్మ(రూప)మై, సర్వవర్ణములకు మొదటిదైన 'అ'కారమును, సర్వవర్ణములకు కడపటిదైన 'హ'కారమును అనెడి లిపివర్ణములచేత చూడదగిన శరీరము గల మిశ్రబిందురూప పరాశక్తి ప్రకాశించినది.

సూ॥ పరశివ రవి కర నికరే ప్రతిఫలతి విమర్శ దర్పణే విశదే।
ప్రతి రుచి రుచిరే కుడ్యే చిత్తమయే వివశతే మహా బిందు॥

(కా. క. వి. 4)

తా॥ ప్రకాశైక స్వరూపుడగు పరశివు (డనియెడి సూర్యు)ని యొక్క కిరణసముదాయము స్ఫురణశక్తి యనెడి అద్దమునందు ప్రతిఫలించు చుండగా, చిత్తమను గోడయందు ప్రకాశ విమర్శాత్మక మిశ్రబిందువు యొక్క ప్రతిబింబము ("అహం" అను బింబము) ప్రవేశించినది.

ఇందుకు వివరము :- ప్రకాశబిందువు సూర్యునివంటిది. విమర్శబిందువు అద్దము వంటిది. సూర్యుని ప్రతిబింబము అద్దమునందు ప్రతిఫలించి ఆ ప్రతిబింబముయొక్క కాంతి అంతఃకరణమను గోడయందు ప్రకాశించినది. ఇది ప్రకాశవిమర్శాత్మక మగు బింబము యొక్క ప్రతిబింబము. (మిశ్రబిందువు) ఇప్పుడు ఆకాశమునందున్న సూర్యబింబము ఒకటి, అద్దమునందు ప్రతిఫలించిన సూర్యుని ప్రతిబింబము ఒకటి, అద్దమునందలి ప్రతిబింబ కాంతిచే గోడయందు ప్రతిఫలించిన

ప్రతిబింబము ఒకటి. ఈ విధముగా బింబ ప్రతిబింబములు మూడు నేర్పడినవి. అనగా : మొదటిది 'అ', రెండవది 'హం', మూడవది 'అహం'. దీని సారాంశ మేమన :- బింబభూతుడగు పరబ్రహ్మము అద్దమునందు తన స్వరూపమును చూచి 'అయమహం' ("ఈ ప్రతిబింబము సర్వ పరిపూర్ణుడగు నేను") అని తన చిత్తమునందు తలంచెనని తాత్పర్యము.

ఒకటవది యగు ప్రకాశబిందువు చంద్రమండలము అకారము, శివస్వరూపము, శుక్లవర్ణము-2వది అగు విమర్శ బిందువు అగ్నిమండలము, 'హం' కారము శక్తి రూపము, రక్తవర్ణము-3వ దగు మిశ్రబిందువు సూర్యమండలము, 'అహం' కారము, శుక్లరక్త మిశ్రవర్ణము, మహాబిందువు, బీజాంకురరూపిణి-ఆదిని బింబభూతుడగు పరమాత్మయందు విమర్శరూపశక్తి అంతర్లీనముగా నున్నందున ఏకవస్తువుగా ఉండి కార్యార్థము విభాగము పొందినది. ఇట్లు తనయందుండి వేఱైన తన విమర్శ శక్తిరూప దర్పణమునందు ప్రతిఫలించి యున్న ప్రకాశరూప పరమాత్మయొక్క ప్రతిబింబము చిత్కల, సాక్షి, కూటస్థుడు, ఈశ్వరుడు, ఆత్మ అని చెప్పబడెను. ఈ ఆత్మకు విమర్శాత్మక శుద్ధసత్త్వమగు మాయ ఉపాధి. వ్యష్టి శరీరమునందు భ్రూమధ్యమునుండి బ్రహ్మరంధ్ర పర్యంతము తురీయకూటమను జ్యోత్స్నాలోకము సాక్షికి స్థానము. బ్రహ్మరంధ్ర అధోభాగమున నున్న పరాకాశ మిదియే. అద్దమునందు ప్రతిఫలించిన ప్రతిబింబము ఈశ్వరుడు (కూటస్థుడు, లేక, సాక్షి). ఈ యీశ్వరునియొక్క ప్రతిబింబము జీవుడు (చిదాభాసుడు).

ఇతనికి ఉపాధి మలినసత్త్వ ప్రధానమగు మాయ (చిత్తము). ఇచట చిత్తము గోడయని చెప్పిరి. 'చిత్తము' అనినపుడు మనోబుద్ధి చిత్తాహంకారముల సమష్టి అంతఃకరణము. ఇదియే జీవుని యొక్క స్థానము.

జిజ్ఞాసువు :- అయ్యా! ఇదివఱలో జీవేశ్వర స్వరూపము ఈ విధముగా చెప్పలేదే. ఇప్పుడు చెప్పినది దానికి విరుద్ధముగా ఉన్నదే?

వేదాంతి :- శ్రీశంకర-శ్రీవిద్యారణ్యుల మతమును ఇదివఱలో చెప్పితిని.* దానిని మఱల చెప్పెదను. పరబ్రహ్మము శుద్ధసత్త్వప్రధానమగు మాయయందు ప్రతిఫలించెను. ఆ ప్రతిబింబమును, మాయయును, మాయకధిష్ఠాన మగు పరబ్రహ్మమును - ఈ మువ్వురును చేరి యీశ్వరుడనియు,ఆ పరబ్రహ్మమే మలినసత్త్వప్రధాన మగు మాయ (అవిద్య) యందు ప్రతిఫలముగా ఆ ప్రతిబింబమును, అవిద్యయు (అవిద్యాకార్యము అంతఃకరణ మగుటవలన అంతఃకరణమని చెప్పినను తప్పులేదు.), అవిద్యకు అధిష్ఠానమగు పరబ్రహ్మమును - ఈ ముువ్వురును చేరి జీవుడనియు (చిదాభాసుడనియు) చెప్పియుంటిని. శ్రీవిద్యా సంప్రదాయజ్ఞులు దీనిని పై విధముగా మార్చిరి.

జీవుడు పరబ్రహ్మమునకు ప్రతిబింబ మనుటకు మారుగ ఈశ్వరునియొక్క ప్రతిబింబ మనిరి. అదిగాక వీరు (శ్రీవిద్యయందు) ఆత్మ, సాక్షి, యీశ్వరుడు - వీరందరు ఒకటేయని చెప్పిరి. శ్రీశంకర-శ్రీవిద్యారణ్యులవారి మతములయందు కూటస్థుడు, ఈశ్వరుడు ఒకటి కాదు. భిన్నులు. శ్రీశంకర, విద్యారణ్యుల అద్వైతమును 'ఆభాసవాద' మందురు. పైన చెప్పిన శ్రీవిద్యయందలి అద్వైతమును ప్రతిబింబవాద మందురు. రెండును అద్వైతమతములే. ఈ యంశము ముందు చర్చింపబడును. కనుక దీని నింతటితో విరమించి ప్రస్తుతాంశమును చెప్పెదను.

సూ॥ చిత్తమయో హంకార స్సువ్యక్తాహార్ణ సమరసాకారాః।
శివశక్తి మిథున పిండః కబలీకృత భువన మండలో జయతి॥

(కా. క. వి. 5)

తా॥ పూర్వసూత్రము నందు పరబ్రహ్మము ఇచ్ఛాశక్తి సాన్నిధ్యము నందు చూచుటవలన విమర్శ శక్తియుతు డైనపుడు అందు ప్రతిఫలించిన

---

* ఈ విషయము వివరముగ నీ గ్రంథము యొక్క 2వ ప్రకరణము 7,8 అధ్యాయములందు చెప్పియున్నాను.

తన ప్రతిబింబమును చూచి తానే యని గ్రహించి తాను సర్వపరిపూర్ణుడనని తలంచుటయే అహమనే జ్ఞానోదయమని చెప్పినారు. 'అహం' అనగా చిత్తస్వరూపము. (శ్రీవిద్యా సంప్రదాయమున) చిత్తమే జ్ఞానస్వరూపము. ఇది తన యందు స్థాపితమై యున్న 36 తత్త్వకదంబమును, సరళ శబ్దజాలమును కలదియై 'అ' కార 'హం' కారముల మధ్య లోలీభావ మనెడి ప్రకాశ విమర్శాత్మక దివ్యదంపతీ ద్వయమునకు జయము.

మిశ్రబిందువుపై రెండు బిందువుల వలన ఏర్పడిన మూడవ బిందు వగుట వలన త్రిపురసుందరీ స్వరూపమని కొందఱందురు. ఇది జ్ఞానరూపమగు చిత్తము. "అహం" శబ్దవాచ్య మయినంత మాత్రమున అహంకారము కాదు. ఈ మిశ్రబిందువు జీవుడు.

సూ॥ బిందురహంకారాత్మా రవిరేతన్మిథున సమరసాకారః।
కామః కమనీయతయా కలా చ దహనేందు విగ్రహౌ భాతి॥

(కా. క. వి. 7)

తా॥ వెనుక చెప్పబడిన శుక్ల రక్తబిందుద్వయము యొక్క అన్యోన్య మేళన స్వరూపమగు రవిబింబము, మనోహర మగుటచే మహాయోగులచే కోరబడుచున్నదై ప్రకాశవిమర్శాంశులగు కామేశ్వరీ కామేశ్వర దంపతీద్వయము వలన కలిగిన జీవాత్మ మూడవ బిందువు.

ఇప్పటికి పైన చెప్పిన విధముగ ఒకటవ బిందువు పరబ్రహ్మము. రెండవది :- ఆయనయందు అంతర్లీనమై యుండి వెడలిన విమర్శరూపశక్తియను శుద్ధ మాయోపాధి యందు ప్రతిఫలించిన బ్రహ్మముయొక్క ప్రతిబింబమగు ఈశ్వరుడు, లేక, కూటస్థుడు (సాక్షి). మూడవది :- మలినసత్త్వ ప్రధానమగు మాయ, లేక, అంతఃకరణమునందు ప్రతిఫలించిన ఈశ్వరుని ప్రతిబింబమగు జీవుడు.


ఇట్లు త్రివిధబిందువులను గుఱించి చెప్పితిని. ఇప్పుడు చతుర్బిందువును గుఱించి చెప్పెదను.

పైనచెప్పిన విధముగ శుక్ల, రక్త, మిశ్రబిందువులు- మూడును ఏర్పడినవి గదా? వాటి పరిలేఖనము సూర్యచంద్రుల చుట్టును పరివేషము లున్నట్లు మూడు బిందువుల మధ్యస్థానము పై మూడుబిందువుల ప్రభతో త్రికోణాకారమగు యోనిచక్రముగా పరిణమించినది. "**త్రికోణ రూపిణీ శక్తి బిందురూప శివస్స్మృతః**" ఈ త్రికోణాకారమునందు నాలుగవది యగు సంవిద్బిందువు ఏర్పడుచున్నది. పైయోని చక్రమునందలి సంవిద్బిందువే త్రిగుణాత్మిక ప్రకృతి.

పైన చెప్పిన బిందుత్రయమునే చంద్రాగ్ని సూర్యమండలత్రయము; ఇచ్ఛా, జ్ఞాన, క్రియ - లను శక్తిత్రయము; బ్రహ్మ, విష్ణు, రుద్రులను మూర్తిత్రయము; జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయములను త్రిపుటి. ఈ బిందురేఖల సమష్టి కామకలా స్వరూపము.

పై అర్థము సుబోధ మగుటకు ఈ క్రింద కనబరచిన చక్రమును చూడవలయును.

- కామకలాస్వరూపము -



-: నామశాఖ :-

కేవల శుక్లబిందువు వలనగాని, కేవల రక్తబిందువు వలనగాని జగదుత్పత్తి కలుగజాలదని చెప్పియుంటిని. అందువలన పై బిందుద్వయ

సమ్మేళనమువలన ఉదయించిన మిశ్రబిందువు నందున్న శుక్ల-రక్తబిందు ద్వయములోని రక్తబిందు విలసనమువలన నాద ముత్పన్న మైనది. మాయాస్వరూపము యొుక్క అవ్యక్తము నాదస్వరూపము. నాదబ్రహ్మాంకురము వలన పంచభూత ప్రకృతికములగు పంచాశత్కలలును, వాటి వలన వర్ణపద మంత్రములును ఉత్పన్నము లయినవి. అవి ఎట్టివనగా:-

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ అం అః* = ఈ 16ను చంద్రఖండము.

క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ = ఈ 24ను సౌరఖండము.

మ య ర ల వ శ ష స హ క్ష = ఈ 10 అగ్ని ఖండము.

"అకారాది క్షకారాంతా మాతృకే త్యభిధీయతే" = అకారము మొదలు క్షకారాంతము గల వర్ణములు మాతృకలని చెప్పబడును. వీనిని వ్యాపకము లందురు. ఈ విధముగా నామాతృకశాఖ విస్తరిల్లినది.**

ఇందులో నాదోత్పత్తికాలమందు మంద్ర మధ్యమాది భేదమును అకారాది భేదమును లేనందున అవ్యక్త మనబడును. అంతపర్యంతము సూక్ష్మము. ఆ సూక్ష్మము నుండి పై యేబది వర్ణములు ఏర్పడినవి. అందులో అకారాది హ్రస్వములు పుం భాగములు. దీర్ఘములు స్త్రీ భాగములని యందురు. అయినను ప్రకాశరూపమగు ఆదిబిందువు

---

* అం, అః అనుటకు మారుగ 0 పూర్ణబిందువు విసర్గలు వ్రాసిన చాలును.

** వ్యాకరణశాస్త్రము ననుసరించి వర్ణసమామ్నాయమున పైన చెప్పిన చంద్రఖండము నందలి 16 వర్ణములను అచ్చులనియు, స్వరములనియు, ప్రాణములనియు అందురు. సౌరఖండ అగ్ని ఖండముల యందలి 34వర్ణములను (అక్షరములను) హల్లులనియు, వ్యంజనము లనియు, ప్రాణి లనియు అందురు.క-మొదలు వ-వఱకును స్పర్శములు. య-ర-ల-వ, లు అంతఃసములు. శ-ష-స-హ లు ఊష్మములు అని పేర్లు-.

శివశక్త్యాత్మక మగుటవలన అకారాది ప్రతిస్వరమును స్త్రీ పుం భాగములుగా ఉన్నవని కొందఱందురు. బిందువు, విసర్గ అంతమం దున్నపుడు హ్రస్వములు దీర్ఘము లగును. బిందువు సూర్యుడు. విసర్గ చంద్రుడు, ఋ ౠ ఌ ౡ అనునవి నపుంసకాక్షరములు.

ప్రాణము దక్షిణ నాసిక యందున్నపుడు దక్షిణాయనము. అపుడు పంచహ్రస్వ స్వరములు కలుగును. ప్రాణము ఉత్తరనాసిక యందున్నపుడు ఉత్తరాయణము. అపుడు పంచదీర్ఘ స్వరములు కలుగును. స్వరములు సుషుప్తిని; స్పర్శలు జాగ్రత్తను; అంతఃస్థములు స్వప్నమును; ఊష్మములు (శ, ష , స , హ,) తురీయమును; 'క్ష' కారము తురీయాతీతమును తెలియజేయునని మంత్రశాస్త్రవిదులు చెప్పుదురు.

అచ్చులు (ప్రాణములు) శక్తిరూపములు. హల్లులు (ప్రాణులు) శివాంశములు. అచ్చులతో హల్లులకు సంయోగము కలుగనిచో హల్లులకు స్పష్టోచ్చారణము లేదు (ప్రాణములు లేని ప్రాణులవలెనని భావము). విమర్శరూపిణి యగు శక్తి అంతర్లీన యగుటచేతనే శివుని స్వరూపము అభివ్యక్త మైనదని చెప్పుదురు. **"ఆది క్షాంతాః స్మృతా వర్ణాః"** అని ఆగమవేత్తలు "క్ష" కారమును వేఱు వర్ణముగా పరిగణించి "ళ" కారము వర్ణాంతరము కాదని త్రోసివేయుదురు. కొందఱు "ళ" కారమును కలుపుకొని 50వర్ణములని "క్ష"కారమును మేరుపూసగా నెన్నుదురు. అందువలన జపమాలను "అక్షమాల" యందురు. కొందఱు "ళ" కారమును వర్ణములలో లెక్కించి "క్ష" కారమును వదలివేయుదురు. **"ఓం 'క్షం'కాలపరా పరత్వజ్ఞాపక పరంజ్యోతీ రూపశిఖామణౌ ప్రతితిష్ఠ"** అని అక్షమాలికోప నిషత్తు చెప్పినది. కాని అందు 'ళ' 'కారముకూడ కలదు.

ఇచట అక్షరము లనగా లిపికాదు, శబ్దములు. ఇందులో 'క్ష కారము సంయుక్తాక్షరమని వదలిన ప్రథమమునందున్న 'అ', కడపట నున్న 'హ' బిందువుతో చేరి "అహం" అయినది.

ఇంకొక విధముగా చూచిన శుక్లబిందువు (అ)పరబ్రహ్మము, రక్తబిందువగు తన మాయయందు ప్రతిఫలించి యీశ్వరుడను నామమున ప్రసిద్ధు డయ్యెను. మిశ్రబిందువు జీవుని (జవాత్మను) తెలుపును. చతుర్థబిందువు (సంవిద్బిందువు) త్రిగుణాత్మక ప్రకృతి.

పైయేబది అక్షరములే అనేక మార్పులను పొంది ఒండొంటితో కలిసి నిగమాగమ శ్రుతి స్మృతి పురాణేతిహాస కావ్య ప్రబంధాదిరూపమున లోకమున విస్తరించినవి. ఇందుండి బీజాక్షరము లనగా : బీజము (విత్తనము) నందు వృక్షమున్న విధముగా బీజాక్షరమునందు శక్తులు ఇమిడి యుండును. తురీయ తురీయమను షోడశీకలయే నామాత్మకశాఖ యని మంత్రశాస్త్రవిదులు చెప్పుదురు. 'అహం' లోనే పై యేబది అక్షరములు ఇమిడి యున్నవి.

-: ఆత్మమంత్రము (అజపాగాయత్రి) :-

చంద్రాగ్నుల సమ్మేళనముచే ఏర్పడిన మిశ్రబిందువు సూర్యబిందువని చెప్పితిని. అదియే 'అహం' అనునదే మహామంత్రము. 'శ, ష, స, హ.' అను నీ వర్ణక్రమమున 'ష' కారము తరువాత ఉన్న 'స' (సః) కారము సారస్వత బీజము కాన శక్తి స్వరూపము. ఆ సకారాంతమందున్న హ (హం) కారము అగ్నిబీజము కనుక శివస్వరూప మగుటవలన "సోఽహం"-హంసః" అను మంత్రము శివశక్తుల సమ్మేళన సంపుటముగా ఉన్నందున ఆత్మ మంత్రమైనది. ఈ మంత్రమునందు శివశక్తులతో కూడిన సమస్తము ఇమిడియున్నందున ఇది సర్వోత్తమమగు ఆత్మమంత్రము. ప్రకాశ విమర్శాంశములగు కామేశ్వరీ కామేశ్వర స్వరూప దివ్యదంపతీ ద్వయమే శరీరముగా కలిగి యున్నందున మహామహిమాన్విత మైనది. దీనినే అజపాగాయత్రి యందురు. దీనినిగురించి యిదివఱలో కొంత చెప్పియుంటిని.

* **"అజపా నామ గాయత్రీ యోగినాం మోక్షదా సదా"** (ధ్యాన. బిందూపనిషత్తు 63). బిందువు హకారము దక్షిణభాగము (శివాత్మకము) సమయాచారము. సకారము వామభాగము శక్త్యాత్మకము. వామాచారము. (కౌలాచారము) సోऽహం అను పదమునందలి సకార, హకారములు లోపించినపుడు "ఓమ్" అను అక్షరము మిగులును. **"హంస ప్రణవయో రభేదః"** అని పాశుపత బ్రహ్మోపనిషత్తు చెప్పినది. హృదయమునందు దీపకళికవలె ఉన్న జీవాత్మను హంసమంత్రముతో మూలాధారచక్రమునకు తీసికొనివచ్చి అచ్చటినుండి లయక్రమమున కుండలినీ సహిత జీవుని సహస్రారమునకు తీసికొనిపోవుట మంత్రముయొక్క ఫలము.

మిశ్రబిందువునందలి రక్తబిందువుయొక్క అంశము విస్తరించుట వలన నాదముత్పన్న మైనదనియు, అఖిలశబ్దరూప మగు నామశాఖ విస్తరిల్లిన దనియు చెప్పితిని. ఈ సందర్భమున ఆత్మ మంత్రమును గురించి చెప్పవలసి వచ్చుటచే దానిని చెప్పితిని. ఇప్పుడు మిశ్రబిందువునందలి శుక్లబిందు సంబంధమైన రూపశాఖ యెట్లు విస్తరించెనో వివరించెదను.

రూపశాఖ

శుక్లరక్త మిశ్రబిందువు వలన కలిగిన యోనిచక్రము త్రిగుణాత్మకము. అదియే ప్రకృతి యని చెప్పియుంటిని. అందుండి మహత్తత్త్వము, దానినుండి అహంకారము, అందుండి మనస్సు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచతన్మాత్రలు; వాటివలన ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథ్వీ - భూతములును; వాటి పంచీకరణము వలన** శ్రోత్ర

---

* అజపాగాయత్రీ మంత్రమును గురించి బ్రహ్మజిజ్ఞాస ద్వితీయ భాగమున రాజయోగ ప్రకరణమున 17వ అధ్యాయమున కొంత చెప్పియున్నాను. అయినను దీనికి మంత్రశాస్త్రమునందు ప్రాముఖ్య మున్నందున కొన్ని యితర అంశములను కలిపి యిచట చెప్పితిని. ఆ భాగమును చూచుట మంచిదే అని మనవి.

** పంచీకరణమును గురించియు త్రివృత్కరణమును గురించియు నీగ్రంథము (బ్రహ్మజిజ్ఞాస) ప్రథమభాగమున రెండవ ప్రకరణమున విపులముగా చెప్పియున్నాను.

త్వక్ నేత్ర రసన ఘ్రాణములను పంచజ్ఞానేంద్రియములును; వాక్పాదపాణి పాయు ఉపస్థలను కర్మేంద్రియ పంచకమును కలిగినవి. ఈ విధముగా ఇరువది నాలుగు తత్త్వము లయినవి. శుక్లరక్త బిందు స్వరూపమగు శివశక్తులు తత్త్వాతీతము. లేక, పరతత్త్వము. చతుర్వింశతి తత్త్వములు క్రమముగా వ్యాపించి కలాతత్త్వము జగదాకారమును పొందినది. ఇది రూపాత్మక శాఖ.

-: పిండబ్రహ్మాండములయొక్క అభేద రూపము:-

పిండము (పంచీకృత పంచభూత సమ్మేళనము వలన కలిగిన మనుష్య దేహము) బ్రహ్మాండము యొక్క సూక్ష్మరూపము. పిండ బ్రహ్మాండములకు భేదము లేదు. కనుక పిండమునందు నామరూపాత్మక శాఖలు ఎట్లు విస్తరించినవో విచారింతము.

మూలాధార కమలమునుండి బ్రహ్మరంధ్ర పర్యంతము (సహస్రారము కాక) ఆఱు చక్రములు కలవు. అందు నేబది దళములున్నవి. ఒక్కొక్క దళమునందును బిందువుతో చేరి యేబది వర్ణములు కలవు. వాటి వివర మిదివఱకు చెప్పియున్నాను.**

పరమాత్మ తన శక్తితో కలిసి సహస్రారపు పైభాగమును భేదించి అందున్న బిందువునందు ప్రవేశించెను. ఆయన ప్రవేశించిన రంధ్రమునకే 'బ్రహ్మరంధ్ర' మనియు, 'నాందన' మనియు పేర్లు.

అదియే సాక్షికి స్థానమని యీ మతము. పరబ్రహ్మము (శివుని) యొక్క శక్తి అచటినుండి మూలాధార కమలకర్ణిక వఱకును పరానాడి రూపమున వ్యాపించియున్నది. ఇదియే సుషుమ్నానాడి యనబడును. భ్రూమధ్యము నుండి మూలాధారము వఱకును సుషుమ్నానాడి కిరుప్రక్కలను ఇడాపింగళనాడు లున్నవి. పంచీకరణము వలన స్థూలదేహ మేర్పడిన విధము తొలుత చెప్పియుంటిని.*

**కమలదళముల యందలి అక్షరముల వివరము ఈ గ్రంథము ద్వితీయ భాగమునందలి రాజయోగప్రకరణమున వివరించితిని. స్థూలభూత పంచీకరణము వలన రూపాత్మకశాఖ చెప్పినట్లయినది. అది యీ గ్రంథము ప్రథమభాగము రెండవ ప్రకరణమున కలదు.

*బ్రహ్మజిజ్ఞాస ౧-౨- ౧౪ పంచీకరణమును చిత్తగింపుడు.

-: వాక్చతుష్టయము :-

"చత్వారి వాక్పరిమితా పదాని తాని
విదుర్బ్రాహ్మణా యే మనీషిణః,
త్రీణిగుహా నిహితా నేంగయంతి**

తురీయం వాచో మనుష్యా వదంతి. (ఋగ్వేదము) (సరస్వతీ రహస్యోపనిషత్తు 6)

తా॥ చత్వారి వాక్పరిమితా = పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపమైన నాలుగుస్థానములను ఎవరు తెలిసికొనుచున్నారో వారు విద్వాంసు లనబడుదురు. ఈ నాలుగు స్థానములలో మొదటి మూడును గుప్తముగా నున్నందున (నేంగయంతి) = ఎవరును తెలిసికొనజాలరు. మనుష్యులు వాచా ఉచ్చరింపబడు వైఖరీరూపమును మాత్రమే యెఱుగుచున్నారు.

వెనుక చూపించిన యోనిచక్ర పరిలేఖనమునందలి సంవిద్బిందువుతో చేరి నాలుగుబిందువులనే పరాదినామములగు వాగ్రూపమని అందురు.

పరావాక్కు :- సహస్రారము పరమాత్మ (సాక్షి) స్థానము. అందు బిందురూప శివునియం దధిష్ఠించియున్న విమర్శాంశయగు పరాశక్తియే సర్వజ్ఞశక్తి, 'పరావాక్కు' ఆ స్ఫురణశక్తి (సంకల్పశక్తి) యిచ్చువలననే యేక్రియ యే యింద్రియ సంబంధమువలన కలుగుచున్నదో ఆ యింద్రియము ప్రేరేపింపబడి అట్టి క్రియ జరుగుచున్నది. ఉదాహరణమునకు :- మనము 'రామ' శబ్దము నుచ్చరింపదలచితి మనుకొనుడు. 'అనుకొనుట' అనగా : సహస్రారమునందు అట్టి సంకల్పము కలుగును. సహస్రారము సంకల్పమునకు స్థానము. సంకల్పమే పరావాక్కు.

పశ్యంతి :- పిదప వాక్కునకు (రామశబ్దోచ్చారణమునకు) వాయువాధారము కాన శబ్దము ఉచ్చరింపవలయు నను సంకల్పము కలుగగనే అచటినుండి (సహస్రారము నుండి) వ్యాపించిన పరానాడి

**మూడవ పాదమున "గుహాత్రీణీ నిహితానేంగయంతి" అని సరస్వతీ రహస్యోపనిషత్తు.

ద్వారా ప్రేరణఅయి మూలాధార స్థానమున వాయువు ఉత్పన్నమగును. అది పశ్యంతీ స్థానము.

మధ్యమ :- పశ్యంతీ స్థానమున చేరిన వాయువే స్వాధిష్ఠానము నందున్న అగ్నితత్త్వముతో చేరి సుషుమ్నద్వారా స్వాధిష్ఠాన, మణిపూరకములను దాటి అనాహత కమలమును చేరినపుడు 'మధ్యమా' అనబడును. మధ్యమా వాక్కు సూక్ష్మమని, స్థూలమని రెండు విధములుగా ఉన్నది. పరాపశ్యంతులకు మధ్యమావస్థ సూక్ష్మమధ్యమ. పశ్యంతీ వైఖరుల మధ్యమావస్థ స్థూలమధ్యమ.

వైఖరీ :- మధ్యమా విశుద్ధకమలమును పొందినపుడు వైఖరి యనబడును. ఇది తేజోమయ మైనదై స్పష్టమైన అక్షరములతో శబ్దమును ఉచ్చరించుచున్నాము. ('రామ' అనుచున్నాము.) వైఖరీ వాక్కును అందఱు తెలిసి కొనుచున్నారు. తక్కిన మూడును అతిసూక్ష్మము లగుటవలన సామాన్యులు తెలిసికొనజాలరు. దేవతలు యోగులు మాత్రమే తెలియగలుగుదురు- ఇందులో మతభేద మున్నది. ఎట్లన :-

పైన చెప్పిన పద్ధతి, అనగా : సంకల్పస్థానము సహస్రారము కనుక అదియే పరావాక్కునకు స్థానమనునది సమయాచారమతము. మాతృకా వివేకాది కౌళ మతపరమైన తంత్రములయందు మూలాధారమే పరాస్థానమని చెప్పియున్నారు. **"మూలాధారా సముత్పన్నః పరాఖ్యానామ సంభవః"**

పరావాక్కు :- ఇది సర్వగతమైనను దీనికి ప్రధాన స్థానము మూలాధార చక్రము. ఇది యిచట అతి సూక్ష్మమగు 'సంస్కృత పవనము'చే అభివ్యక్తమగును. ఇది స్పందరహితము, భావాతీతము, ప్రకాశాంశ మాత్రము. తక్కిన మూడింటికిని ఇది సాక్షి.

పశ్యంతీ :- మూలాధారమున నున్న సంస్కృత పవనము అచటనుండి నాభిస్థానమును చేరును. అచట చేరినపుడు ఆ నాభిదేశ సంయోగమువలన ఉత్పన్నమైనశబ్దము (వాక్కు) పశ్యంతి అనబడును. పశ్యంతి అనగా : ఏదైన నామరూపములను కల్పించి చూచుచున్నదని అర్థము.

మధ్యమా :- నాభిదేశమునందలి సంస్కృత పవనము హృదయ కుహరమునకు ఎగబ్రాకి హృదయ ప్రదేశముతో సంయోగమైనందున కలిగిన మార్పునకు 'మధ్యమా' అని పేరు. ఇది చాల ముఖ్యమైనది. వర్ణస్వరమాత్రాది స్థూలరూపమును పొందక ముఖమును చేరక మధ్యనే నిలిచి యుండునది కనుక దీనికి మధ్యమ అని పేరు.

వైఖరీ :- హృదయ స్థానమునందున్న సంస్కృత పవనము ఊర్ధ్వముఖముగా ప్రసరించి కంఠప్రదేశమును చేరి పుఱ్ఱెకు తగిలి ఆ ప్రతిఘాతముచే పరావర్తితమై ముఖ వివరమునందు కంఠము మొదలగు (8) స్థానములను బలముగా తాకుటచే పుట్టినశబ్దము 'వైఖరి' అనబడును. ఇది వాగ్రూపమున నున్న విశ్వముయొక్క శరీరము. పరాస్వరూపము సదాశివాది సాధకజన పర్యంతము అంతఃకరణమునందు సంకల్పమే రూపముగా కలదని కొందఱందురు. పరా పశ్యంతీ మొదలగు నామములు స్థానముల నామములేగాని వాక్కుయొక్క నామములు కావనియు, ఒక వాక్కే ఆయా స్థానములను చేరినపుడు ఆయా స్థాన నామములను పొందుననియు కొందరందురు. ఎట్లన్నను తుదకు పర్యవసాన మొకటియే.

ఈ విధముగా నామరూపాత్మక విశ్వసృష్టి యెట్లు కలిగినదో తెలిసికొంటిమి. నామరూపము లనగా వాగర్థములు. వైఖరియే పైన చెప్పిన పంచాశద్వర్ణములుగ విభాగ మైనది. మనము దోసిలిలో పాదరసమును నింపుకొని దానిని క్రింద పడవైచిన దోసిటియందు ఏకబిందు రూపమై యున్న పాదరసము భూమిపై బడి యేబది బిందువులుగా చెల్లా చెదరైనట్లు శబ్దబ్రహ్మము ఏబది అక్షరము (మాతృక) లైనది. రూపము, ప్రకృతి మహత్తు మొదలు పృథ్వీ పర్యంతమై విశ్వాకారమున కనబడుచున్నది.

-: మంత్రములు - శ్రీవిద్య :-

"సప్తకోటి మహామంత్ర స్వరూపిణి" దేవి అని ఉన్నది. ఆ మంత్రము లన్నియు తెలిసినవా డెవ్వడును లేడు. కనుక ముఖ్యమగు అయిదు మంత్రములు ఈ క్రింద వివరించుచున్నాను.

(1) సంపూర్ణ గాయత్రీ మంత్రము.

ఓం భూర్భువఃస్వః :- తత్సవితుర్వరేణ్యమ్, భర్గోదేవస్య ధీ మహి ధియోయోనః - ప్రచోదయాత్ -

పదవిభాగము :- ఓం-భూః-భువః-సువః; తత్, స, వి, తుః-వ-రే-ణియమ్; భ, ర్గః, - దే, వ, స్య-ధీ, మ, హి- ధి, యః-యః, నః; ప్ర, చో, ద, యాత్.

ఓం, అనునది ప్రణవము భూర్భువఃస్వః - అను మూడును మహా వ్యాహృతులు. ఇంతవఱకు వదలిన మిగత 24 అక్షరములు ముఖ్యమంత్రము. ఇవి మూడు పాదములు. నాలుగవపాదము "పరో రజసి సావదోం." ఉపనయన కాలమున మంత్రము మూడు పాదములు మాత్రమే ఉపదేశింతురు. నాలుగవ పాదమును బ్రహ్మజ్ఞాని యగు గురువు ఉపదేశించును.

గాయత్రి మంత్రమునే సంపూర్ణ గాయత్రి యని మరొకవిధముగా చెప్పుదురు ఎట్లన :- పైన చెప్పిన వ్యాహృతి త్రయమునకు ముందున్న ప్రణవాక్షరము కాక మంత్రారంభమునను మంత్రముయొక్క నాలుగవ పాదారంభమునందును ప్రణవాక్షరముల నుంచిన సంపూర్ణగాయత్రి యగును.

"న గా య త్ర్యా పరం మంత్రం న మాతుః పరదేవతా" గాయత్రిని మించిన మంత్రముగాని జగన్మాతను మించిన పరదేవతగాని లేదు. పైన చెప్పిన గాయత్రి మంత్రమును 'ప్రకటగాయత్రి'యనియు ; ముందు చెప్పబోవు 'బాలా' మంత్రమును 'గుప్తగాయత్రి'యనియు అందురు. బాలా పంచదశాక్షరి,

షోడశాక్షరి నామములచే శ్రీవిద్యావిధాన ముపదేశింపబడుచున్నది.

"గాయంతం త్రాయత ఇతి గాయత్రీ" గానము (జపము) చేయువారిని తరింప (రక్షింప) జేయునది గనుక గాయత్రి యని పేరు.

గాయత్రి బ్రహ్మ ప్రదిపాదకమగు మంత్రము. మూడు పాదములు సగుణబ్రహ్మమును నాలుగవపాదము నిర్గుణబ్రహ్మమును ప్రతిపాదించునని పెద్దలందురు. ఇందు ప్రతిపాదింపబడిన దేవత స్త్రీ (విశిష్ట) దేవత. గాయత్రీ మంత్రార్థమును కొందఱు సూర్యపరముగను, కొందఱు విష్ణుపరముగను, కొందఱు రుద్రపరముగను, కొందఱు శక్తిపరముగను చెప్పుదురు, శాక్తము ననుసరించి :-

తా|| లోకప్రసిద్ధిగా నున్న లింగధర్మ రహితమును, సచ్చిదానంద లక్షణములు కలిగి సూర్యమండలాంతర్గత మైనదై (యే బ్రహ్మ తేజస్సు) మా బుద్ధివృత్తులను ప్రేరణ చేయుచు, జగత్తుయొక్క సృష్ట్యాది ధర్మములు గలదై, ప్రకాశమూల మైనదై, సకల నిగమాగమ ప్రసిద్ధ మైనదై యున్నదో అట్టి బ్రహ్మతేజస్సును ధ్యానించుచున్నాను.

జగత్కారణమై ప్రకృతికంటెను వేఱుగా ఉన్న ఆ పరాశక్తి తన సాయుజ్యమును ఇచ్చి మమ్ముల రక్షంచుగాక. అని నాలుగు పాదములయందలి ముఖ్యార్థము. మంత్రము అద్వైతపరముగా ఉన్నది. ఈ మంత్రమహిమను గుఱించి దేవీభాగవతము నవమస్కంధమున నారాయణుడు నారద మహర్షికి బోధించి నట్లున్నది. మఱియు, సూర్య, త్రిపురతాపి న్యుపనిషత్తుల యందును, తైత్తిరీయోపనిషత్తు ప్రథమాధ్యాయము పంచమానువాకమునందును, బృహదారణ్యకోపనిషత్తు సప్తమాధ్యాయమునందలి 14వ బ్రహ్మణమునందును, ఈ మంత్రార్థము వివరింపబడి యున్నది.*

(2) కామకలా ఏకాక్షరీ మంత్రము.

"శ్రీం" ఈ మంత్రమునందు బిందువుతో చేరి నాలుగు బీజము లున్నవి. శ+ర+ఈ+0 = శ్రీం

---

* ఈ మంత్రాధిష్ఠాన దేవతయగు గాయత్రీదేవి భూలోకమున గోపకులమున మానుష రూపధారియై అవతరించినది. ఈ యంశమును ఇదివఱలో (ఈ గ్రంథము ద్వితీయభాగము ప్రకరణము 4-14వ అధ్యాయమునందు) చెప్పియుంటిని.

ముఖ్యముగా నాలుగు బీజములు ప్రకాశ, విమర్శ, మిశ్ర, సంవిద్బిందువు లనియు పరాది వాక్చతుష్టయ మనియు చెప్పుదురు. దీనినే కామకలా బీజమనియు, ధృవకల యనియు, షోడశీకల యనియు శ్రీవిద్య యనియు చెప్పుదురు.

(3) బాలా త్రిపురసుందరీ మంత్రము.

ఐం క్లీం సౌః = ఇవి వాగ్భవ, కామరాజ, పరాశక్తి బీజములు. ఐం క్లీం సౌః = అనగా - అహం బ్రహ్మాస్మి అని భావము. దానినే సౌః క్లీం ఐం = అనిన "బ్రహ్మైవాహమస్మి" యని అర్థము.

(4) శ్రీ విద్యా పంచదశాక్షరీ మంత్రము.

త్రిపురోపనిషత్తునందు ఈ మంత్రోద్ధారము ఈ క్రింది విధముగా చెప్పబడినది-

"కామో యోనిః, కమలా వజ్రపాణి, ర్గుహా హసా, మాతరిశ్వా, అభ్రం ఇంద్రః, పునర్గుహా సకలా, మాయయాచ పురుచ్చేషా విశ్వమాతాది విద్యా"

కామః = 'క'కారము, యోనిః = 'ఏ' కారము, కమలా = 'ఈ',

వజ్రపాణిః = 'ల' కారము, గుహా = 'హ్రీ'కారము, హసా = 'హ';

'స' కారములు, మాతరిశ్వా = 'క'కారము, అభ్రం = 'హ'కారము, ఇంద్రః = 'ల' కారము, పునర్గుహా = 'హ్రీం' కారము, సకలా = 'స'; 'క'; 'ల'; కారములు, మాయా = 'హ్రీం' కారము; పురూచీ = పురాతని; విశ్వమాతా = జగజ్జనని,

- ఆదివిద్యా -

శ్రీ శంకరాచార్యులవారు సౌందర్యలహరి యందు ఈ మంత్రమును, 'శివ శ్శక్తిః కామః క్షితి రథ రవి శ్శీత కిరణః" అను 32వ శ్లోకమున ఉద్ధరించి యున్నారు.

అన్ని బీజములు చేర్చిన ఇట్లుండును.

క ఏ ఈ ల హ్రీం, హ స క హ ల హ్రీం, స క ల హ్రీం

వాగ్భవకూటము కామరాజకూటము శక్తికూటము

వెనుక శైవమతమునందు చెప్పిన 36 తత్త్వములును తత్త్వాతీతములును పంచదశీమంత్ర పరదేవతా స్వరూపమని మంత్రము నందలి అచ్చులను హల్లులను విడదీసి చూచిన బోధపడును. కామకలావిలాసాది గ్రంథముల యందు మంత్రమును మూడు కూటములుగా విభజించి మూడు కూటములకు ఈ క్రింది విధముగా తాత్పర్యమును చెప్పిరి.

ప్రథమకూట తాత్పర్యము :- మాయాస్వరూపయైన హే పరదేవతే బ్రహ్మ విషయమైన అష్టపాశాత్మక* అవిద్యను నివర్తింపజేయుము. బ్రహ్మజ్ఞానమును గుఱించి నాకు గల అజ్ఞానమును నివర్తింప చేయుము- వాక్ప్రావృత్తి నిమిత్తముచే ఈ ఖండమును వాగ్భవఖండ మందురు. ఇందు గాయత్రీ మంత్రముయొక్క సారము కలదు. ఇది ఋగ్వేదాత్మకము. ఈ కూటము దేవియొక్క శిరస్సు (ముఖము) గా వర్ణింపబడినది.

ద్వితీయ కూటార్థము :- ఆముష్మిక బాధా నివృత్తియు, సకల ధన కనక వాహన భూమ్యాది సంపత్తులు అనుభవింప జేయబడుటయు, స్రక్చందన వనితాది మదన విషయ భోగములు కామింప బడుచున్నవియు, ఐహి కాముష్మిక సకలభోగములు, ఉపద్రవ నివృత్తిపూర్వకమైన కామ భోగప్రాప్తియు, అర్థకామ పురుషార్థములను కలుగజేయును. కనుక యీ ఖండమునకు కామరాజఖండమని పేరు. ఇది యజుర్వేదాత్మకము. ఈ కూటము దేవియొక్క కంఠాధః కటి పర్యంతము వర్ణింపబడినది.

---

* అష్టపాశ వివరము ఈ క్రింది శ్లోకములో చెప్పబడినది.

శ్లో॥ ఘృణా శంకా భయం లజ్జా జుగుప్సా చేతి పంచమీ
కులం శీలం చ జాతిశ్చే త్యష్టౌ పాశాః ప్రకీర్తితాః.

తృతీయ కూటార్థము :- (పై రెండు ఖండములను ఈ ఖండము కలుపును.) నిరతిశయానందానుభవ ప్రకాశనాదాత్మ చిచ్ఛక్తి అనగా :- సకల హృదయాకాశముల యందు దీపశిఖవలె అంతర్గతమై యున్నట్టియు, సత్యానందములయొక్క అనుభవమును ప్రకాశింప జేయునట్టి చిచ్ఛక్తికిని నాదలయయోగానందము చెప్పబడినది. కనుక శక్తికూటమని చెప్పబడినది. ఇది నాదరూప మగుటవలన సామవేదాత్మకము. ఈ కూటము దేవియొక్క కటి అధోభాగము వర్ణింపబడినది.

పంచదశాక్షరీ మంత్రము "తత్త్వమసి" మహావాక్యార్థమును బోధించుచున్నదని శ్రీవిద్యోపాసకు లందురు. ఇందు మూడు ఖండములయొక్క అర్థమును సంగ్రహముగా నిట్లుండును :-

(1) ఐం క ఏ ఈ ల హ్రీం = ఓ పరమాత్మా! నేను నీవై యుండియు అవిద్యవలన నీకంటె నేను భిన్నుడనని భేదబుద్ధిని కలిగియున్నాను. అట్టి భేద బుద్ధిని నిర్మూలింపుము - ఇది "త్వం' పదమును సూచించును.

(2) పైన చెప్పినట్లు భేదబుద్ధి నశించినంతనే నేను పరబ్రహ్మము నగుచున్నా నను బ్రహ్మభావన అలవడును- ఇది "తత్" పదమును సూచించును.

(3) సకల హ్రీం = అఖండాకారవృత్తిని నన్ను పొందనిమ్ము. ఇది "అసి' పదమును సూచించును.

ఈ మంత్రమహిమ చెప్పనలవి కానిదని శాస్త్రములయందున్నది. ఉపపురాణములయం దొక్కటిగ నెన్నబడిన బ్రహ్మాండ పురాణాంతర్గత ఉత్తరఖండమున హయగ్రీవాగస్త్య సంవాదరూపమున నీ మంత్రార్థము వివరింపబడినది. ఆ గ్రంథమునకు "లలితా త్రిశతీ" అని నామము. శ్రీ శంకరభగవత్పాదులు ఆ గ్రంథమునకు భాష్యమును రచియించిరి. మంత్రమునందున్న పదునైదు బీజాక్షరములకు ఒక్కొక్క బీజాక్షరమునుండి యిరువది నామములు చొప్పున పదునైదు అక్షరములకు 300 నామములు

లలితాదేవికి చెప్పబడెను. శ్రీ శంకరులవంటి మహాత్ముడు భాష్యము వ్రాసియున్నందున నీ మంత్రముయొక్క గొప్పతనమును ప్రత్యేకించి చెప్పవలసిన అవసరముండదు. అగస్త్యముని హయగ్రీవస్వామిని ఈ మంత్రరహస్యమును నెఱిగింపుమని మూడు సంవత్సరములు హయగ్రీవస్వామి పాదములు పట్టుకొని విడువకుండిరట. అప్పుడు పరదేవత హయగ్రీవస్వామికి దర్శనమిచ్చి మంత్రమును ఉపదేశింపుమని ఆజ్ఞాపింప స్వామి ఆగస్త్యమునికి మంత్రమును ఉపదేశించినట్లు గ్రంథ ఉపోద్ఘాతమున కలదు.

మంత్రమును కామేశ్వరీ కామేశ్వరు లిరువురు చెప్పిరని, అందు - శివవర్ణములు కామేశ్వరి (శ్రీదేవి) యును, శక్తివర్ణములు కామేశ్వరుడును, శివశక్త్యాత్మకము లయిన వర్ణములు (బీజాక్షరములు) శివశక్తుల (ఉభయుల) వలనను చెప్పబడినవి. ఎట్లనగా :- కకారత్రయము, హకారద్వయము కామేశ్వరుడు చెప్పినవి. హ్రీంకారములు శివశక్త్యాత్మకములు. మిగిలిన వర్ణములు శక్త్యక్షరములు. ఈ విభాగమును తెలిసికొనక మంత్రమును జపించిన వారికి కల్పకోటి శతములకైనను మంత్రసిద్ధి కలుగదట. ఈ విద్య సకల పురుషార్థ ప్రాప్తిరూపమగు ఆత్మజ్ఞాన సాధనము; జీవబ్రహ్మ సమరసభావరూప మోక్షసాధనము.

"శ్లో॥ యస్య నో పశ్చిమం జన్మ యది వా శంకరస్వయమ్।
తేనైవ లభతే విద్యా శ్రీమత్పంచదశాక్షరీ॥

తా॥ ఎవనికి పునర్జన్మ లేకపోవునో, ఎవడు సాక్షాత్తు శంకరుడో వానిచేతనే శ్రీమత్ పంచదశాక్షరీ విద్య పొందబడుచున్నది.

దేవీ సహస్రనామ పఠనమువలన ఎట్టి ఫలము చెప్పబడినదో "తత్ఫలంకోటి గుణితం" అంతకంటెను కోటిరెట్లధిక ఫలము ఒక్కొక్క నామమును జపించిన కలుగునని చెప్పబడినది.

(5) శ్రీవిద్యా షోడశాక్షరీ మంత్రము

ఈ మంత్రమునుగుఱించి కొంద ఱిట్లు చెప్పుదురు :-

"పంచదశీ మంత్రమునకు 'శ్రీం' అను బీజమును చేర్చినపుడు శ్రీ రాజరాజేశ్వరి అను పేరు కలిగిన షోడశాక్షరీ మంత్రమగుచున్నదట. బీజము ఈ విద్యకు ప్రధానమైన దగుటచే ఈ విద్యకు శ్రీవిద్యయను పేరు కలిగినది." (లలితాత్రిశతీ భాష్య పీఠికనుండి) మఱియు బాలా, పంచదశాక్షరీ, షోడశాక్షరీ మంత్రములు శ్రీవిద్యయని చెప్పబడుచున్నవి.

కామకలావిలాసమను గ్రంథమున ఈ మంత్రము ఈ క్రింది విధముగా ఉన్నది.

శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఓం హ్రీం శ్రీం హల హ్రీం సౌః ఐం క్లీం హ్రీం శ్రీం = 16

ఈ మంత్రమును నాలుగు భాగములుగ విభజించి తాత్పర్యమును చెప్పిరి. మొదటిభాగమునందలి అయిదు బీజములు క్రమముగా ఆత్మ-అవ్యక్త-మహత్తత్త్వ-అహంకార అర్ధనారీశ్వరాత్మకమైనవి. రెండవభాగములోని మూడు బీజములు క్రమముగా పార్వతీపరమేశ్వర-వాణీహిరణ్యగర్భ - లక్ష్మీనారాయణాత్మకమైనవి. మూడవ భాగము-మూడు బీజములు పంచదశాక్షరీ మంత్రమునందలి 9, 10, 11 బీజత్రయములే గనుక వాటి అర్థమును ఇదివఱకే చెప్పియున్నందున దాని నిచట గ్రహింపదగును. నాల్గవ భాగము - అగ్నిసోమాత్మకమును పృథివ్యాది పంచభూతాత్మక ప్రతిబింబ రూపముచేత బ్రహ్మగ్రాహకమైన ఓ పరదేవతా! (శబలబ్రహ్మస్వరూపమాయాశక్తే!) నాకుగల అజ్ఞానమును పోగొట్టి బ్రహ్మపరోక్షవృత్తిని కలుగజేసి (నా నిజస్వరూపమును నాకు తెలిపి) నీ సాయుజ్యమును ఇచ్చి రక్షింపుమని ప్రార్థన-

ఈ మంత్రమును మఱియొక విధముగా చెప్పుదురు. ఎట్లన :-

"శ్రీం హ్రీం క్లీం ఐం సౌః, ఓం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః,
సౌః ఐం క్లీం హ్రీం శ్రీం- "

మహా షోడశాక్షరి

" శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఓం హ్రీం శ్రీం- క ఏ ఈ ల హ్రీం - హ స క హ ల హ్రీం- సకలహ్రీం- సౌః ఐం క్లీం హ్రీం శ్రీం"

ఇవి 28 వర్ణములు. ఇందులో పంచదశిలోని మూడు కూటములను మూడు వర్ణములుగా గ్రహించిన యెడల "షోడశాక్షరి" అగును- "అథ విద్యా హ్యష్టా వింశతి వర్ణవిశిష్టా" అని గౌడపాద సూత్రము గలదట. పరాస్వరూపము గల బాలా త్రిపురసుందరి తొమ్మిది సంవత్సరముల ప్రాయము కలది. పదునైదు సంవత్సరముల ప్రాయము గల లలితా త్రిపురసుందరి 'యోషిత్' సంజ్ఞ కలది. పదునాఱు సంవత్సరముల ప్రాయముగల రాజరాజేశ్వరీ త్రిపురసుందరి 'పతివ్రత'. ఈమె సదాశివుని అంకభాగమున ప్రౌఢాంగనాకృతిగా ఉన్నది.

-: జప విధానము :-

పై మంత్రములను శాస్త్రార్థమును బోధించుటకొఱకై చెప్పితిని. జపించుటకు కాదు. జపము చేయువారలకు **"ఏవం సకల మహా మంత్రాణాం ఋషి-ఛందో-దేవతా-బీజ- శక్తి కీలకా ఇతిషడంగ జ్ఞాన మావశ్యకం"** అని యున్నందునను.

"శ్లో॥ అవిదిత్వా ఋషిం ఛందో దైవతం యోగ మేవ చ।
యో ధ్యాపయేత్ జపే ద్వాపి పాపి జ్ఞాయతే తు సః"॥

తా॥ దేవతను, ఋషిని, ఛందస్సును, వినియోగమును తెలిసికొనక యేమంత్రమునైనను పఠించువాడును, జపము చేయువాడును పాపి యగును - అని ఉన్నందునను అట్లు తెలిసికొనియే జపము చేయవలయునని తాత్పర్యము.

కొన్ని శాస్త్రములు పైవిధముగా చెప్పియున్నను కొన్ని శాస్త్రముల (పురాణముల) యందు ఇవి యేవియు లేకనే అనగా ఋషి మొదలగునవి యెఱుగకనే భక్తితో కేవల మంత్రమునుమాత్రమే జపించినవారు

సిద్ధినొందుటయే గాక పరమేశ్వరి అనుగ్రహమునకు పాత్రులైనట్లు చెప్పబడియున్నది. ఉదా :- దేవీ భాగవతమునం దిట్లున్నది :- "వ్యాఘ్రాది సందర్శన భయంబున దదీయ బీజాక్షరంబగు నైకార్యంబు బిందురహితంబుగ నేని యెవ్వం డొక్కపరి యాదృచ్ఛికంబున నుచ్చరించు నవ్వాడు పూర్ణకాముండగు". **'యాదృచ్ఛికంబున'** అనినందులకు దృష్టాంతముగ ఒక కథ చెప్పబడినది. దాని సారాంశమిది :-

విద్యావిహీనుండును మూర్ఖుడును అగు సత్యవ్రతుండను బ్రాహ్మణ కుమారుడు వేటకాని బాణాఘాతముచే బాధపడుచు "ఐం"..... అని మూల్గుచు వచ్చిన అడవి పందిని చూచి ఆ శబ్దము మనమున నాటుకొనగా దానినే పలుమాఱు తలంచుచుండుటవలన కొంతకాలమునకు మహాకవి యయ్యెనట. "ఐం" అనునది సారస్వత బీజము. బ్రాహ్మణుడు బిందురహితముగ "ఐ" అని మాత్రమే జపించినను ఫలము లభించినదని సారాంశము. దేవీ భాగవతమునందే యీ యంశమును గుఱించి చెప్పబడిన మఱియొక కథ యిట్లున్నది :-

ఒక మునిపుత్రుడు ఒకనిని "క్లీబ" అని పిలువగా సుదర్శను డను నొక రాజపుత్రుడు దానిని విని అందులోని మొదటి అక్షరమగు "క్లీ" ప్రక్కన పూర్ణబిందువును చేర్చి "క్లీం" అని అనేక సంవత్సరములు జపింపగా "క్లీం" కామబీజ మగుటవలన దేవి గరుడవాహనారూఢయై సాక్షాత్కరించి అభీష్టముల నొసగెనట. ఆ సందర్భమున దేవీ భాగవతమునందు :-

ఉ॥ న్యాసము సున్న ఛందమును నట్టిది లేదిక ధ్యానమన్న స
న్న్యాసము సర్వశూన్యముగ నాతడదృష్ట మహోదయంబునన్
జేసి మనంబున్ నిలిపి శ్రీకరమై తగు కామబీజ మ
భ్యాసము చేసె నెన్నటికి నైనను విస్మృతి జెందకుండగన్.*

---

* పై రెండు దృష్టాంతములు పూజ్యులగు శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు ఆంధ్రీకరించిన దేవీభాగవతమునందలి తృతీయ స్కంధములోనివి.

వాల్మీకి మహర్షి 'రామ' 'రామ' అనలేక 'మరా' 'మరా' అని జపించి మహర్షి యయ్యెనని వినియున్నాము. ఇట్లున్నందున ఋషి, ఛందాదుల జ్ఞనము ఎందు కనిపించును.

అయినను గురుముఖమున శాస్త్రోక్తముగ మంత్రోపదేశమును పొందుటయే ఉత్తమ పద్ధతి.

-: దేవీ మంత్రశాస్త్రమునకు (శ్రీవిద్యకు) గురుపరంపర :-

సూ|| బీజత్రితయాధిపతీ స్వరీక్ష్య విద్యాం ప్రకాశయామాస|
ఏతైరోఘ త్రితయం సమనుగృహీతం గురుక్రమో విదితః||

(కా. క. వి. 53)

తా|| పరమాత్మ స్వరూప పరశివుడు ఈ విద్యను లోకానుగ్రహము కొఱకు లోకమున ప్రవర్తింప చేయగోరి తాను, "ఊర్ధ్వ దేవనాథ" నామమును ధరించి కామేశ్వరీ దేవి కుపదేశించి ఆమెకు "మిత్రేశ దేవనాథ" నామ మొసంగెను. ఈ దంపతులు సర్వానందమయ ఉడ్యాణ పీఠమున* పురాణదంపతులుగా ఉన్నారు.

ఈ చిద్విద్యాసంప్రదాయ రహస్యమును లోకమున విస్తరింపగోరి ఆ పరాభట్టారిక (కామేశ్వరీదేవి) షష్ఠీశదేవనాథ నామమును ధరించి

---

* ఋగ్వేదీయ సౌభాగ్య లక్ష్మ్యుపనిషత్తునందు ఈ పీఠములు శరీరమునందున్నట్లు చెప్పబడినది. అక్కడ చెప్పినదానిని సంగ్రహముగా చెప్పెదను :-

(1) మూలాధార చక్రమునందు కామరూప పీఠము.

(2) స్వాధిష్ఠాన చక్రమునందు ఉడ్యాణ పీఠము.

(3) ఆకాశ (విశుద్ధ) చక్రమునందు పూర్ణగిరి పీఠము.

(4) బ్రహ్మరంధ్ర నిర్వాణ (సహస్రార) చక్రమునందు జాలంధర పీఠము. కలవని చెప్పబడెను - ఇది సూక్ష్మవిషయము. అధ్యాత్మము- స్థూల విధముగా చెప్పవలయునన్న సతీదేవి దేహమును విష్ణుదేవుడు చక్రాయుధముచేత ఖండించినపుడు దేవి దేహభాగములు పడిన చోటులెల్ల దేవీ పీఠము లయ్యెను.

ఇవిగాక - శ్రీచక్రము మొదలగునవి వెండి బంగారు రేకులయందు వ్రాసి ఒక పీఠమునందు వానినుంచి పూజింతురు. అవియు పీఠములే.

జాలంధర పీఠస్థిత శక్తి బీజాత్మక జ్యేష్ఠ సంజ్ఞ గల ఉమామహేశ్వర ద్వంద్వమున కుపదేశించి వారికి ఊర్ధ్వదేవనాథ కామేశ్వరాంబా నామము లిడెను.

ఆ ఊర్ధ్వ దేవనాథ ద్వంద్వము **పూర్ణగిరి పీఠస్థిత** కామరాజ పీఠాధిపతులైన లక్ష్మీనారాయణుల కుపదేశించి వారికి షష్ఠీశ దేవనాథానంద వజ్రేశ్వర్యంబా నామముల నొసంగెను.

ఆ షష్ఠీశ దేవనాథానంద ద్వయము కామరూప పీఠస్థిత వాగ్భవ బీజాధిపతులైన వాణీ హిరణ్యగర్భుల కుపదేశించి వారికి మిత్రేశ దేవనాథానంద భగమాలిన్యంబా నామముల నొసగెను.

ఆ మిత్రేశ దేవనాథానంద ద్వంద్వమువలన దివ్యౌఘ, సిద్ధౌఘ, మాన వౌఘరూప గురుపరంపరగా ఉపదేశింపబడి యీ శ్రీవిద్య అవతరించి జగత్తున వ్యాపించినది. ఈ సంప్రదాయమువారు గురువువద్ద దీక్ష గైకొనునపుడు గురువు శిష్యునకు దీక్షానామ మిడు ఆచార మున్నది.

పర్యవసాన మేమనగా :- సర్వమును శక్తిమయమే. మహాకవి కాళిదాసు దేవిని "**సర్వయంత్రాత్మికే సర్వతంత్రాత్మికే సర్వముద్రాత్మికే సర్వశక్త్యాత్మికే సర్వచక్రాత్మికే సర్వవర్ణాత్మికే సర్వరూపే**" అని శ్యామలా దండకమున వచించిన ప్రకారము సర్వమును శక్తియే. శంకరభగవత్పాదులు దేవీ వేదపాఠస్తవమున దేవిని ఇట్లు స్తుతించిరి.

"యత్రైవ యత్రైవ మనో మదీయం
తత్రైవ తత్రైవ తవ స్వరూపమ్।
యత్రైవ యత్రైవ శిరో మదీయం
తత్రైవ తత్రైవ పదద్వయం తే"॥

తా॥ తల్లీ! ఎచ్చటెచ్చట నామనస్సు కలదో అచ్చటచ్చట నీస్వరూపమును, ఎచ్చటెచ్చట నా శిరస్సు కలదో అచ్చటచ్చట నీపాదద్వయమును కలవు - ఇంతటితో శాక్తేయము పూర్తిచేసితిని.

జిజ్ఞాసువు :- అయ్యా! నాకు కొన్ని సంశయములు కలవు. తరువాత వాటిని మీవలన తెలిసికొందును. షణ్మతములలో మూడు మతములు చెప్పితిరి. గాణాపత్య, కౌమార సౌరమతములు చెప్పవలసియున్నది. అనుగ్రహించి వాటిని సంగ్రహముగా వివరింతురని ప్రార్థన.

వేదాంతి :- నీ సంశయములను తరువాత తీర్చుటకు ప్రయత్నింతును. ప్రస్తుతము గాణాపత్యమును చెప్పెదను. సావధానుడవై వినుము.

(16) గాణాపత్యము

గణపతియే పరదైవ మనువారు గాణాపత్యులు. ఈ మతము శైవమతశాఖయే అయినను షణ్మతములలో ఒకటిగ చెప్పుటవలన దీనిని ప్రత్యేకించి చెప్పవలసి వచ్చినది. గణపతిని గుఱించి పురాణములయందు చెప్పినదానిని సంగ్రహముగ నిచ్చట చెప్పెదను.

ఒకనాడు పార్వతీదేవి స్నానమాచరించునపుడు శివుడు దేవీ అంతఃపురములోని కరుదెంచెను. ద్వారపాలకులు స్వామిని వారింపరైరి. దేవి సిగ్గుపడి యిట్టి సంఘటనలు మఱల జరుగకుండునట్లు చూడుడని చెలుల కాదేశించెను. "ద్వారమును రక్షించు ప్రమథు లందఱు స్వామిభక్తులగుట వలన స్వామికి అడ్డు చెప్పజాలరని, తమవాడొకడు ద్వార రక్షకుడుగా నుండిన నిట్టి సంఘటనలు ఇకముందు జరుగబోనివ" దేవిచెలులు దేవికి ఉపాయము చెప్పిరి. దేవియు అది మంచి"దని తలచెను.

ఒకనాడు దేవి స్నానము చేయునపుడు ఈ విషయము స్మరణకు వచ్చెను. శరీరము శుభ్రపరచుకొనుటకై యుంచిన నలుగుపిండితో సుందరమూర్తి యగు బొమ్మను చేసి దానికి ప్రాణప్రతిష్ఠ చేసెను. ఆ బాలుడు అమిత తేజస్వియు, మహాబలుడును అగునట్లు దేవి ఆశీర్వదించి "ద్వారరక్షకుడవై యుండి, నాయాజ్ఞ లేనిదే లోని కెవ్వరినీ రానీయవల"దని ఆదేశమిచ్చి ఆ బాలునకు ఒక యష్టి (చేతికఱ్ఱ లేక వేత్రము) ఇచ్చెను. ఆ బాలుడు ద్వారమును కాయుచుండెను.

అనాడు శివుడు పార్వతీదేవి మందిరమునకు వచ్చి లోన ప్రవేశింపబోవ వేత్రహస్తుడగు బాలుడు 'అంబ ఆజ్ఞ లేనిదే లోపల ప్రవేశింపరాద'ని శివుని అడ్డగించెను. ఎవడో ఒక అర్భకుడు శివుని అడ్డగించుట చూచి ప్రమథులు బాలుని నదలించి అవల పొమ్మనిరి. శివుడును బాలుని తొలగిపొమ్మని చెప్పెను. ఆ బాలుడు వినలేదు. ప్రమథులకును బాలునకును పోరు జరిగెను. వేత్రము (యష్టి)తో ప్రమథులను పెక్కండ్రను నేల పడగొట్టెను. అది గొప్ప యుద్ధముగా మారెను. విష్ణుదేవుడు మొదలగు దేవతలు శివుని పక్షమున పోరొనర్చుట కుదెంచిరి. ఈ సంగతి పార్వతీదేవికి తెలిసెను. తన కుమారునకు జయము కలుగు నట్లయిన శివునికి, దేవతలకును బుద్ధి చెప్పినట్లగునని ఆమె మిన్నకుండెను. శివు డీఅవమానమును భరింపలేక బాలుని శిరమును ఖండించెను.

పార్వతీదేవి జరిగిన సంగతి విని కుమారుని మరణమునకు దుఃఖించి శివానుచరులను, దేవతలను జయింప శక్తులను సృష్టించి యుద్ధమున కంపెను. పిమ్మట మునులు దేవిని శాంతింప జేయుటకై బాలుని బ్రతికింపుమని శివుని ప్రార్థించిరి. శివుడు తన అనుచరులను చూచి "మీరు ఉత్తరదిశగా పొండు. మొదట మీకే ప్రాణి కనబడిన దాని శిరమును ఖండించి తెం"డని పంపెను. వారట్లు పోవుచుండ వారికి మొదట గజమొకటి కనబడెను. దానిశిరమును నఱికి తెచ్చిరి. గజశిరమును బాలుని కంఠమునకు చేర్చిరి. శివుడు తన అమృతదృష్టిచే బాలుని బ్రతికించెను. దేవి సంతోషింప గజాననుని ప్రమథ గణములకు పతిగా చేసిరి. దేవతలు పెక్కు వరములు గణపతి కొసంగిరి. దేవతలందరిలో గణపతి ప్రథమపూజార్హుడనియు, ఏ కార్యము చేయదలచినను గణపతిని తొలుత పూజింపరేని ఆ కార్యములకు విఘ్నము కలుగుననియు శివుడు గణపతికి వరమొసగెను. అంతటినుండి గజాననుడు "విఘ్నపతి", "విఘ్నేశ్వరుడు" అను నామముల పిలువబడెను.- ఇది శివపురాణమునందు చెప్పిన విధము.

గణపతి జన్మవృత్తాంతము **వరాహపురాణమున** ఈ క్రింది విధముగ చెప్పబడినది :- ఒకప్పుడు దేవతలు శివునికడ కేతెంచి దుర్మార్గులగు రాక్షసులు చేయు కార్యములు చెడకుండ కొనసాగుచుండుట వలన వారు దేవతలను ధిక్కరించి బలవంతులైరని వారి కార్యములకు విఘ్నమాపాదించు విధమును చింతింపవలెనని శివుని ప్రార్థించిరి. శివుడాప్రార్థనను మన్నించి ప్రక్కనున్న పార్వతీదేవిని చూచెను. జ్ఞానశక్తియగు అద్దేవియొక్క అనన్యసామాన్య సౌందర్యమునందు పంచభూతముల సాదృశ్యమును చూచి చిత్తమున చింతించి ఆనందించెను. అప్పుడు శివుని ముఖమున చిరునవ్వు చిందులాడుచుండ ఆ స్వామి ముఖమునుండి సహస్రకోటి మన్మథ సదృశాకారుడగు కుమారు డుదయించెను. ఆ కుమారుని అద్భుత సౌందర్యమును చూచి అచ్చట నున్న దేవాంగనలును, పార్వతీదేవి చెలికత్తియలును, మోహమును చెంది కనురెప్ప వాల్చక చూడసాగిరి. పరమ పతివ్రతా తిలకమగు పార్వతి సహితము ఆ బాలుని సౌందర్యమును ఱెప్పవాల్చక చూచెను. ఇది యంతయును చూచిన శివుడు ఉగ్రుడై ఆ కుమారుని నిట్లు శపించెను.

"ఉ|| ఓరి గజాననంబును మహోదరమున్ భుజగోపవీతమున్
వారక తాల్చు మంచు గత వత్సలతన్ శపియింప దద్విధా
కారముతోడ నిల్చె మును కామ వికార సమేతలై తనుం
గూరిమి జూచు నిర్జర చకోర విలోచనలెల్ల రోయగన్."
(అం. వ. పు.)

ఆ కారణముగ గజాననము, లంబోదరము, పాముజన్నిదము, గణపతికి కలిగెను. శంకరునకు అంతటితో కోపమాగలేదు. శివుని శరీరమున చెమటపట్టెను, ఆ చెమటబిందువులనుండి అనేక గణపతులు శూలాయుధ హస్తులు పుట్టిరి. అంత కోపము శాంతింప శివుడు గణపతిని చేరదీసి వాత్సల్యమున గజానను లందరికిని అధిపతిని చేసి, అభిషేకించి కరుణతో నిట్లు వరమిచ్చెను.

గీ|| "యజ్ఞదేవాది సకల కార్యముల నిన్ను
మొదల బూజించు నిర్మలాత్ములకు ఫలము
గలుగ జేయుము నిను గొల్వ దలపులేని
ఖలుల కృత్యములకు విఘ్నములు ఘటింపు"
(*ఆం. వరాహపురాణము షష్ఠాశ్వాసము)

గణపతి పార్వతీదేవీ గర్భసంజాతుడని వేఱొకవిధమగు కథ గలదు. పార్వతీ పరమేశ్వరులు రజతాద్రిసానువులయందు విహరించు చుండ ఏనుగుల గుంపు ఒక హ్రదమున జలక్రీడ లాడుచుండుటయు, వాటిలో ఆడ, మగ జతలు మన్మథ క్రీడలు జరుపుచుండుటయు, చూచిన పార్వతీదేవి తానును అట్లుండవలెనని మనస్సున తలచి భర్త ముఖమును వీక్షించెను. శివుడామె మనోగతము నెఱిగి సమ్మతించెను. ఇరువురు గజదంపతులై దాంపత్య క్రీడ సలుప దేవీగర్భమున గణపతి జన్మించెనని నన్నెచోడ దేవకవి కుమార సంభవమున గలదు. దీనికి మూలమేమో తెలియదు.

విశ్వరూప ప్రజాపతి తన పుత్రికలగు సిద్ధి, బుద్ధి అనువారిరువురను గణపతికి నిచ్చి వివాహ మొనరించెను. గణపతికి సిద్ధివలన 'క్షేముడు', బుద్ధివలన 'లాభుడు' అను పుత్రులు కలిగిరట. మూషికము గణపతికి వాహనము.

సిద్ధి, బుద్ధి, క్షేముడు, లాభుడు అను నీ నామములు వ్యక్తులకు సంబంధించినవి కావని వాటి అర్థమును పరిశీలించిన బోధపడును. మరేమనగా:- నిర్విఘ్నముగ కార్యము సిద్ధించుటకు గణపతి అనుగ్రహమున్న కార్యమును ఫలవంతము చేయ సమర్థమగు బుద్ధి కలుగును. అట్టి బుద్ధికలవారు చేయు కార్యములు ఫలించును. (అనగా ఫలము సిద్ధించును) కనుక బుద్ధియు, సిద్ధియు గణపతికి భార్యలని చెప్పిరి. ఎవరికి కార్యానుకూలమగు బుద్ధియు, కార్యసిద్ధియు కలుగునో

* వరాహపురాణము - నందిమల్లన్న, ఘంట సింగయ్య అను జంట కవులచే ఆంధ్రీకరింపబడినది.

అట్టి వారికి లాభము క్షేమము కలుగుట తథ్యము. ఇట్లు బుద్ధియు, సిద్ధియు గణపతికి భార్యలు (సహధర్మచారిణులు) అయినప్పుడు వారికి కలుగు సంతానము (ఫలము) లాభము, క్షేమము అనుట సహజమే. ఈ విధముగ గణపతి నుపాసించువారు లాభక్షేమములు పొందుదురను తత్త్వమునకు పైవిధముగా రూపకల్పన చేయబడెనే గాని గణపతియు, కార్తికేయుడును, ఇప్పటికిని బాల బ్రహ్మచారులే యని పెద్దల మతము.

ఈ మతము దక్షిణ భారతమున విస్తరించి యుండినది. శివాలయముల యందు గణపతి విగ్రహమును ప్రతిష్ఠించుట సహజమే. ఈ మతావలంబులు గణపతికి ప్రత్యేక ఆలయములు నిర్మించి అందు గణపతి విగ్రహములను ప్రతిష్ఠింతురు. అట్టివి చిత్తూరు జిల్లానుండి దక్షిణమున పోనుపోను ఎక్కువగ కనబడును.

జిజ్ఞాసువు :- అయ్యా! గణపతిని సృష్టించిన శివుడు దేవుడగునుగాని ఆయన పుత్రుడు జన్మము కలవాడు పరతత్త్వ మెట్లగును?

వేదాంతి :- ఈ ప్రశ్నమునకు గాణాపత్యులు చెప్పు సమాధాన మేమన :- శ్రీరాముని దేవు డనుచున్నారు కాని దశరథ మహారాజును పూజించుట లేదు గదా! శ్రీకృష్ణుని దేవుడని పూజింతురుగాని వసుదేవుని పూజించుట లేదు గదా! అట్లే మేమును గణపతిని పరతత్త్వమని పూజింతు మందురు. విఘ్నేశ్వరస్వామి భాద్రపదమాస శుక్ల చవితినాడు అవతరించినందున ఆ దినము ఆయనను గాణాపత్యులే గాక హిందువు లందఱు పూజింతురు. ఆయన శివుని అంశమే కనుక శివుడని పూజించుటలో తప్పు లేదు. ముఖ్యముగా గణపతియు, కార్తకేయుడు శీఘ్రవరప్రదాతలని కొందఱు వారిని ఉపాసింతురు.

గణపతిని ఆఱువిధములుగ పూజింతురు గనుక గాణాపత్యుల యందు ఆఱుశాఖ లేర్పడినవి. (1) మహా గణపతి, (2) హరిద్రా గణపతి, (3) ఉచ్ఛిష్ట గణపతి, (4) నవనీత గణపతి (5) స్వర్ణ

గణపతి, (6) సంతాన గణపతి. ఈ ఆఱువిధములలో ఉచ్ఛిష్ట గణపతిని ఉపాసించు వారు వామాచారులు. వీరందరు గణపతి ముక్తిప్రదాత యని గణపతి పరతత్త్వమని శ్రుతులు చెప్పుచున్నవని అందురు. 'శంకర విజయము' నందు శ్రీ శంకరాచార్యులవారు వీరిని వాదమున ఓడించినట్లు కలదు.

గాణాపత్యుల వాదమునకు ఆధారవేమన; త్రిపురాసుర సంహారమునకు ఉద్యుక్తుడగు శివుడు ప్రథమమున గణపతిని పూజించెను. కనుక గణపతియే పరదైవము, శివుడు కాడు. శివుడైనచో గణపతి నేల పూజించె నందురు.

వరాహపురాణము (1) కఠినోరగబద్ధి, (2) పినాక హస్త, (3) కుఠార స్సృణిపాశ, (4) టంక గుంభితహస్త అని గణపతిని వర్ణించినది.

జిజ్ఞాసువు :- త్రిపురాసుర సంహార కార్యారంభమున శివుడు గణపతి నేల పూజించెను ?

వేదాంతి :- ఈ ప్రశ్నకు సమాధానము సులభమే. అథర్వణీయ గణపత్యుపనిత్తున గణపతిని సాక్షాత్పర బ్రహ్మస్వరూపునిగా చెప్పబడినది.

"త్వం వాఙ్మయ స్త్వం చిన్మయః త్వ మానందమయ స్త్వం బ్రహ్మ మయః త్వం సచ్చిదానందా ద్వితీయో౽ సి, త్వం ప్రత్యక్షం బ్రహ్మాసి, త్వం జ్ఞానమయో విజ్ఞాన మయో౽ సి," "సర్వం జగదిదం త్వత్తో జాయతే సర్వం జగదిదం త త్తస్తిష్ఠతి, సర్వం జగదిదం త్వయి లయ మేష్యతి."

తా|| నీవే సర్వశబ్దస్వరూపము, నీవే చిన్మయుడవు, నీవే ఆనందమయుడవు, నీవే బ్రహ్మమయుడవు, నీవే సచ్చిదానందాద్వితీయుడవు, నీవే ప్రత్యక్ష బ్రహ్మమై యున్నావు, నీవు జ్ఞానమయుడవు విజ్ఞానమయుడవు నయి యున్నావు, సమస్తమైన యీ జగత్తు నీయందే పుట్టియున్నది. సమస్తమైన యీ జగత్తు నీయందే నిలిచి యున్నది. సమస్తమైన యీ జగత్తు నీయందే లయించుచున్నది.

శ్రీగణేశగీత అను గీతను వరేణ్యుడను రాజునకు విఘ్నేశ్వరుడు చెప్పినట్లు కలదు. ఆ గణేశ గీత చాలావఱకు భగవద్గీతను పోలియున్నది. అందు 11 అధ్యాయములలో 414 శ్లోకములు గలవు.

అందులో సర్వేశ్వరుడగు గణేశుడే బ్రహ్మ, విష్ణు, శివులను సృష్టించి సృష్టి స్థితి లయ కర్తలుగ నియమించినట్లు చెప్పబడినది.

శ్లో॥ "అహమేవాఖిలం విశ్వం సృజామి విసృజామి చ,।
ఔషధీస్తేజసా సర్వా విశ్వం చాప్యాయయామ్యహమ్"॥
(గ. గీ. 9-37)

తా॥ నేనే సమస్త విశ్వమును సృష్టించుచున్నాను. మఱియు నాశము చేయుచున్నాను. నా తేజస్సుచే సమస్త ఓషధులను, ప్రపంచమును తృప్తిగావించుచున్నాను - అని యుండుటవలనను శివుడు గణపతికి తాను ఇచ్చిన వరమును లోకము పాటించుటకు తానే మార్గదర్శియై తొలుత గణపతిని పూజించెను. అది అట్లుండ నిండు. త్రిపురాసుర కథయందలి నిగూఢార్థము వేఱు. దాని రహస్యము తెలిసిన వారు అట్లు ప్రశ్నించరు. దానిని సంగ్రహముగ చెప్పెదను.

త్రిపురధ్వంస కథయందలి నిగూఢార్థము :- ఈ కథ మహాభారతమునందలి కర్ణపర్వమునను; పద్మ, శివ, శ్రీమద్భాగవత పురాణాదులయందును కలదు. అన్నింటియందును స్వల్పములైన మార్పులతో ఒక్కవిధముగనే చెప్పబడినది. త్రిపురములను దగ్ధమొనర్చుటకు శివుడు చేసిన సన్నాహము గమనింతము. భూమి - రథము, ఆ రథమునకు సూర్యచంద్రులు - ఇరువురు రెండు చక్రములు. రథమునకు పూన్చిన అశ్వములు వేదములు. రథచోదకుడు (సారథి) - బ్రహ్మదేవుడు. మేరుపర్వతము (మందరమని వేఱొకచోట) - విల్లు. వాసుకి యను సర్పరాజు వింటినారి. విష్ణుదేవుడు - బాణము. ఇట్టి పరికరములతో శివుడు రథముపై నెక్కి, తదేక లక్ష్యంబు గలిగి స్థాణువుగ సహస్ర వత్సరము లుండెనని చెప్పిరి.

దీని తాత్పర్యము :- త్రిపురములు ఆకాశమున తిరుగుచున్నవట. సమస్త ప్రాణికోటులు ఆకాశమునందే తిరుగుచున్నవి గదా! మనము మన పాదములను భూమియందు మోపి ఆకసమునందే తిరుగుచున్నాము. ఆ త్రిపురములు వేఱు వేఱుగ ఉన్నప్పుడు వాటిని ధ్వంసము చేయుటకు వీలులేదు. అనగా మనస్సు ఏకాగ్రమయి యింద్రియ ప్రవృత్తు లన్నియు శమించవలెను. ధ్యాననిష్ఠుడు కావలెను. అదియే త్రిపురములు ఒకచోటికి చేరుట. సూర్యచంద్రులు రథచక్రము లనగా ఇడాపింగళానాడులు (కుడి, యెడమ నాసికారంధ్రములనుండి వెడలు వాయువులు). విష్ణువు బాణమనగా విష్ణుదేవునియందు భక్తిని తదేక లక్ష్యముగ ఉంచుట. శరీరత్రయమును వేఱుచేసి ఆత్మను దర్శించిన జీవుడే శివుడగు ననుటకు ప్రమాణము.

జీవశ్శివ శ్శివో జీవ స్సజీవః కేవల శ్శివః
తుషేణ బద్ధో వ్రీహి స్స్యాత్తుషా భావే తు తండులః॥
ఏవం బద్ధ స్తథా జీవః కర్మనాశే సదాశివః
పాశబద్ధ స్తథా జీవః పాశముక్త స్సదా శివః॥ (స్కందోపనిషత్తు)

వడ్లగింజపైన పొట్టుతీసి వేసిన బియ్యపుగింజ యగును. దేహత్రయమును విడదీసిన జీవుడు శివుడగును. పాశబంధమున్న శివుడు జీవు డనబడును. పాశచ్ఛేదమైన జీవుడే శివుడనబడును. ఇది శ్రుతి తాత్పర్యము.

దీనికి మొదట మూలాధార చక్రమున నున్న కుండలినిని మేల్కొల్పి సుషుమ్నద్వారా సహస్రారము చేర్పవలయును. అనగా : శక్తిని శివునితో చేర్చవలయును. దీనిని మూలాధారమునుండియే ప్రయత్నింపవలయును. మూలాధారము పృథ్వీతత్త్వము. అది గణపతికి స్థానము. కనుక కుండలినిని మేల్కొల్పు ప్రథమ ప్రయత్నమే గణపతిపూజ. కుండలినిని మేల్కొల్పక పాశబంధము కాదు. త్రిపురధ్వంసము కానేరదు. దానినే లోకులకు అర్థమగునట్లు అలంకారముగ శివుడు త్రిపురసంహార కార్యారంభమున గణపతిని పూజించెననిరి. శివుని యుద్ధసాధనములను గమనించిన నీ యర్థము స్పష్టము.

రథముగాని రథము, బాణముకాని బాణము, ఇట్టి సాధనములు కావలయునని గ్రంథములయందు కలదు. ఆ కథయందు శివుని ఆది రథికుడని చెప్పియున్నందున శివుడే మొదట ఈ యోగమును కనుగొన్నాడని అర్థమగు చున్నది. శివుని త్రిపురధ్వంసి యని యీ కథయందు రూపకాలంకారముగా చెప్పబడినది.

ఏ మహాత్ముడు స్థూల సూక్ష్మ కారణ శరీరములయందు అభిమానమును త్యజించుటలో అతడు జీవభావమును త్యజించి శివుడగును. అతడు పరమశాంతుడు, నిర్వైరుడు, మౌనియగును. ఈ యర్థమునే కథయందు శివుడు త్రిపుర ధ్వంసియైన పిమ్మట త్రిపురాసుర సంహార కాలమున ఉన్న ఉగ్రమూర్తిని త్యజించిన పరమశాంతుడు, బాలుడు మూర్తీభవించిన జ్ఞానరూపమా యన్నట్లు సుందరరూపమును పొంది బాండీర వనమునందున్న వటవృక్షమూలమున పద్మాసనమున ఉపవిష్టుడై యుండ దేవతలు, సిద్ధులు, మునులును ఆ దేవుని పరివేష్టించి సేవించి బ్రహ్మస్వరూపమును గూర్చి బోధింపుమని ప్రార్థింప మౌనముద్రతో ఆ దేవుడు తత్త్వమును వ్యాఖ్యానించె నందురు. అప్పుడు శివుడే దక్షిణామూర్తి నామమున పిలువబడెను. ఉపనిషత్తుల యందు దక్షిణామూర్త్యుపనిషత్తు కలదు. అందు మేధాదక్షిణామూర్తి ఉపాసన చెప్పబడియున్నది. శ్రీశంకరాచార్యుల వారు శ్రీ దక్షిణామూర్తిని స్తుతించిరి.

గణపతి రూపమును గణపత్యుపనిషత్తు ఇట్లు వర్ణించి స్తుతించినది.

ఏకదంతం చతుర్హస్తం బిభ్రాణం పాశమంకుశమ్
అభయం వరదం హస్తై ర్దధానం మూషికధ్వజమ్।
రక్తలంబోదరం శూర్ప సుకర్ణం రక్తవాసనమ్
రక్తగంధానులిప్తాంగం రక్తపుష్పై స్సుపూజితమ్.॥

(17) కౌమారము

శివుని కుమారుడగు కుమారస్వామిని పరతత్త్వమని [illegible] యని ఉపాసించు వారి మతము కౌమార మందురు. [illegible]

గణపతికి వలెనే జన్మమున్నది. కుమారస్వామి జన్మకథనము పురాణాదులయందు ఈ క్రింది విధముగ చెప్పబడినది.

తారకుడను రాక్షసుడొకడు దేవతలను, మానవులను బాధించుచుండ ఆ సంగతిని దేవతలు బ్రహ్మదేవునితో మొఱపెట్టుకొనిరి. శివుని వీర్యమునకు పుట్టిన వాడు తారకాసురుని చంపగలడు గాని తక్కొరులచే తారకుడు మృతుడు కాడని బ్రహ్మదేవుడు చెప్పెను.

బ్రహ్మాది దేవతలు శివుని కడకేగి పార్వతీదేవివలన పుత్రుని బడయుమని ప్రార్థించిరి. వారి ప్రార్థనను మన్నించి శివుడు దేవీ మందిరమున కేగి దేవితో క్రీడించుచుండెను. అట్లు వేయి దివ్యసంవత్సరములు గడిచెనట. శివుడు ఏకాంతమున నుండి దర్శన మివ్వనందులకు దేవతలు దుఃఖించి శివుని బిగ్గరగ ప్రార్థించిరి. దేవితో సంభోగ సుఖము ననుభవించుచున్న శివుడు రతిక్రీడను మాని దేవతలకు దర్శన మిచ్చెను. దేవతలు పుత్రుని ప్రసాదింపు మనిరి. ఆ సమయమున శివుని వీర్యము ఆయన శిరమునందుండి జారి భూమిపై పడెను. దానిని ఎవరైనను భరింపుడని శివుడాజ్ఞాపించెను. దేవతల ప్రేరణచే అగ్నిదేవుడు పావురమై రుద్రవీర్యమును కొంతవఱకు పానముచేసెను. కాని దానిని భరింపలేకపోయెను. దేవతలు కొంత గ్రహించి భరింపజాలక వెడలగ్రక్కిరి. పార్వతీదేవి తనకు పుత్రలాభము కలుగకుండ చేసిన దేవతలు సంతానహీను లగుదురు గాక యని (దేవతల) శపించెను. ఈ విధముగ శివపురాణమున గలదు-

మహాభారతమునందలి అరణ్య(వన) పర్వమునందును, శల్యపర్వమునందును కుమారస్వామి కథ కలదు. అందు పైన చెప్పిన కథ అంతయు వదలివేయబడినది. ఆరణ్యాపర్వమున "రుద్రుండు మున్ను నిజవీర్యంబు వహ్నియందు సంగ్రహించి" అని మాత్రమే కలదు శల్యపర్వము నందును ఇచ్చటి నుండియే ప్రారంభింపబడినది. రెండుపర్వములందును స్వాహాదేవి ఋషిపత్నుల రూపమున వచ్చిన కథ లేదు.

సప్త ఋషులు ఆహవనీయమను అగ్నిహోత్రముఖమున ఆహుతు లిడుచుండ ఋషిపత్నులు వారి భర్తలను సేవించుచుండిరి. అగ్నిదేవుడు ఋషిపత్నుల సౌందర్యమునకు మోహితుడై వారియందలి విరహముచే కృశించిపోవుచు మహారణ్యమున శరీరంబు దిగవిడువ యత్నించెను.* అగ్ని దేవుని ఆంతర్య మెఱిగిన మహాపతివ్రతయు, అగ్నిదేవుని భార్యయు నగు స్వాహాదేవి భర్తకు ప్రియము చేయగోరి ఒక్కొక్క దినము ఒక్కొక్క ఋషిపత్ని రూపమును ధరించి భర్తను తృప్తిపరచి ఆయనయందున్న శివతేజమును గరుడియై శ్వేతపర్వతమునకు పోయి అచట శరవణస్తంభ సంవృతమైన (తెల్లువనమునందు కాడలచే చుట్టబడిన) బంగారు కుండయందు తన భర్తశుక్లమును సంగ్రహించుచుండెను.

శివపురాణమున ఇట్లున్నది :- స్వాహాదేవి ఆఱుసారులు తెచ్చి శ్వేతాద్రి యందుంచిన భర్త వీర్యమును శ్వేతాద్రియు ఆ వేడిమిని భరింపలేక వాయుసహాయమున గంగయందు బడద్రోసెను. గంగయు భరింపజాలక శరవణము నందుంచెను. ఆ తెల్లువనమున కుమారస్వామి అవతరించెను. స్వాహాదేవి ఆఱుదినములు అర్గురు ఋషిపత్నుల రూపమును గైకొనెను. అరుంధతీ రూపమును అలవరించుకొన శక్తిలేని దయ్యెను.

ఇట్లు ఆఱుమారులు చేర్చబడిన అగ్ని తేజము వలన అయిదు దినములలో ఆఱు తలలును పండ్రెండు భుజములును గల కుమారుడు కలిగెను. కుమారస్వామి జన్మించినపుడు ఒక శిరము, రెండు హస్తములు మాత్రమే యుండినట్లును, కృత్తికలు ఆఱుగురు ఆ బాలు నెత్తుకొనగా వారికి స్తన్యము చేసిన ఆ బాలుడు ఆననంబు లాఱును దాల్చి అఱ్గుర చనుబాలను ఒకసారియే త్రాగెననియు శల్యపర్వమున కలదు.

ఈ విధముగ అవతరించిన కుమారస్వామిని దేవత లెల్లరు వచ్చి దర్శించిరి. పార్వతీ పరమేశ్వరులు వచ్చిరి. శివుడు కుమారుని ఆలింగనము

---

*(అంగీరసు డను మహర్షియే దేవతయై అగ్నిదేవు డయినట్లు) "త్వమగ్నే ప్రథమో అంగిరా ఋషిర్దేవో నా మభవః" ఋగ్వేదము 7 వ అధ్యాయము, 31వ సూక్తము చెప్పినది.

చేసికొని ప్రమథులతో కలసి భద్రపటమునకు తోడ్కొనిపోయెను. ఇంద్రుడు కుమారస్వామియొక్క జననవృత్తాంత మెఱుగక ఆయనతో యుద్ధము చేసి పరాజితుడై కుమారస్వామిని దేవసేన (దేవతల సైన్యమున)కు సేనాధిపతిగ అభిషేకించెను. కుమారస్వామి మహిషుడను రాక్షసునితో యుద్ధము చేసి వానిని సంహరించెను. శ్వేతాద్రి శిఖరమును కూల్చెను. క్రౌంచపర్వతమును భేదించెను. తారకాసురాదుల సంహరించెను.

శివుని శుక్లము స్కందమై యవతరించుటచే కుమారునకు స్కందు డనియును, అగ్నికి జనించుటవలన గాంగేయు డనియు, శరవణ స్థలమున జన్మించుటవలన శరజన్ము డనియు, దేవసైన్యమునకు నాయకు డగుటవలన దేవసేనాని యనియు, తన చమూరక్షణాధ్యు డగుటవలన విశాఖుడనియు కుమారస్వామికి నామములు కలిగెను.

వసిష్ఠమహర్షి తప్ప తక్కిన ఋషు లార్గురు తమ భార్యలు అగ్ని దేవునితో వ్యభిచరించిరని వారిని పరిత్యజించిరి. ఋషిపత్నులు కుమారుని కడకేగి తమదురవస్థను నెఱిగించి తమ్ము తల్లులుగా స్వీకరింపుమని ప్రార్థించిరి. కుమారస్వామి వారి ప్రార్థనను మన్నించి వారిని తల్లులుగ గైకొని వారిని కృత్తికలుగ జేసి నక్షత్రపథమున నిలిపెను. స్వాహాదేవి కుమారునితో తన భర్త తన్నొల్లడని యిది మొదలు భర్త తన్నెడబాసి యుండకుండు లాగున వర మిమ్మని కోరెను. కుమారస్వామియు అగ్నియం దాహుతు లిడువారు "స్వాహా"అని నీ నామ ముచ్చరించి అగ్నియం దాహుతు లిడవలయునని వరంబొసంగెను. అందువలన నీకు అగ్ని దేవునితో నెడబాటు ఉండదని ఆమె నోదార్చెను.

అరిష్టనేమి అను ప్రజాపతికి దైత్యసేన, దేవసేన యను నిరువురు పుత్రిక లుండిరి. అందు దైత్యసేన ఒక దైత్యుని వరించి వానిని వివాహమాడెను. దేవసేనను కుమారస్వామి వివాహ మాడినట్లు మహాభారతమునను, శివపురాణమునను కలదు.ఒక భిల్లుని పుత్రిక 'వల్లి'అను కన్యను సహితము వివాహ మాడినట్లు గలదు. వల్లీదేవి వివాహకథనము మహాభారతమున లేదు. గజానన స్కందు లిరువురు

ఇప్పటికిని బాలురే యని వారికి వివాహము కాలేదని కొంద అందురు. సౌందర్యలహరి 73వ శ్లోకమునందు-

"పిబంతే తౌ యస్మాదవిదిత వధూ సంగరసికౌ।
కుమారావద్యాపి ద్విరద వదన క్రౌంచ దళనౌ॥"

తా॥ దేవియొక్క స్తన్యపానమును ఇప్పటికిని చేయుచుండు వారగుటచే కుమార, గణపతు లిరువురు యౌవనము పొడసూపని వారై తెలియని స్త్రీ సంగత్యము కలవారై పసిబాలురవలెనే ఉన్నారని భావము.

జిజ్ఞాసువు :- అయ్యా! స్కందుని జననము ఇట్లు భిన్నముగ చెప్పిరి గదా? యిందేది నిజము?

వేదాంతి :- ప్రథమ మన్వంతరమున కుమారస్వామి శివుని మానసపుత్రుడై పుట్టెను. ఆ కథను వరాహపురాణము చెప్పినది. ఆ యవతారమున స్కందునకు పుంజుకోడి వాహనము. రెండవ మన్వంతరమున శివపురాణమున చెప్పినట్లు జరిగినది. ఈ విషయము వరాహపురాణము నందే స్పష్టము చేయబడినది.

ఈ కథయందలి తత్త్వమేమన :- స్కందుడే సుబ్రహ్మణ్యమని యందురు. కొందఱు బ్రహ్మమానస పుత్రుడగు సనత్కుమార మహర్షి యే యీ స్కందు డందురు. దైత్యసేన దైత్యుని వరించిన దనగా :- అసురసంపద అసురలది. దైవసంపద దేవతలది. కనుక దేవసేన (దైవసంపద) భగవంతుని వరించినది. స్కందుడు మృత్యుంజయుడు. అనగా : బ్రహ్మవిదుడు. పరబ్రహ్మస్వరూపుడు. ప్రకృతి యందుండి మహాతత్త్వము కలిగినది. అది బుద్ధి, బుద్ధికి జ్ఞానమను పేరున్నది. సృష్టిక్రమమున ఈ లోకమున బుద్ధికి సర్పరూపము కడపటిది.

కుమారస్వామి రూపము చిత్రపటముల యందును, శిల్పముల యందును చూచియున్నాము. అందు ఒక సర్పమును కాళ్ళతో త్రొక్కిపట్టిన నెమలిపై షణ్ముఖుడు ఆసీనుడై యున్నట్లు చూచుచుందుము. దాని

అర్థమేమన- జీవరూపమున సర్పమున్నది. దానికి మృత్యువు మయూరము. నెమలి పామును చంపును. నెమలిని చూచిన పాము పరుగిడిపోవును. కనుక సర్పమునకు నెమలి మృత్యువు. ఏప్రాణి తన మృత్యువును జయించునో ఆజీవుడు శివుడగును. అనగా :- మృత్యుంజయు డగును. నెమలి కాళ్ళక్రింద నున్న సర్పమే తన మృత్యువగు నెమలిపై కూర్చున్నదనగా- మృత్యువును జయించినదని అర్థము. కనుక స్కందుడు సుబ్రహ్మణ్యము అని, శివుడని, మృత్యుంజయుడని ప్రసిద్ధి. పుంజుకోడి వాహనమని కొన్ని గ్రంథములయందు చెప్పబడినది. అది వాహనము కాదు. వరుణదేవుడు కోడిపుంజును ఇచ్చినట్లు శల్యపర్వమునందు కలదు.

గణపతి మూషికవాహనుడు. భైరవుని వాహనము కుక్క. శునకమునకు భైరవుడని నామమున్నది. ఈ దేవతలకు రథములు, గజములు లేకపోయెనా? ఈ క్షుద్రజంతువుల నేల వాహనములుగ చేసికొనిరి? అనిన : ఆయా జంతువులు ఆ దేవతల సృష్టి, లేక, దేవతలే తిరగ్జంతువులు వృక్షములు, లతలు మొదలగు సృష్టిని చేసిరనిగాని ఆయా రూపములు పొందిరనిగాని మనము భావింపవచ్చును. ఆకాశమునందలి నక్షత్రములకు ఆయా దేవతానామముల నిడిరి. ఏదేవతకు ఏది వాహనమో ఆదేవత కది కేతనము. హిందూమతమున ఏప్రాణినిగాని నీచముగా చూచు ఆచారము లేదు. గాడిద నీచమైనజంతు వందురు. అశ్వినీదేవతలు గాడిదలు పూన్చిన రథముపై నెక్కివచ్చెడివారని ఋగ్వేదమున కలదు. అనగా అశ్వినులు గార్దభవాహనులని అర్థము.

స్కందుడే సనత్కుమార ఋషి యని ఛాందోగ్యమునందు "భగవాన్ సనత్కుమారస్తగం స్కందేత్యాచక్షతే తగం స్కంద ఇత్యాచక్షతే"

(ఛాం. 7 ప్ర. 26 వ ఖండము 2వ సం.)

మహాభారతము అనుశాసనిక పర్వమునందు హరుడు తత్త్వజ్ఞానార్థియై సనత్కుమారుని కడకేగి, ఆయనవలన ఆత్మతత్త్వము నెఱింగెనని చెప్పబడినది. స్కందు నుపాసించిన భోగ మోక్షములు కలుగునందురు.

జిజ్ఞాసువు :- అయ్యా! సనత్కుమార మహర్షియే కుమారస్వామి యని భావింపవచ్చునా?

వేదాంతి :- సనత్కుమారమహర్షిని స్కందుడని ఛాందోగ్యశ్రుతి చెప్పినట్లు చెప్పితిని. ఆ వాక్యమునకు వేఱొక అర్థమేమైన ఉన్నచో సనత్కుమారమహర్షి స్కందుడు కాడని చెప్పుటకు సంశయ ముండదు.

మహాభారతమునందలి అనుశాసనిక పర్వమున నిట్లున్నది :- బ్రహ్మదేవునకు సనక, సనంద, సనత్కుమార, సనత్సుజాత, వసిష్ఠ, రుద్రులు- అనుఆఱుగురు బ్రహ్మమానస పుత్రులని, ఇందులో సనత్సుజాత మహర్షి బొటనవ్రేలితో సమానమగు శరీరపరిమాణము కలవాడును, ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రమువంటి తేజస్సు గలవాడును అని చెప్పబడినది. మహాభారతాంతర్గత ఉద్యోగపర్వము నందు సనత్సుజాత మహర్షి ధృతరాష్ట్రునకు తత్త్వోపదేశమును (సనత్సుజాతీయమును) చెప్పినట్లు కలదు. అచట నీమహర్షిని అంగుష్ఠమాత్ర పరిమాణము గల శరీరము కలవాడని చెప్పియుండలేదు. ఆ మహర్షి బ్రహ్మలోక నివాసియని విదురుని ప్రార్థన మన్నించి బ్రహ్మలోకమునుండి హస్తినాపురమున సాక్షాత్కరించెనని కలదు. అట్లు వచ్చిన మహర్షితో విదురు డిట్లనెను :-

"శూద్రయోనావహం జాతో ఽతో ఽ నాన్యద్వక్తు ముత్సహే।
కుమార స్యతు యా బుద్ధివేద తాం శాశ్వతీ మహం॥" (స. 1-5)

ఇచట మహర్షిని "కుమార" అని సంబోధన కలదు. "సనత్సుజాతీయము" నందే ధృతరాష్ట్రుడు "కుమార" అని సంబోధించినట్లు కలదు.

మహాభారతాంతర్గత అనుశాసనికపర్వమున హర (రుద్ర) సనత్కుమార సంవాదమను ఇతిహాసము కలదు. అచట రుద్రుడు సనత్కుమార మహర్షిని తమ్ముడా! అని సంబోధించినట్లు కలదు. సనత్కుమారుడు రుద్రుని అన్నగా భావించి "మహాత్మా", "రుద్రా"

అని పెక్కు పర్యాయములు సంబోధించినట్లు కలదు. మహర్షికడ రుద్రుడు తత్త్వోపదేశమును పొందినను మహర్షి రుద్రుని శిష్యుడని తలంపక పూజించినట్లున్నది.

సనకసనందనాదులు ఇప్పటికిని కుమారులే యట.స్కందుడును ఇప్పటికిని కుమారుడే యట. కౌమారము వదలి యౌవనము వారికి రాలేదందురు. ఈ సామ్యము వారికి కలదని స్కంద సనత్కుమారులు ఒక్కరే యనిరేమో.

(18) సౌరమతము

సూర్యదేవుని ఉపాసించు మతము సౌరమతము. సూర్యునిగుఱించిన స్తుతులు వేదముల యందున్నవి. సూర్యుని సవితృడను నామముతో స్తుతించిన ఒక ఋక్కునందిట్లున్నది. ఋక్కు తాత్పర్యమిది :- "ఓ అగ్నీ! మమ్ము రక్షించుటకు దేవపత్నుల నిచటికి దీసికొనిరమ్ము. ఓ చిన్నవాడా! (అగ్నికి సంబోధన). హోమమును నెరవేర్చు నీ భార్య భారతిని (= భరతుడను సూర్యునిభార్య) ప్రార్థింపదగిన సరస్వతిని దీసికొని రమ్ము (ఇచ్చట సరస్వతి వాగ్దేవతయే"). ఋగ్వేదము ఋక్కు 218 - ఈ సూక్తమునందు ఇతరదేవతల స్తుతికూడ కలదు.

ఋగ్వేదమున ఘోరపుత్రుడగు కణ్వుడను ఋషి సూర్యుని పూషుడని స్తుతించెను. అందలి తాత్పర్యము.

"ఓ పూషా! (= సూర్యుడు, జగత్పోషకుడని వ్యుత్పత్తి. పృథివి కభిమానదేవత). నీటిని విడుచునట్టి మేఘమునకు బుత్రుడా! మార్గమునుండి (మేముగోరిన స్థలమునకు) కొనిపొమ్ము. పాపమును దొలగింపుము. మాముందు నడువుము (ఋక్కు 500). ఈ సూక్తమున, 9 ఋక్కులున్నవి.

సామవేదమునందు పూష, సవితృ, సూర్యదేవతలు వేఱు వేఱుగా స్తుతింపబడిరి. సామవేదము పూర్వార్చితమునందు విభ్రాజ (సూర్యపుత్ర) ఋషి, కుత్సఋషి, సర్పరాజ్ఞీఋషి, వైఖానస ఋషులు సూర్యుని

స్తుతించిరి. అందొక అంత్రమున సూర్యుని రథమునకు శుద్ధిచేయునట్టి అడుగుఱ్ఱముల ఏడింటిని (కిరణములు యందలి రంగులు) పూన్చినట్లు కలదు (ఋక్కు ఋగ్వే - 638, 639).

సామవేదమునందు ఋక్కు 276 గల ఒక మంత్రమును సూర్యుని చూచుచు జపించినచో అబద్ధమాడిన పాపము నశించునని చెప్పడినది- ఇంద్రుడే సూర్యుడని (125ఋ), సూర్యుడు ఇంద్రుని ప్రతినిధి అని (628ఋ)ఒకచోట కలదు. ఇచ్చట ఇంద్రుడనగా బ్రహ్మమని అర్థమగునేమో.

ఋగ్వేదము 50వ సూక్తమున 587వ ఋక్కునుండి 599వ ఋక్కువఱకు సూర్యదేవతను స్తుతించిరి. అగ్నికిని సూర్యునకును అభేదమును తెలుపు స్తుతివాక్యములు సహితము కలవు.

ఉపనిషత్తులయందు సూర్యోపనిషత్తు కలదు. అందు సూర్యోపాసన చెప్పబడినది. అందు కొన్నిమంత్రములు, సూర్యుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడని స్తుతింపబడెను.

"సూర్యాద్వై ఖల్విమాని భూతాని జాయంతే సూర్యా ద్యజ్ఞః పర్జన్యో న్న మాత్మా, నమస్తే ఆదిత్య త్వమేవ ప్రత్యక్షం కర్మ కర్తాసి. త్వమేవం ప్రత్యక్షం బ్రహ్మాసి త్వమేవ ప్రత్యక్షం విష్ణురసి త్వమేవ ప్రత్యక్షగ్ం రుద్రో ఽసి. అనిసూర్యుడు పరబ్రహ్మమే నీవని బ్రహ్మ, విష్ణు, రుద్ర దేవతలు నీవేయని స్తుతింపబడెను. మఱియు చతుర్వేదములు భూమ్యాది భూతములు సమస్త లోకములు సూర్యునివలననే కలిగినట్లు చెప్పబడినది.

వరాహపురాణమున సూర్యుని జననము ఇట్లు చెప్పబడినది :- ఆదియందు పరమాత్ముడు తనకంటె వేఱుగాని జ్ఞాన శక్తిని వీక్షింప మహాజ్యోతి పుట్టెను. అట్లు జనించిన మహాతేజోరాశి దిగంతముల వ్యాపించి తనయందు తానె లోలీభూతమైన ఆ మహాతేజో రాశియందు సురవరులు ప్రవేశించిరి. ఆకారణమున ఆ తేజోరాశికి సూర్యుడను నామము కలిగెను. సమస్త ప్రపంచమునకును ఆది యగుటవలన ఆదిత్యుడను నామము కలిగినట్లును చెప్పబడెను.

సూర్యుడు దేవుడనిగాని దేవుని ప్రత్యక్షప్రతినిధి యనిగాని (ప్రతీకమని గాని) విశ్వసించి సూర్యోపాసనము చేయు మతవిధానము భారతదేశము నందేగాక, ఇతరదేశముల యందును వ్యాప్తిలో నుండినట్లు తెలియు చున్నది. ప్రాచీన కాలమున నాగరికతకు ప్రసిద్ధిచెందిన దేశములలో ఒకటిగా పరిగణింపబడిన ఈజిప్టునందు సూర్యోపాసన యుండెనట. ఆ దేశమునందు సూర్యుని "రే"అను నామముతో పిలిచెడివారు. సూర్యుడుగాక ఆదేశమున మఱియిద్దరు ప్రాంతీయదేవతలు "అటుం", "హోరన్" అను వారలుకూడ ఉపాసింపబడుచుండిరి. వీరిని త్రిమూర్తు లందురట. త్రిమూర్తులలో సూర్యుడు "రే" దేవుడు ముఖ్యుడు.

ఖురానులో "త్రిమూర్తులలో నన్ను ఒకనినిగా భావించినవారు నరకమునకు పోవుదుర"ని అల్లా (దేవుడు) చెప్పినట్లు కలదు. ఖురానులో చెప్పిన త్రిమూర్తులు పైన చెప్పినవారని నమ్మవచ్చును. లేదా, క్రైస్తవమతమునందలి త్రికము (పితృ, పుత్ర, పరిశుద్ధాత్మల)నే త్రిమూర్తులను భావముతో చెప్పియుండవచ్చు నేమో. మహమ్మదు ప్రవక్తగారు హిందువుల బ్రహ్మ, విష్ణు, ఈశ్వరులను త్రిమూర్తులను గుఱించి యెఱుగుదురో యెఱుగరో. సూర్యునితో చేరి త్రిమూర్తుల నుపాసించు ఈ పద్ధతి క్రీ. పూ. 3000ల నుండి క్రీ. పూ. 2000ల మధ్య ఉన్నట్లు ఊహించిరి. క్రీ. పూ. 1500-1360 మధ్య సూర్యుని, దేవుని ప్రతీకమని ఉపాసించిరట. (వి. సర్వస్వము ఈజిప్టుమతము పుట313). సూర్యుడు దేవుడను నమ్మకము గల యీ మతమునకు ఇతర దేశములయందు "మిత్రమతము" (Mitraism)అనిపేరు. క్రీస్తునకు పూర్వమును, తదనంతరము మూడుశతాబ్దముల వఱకును మిత్రమతము వ్యాప్తిలో నుండెను. ఆర్యన్ పర్షియన్ పురాణగాథల యందు "మిత్రుడు"అని చెప్పబడిన దేవుడు తరువాత సూర్యదేవుడుగా మారెను. రోమనులు ఇరానియనులు కూడా ఈ మతమును అవలంబించియుండిరట.

మన వేదములయందును, పురాణములయందును, మిత్రావరుణుల నామములు అశ్వినీ దేవతల నామములవలె జంటగా వినబడుచుండును. ఒక్కొక్కప్పుడు మిత్రుడు, వరుణుడు అను నామములు వేఱు వేఱుగా

చెప్పబడినవి. ఋగ్వేదమునందు 41వ సూక్తమున "ఆదిత్యులు" అని మిత్రావరుణులను స్తుతించి నట్లున్నది. సూర్యుడు అదితిపుత్రు డనుట ప్రసిద్ధి. అదితి శబ్దమునకు మహాకాశమని అర్థము చెప్పినారు. సూర్యుని ప్రత్యేకముగా స్తుతించిన ఋక్కులు కలవు.

వైదికమిత్రుడు ఇరానీయుల మిత్రుడు ఒక్కడే. ఏలయన, ఆకాశమున పయనించు వీరి రథమును "కాంతి" యనిరి. ఆర్యులు ఇరాన్ నుండి భారతదేశమునకు రాకముందే ఆర్యులయం దీమతము ప్రచారము నందుండెను. పరిషియనుల మతము ప్రకారము విశ్వాధినేతయగు దేవదేవునికి ప్రపంచమునకును మధ్యవర్తిగా మిత్రుడు వర్తించునట.

మన పురాణములలోనికి వచ్చునప్పటికి మిత్రావరుణులు ఋషులు.

భౌతికశాస్త్రజ్ఞులు చెప్పిన విధమిది :- ఒకప్పుడు గొప్ప తేజోరాశి శూన్యప్రదేశమున ప్రవేశించెను. ఆ తేజోరాశి మహావేగమున పరిభ్రమించుటవలన తునకలై అనేకము లాయెను. వాటిని 'నెబ్యూలాల'ని పిలుతురు. ఆ నెబ్యూలాలు సహితము విచ్ఛిన్నమై అనేక నక్షత్రములుగా ప్రదేశము నందంతటను చెదరిపోయెను. ఆ నక్షత్రకోటిలో ఒకటి మనకు కనబడు సూర్యుడు. ఆ సూర్యునినుండి కొంత ద్రవ్యము బయటికి పోవ ప్రయత్నించి పోలేక అదియు ముక్కలై సూర్యునిచుట్టును తిరుగుచున్నది. అవియే గ్రహము లనబడుచున్నవి. అట్టిగ్రహములలో ఒకటి మనమున్న భూమి.

ఒకసూర్యుడే ద్వాదశమాసములయందు ద్వాదశనామములతో పిలువబడి ద్వాదశాదిత్యులని ప్రతీతి.

భగవద్గీతయందు

"ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవిరంశుమాన్."

(గీత. 10-21)

ఆదిత్యులయందు విష్ణువనువాడను నేనే అని చెప్పియున్నందున సూర్యుడు రుద్రవిష్ణు స్వరూపుడని తెలియుచున్నది.

భూమియందు ప్రాణికోటి పుట్టుటకు వర్ధిల్లుటకు కారణము సూర్యుడే. సూర్యుని కిరణములవల్ల కొన్ని ప్రాణులు నశించును. ఈ విధముగ సృష్టిస్థితిలయకారకుడు సూర్యుడు. కనుక సూర్యుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడు.

ముఖ్యముగా రుద్రుడు అగ్ని తత్త్వమగుట శైవులకును, సూర్యమండలమున విష్ణుదేవు డున్నాడనుట వలన వైష్ణవులకును - ఇట్లు శైవ వైష్ణవ మతములకు సూర్యునితో సంబంధ మున్నది.

పురాణములయందు బ్రహ్మదేవుని అంగుష్ఠమున దక్షుడవతరించెనని దక్షతనూజయగు అదితివలన కశ్యపునకు ఆదిత్యుడు (సూర్యుడు) పుట్టెనని చెప్పబడినది.

సూర్యబింబము భూమికంటె కొన్ని కోట్లరెట్లు పెద్దది. అట్టి సూర్యబింబము ఈ భూమిపై ఉన్న ఒకతల్లి కడుపున పుట్టెననుటను నెవ్వరును నమ్మరు. సూర్యగోళ (మండల) మునకు అధిపతియు, మండలాంతర్వర్తియు, సూర్యనామక దేవతా పురుషుడు అదితికశ్యపులకు పుట్టి సూర్యమండలాధిపత్యమును పొందియుండవచ్చునని మనమూహింప వచ్చును. స్వర్గము నందలి ఇంద్రుడు, బ్రహ్మలోకమునందలి బ్రహ్మదేవుడు మొదలగు దేవతలు పరమేశ్వరుని కరుణచే ఆ యా లోకపాలకులుగా నియమింపబడినవారే. వారును కొంతకాలమునకు మారిపోవుచుందురు. అట్టి దేవపురుషులలో నొక్కడగు సూర్యనామక దేవుడు లేదా మహర్షి అదితిగర్భమున పుట్టియుండవచ్చును.

సూర్యోపాసన చాల ప్రాచీనమైనది. సూర్యుని ఉపాసించినవారు సామాన్యులు కారు. ఇక్ష్వాకులు సూర్యోపాసకులు. తాము సూర్యుని బిడ్డలమని, ఆ వంశీయులమని చెప్పుకొందురు. సామాన్యముగ ఉపాస్యదైవమును తండ్రిగా భావించి ఉపాసకుడు తనసంతతిని ఆ దేవుని బిడ్డలమని చెప్పు ఆచారము గలదు. శ్రీమద్రామాయణమునందలి

యుద్ధకాండమున "ఆదిత్యహృదయము"* కలదు. అది అగస్త్యమహర్షి శ్రీరామచంద్రున కుపదేశించి నట్లున్నది. అందు సూర్యుడు సర్వదేవతా స్వరూపుడని యిట్లు చెప్పిరి.

శ్లో॥ "సర్వదేవాత్మకోహ్యేష తేజస్వీ రశ్మిభావనః।
ఏషదేవా స్సురగణాన్లోకాన్పాతి గభస్తిభిః॥
ఏష బ్రహ్మాచ విష్ణుశ్చ శివస్స్కన్దః ప్రజాపతిః।
మహేన్ద్రో ధనదః కాలో యమస్సోమోహ్యపాంపతిః."॥

వేదములలో చెప్పినట్లు పూషుడు మొదలగు నామములు సూర్యున కున్నట్లు అందే యిట్లు చెప్పబడినది.

శ్లో॥ ఆదిత్య స్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్।
సువర్ణ 1 సదృశో భాను 2 ర్హిరణ్యరేతా దివాకరః॥

పై శ్లోకములయందు సూర్యుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడేగాక స్కంద, ప్రజాపతి, మహేంద్ర, ధనద, కాల, యమ, సవితాది దేవతామూర్తియని తాత్పర్యము.

అన్నము ఆదిత్యమయమని తెలిసికొని పూర్వము "భీమ వైన్య కార్తవీర్య నహుషాదులు యోగసమాధినిష్ఠులై సూర్యభజనంబున నన్నంబు బడసిరి." పాండవులు అరణ్యమున కేగునపుడు బ్రాహ్మణులు వారిని వెంబడించిరి. అడవియందు బ్రాహ్మణులకు అన్నమెట్లు ఇవ్వగలనా? అని దుఃఖించు యుధిష్ఠిరునకు ధౌమ్యుడు సూర్యోపాసన చెప్పి దానివలన అక్షయమగు అన్నమును పొందవచ్చు ననెను. యుధిష్ఠిరుడు సూర్యు నుపాసింప సూర్యుడు ప్రత్యక్షమై అట్టి వరమొసంగెను. పూర్వము ఇంద్రునివలన నారదమహర్షియు, ఆయనవలన వసురాజును, అతనివలన ధౌమ్యుడును ఆ మంత్రమును పొందిరని మహాభారత ఆరణ్యపర్వమున కలదు.

---

* ఆదిత్యహృదయము శ్రీమద్రామాయణమున ప్రక్షిప్తమని కొందఱు శ్రీవైష్ణవులందురు.
1 స్తపనో. 2 స్సర్వ అని పాఠాంతములు

సూర్యుడు పరబ్రహ్మమని ఆయనను ఉపాసించుట వలన మోక్షము కలుగునని భావించియుండరు. కాని, పరమేశ్వర ప్రతీకముగా సూర్యు నుపాసించుటవలన పాపక్షయమై చిత్తశుద్ధికలిగి తత్త్వజ్ఞానము కలుగును. జ్ఞానము వలన ముక్తి కలుగును. కనుక సూర్యోపాసనను నిరసింపరాదు. ప్రతీకము లన్నింటికంటెను సూర్యుని పరబ్రహ్మము యొక్క ప్రతీకముగా ఉపాసించుటయను పద్ధతి ప్రపంచమున పూర్వము ఎక్కువ ప్రచారమునందుండినట్లు తెలియుచున్నది.

(19) సింహావలోకనము - సంగ్రహపరిశీలనము

-: మతముల - దర్శనముల మేళనము :-

దర్శనముల గుఱించి సమీక్షించితిని. జడదర్శనము లగు న్యాయవైశేషిక మీమాంసాదర్శనములు ముముక్షువునకు సంతృప్తికరములు కానందున కాలక్రమమున ఆ దర్శనములకు పలుకుబడి తగ్గిపోయెను. న్యాయదర్శనము శైవమునందును, వైశేషికము పాశుపతమునందును కలసిపోయినవని కొందఱు పండితులందురు. తన 'వివేక విలాసము' నందు జినదత్తుడు (13వ శతాబ్ది మధ్యకాలము) న్యాయవైశేషికవాదులకు శివుడు ఇష్టదైవమని చెప్పినాడందురు. ఉద్యోతకరుడు పాశుపత మతస్థుడట. భాస్కరజ్ఞుడు తన ధ్యానములో మహేశ్వరసాక్షాత్కారము లభించినదని చెప్పినాడని అందురు.

శివుడే పరతత్త్వమని, ఉదయనాచార్యులు తన "న్యాయ కుసుమాంజలి" అను గ్రంథమును ఈశ్వర ప్రార్థనతో ప్రారంభించెను. పూర్వమిమాంసాదర్శనము విశిష్టాద్వైతమునందు కలిసెను. సాంఖ్యయోగ దర్శనములు చైతన్య దర్శనము లగుటవలన కొంత విలువ కలవియైనను ఇందలి దర్శన భాగమును చాలవఱకు వేదాంతులు ఖండించిరి. కాని, యోగమునందలి సాధనపద్ధతిని కొంత మార్పుతో అన్ని మతములవారును గైకొనిరి. సేశ్వర సాంఖ్యదర్శనమునందలి కొన్ని

సిద్ధాంతములు వేదాంతముతో కలిసిపోయెను. ఈ విధముగా అయిదు దర్శనములు ఇతర మతములలో తలదాచుకొనుటచే వాటిని ప్రత్యేకించి అనుష్ఠించువారు లేరు. తర్కమును మాత్రము ఇప్పటికిని పఠించుచున్నారు. తర్కము వేదాంతము తెలిసికొనుటకు సహాయపడును.

-:మతతత్త్వ పరిశీలనము:-

మత తత్త్వమును గుఱించి దిఙ్మాత్రముగా సమీక్షింతును. పురాణములు, ఆగమములు మతములను పోషించినవని చెప్పియుంటిని. ప్రాచీనోపషత్తులయందు మతప్రమేయము లేదు. తదనంతరము వెలువడిన ఉపనిషత్తులయందు మతము ప్రవేశించినది. దశోపనిషత్తుల తరువాత వెలువడిన ఉపనిషత్తులలో శైవ, వైష్ణవ దేవీసంబంధమైన ఉపనిషత్తులు ప్రచారములోనికి వచ్చి ఆయామతములను పోషించినవి. శైవాది పురాణములయందున్న మతముల ననుసరించి శైవాది ఉపనిషత్తులు రచియింపబడెనో లేక ఆయామతములకు సంబంధించిన ఉపనిషత్తులను చూచి పురాణములు రచియింపబడెనో చెప్పుట కష్టము. మతము భక్తికి సంబంధించినది. మొట్టమొదట భక్తిభావము శ్వేతాశ్వరోపనిషత్తునందు కనబడుచున్నది.

దశోపనిషత్తులయందు శివ, కేశవ, శాక్త సంబంధమగు ఉపాసనలు లేవు. అందు 32ఉపాసనలు చెప్పబడియున్నవి. వాటికి విద్యలనిపేరు. అందు ప్రతీకముగా మానవరూప సాదృశ్యము గల వ్యక్తులుగా శివకేశవాది మూర్తులను గైకొనక మనస్సు, ప్రాణము, అగ్ని, సూర్యుడు మొదలగు సగుణ సాకార ప్రతీకములను ఉపాసనకు ప్రతీకములుగా గైకొనిరి. పర్యవసాన మేమనగా :- శ్రీలోకమాన్య తిలక్ మహాశయులు చెప్పినట్లు "మానవ దేహధారియగు ఈశ్వరునియొక్క యుపాసన ప్రాచీనములగు నుపనిషత్తులలో స్పష్టముగా గాన్పింపదు." (గీ. ర. పరిశిష్టప్రకరణము పుట.724)

మతములను పోషించిన పురాణములయందు ఏమతమునకు చెందిన దేవతయొక్క ఘనతను ఆ మతసంబంధమగు పురాణము వర్ణించినది. శ్రీకృష్ణభగవానుడు పరతత్త్వమని వైష్ణవపురాణములు వేనోళ్ళ చాటినవి. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు తాను పురుషోత్తముడనని స్వయముగా చెప్పుకొనెను. క్షరము, అక్షరముకంటెను పరుడ నగు పరమాత్మయే తాననెను. అట్టి భగవానుడు ఉపమన్యుడను శైవబాలునివద్ద శైవదీక్షను గైకొనెనని శివపురాణము చెప్పినది. శ్రీరామచంద్రుడు, అరణ్యమునందున్న సమయమున అగస్త్యమునివలన విరజా (శైవ) దీక్షను గైకొని శివుని ఉపాసించి శివునిచే మహాస్త్రములను, ఆత్మజ్ఞానమును పొందెనని శ్రీ పద్మపురాణాంతర్గత శివగీత చెప్పినది. కాని, కొన్ని పురాణములు శివుడు (రుద్రుడు) విష్ణుమహిమను కొనియాడి విష్ణుదేవుని స్తుతించినట్లును, విష్ణుదేవుడు శివునిగుఱించి తపమాచరించి శివుని యనుగ్రహమునకు పాత్రుడయినట్లును అన్యోన్య సమరసభావము సహితము బోధించినవి.

వైదిక మతము నందలి కొన్ని అంశములయొక్క నిగూఢార్థము మన మిప్పటికిని పూర్ణముగా గ్రహించలేకున్నాము.

-: దేవతల స్వరూప పరిశీలనము :-

జిజ్ఞాసువు :- పురాణములు దేవతలకు మానవులకు బాంధవ్యమును చెప్పినవి. ఆ దేవత లెవరు?

వేదాంతి :- ప్రపంచమున గల ముఖ్యమైన మతములు అనగా :హిందు, జైన, బౌద్ధ, పారసీక, (జోరాష్ట్రియన్) యూదు, క్రైస్తవ, ముస్లిమ్, సిక్కు మతముల వారి యందు కొందఱు ఈశ్వరుని అస్తిత్వము అంగీకరింపని వారైనను, ఏదో ఒక రూపమున దేవత లున్నట్లు అంగీకరించియున్నారు. ఆ దేవతల సంఖ్యయందును వారి స్వరూప స్వభావ వ్యవహార ధర్మములయందును భేదములు చెప్పిరి. అన్నిమతములు ఏకవాక్యతను పలుకలేదు. హిందువులు దేవుడొక్కడే అని చెప్పి ఆయనయే

మువ్వురనియు, ఆఱుగ్గురనియు, ముప్పది మువ్వు రనియు, మూడువేల మూడునూర్ల ముప్పది ముగ్గురనియు, బృహదారణ్యక శ్రుతియందు విదగ్ధ శాకల్యుడను నతడు అడిగిన ప్రశ్నకు యాజ్ఞవల్క్యమహర్షి పై అర్థము నిచ్చునట్లు "త్రయశ్చ త్రీ చ శతాత్రయశ్చ త్రీ చ సహస్ర"(అ-3-బ్రా 9-నం. 1) అని చెప్పెను. బ్రహ్మసూత్రముల యందు 1వ అధ్యాయము 3వ పాదము నందలి దేవతాధికరణమున ఈ విషయము చర్చింపబడెను. కాని యీ దేవత లెవరైనది స్పష్టము కాలేదు. వీరు దేహము నందలి యింద్రియ ప్రాణాదులగు శక్తులో, వేఱొక లోకము నందలి వ్యక్తులో చెప్పుట కష్టము. జైమిని ప్రభాకరాదులు (పూర్వమీమాంసాచార్యులు) దేవతలకు రూపము లేదనిరి. అనగా : మన మనుకొను దేవతలే లేరని వారి భావము.

దేవతల దేహములు ఆతివాహక దేహములు. మానవుల దేహములవలె ఆధిభౌతికములు కావు. ఆ దేవతలు దేవలోక నివాసులు. భూలోకవాసులు కారు. ఆతివాహక దేహములతో సంకల్పమాత్రమున అనుకొన్న చోటునకు చేరగలరు. వారు కోరినపుడు ఆధిభౌతిక దేహములు ధరింపగలరు. సామాన్యమానవుల కాశక్తి లేదు. వాసనాక్షయమైన జీవన్ముక్తులగు మహాయోగులు, వారి యోగశక్తిచే ఆధిభౌతిక దేహమును త్యజించి ఆతివాహిక దేహమును ధరింపగలరు. అప్పుడు వారికిని, దేవతలకును భేదముండదు. ఈ విషయము విపులముగ తెలియగోరిన యోగవాసిష్ఠ గ్రంథమున మండపోపాఖ్యాన మను నామాంతరము గల లీలోపాఖ్యానమును చూడవలయును.

మర్త్యులయిన ఋభువులు దేవత లయినట్లు ఋగ్వేదము నందలి ద్వితీయాధ్యాయమునం దిట్లున్నది :-

"సూ|| 20 = ఋభుదేవతలస్తుతి (౧౫వ ఋక్కు) సర్వత్రాగమనము గలది, కూర్చుండుటకు సుఖమైనది అగు రథమును అశ్వినీ దేవతల

కొఱకు ఋభువులు చెక్కి తయారుచేసిరి. (౧౯౭) ఋభువులు ముసలి తలిదండ్రులను యౌవనవంతులుగ చేసిరి. (198) వీరు త్వష్టయొక్క శిష్యులు (దేవతలయొక్క చెక్కడపు పనివాడు త్వష్ట). చమస = సోమపానమును చేయుటకుగా కఱ్ఱతో చేసినపాత్ర."

"ఋభువుడు (తాము మర్త్యులయ్యును) చమసాది పాత్రలు చేయుటవల్ల దేవతలయి దేవతలతో పాటు యజ్ఞభాగమును పొందిరి. (౨౦౨)

పైన చెప్పిన వేదవాక్యములవలన మర్త్యులు అమర్త్యు లగుటకు వీలున్నదని తెలియుచున్నది. కాని ఈ దేవత లెవ్వరు ?

పురాణములయందు చెప్పిన త్రిమూర్తులున్ను, ఉపనిషత్తులయందు ద్యులోకవాసులని చెప్పబడిన వారును తప్ప తక్కిన దేవతలు నరులే. పుణ్యపరిపాకము వలనను, తపము వలనను దివ్యభావము గల నరులు దేవత లగుదురు. ఒక్కొక్క మన్వంతరమున దేవతలు, ఇంద్రుడు, సప్తఋషులు మారుచుందురు. అవన్నియు పదవుల (ఉద్యోగముల) వంటివి.

ఇతర మతములవారు దేవునికి అవతారము లున్నట్లు చెప్పలేదు. కాని, - బైబిల్ ప్రాత నిబంధన ప్రకారము ఇజ్రాయేల్ ప్రజల దేవుడని చెప్పబడిన యెహోవ (జిహోవ Johove) పూర్వకాలమునందలి మానవులకు అతిసులభుడు. యెహోవ మానవునిరూపము వంటి రూపము గలవాడు. ఆయనకు కొందఱియందు అకారణప్రీతి. అనేక పర్యాయములు అబ్రహాము మొదలగు భక్తులకేగాక భక్తులుగాని సామాన్యులకును కనబడి వారితో ప్రసంగించువాడు. లేదా, తన దూతలను వారికడ కంపెడివాడు. ఒకప్పుడు వారియింట భుజించెడి వాడు. బైబుల్ ప్రాత నిబంధనము ప్రకారము మానవులు, దేవతలు, దివ్యజీవులు, పిశాచములు - అను నాలుగు వర్గముల సృష్టి యున్నట్లు తెలియుచున్నది. బైబుల్ ప్రాత నిబంధనయం దిట్లున్నది -

"నరులు భూమిమీద విస్తరింప నారంభించిన తరువాత కుమార్తెలు వారికి పుట్టినప్పుడు దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కనివారని చూచి వా రందరిలో తమకు మనస్సు నచ్చిన స్త్రీలను వివాహము చేసికొనిరి." (ఆదికాండము. అ-6-3)................

............"దేవుని కుమారులు నరుల కుమార్తెలతో పోయినప్పుడు వారియందు పిల్లలను కనిరి. పూర్వకాలమందు పేరొందిన శూరులు వీరే." (1-6-5)

ఈ వాక్యముల వలన దేవునికి భార్యగాని భార్యలు గాని ఉన్నట్లును, భూమియందలి మానవులవలెనే దేవుడు ఆయన భార్య(లు) దాంపత్యధర్మము ననుష్ఠింతు రనియు స్పష్టమైనది.

దేవతా పురుషులవలన మానవాంగనలకు శూరులగు పుత్రులు కలిగిరను నంశము హిందూమత మంగీకరించినది. హనుమంతుడు, కర్ణుడు, పాండవులు మొదలగువారిని గుఱించి విదేశీయు లెఱింగియుందురు. కాని దేవునికి కుమారు లున్నట్లు మన మంగీకరింపము. దేవుడు దేవతలను అగ్ని నుండి పుట్టించెనని ముస్లిముల వేదమగు ఖురాను చెప్పినది. ఒక సందర్భమున దేవుడు దేవతల నందఱను పిలిచి ఆదామునకు సాష్టాంగ నమస్కారము చేయుడని చెప్పెనట. దేవత లట్లు చేసిరి. కాని, దేవతలయందొకడు "ఇబ్లీస్" అను దేవత మాత్రమే దేవునితో ఇట్లు చెప్పెను. "వీనిని (ఆదామును) నల్ల మట్టినుండి నీవు సృష్టించితివి. నేను అగ్ని సంభూతుడను. వానికి నేనెట్లు నమస్కరింతును" అని నమస్కరించుటకు తిరస్కరించెను. దేవు డాతనిని శపించెను. ఈ 'ఇబ్లీసు'నే క్రైస్తవులు, ముస్లిములు "సైతాన్" అని పిలుతురు. అనగా పాపపురుషుడని అర్థమట.

రోమనులు దేవత లున్నట్లు అంగీకరించిరి. జూపిటర్ రోమనుల ప్రధాన దేవుడు. ఆయనభార్య "జూనో". ఆమెను "హిరా" అనికూడ అందురు. ఆపె స్వర్గమునకు రాణి. తన భర్తకు మానవ స్త్రీలయందు గల అనురాగమునకు అసూయచెంది రూపలావణ్యవతులగు మర్త్యకాంతలకు కీడు తలపెట్టుచుండునట.

జొరాష్ట్రియనులు (పారసీకులు) తొలుత బహుదేవతారాధన చేయుచుండెడివారు. వారియందు క్రీ.పూ. సుమారు 1500 సంవత్సరముల క్రిందట జొరాష్టర్ అను మహనీయుడు జన్మించి బహుదేవతారాధనమును ఖండించి ఏకేశ్వరుడు "అహరమఝ్దా" ఒక్కడే దేవుడని ఏకేశ్వరారాధన ప్రవేశపెట్టెను.

-: వైష్ణవ మతతత్త్వ పరిశీలనము :-

మొదట శ్రీరామానుజ మతమును గైకొందము. ఇది విశిష్టాద్వైతము. ఆళ్వారులు, శ్రీనాథముని, శ్రీయామున, శ్రీరామానుజులు రూపొందించినదే ఇప్పటి విశిష్టాద్వైతము. వీరిలో ప్రాముఖ్యము వహించినవారు శ్రీరామానుజులు. దక్షిణ దేశమందలి శ్రీవైష్ణవమతమునకు రామానుజులే గురువు. "శ్రీమతే రామానుజాయ నమః" అనని వైష్ణవు డుండడు.

వైష్ణవమతము విష్ణుపారమ్యమును బోధించు మతము. ఆ మతము ననుసరించి విష్ణుదేవునితో సముడు కాని: అధికుడు కాని అగు దేవుడు లేడు. ఆయనయే పరతత్త్వము. పరబ్రహ్మము. పరమ పురుషుడు. విష్ణుదేవుని స్తుతి ఋగ్వేదము నందున్నది. "విష్ణు వీజగత్తునందు నడిచెను. మూడువిధముల నడుగుపెట్టెను. ధూళియుక్తమైన యీతని పాదమందు ఈ సర్వజగత్తు నిమిడియున్నది" (ఋ227) అని కలదు గాని, యింకేవిషయములును లేవు. పురాణములయందు చెప్పిన వామనావతారము అదితికశ్యపుల గర్భముల అవతరించిన విష్ణువు. ఋగ్వేదమునందు వామనశబ్దము ప్రయోగింపబడలేదు. కనుక ఋగ్వేదమునందు చెప్పిన త్రివిక్రముడు పరబ్రహ్మమను అర్థమున ప్రయోగింపబడిన దేమో.

విష్ణువు నీలమేఘశ్యాముడు. శేషశయనుడు. క్షీరసాగరమందుండువాడు. ఇచ్ఛాశక్తి యీయనకు తోడ్పడును. ఇచ్ఛాశక్తియే భూదేవి. భూ, శ్రీ, నీళా దేవీత్రయము విష్ణుదేవుని భార్యలని, చతుర్ముఖునిచే సృజింపబడిన జగమును రక్షించుట, పోషించుట ఈయన కార్యములని అందులకుగాను విష్ణుదేవుడు అవతారములు ఎత్తుచుండునని పురాణములు చెప్పుచున్నవి.

ఈ విషయమై యీ క్రింద చెప్పబోవు నిగూఢమైన అర్థము ఎంతవఱకు సరిపోవునో విచారించి చూతము.

క్షీరసాగరమనగా : పాలసముద్రము. ప్రతిప్రాణికి పుట్టినది మొదలు మరణపర్యంతము క్షీరమే ఆహారమై యున్నది. అన్నమే దేహము. పుట్టిన శిశువు తల్లిపాలను త్రాగును. పెఱిగినపిదప అన్నమును భుజించును. వరి, రాగి, జొన్న, సజ్జ, గోధుమలు, బార్లీ మొదలగు ధాన్యము లన్నియు క్షీరములే. మొదట పాల(క్షీర) రూపముననుండి గట్టిపడి ధాన్యరూపమును పొందును. అట్లు గట్టిపడి ధాన్యరూపము నొందకున్న అవి శీఘ్రముగ నశించునని ధాన్యరూపమున విష్ణుదేవుడే అట్లుచేసెను. సమస్త ధాన్యములును ద్రవరూపమునుండి ఘనరూపము పొందిన క్షీరములే. కనుక జీవుల పోషణశక్తి క్షీరముల యందున్నది. ఆ పోషణశక్తియగు ఈశ్వరతత్త్వమునే విష్ణుదేవుడని పురాణములు రూపకల్పనము చేసి, ఆయన క్షీరసాగరమున నున్నాడని చెప్పియుండవచ్చును.

జీవుల పోషణనిమిత్తము అన్నమును సృష్టించుటకు దానిని నిలువచేయుటకు భూదేవి విష్ణుదేవునకు సహాయపడును. జీవితమునకు ధనమవసరము. ధనాధిష్ఠానదేవత యగు లక్ష్మీదేవియు, విష్ణుదేవునకు సహాయపడును. "**శ్రీదేవీ త్రివిధం రూపం కృత్వా భగవత్సంకల్పానుగుణేన లోకరక్షణార్థం రూపం ధారయతి శ్రీరితి లక్ష్మీరితి లక్ష్యమాణా భవతీతి విజ్ఞాయతే, భూదేవి ససాగరారంభ స్సప్తద్వీపా వసుంధరా భూరాది చతుర్దశ భువనానా మాధారాధేయ ప్రణవాత్మికా భవతి, నీళాచముఖ విద్యున్మాలినీ సర్వౌషధీనాం సర్వప్రాణినాం పోషణార్థం సర్వరూపా భవతి**" అని (సీతోపనిషత్తు చెప్పినది) శ్రుతియందు పైన చెప్పిన శ్రీదేవియే శ్రీసూక్తమునందు చెప్పబడిన లక్ష్మీదేవి. అచట "**విష్ణుప్రియే విష్ణుమనో ఽ నుకూలే**" అనికూడ కలదు.

పైనచెప్పిన లక్ష్మీ, వసుంధరా, నీళాదేవులను శక్తులసహాయము పోషణకర్తయగు విష్ణుదేవునకు అవసరము గనుక ఆ దేవీత్రయము

విష్ణుదేవుని భార్యలని రూపకల్పన చేసి యుండవచ్చును. ఋగ్వేదము 478 వ ఋక్కునందు నీళాదేవిస్తుతి కలదు.

విష్ణుదేవుడు శేషశాయి అని పురాణములు చెప్పినవి. శేషుడు సర్పము. ఆయన సహస్ర శీర్షుడు. శరీరముమాత్రము ఒక్కటే. ఈ శేషుడే మహత్తత్త్వము. ప్రకృతియందు మొట్టమొదట కలిగిన పరిణామమే మహత్తు. దీనిని వ్యష్టిగతముగా 'బుద్ధి' అందురు. సమష్టి అయినప్పుడు 'మహత్తు'అందురు. మహత్తు పరిశుద్ధమైనది. సత్త్వగుణ సంపన్న మైనది. భగవంతునకు అతిసమీపమున నుండునది. అట్టి బుద్ధి రెండు విధములు. (1) వ్యవసాయాత్మికబుద్ధి (2) అవ్యవసాయాత్మికబుద్ధి. మొదటిది ఏకము, శుద్ధము. రెండవది మలినము, అనేకము (బహువిధములు). శేషునికి అనంతుడని పేరు. శేషుడు ఒక్కడైనను ఆయనకు వెయ్యి శిరము లున్నవి. అనంత శీర్షుడని అర్థము. విష్ణుదేవుడు శేషునియందు శయనించినాడని అనగా పరమాత్మ బుద్ధియందున్నాడని అర్థము.

"తను దనయందు నిలిపి పే,
రనువున బుద్ధికడ వెలుగు నచ్యుతుని.... (తిక్కన. శాంతి. 4-247)

అని చెప్పియున్నందున బుద్ధి సమీపమునందు భగవంతు డున్నాడని తెలియజేయుటకే శేషునిమీధ విష్ణుదేవుడు శయనించి యున్నాడనిరి. ఇది అధ్యాత్మపరమగు సూక్ష్మవిచారము. శేషుడు కద్రువ పుత్రుడని పురాణములు చెప్పును. ఇది మతపరమగు స్థూలప్రకారము-విష్ణుదేవునకు వాహనము గరుడాళ్వార్. ఋగ్వేదమున 332వ మంత్రమున గరుడుని గుఱించిన స్తుతి కలదు. అచ్చట తార్క్ష్యుడు, సుపర్ణుడను నామముల యాగకర్తలచే ఆహ్వానింపబడెను. గరుడుడు మహాబలవంతుడు. దేవతలచేత సోమముకొఱకు పంపబడిన వాడుగ వర్ణింపబడెను. అధ్యాత్మవిధానము ననుసరించి భగవత్ప్రాప్తికి ఉపనిషత్ జ్ఞానము అవసరము. విష్ణుదేవుని దర్శనమునకు ముందే మనకు సుపర్ణుని దర్శనము కావలెను. వైష్ణవాలయములందు గర్భగుడి ప్రవేశించుటకు ముందు

ధ్వజస్తంభముండును. అచ్చటనే గరుడాళ్వర్ల విగ్రహము ప్రతిష్ఠించి యుందురు. గరుడస్వామి జ్ఞానవైరాగ్యముల చిహ్నము. ఆయన ఉపనిషద్రూపుడు. ఉపనిషత్తులనుండి బ్రహ్మము నెఱుగవలయును- వినతాపుత్రుడని పురాణములు చెప్పును. ఇది మతసంబంధమగు స్థూలవిధానము.

విష్ణుదేవుని హస్తములయందలి ఆయుధములలో ముఖ్యమైనది చక్రము. దానికి ఆద్యంతములు లేవు. దాని ఆరంభ మెచ్చటనో అంతముకూడ అచ్చటనే. భూమిపై విత్తనము వేయుచున్నాము. భూమాత దానిని పోషించును. అది పండిన అందు అనేక బీజములుండును. ఆ ధాన్యము మనకు ఆహారము. గడ్డి పశువుల కాహారము. పశువులు గడ్డిని తిని మనకు పాలనిచ్చును. పేడవేయును. పేడ భూమిని సారవంతముగ చేయును. ఆ సారమునుండియే మనకు చల్లిన ధాన్యము ఒకగింజకు నూఱుగింజలుగ తిరిగి మనకు లభించును. ఇది ఒక చక్రమువలె సాగిపోవుచున్నది. ఒకచోట నిలిచిపోవుట లేదు. మనము ఒక ధాన్యపుగింజను వేసిన అది ఒకటియే తిరిగి మనకు లభించిన లోకమున అన్నము అదృశ్య మగును. సకలప్రాణులు అన్నరూపమున నున్నవి. ఒకప్రాణి మృతిచెందిన దానిశరీరము మఱియొకప్రాణి కాహార మగును. ఇట్లు ఎడతెగక మఱల మఱల అదేరూపమున అన్నము ఉత్పన్న మగుటచే జీవలోకము పోషింపబడుచున్నది. ఇదియే చక్రము చేయుపని.

శంఖము సకల వేదసారము. దానిశబ్దము విన్న వారికి తిరిగి జన్మలేదు. ఇట్లే తక్కిన గదాది సాధనములను గుఱించి తెలిసికొనవలయును.*

శ్రీమన్నారాయణుడు వైకుంఠమున నుండు నందురు. వికుంఠ మనగా:- నాశనము లేనిది, వైకుంఠ మనగా: నాశనము లేనిది. అనగా:

---

* గదాది ఆయుధముల గుఱించి శ్రీ వైష్ణవ మతమున చెప్పిన దానిని ఈ గ్రంథము నందలి ద్వితీయ భాగమున ఐదవ ప్రకరణమున, మూడవ అధ్యాయమునందు చెప్పియున్నాను.

శాశ్వతమైన నెలవు. పరమాత్మయే ఆ నెలవు. శ్రీరామనుజ మతమునందు వైకుంఠము అప్రాకృత మనియు, శుద్ధ సత్త్వ స్వరూప మనియు చెప్పుదురు. అట్టి వైకుంఠము నందుండియే శ్రీమన్నారాయణుడు లోకములను రక్షించుచుండు నందురు. అది ముక్త జీవులకు గమ్యస్థాన మనిరి.

విష్ణుదేవుడే శ్రీమన్నారాయణుడని వేదములయందు చెప్పక పోయినను బ్రాహ్మణములయందు కలదు. లోకములను రక్షించు బాధ్యత విష్ణుదేవుని దని చెప్పితిని. కనుక లోకరక్షణార్థమై ఆయన అవతారములు ఎత్తవలసి వచ్చినదని పురాణములయందు చెప్పబడినది. లోకమునందు మానవుడు పుట్టుకుగాని, గిట్టుటకుగాని వేషము వేయడు. పేరు మార్చుకొనడు. అట్టి అవసరము లేదు. వ్యక్తిగతముగా తాను జీవించుటకో, సంఘమును పోషించుటకో మానవుడు వేషములు, నామములు ధరించుచున్నాడు.

ఉదా : ఒక పోలీసు ఉద్యోగి ఇన్‌స్పెక్టర్ పని చేయునపుడు "ఆయన ఎవరు?" అని అనుచున్నారు. అట్లే న్యాయాధిపతిని "జడ్జి" అని అనుచున్నారు. ఆ ఉద్యోగ నిర్వహణ కాలమున వారికి నియమిత మగు వేషమున్నది. "ఇన్‌స్పెక్టర్", "జడ్జి" అను నామములు వారి తల్లిదండ్రులు లిడిన నామములు కావు. వారి ఉద్యోగమునుబట్టి వారికి కలిగినవి.

సర్వలోకాధారమగు పరమేశ్వరుని అనంతశక్తులలో లోకములను రక్షించు శక్తియే శ్రీమన్నారాయణుడు. ఆయన రామకృష్ణాద్యవతారములు ధరించినపుడు నామరూపములు మారినవి. బ్రహ్మకుగాని, శివునకుగాని అవతారములు లేవు. వారికి అవతారములతో అవసరము లేదు. వారు జగత్తును పోషించువారు కారు. జనన, మరణములకు వేషధారణమును, నామధారణమును అవసరము లేదని చెప్పితిని గదా? శివుడు హనుమంతుడుగాను, దుర్వాసుడుగాను అవతరించెనని శివపురాణము నందు కలదు కాని, రుద్రతేజము వారి యందుండుటవలన అట్లు వ్రాసిరి. అవతారములయందు శ్రీరామకృష్ణావతారములు మిగుల ప్రసిద్ధములు.

శ్రీకృష్ణావతారమును గుఱించి పలువురు పలువిధములుగ చెప్పియున్నారు. కృష్ణుడొక వైదిక ఋషి యని, ఒక మంత్రకర్త యని చెప్పిరి. ఆంగీరస వంశీయుడగు ఘోరుడను నతనికి దేవకీ పుత్రుడగు కృష్ణుడు శిష్యుడని ఛాందోగ్యశ్రుతి చెప్పినది. (3-17-5) గార్బె, వీబర్ మొదలగు కొందఱు పాశ్చాత్యపండితులు కృష్ణుడు అనార్యజాతి వాడని చెప్పిరట. డాక్టర్.స, రాధాకృష్ణన్ గారు వారి భారతీయ తత్త్వశాస్త్రము నందలి రెండవభాగము అష్టమాధ్యాయమున ఇట్లు వ్రాసిరి-

"కృష్ణుని జీవితములో ఇట్టి సందర్భములు, నాతని బాల్యక్రీడలు, సురాపాన లాలసుడైన బలరాముని ప్రవర్తనము, కృష్ణు డనార్యుడని విశదపఱచును. కృష్ణుడు నేడు భారతీయులచే నేకగ్రీవముగా బూజింపబడుటకు కారణము - భగవద్గీతాకారు డతనిని ఒక యద్భుత తత్త్వోపదేశకునిగా బ్రదర్శించి యుండుటయే."

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల వారు శ్రీకృష్ణభగవానుని అనార్యు డనుట (ఆర్యేతర జాతికి చెందిన వాడనుట) దోషమని నేను తలంపను. ఏలయన :- ఆర్య ఆర్యేతర జాతుల సాంకర్య మెప్పుడో జరిగిపోయినది. ఏనాడు యయాతికి రాక్షసరాజపుత్రిక యగు శర్మిష్ఠయందు పూరుడు మొదలగు పుత్రులు కలిగిరో, ఆనాడే జాతి సంకరమైనది. యయాతికి దేవయానియందు యదువు మొదలగు పుత్రులెప్పుడు కలిగిరో ఆనాడే వర్ణసాంకర్య మేర్పడినది. అంతకు పూర్వమే యిట్టివి జరిగినవి. వానిని, శ్రీకృష్ణభగవానునితో గోపికల కున్న సంబంధమును కేవల వ్యభిచార దృష్టితో చూచి శ్రీకృష్ణుడు ధర్మమార్గమును వదలి ప్రవర్తించెనని భావించి ఆవిధముగ వ్రాసిరి. పాశ్చాత్య పండితుల మార్గమున శ్రీరాధాకృష్ణ పండితులు నడచియుండుట విచారకరము. ఇందుకు నా సమాధానము ఇదివఱలో తెలిపియుంటిని.*

వీరొకచోట శ్రీకృష్ణస్వరూప తత్త్వమును ఇట్లు వర్ణించిరి :-

---

* ఈ గ్రంథ ద్వితీయభాగమున 4-14 గోపికల భక్తి అను అధ్యాయమును చిత్తగించవలెను.

"కృష్ణుని స్వరూపమే యాతని సర్వతోముఖ పరిపూర్ణతను సూచించును. ఆతని శిరస్సున ధరించిన నెమలి పింఛములోని రంగులు మానవుని నేత్రములకు మిఱుమిట్లు గొల్పును; ఆతని శరీరవర్ణము నీలాకాశవర్ణము: ఆతడు ధరించిన పుష్పమాల, గ్రహనక్షత్రజాల కాంతిపుంజములను సూచించును; ఆతడు గాన మాలపించు మురళి యాతని దివ్యసందేశము నిచ్చును; ఆతని యురమునందలి మచ్చ, తన భక్తులు తనకు జూపు భక్తి చిహ్నము; ఆతడు భక్తుల హృదయముల నివసించును; ఆతని కృప అపారమైన దగుటచే నొక పాదముపై నింకొక పాదమును మోపి తన కటాక్షమును బ్రసాదించు సూచనగా నిలబడినాడు." (భా. త. 9 అధ్యాయము)

వైష్ణవు లందఱును శ్రీకృష్ణభక్తులే. అయినను ముఖ్యముగా శ్రీ కృష్ణభక్తులలో-లక్ష్మీనారాయణులే రాధాకృష్ణులుగా అవతరించిరని శ్రీ నింబార్కాచార్యులును, గోలోకవాసులగు రాధాకృష్ణులే భూలోకమున రాధాకృష్ణులుగా అవతరించిరని శ్రీ వల్లభ, శ్రీ గౌరాంగ దేవు లిరువురును చెప్పిరి. ఈ ముువ్వురు సత్యమునే చెప్పిరని మన మంగీకరించితిమేని; గోలోకవాసి యగు కృష్ణుడు యశోదాదేవి గర్భసంజాతుడై యుండవచ్చు ననియు; దేవకీదేవి గర్భసంజాతుడగు కృష్ణుడు శ్రీమన్నారాయణుని యవతారమై యుండవచ్చు ననియు; యశోదా పుత్రునివలన ప్రేమరూప భక్తి లేక భాగవత ధర్మములు ప్రచారమునకు రాగా, దేవకీ పుత్రుని వలన నిష్కామ కర్మయోగము ప్రచారమునకు వచ్చి యుండవచ్చుననియు; భగవద్గీతాచార్యులు నీరెండుతత్త్వములను గీతయందు మేళవించి యుండవచ్చుననియు కొందరూహింతురు. గోలోకము, రాధాకృష్ణులు- వీరిని గుఱించి తెలిపిన పురాణములు ఇటీవలి వనియు, ఇది శుద్ధ కల్పన యనియు, దీని కాధార మెచ్చటను కన్పింప దనియు అభిప్రాయపడు వారున్నారు.

అట్టివారికి నా సమాధాన మేమన;- మహాభారతము సత్యలోకమున కంటె పైన గోలోక మున్నదని అంగీకరించినది. చతుర్ముని లోకమునకంటె పైన లోకమున్న దనగా ఆ లోకాధిపతి పరమపురుషు డనవలయును.

మహాభారతమున చెప్పిన మార్తాండుని కృష్ణునిగను: సురభిని రాధగను పురాణములు పేర్కొన్నవని తలంపవలయును. ఇందులోని మధురభావము అమృతరూపిణియగు సురభినుండి వర్షించిన అమృతమే.

-: అవతారతత్త్వ పరిశీలనము :-

హిందూమతమున బహుదేవతారాధన మనునది నామమాత్రమే. వేద కాలమునుండియు (అనాదినుండియు) హిందువులు ఏకేశ్వరారాధకులే. ఈ సూక్ష్మమును అందఱు గుర్తింపజాలరు. ఆ విషయ మటుంచి ప్రస్తుతము పురాణముల యందు చెప్పబడియున్న విష్ణుదేవుని అవతారములు (లీలా విలాసములు) అనేకములు. వాటినిగుఱించి కొందఱు పండితులు ఈ క్రింది విధముగ చెప్పిరి. దశావతార కల్పనము సృష్టియొక్క వివిధ పరిణామముల వికాసములనుగాని, లేక డార్విన్ పరిణామమువంటి స్థితినిగాని, మానవదేహము యొక్క ఆరంభాది దశలనుగాని తెలుపునట.* ఎట్లన :-

మానవుడు తొలుత పశుప్రవృత్తిలో నుండుటను మత్స్య కూర్మ వరాహావతారములును, పశుత్వమును వీడి మానవత్వమును పొందిన మధ్యమావస్థను నరసింహావతారమును, అప్పుడప్పుడే మానవత్వ వికాసమును పొందుట వామనావతారమును, మానవునియందు తపము పశుబలము హింసాక్రౌర్యములు కలిసియుండుటను పరశురామావతారమును తెలుపును. ఆత్మజ్ఞానము ధర్మనిష్ఠ, ప్రేమ, త్యాగము గల పూర్ణవ్యక్తి అయినను దుఃఖితుడయ్యెను. కనుక యిట్టి స్థితిని తెలియజేయు శ్రీరామావతారమును; పూర్ణత్వమును, శోక మోహములు లేని ఉన్నతపరిణామమును, మహిమోపేతమునునైన శ్రీకృష్ణావతారమును, ఆ యవతారమున దుష్టశిక్షణాది హింస కలదు - కాబట్టి దానికంటెను ఉన్నతమగు నట్టిదియు, మానవజాతి సముద్ధరణకై సర్వసంగ పరిత్యాగియై, యోగియై, పరిపూర్ణత నొందుటను బుద్ధావతారమును తెలుపునట.

---

* డాక్టర్ రాధాకృష్ణపండితులును, డాక్టర్ బి. పెంటమ్మగారును ఇంచుమించు ఈ యర్థమునే తెలిపిరి.

రాబోవునది కల్క్యవతారము. ఈ అవతారమున కల్కి ఖడ్గము చేబూని దుష్టుల సంహరించునట. మానవుని యిట్టి వివిధదశా పరంపరల తెలుపు రూపకల్పనయే దశావతార కథనము సూచించుననిరి.

పైన చెప్పినవిధము వినుటకు కొంతవఱకు బాగుగనె యున్నది. కాని బుద్ధభగవానుని తరువాత వచ్చు కల్క్యవతారము పరశురామునివంటి అవతారమేగదా! బుద్ధావతారమునకంటెను హింసారహితము, గాంధీమహాత్మునికంటెను గొప్పవాడుగను తన దివ్యతేజముచేతనే లోకమును పాపరహితముగ చేయు అతిమానుషశక్తియు, దివ్యభావమును కలిగియుండవలయుగదా! అయిన కల్కి అట్టివాడని చెప్పియుండలేదే! ధర్మద్వేషులను ఖడ్గముతో సంహరించు వాడనిరి. కనుక పై సిద్ధాంతము సంతృప్తి నివ్వజాలదు.

ఇంకొక విధముగ చెప్పుదురు. మాతాపితల శోణితశుక్లములు జల(ద్రవ) రూపమున నున్న ఆస్థితియందు ప్రాణి మత్స్యమూర్తి. గర్భమున తిరుగునపుడు కూర్మము. పుట్టి శైశవమున కాళ్ళపై దోగాడునప్పుడు వరాహము. చిన్నతనమున తెలియకచేయు హింస నరసింహము. బాల్యమున వామనరూపము. ఈ విధముగ పరిపక్వస్థితి వచ్చుటను తక్కిన అవతారము లందురు. కాని పరిణామము పరిపూర్ణత నొందినపుడు తిరిగి వెనుకకుపోయి యుద్ధమున మానవ మారణమును చేయు కల్క్యవతార ప్రయోజనము సిద్ధావస్థను సూచింపదు. కనుక యీ కల్పనము సహితము తృప్తికరమైనది కాదు. దీనికంటె అవతారముల అంతరార్థము మనకు తెలియదనుట యుక్తము.

శ్రీమద్భాగవత పురాణము ననుసరించి మొదటి మనువుకాలమున విష్ణువు యజ్ఞపురుషుడుగ అవతరించి, రాక్షసులను సంహరించినట్లును, ఆ మనువు కాలమునందే బ్రహ్మదేవుని నాసికారంధ్రముననుండి విష్ణువు అంగుష్ఠమాత్ర శరీరముతో యజ్ఞవరాహమూర్తిగా అవతరించి క్షణమాత్రమున పర్వతోపమాన శరీరుడై హిరణ్యాక్షుని సంహరించి భూమి నుద్ధరించినట్లును, కలదు. రెండవ మనువు కాలమున వేదశిరుడను

విప్రునికి హరి కుమారుడై పుట్టి బాలబ్రహ్మచారి యయ్యెను. మూడవ మనువు కాలమున ధర్మునకు సూనృతయందు అవతరించి సత్యసేను డనబడెను. నాలుగవ మనువు కాలమున హరిమేధుడను నతనికి హారిణి అను భార్యయందు హరిపుత్రుడై యవతరించి మకరిచేత పట్టుపడిన గజేంద్రుని రక్షించెను. (ఇదియే గజేంద్రమోక్షణ కథనము) అయిదవ మనువు కాలమున శుభ్రుడను నతనికి వికుంఠమను భార్యయందు వైకుంఠుడను నామమున నవతరించి భూమియందు వైకుంఠమను నగరమును నిర్మించి సమస్తలోకములచే మ్రొక్కు లందెను.

ఈ వైకుంఠమునే ఋషులు, దేవతలు ఆపదలయందు దర్శించి భగవంతుని ప్రార్థించిరని మనమూహింపవచ్చును. జయ విజయులు ఈ వైకుంఠమునందే ద్వారపాలకులై యుండిరనియు, సనకసనందనాదులచే శపింపబడియుండవచ్చు ననియు మన మూహింపవచ్చును. ఏలయన బ్రహ్మాండమున కావలనున్న వైకుంఠమునకు నెవ్వరును శరీరముతో పోజాలరు. అది అసాధ్యము. ఆ వైకుంఠప్రాప్తి శరీరము వదలి భక్తులగువారు దేవపురుషుని (ఆతివాహిక పురుషుని) సహాయమున అర్చిరాది మార్గమున పోవలసినదే గాని శరీరధారులు అందు ప్రవేశింపజాలరు. (అర్చిరాది మార్గమును గుఱించి యీ గ్రంథముయొక్క ప్రథమభాగము నందలి మూడవ ప్రకరణమున వివరించితిని.)

ఆఱవ మనువు కాలమున వైరాజు అనునతనికి సంభూతియను భార్యయందు "అజితుడు" అను నామమున హరి అవతరించెను. ఆ అజితుడే క్షీరసాగర మథనకాలమున కూర్మావతారమెత్తి మందరాద్రిని మోసెను. మోహినియై దేవతలకు అమృతమును పంచెను. ఆ మన్వంతరము కడపటనే మత్స్యావతారము జరిగియుండవచ్చును. లేదా యేడవ మనువు కాలము ప్రారంభమునందైనను జరిగియుండును. ఏడవ మనువు (ప్రస్తుతమనువు వైవస్వతుడు) కాలమున అదితికశ్యపులకు వామనుడై అవతరించెను. శ్రీరామ, పరుశురామ, శ్రీకృష్ణ, బలరామా ద్యవతారము లన్నియు ఈ మనువు కాలముననే జరిగెను.

శ్రీహరి కేవలము దుష్టశిక్షణకై అవతరించినట్లు భావింపరాదు. శిష్టరక్షణమే ప్రధానము. దుష్టశిక్షణము ఆనుషంగికము. భగవంతుడగు శ్రీహరి లోకులకు బహుళార్థసిద్ధికై అవతరించును. కొందఱు భగవంతుడు పుత్రుడు కావలెనని ఉపాసింతురు. తపమాచరింతురు. కొందఱు భర్త కాగోరుదురు. కొందఱు గురుడు కావలెనని కోరుదురు. ఇట్లు అనేకులు అనేకవిధముల భగవంతునితో సంబంధము కలిగి యుండుటకై భగవంతుని సేవింతురు. అందఱియొక్క అభీష్టములు సిద్ధింపజేయుటకై శ్రీహరి అవతరించును. ఆకాలమున శిష్టరక్షణ, దుష్టశిక్షణమేగాక భక్తులకోరిక లెన్నియో సిద్ధించును. మత్స్య, నారసింహావతారములు రెండే యితరులతో అంత సంబంధము లేకుండ జరిగినవి.

జిజ్ఞాసువు:- విష్ణు దేవుడు గాని, విష్ణులోకముగాని కేవల ఊహాకల్పిత మనియేనా మీ అభిప్రాయము?

వేదాంతి :- ఇది చాల సూక్ష్మమగు విషయము. కేవల కల్పనామాత్ర మని నేనను. తత్త్వము సూక్ష్మము, స్థూలము అని ద్వివిధము. సూక్ష్మతత్త్వము ఆత్మజ్ఞానము కొఱకును, స్థూలము ఉపాసనకొఱకును, ఉపయోగించు కొందుము. వైకుంఠమున శ్రీమన్నారాయణుడు శ్రీదేవి, భూదేవి, నీలాదేవులతోను శేషశయనుడై ఉన్నాడనియే సంశయరహితముగ నమ్మి త్రికరణశుద్ధిగా భగవంతుని ఆవిధముగ ఉపాసింపవలయును. ఈ మార్గము నందు పైన నీవడిగిన ప్రశ్నగాని, సంశయముగాని కలుగరాదు. సూక్ష్మతత్త్వ మట్లు కాదు. ఉన్నది ఉన్నట్లు వాస్తవమును తిలకింపజేయును. అధికారి భేదమునుబట్టి రెండును ఆవశ్యకములే.

శ్రీమన్నారాయణుడు వైకుంఠమున, విష్ణులోకమున, క్షీరసాగరమున శ్వేతద్వీపమున ఉండునని పురాణములు చెప్పుచున్నవి. సర్వవ్యాపియగు శ్రీనారాయణుడు పై నాలుగు స్థానములయందు మాత్రమే యుండునని సర్వత్ర లేడని అర్థము కాదు. భగవద్విభూతి ఆ నాలుగింటిలో కడపటిదగు శ్వేత ద్వీపమునకంటె ఉత్తరోత్తరము (పూర్వపూర్వము) అధికమని, అందు వైకుంఠము శుద్ధసత్త్వ ప్రధానమని యందురు. ఆ దేవుడు

సర్వవ్యాపి యయ్యును, భక్తానుగ్రహముకొఱకు దీపోత్పన్న దీపములవలె పై నాలుగు స్థలములయందును తేజము ఎక్కువ తక్కువలతో వేంచేసి యుండును.

త్రిమూర్తులు నరులు కాదు. వారిదేహములు ప్రార్థివములు కావు. తేజోమయములు నేత్రమునకు శరీరమువలె కనబడును గాని వాస్తవముగ బ్రహ్మాదిదేవతల శరీరములు ఇదివఱలో నేను చెప్పిన దేవతల శరీరములవంటివి. రక్తమాంస మయములు కావు. కాని వారు కోరినపుడు వారు ప్రాకృత (అధిభౌతిక) శరీరధారు లగుదురు. పుణ్యాము చేసిన మానవుడు మరణించిన ఆ జీవుడు పితృయానమున పోవునట్టి స్వర్గము వేఱు. రావణుడు దండెత్తిపోయిన స్వర్గము, అందలి దేవతలు వేఱు. మానవులలో గొప్పవారు దేవతలుగా ఎన్నబడిరి. టిబెట్ (త్రివిష్టపము) ఒకప్పుడు స్వర్గ మనినట్లును, ఉత్తరధృవప్రాంత భూమిని ఒకప్పుడు స్వర్గమని చెప్పినట్లును ఊహింపవచ్చును. రావణాది రాక్షసులు, దేవగంధర్వాదులు నరులే. మనువుయొక్క ధర్మమును అనుసరించిన వారు మాత్రము మానవు లనబడిరి.

-: శైవ తత్త్వము :-

శైవాగమములయందు ద్వైతమును బోధించునవి శివాగమము లనియు, ద్వైతాద్వైతమును బోధించునవి రుద్రాగమము లనియు, అద్వైతమును బోధించునవి భైరవాగమములనియు చెప్పుదురు. ఈ విధముగ శైవము మూడు శాఖలై యున్నది.

శివుని గుఱించి పురాణము లిట్లు వర్ణించెను. ఆయన చతుర్భుజుడు. త్రినేత్రుడు, వ్యోమకేశుడు (ఆకాశమే జటాజూటముగ గలవాడు) చంద్రమౌళి, గంగాధరుడు, నందివాహనుడు, త్రిశూలమును పరశువును ఆయుధములుగ ధరించినవాడు, కైలాసవాసి, శ్మశానవాసి అనిరి.

కీ.శే. డగు M.A.Ph D. పట్టమును పొందిన ఒక ప్రఖ్యాత పండితుడు శివుని గుఱించి యిట్లు వ్రాసెను :-

శివుడు హిమాలయములయందు అనార్య జాతులకు ప్రభువు. అచ్చట చలి అధిక మగుటవలన వస్త్రములకు బదులు గజచర్మమును, పులిచర్మమును ఆయన ధరించును. దేహమునకు విభూతి పూసికొనును. అది చలిని కొంతవఱకు ఆపును. ఆ అరణ్యప్రాంతములందు నిమ్నోన్నత ప్రదేశ మగుటవలన రథ, గజ, తురగముల నెక్కి సంచరించుట కష్టము. కనుక ఆ ప్రదేశమున తిరుగుటకు అనుకూలముగా నుండునని ఎద్దును వాహనముగా చేసికొనెను.

నే నీ సిద్ధాంతమును అంగీకరింపను. మన మతతత్త్వము ననుసరించి వృషభము ధర్మదేవతా చిహ్నము. ధర్మమును మన పూర్వులు వృషభరూపమున వర్ణించిరి. వృషభమునకు నాలుగు పాదములు. అట్లే ధర్మమునకు తపస్సు, జ్ఞానము, యజ్ఞము, దానము అను నాలుగు పాదములు. ఇందులోనే ఒక్కటి లోపించినను ధర్మము మూడు పాదములతో నిలిచియున్నదని అందురు. మూడు లోపించిన ధర్మము ఏకపాదమున నిలిచియున్న దందురు. ఆ పాదముకూడ నశించిన లోకముకూడ నశించునేమో. భగవంతుని మనము దర్శింప వలయునన్న ధర్మమును తప్పక అనుష్ఠింపవలయును. ధర్మము నుండియే భగవద్దర్శనము కలుగును. కనుక శివాలయమునకు మనమేగినపుడు మనకు ముందు నందియు, ఆవల శివుడును దర్శన మగుదురు. మనము శివాలయమునకు పోయిన శివుని తొలుత నంది కొమ్ముల మధ్యనుండి దర్శనము చేసికొను ఆచార మున్నది. శ్రీరామలక్ష్మణులకు వనవాసకాలమున శివుడు ప్రత్యక్ష మైనట్లును, రామలక్ష్మణులు తొలుత వృషభవాహనమునే దర్శించినట్లును పిమ్మట శివదర్శనము వారికి కలిగినట్లును శివగీతయందు కలదు. (శి. గీ. 4-24, 27, 28)

వృషభము శివునకు వాహనమైన కారణము మహాభారతము నందలి అనుశాసనిక పర్వమున నిట్లు చెప్పబడెను -

ఒకప్పుడు దేవతలు ఆకలిచే బాధపడుచుండగ బ్రహ్మదేవుడు వారికి అమృతము నొసగెను. అమృత సౌరభము (సువాసన) నుండి,

సురభి (కామధేనువు) పుట్టినది. కామధేనువుయొక్క సంతానమగు వృషభమును బ్రహ్మదేవుడు శివునకు వాహనముగ ఇచ్చినట్లు గలదు. ఇది మతమును తెలుపును., మఱియు నందికేశ్వరుడు తపమొనర్చి శివుని మెప్పించి ఆయనకు వాహన మైనట్లు కలదు. ఇది స్థూల పద్ధతి. తత్త్వదృష్టితో ఋషభము ధర్మదేవతా చిహ్నమే.

మహాభారత అనుశాసనిక పర్వము 4వ ఆశ్వాసమున ఉమామహేశ్వర సంవాద మను ఇతిహాసమును కలదు. అందు ఉమాదేవి శివుని నిట్లు ప్రశ్నించినట్లున్నది :-

నీవు శ్మశాన వాసివైతి వెందులకు? కపాలమాలలు, సర్పములు ధరించుటేల? అందులకు శివుడు తెలిపిన సమాధానమం దిట్లున్నది - లోకస్వరూపము శీతలమును, ఉష్ణమును అను రెండు విధములుగా నున్నది. ఈ రెండింటియొక్క సంకలనమే సకల ప్రపంచము. సౌమ్యమును విష్ణువును, ఆగ్నేయమును నేనును వహింతుము. కనుక "ఆగ్నేయభావ రూఢమైన యాకృతి లోక హితార్థముగ వహించినాడ" నని చెప్పెను.

ఈ వాక్యమునందు అనేక అర్థములు ఇమిడి యున్నవి. దేవి అడిగిన ప్రశ్నలకు సమాదాన మిందున్నది. శ్మశానము వైరాగ్యమునకు నిలయము, సర్వము లయమగుచోటు, కనుక లయకర్తకు నివాస మగును. సర్వభూమండలాధిపతియు, భిక్షుకుడును, సకల లోకమును మోహింపజేయు సౌందర్యరాశి యగు యువతియు, కురూపియు కడపట అచ్చటనే చేరుదురు. చితియందు కాలుచున్న శవమును చూచిన నెవరికి వైరాగ్యము కలుగకుండును? మొలలోతు గుంతలో శవమును వేసి మట్టిచే కప్పి బంధువులు వారియిండ్లకు పోవుచున్న దృశ్యమును తిలకించిన నెవరికి వైరాగ్యము కలుగకుండును? సమస్తము బూదియైన పిదప కావలసిన దేమున్నది? అదియే కడపటిస్థితి. కనుకనే యెట్టివానికైనను శ్మశానమున వైరాగ్యము కలుగును. అది శివునకు నిలయ మనుటలో అంతరార్థమదియే నెలవంక నేల దాల్చితివని దేవి అడిగిన ప్రశ్నకు శివుడిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"దక్షాధ్వర ధ్వంసకాలమున చంద్రుడు నా పాదము క్రింద పడెను. నేను వానిని త్రొక్కితిని. అప్పుడు చంద్రుడు నన్ను శరణువేడెను. కరుణించి చంద్రుని శిరమున ధరించితిని." ఇది మతతత్త్వము. శివుడు శరణాగత వత్సలుడని బోధించును. శివుడు కైలాసవాసి. కైలాసమనగా ఏది? హిమాలయమందలి ఒకశిఖరము. అచట భక్తానుగ్రహము కొఱకు శివుడు నివసించు నందురు. శివుని అనుగ్రహము గోరి తపమాచరించువారు అచ్చటికిగాని, ఆ సమీపమునకుగాని పోయి తపమాచరించిన శివుడు శీఘ్రముగ ప్రత్యక్ష మగును. ఇతరప్రదేశములయందు తపమాచరించిన అంత అల్పకాలమున సిద్ధి లభింపదు. ఇది స్థూలముగ చెప్పిన విషయము. అధ్యాత్మముగ కైలాసమనిన "కేళినాం=ఆనందానాం కైలం. తేన ఆస్యతే = స్థియతే, ఇతి కైలాసం - అస ఉపవిశనే -" అనగా : కేళి = ఆనందము, దానిసమూహము కైలము. కైలమునకు స్థానము కైలాసము. బ్రహ్మానందము లభించుచోటు. కైలాస మనగా సహస్రారమనికూడ అందురు.

మనపూర్వులు తపశ్శక్తిని పర్వతములకు పోయి సంపాదింతురు. కనుక శక్తి పర్వతరాజపుత్రికయై అవతరించినది. పార్వతిదేవి శక్తి. విశ్వమును పోషించుటకు విష్ణుదేవునకు లక్ష్మీదేవి సహాయము కావలెను. విశ్వలయమునకు శివునకు శక్తిసహాయ మవసరము.

శివుడే రుద్రుడని శివ రుద్రనామములు ఒక శివునికే చెప్పబడినవని శాస్త్రములయందు కలదు. అట్లు కాదు, రుద్రుడు శివాంశమే అన్నారు. అనగా శివునికంటె భిన్నమగు వ్యక్తి శివునికంటెను తక్కువ మహిమ గలవాడు. పుట్టినప్పుడు రోదనము చేసినందున రుద్రుడను నామము కలిగిన దందురు. ఈ విధముగ రుద్రునకు జన్మ మున్నట్లు శాస్త్రములు చెప్పినవి. కాని శివుడే బ్రహ్మదేవునకు వరము లొసంగి బ్రహ్మలలాటమందు జన్మించె నందురు. సంహారశక్తియగు రుద్రుడు తన నైజప్రవృత్తిని విడువలేదు. బ్రహ్మశిరములలో ఒకదానిని త్రుంచెను. ఇది స్థూలముగ పురాణగాథ. ఈ కథ యదివఱకు చెప్పియుంటిని. రుద్రుడు శివాంశమైనను శివునికంటె తక్కువ తేజస్వి యనిరి. మహాభారతమునందలి అనుశాసనిక

పర్వమున రుద్రుడు సనత్కుమార మహర్షి కడకేగి తత్త్వోపదేశము పొందినట్లు చెప్పబడినది. కాని శైవోపనిషత్తులయందు రుద్రుడు పరబ్రహ్మమని "రుద్ర" శబ్దము పరబ్రహ్మవాచకముగా ప్రయోగింపబడినది. అథర్వశిరోపనిషత్తునందు ఈ యంశము స్పష్టముగా కలదు. అందిట్లున్నది:-

ఓం దేవాహ వై స్వర్గం లోకమగమస్తే దేవా రుద్రమ పృచ్ఛ న్కో భగవానితి? సోఽబ్రవీదహమేకః ప్రథమా సంవర్తామి చ భవిష్యామి చ నాన్యః కశ్చిన్మత్తో వ్యతిరిక్త ఇతి (1)

తా॥ దేవతలు రుద్రుని నివాసమగు స్వర్గమున కేగి రుద్రునితో "ఓ భగవాన్ నీవు ఎవ్వడ" వని రుద్రుని ప్రశ్నించిరి. రుద్రుడు ఈ విధముగా పలికెను. "నేను ఒక్కడనే మొట్టమొదట ఉంటిని. ఇప్పుడును ఉంటున్నాను. ముందును ఉండగలను. నాకంటె అన్యుడెవ్వడును ఉండియుండలేదు. ఇకమీదటను ఉండబోడు"

పై వాక్యములవలన దేవతలు రుద్రుని పరబ్రహ్మమని తెలిసికొని యీవిధముగా స్తుతించిరి :-

"ఓం యో వై రుద్ర స్స భగవాన్ యశ్చ బ్రహ్మ తస్మై వైనమో నమ." అని ప్రారంభించి విష్ణు, మహేశ్వర, ఉమ, వినాయక, స్కంద, ఇంద్ర, అగ్ని ప్రభృతుల రూపములతో ఉన్నవాడు ఆ రుద్రుడే యని, అట్టి భగవంతుడైన ఆ రుద్రునకును ఆయా బ్రహ్మాది దేవతలకును నమస్కరించు చున్నామని స్తుతించిరి.

రుద్రునిగుఱించి వేదములు ఆగమములు చెప్పినవి. రుద్రుడు పంచముఖుడని యందురు. అందు తూర్పుముఖమును తత్పురుషమనియు, పశ్చిమముఖమును సద్యోజాత మనియును, ఉత్తరముఖమును వామదేవమనియు, దక్షిణముఖమును అఘోరమనియు, ఊర్ధ్వముఖమును ఈశాన్య మనియు నామములచే పేర్కొందురు. పంచముఖములను పంచబ్రహ్మలని పంచబ్రహ్మోపనిషత్తు చెప్పినది. పంచముఖములకు కళలు వర్ణములు వేఱు వేఱుగా చెప్పబడినవి. పంచముఖములని

చెప్పినప్పుడు బాహువులు పది అని ప్రత్యేకించి చెప్పనవసరము లేదు. పంతముఖములు బాహుదశకమును సర్వవ్యాపకత్వ, సర్వశక్తత్వములకు చిహ్నములు. శివుడు పదిచేతులయందు ధరించిన అభయము, టంకము, మొదలగు భూషణములు (ఆయుధములు) ఆయన సర్వజ్ఞుడని సూచించును. పంచముఖము లనగా తత్త్వము ననుసరించి శివునిశరీరము పంచమంత్ర కల్పితమని సృష్టి, స్థితి, లయములు, జీవతిరోధాన, మోక్షములను పంచకార్యములయందు తోడ్పడు ఉపనిషత్తులు చెప్పిన పరబ్రహ్మము. మతదృష్టితో చూచిన ఈశ్వరుడు (శివుడు).

రుద్రుడు దేవతలలో శ్రేష్ఠుడని ఋగ్వేదము చెప్పినది.

"శ్రేష్ఠో దేవానాం వసుః" (ఋక్కు ౫౧౪)

ఋగ్వేదము ౯వ అధ్యాయము 45వ సూక్తము నందు అగ్నిని "రుద్రులు" అని బహువచనములతో స్తుతించిరి. సూర్యుడు రుద్రుడే. ఋగ్వేదము అగ్నికిని రుద్రునకును అభేదము చెప్పినది. సూర్యుడు రుద్రాంశము విష్ణ్వంశము అనియు చెప్పినట్లు కలదు. రుద్రుడు దహించువాడు, ద్రవింపజేయువాడు. వేదములయందు ప్రసిద్ధి కెక్కిన రుద్రుడు మహాభారతరచనా కాలమునకు ఆయన బ్రహ్మకు పుత్రుడైనట్లు ఆయన గొప్పతనము తగ్గింపబడినది. మహాభారతమునందలి అనుశాసనికపర్వమున రుద్రుడు సనత్కుమారుని కడకేగి తత్త్వజ్ఞానమును తెలిసికొన్నట్లు చెప్పబడినది.

జిజ్ఞాసువు :- ఏకాదశరుద్రు లందురు కదా? ఆ ప్రసిద్ధి యెట్లు కలిగెను?

వేందాంతి :- వేఱు వేఱు శాస్త్రములయందు భిన్న భిన్న రీతుల చెప్పిరి. ఇదివఱలో నేను గోలోకమును గుఱించి చెప్పిన సందర్భమున సురభి, మార్తాండులకు తొలుత ఏకాదశరుద్రులు జన్మించిరని చెప్పియుంటిని. వారి నామములు సహితము అందే యిట్లు చెప్పబడెను- (1) అజపాత (2) అహిర్బుధ్న (3) త్రియంబక (4) వృషాకపి (5) శంభు

(1) అజపాత (2) అహిర్బుధ్న (3) త్రియంబక (4) వృషాకపి (5) శంభు (6) కామారి (7) దైవత (8) హర (9) బహురూప (10) ఉగ్ర (11) విశ్వరూప అనువారు. వీరు బ్రాహ్మణజాతికి మూలపురుషులని కూడా చెప్పబడినది.

జిజ్ఞాసువు :- శివుడు చతుర్ముఖు డందురు గదా?

వేదాంతి :- అదియు వాస్తవమే. పూర్వము సుందోపసుందు లను రాక్షసులను సంహరించుటకై యముడు తిలోత్తమ యను స్త్రీని సృష్టించెను. తిలోత్తమ శివునకు నమస్కరించుటకు ఆయనకు ప్రదక్షిణము చేయుచుండగా, ఆ స్త్రీ దేవకార్యము సాధింపగలదా లేదా అని శివుడు ఆమెను చూచుటకు అమె యేప్రక్కకు (దిశకు) తిరిగిన ఆ దిశ ఒక ముఖముండునట్లు సంకల్పించెను. ఆ విధముగా శివునకు నాలుగు దిశలయందు నాలుగు శిరములు (ముఖములు) కలిగెనని అనుశాసనిక పర్వమునందు చెప్పబడినది.

శివుడు వ్యోమకేశుడు, అనగా :- ఆకాశము శిరస్సుగా గలవాడని అర్థము. ఆకాశమునందే చంద్రుడున్నాడు. అందువలన శివుడు చంద్రమౌళి యయ్యెను. మేఘమునందు జలము కలదు. అదే ఆకాశగంగ (వియద్గంగ) ఆయన వ్యోమకేశు డైనపుడు గంగాధరు డగును కదా? అదిగాక శివుని ఫాలనేత్రము లోకములను దహింప జేయగల శాంభవాగ్ని గలది, ఆ అగ్ని వేడిమిని తగ్గించుటకు శిరమున శివుడు గంగను, చంద్రుని ధరించె నందురు. మఱికొందఱిట్లు చెప్పుదురు. గంగ విష్ణుపాదోద్భవ. అనగా - విష్ణుదేవుని పాదముల యందు భక్తులకు కలిగియుండెడి అచంచల భక్తియే గంగ యనిరి. గంగ సకలపాప సకల తాపముల హరించునది. భక్తియు నట్టిదే. శివుడు లోకహితార్థము భక్తిని గౌరవించుటకు భక్తిని (గంగను) శిరమున ధరించె నందురు. శివుడు నాగభూషణు డనగా బుద్ధిని భూషణముగ కలవాడని అర్థము.

(1) ఆయన త్రిశూలహస్తుడు. శూలమనగా : ప్రకృతి. అది సత్త్వరజస్తమో గుణాత్మకము. శూలమునందున్న మూడు మొనలు

మూడు గుణములు. ప్రకృతి ఆయన ఆధీనమని ఆయన హస్తగతమని అర్థము. (2) ఇంకొక హస్తమున గండ్రగొడ్డలి ధరించినట్లున్నది. శివుడు పశుపాశ విమోచనమునకై పరశువు నుపయోగించు నని అర్థము. (3) ఒక చేతిలో ఆయన హరిణము పట్టుకొని యుండును. లేడి వాయువునకు వాహనము. వాయువు చంచలస్వభావము గలది. చంచలమైన మనస్సును దాని యిష్టానుసారము పోనివ్వక పట్టియున్నా డనుట కది చిహ్నము. (4) మఱియొక చేతిలో ఢమరుకము గలదు. దానిని ప్రయోగించిన దానియందుండి వెలువడు శబ్దము సృష్టి బీజము. అదియే తాండవమున లయకారణ మగును. (5) ఒక హస్తము అభయమును సూచించును. (6) ఇంకొక హస్తమున ఖడ్గము, (7) అంకుశము, (8) గంట, (9) వజ్రము, (10) అగ్ని. ఎప్పుడో ఒకప్పుడు పినాక మను పేరు గల ధనుస్సును* ధరించును.

వాస్తవమునకు ఇట్టి రూపధారి యైనను కాకున్నను శివ (రుద్ర) తత్త్వవిదులగు ఆగమవేత్తలు ఆ దేవతా తత్త్వమునకు అనుగుణముగా సంకేతములను కల్పించి యుందురని తోచును. కాని నిరవయవ మగు శివలింగమే పూజనీయము. శివునకు సూర్యచంద్రాగ్నులు మూడు నేత్రములు. అవియే త్రిగుణములు. ఫాలాక్షము అగ్ని నేత్రము. అది దివ్యము. అది సకలలోకములను భస్మము చేయగలదు. శివుని మూడునేత్రములు మూడు వేదము లని కుమారిలభట్టు చెప్పినాడట. ఏనుగు చర్మమును ధరించుట చలిబాధ నివారణ కొఱకు కాదు.

* పూర్వము కణ్వుడను ముని గొప్ప తప మాచరించెను. ఆయనపై ఒక పుట్ట పెరిగి ఆ పుట్ట యందు వెదురుచెట్టు పుట్టి వృద్ధినొందెను. బ్రహ్మదేవుడు మునికి ప్రత్యక్షమయి వరము లొసంగెను. ఆ వెదురు లోకసామాన్యమగు వెదురుగాక అపూర్వము. విశేషముగ చేవ గలదగుటచే బ్రహ్మదేవునకు దానియందు ప్రీతి కలిగి దానిని తీసికొని విశ్వకర్మచే రెండు ధనుస్సులును దాని కొనతో మఱియొక ధనుస్సును చేయించెను. అందులో పినాకమను పేరిడిన దానిని శివునకును, శార్‌ఙ్గమను పేరిడిన దానిని విష్ణువునకును, బ్రహ్మదేవు డిచ్చి, గాండీవమను పేరిడిన దానిని బ్రహ్మ తన లోకమునకు తీసికొని పోయెను. అదియే ద్వాపరమున అర్జునునకు లభించెను.

శివుడు తన గర్భమునం దుండునట్లు అతడు శివుని వరము కోరెను. శివుడు అట్లే వరము నొసంగి గజాసురుని గర్భమున నివసించుచుండెను. శివుని దేవతలు గజాసురుని గర్భమునుండి వెలుపలికి వచ్చునట్లు చేసిరి. గజాసురుడు మరణించెను. గజాసురుడు అజ్ఞాని. అజ్ఞానులయెడ శివునకు దయ. అహంకారులయెడ దయలేదు. గజాసురుడు చంపబడిన తరువాత అతని యందలి దయచే అతని చర్మమును వస్త్రముగ ధరించెను. ఇది మతతత్త్వము.

-: శక్తితత్త్వము - శ్రీవిద్య :-

శైవము వలెనే శాక్తేయము సనాతన మతము దుర్గోపాసన మహాభారత విరాట పర్వాంతర్గత పాండవ ప్రవేశపర్వమునందలి ఆఱవ అధ్యాయమున కలదు. యుధిష్ఠిరాదులు శమీ వృక్షముపై వారి ఆయుధములను నిక్షిప్తము చేసిన పిమ్మట, ధర్మరాజు విరాటనగ రాభిముఖుడై పోవుచు దుర్గాదేవిని స్మరించి, భక్తి భరితుడై" ఓదేవీ! నీవు సకల లోకేశ్వరివి. యశోదాదేవి గర్భ సంభూతురాలవు. ఆశ్రితుల దుర్గమములగు సంకటములను పరిహరించు దాన వగుటచే నిన్ను 'దుర్గ' యని పిలుతురు. మాకష్టములను బాపుము." అని యింకను అనేక విధముల స్తుతించెను. దుర్గ యుధిష్ఠిరునకు ప్రత్యక్షమై అజ్ఞాతవాస సమయమున వారి నెవరును గుర్తింపకుండు లాగునను, రాబోవు కురుపాండవ యుద్ధమున కౌరవులు నశించునట్లును, పాండవులకు జయము కలుగునట్లును వరముల నిచ్చి, అంతర్ధాన మైనట్టు కలదు.

మఱియు కురుక్షేత్ర సంగ్రామారంభమున అర్జునునకు దుర్గ నుపాసించుమని శ్రీకృష్ణ భగవానుడు ఆదేశించెను. ఆ యాదేశానుసారము అర్జునుడు భక్తితో దుర్గను ఇట్లు స్తుతించెను. "ఓలోకమాతా! నీవు నందగోపుని పుత్రికవు. దుఃఖమును పోగొట్టుదానవు. జయము నిచ్చుదానవు" అని యుధిష్ఠిరుని వలెనే అనేక విధముల స్తుతింపగా దుర్గాదేవి కృష్ణార్జునులకు ప్రత్యక్షమై యుద్ధమున కౌరవులు నశించునట్లును, పాండవులకు జయము కలుగుట్లును వరమును ప్రసాదించి అంతర్ధాన

మయ్యెను - ఈ యంశము మహాభారతాంతర్గత భీష్మ పర్వమునందలి 23వ అధ్యాయమున కలదు. ఇందువలన లలితోపాసనకంటె దుర్గోపాసన ప్రాచీనమని విదిత మగుచున్నది.

శాక్తేయము శైవము వలెనే సనాతన మతము. శ్రీమద్భాగవతము ననుసరించి చూచిన రుక్మిణీదేవి వివాహకాలమున "నమ్మితి నామనంబున" అని సనాతన దంపతులగు పార్వతీపరమేశ్వరులను మనమున ధ్యానించినది. "ఇందుధర సుందరీ మందిరంబు చేరి" అని ఉన్నందున ఆ కాలమునకే దేవికి ఆలయములు, దేవీ విగ్రహపూజయు ఉన్నట్లు విదితమైనది.

ఈశ్వరుడు (దేవుడు) స్త్రీమూర్తి యనుభావము కేవలము భారతదేశమునకుమాత్రమే చెందినది కాదు. ఒకప్పుడు జగద్వ్యాప్తమై యుండెనని తోచును. తొలుత భారతదేశము నందుండియే యీ భావము ఇతరఖండములకు దేశములకు వ్యాపించి యుండినను నుండవచ్చును. క్రీస్తునకు పూర్వము గ్రీసుదేశమునందలి ఏథెన్స్ నగరమున నున్న దేవాలయము లన్నిటిలోను పార్తినాన్ దేవాలయము ముఖ్యమైనదట. అందుండు "ఎతీనా" విగ్రహము స్త్రీ విగ్రహము. ఇట్టి దృష్టాంతము లనేకములు చెప్పవచ్చును.

శాక్తేయ మన్నపుడు నేను వెనుక చెప్పిన కాళీతారా, షోడశీ మొదలగు విద్యలన్నియు అందు అంతర్భూతములే. అవి శిష్టజనా మోదమును పొందలేదు. శుభాగమములచేత చెప్పబడినట్టి శ్రీవిద్య (శ్రీతత్త్వము) మాత్రమే శిష్టజనామోదమును పొందినది.

ఇది విలక్షణమైన తత్త్వము. దీనిని మహర్షులు, మహాకవిపుంగవులు, తత్త్వవేత్తలు ఆమోదించిరి. ఈ విద్య విస్తరించుటతో దీనియందు కాలానుగుణముగ కొన్ని మార్పులు జరుగుచు వచ్చెను. అది సహజమే.

ప్రాచీన ఉపనిషత్తుల యందు చెప్పిన పరబ్రహ్మము శుద్ధ చైతన్య స్వరూపుడు. శ్వేతాశ్వతర శ్రుతియందు చెప్పినట్లు "మాయాం తు ప్రకృతిం విద్ధి" మాయయు, ప్రకృతియు ఒక్కటియే. అనగా : చైతన్యము కానిదని

విద్ధి" మాయయు, ప్రకృతియు ఒక్కటియే. అనగా : చైతన్యము కానిదని అర్థము. చైతన్యము కానిదనగా: జడము (తెలిసికొన లేనిది) అనగా: తెలియబడునది. వేదాంతుల ఆత్మ చైతన్యము; మాయ జడము. శాక్తమునందు శక్తి జడద్రవ్యము కాదు. శైవతత్త్వము ననుసరించి మాయ, ప్రకృతి అనునవి శక్తితత్త్వము తరువాత నేర్పడిన తత్త్వములు. శాక్తతత్త్వమునందు ప్రకృతియు, పురుషుడును, శక్తియందంతర్భూతములు.

దేవిని గుఱించి దేవీభక్తులలో కొంద ఱిట్లు చెప్పుదురు. వెనుక దేవి, బాల, యోషిత్, పతివ్రత అను నామములతో పిలువబడునని చెప్పియుంటిని. అది మంత్రమునందలి బీజాక్షర సంఖ్యను బట్టి చెప్పబడినది. మఱియొక విధముగ (తత్త్వవిచారపరముగ) ఇట్లు చెప్పిరి:- పరాశక్తి పిండమున కుండలినీ శక్తి రూపమున కలదు. ఈమె సర్వాత్మకము. కుండలినీశక్తి సహజముగ ఎల్లప్పుడు నిద్రించుచుండును. సర్పమువలె మంద్ర స్వరము చేయును. పసిపాప యెక్కువ కాలము నిద్రించును. అప్పుడు పరాశక్తి తొమ్మిది సంవత్సరముల ప్రాయము కలదిగా 'బాల' 'కుమారి' అని పిలువబడును.

కుండలిని నిద్రనుండి లేచి మూలాధార స్వాధిష్ఠానములనెడి బ్రహ్మగ్రంథిని భేదించును. దానిని పురాణములయందు మధుకైటభ వధముగా వర్ణించిరి. రెండవ దశయందు దేవి మణిపూరక, అనాహత చక్రములను విష్ణుగ్రంథిని భేదించునపుడు దేవి పదునైదు వత్సరముల ప్రాయము గల యువతి (యోషిత్)అని పిలువబడును. ఇదియే మహిషాసుర వధగా పురాణములు చెప్పును. మూడవ దశయందు దేవి పదునాఱువత్సరముల ప్రాయముగల పతివ్రతగా పిలువ బడును. ఈమెయే షోడశాక్షరీమంత్ర స్వరూపిణి యగు త్రిపురసుందరీదేవి.

విశుద్ధచక్రము (పద్మము) కంఠమున నుండును. ఆ కమలమునకు 16 దళము లుండును. షోడశ నిత్యకళలయందు నివాస ముండును. అవి తిరుగుచుండును. ఆపై నున్నది ఆజ్ఞాచక్రము. దేవి విశుద్ధ ఆజ్ఞచక్రములను రుద్రగ్రంథిని భేదించును. పురాణముల యందు దీనిని

నిశుంభుని వధ అనిరి. దేవీ భాగవతమునందును ఇతర పురాణముల యందును మధుకైటభుల సంహరించినవాడు విష్ణుదేవుడని యున్నను దేవీభాగవతమునందు దేవియే (అంబ) వారిని కామవివశులనుగా చేయుటవలన వారు మోహము నొంది విష్ణునిదేవునిచే మృతిచెందిరి. కనుక వారి మృతికి దేవియే మూలకారణమని శాక్తేయుల మతము. ఇంతటితో (రుద్రగ్రంథిని భేదించుటచే) దేవి సహస్రారము నందున్న తన పతియగు శివునితో ఐక్యమగును. ఇది దేవీభక్తుల సిద్ధాంతము.

దేవీ భాగవతమునందును, సౌందర్యలహరి యందును వర్ణింపబడిన దేవీ నివాసమగు మణిద్వీపము సహస్రార చక్రము అందున్న కర్ణిక (బైందవము) శివశక్తులకు నివాసము.

శ్రీవిద్యయందు దేవి యెట్లు మాయ, ప్రకృతి అను వానికంటెను ఆధిక్యము పొందియున్న దనగా - అందుకు ఆమె జీవరూపమున నున్నదని చెప్పుటయే. ఆమె (శక్తి) మంత్రమునకు రెండు బీజములు కలవనియు అందొకటి సచ్చిదానంద స్వరూపమనియు, వేఱొకటి ప్రకృతి యనియు దేవీభాగవతమున చెప్పినట్లు వెనుక చెప్పియుంటిని. సచ్చిదానంద లక్షణములను పరబ్రహ్మమునకు (శుద్ధచైతన్యమునకు) మాత్రమే శ్రుతులు చెప్పినవి.

దేహిదేహములు రెండును శక్తియే యను దార్శనిక తత్త్వము మతములో ప్రవేశించి "దేవి చేతనా రూపిణీ"; "జీవరూపిణీ" యనియు "చైతన్య కుసుమ ప్రియా" యనియు నామముల యందుండుటవలన దేవిని చైతన్య కుసుమములతో పూజింపవలయునని; జీవములను (ప్రాణులను) దేవికి నైవేద్యముగ సమర్పించిన దేవి సంతసించునని; జంతుబలులు, నరబలులు ఇచ్చుటవఱకు దారితీసిన దేమో, కాని సమయాచార పరాయణుల మతము ననుసరించి ఆత్మ చైతన్యమునే పుష్పముగ దేవికి సమర్పించుటేగాని బలిసమర్పణము కాదు.

-: శాక్తతత్త్వమునందు లలితాభావము :-

శైవమునందు కాశ్మీర శైవము చాల ముఖ్యమైనది. ఇది శివసూత్రములనుండి ఉద్భవమైన దందురు. ఈ యంశమును ఇదివఱకే చెప్పితిని. కాశ్మీర శైవమునుండి శాక్తేయము నందలి 'లలితా' భావము కలిగినదని పండితు లందురు. లలితోపాసన లలితాసహస్ర నామముల నుండి కలిగినది. దానికాధారము బ్రహ్మాండ పురాణమను శాక్తపురాణము. లలితాభావము, అందుకు సంబంధించిన వాఙ్మయము ఏ కాలము నందుండి కలిగినదో చెప్పుట కష్టము. సుప్రసిద్ధ శాక్తపురాణమగు దేవీభాగవతము నందుగాని, శ్రీమహాభాగవతము (శాక్తపురాణము) నందుగాని లలితా ప్రస్తావనగాని, భండాసుర నామముగాని లేవు. శక్త్యుపనిషత్తుల యందందు కడపటిదగు బృహ్వృచోపనిషత్తునందు లలితానామము కలదు. అందు **"సచ్చిదానందలహరీ మహా త్రిపురసుందరీ బహిరంతర మనుప్రవిశ్య స్వయమేకైవ విభాతి, యదస్తి సన్మాత్రం యద్విభాతి చిన్మాత్రం యత్ప్రియ మానందం తదేత త్సర్వాకారా మహాత్రిపురసుందరీ. త్వం చాహం చ సర్వం విశ్వం సర్వదేవ తేతరత్సర్వం త్రిపురసుందరీ సత్యమేకం లలితా౨౨ఖ్యం వస్తు తదద్వితీయమ్..."**

తా॥ సచ్చిదానంద ప్రవాహమగు త్రిపురసుందరి బహిరంతరముల సర్వవ్యాపియై యున్నది. ఆమె యొక్కతెయే ప్రకాశించుచున్నది. ఆమె యునికియే సన్మాత్రము. ఆమె ప్రకాశించుటయే చిన్మాత్రము. ఆమె ప్రియమే ఆనందము. ఆమెయే సర్వరూపములతో ఉన్న మహాత్రిపుర సుందరి. ఆమెయే నీవును, నేనును, సర్వవిశ్వమును అయియున్నాము. సర్వదేవతేతరమగు సర్వమును త్రిపుర సుందరియే యేకైక సత్యము. లలితానామమున ఉన్న పరబ్రహ్మము ఆమెయే అద్వితీయమగు వస్తువు-

అటుపిమ్మట శ్రుతియందు 'తత్త్వమసి' ఇత్యాది వాక్యములయందు చెప్పబడిన తత్పద వాచ్యమగుబ్రహ్మము ఆమెయే యని విశదీకరింపబడినది.

సర్వము లలితయే అను నీభావము వలన లలిత జడమగు ప్రకృతి కాదు. మాండూక్యశ్రుతి చెప్పిన ఆత్మ (బ్రహ్మ) లక్షణము లన్నియు లలితా పక్షమున కలవు. లలితా సహస్రనామముల యందు ఆనామముల సంఖ్యను ఆయానామముల ముందు వ్రాయబడిన ఈ క్రింది నామము లున్నవి :-

(136) నిత్యా (139) నిర్గుణా (154) నిరుపాధిః (155) నిరీశ్వరా (198) సమానాధికవర్జితా (262) తుర్యా (265) బ్రహ్మరూపా (292)పూర్ణా (304) హేయోపాదేయ వర్జితా (384) విశ్వసాక్షిణీ (385) సాక్షివర్జితా (575) ప్రజ్ఞానఘనస్వరూపిణీ (623) కేవలా (663) అజా (667)భూమరూపా (668) నిర్ద్వైతా (669) ద్వైతవర్జితా (673) బ్రహ్మాత్మైక్యస్వరూపిణీ (701) సచ్చిదానందరూపిణీ (735) మిథ్యాజగదధిష్ఠానా (789) నిస్త్రైగుణ్యా (791) సత్యజ్ఞానానందరూపా (806) పరంజ్యోతి - ఈ నామములన్నియు బ్రహ్మపరములేగాని ప్రకృతి, లేక మాయాపరములు కావు. కాని (397) మూలప్రకృతి (398) అవ్యక్త (418) జడశక్తి మొదలగు కొన్ని నామములు సగుణ సాకారముల పరములై యున్నవి. ఇవి శంకరాద్వైత మతము ననుసరించి అనాత్మ పరములు అనగా మాయా (ప్రకృతి) పరములు.

సర్వము లలితా స్వరూపమేనని నామములు చెప్పుచున్నవి. శక్త్యుపనిషత్తు లన్నియు అద్వైతమునే బోధించును. శాక్తము శైవమువలె మూడు మార్గముల నడువలేదు. శైవమునందు చెప్పిన అద్వైతమునే శాక్తము (శ్రీవిద్య) బోధించును. అద్వైత మతోద్ధారకులు శ్రీశంకరులు లలితా త్రిశతి నామములకు భాష్యమును రచియించిరి.

లలితా దేవికి 'కామేశ్వరి' అను నామము ప్రసిద్ధము. కాని కామాఖ్య యందలి కామేశ్వరీదేవి లలితాదేవి యేనా? యని సంశయము. పంచదశి మంత్రమునందలి కామరాజ కూటమును తామసుడను నాలుగవ మనువు జపించి దేవిని ప్రసన్నను చేసికొనినట్లును, రైవతుడను అయిదవ మనువు కామాఖ్య బీజము జపించినట్లును, చాక్షుష మనువు (ఆఱవ మనువు) వాగ్భవ మంత్రమును జపించినట్లును, సావర్ణియను ఎనిమిదవ మనువు

మహాకాళిని ఉపాసించగా, తక్కిన మనువులు ఆఱుగురును వాగ్భవనే ఉపాసించినట్లును దేవీ భాగవతమునందలి దశమస్కంధమున గలదు. ఇందులో లలితోపాసకులు లేరనియే చెప్పవలయును. ఇందువలన లలితోపాఖ్యానము దేవీభాగవత శ్రీమహాభాగవత పురాణముల రచనానంతరమే ఆరంభ మైనదేమో అని తోచును.

లలితకు భండాసురున్నకు జరిగిన యుద్ధమును దుర్గాదేవికి మహిషాసురునితోను శుంభనిశుంభులతోను జరిగిన యుద్ధములు రామరావణ యుద్ధకథన మంతపెద్దగా పెంచబడినవి. లలితాపక్షమున సైన్యము, సేన్యాధిపతులు శక్తులే (స్త్రీ దేవతలే) పురుష డొక్కడును లేడు. మహిషాసురాదుల యుద్ధమునందును దేవిపక్షమున సైనికులు శక్తులే. శక్తులే భండాసురుని పరివార మంతయును హతమొనర్చిరి. భండాసురుడు లలితాంబచే మృతుడయ్యెను. ఇంత గొప్ప యుద్ధము జరుగుచుండగా శ్రీచక్రరథమునందు లలితాదేవి సహితుడై యుండు కామేశ్వరుడు రాక్షసులపై ఒక్క బాణమైనను ప్రయోగించి యుద్ధము చేయలేదు. భండాసురుడు లలితాదేవిని మహాస్త్రముతో కొట్టినను కామేశ్వరునిపై ఒక్క చిన్న అంబునైనను ప్రయాగించలేదు. కామేశ్వరు డున్నాడనిన ఉన్నాడు. అంతే. ఆయన చేసిన దేమియులేదు. సర్వము లలితాకార్యమే. కాని, దేవి భండాసురుని సంహరించినది కామేశ్వర మహాస్త్రముచేతనే. కాని యిచ్చట ఆయనకు సాక్షిత్వము కలుగుచున్నది. సాక్షి చిద్రూపము కదా? బ్రహ్మము సర్వసాక్షి. ఆయన మాయ. సర్వవ్యాపారములను బ్రహ్మ సాన్నిధ్యమున చేయుచున్నదని చెప్పిన వేదాంతుల సిద్ధాంతమునకు ఇది అనుకూలముగా నున్నదని దీనిభావము. ఇట్లుండగా దేవి సాక్షిణియని శాక్తేయుల మతము. ఇది యెట్లు సమన్వయ మగునో బోధపడదు. లలితాదేవియే సాక్షిణియైన ఆమె భండాసురునితో యుద్ధమొనర్పక ఆమె .పతియగు కామేశ్వరునివలె సాక్షిమాత్రముగా నుండవలెను గదా? శుంభనిశుంభుల యుద్ధమునందు దేవి (దుర్గ) సాక్షిణిగానే యుండినది. యుద్ధమంతయు చేసిన దేవి కాళి (మహాకాళి).

చిదగ్నికుండమున ఆవిర్భవించిన అరుణారుణ దివ్య సుందరమూర్తి యగు లలితారూపము స్థూలము. పంచదశీ మంత్రరూపము సూక్ష్మరూపము. కామకలా మంత్రరూపము సూక్ష్మతరము. కుండలినీ శక్తిరూపము సూక్ష్మతమము. పరారూపము సూక్ష్మతమమని కొందఱందురు. ఇది శ్రీవిద్యోపాసకుల మతము.

లలితాదేవికి భండాసురునకు జరిగిన యుద్ధము విద్యావిద్యలకు ద్వైతాద్వైతములకు మధ్యగల సంఘర్షణమని చెప్పవచ్చును. ఉభయ పక్షముల యందలి సేనాపతుల నామములను తత్త్వదృష్టితో చూచిన సరిపోవును. ఉదా :- విషంగుడు విషయలోలుడు. మంత్రిణీదేవిచే సంహరింపబడియెను. మంత్రిణీమంత్రజపముచే విషయలాంపట్యము నశించి అంతర్దృష్టి కలుగునని భావము. విశుక్రుడు అహంకారి. వారాహీదేవి ఉపాసనవలన అది నశించునని భావము. ఈవిధముగా సమస్తమును తత్త్వదృష్టికి గోచరించుచున్నది.

భండాసుర వధానంతరము లలితాంబ తన ఫాలనేత్రాగ్నిచే భండాసురుని పట్టణమగు శూన్యక పురమును దగ్ధము చేసెను. అందున్న సమస్తము దగ్ధమైపోయెను. దీని భావమేమి? శూన్యకపురమనున దెట్లుండును? దీని భావమిట్లు చెప్పవచ్చు ననుకొందును. న్యాయ వైశేషికాది దర్శనములయందు ఆత్మ (ఆత్మలు) జడము లనిరి. అనగా: కేవలము సన్మాత్రములేగాని చిదానంద రహితములనిరి. జ్ఞాన శూన్యమే శూన్యకపురము. దేవి జ్ఞానాగ్నిచే శూన్యభావమును దహించి అందు జ్ఞాన తేజమును ప్రకాశింపజేసెను. దీనివలన ఆత్మ (లు) నిత్యమేగాని చిద్రూపము కాద(వ)ను వాదమును శ్రీవిద్యోపాసకులు ఖండించి అద్వైతమతముతో దేవీ మతములకు సామరస్యము సంఘటింపజేసిరని తలంపవచ్చును. కాశ్మీరశైవమును గుఱించి చెప్పిన సందర్భమున నీ విషయము వివరింపబడెను. లలితాభావముచే అదియే దృఢీకరింపబడినది.

-: బ్రహ్మవిద్య - శ్రీవిద్య :-

జిజ్ఞాసువు :- అయ్యా! శ్రీవిద్య బ్రహ్మవిద్యయే యని శ్రీవిద్యోపాసకులు చెప్పిరి. బ్రహ్మవేత్తలుగాని. బ్రహ్మోపాసకులుగాని తమ బ్రహ్మవిద్య శ్రీవిద్యయని చెప్పరు కదా? శ్రీదేవీభాగవతము దేవీపారమ్యమును తెలుపునట్టి పురాణము. శాక్తేయమున దీనికి చాల ప్రాముఖ్యము కలదు. అందు బ్రహ్మవిద్యయు చెప్పిరికదా? ఈ రెంటిలో ఒకదానితో మఱియొక దానికి వైరుద్ధ్యము లేదా?

వేదాంతి:- స్వల్పభేద మున్నది. శ్రీదేవీ భాగవతమునందలి సప్తమస్కంధమున హిమవంతునకు దేవి తత్త్వోపదేశము చేసినట్లు చెప్పబడినది. ఆ యుపదేశమునే "శ్రీదేవీగీత" యని యందురు.* అందు బ్రహ్మవిద్యయే ప్రతిపాదింపబడినది. శంకరాద్వైతమునకు దేవీగీతయందలి తత్త్వమునకును భేదము స్వల్పము. జీవేశ్వర స్వరూప నిరూపణము. భూతముల యుత్పత్తి, పంచీకరణము, శరీరత్రయ నిర్మాణవిధానము మొదలగున వన్నియు శంకరాద్వైతమునందు చెప్పిన విధముగనే యున్నది. భేదమేమన?

"ఆత్మానా ఇదమేక ఏవాగ్ర ఆసీన్నాన్య త్కించన మిషత్"

సృష్టికిపూర్వము పరమాత్మ తప్ప అన్యమేమియు లేకుండెను. అను శ్రుతివాక్యము నాధారముగ దేవి తానే బహ్మమునని ప్రథమవాక్యముననే హిమవంతున కిట్లు బోధించెను:-

శ్లో॥ అహమేవాస పూర్వం తు నాన్యత్కించి న్నగాధిప।
తదాత్మ రూపం చిత్సంవిత్పర బ్రహ్మైక నామకమ్॥ (దే. గీ. 1-2)

తా॥ ఓ పర్వతరాజా! సృష్టికి పూర్వము పరబ్రహ్మమను పేరున

---

* శ్రీ దేవీగీత యన్నను, దేవీగీతయన్నను ఒక్కటియె. దేవీగీత ప్రత్యేకముగ ముద్రితమై యున్నది. అందు అవతరణికగాక 9 అధ్యాయము లున్నవి. అవతరణికతో కలిసి 508 శ్లోకము లున్నవి.

పిలువబడు ఆత్మస్వరూపురాలనగు నేను మాత్రమే యుంటిని. నాకన్న వేఱగునది కొంచెమైనను లేదు.

సృష్టికిపూర్వము ఆత్మ (పరబ్రహ్మము) తప్ప అన్య మేమియు లేదని శ్రుతులు ఎవరి నుద్దేశించి చెప్పియున్నవో ఆ బ్రహ్మము తానేనని దేవి చెప్పియుండుట వలన, దేవియే పరబ్రహ్మమనియు లేక పరమేశ్వరియనియు పరబ్రహ్మమునే స్త్రీ వాచకముగ చెప్పబడియెననియు, మనము సమాధానపడిన- దేవీ గీతయందలి యర్థము శంకరాద్వైతముతో సరిపోవును.

జిజ్ఞాసువు :- దేవియే పరబ్రహ్మమైన 'మాయ' యని శాస్త్రములయందు చెప్పబడిన పదార్థమెద్ది?

వేదాంతి :- శ్రుతులయందు చెప్పబడిన ఆత్మ (పరబ్రహ్మ) స్థానమున దేవిని చేర్చి చెప్పిన సిద్ధాంతమును మన మంగీకరించితిమేని, పరబ్రహ్మ సంబంధమగు మాయను దేవీ సంబంధమైన దానినిగా మన మంగీకరించి నట్లగును. కాని అది సరిపడదు. ఏలయన? పరబ్రహ్మమునందు అంతర్లీనమై యుండిన ఆయనయొక్క స్వాభావిక స్ఫురణమను ప్రథమ వికసనమే విమర్శ యనబడు శక్తియనియు, ప్రకాశ స్వరూపుడగు పరమేశ్వరుని విమర్శశక్తియే పరమేశ్వరియనియు, శ్రీవిద్యోపాసకులు చెప్పియున్నారు. కనుక అధిష్ఠానమగు పరబ్రహ్మము సృష్టికి పూర్వమున ఉన్నదని అంగీకరింపక తప్పదు. సృష్టికి పూర్వము మాయయని బ్రహ్మమని నామద్వయ వ్యవహారము లేదనియు, అఖండాద్వితీయ పరబ్రహ్మమునందు ప్రథమమున తోచిన **"సోఽకామయత, బహుస్యాం ప్రజాయే యేతి"** (తైత్తి. అ-2-అను 6) అను సంకల్ప మేది కలదో అదియే విమర్శరూప పరబ్రహ్మ శక్తి యనియు, అదియే సృష్టియొక్క ఆదియనియు, ఆశక్తినే శ్రీవిద్యోపాసకులు పరమేశ్వరి యనియు అందురు. ఆమెయే కార్యార్థమై సచ్చిదానంద స్వరూపమగు ఆత్మగను, అనృతజడ దుఃఖాత్మిక మగు **జడజగత్తు** (అనాత్మ)గను రెండు విధము లైనదని శ్రీవిద్యోపాసకులు **చెప్పిన దానిని వినిపించి యుంటిని. ఇదియే శ్రీవిద్య. దేవి,**

దేవీభాగవతమునందలి ద్వాదశస్కంధమున ఇంద్రున కుపదేశించిన తత్త్వమిదియే. ఈ యంశ మిదివఱకు చెప్పియుంటిని.

జిజ్ఞాసువు :- మాయ, రజ్జువునందు భ్రాంతివశమున తోచిన సర్పమువలెను, శుక్తియందు తోచిన రజతమువలెను మిథ్యయని శ్రీవిద్యోపాసకు లెఱుంగుదురు కదా? మిథ్యా భూతమగు మాయను వారుపాసించుటవలన వారికి మోక్షమెట్లు సిద్ధించును?

వేదాంతి :- నీవు చెప్పినరీతిగా వారంగీకరింపరు. ఒక విధముగా అంగీరించిరని తలంచినను మసకచీకటిలో త్రాటిని చూచి పామనుకొని కఱ్ఱతో మిథ్యాసర్పమును బాదినచో నీవు కఱ్ఱతో కొట్టినది త్రాటినేగాని భ్రాంతివశమున తోచిన మిథ్యాసర్పమును కాదు. పరబ్రహ్మమందు తోచిన మాయ నుపాసించిన మాయ లేనిదే కనుక దాని అధిష్ఠానమగు పరబ్రహ్మమునే ఉపాసించి నట్లయినది కదా? కనుక నీకు క్రమముక్తి సిద్ధించుటకు అభ్యంతర మేమున్నదని శ్రీవిద్యోపాసకుల మతము. మఱియు శంకరాద్వైతమునందును విద్యావిద్యలు రెండును మాయిక మనియే కదా చెప్పి యున్నారు. విద్యవలన ఆత్మానాత్మ వివేకము సిద్ధించుచుండుట లేదా? కాని యింతకు విరుద్ధముగ పరమేశ్వరి మాయ కాదని అర్థమిచ్చునట్టి వాక్యము లున్నవి. లలితాసహస్ర నామములయందు 735వ నామము "మిథ్యాజగదధిష్ఠానా" అని యున్నది. 716వ నామము "మాయా" యని యున్నది. ఇట్లు పరబ్రహ్మ వాచకములగు నామములును, మాయా సంబంధమైన నామములును లలితాంబకు అనేకములున్నవి. పరబ్రహ్మ పరములగు అనేక నామములు లలితాంబ కున్నట్లు ఇదివఱలో చెప్పియుంటిని.

దేవీగీత మాయను మిథ్యయని, అది జడమని, జడము కనుక దృశ్యపదార్థములు దానియందు పుట్టుచున్నవని, అధిష్ఠానము తెలియబడినపుడు మాయ నశించుచున్నదని, ఇట్లు మాయకు మిథ్యాత్వము, జడత్వము చెప్పి ఆ రెండును అధిష్ఠానమునందు లేవని చెప్పినది. (దే. గీ. 1-12, 13, 14) శంకరాద్వైతము ఈ పద్ధతిని

అంగీకరించినది. శంకరాద్వైతమున సయితము విద్యావిద్యలు రెండును మాయికమే యైనను విద్యవలన అవిద్య నశించి ఆత్మానాత్మ వివేక మేర్పడునని చెప్పియుండ లేదా?

దేవీభాగవతమునందలి ద్వాదశస్కంధమున దేవి యింద్రున కుపదేశించినట్లు చెప్పబడినదే శ్రీవిద్య. కామకలా, ఏకాక్షరీ, బాలా, పంచదశాక్షరీ, షోడశాక్షరీ మంత్రములను వాటి అర్థమును శ్రీవిద్య యందురు. "శ్రీం" అను ఏకాక్షరీ మంత్రము శ్రీ బీజము ప్రధానముగా గల విద్య యగుటచే దీనికి శ్రీవిద్య యను పేరు కలిగినది. శ్రీ యనగా లక్ష్మి. లక్ష్మీదేవి పరమేశ్వరిని గుఱించి తపమాచరించి "శ్రీ" యను నామము తనకు కలుగునట్లు వరము పొందినదట.

శ్రీవిద్యను గుఱించియు, శ్రీవిద్యకు బ్రహ్మవిద్యకు గల భేదమును గుఱించియు ఇదివఱలో కొంత చెప్పియుంటిని. మరల ఆ రెండు విద్యలకునుగల ముఖ్యభేదమును సూత్రప్రాయముగ చెప్పెదను.

కేనోపనిషత్తునందు "స తస్మిన్నే వాకాశే స్త్రియ మాజగామ బహు శోభమానా ముమాం హైమవతీం".. (3-25) ఇంద్రునకు పూర్వము యక్ష మెచ్చట కనబడి అంతర్ధాన మయ్యెనో అచ్చటనే మహాసౌందర్య రాశియగు ఉమ (హైమవతి) ప్రత్యక్ష మయ్యెను. కనుక బ్రహ్మమే ఉమ యని భావము. ఉమాదేవి యింద్రునకు చెప్పిన దేమి? ఓమ్, హ్రీం అను రెండు బీజములు నామమంత్రమునకు కలవనినది. అందు ఓమ్ బ్రహ్మమునకు, హ్రీం మాయకును (సంకేత) నామములు. ప్రణవమును గుఱించి బ్రహ్మవాదులు చెప్పిన దేమన:- ఓమ్ కారమునందున్న అ+ఉ+మ అను మూడు మాత్రలు సగుణ బ్రహ్మమును, అర్ధమాత్ర నిర్గుణబ్రహ్మమును ప్రతిపాదించును కనుక ప్రణవము సగుణ నిర్గుణము లకు చిహ్నము (ప్రతీకము) అని చెప్పుదురు. ఈ విషయమిది వఱలో చెప్పియుంటిని* శ్రీవిద్యోపాసకులు ఓమ్ కారము నిర్గుణమును, హ్రీంకారము సగుణమును

---

* బ్రహ్మజిజ్ఞాస ౨-౧-౧౧ "ప్రణవోపాసన" అను అధ్యాయము చిత్తగించవలెను.

సూచించు నందురు. కొందఱు హ్రీంకారము శివశక్తుల కిరువురకు వాచకమందురు. దీని భావమిది :- హ్రీంకారము మాయకు చిహ్నము. మాయయే ఆత్మానాత్మ లయినదని శ్రీవిద్య చెప్పునుగదా? ఇచట ఆత్మానాత్మలనిన సగుణ నిర్గుణములే కదా? కనుక వారు "హ్రీంకారం భయాత్మకం" అని చెప్పిరి. దేవీభాగవతమున జనమేజయునకు వ్యాస మహర్షి యీ క్రింది వాక్యములు చెప్పినట్లున్నది.

"రాజన్! జనమేజయ మహారాజా! ఈ జగమంతయు నేయమయొక్క అవ్యయమైన శక్తిప్రభావ రచనయో ఆ పరాశక్తి ఆరాధించ దగినదని తెలియుము. ఆమెయే కార్యభేదమున సగుణయు, నిర్గుణయు నగుచున్నది. నిర్గుణ స్థితియందు దామహామాయయే కర్తృత్వమును పూనక పూర్ణము, నిరీహము, పరము, అవ్యయము, సాక్షియు నగు పురుషుడని ఖ్యాతి వహించుచున్నది. సృష్టి కాలమున నాదిశక్తి జగన్మాత గుణ సమన్వితయయి మహామాయనా నొప్పి సదసదాత్మకమ్మయిన యీ విశ్వమును సృజించును" (దే. వీ. భా. తృ. పుట. 96, 97)

ఇచట దేవి తానే బ్రహ్మపద వాచ్యురాలనని తన మాయ, పరాశక్తి అనునది నాకంటె అభిన్నమని, అయ్యది తమయందే ప్రతిష్ఠిత మైనదని, చంద్రునకు చంద్రికకును గల సంబంధమువంటిదే నాకును నామాయకును గల సంబంధమని, మా యిరువుర సంబంధము విడదీయరానిదని, ప్రళయకాలమున నామాయ నాయందే లీనమగునని చెప్పియున్నది. ఇచట బ్రహ్మవిద్యకును శ్రీవిద్యకును భేదమున్నది. బ్రహ్మవాదుల మతమున మాయ పరబ్రహ్మ సంబంధ మైనదనిగాని, పరబ్రహ్మమున కంటె అభిన్న మనిగాని చెప్పుటకు వీలులేదని చెప్పిరి. శ్రీవిద్య ననుసరించి మాయ దేవిసంబంధ మైనది. బ్రహ్మవాదులమాయ అనిర్వచనీయ మైనది. శ్రీవిద్యయందు మాయ అనిర్వచనీయ కాదు.

శ్రీవిద్యయందలి యీ యంశమును బ్రహ్మవాదు లంగీకరింపరు. ఏలయన? బ్రహ్మవాదుల మాయా స్వరూప నిర్వచనముకంటె శ్రీవిద్యోపాసకుల మాయాస్వరూప నిర్వచనము భిన్నమైనది. అదిగాక

శ్రీవిద్య ననుసరించి ఆత్మానాత్మలు రెండును ఒక వస్తువే (మాయ, లేక, దేవియే) యనిన ఆత్మ చూచువాడు (దృక్కు.) అనాత్మ చూడబడునది (దృశ్యము.) దృక్-దృశ్యములు రెండును ఒకటియేయని చెప్పునట్టి బౌద్ధులలోని యోగాచారశాఖ యొక్క మతమును అంగీకరించి నట్లయినది.* అట్లయిన చూచువాడును, చూడబడునదియు ఒకటియే యను సిద్ధాంతము అనుభవవిరుద్ధము. ఎవడైనను తన భుజములపై తానాసీనుడు కాజాలడు. దృక్కు అనగా:- చూచునట్టి స్వభావము కలది. ఇట్టి పరస్పర స్వభావము గల రెండు భిన్నతత్త్వములు ఒకటియే యెట్లగునని బ్రహ్మవాదుల ప్రశ్న.

జిజ్ఞాసువు :- శ్రీవిద్యను సూక్ష్మముగ పరిశీలించిన ద్వైతమున కవకాశ మున్నదని అనుమానము కలుగుట లేదా?

వేదాంతి :- అట్టి సందేహము కలుగుట కవకాశము లేదు. దేవీభాగవతమున ఒక చోట బ్రహ్మదేవుడు నారదమహర్షికి త్రిగుణములను గుఱించి ఉపదేశించిన ఘట్టము కలదు. అందు బ్రహ్మదేవుడు చెప్పిన వాక్యములను కొన్నింటిని నుదాహరించియుంటిని.

జిజ్ఞాసువు :- ప్రాచీన ఉపనిషత్తులయందు సృష్టికి పూర్వము సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమును, అద్వితీయమును, నిర్విశేషమును నగు పరబ్రహ్మము మాత్రమే ఉండినదని చెప్పిరి కదా? ఈ సిద్ధాంతము శ్రీవిద్యోపాసకులకు సమ్మతమేకదా? అట్లైన పరబ్రహ్మము నందు అంతర్లీన మైయున్న ఆయన విమర్శశక్తి ఆయననుండి వేరై ఆత్మానాత్మల రూపమున (శివశక్తి మిథున రూపమున) జగదుత్పత్తిని చేసినదనిన పరబ్రహ్మము నందు స్వగతభేదము కలదని అంగీకరించినట్లే కదా? అదిగాక విజ్ఞానస్వరూపము తప్ప అన్యమేమియు లేని నిర్విశేష పరబ్రహ్మము నందు విమర్శ యున్నదన్నచో పరబ్రహ్మము నిర్విశేషు డెట్లగును?

---

* ఈ తృతీయభాగము నాలుగవ ప్రకరణమున బౌద్ధమతమును గుఱించి వివరింతును

వేదాంతి :- వారు విమర్శరూప పరమేశ్వరశక్తికి పరమేశ్వరునకు అభేదము చెప్పియున్నందున స్వగతభేదముగాని, పరబ్రహ్మమునకు విమర్శ విశేషమని (విశిష్టమని) గాని చెప్పుటకు వీలు లేదందురు. కాని, శ్రీశంకరాచార్యుల వారు చెప్పిన మాయ అనిర్వచనీయ మైనదగుటచేత అచట ద్వైతదోష మున్నదనిగాని, స్వగతభేదమను దోషమున్నదనిగాని అనుమానించుటకు వీలులేదు. శ్రీవిద్యయం దట్టి అనుమానమునకు చోటున్నది. విమర్శశక్తి పరమేశ్వర సంబంధియే యైనను పరమేశ్వరు నందున్నందున పరమేశ్వరుడు సావయవి యని అనుమానించుటకు వీలున్నది కదా?

ఇది చాల గొప్పవిషయము. ఆంధ్రప్రదేశము నందు ముఖ్యముగా బ్రాహ్మణులయందు శ్రీవిద్యోపాసకులు పెక్కండ్రు కలరు. వారిలో అనేకులు మహాపండితులు, మహాకవులు, దుర్గోపాసకులు, లలితోపాసకులు కలరు. లలితోపాసనము మన ప్రాంతమున ఎక్కువ. ఈ చర్చ యీ సందర్భమున చేయక మఱియొక సందర్భమున చర్చింతము.

శ్రీవిద్యోపాసకులయందు చాల గొప్పవారని ప్రసిద్ధి చెందిన శ్రీభాస్కరాచార్యులు (భాస్కరరాయలు) 9వ శతాబ్దియందుండిన మహారాష్ట్ర బ్రాహ్మణకులమునకు చెందినవారు. వీరు బ్రహ్మసూత్రములకును, దేవీ సంబంధమైన కొన్ని నామస్తోత్రములకును భాష్యములను వ్యాఖ్యానములను రచియించిరి. వీరి గ్రంథములయందు వీరు శంకరాద్వైతమును నిశితముగ ఖండించిరట. ఇంతటి మహాపండితుడు శ్రీవిద్యను సంపూర్ణముగ అద్వైతమని అంగీకరింప లేదు. అచిత్తునకు బ్రహ్మమునకు భేదమును అభేదమును కూడా స్వాభావిక మనియు - బ్రహ్మము కేవలము అభేదమును కాదు, కేవలభేదమును కాదని స్వల్పముగ మార్చుకొనవలసి వచ్చెను. మహారాష్ట్రప్రాంతమున వీరి మతప్రభావము వీరి అనంతరము కొంతమార్పుతో ప్రచారము లోనికి వచ్చిన దందురు.

మహారాష్ట్ర ప్రాంతమున శ్రీతత్త్వమునందు కొంత మార్పుచేసి **కొందఱు పెద్దలు తమ దర్శనములను ప్రచారములోనికి తెచ్చిరి.** వారిలో

విఖ్యాతులు శ్రీజ్ఞానేశ్వరులు * శ్రీ సమర్థ రామదాస స్వాములవారు. శ్రీ జ్ఞానేశ్వరులు తాము రచియించిన అనుభవామృతమునందు ఇట్లు చెప్పిరి:-

ఆత్మ (విశుద్ధజ్ఞానము) యొక్క స్పందనమే జగత్తు. ఇచట విశుద్ధజ్ఞాన మనిన ఉపనిషత్ప్రతిపాదిత పరబ్రహ్మము. ఆ ఆత్మనుండియే లేక ఆయనయే శివశక్తు లిరువురుగ భాసించిరి. పై న చెప్పిన ఆత్మయొక్క స్పందనమే శివశక్తి దంపతులు. శివశక్తు లిరువురు ఒకటియే. భిన్నలు కారు. జగత్తు వారి లీల. శాక్తమునందలి విమర్శరూప శక్తినే వీరు స్పందమనియు శివశక్తి ద్వంద్వ మనియు చెప్పిరి. "మాయ" అను వాక్యమును అంగీకరింపక మాయ త్రికాలములయందు లేనిదే అని దానిని త్రోసివేసిరి.

శ్రీసమర్థ రామదాసుగారును శ్రీవిద్య ననుసరించియే తమ అద్వైతమును స్థాపించిరి. శైవ, శాక్తములయందలి "విమర్శ"ను వీరు "మూలమాయ" యనిరి. వారి వాక్యము లివి :-

"ఆదియందు నిత్యము, ముక్తము, పరమార్థ క్రియయు నగు పరబ్రహ్మ మొక్కటియే కలదు. దానియందు అస్పష్టముగను సూక్ష్మముగను మూలమాయ కలిగెను." (దా. బో. 8-4-2)

శ్రీ సమర్థ రామదాసస్వామివారు క్రీ. శ. 1608-1682 మధ్యవారు.

వీరి సిద్ధాంతములను అచల వేదాంతమును చెప్పు సందర్భమున కొంతవిశదముగా చెప్పెదను.

"బ్రహ్మమునందున్న మూలమాయయే ముందున కరిగి అష్టవిధ ప్రకృతి యనబడుచున్నది. (పంచభూతములు, త్రిగుణములు - అష్టవిధ ప్రకృతి). " (దా. బో. 10-4-9)

శ్రీవిద్యయందు చెప్పిన ఆత్మానాత్మలనే దాసుగారు మూలమాయ యనిరి. మూలమాయయే ప్రకృతి పురుషులైనదనిరి. (దా.భో. 10-9-7)

---

* శ్రీ జ్ఞానేశ్వరులు క్రీ.శ. 1275 - 1296 మధ్యవారు.
శ్రీ సమర్థ రామదాసస్వామివారు క్రీ.శ. 1608 - 1682 మధ్యవారు.
వీరి సిద్ధాంతములను అచల వేదాంతమును చెప్పు సందర్భమున కొంత విశదముగా చెప్పెదను.

జిజ్ఞాసువు :- నాకొక సంశయము కలుగుచున్నది. మాయ లేక పరాశక్తియే సగుణ నిర్గుణములు- ఆత్మానాత్మలు అయిన వీరికంటె పరమునందున్న వస్తువేది?

వేదాంతి :- సగుణ నిర్గుణములు కాని వస్తువు ఒకటి కలదని కొందఱందురు. తేజోబిందూపనిషత్తునందలి పంచమాధ్యాయమున "అరూప బ్రహ్మము" అని చెప్పబడినట్టిదియు, ఋభుగీతయందు "నిష్ప్రతియోగిక బ్రహ్మము" అని చెప్పబడి నట్టిదియు నగు వస్తువు ఒక్కటియే (ఋ.గీ. 7-72). మఱియు శ్రీజ్ఞానేశ్వరులయొక్క విశుద్ధజ్ఞానమగు ఆత్మయు, రామదాసస్వామివారి మూలమాయ కాధారమగు (అధీనమగు) బ్రహ్మమును, ప్రాచీన ఉపనిషత్తులు చెప్పిన నిర్గుణ పరబ్రహ్మమును, శ్రీ శంకరాచార్యులవారు చెప్పిన నిర్గుణ పరబ్రహ్మమును ఒక్కటియే. మాటల భేదమేగాని వస్తుభేదము లేదు. ఈ విషయము వేఱొక సందర్భమున (నాలుగవ భాగమున) విస్తరించి చెప్పెదను.

దర్శన-మత-తత్త్వముల పరిశీలనము

వైష్ణవమత తత్త్వమునకును, శైవమత తత్త్వమునకును మతమునందున్నంత వైరుధ్యము దర్శనములందు లేదు. మతమును దర్శనమును వేఱుగా చేసి చూడవచ్చును.

ఒక విషయము గమనింపవలెను. తత్త్వశాస్త్రమునందు జీవేశ్వరులకు అభేదమో (అద్వైతమో), నిత్యభేదమో (ద్వైతమో), భేదాభేదమో (ఒక కాలమునందు జీవేశ్వరులకు భేదమును మఱియొక కాలమునందు అభేదము చెప్పునట్టి ద్వైతాద్వైతమో), సర్వకాలముల యందుండు నిత్య భేదాభేదమో (నిత్యద్వైతాద్వైతమో) చెప్పిరి. ఇంతకంటె భిన్నముగ వేఱొక మార్గమును మానవబుద్ధి ఊహింపజాలదు. ఊహింపగలిగినంతవఱకు దార్శనికులు ఇన్ని దర్శనములు కల్పించిరి. మతమేదైన కానిండు, దర్శనములయందున్న మూలభేద మిదియే.

వైష్ణవదర్శనములలో మాధ్వదర్శనముతో వీరశైవుల ఆరాధ్యశాఖకు చాలవఱకు పోలిక కలదు. నింబార్కుల ద్వైతాద్వైత సిద్ధాంతముతో

అనగా :- భేదాభేద వాదముతో బసవేశ్వరుల వీరశైవ దర్శనమునందలి భేదాభేదవాదము సరిపోవును. వల్లభాచార్యులవారి శుద్ధాద్వైతముతోను, శ్రీరామానుజ దర్శనముతోను, కొంతవఱకు శివాద్వైతమునకు శివవిశిష్టాద్వైతమునకును సామ్యము కలదు. చైతన్యుల అచింత్య భేదాభేదవాదముతో కొంతవఱకు పైన చెప్పిన భేదాభేద దర్శనములతో సామ్యము కలదు. వైష్ణవములో మొదటిసారిగా చైతన్య మతమునందే శక్తి ప్రవేశము కనబడును. శాక్తాద్వైతము అద్వైతముతోను, కాశ్మీరశైవముతోను ఏకీభవించును. ఈ విధముగా శైవ, వైష్ణవ, శాక్తేయ దర్శనములు స్వల్పమార్పులతో ఏకీభవించుచున్నను మతములుమాత్రము ఏకీభవించుట లేదు. అవి పరస్పర విరుద్ధములే కాక ఒక దానికొకటి ప్రత్యర్థులు. అన్నియు వైదికమత శాఖలే యైనను ఒకరినొకరు అణగద్రొక్కుటకు ప్రయత్నములు జరిగినవి.

శైవమతమునందే వీరశైవము, ఆరాధ్యశాఖ, శాక్తేయము. గాణాపత్యము, కౌమారము, సౌరము - ఇవన్నియు ఇమిడియున్నందున అన్నియు శైవమే. వైష్ణవమునందు రామానుజ, మధ్వ, నింబార్క, చైతన్యమతము లున్నవి. శ్రీవైష్ణవులయందు తెంగల, వడగల శాఖలును, విష్వక్సేన మతము మొదలగు మతము లున్నను అవన్నియు వైష్ణవము క్రిందనే లెక్కకట్టవలెను. ఈ విధముగా మనదేశమునందు శైవ, వైష్ణవ, స్మార్తములను మూడు మతములే లెక్కింపదగినవి. అందులోను స్మార్తము పై రెండింటికంటె విస్తరించియున్నది. స్మార్తమనగా శంకరులవారి అద్వైతదర్శనము. మతముపేరు స్మార్తము. ఈ మతము విశాలదృక్పథము కలది. వీరికి శివకేశవులు శక్తియు సమానముగ ఆరాధ్యులే.

ఈ మతోద్ధారకులగు శంకరులు శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, కౌమార, సౌరమతము లాఱింటిని వాటియందలి దోషములను తొలగించి అంగీకరించిరి. శాక్త, గాణాపత్య, కాపాలిక, భైరవములయందు వామాచారము, నరబలులు, జంతుబలులు ఆకాలమున విశేషించి ప్రబలియుండెను. వామాచారులు సురాపానము, వ్యభిచారము, దేవతా ప్రీత్యర్థమై చేయుచుంటిమని చెప్పుచుండిరి. సూర్యునకు రక్తతర్పణము

విడుచుచుండిరి. శ్రీశంకరులు వారితో వాదించి వారికి శాస్త్రప్రమాణములను చూపి అవన్నియు అశాస్త్రీయము లనియు, పాపహేతువు లనియు బోధించి వాటియందలి దోషములను తొలగించి "షణ్మత స్థాపనాచార్యు"లను బిరుదమును వహించిరి. ఆయా దేవతలపై స్తోత్రములను రచియించిరి. కనుకనే యీ మతమునకు విశేషఖ్యాతి కలిగినది. కాని, శ్రీశంకరులు ప్రస్థానత్రయమునకు భాష్యములను,కొన్ని ప్రకరణ గ్రంథములను మాత్రమే రచియించిరిగాని, శివుడు, శక్తి మొదలగు దేవతలపై స్తోత్రములు రచింపలేదనియు; ఎవరో వాటిని రచియించి శంకరులవారి కర్తృత్వమును వాటికి అంటగట్టిరనియు ఒక వాదము కలదు. అది మన కప్రస్తుతము.

శంకరుల దర్శనము ఉపనిషద్బ్రహ్మమును బోధించును. సామాన్య మానవుడు నిర్గుణ తత్త్వమును తెలిసికొన జాలడని శంకరులవా తెరుగుదురు. ఉపనిషత్తులు బోధించిన బ్రహ్మమే మాయా ప్రభావమున వివిధ దేవతా రూపమున తోచుచున్నాడని, షణ్మతముల వారికి నచ్చజెప్పి షణ్మతములలో ఎవడు ఏదేవతను మోక్షకామియై యుపాసించునో అట్టివానికి చిత్తశుద్ధి కలిగి వాడాదేవతా ద్వారముననే ఆత్మజ్ఞానమును అలవరచుకొని వర్తమాన జన్మమునందో, జన్మాంతరమునందో ఆత్మైక్యబోధను ('తత్త్వమసి' అను అపరోక్షజ్ఞానమును) పొంది ముక్తుడగుచున్నాడని బోధించిరి. శ్రీశంకరులవారు ఏ మతమునూ త్రోసివేయలేదు. అదియే వారి గొప్పతనము.

షడ్దర్శనములు,. షణ్మతములు చివఱకు బోధించిన దేమి? ముక్తి లేక, మోక్షము. ఈ మోక్షస్వరూప మెట్టిదను అంశమును గుఱించి భిన్నభిన్న నిర్వచనములు చేసి నప్పటికిని అట్టి మోక్షమును పొందుటకు భిన్న భిన్న సాధనము లుపదేశించి నప్పటికిని మోక్షమనునది సంపూర్ణ దుఃఖరాహిత్య మనియును, అది పునర్జన్మ లేకుండుటే యనియును, ఏకవాక్యమును ప్రకటించినవి. కేవల వైదికములగు పై మతములే గాక అవైదికములని ప్రచారమందున్న జైన బౌద్ధదర్శనములు సహితము ఈ యంశమున వైదిక దర్శనములతో ఏకీభవించినవి.

శ్రీ పుష్పదంతాచార్యులు చెప్పినట్లు నదులన్నియు సముద్రము చేరునట్లు మతములన్నియు భగవంతునే చేరుచున్నవి. కనుక ఇచ్చట ఇంతవఱకు పేర్కొనిన మతాచార్యు లందఱికిని వందనము లర్పించుచున్నాను.

శ్లో॥ త్రయీ సాఙ్ఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదః పథ్యమితి చ।
రుచీనాం వైచిత్ర్యాదృజు కుటిల నానాపథ జుషామ్
నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవ ఇవ॥

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱిబోయిన రామ
సుబ్బయ్యచే రచియింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస'
తృతీయభాగమునందలి 'మతతత్త్వములు'
అను రెండవప్రకరణము సంపూర్ణము.
ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మజిజ్ఞాస

తృతీయభాగము

మూడవ ప్రకరణము-జైనమతము

"నమో అరిహంతాణం
నమో సిద్ధాణం
నమో ఆయరియాణం
నమో ఉపజ్ఝాయాణం
నమో లోయె సవ్వసాహూణం
ఎసో పంచనముక్కారో
సవ్వ పానప్పణాసణో
మంగళాణం చ సవ్వేసిం
పఢమం హవయి మంగళం." *

---

* పైన చెప్పినది నమస్కార మంత్రము. ఈ మంత్రమహిమను జైను లిట్లు వచింతురు :- "నమస్కారమంత్రమును పఠించిన సర్వఫలములు సమకూరును. దీని మహిమ కంతులేదు. భావము విశేషమైనది. సుఖదుఃఖములలోగాని రాత్రింబవళ్లుగాని సంచరించునపుడు లేదా మరణకాలమున నెల్లప్పుడు తప్పక దీనిని స్మరించండి....... ఈ మంత్రములో నున్న అరువది యెనిమిది అక్షరముల మహిమ అపారమైనది. అరువదితీర్థాల సారాంశమే యిది. దీనిస్మరణచే అష్టలక్ష్ములు అష్టసిద్ధులు చేకూరును. ఇందు తొమ్మిదినముల స్మరణచే నవనిధులు లభించును. జన్మముల దుఃఖము తొలగి పరమాత్మ సన్నిధిలో స్థానము లభింపగలదు. పదునాల్గు పూర్వశాస్త్రాల సారాంశ మిందు ఇమిడియున్నది." ("జైనధర్మము" నుండి)

(1) ఆరంభము

జిజ్ఞాసువు :- అయ్యా! మీ అనుగ్రహమువలన వైదికములని ప్రసిద్ధిగన్న షడ్దర్శనములను, షణ్మతములను వింటిని. అవైదికములని చెప్పబడు జైన, బౌద్ధ చార్వాకాది మతము లెట్టివో అనుగ్రహించి తెలుపుడు.

వేదాంతి :- జైన, బౌద్ధములు అవైదికములని ప్రతీతియేగాని అవియును వైదికము లనియే నా యభిప్రాయము. పునర్జన్మ కలదను కర్మసిద్ధాంతమును అంగీకరించు వారందఱు వైదిక మార్గావలంబు లనియే చెప్పవచ్చును. తొలుత జైనమతమును పిమ్మట బౌద్ధచార్వాకాది మతములను చెప్పెదను.

తీర్థంకర భగవాన్ మహావీరుడు వైశాలి గణతంత్రములోని సుప్రసిద్ధరాజగు సిద్ధార్థునికిని వారి ధర్మపత్నియగు త్రిశల దేవికిని కుండ అను గ్రామమున క్రీ. పూ. 599వ సంవత్సరమున జన్మించెనని కొందఱును, క్రీ. పూ. 598లో జన్మించిరని కొందఱును చెప్పుదురు. వీరి జన్మదినము చైత్ర శుక్లత్రయోదశియందురు. వీరు జాతృవంశీయులగు క్షత్రియులు. వీరికి తల్లిదండ్రులు లిడిన నామము వర్ధమానుడు. కాని, ఆయా సందర్భములయందు వీరిని వీరుడు, అతివీరుడు, మహావీరుడు, సన్మతి అనికూడ పిలుతురు. ఇవి వారి ముఖ్యమైన బిరుదనామములు. వీర్ చంద్ గాంధిగారు మహావీరుడు క్రీ.పూ. 665లో జన్మించి క్రీ. పూ. 593లో సిద్ధినొందిరని వ్రాసిరి. వీరి తండ్రి మగధరాజు సోదరిని వివాహమాడెనని ఒక జైన గ్రంథమున నున్నట్లు చెప్పుదురు.

వీరి అన్నగారగు నంది వర్ధన మహారాజు రాజ్యాధిపతి. వీరు తమ యిరువది యెనిమిదవ యేట ఆధ్యాత్మిక విచారమును ప్రారంభించిరి. 12 లేక 13 సంవత్సరములు తపస్సు చేసిరి. వీరికి సర్వజ్ఞుడనియు, తీర్థంకరుడనియు (తీర్థంకారుడనియు), జినుడనియు గౌరవనామములు కలవు. వీరు సిద్ధి నొందుటకు పూర్వము ముప్పది సంవత్సరముల కాలము మతప్రచారముచేసి 72వ యేట 'పవా' పట్టణమున మోక్షము (సిద్ధి) నొందిరి.

వీరు పరిపూర్ణ వైరాగ్యవంతులు. సర్వమును త్యజించుటయేగాక తుదకు కౌపీనమును కూడ త్యజించి దిగంబరుడై యుండెడివారు. వివాహము లేదు. సన్న్యసించుటకు ముందు తల్లితండ్రుల యొక్కయు, బంధువుల యొక్కయు ఆజ్ఞను పొంది తపస్సునకై అరణ్యమునకు పోయిరి. జైనమతము వీరివలననే ప్రారంభించబడినది కాదు. వీరికి పూర్వము ఇరువదిముగ్గురు తీర్థంకరులు జన్మించి ఈ మతమును ప్రచారములోనికి తెచ్చిపోయిరి. భగవాన్ మహావీరుడు ఇరువది నాలుగవ వారు. ఇరువదిమూడవవారు కాశీరాజగు అశ్వసేనుని కుమారుడు పార్శ్వనాథుడను నతడు క్రీ. పూ. 817 ప్రాంతమువారు. భగవాన్ మహావీరునికి ముందు ఈ మతమును 'నిర్ఘాంత మతము' అని అందురట. మొదటి తీర్థంకరుడు నిమివంశమునకు చెందిన వృషభుడను మహారాజు. శ్రీమన్నారాయణుని యేకవింశతి లీలావతారములయందు ఋషభావతార మొక్కటిగా భాగవతపురాణము చెప్పినది. వీరి కుమారులలో నొకరగు భరతుడు అరణ్యమున తపము చేయుచుండి ఒక జింకపిల్లపై మమకారముచే జింకయై పుట్టి ఆ తరువాతి జన్మమున జడభరతుడై ముక్తినొందెనని భాగవతము చెప్పినది.

ఈ మతము ఆదినుండియు (వృషభరాజునుండియు) తీర్థంకరు లందఱు క్షత్రియులే. బ్రాహ్మణులు ముఖ్యముగా "బ్రాహ్మణముల" యందు చెప్పిన యజ్ఞకర్మను వ్యాప్తి చెందించిరి. బౌద్ధమత స్థాపకుడగు బుద్ధభగవానుడు క్షత్రియుడే. ఉపనిషత్తులయందు చెప్పబడిన అశ్వపతి, జనకరాజు, పాంచాలరాజగు ప్రవాహనుడు, కాశీరాజగు అజాతశత్రువు, మొదలగు జ్ఞానులు క్షత్రియులే. వీరు బ్రాహ్మణులకు గురువు లైనట్లున్నది. కర్మయోగమునందు వైశ్యులకు ప్రవేశ మున్నది. తులాధారుడను వైశ్యశిఖామణి జాజలికి గురువయ్యెను. భక్తియోగమును నారదమహర్షి, ఆళ్వారులు మొదలగు శూద్రకుల జన్ములు లోకమున విస్తరింపజేసిరి. గీతాచార్యులగు శ్రీకృష్ణభగవానుడు, కృష్ణద్వైపాయనుడు బ్రాహ్మణేతరులే.

జైనమతము ఉపనిషత్తులకంటె పూర్వమే ఉండినదని అందురు. యజుర్వేదమునందు ఈ మతము కలదట. ఋషభరాజును "ఆదినాథుడని'

కూడ పిలుతురు. 20, 22వ తీర్థంకరు లిద్దరు తప్ప తక్కిన వారందరు ఇక్ష్వాకులు. 22వ తీర్థంకరుడు నేమినాథుడు. వీరినే "అరిష్టనేమి" అనికూడ పిలుతురు. వీరు శ్రీకృష్ణభగవానునికి జ్ఞాతియని యందురు. తీర్థంకరులయందు 19వ తీర్థంకరి "మల్లినాథ" అను నామము గల ఒక స్త్రీ యుండెను. మొదటిమనువగు స్వాయంభువునకు ప్రియవ్రతుడును, ప్రియవ్రతునకు ఆగ్నీధ్రుడు, ఆగ్నీధ్రునకు నాభి, నాభికి ఋషభరాజు (ప్రథమ తీర్థంకరుడు) జన్మించినట్లు చెప్పుదురు. ప్రియవ్రతుని పుత్రులలో మహావీరుడను పుత్రుడున్నట్లు కలదు, ఋషభరాజునకు నూర్గురు పుత్రులుండిరి. వారిలో కొందఱు లోకవ్యవహారముల యందుండిరి. కొందఱు తత్త్వవేత్తలు. అందులో పెద్దవాడు సుప్రసిద్ధుడగు భరతుడు. తక్కినవారిలో కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, అవిర్హోత్ర, ద్రమిళ, చమస, కరభాజనులు- తొమ్మండ్రుగురు దిగంబరులై మోక్షధర్మమును లోకుల కుపదేశించుచు, చరించు చుండి ఒకనాడు విదేహరాజు (నిమి) కడ కరుదెంచి ఆ రాజునకు ఆత్మతత్త్వమును ఒక్కొక్కరు వేఱువేఱుగా ఉపదేశించినట్లు భాగవత పురాణమునందలి ఏకాదశ స్కంధమున కలదు.

ఈ మతస్వరూపము సంగ్రహముగ ఇట్లుండును.

(2) ఈశ్వరుడు - జీవులు

ఈశ్వరుడు : ఈ మతమునందు జగత్తును సృష్టించి పోషించి లయమొనర్చు ప్రభువొక్కడును లేడు. అనగా లోకులు సామాన్యముగ దేవుడని చెప్పువాడుగాని, అద్వైతుల నిర్గుణ పరబ్రహ్మముగాని, విశిష్టాద్వైతులు చెప్పునట్టి అనంత కల్యాణ గుణాకరుడగు సగుణమూర్తిగాని కలడని వీరంగీకరింపరు. జీవుడే కర్మమాలిన్యమును కడిగివేసికొని దేవుడగును. "ఎవడు అంతశ్శత్రువులైన క్రోధ ద్వేషాదులను జయించినాడో ఆయనయే నిజమైన దేవుడు." (జైన ధర్మము) పూర్ణసిద్ధుడైన మానవుడే దేవుడని అర్థము. కనుక, ఎవడైనను తన పుణ్యపరిపాకమువలన దేవుడు కావచ్చును. కానీ, "సర్వవస్తువులందును, (ఆత్మజ్ఞానమున్న

వానియందును, అది లేనివాని యందునుకూడ) అంతర్గతముగా పరమసూక్ష్మమైన సారభూత పదార్థ మొకటి యున్నదని, విశ్వములోని యీ మార్పులకు, వికారములకు అదే పరమశాశ్వతమైన మూలకారణమని, అదే ఈశ్వరుడనిమాత్రమే జైను లంగీకరించుచున్నారు."

(శ్రీ వీర్చంద్ గాంధిగారి ఉపన్యాసమునుండి)

జీవుడు : ఆత్మ (జీవ) లనేకులు. కొందఱు చెప్పునట్లు విభువులు కారు. అణుస్వరూపులు కారు. ఏజీవు డేశరీరము నందుండునో ఆ జీవు డాశరీర పరిమాణము కలిగి పాలయందు నెయ్యివలె శరీరమంతటను వ్యాపించియుండును. ఆత్మ జడ పదార్థమున కంటె భిన్నమైనది. జీవుడు (ఆత్మ) ఏ జడ పదార్థమునుండి గాని లేక, యే శరీరము నుండిగాని పుట్టినది కాదు. జీవులలో జీవమే తప్ప పదార్థ మేమియు లేదు. స్వయం ప్రకాశము. ఆత్మ పెఱుగుట తఱుగుట కలదు, గాని సంపూర్ణ నాశము లేదు. ఆత్మ నిత్యమైనది. తల్లిగర్భము నుండి జన్మించినపుడు శరీరము చిన్నదిగా నుండును. అప్పుడు ఆత్మయు అంతమాత్రమే యుండును. శరీరము పెఱిగినకొలది ఆత్మ పెఱుగుచుండును. ఆ ప్రాణి మరణించినపుడు ఆత్మ సూక్ష్మాకృతి నొందును. తిరిగి జన్మమెత్తునపుడు (పునర్జన్మనందు) ఏ జీవుడు ఏ శరీరమునందు ప్రవేశించునో ఆ శరీర పరిమాణమునే పొందును. అనగా: చీమగా పుట్టిన ఆత్మయు అంత చిన్నదిగా మారును. (సంకోచము నొందును). తిమింగిలముగా పుట్టిన అంత పెద్దదిగా మారును. ఇట్టి శక్తి ఆత్మకు నైజము.

ఏదేని ఒక కర్మ చేయుటకుగాని చేయకుండుటకుగాని జీవుడే కర్త. కర్మఫలము ననుభవించు వాడును జీవుడే. కర్మఫలము నిచ్చు ఈశ్వరు డొకడు లేడు. కనుక కర్మయే కర్మఫలము నిచ్చుచున్నది. ఆత్మ స్వచ్ఛమైనది. జ్ఞానస్వరూప మైనది. సర్వజ్ఞము శుద్ధము. సుఖ దుఃఖాది ద్వంద్వములకు అతీత మైనది. అనంత్యచతుష్టయ విశిష్టమైనది. అనగా : ఆత్మ (1) అనంతదర్శనము (2) అనంతజ్ఞానము (3)

అనంతానందము (4) అనంతవీర్యము - అను నాలుగు విధములైన స్వరూపము గలది.కాన ఆత్మ అనంత చతుష్టయాత్మక మనియు అందురు. కర్మమాలిన్యము కడిగివేయబడియున్న ఆత్మకు అనంత చతుష్టయము స్వరూపమేగాని గుణములై యుండరాదు. కనుక ఆత్మ అనంత చతుష్టయాత్మక మనునదే సరియైన మతము. కాని కర్మలచే మాలిన్యము నొందుచున్నది. అందువలన దర్శన జ్ఞానానంద వీర్యములు పరిమితము గలదిగా గన్పట్టుచున్నది. ప్రయత్నముచేత కర్మలను కడిగివేసిన యెడల ఆత్మ తన సహజస్థితిని బొందును. అది సిద్ధావస్థ. కర్మలవల్ల కలిగిన పరమాణువులు ఆత్మయందు ప్రవేశించి యుండును.

అనగా: పాలయందు నీరు, నూనెయందు నెయ్యి కలిసిపోయినట్లు ప్రవేశించియుండును. ప్రతికర్మకు ఫలిత మున్నది. దానినుండి తప్పించుకొనుటకు సాధ్యము గాదు. జైనధర్మము ననుష్ఠించిననే దానిని కడిగివేయవచ్చును. కర్మ ఉన్నంతవఱకు ఆత్మకు మాలిన్యము ఉండును. ఆత్మకు మాలిన్యము కలిగిన అజ్ఞాని యగును. అజ్ఞానమువలన తానే దేహమని భ్రమించును. అందువలన దేహమునకు కలుగు సుఖ దుఃఖాది ద్వంద్వములు తనవిగా భావించుచుండును. నిర్మల జ్ఞానము కలుగవలెనన్న కర్మజాలము నంతయు తననుండి కడిగివేయవలెను. కర్మకు ఆకారము గలదు. దానిని జ్ఞాని మాత్రమే చూడగలడు.

జీవాత్మలు (1) సంసారాత్మ లనియు, (2) మూక్తాత్మ లనియు అని రెండు విధములు. సంసారాత్మలయందు (1) చలనములు, (2) స్థావరములని రెండు విధములు. స్థావరములు పృథ్వి, అప్పు, తేజస్సు, వాయువు, వనస్పతి - అని అయిదు విధములు. వీటిని కాయము లందురు. ఇవి జీవములు. వీటిని గుఱించి తరువాత చెప్పెదను.

జీవులు వారివారి పూర్వజన్మ కర్మల ననుసరించి యీ జన్మమున వివిధ శరీరము లెత్తుచుందురు. తక్కువ శ్రేణికి చెందిన జీవి ఒకటే యింద్రియము కలదై యుండును. అట్టి నీచస్థితినుండి పోనుపోను రెండు, మూడు, నాలుగు, అయిదు ఇంద్రియములు కలవిగా నుండును. మానవులు, పక్షులు, గోవులు మొదలగునవి పంచేంద్రియములు గలవి. జీవు లనాదులు.

(3) విశ్వము - షట్పదార్థములు

ప్రపంచము ఎట్లు కలిగినది? అను ప్రశ్నకు ఇతర మతములవలెనే జైనులు సహితము సమాధానము చెప్పలేరు. జగత్తు అనాదియని వీరిమతము. అది దేనియొక్క పరిణామముగాని, దేనినుండియైనను ఏర్పడినదనిగాని, యేదైనను ఒక సత్యపదార్థము భ్రాంతివశమున ఈ రూపమున కనబడుచున్న దనిగాని వీరంగీకరింపరు. ఈశ్వరుడు జగత్తును నిర్మించెనను వాదమును వీరంగీకరింపరు. స్వతంత్రములైన ఆఱు పదార్థముల కలయికవల్ల ఈ విశ్వ మేర్పడినదని చెప్పుదురు. ఈ ఆఱు పదార్థములను రెండుగ విభజింపవచ్చును (1) జీవము (2) అజీవము. జీవునిగూర్చి యిదివఱకు చెప్పితిని. అజీవము అయిదు విధములు. (1) ధర్మము (2) అధర్మము (3) ఆకాశము (4) పుద్గలము (5) కాలము.*

(1) ధర్మము :- ఇది హిందూమత గ్రంథములయందు జెప్పిన ధర్మము (పుణ్యము) వంటిదికాదు. దీనివలన జీవులకు చలనశక్తి కలుగుచున్నది. జీవుల చలనమునకు ధర్మము ప్రత్యక్షకారణము కాకపోయినను ఉదాసీన హేతు వగుచున్నది. అనగా : ధర్మముయొక్క యునికివలననే చలన మేర్పడునని భావము. చేప కదలుటకు జల మెట్లు ఆధారమో, అట్లని తాత్పర్యము. జలము చేపను ఒకచోటు నుండి మఱియొక స్థలమునకు స్వయముగా తీసికొనిపోవుట లేదు. నీటివలన చేప ఆవిధముగా తిరుగుట కవకాశ మేప్పడినది. లోకమంతయు ధర్మము నాశ్రయించియే యున్నది. అది ఒకచోటునుండి యింకొక చోటునకు కదలునట్టిది కాదు. అది ఏకద్రవ్యము. ధర్మము చలనము లేనిది.

* శ్రీశంకరాచార్యులవారి భాష్యమున ఈ క్రిందివిధముగా ఉన్నది :-

"సప్తచైషాం పదార్థా స్సమ్మతా జీవాజీవాస్రవ సంవర నిర్జర బంధమోక్షానామ"

(బ్రహ్మ.2-2-33)

తా॥ జీవుడు, అజీవము, అస్రవము, సంవరము, నిర్జరము, బంధము, మోక్షము.

(2) అధర్మము ; ఇది పురుషుని స్తంభింపజేయునది. అనగా : ముందునకు సాగిపోకుండ అరికట్టి జడతుల్యునిగా జేయునది. ధర్మము గతి స్వభావము గలది. అధర్మము స్థితి స్వభావము గలది. ఇది హిందూమత గ్రంథములయందు పాపమునకు పర్యాయముగ చెప్పబడు అధర్మము వంటిదికాదు. ధర్మమువలెనే యిదియు ఏకద్రవ్యము. ప్రపంచమంతటను వ్యాపించియున్నది. ధర్మము జీవజడముల కెంత యుపకారియో అధర్మముకూడ అంత యుపకారియే. ఏలయన అధర్మము చలనమును నిరోధించి జీవద్రవ్యములకు విశ్రాంతి నిచ్చుచున్నది. అధర్మము లేనియెడల జీవులకు విశ్రాంతి యుండదు. నిరంతరము చలనమే యుండును. ధర్మాధర్మములు రెండును క్రమముగ గతికి, స్థితికి ఉదాసీన కారణములు. ఇవి యింద్రియ గోచరములు కావు. ఇవి సర్వవ్యాపకములు.

(3) ఆకాశము :- ఇది కదలికకు అవకాశ మిచ్చునట్టిది. ఆకాశము రెండువిధములని చెప్పిరి. (1) లోకము నందలి సమస్తము తనయందిముడ్చుకొని యున్న దానిని లోకాకాశమని యందురు. ఇచట "సమస్తము" అనగా - చలనము, నైశ్చల్యము, నియామకము, ధర్మాధర్మములు, కాలము, ద్రవ్యము, జీవులు - అని అర్థము. దీనికి పైన శూన్యమై యున్నదానిని అలోకాకాశమని చెప్పిరి. ఆకాశము సర్వగతము నిత్యమునై యున్నది.

(4) పుద్గలము అనగా :- ద్రవ్యము (Matter) రూపము గలది. శబ్ద స్పర్శ రూప రస గంధములు పుద్గల లక్షణములు. అవిభాజ్య ప్రాథమిక ద్రవ్య శకలమునకు "అణువు" అని పేరు. అది అవిభాజ్యముగను ఆది మధ్య అంతము గలదిగను ఉండును. దానికి స్పర్శ, రూప, రస గంధములు గుణములు. వైశేషికులు చెప్పినట్లు పృథివ్యాది అణువులకు వేఱువేఱుగా ఆయా జాతిగుణములు ఒక్కొక్కటి మాత్రమే ఉండును. ఈ మతమున ప్రతి అణువునకు అన్నిగుణములు ఉండును. ఇదియే వైశేషికుల అణువాదమునకును, జైనుల అణువాదమునకును గల భేదము.

(5) కాలము*:- ఇది సూక్ష్మకణాత్మకము. కణములు అసంఖ్యాకములు. అవిభాజ్యములు, అరూపములు. కాలము జీవ జడ పదార్థముల యందు పరిణామమును కలుగ జేయును. మఱియు ఆద్యంతరహిత మైనది. గంటలు నిమిషములు మొదలగు హద్దులు గల కాలమును "సమయ" మనియు, ఆద్యంత రహితమైన దానిని "కాల"మనియు రెండు విధములుగా చెప్పిరి. కాలము పైనచెప్పిన ధర్మాధర్మములవలె ఉదాసీన మైనది కాదు. ఇది కారయికత్వము గల కారణము. క్రొత్త దానిని ప్రాతదానినిగాను, బాలుని వృద్ధునిగాను, వృద్ధుని మరణానంతరము తిరిగి జన్మించు బాలునిగాను చెందించుచున్నది. మనదేశమున పూర్వము కాలవాదు లనువారు కొందఱు కలరు. జైనులు జీవుడు తప్ప తక్కిన యైదును చేరి పంచాస్తికాయ మందురు. ఇవి అజీవములు. పుద్గలము తప్ప తక్కినవి అరూపములు. (రూపము లేనివి.)

విశ్వమునకు ఆదిగాని మూలముగాని లేదు. ఈ జగత్తు సత్యమా? లేక నశించునదా? అను ప్రశ్నలకు వీరు చెప్పు సమాధానమిది:- జగత్తు దానియందలి సర్వపదార్థములు ఒక్కటిగా భావించినచో అది శాశ్వతమే. అనగా :అవినాశియే. అట్లు మొత్తముగా గైకొనక వేఱు వేఱు

---

* తిక్కనగారి మహాభారత శాంతిపర్వమున ఇంద్ర బలి సంవాదమున బలి యింద్రునకు కాలమహిమను ఈ క్రిందివిధముగా చెప్పినట్లు గలదు :-

క|| నిను నే గెలుచుట కాలము,
నను నీవును గాలయుక్తి నను గెలిచితి కా
వున నశుభమునకు శుభమున,
కును గాలము సూవెకర్తకు శికసూతజా.

ఆ|| నాకు నీకు నేల నాకేశ శత్రుత్వ,
మేర్లైనఁ గలదె యెందు బాక
మునకుఁ తెచ్చుచుండు జనుల గాలము వృక్ష,
ఫలవిధముగ రజ్జుపలుకు లుడుగు.

ఈ విధముగ కాలవాదులు కొందఱున్నట్లు తెలియుచున్నది.

భాగములుగా చూచినపుడు అవి క్షణక్షణమున మారుచున్నందున అవి వినాశము నొందునట్టివియే.

(4) జ్ఞానము

జ్ఞానముగూర్చి వీరిట్లు చెప్పుదురు:- జ్ఞానము ఐదు విధములు. లేక జ్ఞానమునకు ద్వారము లయిదని చెప్పవచ్చును. అవి యీ క్రింద చెప్పబడినవి :-

(1) మతి :- ఇది యింద్రియములచేత తెలియబడు సామాన్య జ్ఞానము. దీనిలోనే స్మృతి అనుమానము లున్నవి. ఉపలబ్ధి, భావన, ఉపయోగము - ఇందులోనివే. మతి జ్ఞానమునకు ముందు దర్శనము ఉన్నది.*

(2) శ్రుతి :- శబ్దమునుండి గ్రహింపబడు నట్టిది;సాక్షము లేక సంజ్ఞనుండి గ్రహింపబడునది. లబ్ధి (సహకారము), భావన (శ్రద్ధ), ఉపయోగము (విషయగ్రహణము), నయము (వస్తుజ్ఞాన విచేష్టనము)- ఇవి ఇందులో చేరినవే. ఇచట నయమనగా ముందు చెప్పబోవు సప్తభంగీ నయమని అర్థము.

(3) అవధి:- ఇతర ప్రదేశముల యందు కాని ఇతర కాలములయందుకాని ఉన్న వస్తువులను తెలిసికొనునట్టిది. అనగా: దూరశ్రవణ దూరదర్శనాదిక శక్తులు గల జ్ఞానము.

(4) మనోగ్రహణశక్తి (మనఃపర్యాయము) అనగా:- ఇతరుల భావమును తెలిసికొనునట్టి జ్ఞానము. ఇతరులు ఆలోచించునప్పుడు మనస్సులో జరుగు ఆలోచనలను మార్పులను (విషయములను) గ్రహించుట.

---

* దర్శనమనగా :- జ్ఞానమును దర్శనమని, జ్ఞానమని రెండు విధములుగా చెప్పిరి. దర్శనమునందు తెలియబడు వస్తువును గుఱించిన వివరములు తెలియవు. వస్తువుయొక్క సామాన్యలక్షణము మాత్రమే తెలియును. విశేషలక్షణములు తెలియవు. ఇది లఘుజ్ఞానము. జ్ఞానమువలన వస్తువుయొక్క వివరములు తెలియును. ఇది బుద్ధిజన్యము

(5) కేవల (పరిపూర్ణ) జ్ఞానము :- ఇది సమస్త వస్తువులయొక్క రూప గుణ విశేషములను తెలిసికొనునట్టిదియు, దేశ కాల వస్తువులచేత పరిచ్ఛిన్నము గానట్టిదియు, సర్వజ్ఞమును, అతీంద్రియమును - అగు ఆత్మజ్ఞానపరాకాష్ఠ స్థితియే గాని "ఆత్మవినాశనము గాదు". ఈ స్థితిలో శారీరక అవధులను మానవు డతిక్రమించిపోవును. అనుభవైక వేద్యమైన యీ పరిపూర్ణ జ్ఞానమును పరిశుద్ధాత్ము లగు కేవలులకు మాత్రమే కలుగును. ఇతరులకు దుర్లభము.

(5) స్యాత్‌వాదము (సప్తభంగీనయము)

స్యాద్‌వాదము జైనమతమునందు ముఖ్యమైనది. ఒక వస్తువునకు ఒక ధర్మమున్నదని మన మెఱుగుట 'నయ' మనబడును. మనకు తెలియని ధర్మము లెన్నియో ఆ వస్తువు నందు ఉండవచ్చును. కాని మన మెఱిగిన ధర్మము (గుణము) మాత్రమే కలదని చెప్పలేము. అప్పుడు "బహుశః యిది ఉన్నది",'బహుశః కావచ్చును.' (సత్-స్యాత్) అని చెప్పుటయే సరియగు పద్ధతి. మన జ్ఞానమంతయు నయమే. తీర్థంకరుల జ్ఞానము పరిపూర్ణము. వారు సర్వజ్ఞులు.

ఈ మతము ననుసరించి మన అనుభవమునందున్న ప్రతి విషయము, మనమే నిర్ణయము చేసినను ఇదమిద్ధమని నిస్సందేహముగా చెప్పజాలము. అనగా స్థిరమైన నిర్ణయము చేయజాలము. ఏదైన చెప్పవలె నన్నచో "బహుశః కావచ్చును" అని చెప్పవలసివచ్చును. అదియే 'స్యాత్? ఏలయన? ఈ మతము ననుసరించి తత్త్వము లనేకములు. తత్త్వస్వరూపమును నిర్ణయించవలెనన్న దానిని వివిధ దృక్పథముల ద్వారా నిర్ణయింపవలెనేగాని ఒకే దృక్పథముతో నిర్ణయించరు. ప్రతి వస్తువునకు అనంతధర్మములు కలవు. ఇవి మనఃకల్పితములు కావు. నిజమైనవి. ఆ ధర్మము లా వస్తువునందుండును. అందువలన మనము చేసిన నిర్ణయము కొన్ని పరిస్థితులలో సత్యమైన నిర్ణయమే కావచ్చును. కాని అన్ని పరిస్థితులలోను అది సత్యము కాజాలదు. అనగా : అది తాత్కాలిక సత్యము. ఈ 'స్యాత్' ను ఏడు విధములుగా చెప్పిరి.

స్యాత్ వాదముయొక్క వివరము :-

✓ (1) స్యాదస్తి-బహుశః ఉన్నది :- ఒక స్థలమున ఒక వస్తువు ఉన్నది. దానిని "ఉన్నది" అని మనము చెప్పుదుము. జైనులు ఉన్నది అని చెప్పరు. ఉన్నది అనుటకు మారుగా "బహుశః ఉన్నది" లేక బహుశః ఉండవచ్చును అందురు. ఒక వస్తువును "ఉన్నది" అని చెప్పవలయునన్న జైన మతానుసారము. 1. పదార్థము, 2. స్థలము, 3. కాలము, 4. స్వభావము - అను ఈ నాలుగు దృక్పథములలో వస్తువున్న యెడల 'ఉన్నది' అని చెప్పవలయును. కాని అన్ని దృక్పథములనుండి వస్తు వున్నదనుట సాధ్యపడదు. అనగా : అట్లుండుట అసంభవము. ఉదాహరణమునకు- ఒక ఘటము ఉన్నది. అది మట్టితో చేసినది. ఆ గదిలో ఉన్నది. ఈ కాలమునందు మాత్రమే ఉన్నది. అది ఒక పరిమాణమగు లావు, ఎత్తు, ఒక విధమగు రంగు కలిగియున్నది.

✓ (2) స్యాత్+నాస్తి (స్యాన్నాస్తి) :- బహుశః లేదు. మఱియొక దృక్పథమునుబట్టి చూచిన పైన చెప్పబడిన ఘటము లోహమయము కాదు. వేఱొకచోట లేదు. ఇంకొక సమయము లేదు. వేరొక రూపమున లావు ఎత్తు రంగు పై విధముగా లేదు. ఆ దృక్పథమునుడి చూచిన బహుశః లేదు అని అనవలసి వచ్చును.

✓ (3) స్యాదస్తి(చ) నాస్తి(చ) :- ఉండను ఉన్నది - లేను లేదు - పైన చెప్పిన పదార్థ, స్థల, కాల, స్వభావము లను చతుర్విధ దృక్పథములనుండి చూచిన ఒక వస్తువు ఉన్నది అనియు, లేదు అనియుకూడా చెప్పవచ్చును.

✓ (4) స్యాదవక్తవ్య :- బహుశః చెప్పుటకు సాధ్యపడదు.-పైన చెప్పిన రీతిగా ఘటము ఒకరీతిగా ఉన్నదనియు, ఇంకొక రీతిగా లేదనియు చెప్పియున్నారు. ఈ విధముగా పరస్పర విరుద్ధ భావములను ఏకకాలమున చెప్పుటకు సాధ్యపడదు. కనుక అవక్తవ్యము కావచ్చును.

(5) స్యాదస్తి (చా) అవక్తవ్యా :- బహుశః ఉన్నది కాని వక్తవ్యము కాకపోవచ్చును- పైన చెప్పిన చర్విధ లక్షణ దృక్పథములనుండి అవక్తవ్య

మనియు - అను రెండు భావములు ఏర్పడినవి. ఇచట "స్థితి" యు, "అవక్తవ్యము" రెండు భావము లున్నవి.

✓ (6) స్యాన్నాస్త్యవక్తవ్యా :- బహుశః నాస్తి అవక్తవ్యము కావచ్చును. ఘటము పైన చెప్పిన చతుర్విధ లక్షణ దృక్పథములనుండియు తానుగాని వస్తువుయొక్కయు, తన యొక్కయు, ఉభయ దృక్పథములనుండి వస్తువు లేదు. ఆవక్తవ్యము - ఇచట అభావము దాని అవక్తవ్యము చెప్పబడినది.

✓ (7) స్యాదస్తి(చ) నాస్తి(చా) అవక్తవ్యా :- బహుశః ఉన్నది, లేదు, అవక్తవ్యము. ఒకే వస్తువు, ఒకే క్షణము నందు ఒకే దృక్పథమునుండి ఉన్నదనియు, వేఱొక దృక్పథమునుండి ఆ క్షణమున లేదనియు, చెప్పిన కారణమున నవక్తవ్య మనియు, దాని స్వరూపమేగాక, అది కానిది కూడ చెప్పబడెను.

పైన చెప్పిన యేడింటిలో మొదటి రెండే ముఖ్యమైనవి. ఎట్లన :- మొదటిది - ఘటము స్వద్రవ్యమునందు (మృత్తికయందు) తానున్న గదిలో, తానున్న కాలమున, తన స్వభావ స్వరూపమున ఉన్నదని అతి కష్టమువలన సాధించిన భావ నిర్ణయము.- రెండవది. ఒక వస్తువు (ఘటము) పరద్రవ్యమున,పరస్థలమున, ఇతర సమయమున పరరూపమున లేదని శ్రమచే చేసిన అభావ నిర్ణయము - నిర్ణయము లన్నియు సదసదాత్మకములు, భావాభావములు ఉన్నవి లేనివి, తానైనది తాను కానిది అను రెండు ముఖములు కలవియై యున్నవి. లోకమున శశము కలదు, శృంగము కలదు, శశ+శృంగము=శశశృంగము (కుందేటికొమ్ము) లోకమున లేదు. అనగా అభావము ఉన్న శశ+ శృంగ శబ్ద మేర్పడినది. ఇందువలన అభావము భావాశ్రయమై యున్నది. మూడవ అంశము కొంతవఱకు అంగీకరింపవలసినదే. తక్కిన నాలుగంశములు అంత యుపయుక్తములు కావు.

జైనమతము ననుసరించి ఒక వస్తువు 'ఇది ఇంతే' కావచ్చును. ఇంకేమైన కావచ్చును. ఏదిగాని 'ఇదియే' అని ఖండితముగ చెప్పుటకు వీలులేదు. అంతయు అనిశ్చితము. ఇది అనేకాంతవాద మగుటచే ఒక

వస్తువును సూక్ష్మముగా బహు ముఖములు (Aspects) గా వివరించవలెనను సూత్రము. ఒక వ్యక్తి యింకొకనికి తండ్రి, మఱియొకనికి కుమారుడు అగుచున్నాడు గదా? ఆ విధముగానే విశ్వములో ఉన్న ప్రతి వస్తువునకు ఇతర వస్తువులతో ఏదో ఒక విధమగు సంబంధ ముండియే తీరును. ఉదాహరణము : ఒక బల్లపై ఒక పుస్తకము ఉన్నది. దానిని మనము "పుస్తకము బల్లపై ఉన్నదందుము." జైనులు "బహుశః బల్లపై పుస్తకము ఉన్న" దందురు. వారి వాదమేమన :- అన్ని కాలములందును పుస్తకము బల్లపై ఉండగలదా? ఉండదు. బంగారమును చూచినపుడు మనము "ఇది బంగార మందుము". వారు "బహుశః ఇది బంగారమై యుండవచ్చును" అందురు: దానిని పరిశీలించిన బంగారమునకంటె అన్యద్రవ్యమునకు సంబంధించిన పరమాణువులు దానియం దుండవచ్చును. అందువలన "అది బంగారమే" అని నిశ్చయముగా చెప్పలేమందురు.

(6) కర్మ సిద్ధాంతము

ఈ మతము ననుసరించి 'కర్మ' యనగా క్రియ గాదు. వ్యాపారము కాదు. కర్మ ద్రవ్యరూప మైనది. ఇంద్రియ గోచరముగాని అతి సూక్ష్మ కణములయొక్క సముదాయము. ఈ సూక్ష్మపదార్థముచే జగమంతయు నిండియున్నది. అనాది నుండియు వచ్చుచున్న యీ ద్రవ్య సంపర్క దోషముచేతనే జీవుడు ప్రస్తుత జన్మమున వ్యవహరించుచు నూతన ద్రవ్యమును సంగ్రహించుకొనుచున్నాడు. మనోవాక్కాయముల యొక్క వ్యాపారముచేత జీవునియందు కొన్ని యణువులు లేక కణములు (పదార్థములు) ప్రవేశించుచున్నవి. జీవుడు కార్మిక ద్రవ్యము నాకర్షించుటనే జైనులు 'ఆస్రవ' మందురు. పూర్వమున్న కొంత ద్రవ్యము జీవునియందుండి బయటికి పోవుచున్నది. ఈ కర్మపదార్థమువలన కర్మ శరీర మేర్పడు చున్నది.

జీవు వాశ్రయించిన ఈ కార్మికద్రవ్యము పెక్కు కార్యముల నుత్పాదించును. ఫలభేదము ననుసరించి కర్మను భౌతిక స్వభావము

గల ద్రవ్యమనియు, మానసిక స్వభావము గల భావమనియు రెండు విధముల పేర్కొనిరి. రెండవది ద్రవ్యమువలన కలిగిన కర్మ సంసర్గముచే జీవులయందు పుట్టు మానసిక వికారము. జీవుడు సిద్ధావస్థ నొందువఱకు క్రొత్త కర్మ పదార్థము జీవునిలో ప్రవేశించుచు, జీవునియందుండి కొంత పదార్థము నిర్గమించుచు, ముక్తావస్థ చెందువఱకు జీవునియందు కొంత నిలిచియే యుండును. జీవుడు ముక్తుడై నప్పుడు ఆతనియందు కర్మ లేశమైనను ఉండదు. కర్మ వలననే జీవుడు మరణానంతరము పుణ్యాపాపముల ననుసరించి లోకాంతర జన్మాంతరముల నొందుచున్నాడు. హిందువుల వలెనే జైనులును పునర్జన్మ సిద్ధాంతము నంగీకరింతురు.

(7) ధర్మానుష్ఠానము

జీవులు కర్మనుండి విముక్తి నొందుటకు రెండు మార్గములు కలవు. (1) మనోవాక్కాయ కర్మలచే రాగాదులును, వాటి కార్యములగు కర్మపుద్గలమును ఆత్మయందు ప్రవేశించుచుండును. దానినే 'ఆస్రవ' మందురు. అట్టి ఆస్రవమును అరికట్టుట. కర్మలు ఆత్మయందు ప్రవేశింపజేయకుండుట. దానినే "సంవరము" (నిరోధించుట) నిర్జరము (క్షీణింపజేయుట) అని అందురు. ఈ రెండు పద్ధతులు ఆచరణ యందుంచవలయును.

(2) జైనుల మతానుసారము ముక్తిని కోరువారు ఆత్మ నంటియున్న కర్మ పంకిలమును కడిగివైచి ఆత్మను స్వాభావిక స్థితికి తేవలయును. దీనికి భక్తిగాని యుక్తిగాని పనికిరావు. తపస్సు, ధర్మా (పుణ్యా) చరణము, వైరాగ్యము, తత్త్వచింతనము - అవసరము. ఈ మతము ననుసరించి రక్షకు డొకడు లేడు. కనుక, ఆశ్రితుల పాపములను క్షమించుటకు గాని నిర్హేతుక కృపకుగాని అవకాశము లేదు. ఘంటాకర్ణుని వంటి భక్తునకుగాని, పరశురామునివలె లోక కల్యాణమునకై యితరులను చంపు కర్మయోగికి గాని గౌరవస్థానము ఈ మతమునందు లేదు.

పరిశుద్ధమైన నైతిక ప్రవర్తనము, సర్వభూతములయెడ దయయు ముఖ్యమైనవి. హిందువులు, బౌద్ధులు అహింసా ధర్మావలంబులేగాని

జైను లీధర్మమును అందఱికన్నను ఎక్కువగా పాటింతురు. ఇతరులకు హానికరములగు ప్రాణులను అనగా : పాము,తేలు మొదలగువాటిని సహితము చంపరు. రాత్రులందు దీపములు వెలిగించిన పురుగులు నశించునని దీపములు పెట్టరు. కొందఱు భూమిపై నడచునప్పుడు కొన్ని ప్రాణులు పాదముల క్రిందపడి నశించునని నెమలి కుంచెలతో నేలనూడ్చుచు అడుగులు పెట్టి నడతురట. దానమును, సత్యమును ఉపవాసమునుగూడ పరమధర్మముగా పాటింతురు.

(8) జైన సంఘము

జైనులయందు దిగంబరులని, శ్వేతాంబరులని రెండు శాఖలు గలరు. జైనమతమునందు రానురాను అనేక శాఖలు ఏర్పడినవి. కాని తుదకు ముఖ్యమైన శాఖలు పై రెండు మాత్రమే మిగిలినవి. వర్ధమాన మహావీరుడు దిగంబర శాఖవారు. పార్శ్వనాథుడు శ్వేతాంబర శాఖవారు. ఈ యిరుతెగల వారియందు భేదమున్నది. ఈ రెండు శాఖలు క్రీ. వె. మొదటి శతాబ్దమున ఏర్పడియుండవచ్చునందురు. ముక్తపురుషులు లోకమును జయించినవారు గనుక వారిని "జిను" లందురు. లోకమును తరంపజేయువారిని "తీర్థంకరు" లందురు. జైనులయందు వర్ణవ్యవస్థ కలదు. కాని వారు వ్యక్తియొక్క యోగ్యతనుబట్టి వర్ణనిర్ణయము చేయుదురు. "మానవుడు పాపము చేయుటకు కారణములైన అష్టవిధ గర్వములలో కులగర్వ మొక్కటి" అని చెప్పిరి. దీనిని నశింపజేయనిదే 'జినుడు' కాలేడు.

వీరు హిందూ సంఘమునందున్న నేటి వర్ణవ్యవస్థను తీవ్రముగా ప్రతిఘటించిరి. ఆకారణమున హిందువులయందు, ముఖ్యముగా బ్రాహ్మణుల ఆగ్రహమునకు పాత్రులై అనేక హింసలకు పాలైరి. జైనులకు బ్రాహ్మణులకు సరిపడదు. జైనులు పతితులనైనను దగ్గరకు చేరదీసి తమ మతదీక్షను ఇచ్చెడి వారు. ఈ మతమునకు హాని కలిగించిన వారిలో అగ్రగణ్యుడు కుమారిలభట్టు. బౌద్ధులు చచ్చిన మృగమాంసమును భక్షింతురు గాని వీరు పూర్తిగా శాకాహారులు. ప్రస్తుతము జైనులు

చాల ధనవంతులు. కన్నడ, గుజరాత్, మార్వాడి ప్రాంతమున ఈ మతమున్నది. ఆంధ్ర, కేరళ, తమిళ ప్రాంతములలో ఈ మతము నశించినది. జైనుల మతగ్రంథముల నెన్నిటినో హిందువులు నాశన మొనర్చిరి. భూగర్భమున దాచిన కొన్ని గ్రంథములు మాత్రమే మిగిలినవట. జైనులు మొదట విగ్రహారాధనమును నిరసించినను తరువాత మహావీరుని విగ్రహమును పూజించిరి. దిగంబర శాఖకు చెందినవారు స్త్రీలకు మోక్షము లేదందురు. శ్వేతాంబర శాఖీయులు స్త్రీలకు సహితము మోక్షము కలదందురు. జైన సంఘమున స్త్రీసన్న్యాసినులు అనేకులు కలరని చరిత్ర చెప్పినది. వీరిని శ్రావికగణ మందురు. హిందూమతమున నున్నట్లే జైనుల యందును మంత్ర తంత్రములు కలవు. యోగము, యోగ మహిమలుకూడ వీరికి ఉండిన వందురు.

మహావీరుడు, మునిసంఘము, శ్రావకసంఘము, ఆర్యకాసంఘము, శ్రావికాసంఘము అను నాలుగు సంఘముల నేర్పరచెను. సర్వప్రాణుల కళ్యాణసాధనకై సర్వోదయ తీర్థాన్ని స్థాపించి దానిని ప్రచారము చేయుచు వారి చివరి ముప్పది యేండ్లు గడిపిరి. భగవాన్ మహావీరుడు తమ 72 వ యేట భౌతిక దేహమును త్యజించి నిర్వాణమును పొందిరి. ఆ దినముననే భగవానుని ముఖ్యశిష్యుడగు ఇంద్రభూతిగౌతమునకు కైవల్యజ్ఞానప్రాప్తి (సిద్ధావస్థ) కలిగెను. ఈ రెండు కారణములవలన ఆ దినము జైనులు దీపావళి పర్వదినముగా జరుపుకొనుచున్నారు.

ఆంధ్రదేశమునందు బౌద్ధమతము సుమారు క్రీ. శ. 600 సంవత్సరములనాటికి చాలవఱకు నశించియుండినను, ఆపిమ్మట కొన్ని శతాబ్దములవఱకు (జైనము) దక్షిణభారతమున మంచిస్థితి యందుండినది. ముఖ్యముగా ఆంధ్రదేశమును పాలించిన రాజు లనేకులు హిందూ జైనమతముల సమానముగా చూచిరి. వేంగిని పాలించిన తూర్పు చాళుక్యరాజులలో పెక్కండ్రకు జైనమతావలంబులగు భార్య లుం(రాణులుం)డిరి.

తూర్పు చాళుక్యరాజులలో మూడవ విష్ణువర్ధనుడు (క్రీ. శ. 718-752) 8వ రాజు. ఇతడు జైనులకు గ్రామదానము చేసెను. ఈ వంశీయుడే యగు రెండవ అమ్మరాజు (క్రీ. శ. 945-970). ఇతని ప్రియురాలగు చామకాంబయను జైనశ్రావణి ప్రోత్సాహమున "సర్వలోకాశ్రయ జినభవనము"నకు "కలుచుంబరు" అను గ్రామమును దానము చేసెను. ఈ వంశీయుడేయగు క్రీ. శ. 1011-1018 వఱకు పాలించిన రాజమార్తాండ బిరుదనామము గల విమలాదిత్యుడు అతని చరమదశయందు జైనమతమును స్వీకరించెను. ఇతడు ఆంధ్రభారత కృతికర్తయగు రాజరాజనరేంద్రుని తండ్రి. చోడచక్రవర్తియగు రాజరాజ కేసరివర్మకు అల్లుడు. ఇట్లు పై యంశములు చరిత్రకారులు వ్రాసియున్నారు.

జైనమతము రాజాదరణ కోల్పోయిన పిమ్మట హిందూప్రజల ద్వేషమునకు గురియయ్యెను. జైనుల దేవాలయములను కొన్నింటిని హిందువులు తమ దేవాలయములుగా మార్చిరి. శైవ, వైష్ణవముల వత్తిడిని భరింపజాలక దక్షిణమున జైనము నశించెను.

(9) సిద్ధావస్థ

జైనదర్శనము ననుసరించి జీవులు సిద్ధావస్థయందు కర్మపదార్థరహితులై సచ్చిదానంద స్వరూపులై యుందురు. ఆత్మయందు పుణ్యపాపములు రెండును ఉండరాదు. వారికి దేహములు ఉండవని వేఱుగా చెప్పనవసరము లేదు. ప్రతిఒక్కరు ఒక్కొక్క దేవుడని చెప్పవచ్చును. ఏలయన ? ఆత్మకు సహజ స్వరూపమైన (1) అనంతదర్శన (2) అనంతజ్ఞాన (3) అనంతసంతోష (4) అనంతవీర్యములు - గలవారలై యుందురు. వాస్తవమునకు అనంతశబ్దముతో చెప్పబడు నీదర్శన జ్ఞానానంద వీర్యములన్నియు ఏకవస్తు స్వరూపములే. ముక్తజీవులు బద్ధజీవుల ముక్తికై పాటపాడెదరు. చివఱకు ముక్తులు లోకాకాశమును దాటి ముక్తుల నివాసలోకమును చేరి 'అనంత చతుష్టయానుభూతిలో అచలముగ నుందురు. సంపూర్ణ దుఃఖనాశనమే మోక్షము."

ఉపనిషత్తులయందు చెప్పు ఆత్మకును కేవులుడగు జైనుల ఆత్మకును భేదము చాలస్వల్పము. ఉపనిషత్తులయందలి ఆత్మ అద్వితీయము. జైనుల ఆత్మలు అనేకములు. ఇదియే భేదము. అయినను ఈ భేదము సహితము ముక్తావస్థయందు సత్యము గాదు. ఏలయన ముక్తాత్మలయందు కర్మగాని పుద్గలము (జడద్రవ్యము)గాని లేదు. కనుక ఆత్మల యందొక దానికంటె మరియొకటి భిన్నమని చెప్పుటకు లింగమేమియు లేదు. జైనులు చెప్పునట్లు ముక్తి పొందిన జీవులందరు సచ్చిదానంద స్వరూపులే. ఒక ఆత్మకు మఱియొక ఆత్మకు భేదము స్వరూపమునందు లేనప్పుడు అవి అనేకము లని చెప్పుటకు సాధ్య మెట్లగును? అదిగాక, అనంతా నందము అనంతజ్ఞానములుగల వస్తువు అనంతమైనదే (అఖండ మైనదే) గాని పరిచ్ఛిన్న మైనదగుటకు వీలులేదు. పరిచ్ఛిన్నత మాయ (ప్రకృతి) వలన తోచుచున్నదని వేదాంతులు చెప్పుదురు. అట్లే జైనులు చెప్పు పరిచ్ఛిన్నతకూడ అనాత్మవలననే కలుగుచున్నదని వారంగీకరింపక తప్పదు. అనాత్మ సంబంధము లేని ఆత్మలు పరిచ్ఛిన్న మైనవని (అనేకములని) చెప్పుటకు వీలులేదు. ఈ విషయము వారంగీకరింపక పోయినను వ్యవహారదశయందు ద్వైతము నంగీకరించుచు పారమార్థిక దశయందు శ్రీశంకరులు చెప్పిన అద్వైతమే వారికి గమ్యస్థాన మైనది. కనుక పరమార్థమునందు జైనదర్శనము అద్వైతమునే బోధించుచున్న దనుటకు అవకాశ మున్నది.

(10) జైనమత విమర్శ

జిజ్ఞాసువు :- శంకరాచార్యులవారు ఈ మతమునం దెట్లు దోషములను జూపిరి ?

వేదాంతి :- బాదరాయణాచార్యులవారు బ్రహ్మసూత్రములో రెండవ అధ్యాయమున 'ఏకస్మిన్నసంభవాధి కరణము'న ఈ మతమును విమర్శించిరి. దానికి శ్రీశంకరులు భాష్యమును రచియించిరి. భాష్యమువందలి సారాంశమిది :

సూ॥ నైకస్మిన్నసంభవాత్. (బ్ర.సూ. 2-2-33)

తా|| ఒక వస్తువు నందొక కాలముననే కలిమి లేములను విరుద్ధధర్మము లుండుట సంభవింపదు.*

దీనివలన స్యాదస్తియను "సప్తభంగీన్యాయము" పరిహరింపబడినది. స్యాదస్తివాదము ననుసరించి "జీవులు నిత్యులు", "కైవల్యము నిత్యము" అని చెప్పుటకు వీలులేదు. స్యాదస్తివాదమునందలి సారాంశము ఏదియు నిజమని చెప్పుటకు వీలులేదనియే గదా?

సూ|| ఏవంచాత్మా ఒకార్త్స్న్యమ్. (బ్ర. సూ. 2-2-34)

తా|| ఆత్మకు అపరిపూర్ణత్వమను దోషము పట్టును.

నిత్యవస్తువెప్పుడును నిర్వికారమై యుండవలెను. వికారి యగునది నాశన మొందక తప్పదు. ఆత్మ చీమదేహమం దుండునప్పుడు చిన్నది యగుటయు గజదేహమునం దున్నప్పుడు పెద్దది యగుటయు కలుగుననుటవలన ఆత్మకు వికారము సంభవించినట్లే కదా? వికారియగు ఆత్మ నిత్య మెట్లగును? పరిచ్ఛిన్నమగు ఘటపటాదులవలె నశించి తీరును.

సూ|| న చ పర్యాయాదప్యవిరోధో వికారాదిభ్యః. (బ్ర. సూ. 2-2-35)

తా|| పర్యాయాదపి = ఆత్మ అనంతావయవములు గలది. కనుక ఆత్మ అల్పాధిక పరిణామములను బొందునపుడు కొన్ని అవయవములు ఆత్మను విడిచిపోవుటయు, కొన్ని అవయవములు వచ్చిచేరుటయు కలుగుచుండుటచే సంకోచవికాసములు పొందుటయందు, అవిరోధః = విరోధము; న చ = లేదు; అని చెప్పుదురా? అట్లు చెప్పినచో ఆత్మనుండి వెడలి పోయిన కొన్ని అవయవములు ఎచ్చటికి పోవును?

---

* ఒకే కాలమున ఒకవస్తువునందు పరస్పర విరుద్ధధర్మము లున్నట్లు జైన మతము చెప్పియుండలేదని "ఒక వస్తువు కొన్ని పరిస్థితులలో వేడిగాను మరికొన్ని పరిస్థితులలో చల్లగాను ఉండునని మాత్రమే చెప్పియుండిరి. "అని శ్రీ వీర్చంద్ రాఘవజీ గాంధీగారు శ్రీశంకరభగత్పాదులు విమర్శించిన యీ యంశమునకు సమాధాన మిచ్చిరి. (చికాగో విశ్వమత కాంగ్రెస్‌లో ఇచ్చిన ఉపన్యాసమునుండి)

తిరిగికొన్ని ఎచ్చటనుండి వచ్చును? అను ప్రశ్న కలుగును. దీనికి సమాధానము చెప్పుటకు సాధ్యము కాదు. అందువలన ఆత్మ (జీవుడు) అనిశ్చిత స్వరూపు డగును. అదిగాక పైన చెప్పినట్లు ఆత్మకు వికారిత్వము సంభవించును.

సూ|| న చ పర్యాయాదప్యవిరోధో వికారాదిభ్యః. (బ్ర. సూ. 2-2-35)

తా|| బౌద్దులు విజ్ఞానము నిత్యము గాకున్నను దాని సంతానము (ప్రవాహరూపము) నిత్యమని చెప్పుచున్నారు గదా? ఆవిధముగనే మార్పులతో కూడిన ఆత్మ నిత్యమే. (పర్యాయాదపి=సంతానమువలన సైతము ఆత్మకు విరోధభావము లేదు) అనినట్లయితే, సంతానమునకు అవస్తుత్వము కలుగును కనుక ఆత్మయే లేకపోవలసివచ్చును. బౌద్ధులు చెప్పిన శూన్యవాదము కలుగును.

సూ|| అంత్యావస్థి తేశ్చోభయ నిత్యత్వా దవిశేషః. (బ్ర. సూ. 2-2-36)

మఱియు మోక్షకాలమునందు జీవు డేపరిమాణము కలవాడగును? అను ప్రశ్న కలుగుచున్నది. మోక్షావస్థయందు జీవునకు నిత్యత్వ మంగీకరించిన ఉభయ (మొదటను నడుమను) నిత్యత్వ మంగీకరించినట్లే యగును. అంత్యావస్థ (మోక్షస్థితియందు) అవిశేషః= పరిణామభేదము లేకపోవలయును. ఏలయన : అచట కర్మగాని దేహముగాని లేదుగదా? కర్మ, పుద్గలము నీరెంటికి సంబంధము లేని స్థితిలో మొదట ఎట్లుండెనో మోక్షస్థితియందును అట్లే యుండవలెను గదా? ఆపరిమాణ మెట్టిది? అది అణు పరిమాణమా? లేక మహాపరిమాణమా? ఏదియు చెప్పుటకు వీలులేదు.

కనుక జైనులమతము వేదాంతుల మతమునకు విరోధమని శంకరులవారి భాష్యము చెప్పుచున్నది.

(11) సంగ్రహ పరిశీలనము

జైనులు ప్రత్యక్షముగా వేదములు తమకు ప్రమాణమని అంగీకరింపక పోవుట తప్ప జైనమతము అవైదిక మనుటకు ఇతర కారణములు లేవు. సాంఖ్యదర్శనము ప్రకృతియు, దాని వికృతులును కలసి ఇరువది

నాలుగు తత్త్వము లనియు, ఇరువది అయిదవవాడు పురుషుడనియు, పురుషుడు ప్రకృతి బంధమునుండి విడువబడిన - యిరువది ఆఱవ తత్త్వముగా పరిగణింపబడు ననియు అనుచున్నారు. దీనిని కొందఱు వేదాంతు లంగీకరింతురు. జైనులు సహితము శుద్ధాత్మయే దేవు డనుచున్నారు. ఈ రెండింటికి భేదము లేదు. ఇరువురును ఆత్మ అనాది, చైతన్యస్వరూపము, స్వయంప్రకాశము - అని అంగికరించినవారే. ఇరువురిలో భేదమెచ్చట ననగా : ఆత్మ పరిమాణములోనే. ఇంతమాత్రమునకే సాంఖ్యము వైదికము, జైనము అవైదికము ఎట్లగును?

న్యాయ వైశేషిక పూర్వమీమాంసా దర్శనములు కొన్ని మూలద్రవ్యములను నిత్యములని అంగీకరించుచున్నారు. వేదాంతులు, సాంఖ్యులు చెప్పువిధముగ ప్రకృతిని అంగీకరింపరు. జైనులు జీవులతో కలిసి ఆఱు నిత్యద్రవ్యముల నంగీకరించుచున్నారు. న్యాయ వైశేషికాదులు వైదికు లయినచో, జైను లేల వైదికులు కారు?

నిరీశ్వర వాదమును చేయు వైశేషిక, సాంఖ్య, మీమాంసా దర్శనములు, కర్మఫలమును కర్మయే యిచ్చునందురు. జైనులు అట్లే యందురు. ఇందులోను నిరీశ్వరవాదులు వైదికు లనుటయును, జౌనులను అవైదికు లనుటయు సరికాదు. జైనము నాస్తికవాదము కాదు. సర్వమునకు మూలమున సత్యపదార్థమున్న ట్లంగీకరించిరి. వీరిది భౌతికవాదము మాత్రము కాదు.

సత్కర్మలుగాని, దుష్కర్మలుగాని చేయరాదని మీమాంసకుల మతము. ఆ రెండింటిలో ఏకర్మ చేసినప్పటికిని దాని ఫల మనుభవించుటకు తిరిగి జన్మ మున్నది. జైనులు సహితము పై ద్వివిధ కర్మలను వదలవలయు నన్నారు. ఆత్మ శుద్ధమై యున్నపుడే మోక్షము. ఏది అంటియున్నను స్వస్వరూపముకంటె భిన్నత్వము సిద్ధించునని చెప్పిరి. కనుక పూర్వమీమాంస వైదికమైన యెడల జైనము అవైదిక మనుటకు హేతువేమి?

వైదిక దర్శనములు వేదప్రమాణ మంగీకరించినవి. జైనులు వేదప్రమాణ మంగీకరింపలేదు. దానికి కారణము జైనుల మతమునకు ప్రాణమువంటిదగు అహింసా సిద్ధాంతమునకు ప్రాణిహింసతో కూడిన వైదిక యజ్ఞములు విరుద్ధములు. కనుక వేదప్రమాణమును త్రోసివేసిరి. వేదాంతులు తప్ప తక్కిన దర్శనకారుల దర్శనములయందు వేద విరుద్ధధర్మము లనేకములు ఉన్నట్లు శ్రీ బాదరాయణాచార్యులు బ్రహ్మసూత్రములయందు వివరించియే యున్నారు.

జైనమతముతో పూర్తిగా మన మేకీభవింపకున్నను అహింసా ధర్మనిరతులును, త్యాగశీలురును నగు తీర్థంకరులు సర్వజన పూజ్యు లగుటచే వారికి వందనము లర్పించుచున్నాను.

.... * .... * ....

ఇది పరమేశ్వరానుగ్రహమువలన
మఱ్ఱిబోయిన రామ సుబ్బయ్యచే రచియింపబడిన
'బ్రహ్మజిజ్ఞాస' తృతీయభాగమునందలి జైనదర్శనము
అను మూడవ ప్రకరణము సంపూర్ణము.

శ్రీకృష్ణార్పణమస్తు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మజిజ్ఞాస

తృతీయభాగము

నాలుగవ ప్రకరణము-బౌద్ధమతము

"అభ్రాంతా అత్రస్తా అభీరూ అచంభీ
అలీనా అదీనా ప్రహృష్ట దు ధర్షా
అరక్తా అదుష్టా అమూఢా అలుబ్ధా
విరక్తా విముక్తా నమస్తే మహర్షే" (లలిత విస్తరం)

(1) ఆరంభము

జైన బౌద్ధమతములు సమకాలికములే. కాని, జైన మతము ఉపనిషత్తులకంటె పూర్వికమని కొందరందురు. అట్లనుటకు కారణము లేకపోలేదు. ఋషభుని (ప్రథమ తీర్థంకరుని) నుండి జైనమత మున్నట్లు నమ్మినచో వారు చెప్పిన వాక్యములయందు సత్యముండవచ్చునా? భగవాన్ మహావీరుడు, బుద్ధభగవానుడు ఇరువురు సమకాలికు లగుటవలన జైన బౌద్ధములు రెండును సమకాలీనములను భావమేర్పడినది. జైనమతమును గుఱించి స్థాలీపులాక న్యాయముగా తెలిసికొంటిమి. బౌద్ధమతము బుద్ధభగవానునితోనే ఆరంభమైనది. హిందూమతమునకు మూలపురుష డొకడు లేదు. ఏ మతమునందైనను ఆ మతకర్త జీవించి యున్నకాలము, అతడు జన్మించిన సంఘము, ఆ సంఘమునం దప్పుడాచరణయందున్న మతము, అతని చదువు సంస్కృతి, మతకర్త జీవితానుభవములు, మతకర్త బోధించిన నూతన మతము నందు కొంతవఱకు ప్రతిఫలించును. ప్రస్తుతము మనము బుద్ధభగవానుని చరిత్రను గుఱించి గాక బౌద్ధమతమును గుఱించి స్థాలీపులాక న్యాయమున

(సంగ్రహముగ) విచారించుటకు పూనుకొని యున్నను, సంగ్రహముగా నైనను బుద్ధగవానుని జీవితవిధానము తెలిసికొనుటవలన ఆయన మతమును కర్థము చేసికొనుట కొంత సులభమగును. కాని బుద్ధభగవానుడు జన్మించిన కాలపరిస్థితులు, సమాజ స్వరూపము ఇచ్చట వివరముగా చర్చించుటకు చోటులేదు. సంగ్రహముగా బుద్ధదేవుని జీవితమును తెలిపి పిమ్మట వారి దర్శనమును గుఱించి తెలిపెదను.

(2) బుద్ధదేవుని సంగ్రహ జీవిత చరిత్రము

వంశము-జననము

అధర్మము ప్రబలి ధర్మ మడుగంటుటకు కాల మాసన్న మగునపుడు భగవంతు డవతరించు నందురు. క్రీస్తు పుట్టుటకు పూర్వము ఆఱవ శతాబ్దమునందు భారతదేశమట్టి స్థితియం దుండెను. బ్రాహ్మణ ధర్మావలంబులు వర్ణాశ్రమ ధర్మములను నెపమున తక్కువ కులము వారిని నిర్లక్ష్యము చేసి పశుతుల్యులనుగా భావించి హింసించుచుండిరి. యజ్ఞములయందు చేయబడు హింస హింస కాదని అనేక ప్రాణులను హింసించుచు యజ్ఞములకొరకు ధనమును వెచ్చించుచుండిరి. కొందఱు ఘోర తపస్సు పరమపురుషార్థమని అరణ్యములయందు వివిధ తపశ్చర్యలయందు నిమగ్నులై యుండిరి. కొందఱు మాయావులు సన్న్యాసులై గృహస్థులను మోసగించుచుండిరి. పరలోకము లేదని, దేవుడు లేడని, పునర్జన్మము లేదని యిట్లు ఎవరికి తోచిన విధముగ వారు బోధించుచుండిరి. ఒక్కమాటలో చెప్పవలయునన్న ప్రజలయందు ధర్మ ప్రవర్తనము క్షీణించెనని చెప్పిన చాలును.

అట్టి సమయమున నేపాళదేశ పరిసరములయందు కపిలవస్తు వను నగరమును రాజధానిగా ఆ ప్రాంతమును సూర్యవంశ క్షత్రియ కులముకు చెందినవారు పాలించుచుండిరి. శ్రీరామచంద్రుని వంశీయులు కోసలదేశమును వదలి నేపాళదేశ ప్రాంతమున కపిలవస్తు వను నగరమును నిర్మించి ఆ పరిసర ప్రదేశమునకు రాజులై రాజ్యపాలనము చేయుచుండిరి. శుద్ధోదనుడను రాజు ఆ వంశమునకు చెందినవాడు.

ఆ కాలమున శుద్ధోదనుడు రాజ్యపాలనము చేయుచుండెను. ఆయనకు మాయాదేవి అను భార్యయందు కపిలవస్తు నగరమున కనతిదూరము నందుండు లుంబినీ వనమున క్రీ. పూ. 567లో బుద్ధభగవానుడు జన్మించెను. కొందఱు క్రీ.పూ. 563 వ ప్రాంతమున జన్మించె నందురు. కొందఱు క్రీ. పూ. 620 ప్రాంతమున జన్మించె నందురు. పుట్టిన ఏడవ దినముననే మాయాదేవి పరమపదించెను. వీరికి తండ్రి పెట్టిన పేరు సిద్ధార్థుడు. అనగా: సంకల్పించిన సంకల్పము నెరవేరువఱకు (సిద్ధించువఱకు) ప్రయత్నము విడువనివాడని అర్థము. మఱియు సర్వార్థ సిద్ధియను నామముకూడా కలదు.

సిద్ధార్థుని బాల్యము. వివాహము

సిద్ధార్థుడు బాల్యమున ఒకనాడు తండ్రివెంట పురబాహ్య ప్రదేశమునందు అశ్వారూఢుడై అచ్చటి ప్రకృతి రామణీయకములగు దృశ్యములను గాంచుచు ఆనందమున జనుచుండెను. మార్గముప్రక్క నొక కర్షకుడు ఒక ముసలి యెద్దును నాగలికి కట్టి పొలము దున్నుచుండెను. జర్జరిత దేహము గల యావృషభము నాగలిని లాగలేక బాధపడు చుండెను. కర్షకు డాయెద్దును కఱ్ఱతో కొట్టుచుండెను. దాని వీపున నున్న పెద్ద పుండుపై ఆదెబ్బ తగిలి దానినుండి రక్తము స్రవించుచుండెను. దానిని చూచి రాకుమారుడు ఖిన్నుడయ్యెను. అట్లే తండ్రి వెనుక పోవుచున్న సిద్ధార్థుడు మరియొక దృశ్యమును చూచెను. బల్లి యొకటి చీమల గుంపును భక్షించుచుండెను. అంతలో పాము ఒకటి వచ్చి బల్లిని మ్రింగెను. అదే సమయమున ఆకసమున విహరించుచున్న గ్రద్దయొకటి హఠాత్తుగా వచ్చి పాము నెత్తుకొని పోయెను. దీనిని తిలకించిన రాకుమారు డిట్లు చింతించెను. ప్రపంచమునందలి జీవకోటి తమ యల్ప సుఖమునకై హింసాకార్యమున లగ్నమై యున్నది. ఎచ్చట చూచినను స్వార్థము, హింస, తాండవ మాడుచున్నదని చింతించెను.

సిద్ధార్థుడు జన్మించిన కాలమును బట్టి జ్యోతిశ్శాస్త్రజ్ఞులు ఆయన సన్న్యాసి యగునని చెప్పిరి. తండ్రి కుమారునకు సర్వవిద్యలు గరపి

"యశోధర"* యను నిరుపమాన రూప లావణ్య సుగుణరాశి యగు కన్యను వివాహము చేయించెను. సిద్ధార్థుని ఒక ప్రత్యేకమందిరము నందుంచి చుట్టును రక్షకభటులను కాపుంచి రాజాజ్ఞ లేనిదే సిద్ధార్థుడు బయటకు వచ్చుటకుగాని, యితరులు యువరాజును కలిసికొనుటకుగాని వీలులేకుండ జేసెను. రాజు ప్రధానోద్దేశ మేమన : భోగములనుండి మనస్సు విముఖ మగుటకును, సన్న్యసించుటకును, ఏవి దోహద మిచ్చునో అట్టి విషయములను రాకుమారుడు దర్శించుటకుగాని, వినుటకుగాని, చింతించుటకుగాని వీలు లేకుండునట్టి కట్టుదిట్టముల నన్నింటిని చేయించెను. రాకుమారుడు సహితము సుందర యువతీజన పరివేష్టితుడై నిరంతరము నృత్యగీతాదికముల నడుమ యశోధరా దేవితో కలిసి యెట్టికొరతయును లేక యిష్టభోగములను అనుభవించుచుండెను.

సిద్ధార్థు డొకనాడు పట్టణమును చూడ బోయెను. రాజు తనకుమారునికంట వైరాగ్యమును కలిగించు దృశ్యము లేవియు పడకుండునట్లు కట్టుదిట్టములు చేయించి యుండినను, సిద్ధార్థుడు అస్థిపంజరమువలె నడవలేని ఒక వృద్ధుని చూచెను. మఱియొక దినమున కుష్ఠువ్యాధిచే బాధపడుచుండిన రోగిని చూచెను. ఇంకొక దినమున అంత్యక్రియలు జరుపుటకు తీసికొను పోవుచున్న శవమును చూచి వారివెంట శ్మశానమునకు పోయి చితిపైనుంచి కాల్చబడుచుండిన శవమును చూచెను. ఈ దృశ్యములను తిలకించుటతో వికలచిత్తుడై సిద్ధార్థుడు అంతఃపురము చేరెను.

ఇల్లు చేరిన సిద్ధార్థుడు తాను చూచిన దృశ్యమును గుఱించి చింతించుటచే అతనికి భోగములయందు విరక్తి కలిగెను. ఆయన యిట్లు చింతించెను. దేవు డొక డున్నాడా? ఉన్నచో అతడేల యీ ప్రాణుల కష్టములను జూడడు? లోకము దుఃఖాకులమై యున్నది. ఈ

---

* లలిత విస్తరమను బౌద్ధగ్రంథమున సిద్ధార్థున భార్యపేరు "గోప", "గోపిదేవి" అని వ్రాసి యున్నది. ఆమెను "గోపా", "గోపీ" అని సంబోధించినట్లున్నది. ఇతర అనేక గ్రంథములయందు "యశోధర" అని ఉన్నది.

దుఃఖనివారణ మెట్లు? సర్వము నశించుచున్నది. నాశరహితమగు సత్యమేది? ఇంట నుండిన సత్యము నెఱుగలేను. దుఃఖార్తులగు మానవలోకము నుద్ధరింపలేను . బంగారు పంజరమున బంధింపబడిన పక్షివలె ఈ భోగమందిరము నందుంటిని. దీనిని విడిచి పోవుదును - అని నిశ్చయించి ఒకనాటి అర్ధరాత్రి తన సారథి యగు ఛన్నుని* నిద్రలేపి అశ్వము నాయత్తము జేయుమని చెప్పి, నిద్రించుచున్న యశోధరాదేవిని, కుమారుడగు రాహులుని విడిచి ఛన్నుని వెంటనిడుకొని యిరువది తొమ్మిదవ యేట లోకకల్యాణము కొఱకై సర్వసంగ పరిత్యాగియై దయామయుడగు ఆ మహాపురుషుడు ఇల్లు వెడలిపోయెను.

సిద్ధార్థుడు గృహపరిత్యాగము చేసి తపమున కేగు సమయమునకు కుమారుడగు రాహులుడు జన్మించి యుండలేదనియు, యశోధరాదేవి అప్పటికి గర్భవతి యనియు కీ|| శే|| తిరుపతి వేంకట కవులు "బుద్ధచరిత్రము" నందు వ్రాసియున్నారు. (3-215, 216) రాహులుడు అప్పటికే జన్మించి యున్నట్లు, బౌద్ధవాఙ్మయ బ్రహ్మ దుగ్గిరాల బలరామ కృష్ణయ్యగారు తాము రచియించిన "గౌతమబుద్ధ చరితము" (పుటలు 180, 181) నందు వ్రాసిరి. పెక్కండ్రు చరిత్రకారు లిట్లేవ్రాసిరి. ఎడ్విన్ ఆర్నాల్డు కవిగారు సందిగ్ధముగ వ్రాసిరి. "లలితవిస్తరము" 26వ అధ్యాయమున ఆత్మజు డున్నట్లు ఉన్నది.

సిద్ధార్థుని గృహపరిత్యాగానంతరము

ఇట్లు సిద్ధార్థుడు తన రాజ్యపు పొలిమేరను దాటి బింబిసారుని రాజ్యమునందు ప్రవేశించి రాజోచితమైన వస్త్రాభరణములు ఛన్నున కిచ్చి కాషాయ వస్త్రములు ధరించి "ఛన్నుడా! సత్యాన్వేషణకై పోవుచున్నాను. సత్యము తెలిసికొని తిరిగి వత్తునని తండ్రితోను, భార్యతోను చెప్పు' మని అతని పంపించి వైచెను.

* "లలితవిస్తరము" సారథియగు ఛన్నుని "ఛందకుడు" అని పేర్కొన్నది.

బింబిసారుని రాజ్యమునకు రాజధాని రాజగృహమను పట్టణము. దానికి చుట్టును ప్రాకారమువలె పర్వతశ్రేణి కలదు. తూర్పున నున్న పర్వతము పేరు రత్నగిరి. అందు కొందఱు, తపస్సు చేసికొనుచున్నారని తెలిసి సిద్ధార్థుడు అచ్చటి గేగెను. ఆ గిరియందు ఒక గుహలో నివసించుచు కఠోర తపము చేయుచుండిన కొందఱిని చూచెను. అచ్చట ఉపనిషత్తుల నభ్యసించెను. అవేవియును ఆయనను సంతృప్తి పరచలేక పోయెను.

బింబిసారుడు యజ్ఞము చేయుచుండెను. కొందఱు మనుష్యులు యజ్ఞము నిమిత్తము గొఱ్ఱెలమందను తోలుకొని పోవుచుండిరి. అందులో ఒకగొఱ్ఱె కాలువిరిగి నడువ లేక బాధ పడుచుండెను. సిద్ధార్థుడు వారి యుదంత మెఱిగి కాలు విరిగిన గొఱ్ఱెను భుజములపై వైచుకొని బింబిసారుని కడ కేగెను. అహింసను గుఱించి బింబిసారున కెఱిగించి యజ్ఞమును మాన్పించి అచటినుండి బయలుదేరి పోయెను.

వైశాలీ నగరమున హిరణ్వతీ నదీ ప్రాంతమున* 'నాకాడ కాలామను' డను పేరుకల ఋషి మూడువందల శిష్యులతో నివసించుచున్నాడని సిద్ధార్థుడు విని యచటికి చని. ఆ ఋషి యెఱిగియున్న శాస్త్రముల నన్నిటిని అధ్యయనము చేసెను. సకల విద్యలు గ్రహించెను. ఇతని 'ఆరాడుడు' అనియు అందురు. అచ్చటికి సమీపమునందే తపముచేయు "రామపుత్ర రుద్రకు"డను తపస్విని చూచెను. అచ్చట కొన్ని దినములుండెను. తపస్వి శిష్యులయందు కౌండిన్యుడు, అశ్వజితుడు, భద్రకుడు, వప్రుడు, మహానాముడు - అను అయిదుగురు సిద్ధార్థునికి శిష్యులై ఆయనను వెంబడించిరి.

గోపాలుడు సిద్ధార్థుని ప్రాణరక్షణము చేయుట

సిద్ధార్థుడు శిష్యపంచకముతోడ నీలజ, మోహన యను సెలయేర్లను బర్భరా పర్వతపంక్తిని దాటి గయాశీర్ష పర్వతమునకు సమీపముననే 'నైరంజనా నది' 'ఫల్గు' నదితో కలియుచోటున నున్న సురబిల్వ మను

* పాండవులు కురుక్షేత్ర సంగ్రామమున తమ స్కాంధావారమును హిరణ్వతీ పుణ్యనదీ పొంతన స్థాపించి విడిసిరని మహాభారతమున చెప్పబడినది.

గ్రామమును చేరి నైరంజనా నదీతీరమున ఆఱు సంవత్సరములు తపముచేసెను. కోతులు రాల్చిన పండ్లను, చిలుకలు కొరకగా క్రింద రాలిపడిన ఫలములను భుజించుచు నిశ్చలుడై సత్యాన్వేషణము చేయసాగెను.

అన్న పానములు లేకపోవుటచే శరీరము శుష్కించి కూర్చుండుటకు శక్తిలేక ఒకనాడు ఉచ్ఛ్వాస నిశ్వాసములుకూడ ఆడక క్రిందపడి మూర్ఛపోయెను. సిద్ధార్థుడు ఆవిధముగా మూర్ఛితుడై యుండ శిష్యపంచక మాయనను అన్వేషించుచు వచ్చి మూర్ఛితుడైన గురువును చూచి గురువు మరణించెనని మరణ హేతువు తపోభంగమేనని, అచ్చట తాముండరాదని అట్టి స్థితిలో సిద్ధార్థుని వదలి వెడలిపోయిరి. అట్టి స్థితిలో దైవవశమున గోపాలు డొకడు ఆ మార్గమున పోవుచు మహాతేజస్వియగు సిద్ధార్థుని చూచి తనవద్ద గొఱ్ఱెతోలుతో చేసిన సంచియందున్న పాలును కొంచెము సిద్ధార్థుని నోటిలో పోసెను. దానితో ఆయనకు కొంతస్మృతి కలిగి యింకను కొంచెము పాలిమ్మని చేతితో సంజ్ఞ చేసెను. పాలు త్రాగుటచే సిద్ధార్థునకు శక్తి కలిగి లేచి కూర్చుండెను.

ఆఱు సంవత్సరములు ఘోర తపస్సు చేసినను సిద్ధార్థునకు సత్యము బోధపడలేదు. చిత్తము శాంతి పొందలేదు. ఇట్లుండ ఒకనాడు ఒక విచిత్ర సంఘటనము జరిగెను.

దేవదాసి యొక్క ఉపదేశ వాక్యము

కొందఱు దేవదాసీలు (ఆటవెలదులు) వీణ, మృదంగము, తాళము మొదలగు వాద్యములను వాయించు వారితోకూడ తిరునాళ్ళకు ఆ దారిన పోవుచుండిరి. పొదల చాటున నున్న రాజపుత్రుని వారు చూడకనే వారిత్రోవన వారు పోవుచు సిద్ధార్థుని సమీపమునందుండి పోవునపుడు తమలో తాము నట్లు సంభాషించుచు పోవుచుండిరి. అందొక దేవదాసి యిట్లనెను: "మంచి నాట్యమునందు వీణ వాయించునపుడు హెచ్చుతగ్గులు లేక శ్రుతి సవరింపవలెను. తీగెను మితిమీరి బిగించినచో తెగిపోవును. బిగువు చాలకున్నచో చక్కగా

పలుకదు. తీగె యెంతమాత్రము బిగింపవలెనో అంతమాత్రము బిగించిన శ్రుతి సరిపోవును." ఈ వాక్యములు స్వామి సమీపమునకు వచ్చునప్పటికి పలికినది. వారు స్వామిని చూడకనే వెళ్ళిరి. ఆ వాక్యములను సిద్ధార్థుడు వినియెను. వాటి యథార్థము చింతించి ఆ వాక్యములు తనకు ఉపదేశ వాక్యములుగా భావించెను.

ఆహా! బుద్ధభగవాను డెక్కడ, దేవదాసి యెక్కడ. దేవదాసి పరోక్షముగ సిద్ధార్థునకు గురువయ్యెను. ఆమె వాక్యములు సిద్ధార్థుని హృదయమున స్థిరముగా నాటుకొనియెను. ఆయన బుద్ధుడైన పిదప ఆయన బోధించిన తత్త్వమునందును, ధర్మానుష్ఠానమునందును మధ్యమ మార్గమే అనుసరించెను. 'నాది మధ్యమ మార్గము'ని వారే చెప్పుకొనిరి. భగవంతుడే దేవదాసి ముఖమునుండి ఆ వాక్యములను పలికించెనని నా యభిప్రాయము. సిద్ధార్థు డిట్లు చింతించెను:-

శరీరము నాశన మొందునంతటి ఘోర తపస్సు పనికిరాదు. జలాన్నములు లేకపోయిన దేహమేగాక మనస్సును శోషించును. ప్రాణము తపించును. బుద్ధి పనిచేయజాలదు. కనుక కఠిన తపశ్చర్యగాని భోగముగాని పనికిరాదు అని నిశ్చయించెను. కాని, భుజించుటకు ఆహారమేది? పల్లెకుపోయి బిచ్చమెత్తుకొందమన్న లేచుటకైనను శక్తిలేదు. ఆ యవస్థలో ఆహారము లేకున్న మృత్యువే గతి కదా? ఇట్టి స్థితిలో విధివిలాసముచే నొక అద్భుత సంఘటనము జరిగెను. అది యేమన :-

సుజాతాదేవి

ఆ సమీపమునందలి "సేనాని" యను ఒక పల్లె యందు ఒక గొప్ప రైతుభార్య సుజాత అను నామె తనకు కుమారుడు కలిగిన వనదేవతకు పాయసము నివేదింతు నని మ్రొక్కుకొని యుండెను. ఆమెకు పుత్రుడు కలిగెను. మ్రొక్కుబడి చెల్లించుటకై పాయసమును,

పుత్రుని తీసికొని వచ్చి వనమునందొక పొదయందు* తపమాచరించుచున్న మహాతేజస్వియు, తపస్వియు, రూపసియు నగు స్వామిని చూచి వనదేవత యని యెంచి తన నోము ఫలించెనని దేవుడే యా రూపమున నున్నాడని భావించి పాయస మాయనకు సమర్పించెను. శక్తిహీనుడై బుద్ధిసహితము పనిచేయలేని స్థితిలో నున్న సిద్ధార్థున కాపాయస మారగించుటచే బలమును, తృప్తియు, బుద్ధివికాసమును కలిగి పూజ్యారాలగు సుజాతతో సంభాషించెను. సుజాతాదేవి బాలు నాశీర్వాదింపుమని బాలుని స్వామి పాదముల చెంత విడువగా ఆబాలుడు ప్రాకుచు సమీపమునందున్న బోధివృక్షము కడ కేగెను. సిద్ధార్థు డా బాలుని నెత్తుకొనుట కావృక్షముకడ కేగెను. అది యీ నాటికిని కోటానుకోట్ల ప్రజలచే పూజింపబడుచున్న బోధివృక్షము. స్వామి ఆ వృక్షమూలమున ఆసీనుడై పూర్ణజ్యోతి ప్రత్యక్ష మగువఱకు నా ఆసనమునుండి గదలనని ప్రతిజ్ఞ పూని, ధ్యాననిష్ఠ యందుండెను. సుజాత వెడలిపోయెను. అశ్వఘోషుని బుద్ధ చరితమున సుజాత అనుటకు మారుగ "నందబల" యను గోపాధిపుని కూతురని యున్నది. (శ్రీ దివాకర్ల వెంకటావధానిగారి అనువాదము పుట 82)

ఎడ్విన్ ఆర్నాల్డుగారు సుజాతాదేవి ఆగమనమునకంటె దేవదాసీల వృత్తాంతము ముందు జరిగినట్లు వ్రాసిరి. బలరామకృష్ణయ్యగారు వెనుక జరిగినట్లు వ్రాసిరి.

---

* చెట్టుక్రింద కూర్చున్న గౌతముని చూచెనని ఎడ్విన్ ఆర్నాల్డుగారు వ్రాసిరి. కీ|| శే|| తిరుపతి వేంకటేశ్వర కవులు రచియించిన బుద్ధచరిత్రమున వనదేవతకు అచట ఒక గుడి కలదనియు "వనదేవతాలయంబునకు బోయి యట" (బు. చ. 4-118) గౌతముడు కూర్చుండి యుండెననియు;సుజాత ఆ "విపిన దేవతా గుడికి" (బు. చ. 4-121) పోయినట్లును ఉన్నది. చెట్టుక్రింద ఆసీనుడై యుండిన గౌతముని సుజాత పరిచారిక యగు రాధ తొలుత చూచినట్లు శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు వ్రాసిరి.

ఎడ్విన్ ఆర్నాల్డుగారు సుజాతాదేవి ఆగమనమునకంటె దేవదాసీల వృత్తాంతము ముందు జరిగినట్లు వ్రాసిరి. బలరామకృష్ణయ్యగారు వెనుక జరిగినట్లు వ్రాసిరి.

జిజ్ఞాసువు :- బోధివృక్ష మనగా ఏది? బుద్ధగయకు పోయి చూచి వచ్చినవారు రావిచెట్టని చెప్పుచున్నారు. మఱ్ఱిచెట్టు అని గ్రంథముల యందున్నదట. ఈ వ్యత్యాసమునకు కారణమేమి?

వేదాంతి :- ఎడ్విన్ ఆర్నాల్డుగారును, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య గారును, బుద్ధఘోషుని బుద్ధుని చరిత్రము ననుసరించి వ్రాసితిమని చెప్పిన తిరుపతి వేంకటేశ్వరకవుల బుద్ధచరిత్రమును, డాక్టర్-స||రాధాకృష్ణ పండితులును బోధివృక్షమనగా వటవృక్షమనియే వ్రాసిరి. బుద్ధభగవాను డిచ్చట బోధి నొందెనని పరంపరగా చెప్పుచు వచ్చుచున్న ఆ చోటున ఉన్నది అశ్వత్థవృక్షము, వటవృక్షము కాదు. పూర్వము శ్రీలంక (సింహళదేశము) నుండి వచ్చిన బౌద్ధభిక్షువులు (యాత్రికులు) బుద్ధగయనుండి తీసికొనిపోయినది ఆ అశ్వత్థవృక్ష శాఖనేగాని మఱ్ఱిచెట్టు కొమ్మను గాదు - బుద్ధగయలో ఉన్న బౌద్ధులు ఆ రావిచెట్టు విత్తనములను ఇప్పటికిని చిన్న మట్టిపాత్రలలో (తొట్లలో) వేసి మొక్కలను పెంచి యితర దేశములకు ఎగుమతి చేయుదురట.

ఈ పొరపాటునకు కారణ మిట్లూహింపవచ్చును :- రావి, మఱ్ఱి, జువ్వి మొదలగు వృక్షములు పువ్వులు లేకనే కాయలు కాయును. ఇట్టి వృక్షజాతిని "వనస్పతులు" అందురు. పూర్వము బుద్ధదేవుడు ఏవృక్షము క్రింద బోధిని పొందెనో దాని 'పేరు వ్రాయక' వనస్పతియని సంస్కృతమున వ్రాసియుందురేమో. వనస్పతి యనిన రావి, మఱ్ఱి మొదలగు వృక్షములలో దేనికైనను అన్వయించును గనుక యిచ్చట పొరపాటు జరిగియుండ వచ్చును. 'లలిత విస్తరము' నందు అశ్వత్థ వృక్షమనిగాని, వటవృక్షమనిగాని చెప్పక అన్ని చోటులను "బోధివృక్షము" అని వ్రాసియున్నది. అశ్వఘోషకవి బుద్ధచరితమున అశ్వత్థమనియే స్పష్టముగ కలదు. (ది. వె. అనువాదము పుట 83).

తరువాత ఏమి జరిగెనో చెప్పుదును వినుము.

సిద్ధార్థుడు బుద్ధభగవాను డగుట

హిందూపురాణములయందు చెప్పిన రీతిగనే బౌద్ధగ్రంథముల యందును తాపసుల తపము ఫలించుటకు పూర్వము దేవతలచేత అనేకవిఘ్నములు కలిగింపబడు ననియు, వాటి నతిక్రమించిన మహనీయుడే తపస్సిద్ధి నొందు ననియు చెప్పిరి. సిద్ధార్థుడు బుద్ధ భగవానుడయిన ఆ రాత్రి జరిగిన విశేషములను బౌద్ధగ్రంథముల యందు చెప్పిన దానిని సంగ్రహముగ వచింతును.

మొదటి యామమున :- జంతుజాలమును మోహపెట్టి సంసారమున పడద్రోయు మారుడు పాపములు మొదలగు వాటిని సిద్ధార్థునిపైకి పంపెను. అవి మూర్తివంతములై వచ్చి స్వామిని చుట్టుముట్టి అల్లకల్లోలము చేసినవి. కాని అవి బోధివృక్షపు ఊడలకు ఆవలనే యుండెను. సిద్ధార్థుని సమీపింపలేక పోయినవి.

రెండవ యామమున :- కాముడు సిద్ధార్థునిపై పంచపుష్పసాయకముల కురిపించెను. అతిలోక సుందరు లగు యువతీలలామలను పంపి నృత్యగీతములు స్వామియెదుట ప్రదర్శించునట్లు చేసెను. ఒక శక్తి యశోధరా దేవి రూపమున సిద్ధార్థునికడ కరుదెంచి, ఇంటికి రమ్మని ప్రార్థించెను, దుఃఖించెను, కాని సిద్ధార్థుడు స్థాణునివలె చలింపలేదు.

మూడవ యామమున :- ఒకడు ఒకత్రోవను ఒక పర్వతాగ్రమును చేరి అచట నిలుచుండి తా నచటికి వచ్చిన మార్గమును, విశాలప్రదేశము నందలి తరులతాది విశేషములను విశదముగా కనుగొనునట్లు సిద్ధార్థుడు తన వెనుకటి అనేకజన్మ పరంపరల చూచెను.

నాలుగవ యామమున :- ప్రతీత్య సముత్పాదమునందలి ప్రతి అంశమును పరిశీలించి దానిని చక్రమువలె పలుమారు త్రిప్పిచూచెను. దానితోనే ఆయనకు నిర్వాణము సిద్ధించెను. సకల సంశయములు నశించెను. పరమ శాంతి చేకూరెను. బోధి లభించెను. ప్రతీత్య సముత్పాదమును గుఱించి తరువాత చెప్పెదను.

మొదటి యామమున సిద్ధార్థుడు తన పూర్వజన్మముల నన్నిటిని దర్శించెనని; రెండవ యామమున సమస్త లోకములను దర్శించెనని; మూడవయామమున ప్రతీత్య సముత్పాదనమును తిలకించెనని; నాలుగవ యామమున నిర్వికల్పమైన సర్వజ్ఞస్థితి నొందెనని అశ్వఘోషుడు చెప్పినాడు.

దేనికొఱకై త్యజించరాని సమస్త భోగములను త్యజించి పడరాని కష్టము లన్నియును పడియెనో, అట్టి అమృత మా మహాత్మునకు ఆ రాత్రి లభించెను. అది వైశాఖశుద్ధ పౌర్ణమి. తండ్రి యిడిన సిద్ధార్థుడను నామ మానాడు సార్థక మాయెను. అప్పటికి బుద్ధప్రభువునకు ముప్పది యైదవయేడు.

ఈశ్వరుడే లేడని బుద్ధభగవాను డన్నను ఈశ్వర సంకల్పముననే గోపాలుడు (యాదవుడు), సుజాత, దేవదాసి - యీ ముగ్గురు ఆయా కాలములయందు బుద్ధదేవునికి తోడ్పడిరి. బుద్ధజ్యోతి పైముగ్గురు వెలిగించినదే అని చెప్పవచ్చును. అది ఈశ్వరలీల. బుద్ధ భగవానుని ప్రాగ్జ్యోతి యందురు. నిజమునకు బుద్ధదేవుడు ప్రాగ్జ్యోతి మాత్రమే కాదు. మానవజాతి కంతయు దివ్యజ్యోతి. అమరజ్యోతి.

ధర్మచక్ర భ్రమణారంభము

పూర్వము బుద్ధ భగవానుడు తాను తపమునందుండి స్మృతి తప్పి పడిపోయినపుడు తనను విడిచిపోయిన యేవురు శిష్యులను వెదికి వారిని కనుగొని వారికి మొదట బౌద్ధమతము నుపదేశించెను. ఎచ్చోట బుద్ధభగవానుడు మొదటి ధర్మమును భద్రవర్గీయులను శిష్యపంచకమున కుపదేశించెనో (బౌద్ధదీక్ష నిచ్చెనో) ఆ ప్రదేశము వారణాసీ మహానగర సమీపమునందలి "ఋషిపతన మృగదావము" అనుచోటు. అచట అశోక చక్రవర్తి సారనాథ స్థూపమును నిర్మించెను. అది లోకవిఖ్యాతి గాంచెను. మొదట శిష్య పంచకమునకు బౌద్ధదీక్ష యిచ్చుటతో ధర్మచక్రము తిరుగుటకు ప్రారంభ మయినది. పిమ్మట భగవానుడు కపిలవస్తువునకు పోయి తండ్రికి, భార్యకు, కుమారునకు బౌద్ధ దీక్ష

నిచ్చెను. నలుబదియైదు సంవత్సరములు మతమును బోధించి ఎనుబదవయేట (క్రీ. పూ. 493)లో ఔద్ లోని కుసీనగరమునకు సమీపము నందున్న శాలవనమునందు పరినిర్వాణమును బొంది రందురు. ఆ విధమైనచో 70 సంవత్సరములు మాత్రము వారు జీవించి యుండిరని చెప్పవచ్చును. కొందఱు క్రీ. పూ. 563లో జన్మించి క్రీ. పూ. 483లో పరినిర్వాణమును పొందెనందురు. ఇది సరియైనచో ఎనుబది సంవత్సరములు జీవించియుండిరని చెప్పవచ్చును.

బౌద్ధమత స్వరూప మిట్టిదని చెప్పుట సులభమైన విషయము కాదు. ఏలయన? బుద్ధభగవాను డుపదేశించిన మతము భగవానుని అనంతరము అనేక మార్పులకు లోనైనది. బౌద్ధమతమును పరిశీలించిన పండితులు బౌద్ధమతమును (1) ప్రాచీన బౌద్ధమనియు, (2) తదనంతర బౌద్ధమనియు రెండువిభాగములు చేసి చెప్పిరి. ప్రాచీన బౌద్ధమత స్వరూప మిట్లుండును :-

(3) ఆర్య సత్య చతుష్టయము-ఆత్మ

సత్యాన్వేషణకై గృహమును త్యజించి బయలు వెడలిన బుద్ధ భగవానుడు తుదకు ఈ క్రింది నిశ్చయమునకు వచ్చెను:- సత్యమగు (నిత్య) వస్తువేదియు లేదు. విశ్వము నందలి సమస్తమును మార్పు నొందుచున్నది. సత్య మొకటి కలదని యంగీకరించ వలెనని ప్రయత్నించితి మేని నాలుగు సత్యములు కలవు. (1) దుఃఖము, (2) దుఃఖకారణమగు అజ్ఞానము (తృష్ణ), (3) దుఃఖ నివార్యము (వినాశము), (4) దుఃఖ నివారణోపాయము (నివారణ మార్గము) ఈ నాలుగే ఆర్య సత్యములు.

ఆత్మ

ఆత్మ లేదు, జీవుడు లేదు. లోకమును సృష్టించినవాడు గాని, జీవుల కష్టసుఖములకు కారణకర్తగాని, ప్రాణుల మొఱ వినునట్టివాడుగాని, దేవుడను వాడొకడు లేడు. ఉపనిషత్తులయందు చెప్పబడిన నిత్యము,

సత్యము, వికార రహితము, సర్వగతము, సద్రూపమునగు బ్రహ్మము కలదా? లేదా? యను ప్రశ్నకు బుద్ధభగవానుడు మౌనము వహించెను. ఈ మౌనమునకు కారణము అట్టి నిత్యవస్తువుయొక్క విచారముతో ప్రయోజన మేమియు లేదనియో, లోకులకు దానిని గుఱించి చెప్పిన లోకులట్టి దానిని గ్రహింప లేరనియో, ఇందులో ఆయన మనస్సునందున్న దేదియో తెలియదు. ఇక, దుఃఖమును గుఱించి ఆయన చెప్పినది శ్రుతులకును భగవద్గీతకును అంగీకారమే.

షడ్భావ వికారములు గల శరీరమునందు నిత్యమైన ఆత్మ (జీవుడు) అను వస్తువు కలదా? లేదా? యను విషయముగూడ చర్చనీయాంశముగనే నిలిచిపోయినది. బుద్ధభగవానుని 'ప్రత్యక్షోపదేశములకు భాష్యకర్తలైన నాగసేన బుద్ధఘోషుల భావము ఆత్మ లేదనియే. "కొన్ని వేళల నాత్మ యున్నదనియు, కొన్ని సమయముల నాత్మ లేదనియు తథాగతుడు (బుద్ధభగవానుడు) వచించినాడు" అని నాగార్జునుడు ప్రజ్ఞాపారమిత సూత్రవ్యాఖ్యయందు చెప్పినట్లు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వ్రాసిరి.

"ఏ నా ఆత్మ అనుభవకర్త యగుచున్నదో, అనుభవమునకు విషయ మగుచున్నదో, తన పూర్వపుణ్య పాపకర్మల ఫలితములను అనుభవించుచున్నదో, ఆ నా ఆత్మ నిత్యము (ధ్రువము), అపరివర్తనశీలము, అనంతకాల మిట్లే నిలిచి యుండునది అనుటకంటె, ఓ భిక్షువులారా! పరమ మూర్ఖత వేఱుగ నుండదు."

(విజ్ఞాన సర్వస్వము 7 వ సంపుట, పుట 564)

శ్రీలోకమాన్య బాలగంగాధర తిలకొ గారు ఈ యంశమును గుఱించి గీతారహస్యము నందిట్లు వ్రాసిరి. "బ్రహ్మముగాని, యాత్మగాని బొత్తిగ లేనే లేదని యాతని యుద్దేశ్యము కాదు. కారణ మేమన : తే విజ్జ సుత్తయందు బుద్ధుడే 'బ్రహ్మ సహవ్యతాయ స్థితి" నుల్లేఖించెను. సేలసుత్తయందును, థేరగాథ యందును. "నేను బ్రహ్మభూతుడనై యున్నాను" అని తన్ను వర్ణించుకొనెను."(సేలసు-౧౪; థేరగా-౮ ౧)

ఆత్మను గుఱించి బుద్ధభగవానుని అభిప్రాయము కంటె భిన్న విధముగ ఆయన అనంతర కాలమునందలి బౌద్ధ పండితులును, బౌద్ధమతమును పరిశీలించిన ఈ కాలము నందలి (అధునాతన) పండితులును చెప్పిరి. జీవు లనేకులని యీ మతము అంగీకరించును. కాని బౌద్ధులు చెప్పు జీవ స్వరూపమునకును, ఇతర దార్శనికులు చెప్పు జీవాత్మ స్వరూప నిర్వచనమునకును, చాల భేదమున్నది. జీవులయందు కొందఱు కర్మవలనను, కొందఱు ఋతువులవలనను, మఱి కొందఱు కారణాంతరమువలనను ఈ లోకమునకు వచ్చిరని బౌద్ధులు చెప్పుదురు.

(4) జగత్తు

జగత్తును గుఱించి యిట్లు చెప్పిరి. మన యింద్రియ గోచర మగుచున్నట్టియు, శాస్త్రములయందు చెప్పబడి నట్టియు, జగత్తు ఎట్లు కలిగినది? ఎప్పుడు కలిగినది? ఇది నిత్యమా? అనిత్యమా? అను ప్రశ్నలకు బుద్ధభగవానుడు సమాధానము చెప్పలేదు. 'మాలుంక్యపుత్రుడ'ను నాత డడిగిన పది ప్రశ్నలలో లోకమును గూర్చిన ప్రశ్నయొకటి. ఇట్టి ప్రశ్నలకు సమాధానము చెప్పుటవలన కలుగు ప్రయోజన మేమియు లేదు. శాంతి పరమజ్ఞానము, నిర్వాణము మొదలగునవి కలుగుటకు ఈ విచారము తోడ్పడ దనిరి. అందువలన బుద్ధదేవుడు మౌనము వహించి యుండవచ్చును.

భూ, జలాగ్ని, వాయువులు నాలుగే భూతములు. ఆకాశమును వీరు భూతములలో లెక్కింపరు. ఇంద్రియము లైదును, ఇంద్రియ విషయములగు శబ్దాదు లైదును కలవని అంగీకరింతురు.

లోకము 'ప్రతిక్షణము' మార్పు చెందుచున్నది. మార్పు చెందని వస్తు వేదియు లోకమున లేదు. ప్రవహించు నదీతీరమున నిలుచుండి ప్రవాహజలముపై చూపు నిలిపితి మేని మన మొకక్షణమున చూచిన జలము మరుక్షణమున అచ్చట నుండదు. ఆ స్థానమున నూతన జలము ప్రవేశించి యుండును. కాని మనము ఎడతెగని జలప్రవాహమును

చూచుచునే యుందుము. సమస్తము ఇట్లు ఎడతెగని మార్పునకు లోనగుచున్నది. ఇందుకు బౌద్ధులు దీపదృష్టాంతమును చెప్పిరి. వత్తిని నూనెను వేసి దీపమును వెలిగించితిమేని దీపశిఖ వెలుగుచుండును. అగ్నిజ్వాల యెడతెగక వెలుగు చున్నను ప్రతిక్షణమును అది నూతన జ్వాలయే. ఏక్షణములోను అది యొకే జ్వాల కాదు. ముందు కనబడిన జ్వాల నశియింపక పూర్వమే క్రొత్తజ్వాల దానిస్థాన మాక్రమించుటచే దీపశిఖ అఖండముగ మనకు కనబడును. ప్రవాహజలమునందు నీటిబుడగవలె లోకము జననమరణముల మధ్య పుట్టుచు గిట్టుచున్నది. ప్రపంచ మనునది యేకము కాదు. దీనికి నిత్యత లేదు. ఎడతెగని మార్పునకే వస్తురూపమును కల్పించుచున్నాము. "కర్తలేని కర్మ, వస్తువు లేని చలనము."

జగత్తు అనిత్యమన్ని (అశాశ్వతమని) బుద్ధభగవానుని మతము. ఇది అద్వైతులు చెప్పినదే. క్షణికవాదము కాదు. ద్వీపజ్వాల దృష్టాంతము కేవలము మనస్సునకు (విజ్ఞానమునకు) సంబంధించినదే గాని, వస్తువులకు సంబంధించినది గాదు. వస్తువులు క్షణికములు గావు. వస్తుజ్ఞానము మాత్రమే క్షణికము. అనంతర బౌద్ధతత్త్వవేత్తలు "సర్వము క్షణికమే" యని చెప్పిరి.

జిజ్ఞాసువు :- మార్పు జరుగుచున్నట్లు మన స్వానుభవము చెప్పుచున్నది. 'మార్పు' అను అనుభూతి మార్పు లేని దానినుండియే తెలియవలెనుగదా? లేదా! మార్పులేని వస్తువు లేనియెడల నిది 'మార్పు' అని మన మెట్లు నిశ్చయించితిమి?

వేదాంతి :- ఉపనిషత్తుల మతమునకును బౌద్ధ మతమునకును గల భేద మిచ్చటనే. ఇతర విషయములయందు కనబడు భేదమును ఒకవిధముగ సమన్వయము చేయుట కష్టము కాదు. అనిత్యము, దుఃఖము, అనాత్మ - యీ మూడే బుద్ధభగవానుని మతమునందలి ముఖ్యాంశములు. ఈ మూడింటికి "ఆత్మ" అను నాలుగవ దానిని కలిపిన, అదే వేదాంత మగును.

(5) తత్త్వత్రయము-పంచస్కంధములు

బౌద్ధదర్శనమునందు మూడు తత్త్వములు గలవు :-

(1) స్కంధములు (2) ఆయతనములు (3) ధాతువులు :-

(1) స్కంధములు అయిదు:- (1) రూప (2) వేదన (3) సంజ్ఞ (4) సంస్కార (5) విజ్ఞానములు. వీటివివరములు:-

(1) రూపస్కంధము:- ఇంద్రియములు వాటిచేత ఎఱుగబడునట్టి విషయములు. భూతభౌతికములు :- భూజలాగ్ని వాయువులు భూతములు- శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, వీటిని గ్రహించు (తెలిసికొను) శ్రోత్ర, త్వక్. నేత్ర, జిహ్వా, ఘ్రాణములు భౌతికములు.

(2) వేదనాస్కంధము :- సుఖాద్యనుభవము (feeling)

(3) సంజ్ఞాస్కంధము :- వీడు రాముడు, ఇది గోవు అని యింద్రియములకు విషయముతో సంబంధము కలుగునపుడు ఆయా నామములచే ఆయా విషయములను గుర్తించుట.

(4) సంస్కారస్కంధము :- రాగద్వేషములు, మోహధర్మాదులు అని కొందఱందురు. మన సంకల్పములు సంకల్పప్రేరణచే మనము చేయు కార్యముల (కర్మల) యొక్క ఫలితముచేత ఉత్తరజన్మమునకు అనగా ఉత్తరజన్మమున కలుగబోవు దేహమును నిర్మించుటకు కావలసిన సామగ్రిని చేర్చి పెట్టునట్టిదని మఱికొందఱు అందురు. అనుభవమున రెండును ఒకటియే.

(5) విజ్ఞానస్కంధము :- చిత్తము. ప్రతిక్షణము మార్పుచెందుచు నిరంతర ప్రవాహ రూపమున నుండు జీవాత్మ "అహం" శబ్దవాచ్య మైనది.

ఈ విజ్ఞానస్కంధము చిత్తమనియు పై నాలుగును చైతన్యమనియు; వీటి సంఘాతమే ఆధిభౌతికమనియు బౌద్ధుల సిద్ధాంతము.

(౨) ఆయతనములు పన్నెండు :- ఘ్రాణ, జిహ్వా, చక్షుః, త్వక్ (కాయము), శ్రోత్ర, మనములను ఇంద్రియము లాఱు. వాటి విషయములైన గంధ, రస, రూప, స్పర్శ, శబ్ద, ధర్మము లాఱును కలసి పండ్రెండు.

(3) ధాతువులు పదునెనిమిది :- ఆఱు ఇంద్రియములు, ఆఱు విషయములు, ఆ యింద్రియ విషయ సంయోగమున జనించు ఆఱువిధములగు విజ్ఞానములు, కలిసి పదునెనిమిది ధాతువులు. ఇందులో ఆయతనములు 12ను తొలగించిన ధాతువులు ఆఱే యగును. పరిశీలించి చూచిన ఆయతనములు, ధాతువులు పంచస్కంధమునందు అంతర్భూతములే అని చెప్పవచ్చును.

మానవుడు పంచస్కంధ సముచ్చయము. తక్కిన ప్రాణులయందు పంచస్కంధము లుండవు; తక్కువగా నుండును.

పంచస్కంధములయందు విజ్ఞానస్కంధ మనునది మానవుని మరణానంతరము లోకాంతరమును గాని జన్మాంతరమును గాని పొందుచున్నది. వీరి మతము ననుసరించి ఆత్మ యనునది లేదు. దాని స్థానమున మనస్సు, చిత్తము, విజ్ఞానముల నంగీకరింతురు. అనగా నీ మూడును ఒక్కటే. మనస్సు, చిత్తము, విజ్ఞానము - ఇవి పర్యాయ పదములు. లోకాంతర దేహాంతరములకు పోవునది విజ్ఞానమే యనియు, వేదాంతులు చెప్పు జీవుని స్థానమును బౌద్ధుల విజ్ఞానము ఆక్రమించు ననియు కొంద ఱందురు. కాని ఈ విజ్ఞానము (మనస్సు), శరీరము రెండును ఒకటి కాదు. కాని, అది రెండును అన్యోన్యాశ్రితములు, అన్యోన్యాధారములు. ఇంద్రియములు శరీరమును ఆశ్రయించి ఉండును. ఇంద్రియములు లేక మనస్సు మొదలగునవి పనిచేయవు. విజ్ఞానమునకు ఇంద్రియ సహాయ మవసరము లేదు. ఇది తర్కశక్తి.

జిజ్ఞాసువు :- ఈ మతము ననుసరించి "అహం" = "నేను" అని చెప్పబడునది విజ్ఞానస్కంధమేనా?

వేదాంతి :- అవునని కాని, కాదని కాని చెప్పలేము. నాగసేను డను బౌద్ధ సన్న్యాసికిని మిళింద రాజునకు జరిగిన సంవాదమునందు

ఈ విషయము రథ దృష్టాంతముచే ఇట్లు చెప్పబడెను :- ఒక బండిని చూచినపుడు "ఇది బండి" అని మనము వ్యవహరించుచున్నాము కదా? అందులో బండి యనునది యేది? బండియందున్న యేభాగమును చూచినను దాని కొక పేరున్నది. ఉదాహరణమునకు :- చక్రములు, నొగ, ఇరుసు, కాడి, పరము - అని ఒక్కొక్క దానిని ప్రత్యేకించి పరిశీలించి వ్యవహరించినపుడు ప్రత్యేక నామరూపములు వ్యవహారము నందున్నవి. అన్నియును ఆయా స్థానముల యందమర్చి చూచినపుడు రథాకారమును 'రథ' (బండి) నామమును కలుగుచున్నట్లే, పంచస్కంధముల మొత్తము (సముచ్చయము)ను "నేను" అని వ్యవహరించు చున్నామని వారు చెప్పుదురు. "గ్రంథము" అన్నపుడు కాగితములు అక్షరముల సంపుటములే గాని; కాగితములు అక్షరములకంటె భిన్నమగు గ్రంథమేది ? 'పట్టణము' అన్నప్పుడు, ఇండ్లకంటె భిన్నమగు పట్టణమేది? ఇందువలన నేను అనునది 'మిథ్య' యని వారి మతము. అయితే యిది బుద్ధభగవానుని అభిప్రాయమగునో కాదో చెప్పలేము. నాగసేనుడు నాస్తికు డని ప్రసిద్ధి.

జిజ్ఞాసువు :- అయితే రథమునందలి వివిధ భాగములను కలిపి "ఇది రథము" అని తెలిసికొను ద్రష్ట రథము కంటెను భిన్నుడై యుండవలెను గదా?

వేదాంతి :- నీవన్నది సత్యమే. బౌద్ధమత మిట్లున్నది :- శరీరము యొక్కయు, విజ్ఞానము యొక్కయు, వివిధానుభవములే ద్రష్ట. ప్రత్యేకించి ద్రష్ట యనువాడు వేఱొకడు లేడు. చీకటియందు ఒక కఱ్ఱకు రెండు కొనలను నిప్పు అంటించి దానిని గిరగిర త్రిప్పిన దానిని దూరము నందుండి చూచిన వారికి ఆ అలాత భ్రమణము సూర్యడను భ్రమను కలిగించునట్లును, మండుచున్న దీపజ్వాల ప్రతిక్షణమును నూతన జ్వాలా పరంపరయే యయ్యును ఏకమని తలచునట్లును, అవిచ్ఛిన్న స్కంధ దశా పరంపరనే ఏకైక వ్యక్తి యని లోకము భ్రమించుచున్నది. ఈ యంశము చక్కగా బోధపడుటకు బౌద్ధుల ప్రతీత్య సముత్పాద మనువాదము తోడ్పడును -

(6) ప్రతీత్య సముత్పాద వాదము

సిద్ధార్థుడు బోధి వృక్షము క్రింద కూర్చుండి బోధి నొందిన (అనగా:- ఆశ్రయ జ్ఞాన విద్య సంయక్ జ్ఞానము, సమ్యక్సంబుద్ధిని సాక్షాత్కరించుకొన్న) ఆ రాత్రి చివరిజామున అరుణోదయ మగు సమయమున దుఃఖస్కంధమును నశింపజేయగల ప్రతీత్య సముత్పాదమును ఈ క్రింది విధముగా చింతించినట్లు లలిత విస్తరము 22వ అధ్యాయమునందు వ్రాసి యున్న దానిని సంగ్రహముగా చెప్పుచున్నాను.

ఏది ఉన్నప్పుడు జరామరణములు కలుగుచున్నవి? జరామరణములకు కారణమేమిటి? అని ఆలోచింపగా సిద్ధార్థునకే యిటుల తోచినది :- జాతి (జన్మ) ఉన్నప్పుడే జరామరణములు కలుగును. జన్మ లేనప్పుడు జరామరణము లుండవు. కారణనిరోధమువలన కార్యోత్పత్తి యుండదు - ఈ విధముగా అవిద్య, సంస్కారములు, విజ్ఞానము, నామ రూపములు, షడాయతనము, స్పర్శము, వేదన, తృష్ణ, ఉపాదానము, భవము, జాతి, జరామరణ శోక పరిదేవన, దుఃఖదౌర్మన స్యోపాయములు - ఒక దాని పిమ్మట ఒకటి వరుసక్రమమున కలుగుచున్నవని తెలిసికొనెను. ఇంకను ఇట్లున్నది:-

"ఇదంతా దుఃఖమని యథాభూతంగా (ప్రతిభూతానుసారంగా) తెలిసికొన్నాను. అది ఆశ్రవ (రోష) సముదాయమనీ, ఇది ఆశ్రవ నిరోధమనీ, ఇది ఆశ్రవ నిరోధగామిని ప్రతిపత్ (జ్ఞానం) అనీ, యథాభూతమైన దానిని తెలిసికొన్నాను." అని బోధిసత్త్వుడే స్వయముగా చెప్పినట్లున్నది.

ప్రతీత్య సముత్పాదము బౌద్ధమతమున చాల ముఖ్యమైనది. దానిని భిన్నవ్యక్తులు భిన్నమగు పర్యాయపదములలో చెప్పిరి. కొన్నింటిని కలిపి చెప్పెదను. ఇది జీవుని ఉత్పత్తియు, నాశనమును తెలుపును. దీని వివర మిది :-

(1) అవిద్య (అజ్ఞానము) = దీనిని వేదాంతులు చెప్పు, అవిద్యతో పోల్చవచ్చును. "నేను" అనునదే అవిద్య.

(2) సంస్కారము=మన జీవితకాలమున మనము చేయు పుణ్యాపాపకర్మల ఫలితమే సంస్కారము. అనగా :

నూతన జన్మమునకు కావలసిన సంకల్ప శక్తిని గూడగట్టుకొనుటకు కావలసిన సంకల్పములే సంస్కారములు.

(3) విజ్ఞానము :- నామ రూపముల నెఱుగు నట్టిది. పూర్వజన్మకు ఉత్తరజన్మకు ఇది సంధానకర్త. (చైతన్యము వంటిది.)

(4) నామ - రూపములు = విజ్ఞానము నామ రూపములను నామ రూపములు విజ్ఞానమును పోషించును. ఇవి పరస్పరాధార భూతములు.

(5) షష్ఠ రాష్ట్రములు = ఆఱు ఇంద్రియములు (మనస్సు పంచేంద్రియములు). ఇవి ఆయతనముల లోనివి. విజ్ఞాన, నామరూపముల వలన ఇవి యేర్పడినవి.

(6) సంయోగము = ఇంద్రియముల వలననే స్పర్శము కలుగును.

(7) వేదనము = అనుభవము (feeling).

(8) కామము (తృష్ణ) = దీనిని ఈ వరుసలో అజ్ఞానము తరువాత రెండవ దానినిగా చెప్పవలసి యుండినది కాని వేదనముల వలననే తృష్ణ జనించుచున్నదని ఇచ్చట (8వ దానినిగా) చెప్పినట్లున్నది.

(9) సంగమము (సంయోగశక్తి) లేక ఉపాదానము లేక మోహము. అనగా జీవించవలయు నను కాంక్ష. జీవితమునందలి వివిధావస్థలను సంయోగపరచి (కలిపి) భిన్నదశల సంపుటిగా చేయకున్నచో జీవితము లేదు. కనుక అట్టి భిన్నదశలను ఇది కలుపును.

(10) పరిణామము = భావము. ఇది పునర్జన్మ కారణమగు కర్మ (ప్రవృత్తి.)

(11) జన్మము.

(12) జరామరణములు = వియోగ విచార దుఃఖదైన్యములు*

---

* "అవిద్యా సంస్కారో విజ్ఞానం నామరూపం షడాయతనం స్పర్శో వేదనా తృష్ణోపాదానం భవో జాతి ర్జరా మరణం శోకః పరిదేవనా దుఃఖం దుర్మనస్తే" అవి శాంకర భాష్యము. (బ్ర. సూ. 2-2-19)

ప్రతీత్యసముత్పాదన మనగా:-"ఒక వస్తువు ప్రతి గమనము చేసిన మఱొక దాని ఉత్పత్తి జరుగుట. వినాశముతో కలిసిన ఉత్పత్తి యనియు అర్థమును చెప్పిరి. పైన చెప్పిన 12 పదార్థములు వరుసగా మొదటిది పుట్టి నశింపగా ఆ స్థానమునందే రెండవది పుట్టును. పైన చెప్పిన వాటిలో మొదటిది 'అజ్ఞానము.' అది పుట్టి నశింపగనే ఆ స్థానమున రెండవది అగు 'సంస్కారములును, సంస్కారములు పుట్టి నశింపగనే ఆ స్థానమున 'విజ్ఞానమును' ఈ విధముగా ఒకటి తరువాత నొకటిగ పంద్రెండును పుట్టినవి. ఇది యంతయు ఒక ప్రవాహమువలె సాగిపోవుచుండును. దేనికిని ఆత్మ లేదు. మొదటిది రెండవ దానికి కారణము గాదు. రెండవది మొదటి దానియొక్క కార్యము కాదు. కాదని చెప్పుటకును వీలులేదు. ఏలయన? మొదటిది లేకున్న రెండవది కలుగుటకు వీలులేదు. అట్లని మొదటిది రెండవదిగా మారదు. కనుక మొదటిది రెండవ దానియొక్క కారణము కాదు. ఈ ధర్మము లన్నియు తమకు తామే కారణములు. వీటి నెవరును పుట్టింపరు. ఇవి స్వయముగనే పుట్టును. కాని, ముందున్న పదార్థము లేనిచో తరువాతి పదార్థము కలుగదు. అన్నియు గతి శీలము గలవి. అనగా : అనిత్యములు, క్షణ భంగురములు. వేదాంతులు చెప్పు కార్య కారణ *(నిమిత్తతా) భావమును బౌద్ధు లంగీకరింపరు.

స్కంధము లన్నియును, విజ్ఞానమును (జీవుడును) ప్రతీత్య సముత్పన్నములే. పైన చెప్పిన వాటిలో మొదటిది అజ్ఞానము (అవిద్య). 'నేను" అను భావమే అవిద్య. ఈ మతమునందు 'నేను' అని చెప్పబడు ఒక వ్యక్తి లేడు. అట్లుండియు తానొక స్వతంత్ర జీవనము గల వ్యక్తినని జీవుడ నని ప్రపంచమున గల అనంత జీవకోటిలో తానొక ప్రత్యేకమైన వ్యక్తినని భావించుటే అజ్ఞానము. ఈ అజ్ఞానము నశించినచో

* కార్యకారణ భావమును గురించి ఈ గ్రంథము ప్రథమభాగమున 2-5 నందు చెప్పి యుంటిని. ఇది చెట్టు - విత్తు వంటిది. విత్తునుండి చెట్టు మొలిచినది. విత్తనము కారణము. చెట్టు కార్యము. కార్యమైన చెట్టునుండి మఱియొక చెట్టునకు కారణమైన విత్తు కలిగినది. ఈ విధముగ కారణమునుండి కార్యము. కార్యము నుండి మఱియొక కారణము - దానినే నిమిత్తతాభావ మందురు.

సంస్కారములు నశించును. సంస్కారములు నశించినచో విజ్ఞానము నశించును. పై క్రమమున చెప్పియున్న దశాపరంపరల యందు మొదటిదశ లేకున్న రెండవ దశయు ఉండదు. అట్లే కడపటిదగు జరామరణములు విచారదుఃఖ దైన్యములు కలుగక పోయినచో ఈ చక్రమింతటితో ఆగిపోవును. అనగా : నిర్వాణము సిద్ధించును. తిరిగి అవిద్య కలుగదు. అవిద్య కలుగకున్న ఈ సంసార చక్రభ్రమణ మాగిపోవును. నేనొక ప్రత్యేక వ్యక్తి ననుకొను అహంకారమే మహాపాపము. అదియే సంసారమునకు కారణమును, సంసారచక్రమును, నడిపించు నదియునునై యున్నది.

ఈ ప్రతీత్య సముత్పాద చక్రమును మనము మన యెదుట నుంచుకొని పరిశీలించినచో ఇందులోని పండ్రెండు అంశములలో నేదియు వ్యక్తిగాదు. ఇది ఒక నిరాధారమగు దశాపరంపర మాత్రమే. మానవుడు తానొక వ్యక్తినని తనకు భార్యా పుత్ర మిత్రాదులు గలరని లోకమున ప్రతిష్ఠ ఆర్జింపవలెనని తృష్ణను పెంచుకొను చున్నాడు. తానొక వ్యక్తియే కానని కొన్ని పదార్థముల దశాపరంపరయే యని తెలిసిన పిమ్మట తనకే సిగ్గు కలిగి కోరికలు కోరక, తృష్ణను చంపినచో పునర్జన్మము కలుగదు. మరణానంతరము పరినిర్వాణమును పొందును.*

(7) నీ వున్నంతవఱకు దుఃఖమే

బుద్ధ భవానుడిట్లు చెప్పెను :- జీవితమే దుఃఖము. జీవిత ముండునంత వఱకు దుఃఖముండును. జీవిత ముండినంత వఱకు ఏ యుపాయములచే గాని ఎట్టి కర్మల నాచరించుటచేగాని, ఎట్టి జ్ఞానార్జనచే గాని, దుఃఖమెట్లు పోవును? జీవితమే నశించిన దుఃఖము నశించును. చెట్టు కొమ్మలు నరికిన తిరిగి చిగురించును. చెట్టునంతయు పెఱికి

* "ప్రతీత్య సముత్పాదమును వేదాంతుల సంసారవృక్షము లేక అశ్వత్థ వృక్షముతో పోల్చవచ్చును...." "అశ్వత్థమేనంసువిరూఢమూల మసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా" (గీ.15-3) అని చెప్పినట్లు విరక్తి యను ఆయుధముతో సంసార వృక్షమును ఛేదించినట్లే ప్రతీత్య సముత్పాదనము నశించుననీ తాత్పర్యము, ప్రతీత్య సముత్పాదమును వేదాంతు లొక విధముగా అంగీకరింతురు.

దానిని నశింపజేసిన తిరిగి చిగురింపనేరదు. కేవల మరణము వలన జీవితము నశింపదు. నిర్వాణము వలననే నశించును. వ్యక్తియే లేక పోవును. వ్యక్తియే లేనిచో దుఃఖ మెవరికి? జీవిత నాశనమే (నిర్వాణమే) దుఃఖనివారణోపాయమగు నాలుగవ సత్యము. దీపము వెలుగుటవలన వత్తి నూనె నంతయు పీల్చి తుదకు వత్తియు కాలిపోవును. నూనెయు వత్తియు పోయిన దీపమారిపోవును. అది దీప నిర్వాణము. అజ్ఞానము తృష్ణ - యివి జీవిత జ్యోతిని వెలిగించు నూనె, వత్తి వంటివి. అవి పోయిన జీవితము నశించును.

(8) బౌద్ధుల ధర్మాచరణము

బౌద్ధుల 'ధమ్మపద' మను గ్రంథము సుప్రసిద్ధ మైనది. బౌద్ధగ్రంథములయందు ఏవి చదువక పోయినను ప్రతిబౌద్ధుడును అతని జీవితమునందు తప్పక 'ధమ్మపదము'ను చదివి తీరవలయును. ఈ గ్రంథము మహాభారతమునందలి ధర్మములనే బోధించినది. మనుస్మృతి మొదలగు స్మృతి గ్రంథములకంటె ఇది ఉత్తమగ్రంథము. భగవద్గీతకు గల విలువ ధమ్మపదమునకు లేదు.

పాపాత్ములకు సుఖమును, పుణ్యాత్ములకు దుఃఖమును నీ లోకమున కలదను వాస్తవమును బుద్ధభగవానుడు గుర్తించినాడు.

గీ॥ **సుజీవం అహిరీకేన కాకసూరేన ధంసినా।**
సక్ఖన్దినా పగచ్భేన నంకి లిట్ఠేన జీవితం॥ **(ధ. 18-10)**

గీ॥ **హిరీమతా చదుజ్జీవం నిచ్చం సుచిగవేసినా।**
అలీనేనఉప్పగచ్భేన సుద్ధజీవేన పస్సతా॥ **(ధ. 18-11)**

తా॥ లజ్జాహీనునకు, కాకివలె దుస్సాహసికి, పరుల నవమానించి హాని చేయువానికి, ధూర్తునకు, పాపాత్మునకు, ఈ లోకమున జీవనము సులభ మగుచున్నది.

వినయశీలునకు, పుణ్యశీలునకు, ఆశ లేనివానికి, కళంక రహితునకు, అధూర్తునకు, జ్ఞానికి, జీవితము దుర్భర మగుచున్నది.

అయినను ధర్మాత్మునకు పరలోకసుఖము ఉత్తమ జన్మము కలుగును. జ్ఞాని జన్మరహితు డగును.

ఈ సత్యమును మహాభారత రామాయణాది హిందూ గ్రంథములు అంగీకరించియే యున్నవి. నిర్వాణమును సాధించుటకు సాధనము ధ్యానమే. ధర్మజీవనము లేనివానికి ధ్యానము కుదురదు. జీవితమును పవిత్రవంతముగా చేసికొనుటకు కొన్ని ఆదర్శధర్మములను చెప్పిరి. (1) దానము, (2) విశుద్ధవర్తనము, (3) ఓర్పు, (4) దీక్ష (5) ధ్యానము, (6) వివేకము, (7) సక్రమసాధన సంపత్తి, (8) పట్టుదల, (9) బలము, (10) జ్ఞానము. సర్వప్రాణులయందును ప్రేమ కలిగియుండుట ఉత్తమధర్మము. వీరికి అష్టాంగయోగమను పద్ధతికూడ గలదు. అవి ఏవన :-

(1) సక్రమవిశ్వాసము, (2) సక్రమాశయము అనగా లోకకల్యాణదీక్ష, (3) సక్రమవచనములు అనగా అనృత, వ్యర్థ, పరుష భాషణము లేకుండుట. మోసము లేకుండునట్టి మాటలు సక్రమ వచనములు, (4) సక్రమ వర్తనము అనగా : స్వార్థరహితమగు ప్రవర్తనము. మంత్రతంత్రములు అగ్ని నుపాసించుట, పుణ్యతీర్థములయందు స్నాన మాచరించుట మున్నగునవి నిరుపయోగములని వర్జించి యుండుట, (5) సక్రమజీవన ప్రవృత్తి అనగా: ఉద్దేశము పవిత్రముగా నుంచుకొని వినయవర్తనము కలిగి వంచనను దంభమును వర్జించి యుండుట, (6) సక్రమ ప్రయత్నము, (7) సక్రమ మనఃప్రవృత్తి (8) సక్రమ సంతోషము - కడపటిమూడును అంతఃశుద్ధికి సంబంధించినవి. మనోద్రేకములను నిగ్రహించుటకు తోడ్పడును.

దశ నిషేధములు పాటింపవలయును. అవి ఇవి : (1) హత్య, (2) చౌర్యము, (3) వ్యభిచారము, (4) అనృతభాషణము, (5) దూషణము, (6) ప్రలాపము, (7) మూర్ఖప్రసంగము, (8) పరవస్తుకాంక్ష, (9) ద్వేషము (10) విపర్యయము - ఇందులో మొదటి మూడును దేహదోషములు. తరువాతను నాలుగును వాగ్దోషములు. కడపటి మూడును మానసిక దోషములు.

"దూరఙ్గమం ఏకచరం అసరీరం గుహాసయం।
యే చిత్తం సఞ్ఞామేస్సన్తి మోక్షన్తి మార బంధనా॥ (ధ. 3-5)

తా॥ ఎంతదూరమైనను ఒంటరిగా పోవునట్టి స్వభావము కలదియు, శరీరరహిత మైనదియు, హృదయకుహరము నందు (గుహ) అణగి యున్నదియు అగు మనస్సును వశపరచుకొనినవాడు మన్మథునివలన బంధింపబడడు.

అని చెప్పియున్నందున భగవద్గీతవలెనే మనోజయము ప్రధానమని చెప్పబడినది.

మనస్సుపై ధర్మ మాధారపడియున్నది. ధర్మముపై జ్ఞాని మాధారపడియున్నది. (పరోపకారార్థమై జీవించుటే ధర్మము) కనుక మనస్సును శుద్ధముగా చేయవలయును. ఈ మతమునందు నిర్హేతుక భగవదనుగ్రహమున మానవు డుద్ధరింపబడునను నమ్మకము లేదని చెప్పనవసరము లేదు. కనుక ప్రతివాడును వాని సామర్థ్యముచేతనే ఉన్నతగతిని పొందలేనని చెప్పుదురు.*

ధ్యానమునకు నాలుగవస్థ లున్నవి. (1) ఏకాంతవాసమువలన కలుగు ఆనందము ఉత్సాహము, (2) చిత్తశాంతి, (3) అహంకారము లేకుండుట, (4) పూర్ణశాంతి.

మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష - యివి కలిగియుండవలెను. ఇవి వేదాంతమతమునందు జ్ఞానులకును అవసరమే.

ఈ మతమునందు గురువునందు భక్తి కలిగియుండవలెనని చెప్పినను గురువు చెప్పినదానియందు మూఢనమ్మక ముంచక విచక్షణ నుపయోగించి సత్యాసత్య నిర్ణయము చేయవలె నందురు -

---

* శ్లో॥ ఉద్ధరే దాత్మనా ఽఽ త్మానాం నాత్మానమవపాదయేత్.
(గీత -6-5)

తా॥ సంసారసాగర మగ్నుడైన తనను ఆసక్తిలేని మనస్సుచేత ఉద్ధరించుకొన వలయునను గీతా శ్లోకార్థము ఇచ్చట సరిపోవును.

బౌద్ధమతము శీల సముపార్జనము, ధర్మానుష్ఠానము, సర్వప్రాణుల యందు దయ, అహింస త్యాగము మొదలగు ఉత్తమ గుణములు నిర్వాణమును పొందగోరువారు తప్పక కలిగియుండవలయునని చెప్పును. **ఈ విషయమై** హిందూ జైన బౌద్ధమతములు ప్రపంచమునందలి అన్ని **మత**ములకంటె అగ్రస్థాన మాక్రమించినవని చెప్పవచ్చును. ఈ **మతమునందు 'ధర్మ' మనగా లోకహితమును గోరి జీవించుటయే** యని యర్థము. సకల ధర్మశాస్త్రములయందలి సారము ఈ ఒక్క వాక్యమునందు ఇమిడియున్నది.

బౌద్ధమతావలంబు లందు గృహస్థులను ఉపాసకులనియు, సన్న్యాసులను శ్రమణులనియు, భిక్షులనియు అందురు. గృహస్థులకు కఠిన నియమములు లేవు. శ్రమణులకు కొన్ని కఠిననియమములు ఏర్పరచియున్నను, అవి మనుస్మృతియు ఉపనిషత్తులును సన్న్యాసులకు విధించిన నియమము లంత కఠినము లైనవి కావు. సన్న్యాస మవశ్యముగ స్వీకరింపవలెనను నియమము లేదు. వీరిమార్గము మధ్యమమార్గమని చెప్పిరి గదా? ఒకసమయమున బుద్ధభగవానుని కడకు, కోసలరాజ్యపు రాజధానియగు శ్రావ నగరనివాసి సుదత్తనామధేయుడగు ధనవంతుడు వచ్చి భగవానుని శరణు బొందినపుడు అతనిని గృహస్థునిగనే లోకోపకార మొనర్చుచుండుమని దేశించెనట* కాని. ఉపాసకులకు "అర్హతావస్థ" లేక నిర్వాణసుఖము కలుగదు. వారికి ఉత్తమమగు పుణ్యలోకములు కలుగును. నిర్వాణము కోరువారు తప్పక సన్న్యసించవలయును. అయినను దతనంతర బౌద్ధులు గృహస్థులకు సహితము నిర్వాణము కలుగవచ్చునని యంగీకరించిరట. బౌద్ధులు స్వర్గనరకములు కలవని అంగీకరించిరి.

(9) కర్మసిద్ధాంతము-పునర్జన్మము

వేదాంతులవలెనే బౌద్ధులు కర్మసిద్ధాంతమును, పునర్జన్మ భావమును అంగీకరింతురు. కాని స్వల్ప భేదమున్నది. వేదాంతము, "మరణించిన

---

* సుదత్తుడు అనాథులకు నిరతాన్నదానము చేయుటవలన 'అనాథ పిండదుడ'ను నామము వహించెను. ఇతడు అపారధనమును వెచ్చించి శ్రావస్తి నగర సమీపమున బౌద్ధ విహారమందిరమును నిర్మించినవాడు.

దేహమునుండి వెడలిన జీవుడే పునర్జన్మ మెత్తు"నని చెప్పును. బౌద్ధమతమునం దట్లు కాదు. మృతదేహమును వదిలినవా డొకడు. పునర్జన్మ మెత్తువాడు వేఱొకడు. పునర్జన్మ మెత్తువాడు మరణదేహమును వదలిన వానికంటె పూర్తిగా వేఱుకాదు. ఇద్దరును ఒకడే కాదు. మరణించినవాని కర్మఫలమును అనుభవించువాడు పునర్జన్మ మెత్తినవాడు. ("పునర్జన్మ మెత్తినవాడు" అనుటయు ఒక విధముగ తప్పేయగును. కాని బోధకొఱ కావిధముగ చెప్పిన తప్పు కాదు). ఇరువుర మధ్యగల సంబంధ మట్టిది. మరణించిన వ్యక్తి సంపూర్ణముగ నశించలేదు. పునర్జన్మకు కారణములగు ఆ వ్యక్తిగతమైన ధర్మములు, తృష్ణ యివి నూతన విజ్ఞానరూపమున పునర్జన్మ నొందుచున్నవి. పశువులకు, మానవులకు మరణసమయమున పునర్జన్మకు కావలసిన సామగ్రి (భావాదులు) సిద్ధముగ నుండిననే పునర్జన్మలు లభించును. అట్టి సామగ్రి సిద్ధముగా లేనివారు (ఆకస్మిక మరణమునకు గురియైనవారు) గంధర్వులై పునర్జన్మమున కవసరమగు సామగ్రిని గంధర్వ శరీరరూపములలో నుండియే సంపాదించుకొని ఆ శరీరములను వదలి నూతన జన్మ (పునర్జన్మ)మును పొందుదురు.

దుర్మరణమునకు పాల్పడినవారును, ఆత్మహత్య చేసికొన్నవారును వెంటనే లోకాంతర, జన్మాంతరములు పొందక కొంతకాలము ఇచ్చట వాయుశరీరములతో (భూతములుగా) నుందురని హిందువు లంగీకరింతురు.

(10) చాతుర్వర్ణ్య వ్యవస్థ :

చాతుర్వర్ణ్య వ్యవస్థను బుద్ధ భగవానుడు తీవ్రముగ ఖండించెను. శ్రీయుతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఇట్లు వ్రాసిరి. "బుద్ధుని వర్ణ ధర్మాభిప్రాయమును గూర్చి విపరీత భావములు కొన్ని గలవు. వర్ణ ధర్మమున కాతడు విరోధి కాడు. కాని యత డుపనిషద్వర్ణ ధర్మము నంగీకరించెను." (భా-త. II వాల్యం, పుట. 265).

ధమ్మ పదమునం దిట్లున్నది :-

"బాహి తపాపో ఉతి బ్రహ్మణో సమ చరి! యా సమణోతి వుచ్చతి।
నబ్బా జయమత్త నో మలం తస్మా పబ్బజితో ఉతి వుచ్చతి॥"
(26-వ సర్గము-6)

తా॥ పాపములను పారద్రోలినవాడు బ్రాహ్మణుడు. శాంత చిత్తుడగు వాడు శ్రమణుడు. మాలిన్యము నంతయు కడిగి వేసినవాడు సన్న్యాసి.

మఱియు ధమ్మపదము నందలి 26వ సర్గము 9వ గీత (శ్లోకము) నుండి 26-34 వఱకు బ్రాహ్మణు డెట్టివాడు అను విషయము వివరింపబడెను. ఉపనిషత్తుల యందలి వర్ణ వ్యవస్థను శ్రీ బుద్ధుడంగీకరించె ననగా మన్వాది స్మృతులయందు చెప్పిన వర్ణవ్యవస్థను తీవ్రముగ ఖండించెనని అర్థమే కదా? బుద్ధ భగవానునిచే ఖండింపబడిన వర్ణవ్యవస్థయే యిప్పుడాచరణ యందున్నది. ఇందులో "విపరీత భావము లేమున్నవి?" గీతయందు, స్థితప్రజ్ఞుడు, భక్తుడు, (భగవంతునికి ప్రియతములు) ఎట్టి వారని చెప్పబడిరో ధమ్మపదమునందు బ్రాహ్మణుడు అట్టివాడుగా వర్ణింపబడెను. పర్యవసాన మేమన బుద్ధదేవుని కాలమందును. వర్తమాన కాలమునందును, సాంకర్యము నొందియున్న వర్ణవ్యవస్థ విసర్జింపదగిన దనియే అర్థము.

సిద్ధార్థుడు తన వివాహవిషయమై తండ్రికి పంపిన లేఖయందు ఇట్లున్నదని శుద్ధోదనుడు ఇట్లు వెల్లడించెను.

"శ్లో॥ బ్రాహ్మణీం క్షత్రియాం కన్యాం వైశ్యాం శూద్రీం తథైవ చ,
యస్యా ఏ తే గుణాః సన్తి తాం మే అన్యాం ప్రవేదయ,
న కులేన న గోత్రేణ కుమారో మమ విస్మితః
గుణే సత్యే చ ధర్మే చ తత్రాస్య రమతే మనః..."
(లలిత విస్తరము 12వ అధ్యాయము.)

శుద్ధోదనుడు పురోహితులతో ఈ వాక్యములు చెప్పి, కన్య నన్వేషింపుడని పంపి నట్లున్నది. కన్య యే కులమునకు చెందియున్నను

ఉత్తమ గుణము లుండిన చాలు ననుటలో ఇప్పటి వర్ణధర్మమును సిద్ధార్థుడు సంపూర్ణముగ విడనాడెనని అర్థ మగుచున్నది.

ఒక నూతన మతమును స్థాపించిన వ్యక్తి యంతటి మహనీయుడైనను అతడు పుట్టి పెరిగిన పరిస్థితుల నుండియు, సంప్రదాయముగా వచ్చిన పూర్వుల విజ్ఞానమునుండియు, ఆ దేశీయులు ఎన్నడును నూహింపజాలని క్రొత్త మతమును స్థాపించుట సంభవింపదు. బౌద్ధ దర్శనము ఉపనిషత్తులు చెప్పిన దానికి పూర్తిగా విరుద్ధమైనది కాదు. కొన్ని ధర్మములయందు పరస్పర వైరుధ్య మున్నను పర్యవసానమున ఒక దానిలో ఒకటి కలిసియే యున్నవి.

(11) కాయత్రయము

బౌద్ధులు కాయత్రయమును గుఱించి యిట్లు చెప్పుదురు.

(1) ధర్మకాయము :- ఇది అవస్థారహితము. కాలాతీతమును అగు పరతత్త్వము వంటిది. (2) సంభోగకాయము : నామరూపములు ధరించిన ధర్మకాయమే యిది. (3) నిర్మాణకాయము : ఇది కలుషితమైన చిత్తరూపమున నుండును.

(12) నిర్వాణ స్వరూప విచారము

బౌద్ధమతమున నిర్వాణమే ముక్తి. నిర్వాణ మనగా :- చల్లార్చుట, నాశన మగుట. నిర్వాణము రెండు విధములు.

(1) ఉపాధి శేషనిర్వాణము - ఇందు ఉపాధి శేషించి యుండును. కనుక దీనిని ఉపాధి శేష నిర్వాణ మందురు. ఇందు పంచస్కంధములు నశింపవు. సాధకుడు బోధిని గాంచును*. జీవించవలె నను తృష్ణ, వస్తువులయందు వాంఛకలిగి ఉండడు. రాగద్వేషములు నశించి యుండును. బుద్ధ భగవానుడు ముప్పది ఆఱవయేట బోధివృక్షముక్రింద మొదటి సారి యీ స్థితిని పొంది బుద్ధు డయ్యెను.

---

* ఇతనిని జీవన్ముక్తునితోను. నిర్వాణమును అద్వైతులు చెప్పు నిర్వికల్ప సమాధితోను పోల్చవచ్చును.

(2) పరి నిర్వాణము - ఇది అనుపాధి శేష నిర్వాణము, ఇందు వ్యక్తి పూర్ణముగా నశించును. అనగా :- కడపటి మరణమును పొందును. ఇది శూన్యము కాదు : సంసార విరమణము. దీనిని బుద్ధ భగవానుడు తన ఎనుబదవ యేట పొందెనందురు.* బుద్ధ భగవానుని అనంతరము తన వాక్యములకు వ్యాఖ్యాతలగు నాగసేన, బుద్ధ ఘోషు లిరువురు నిర్వాణ మనగా : సంపూర్ణ నాశన మనియు, అభావ మనియు చెప్పిరి. వీరే గాక బౌద్ధమతమును విమర్శించిన మన పూర్వాచార్యులును (శ్రీశంకరాచార్యాదులును) అధునాతన భారతీయ, పాశ్చాత్య పండితులు పెక్కండ్రును నాగసేనుని మార్గమునే అనుసరించిరి. కొందఱు పాశ్చాత్య పండితులు మాత్రము నిర్వాణ మనగా : శూన్యము కాదని అంగీకరించిరి. నిర్వాణ మనగా : నాశనము కాదని, కాలాతీతమగు అవస్థ యని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు మొదలగు వారు కొందఱు బౌద్ధ గ్రంథములనుండి అనేక ప్రమాణ వాక్యములను చూపి అది నిత్యమైన స్థితి యని సహేతుకముగ నిరూపించి యున్నారు.

నిర్వాణము శూన్యమని మన మంగీకరించితిమేని, అట్టి శూన్యమునకు సాక్షి ఒక డుండవలెను కదా? సాక్షి లేకపోయిన శూన్య మెట్లు అనుభవమునకు వచ్చును. శూన్యమే దాని నది శూన్యమని తెలిసికొని యున్నదనిన అట్లు తెలిసికొన్న అది శూన్య మెట్లగును?

నిర్వాణశబ్దమును బుద్ధభగవానుడే మొట్టమొదట చెప్పినది కాదు. శ్రుతులయందును భగవద్గీత మొదలగు గ్రంథములయందును బుద్ధభగవానునకు పూర్వమును, ఆయన అనంతరమును, కలిగిన రచనలయందు కలదు. భగవద్గీత యందు,

శ్లో॥ యుంజన్నేవం సదా ఽఽ త్మానం యోగీ నియతమానసః।
శాంతిం నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి॥ (గీత. 6-15)

---

*అద్వైతులు చెప్పు విదేహకైవల్యము లేక మహాసమాధితో దీనిని పోల్చవచ్చును.

తా॥ నియమింపబడిన మనస్సు గలిగిన యోగాభ్యాసకుడు పైన చెప్పిన విధముగ మనస్సును సమాధానము చేయుచున్నవాడై, ఉత్కృష్టమైన నిర్వాణమే (మోక్షమే) నాస్థానమును (సంసారోపరతిని) పొందుచున్నాడు.

ఇచ్చట నిర్వాణము మోక్షమునకు పర్యాయముగా చెప్పబడినది. గౌడపాదాచార్యులవారు మాండూక్య కారికలయందు ఇట్లు చెప్పిరి :-

తా॥ అదియే స్వస్థము, శాంతము, నిర్వాణము, ఉత్తమసుఖము, అజము, జ్ఞేయము, సర్వజ్ఞము నని బ్రహ్మ వేత్తలు చెప్పుదురు.

పైవిధముగా నిర్వాణశబ్దము పరబ్రహ్మపరముగాను, పరమశాంతి పరముగాను ప్రయోగింపబడి యున్నందున* జ్ఞానులు, యోగులు చెప్పు నిర్వికల్ప, నిర్బీజసమాధు లెట్టివో నిర్వాణముకూడ నట్టిదే. పొరపాటున నైనను విమర్శకొరకైనను బౌద్ధగ్రంథములయం దెచ్చటను 'బ్రహ్మ' శబ్దము కనబడదని, 'బ్రహ్మదేవుని' (చతుర్ముఖబ్రహ్మను) గుఱించిమాత్రమే కలదని, బౌద్ధగ్రంథములు పరిశీలించిన పండితులు వ్రాసియున్నారు. నిర్వాణము పొందుటకు బౌద్ధులు చెప్పిన సాధనసంపత్తి జ్ఞానయోగులు, పాతంజల రాజయోగులు అవలంబించినట్టి సాధనవిధానమే యగుటవలన నిర్వాణ, కైవల్య, బ్రహ్మ, శబ్దములు పర్యాయశబ్దములని తలపవలెను.

బౌద్ధుల సాధనక్రమమునందు మొదట మలినవాసనాక్షయ మగును. పిమ్మట, శుద్ధవాసన ఆవిర్భావ మగును. దీని వలన విశ్వకల్యాణము సాధింపబడును. తుదకు దీనిని సహితము క్షయింప జేయుటయు నను పద్ధతు లున్నవి. పాతంజల రాజయోగమునందు చెప్పిన అష్టాంగ యోగమును బౌద్ధులు షడంగ యోగముగా కొంత మార్పుతో గైకొనిరి. చిత్తము వికల్పరహిత మగుటయే బౌద్ధులయొక్కయు, జ్ఞానయోగుల యొక్కయు, రాజయోగులయొక్కయు. సాధనముల ఫలము. జ్ఞానయోగ రాజయోగములను గుఱించి యిదివఱలో చెప్పియుంటిని, ఆ విషయము ఇచట స్మరింపనగును.

---

* నిర్వాణము మోక్షమునకును, నిర్యాణము మరణమునకును పర్యాయ పదములు.

(13) యానములు

బౌద్ధమతమున మూడు యానములు కలవు. ఒక దానికంటె ఇంకొకటి ఉత్తరోత్తర శ్రేష్ఠములు. (1) శ్రావకయానము :- ఈ మార్గావలంబులు బుద్ధు లుపదేశించిన మార్గము ననుసరించియు, బౌద్ధగ్రంథముల యందు చూపబడిన మార్గము ననుసరించియు నడచుకొందురు. నూతన మార్గావిష్కరణ చేయరు. (2) ప్రత్యేక బుద్ధయానము :- ప్రత్యేక బుద్ధుని ఆదర్శము. శ్రావకుని ఆదర్శముకంటె గొప్పది. ఇతడు స్వయముగా ప్రయత్నించి మార్గమును కనుగొని ఆ మార్గమున నడిచి బోధిని పొందును. కాని ఇతరుల కుపదేశింపడు. (3) సమ్యక్ బుద్ధయానము :- సమ్యక్ బుద్ధుడు మార్గావిష్కరణ చేసియు, తాను బోధిని పొందియు ఇతరులను తరింపజేయును. దీనిని బోధిసత్త్వయాన మందురు. ఇతనిని బోధిసత్త్వు డందురు.

(14) బుద్ధభగవానుని అనంతరము

బుద్ధభగవానుని యుపదేశములు ఆయన జీవితకాలములో గ్రంథరూపమున వెలువడలేదు. బుద్ధదేవుడు తమ శిష్యులకు మౌఖికముగ ఉపదేశించెను. శిష్యు లా యుపదేశములను జాగ్రత్తగా జ్ఞాపక ముంచుకొని వారి శిష్యులకు బోధించుచు వచ్చిరి. బుద్ధదేవుని పరినిర్వాణానంతరము బౌద్ధ సంఘమునందు భేదాభిప్రాయము లేర్పడెను. బుద్ధభగవానుని కాలమునందే యవి తలయెత్తలేక పోయెననియు కొందఱందురు. భగవానుని పరినిర్వాణానంతరము సుమారు నూఱు సంవత్సరములకు బౌద్ధసంఘము సమావేశమైనది.

మొదటి సంగీతి (సభ) రాజగృహమను నగరమున జరిగినది. ఇందు అయిదువందలమంది బౌద్ధభిక్షువులు మహాకాశ్యపుని అధ్యక్షతన సమావేశమై బుద్ధభగవానుని యుపదేశములు చర్చించి ఆయన యుపదేశములను "సుత్తపిఠక" అను పేరను, ఆచార సంబంధ విషయములను 'వినయపిఠక' అను పేరను సంకలితము చేసిరి. మొదటి దానికి ఆనందుడును, రెండవ దానికి ఉపాలియు సంపాదకులు. మూడవది

నీతిధర్మములు విస్తరించి చెప్పిన 'అభిదమ్మపిటక'మునకు కాశ్యపుడు సంపాదకుడు. ఈ మూడు పిఠకములు* బౌద్ధులకు మూడు వేదములు. వీటిని పిటకములనియు అందురు. వీటిలో ముఖ్యమైనది (1) సుత్తపిఠకము. ఏలయన! ఇందులో బుద్ధభగవానుడు తనసంచారములో చెప్పిన ఉపన్యాసముల యందు బౌద్ధ తత్త్వము విస్తరించి చెప్పబడినది. (2) వినయపిఠకము :- ఇది బౌద్ధసన్న్యాసులయొక్క శిక్షణవిధానమును తెలుపును. (3) అభిధర్మపిఠకము :- ఇందులో చాలవఱకు నీతిధర్మములును, కొంతవఱకు తత్త్వమును చెప్పబడెను.

రెండవ సంగీతి : మొదటి సంగీతి జరిగిన నూఱేండ్లకు వైశాలీ నగరములో జరిగినది. ఇందు ఏడునూర్ల భిక్షువులు పోల్గొనిరి. ఇందు జరిగిన నిర్ణయములు కొందఱంగీకరింపక 'కౌశాంబి'లో వేఱొక సభను జరిపిరి. ప్రాచీన సంప్రదాయమునకు కట్టుపడినవారు స్థవిరవాదులు (సంప్రదాయవాదులు). వీరికంటెను భిన్నులు మహాసాంఘికులు (అభ్యుదయవాదులు), ఈవిధముగా వీరిలో అవాంతరభేదము లేర్పడి పదునెనిమిది శాఖలైనవి.

మూడవ సంగీతి : పాటలీపుత్రమున అశోకచక్రవర్తి ఏర్పాటు చేసినది. ఈ సభయందు బౌద్ధమత ప్రచారమునకు భిక్షువులను భారతదేశమునందలి యితర ప్రాంతములకు పంపుటకేగాక విదేశములకు పంపుటకుకూడ ఏర్పాటు జరిగెను.

నాలుగవ సంగీతి : కనిష్కుని కాలమున ఆయన యాజమాన్యమున జరిగెను. ఈ సభ ఫలితముగా బౌద్ధమతము తొలుత హీనయానమనియు, మహాయానమనియు రెండు శాఖ లేర్పడెను. హీనయానమునకు చెందినవారు సర్వాస్తివాదులు. పిమ్మట హీనయానము వైభాషికులని, సౌత్రాంతికులని

---

* "పిఠకము"లని కొందఱును, 'పిటకము'లని కొందఱును 'పిటికము'లని మఱికొన్నిచోట్లను కలదు. ఏదైనను ఒకటిగా భావింతురని విన్నపము.

యిరుతెగలాయెను. మహాయానము సహితము విజ్ఞానవాదులని (యోగాచారులని), మాధ్యమికులని (శూన్యవాదులని) - రెండుగా చీలిపోయెను.

(15) హీనయానము

బుద్ధదేవుని పరినిర్వాణానంతరము బౌద్ధమతమునందు హీనయానము, మహాయానము అను రెండు చీలిక లేర్పడెనని చెప్పితిని. ప్రాచీన బౌద్ధము భిన్నాభిప్రాయములకు అవకాశ మిచ్చుటచే అట్లు జరిగినది. బౌద్ధులు తొలుత తమ మతప్రచారమునకు పాళీభాషనే ఉపయోగించిరి. పూర్వ పద్ధతి ననుసరించి హీనయానమునకు చెందినవారు పాళీభాషనే వాడుచు పాళీభాషయందే తమ గ్రంథములను రచియించిరి. హీనయానమునందు బుద్ధభగవానుని వ్యక్తిత్వమును గుఱించి భిన్నాభిప్రాయము లేర్పడి రెండు పక్షము లైరి. ఇరుపక్షముల వారును దేవుడు లేడను నాస్తికులే. అందులో ఒకరు - బుద్ధుడు దేవుడు కాడు, మానవాతీత వ్యక్తియు కాడు, సామాన్యులకంటె అధిక విజ్ఞానసంపన్నుడు. ఆయన కష్టపడి బోధి నార్జించి యితరులకు బోధించిన గురువు, మార్గదర్శకుడని అందురు.

హీనయానమందలి మఱియొక పక్షమువారు బుద్ధుడు లోకోత్తర పురుషుడని ఆయన పరిపూర్ణత యితరులకు కలుగదని, ఆయన లోకకళ్యాణమునకై అప్పుడప్పుడు అవతరించుచుండునని అందురు.

హీనయానమునకు చెందినవారి సిద్ధాంత మిట్లుండును:- మనవంటి సామాన్య మానవు లైనను కష్టపడి తపము, అధ్యయనము, ఇంద్రియ నిగ్రహము, యోగము - వీటివలన అర్హత పదవి నొందవచ్చును. ప్రతి మానవుని యందును అంతర్గతమగు నొక శక్తి కలదు. దానిని తపోయోగాదులగు సాధనలతో స్వయముగా బహిర్గతము కావింపవచ్చును. ఎవరైన ఉద్ధరింతురను నమ్మకముగాని, దేవుడు కలడని, అతని భక్తివలన ఉద్ధరింపబడుదు మనిగాని వీరు నమ్మరు. బుద్ధధర్మమును తప్ప వీరు దేని సహాయమును అపేక్షింపరు. మఱియు వారీతత్త్వమునందు మార్పు నంగీకరింపని పూర్వాచార పరాయణులు త్రిపిటకములను ప్రమాణముగ

అంగీకరింతురు. వీరిని స్థవిరవాదులనియు, సంప్రదాయ వాదులనియు అందురు. పాళీభాషలో వీరిని థేరవాదులందురు. వీరు కఠినమైన సన్న్యాస జీవితమును గడుపవలయు ననియు, కొండగుహలయందు ఏకాంతవాసము గడపుట మంచిదనియు చెప్పుదురు. కాని బుద్ధదేవుని యభిప్రాయ మదిగాదు. ఏలయన? ఆయన కష్టపడి ఆర్జించిన బోధిని లోకమునకు అందించెను. సమాజమున నుండియే సమాజము నుద్ధరించెను.

బుద్ధభగవానుని పరినిర్వాణానంతరము రాజగృహమునందు మొదటిసభ జరిగిన పిమ్మట రెండవ సభయందు పూర్వాచార పరాయణులగు స్థవిరులకు అభ్యుదయవాదులకు వాదోపవాదములు జరిగి అభ్యుదయ వాదులు ఓడిపోయిరి. అయినను వారొకపక్షముగా చీలిపోయిరి. అప్పుడు బౌద్ధమతమున అనేక మార్పులు జరిగెను. వాటిని స్థవిరవాదు లంగీకరింపలేదు. సరికదా, అట్టిమార్పును బుద్ధభగవానుని ఉపదేశమునకే విరుద్ధమనియు, వాటిని తాము అంగీకరింపక బౌద్ధమతమును రక్షించుచుంటి మనియు చెప్పిరి. సిలోన్ (శ్రీలంక) , బర్మా దేశములయందు హీనయాన బౌద్ధమే ఇప్పటికిని కలదు. బుద్ధదేవుని పరినిర్వాణానంతరము సుమారు 150 సంవత్సరముల బౌద్ధమత చరిత్ర తెలియవచ్చుట లేదని బౌద్ధమతమును పరిశీలించిన పండితులు చెప్పియున్నారు.

స్థవిరవాదులు యానత్రయమునందు శ్రావక (అర్హత) యానమును, ప్రత్యేక బుద్ధయానమును కోరుదురు. వీరికి, నిర్వాణమే గమ్యస్థానము. లోకోద్ధరణకొఱకు మరల జన్మింపవలెనని సంకల్పించరు. ఈ జన్మయందో, రాబోవు జన్మయందో, యెప్పుడో అర్హతులము గాగలమని వీరి దృఢ విశ్వాసము.

(16) మహాయానము

(మహాయాన తత్త్వము)

పైన చెప్పిన అభ్యుదయవాదులే అధిక సంఖ్యాకు లగుటవలన ప్రతిపక్షముగా చీలిపోయి మహాయాన శాఖగా ఏర్పడిరి. హీనయానమువారు

పాళీభాషను గైకొనగా మహాయానమువారు సంస్కృత భాషయందు తమ గ్రంథములు రచియించిరి. మహాయానమువలన బౌద్ధమతమున గృహస్థులు సయితము చేరుటవలన బౌద్ధము దేశమున విస్తరించినది. మొగ్గలి పుత్రుడైన 'టిస్సా' అధ్యక్షతక్రింద పాటలీపుత్రమున మూడవసభ సమావేశ మయ్యెను. తాత్త్వికాంశములయందు హీనయానము చెప్పిన కొన్ని యంశములను మహాయానము అంగీకరింపలేదు. హీనయానము ఆత్మను క్షణిక దశాసముచ్చయము, లేక స్కంధ సమూహమని చెప్పగా, స్కంధములు సహితము అసత్యములే యని మహాయానము చెప్పెను. మహాయానము "తథత"*, "భూతతథత", "సత్సారము", "నిర్వాణము" "బోధి", "జ్ఞానము"- అను నామములచే చెప్పబడునది ఒకటి కలదని, అట్టి 'తథత' సర్వదేశ సర్వకాలములకు సర్వాధారమును, సర్వాంతర్గతమును నిశ్చలమునునై యున్నదని చెప్పుదురు.** రెండు- దీనిని ఉపనిషత్తులు చెప్పిన నిర్గుణ బ్రహ్మముతో పోల్చవచ్చునందురు. దీనిని బౌద్ధమత సూత్రములయందు "ధర్మకాయ" మని అందురు.

ధర్మకాయము విరుద్ధభావముల సమన్వయరూపము. సర్వజగ ద్వస్తుజాలము. ఏకైక సత్పదార్థ స్వరూపము. అది భాషాతీతము. అనిర్వచనీయము. సర్వజ్ఞాన జ్యోతిస్స్వరూపము.

---

* "తధత" అనియు "తథత" అనియు భిన్నవిధముల వ్రాసియున్నారు. రెండును ఒకే అర్థమున వాడబడినవని తెలియవలెను.

** డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణపండితు లిట్లు చెప్పిరి. మహాయానతత్త్వము. నద్వైతసామ్యము కలదు. సర్వజగద్వస్తు లోకేసత్పదార్థ స్వరూపములు. సత్పదార్థ స్వరూపము, భాషాతీతము, ననిర్వచనీయమునై యున్నది. వస్తువులు..."ఇవన్నియు నొకే యాత్మస్వరూపములు. అట్టి సత్తునకే 'తథత' యను నామాంతర మున్నది."

"నిత్యము భూత తథత; అది సర్వకాల సర్వదేశములనుండి సర్వాధారమై నిత్యమై వెలయుచుండును."

(భా. త. దశమాధ్యాయము II భాగము పుట 522, 523)

వ్యావహారిక జగత్తును గుఱించి మహాయానతత్త్వమిట్లు చెప్పును: "అంతా అనిత్యము. సర్వవాంఛలు ధృవమైనవి కావు. కల్పాలు శాశ్వతమైనవి కావు. మయామరీచికా సదృశాలు, విద్యుత్తులాగున, నురుగులాగున చపలమైనవి." (లలితవిస్తరము-4)

జగత్తు సత్తును గాదు, అసత్తును గాదని వీరందురు. (అద్వైతులు చెప్పునదియు అదియే కదా? ప్రపంచము వాస్తవము గాదు, కనబడుచున్నది) మహాయానము మధ్యేమార్గము నవలంబించును. ప్రపంచమునకు కారణము అవిద్యయని యందురు అవిద్య యేదో రూపమున "తథత" యందుండవలెను. ఏలయన తథత సర్వవ్యాప్తమై యుండ గా దాని యందుగాక అవిద్య ఉండుటకు వేఱొకచోటు లేదు కదా? మహాకాశము నందొక సన్నటి నలుసువలె తథత గర్భమునందు అవిద్య యుండి అది వికాస మొంది నామరూపాత్మక ప్రపంచ మైనది.

'తథత'ను గుఱించి యోగాచార, మాధ్యమికశాఖలను గుఱించి చెప్పునప్పుడు మఱికొంత చెప్పెదను. మహాయానమువారు సమ్యక్ బుద్ధయానమును (బోధిసత్త్వయానమును) మాత్రమే అంగీకరించిరి. మహాయానము ననుసరించి గౌతమబుద్ధు డొక్కడే. బోధిసత్త్వు లనేకు లుండిరని వారి గ్రంథములయం దున్నది (లలితవిస్తరము అ. 22). మహాయానమునందలి గొప్పతన మేమనగా వారు తమ ముక్తికి మాత్రమే పాటుపడరు. మానవులందఱు ముక్తులు కావలెనని వారి సంకల్పము. ఇట్టివారిని బోధిసత్త్వు లందురు. వీరికి అవలోకితేశ్వరుడు ఆదర్శము. బుద్ధభగవానుడు అనేక జన్మము లెత్తియున్నాడు. ధర్మకాయమును ధరించి ఇంకను జన్మల నొందగలడు. ఆ బుద్ధుని మహాయానులు "అమితాభబుద్ధు"డని యందురు. ఈ వాక్యములు భగవద్గీతయందలి "యదా యదా హి ధర్మస్య" అను 4-7, శ్లోకార్థమును స్ఫురింపజేయును. మహాయాన మతమును గుఱించి కొన్ని వాక్యములు చెప్పెదను.

మహాయాన మతము

ఇది చైనా, కొరియా, సయామ్, బర్మా, జపాన్ దేశములయందు వ్యాపించియున్నది. మతము లేని కేవలతత్త్వజ్ఞానము సామాన్యజనుల ఆమోదము పొందజాలదు. పామరులు తత్త్వజ్ఞానమును అర్థము చేసికొనజాలరు. కనుక తత్త్వమునకు, విరుద్ధము గాని విధమున తత్త్వమునకును, వాస్తవిక విషయమునకును కొన్ని అతిశయోక్తులను కల్పించి బౌద్ధులు బౌద్ధ పురాణగాథలను రచియించి ప్రజామోదమును పొందవలసి వచ్చినది. అది యట్లుండ అంతకు ముందే అనాదిగా వేర్లు పాతుకొనియున్న హిందూ పురాణముల యందలి దేవతలు, ఆ దేవతలుండు దేవలోకములు, ఆయా దేవతల నుపాసించినవారు పొందు ఆయా ఫలములు, కొన్ని యిహలోకముననే కలుగునను విశ్వాసమును ఇవన్నియు కలిపి ఉపాసనా, భక్తిమార్గముల నేర్పరచిన సామాన్యులామార్గమున నడతురు. అది వారికి విశేష సంతృప్తి కలిగించును. శుష్కమైన తత్త్వజ్ఞానము వారికట్టి తృప్తి నివ్వజాలదు.

ఈ విధముగా అనేక దేవతలు కలరనియు, సర్వదేవతలు ఏకేశ్వరుడగు దేవతా సార్వభౌముని అంశమాత్రు లనియు, ఆదిదేవుడు ముక్తి ప్రదాత యనియు, హిందూపురాణములు చెప్పినట్లే బౌద్ధులు హిందువుల దేవతానామములను కొన్నింటిని మార్చి తమ మతమున గైకొనిరి. లేని యెడల వారిమతము వృద్ధి చెందజాలదని తెలిసికొనిరి. మహా మేధావియు, మహాపండితుడును అగు నాగార్జునాచార్యుడు ఈ విధానమును చేపట్టి యీ మతమును వృద్ధినొందించెను.

దేవతలకు దేవుడగు బుద్ధుడు తుషిత భువనమునుండి భూలోకమున కరుదెంచి మాయాదేవి గర్భమున ప్రవేశించినాడు. మాయాదేవికి పదిమాసములు నిండినవి. ఆమె లుంబినీ వనమునకు పోవలెనని భర్తను కోరినది. ఆ రాజు ఆమెకు కావలసిన యేర్పాట్లన్నియు చేసెను. ఆవైభవమునకంటె హిందువుల దేవరాజగు ఇంద్రునివైభవము తక్కువేయని

చెప్పవచ్చును. మాయాదేవి రథముపై సింహాసనమున ఆసీన యైనది. అప్పటిస్థితి 'లలిత విస్తరము' ఇట్లు వర్ణించినది :-

"మాయాదేవి ఆ రథములోని సింహాసనముపై కూర్చున్నప్పుడు త్రిసహస్ర యోజన పరివ్యాప్తమైన భూమి ఆరు విధాలుగా కంపించినది. అంబరవీథిలో దేవతలు తిరుగుతూ పుష్పవర్షం కురిపించారు. జగత్తులోకల్లా శ్రేష్ఠుడయినవాడు లుంబినీ వనములో జన్మిస్తాడని దేవతలందరూ గ్రహించారు."

"ఆ రథాన్ని నలుగురు దిక్పాలకులు మోసినారు. దేవరాజయిన యింద్రుడు రథమార్గాన్ని శుభ్రంచేస్తూ వుండినాడు. దుర్మార్గు లెవరూ ఎదురు రాకుండా వారిస్తూ బ్రహ్మ ముందు బయలు దేరినాడు. లక్షలకొలది దేవతలు చేతులు జోడించుకొని నమస్కరిస్తూ ఉండినారు."

(లలిత విస్తరము అ. 7 జన్మ పరివర్తనము)

లలిత విస్తరము మహాయానమునకు చెందిన గ్రంథము. అందు ఇట్టి అతిశయోక్తులు అనేకములు కలవు. అది అతిశయోక్తుల రాశి. ఏమైననేమి! హిందువుల దేవరాజగు ఇంద్రుడు బౌద్ధమున వీథులు ఊడ్చు పాకివాడైనాడు, సృష్టి కర్తయగు బ్రహ్మ వేత్రహస్తు డయ్యేను. విష్ణుదేవుడు బుద్ధ దేవుని సేవ చేసినట్లు వ్రాయలేదు. కనుక విష్ణుదేవుని అవతారమే బుద్ధదేవుడని అభిప్రాయ మగునట్లు సూచనయై యుండవచ్చును. దీనివలన బుద్ధదేవుడు సర్వాధికుడు, అసమానుడు నగు దేవాధిదేవుడు. ఆయన లోకోద్ధరణకై అవతరించిన వాడు. దుఃఖరోగ నివారణము వైద్యుడు, నిర్వాణమును చేర్చు సారథి అని వారి భక్తిభావమును బుద్ధుని యెడల పెంపొందించిరి.

భగవద్గీతయందు చెప్పబడిన శ్రీ కృష్ణభగవాను డెట్టివాడో మహాయానమున బుద్ధు డట్టివాడు. కృష్ణభగవానుడు తత్త్వప్రకారము పరమాత్మ, పురుషోత్తముడు, మతము ననుసరించి దేవాధిదేవుడు శరణాగతుల సర్వ పాపములనుండి విముక్తి నొందించువాడు.

ఇచట ఇంకొక విషయము గమనింపవలసి యున్నది. బౌద్ధులు ాందువుల హృదయములను తమవైపునకు మరలించుటకు జాతకకథలు ముదలగు మనోహరమైన గాథలను పురాణములను అనేకములు చియింంచిరి. వాటిని నిజమని కొందఱు హిందువులు భ్రమపడిరి. ౌద్ధులు ఎన్ని గ్రంథములు వ్రాసినను వాల్మీకిరామాయణము వంటి ావ్యమును, మహాభారతమువంటి యితిహాసమును వ్రాసికొనలేక పోయిరి. ౌద్ధ మహాంబుధి యుప్పొంగి హిందూమతమును ముంచివేయనున్న రుణమున రామాయణ, మహాభారతములు మహా పర్వతములవలె ాందూమతమున కాశ్రయ మిచ్చినవని చెప్పవచ్చును.అట్టి గ్రంథములు పపంచమున మరెక్కడనులేవు.

తరువాత బౌద్ధులు స్థూపములు, విగ్రహారాధన, శిల్పములు, త్సవములు మొదలగునవి జరుపుటద్వారా హిందువులకు బుద్ధదేవుడు విష్ణువు అవతారమని నమ్మకము కలిగించిరి. ఇట్లు రెండు మతములు కేమార్గము నవలంబించుటచే చాలవఱకును మహాయాన బౌద్ధమతము ాందుమతమును సమీపించెను. తత్త్వము సయితము అద్వైతమునకు ంచుమించుగా సమీపవర్తి అయినది.

బౌద్ధులు స్థూప నిర్మాణములను చూచి హిందువులు దేవాలయముల ర్మించుకొనిరని కొందఱందురు. అది యెంతవఱకు సత్యమో రిశీలించవలసిన యంశము.

జిజ్ఞాసువు :- అయ్యా? బౌద్ధము నాలుగు ముఖ్యశాఖలుగా ్యాపించిన దందురుగదా? మీరు హీనయాన, మహాయానములను ెండు యానములనే చెప్పితిరి.? నాలుగింటిని గుఱించి చెప్పవలెనని ార్థింతును.

వేదాంతి :- బౌద్ధమున (1) వైభాషికులు (2). సౌత్రాంతికులు శూన్యవాదులు) (3) యోగాచారులు (విజ్ఞానవాదులు) (4) మాధ్యమికులు శూన్యవాదులు) అని నాలుగు శాఖలు కాలక్రమముగా ఏర్పడినవి. ందు మొదటి రెండును హీనయానమునకు చెందినవి. కడపటి రెండును

మహాయానమునకు చెందినవి. ఇప్పుడు వైభాషికులు మొదలగు నాలుగుశాఖల తత్త్వమును సంగ్రహముగా వినిపింతును.

(17) వైభాషికులు

బుద్ధభగవానుని పరినిర్వాణానంతరము సుమారు మూడునూర్ల సంవత్సరములకు సర్వాస్తి వాదశాఖకు చెందిన కాత్యాయనీ పుత్రుడు "అభిధర్మ ప్రస్థాన శాస్త్రమును" వ్రాసెను. దీనికి కనిష్కుని కాలమున "విభాష" అను వాఖ్య వ్రాయబడినది. ఈ 'విభాష'ను ప్రమాణముగ అంగీకరించిన సర్వాస్తి వాదులందఱు "వైభాషికు"లని పిలువబడిరి. కాని సర్వాస్తి వాదులందఱు వైభాషికులు కారు. సర్వాస్తి అనగా సర్వము కలదనువారు. మనకు గోచరించు ప్రపంచమే గాక గోచరించని ప్రపంచముయొక్క మూలము సహితము కలదనువారు.

వైభాషికుల సిద్ధాంత మిట్లుండును :- బాహ్య ప్రపంచము, అంతరంగ (మానసిక) ప్రపంచము రెండును స్వతంత్రస్థితి గలవి. ఇందువలన ద్రవ్యములు మనః కల్పితములు కావనుటచే 5 స్కంధములు, 12 ఆయతనములు, 18 ధాతువులు - వీటియొక్క ద్రవ్యసత్తను అంగీకరించి నట్లయినది. కాని, అవి నిత్యములనిమాత్ర మంగీకరింపరు. క్షణికములు. బౌద్ధమతమున నిత్యమైన పదార్థ మేదియు లేదు. సమస్తమును పరిణామశీలమే. ఈ క్షణిక సిద్ధాంతము బౌద్ధశాఖ లన్నియు ఆమోదించెను.

ప్రత్యక్షము, అనుమానము రెండింటినే జ్ఞానప్రమాణములని బౌద్ధు లంగీకరింతురు. శ్రుతి ప్రమాణము నంగీకరింపరు. కొన్ని వస్తువులను ప్రత్యక్షముగను, కొన్నింటిని అనుమానముచేతను తెలిసికొనుచున్నాము. ప్రత్యక్షములైన రూపములు ప్రతిక్షణమును మారుచుండును. వాటి మూలవస్తువులు మార్పు లేనివని అనుమానముచే తెలిసి కొనుచున్నాము. మూలవస్తువులు ప్రత్యక్షములు కావు. కారణ (మూల) పదార్థములకు మార్పులేదు. అవి కార్యరూపముగ మారినపుడు అవస్థమాత్రమే మారును.

వీరి మతమున సంస్కృత ధర్మము లనియు అసంస్కృత ధర్మము లనియు ధర్మములు రెండు విధములు.

(౧) సంస్కృత ధర్మములు :- జాతి, స్థితి, జరా, అనిత్యతలు. ఇవన్నియు క్షణికములు. వీటికి భూతభవిష్యత్తులు లేవు. వర్తమానమున మాత్రమే ఉండి తర్వాత లేకుండ పోవునవి.

(౨) అసంస్కృత ధర్మములు :- (1) ఆకాశము (2) ప్రతిసంఖ్యా నిరోధము. (3) అప్రతిసంఖ్యా నిరోధము. సర్వాస్తివాదులు వీటికి ద్రవ్యసత్త నంగీకరింపరు. వీటిని "అసముచ్చయాత్మక భూతము" లని యందురు. వీటియందు (1) ఆకాశము - సర్వవ్యాపకము, గుప్తము కానిది, (బయలు) రూపము లేనిది. సౌత్రాంతికుల మతమున ఇది వస్తువు కాకపోయినను దీనికి ద్రవ్యసత్త కలదని యంగీకరించిరి. (2) ప్రతిసంఖ్యా నిరోధమనగా:- ఒకే లక్ష్యముచే సర్వ భావములను వదలి, రాగాదులను నిరోధించుటవలన అతీంద్రియజ్ఞానము కలుగును. అట్టి ప్రజ్ఞచే నిర్వాణము లభించును, దుఃఖనాశన మగును. ప్రయత్నముచేత నశించునట్టిది. (3) అప్రతిసంఖ్యా నిరోధము - లేకుండ పోవుటయని యందురు. ప్రళయమున ద్రవ్యములకు తమంత కలుగు నాశన మనికూడ అందురు. అనగా దానియంతటదే అది ప్రయత్నము లేకనే నశించునదని తాత్పర్యము.

ఇదివఱలో చెప్పినట్లు వీరుస్కంధములకు, ఆయతనములకు ధాతువులకు ద్రవ్యసత్త నంగీకరింతురు. ప్రపంచమున గల సర్వవస్తువులు ఈ మూడింటిలో దేనిలోనో ఒక దానిలో చేరునందురు.

వైభాషికులును, సౌత్రాంతికులును పరమాణువాదము నంగీకరింతురు. అణువాదము మొదట వైభాషికులనుండి బయలుదేరిన దందురు. సర్వాస్తివాదుల మూలగ్రంథము నందు లేని యీ పరమాణువాదము విభాషలో పొడచూపిన దందురు. పరమాణువులు అవిభాజ్యములు. అగోచరములు. పరమాణువులకు రంగు, వాసన, రుచి, స్పర్శలు లేవు. కాని యీ నాలుగింటి సముచ్చయము అగు. అణు సముదాయము మనకు గోచరించును. "భూపరమాణువులు వేఱు. జల పరమాణువులు వేఱు - అని యీ విధముగా ఒక్కొక్క భూత పరమాణువులు వేఱు వేఱుగా ఉండునను వైశేషికుల వాదమును వీరంగీకరింతురు.

(18) సౌత్రాంతికులు

సౌత్రాంతికులు వైభాషికులవలె అభిధర్మమును బుద్ధవచనముగ భావింపరు. సుత్త పిటికమందలి కొన్ని సూత్రములనే బుద్ధవచనములని వాటిని ప్రమాణముగా గైకొనిరి. అందువలన వీరికి సౌత్రాంతికులని పేరు కలిగెను. తక్షశిలయందు కుమార మాతులుడను ఆచార్యుడు ఈ శాఖను స్థాపించెను. ఇతడు క్రీ. శ. 2వ శతాబ్ది చివరనో 3వ శతాబ్ది ఆరంభముననో ఉండినట్లు చెప్పుదురు.

వీరి మత మిట్లుండును :- వీరు బాహ్యప్రపంచము మాత్రమే కలదందురు. అందువలన వీరిని "బాహ్యార్థవాదు"లని కూడ పిలుతురు. బాహ్యజగత్తు కలదు; కాని, ఆంతరంగిక మనస్సుయొక్క అస్తిత్వము బాహ్యజగత్సంబంధ మైనది. జగత్తును ప్రత్యక్షముగా కాక అనుమాన ప్రమాణముచేతనే తెలిసికొనుచున్నాము. ధాతువులకు మాత్రమే ద్రవ్యసత్త నంగీకరించి స్కంధములకు, ఆయతనములకు 'ప్రజ్ఞసత్త' ను మాత్రమే యంగీకరింతురు. దీని తాత్పర్య మేమనగా :- వైభాషికుల మతము ననుసరించి విజ్ఞానసహితమగు నేత్రములతో మనము రూపమును చూచుచున్నాము. సౌత్రాంతికుల మతము ననుసరించి విజ్ఞానహితమగు నేత్రముతోగాని, కేవల నేత్రముతో కాని రూపమును చూడము. మఱేమనగా :- నేత్రము, రూపము- ఈ రెండింటి కారణముతో మూడవదియగు చక్షుర్విజ్ఞానము కలుగుచున్నది. అట్టి చక్షుర్విజ్ఞానముతో రూపమును ఊహించుకొనుచున్నాము. అనగా : మనము మన యెదుటనున్న పుస్తకమును చూచినప్పుడు, మనకు కలిగినది పుస్తకభావమే కాని పుస్తకమును మనము చూడలేదని సౌత్రాంతికులును, పుస్తకమునే దర్శించితిమని వైభాషికులును చెప్పుదురు. సౌత్రాంతికుల మతము ననుసరించి మనకు దర్శనములను, భావములను ఇచ్చునది జగత్తు, కనుక జగత్తు సత్యమని అనుమానముచే తెలిసికొందుము. అందువలన బాహ్యజగత్తునకు స్వతంత్రాస్తిత్వము నంగీకరించుచు ఆంతరంగిక జగత్తునకు స్వతంత్రాస్తిత్వమును త్రోసివేసిరి.

పరిణామ శీలములగు పదార్థములు క్షణికములని అనగా - క్షణమాత్రకాలముండి నశించునని వైభాషికులు చెప్పగా; వీరును క్షణిక వాదమును అంగీకరింతురుగాని క్షణకాల మైనను అవి యుండవని, పుట్టిన వెంటనే నశించునని చెప్పుదురు. అనగా :- క్షణకాలమైన స్థితికూడ వాటికి లేదని భావము. ఇందువలన వైభాషికుల కాలములో అస్పష్టముగా ఉండిన క్షణిక వాదమును సౌత్రాంతికులు స్పష్టపఱచినారని అర్థము. ఈ క్షణికవాదము బుద్ధదేవుడు ఉపదేశించినది కాదనియు, తర్వాత వచ్చినదనియు, పండితుల అభిప్రాయము. బుద్ధభగవానుడు సర్వము అనిత్యమని మాత్రమే చెప్పిరిగాని సర్వము క్షణికమని చెప్పియుండలే దందురు. వైభాషికులయందు కూడా క్షణికవాదము లేదనియు, క్షణికవాదము సౌత్రాంతికులనుండియే తొలుత ఆరంభ మయినదనియు అందురు.* క్షణమనగా :- జన్మించిన వెంటనే నశించుట అని వ్యాఖ్యానించినారు. వీరు క్రీ. శ. 4వ శతాబ్దమున ప్రాముఖ్యము వహించిరి.

(19) యోగాచారులు (విజ్ఞానవాదులు)

యోగాచారులు (విజ్ఞాన వాదులు) :- ఆర్యసంగుడను నామాంతరము గల అసంగుడును అతని సోదరుడగు వసుబంధుడును ఈ శాఖకు మూలపురుషులు. వీరు క్రీ.శ. మూడవ శతాబ్దమునకు చెందిన వారని కొందఱును, నాలుగవ శతాబ్దారంభమున నుండిరని కొందఱును చెప్పుదురు. క్రీ.శ. మూడవ శతాబ్దమున నుండిన మైత్రేయనాథు డను నతడు ఈ శాఖను ప్రతిష్ఠించెనని కొందఱందురు. బుద్ధులైన వారు దర్శించిన పరమ సత్యమును యోగాభ్యాసము వలననే పొందిరని, యోగాభ్యాసము లేక బుద్ధులు కాలేరని చెప్పుటవలన ఈ శాఖవారిని

* క్షణమనగా ఎంత కాలము ? 24 గంటలు గల ఒక దినములో 64,99, 980 క్షణములున్నవని అన్నారు. అనగా కొంచెము తక్కువగా మన 1/8 సెకండు అని ఊహించుకొనవలెను. బుద్ధఘోషుడు క్షణమనగా భూతభవిష్యత్కాలములు లేని కేవల వర్తమానము మాత్రమే అన్నాడట.

యోగాచారులందురు. యోగము వీరి అనుష్ఠాన పద్ధతి. వీరి తత్త్వవిచారము విజ్ఞానవాద మగుట వలన విజ్ఞాన వాదులని కూడ వీరిని పిలుతురు.

సౌత్రాంతిక శాఖనుండియే యోగాచారశాఖ ఉత్పన్న మైనదని చెప్పవచ్చును. వైభాషికులు బాహ్యజగత్తు యొక్కయు, దానిని గుర్తించు అంతరంగ (విజ్ఞాన) ము యొక్కయు అస్తిత్వమును గుర్తించిరి. సౌత్రాంతికులు బాహ్యజగత్తుయొక్క అస్తిత్వమును మాత్రము గుర్తించి అంతరంగమునకు ప్రత్యేకమగు అస్తిత్వము లేదనియు, అది కేవల బాహ్య జగత్సంబంధ మైనది మాత్రమే యనియు, చెప్పగా యోగాచారులు బాహ్యజగత్తు లేదని, ఉన్నది. ఒక్క విజ్ఞానముమాత్రమే నని చెప్పిరి. వీరిట్లు చెప్పుదురు :-

సౌత్రాంతికుల మతము ననుసరించి మనము చూచినది పుస్తకము కాదు. పుస్తక భావమునే (విజ్ఞానమునే) దర్శించితిమి గదా? మనకు పుస్తక విజ్ఞానము కలుగుటకు బాహ్య జగత్సంబంధ మగు పుస్తకమే యుండనక్కర లేదు. మఱేదైన కారణము కావచ్చును. అట్లు కాదు. బాహ్యజగత్తే కారణమని పట్టుపట్టిన బాహ్య జగద్వస్తువు లన్నియు పుట్టిన వెంటనే క్షణకాల మైనను నిలువక నశించుచున్న వని చెప్పిరి కదా? మన నేత్రమునకు పుస్తకమునకు సంయోగము కలుగుటకును, అది కారణముగ చక్షుర్విజ్ఞానము కలిగి పుస్తక భావమును మనము దర్శించుటకును కాల మెక్కడిది?

విజ్ఞానమునే పుస్తకరూపమున దర్శించితిమి. చిత్తము, మనస్సు, విజ్ఞానము, విజ్ఞప్తి అనునవి పర్యాయ పదములు. విజ్ఞాన మొక్కటి తప్ప వేఱొద్దియును లేదు. ఇదియే సగుణస్వరూపము. మనకు గోచరించు బాహ్యజగత్తు విజ్ఞాన కల్పితమే గాని నిజముగా లేదు. సర్వవస్తు ప్రపంచము అసత్తు. విజ్ఞాన మొక్కటే సత్తు. జగద్రూపమున గోచరించునది విజ్ఞానమే . ఏది స్థితి కలదని చెప్పబడుచున్నదో అట్టి సూర్యచంద్ర నక్షత్రాదికమగు సర్వమును మన భావముపై ఆధారపడియున్నదే. విషయి య ౨ చెప్పినపుడు దానికంటె వేఱుగ

విషయ ముండవలె గదా? అని ప్రశ్నించిన, విషయివిషయములు రెండును "ఆలయ విజ్ఞానమే" యని సమాధాన మిత్తురు. అయితే విజ్ఞానమున కొక ఆలంబన ముండవలె గదా? యనిన "అవసరములే"దందురు. అందువలన వీరికి 'నిరాలంబవాదు'లని పేరు కలదు.

విజ్ఞానవాదులు విజ్ఞానము ద్వివిధమని చెప్పుదురు. (1) ఆలయ విజ్ఞానము లేక విజ్ఞానముల ఆలయము (2) వ్యక్తి విజ్ఞానము.

(1) ఆలయ విజ్ఞానము :- ప్రత్యేక వ్యక్తుల విజ్ఞానము లన్నియు ఆలయ విజ్ఞానములో భిన్నాంశములు. దీనిని సమష్టి విజ్ఞానమని చెప్పవచ్చును. సముద్రమందు కెరటములు పుట్టి గాలిచే ప్రేరితములై కొంతదూరము సాగిపోయి కనబడకుండ సముద్రమునందే అణగిపోవును, ఇంతలో మరల కొన్ని తరంగములు పుట్టుచు మునుపటివలెనే సాగిపోయి అదృశ్యము లగుచుండును. ఈ విధముగా సముద్ర మెల్లప్పుడును క్రియావంతమై యుండునట్లు ఆలయ విజ్ఞానమునుండి వ్యక్తి జ్ఞానములు కలిగి అందే లయ మగుచుండును. విశ్వపరిణామము నొందిన విజ్ఞానమే ఆలయవిజ్ఞానము. ఇది ధ్యానమువలన మాత్రమే తెలియదగిన దనుట వలన దీనిని యోగులు మాత్రమే తెలిసికొందురు. సామాన్యు లెఱుగలేరు. యోగులైనను సంపూర్ణముగ నెఱుగలేరు. అందు కొంత భాగమును మాత్రమే యెఱుగగలరు.

ఆలయవిజ్ఞానము ఏకైక సత్పదార్థము. అజ్ఞానులు దీనిని జ్ఞాన జ్ఞేయ భేదములచే ద్వైతముగ దర్శింతురు. బుద్ధులు అద్వైతముగ దర్శింతురు. అద్వయమగు ఆలయవిజ్ఞానమును తొలగించిన సర్వమును శూన్యమే; భేద సహితమగు అద్వైతమే. దీనియం దవిద్య కలదు. ఆలయవిజ్ఞానము విశ్వముయొక్క మూలతత్త్వమని అంగీకరింప వచ్చును. కాని దిఙ్నాగుడు, ధర్మకీర్తి అను బౌద్ధ మతాచార్యులు - దీనిని ప్రపంచముయొక్క మూల తత్త్వమని అంగీకరింపరు. అట్లంగీకరించిన దీనిని వేదాంతులు చెప్పు "ఆత్మ" యను భ్రమ కలిగించి నట్లగునని వారి భయమట.

(2) వ్యక్తి విజ్ఞానము :- దీనిని జీవవిజ్ఞానమని వ్యష్టివిజ్ఞానమని చెప్పవచ్చును. ఆలయ విజ్ఞానమునకు దీనికిని నామమాత్ర భేదమే. సముద్రమునకును అలకును గల భేదము వంటి భేదవే. పంచేంద్రియముల నాశ్రయించి పుట్టు విజ్ఞానము మనోవిజ్ఞానము. ఇది శరీరముగను మందిరాదులుగను భాసించును.

తధత :- పైన చెప్పిన ఆలయ-వ్యక్తి విజ్ఞానములకంటె పరమునం దున్నది. దీనిని "తధత" అనియును "తథతా" అనియును అందురు. అది ఇట్టిది అట్టిది- అని చెప్పుటకు సాధ్యము కానిది. పరమ సత్యము. అది భావాభావములు కానిది. జ్ఞానాజ్ఞానములు కానిది. సదసత్తులు కానిది. పవిత్రతాపవిత్రతలు కానిది. జనన మరణములు లేనిది. పెరుగుట తరుగుట లేనిది. చలనము లేనిది. యోగాచారుల పరమతత్త్వ మిది. ఇది "జీవత్వము, లేక అభావ లక్షణములతో కలిగినప్పుడు తధతనే ఆలయ విజ్ఞాన మందురు."అనగా 'తధత'ను చిత్తుగా భావించినపుడే ఆలయ విజ్ఞాన మగును. అందువలన 'తధత' శూన్యము కాదు.

(20) మాధ్యమికులు (శూన్యవాదులు)

మాధ్యమికము (శూన్యవాదము) - ఈ సిద్ధాంత ప్రతిష్ఠాపకులు నాగార్జునాచార్యులు.* ఇది నాగార్జునునకు పూర్వమే యుండినను దీనికి పూర్ణరూపము నిచ్చి పోషించి నందున నీ శాఖను నాగార్జునుడే ప్రతిష్ఠించెనని ప్రసిద్ధి. వీరు క్రీ. శ. 175 ప్రాంతమున నుండినట్లు చెప్పుదురు. వీరు అజాతవాదులు అనగా :- ప్రపంచముగాని,

---

* ఈ నాగార్జునుని కాలమును గణించి పండితులయందు భిన్నాభిప్రాయము లున్నవి. శాతవాహనరాజవంశమునకు చెందిన రాజులలో విఖ్యాతుడగు గౌతమీ పుత్ర యజ్ఞ శ్రీ శాతకర్ణి యితనికి మిత్రుడట. నాగార్జునాచార్యులు యజ్ఞశ్రీ శాతకర్ణికి "సుహృల్లేఖ" అను నొక లేఖను వ్రాసి పంపెనట. యజ్ఞశ్రీ, శాతకర్ణి క్రీ. శ. 170-203 మధ్యకాలమున నుండిన వాడందురు. ఆ విధముగా చూచిన ఆచార్యుడును ఆకాలమువాడే ననుట నిశ్చయము. ఈ ఆచార్యుడును కనిష్కుడును సమకాలికు లందురు.

ఏపదార్థముగాని, తనకు తానైగాని, మఱియొకరి వలన గాని, ఉభయతః గాని, అనుభయతః గాని పుట్టినది కాదు. ఈ మార్గీయులు సమస్తదర్శనముల యందును లోపమును చూపి విమర్శింతురు.

'మాధ్యమికులు' అను పదము మధ్యమమార్గము ననుసరించువారని అర్థము సూచించును. బుద్ధభగవానుడును తమ మార్గము మధ్యమమార్గ మనియే చెప్పిరి. మధ్యమమార్గ మనగా :- కఠోరతపమును, భోగలాల సత్వమును వదలి మధ్యమమార్గమున జీవితము గడపుట. తత్త్వవిచారము నందు అతివాదమును మూఢవిశ్వాసములను విడనాడి మధ్యమమార్గ మవలంబించుట. మాధ్యమికులు జీవుని అస్తిత్వ విషయమున శాశ్వతమగు జీవుడు కలడను శాశ్వతవాదమును (doctrine of eternality) గాక, జీవుడు మరణముతో పూర్తిగా విచ్ఛిన్నమగును అను ఉచ్ఛేదవాదమును (doctrine of annihilation) గాక, ఆత్మ కలదు, ఆత్మ లేదు అను వాదములకు మధ్యమమార్గమున నడిచిరి. ఎట్లనగా:- స్కంధ సంతానమగు జ్ఞప్తిమాత్ర జీవుడున్నాడు. స్కంధ వ్యతిరిక్తమగు సత్పదార్థము (జీవుడు) లేడు అని చెప్పుదురు. వీరి మతము ననుసరించి జీవుడు కలడనినను, లేడనినను రెండును తప్పే. ఇదియే మధ్యమ మార్గము. దీని 'కుమార మాతులుడు' 'బుద్ధబోధ వ్యాఘ్రపోతాపహారము' వలె నున్నదని చెప్పిరట. దీని అర్థ మేమనగా :- వ్యాఘ్రము తన పిల్లను ఒకచోటనుండి మఱియొక చోటునకు చేర్చుటకు దానిని పండ్లతో గట్టిగా పట్టుకొనదు. క్రింద పడిపోవునట్లు పట్టుకొనదు. మధ్యమ పద్ధతిగా పట్టుకొనును- పులివలెనే పిల్లియు తన పిల్లల విషయమున నిట్లే ప్రవర్తించును.

మధ్యమమార్గమని చెప్పుటకు కారణము మాధ్యమికు లీ విధముగను చెప్పుదురు. జగత్తు సంపూర్ణ సత్యమును కాదు. సంపూర్ణముగ అసత్యమును గాదు. ఏలయన? ప్రపంచమున వస్తువు లున్నవి, కాని అవి స్వయంస్థితి కలవి కావు. నిత్యమును పరివర్తనము చెందుచున్నవి. అవి పుట్టుట లేదు. గిట్టుటయు లేదు. ప్రతీత్య సముత్పాదమే యున్నది. ప్రతీత్య సముచ్ఛేదమే యున్నది. వాటిస్థితియు నిత్య పరివర్తన శీలమే. పరివర్తనము చెందని వస్తువులు జగత్తున లేనందున జగత్తు శూన్యమని వీరందురు.

ఇచ్చట శూన్యమనగా శుద్ధ శూన్యము కాదు. మనక చీకటిలో భ్రాంతి వశమున రజ్జువునందు తోచిన సర్పమువంటిది కాదు. ఏలయన? వస్తువులు కనబడుట మాత్రమేగాక వాటి ఫలముల నిచ్చుచున్నవి.

వీరు ముఖ్యముగా అలాత భ్రమణ దృష్టాంతము నుపయోగింతురు.* చీకటిలో కొఱవికట్టెను గిరగిర త్రిప్పినను, లేక, ఒక కఱ్ఱకు రెండువైపుల నూనెతో తడిపిన గుడ్డలను చుట్టి నిప్పంటించి కఱ్ఱ మధ్యభాగమును పట్టుకొని కఱ్ఱను గిరగిర త్రిప్పినను, దూరమునుండి చూచువారలకు అది సూర్యబింబ మనియో, చక్రాకారముగ నున్న అగ్నియనియో - భ్రమ కలుగునట్లు నిత్యము క్షణక్షణము మారుచున్న ధర్మముల యొక్క సముదాయమును చూచి అది స్థితి గల వస్తువని, లేక స్థితిగల జగత్తని, లేక వ్యక్తియని అజ్ఞానులు భ్రాంతి చెందుచున్నారు. ఈ భ్రాంతికి కారణము అవిద్య యందురు.

వీరిని శూన్యవాదు లనుటకు కారణ మేమనగా : విజ్ఞానవాదులు సమస్త ప్రపంచమును అసత్తని త్రోసివేసి ఒక్క విజ్ఞానము మాత్రమే సత్తని నిరూపించిరి. అట్టి విజ్ఞానము సహితము క్షణికమే యగుటచే విజ్ఞానము సహితము లేనిదే యని వీరు త్రోసివేసిరి. ఈ వాదమును ఈ విధముగ వీరు సమర్థింతురు.

జ్ఞాత లేని జ్ఞేయముగాని, జ్ఞేయము లేని జ్ఞాతగాని ఉండుటకు వీలులేదు. ఉన్నవన్నచో విషయి విషయములు రెండును కలవని చెప్పవలెను. అందులోనే ఒకటి లేదనినను రెండవదికూడ లేనిదే యనుట మన యనుభవమే తెలియ జేయుచున్నది.

ఏకారణములను చెప్పి యెట్టి తర్కమును ఉపయోగించి విజ్ఞానవాదులు విజ్ఞానమే సర్వము నని విజ్ఞానేతరమైన సమస్తమును

* ఈ అలాత భ్రమణ దృష్టాంతమును, గౌడ పాదాచార్యులవారు మాండూక్యోపనిషత్తునకు వ్రాసిన 'కారికల'యందు నాలుగవ ప్రకరణమునకు 'అలాత శాంతి ప్రకరణమని' నామకరణ మిడిరి. శ్రీ శంకరులవారు అపరోక్షానుభూతియందు అలాత భ్రమణ దృష్టాంతము నుదాహరించిరి.

మిథ్య యని సౌత్రాంతికులకు చెప్పిరో, అట్టి తర్కమునే ఉపయోగించి మాధ్యమికులు విజ్ఞానవాదులకు విజ్ఞానము సహితము శూన్యమే యని చెప్పిరి. దానితో సర్వము శూన్యమే యని సారాంశము. అందువలన వీరిని సర్వవైనాశికులని పిలుతురట. బుద్ధ భగవానునిచే పేర్కొనబడిన దుఃఖచతుష్టయమును, నిర్వాణమును, సహితము అసత్యములే.

ఈ వాదముచే వారు స్థాపించిన దేమన :- జనన మరణములు, నిత్యానిత్యములు, ఏకాత్మ్యానేకత్వములు, రాకడపోకడలు మొదలగున వేవియు సత్యములు కావు. అన్నియు నసత్యములే. పారమార్థికమైన సత్య మొక్కటియు లేదు. కనబడు జగత్సంబంధమగు సమస్త దృశ్యమును గుణముల యొక్క భావపరంపరయే. పరస్పరాధార భూతములగు కార్యకారణ జాతమంతయు జగత్కల్పనము చేయుటచే వ్యావహారిక జగత్తు కలదను భ్రాంతి కలుగుచున్నది. సర్వము శూన్యమునుండియే వచ్చినది. సర్వమును శూన్యమునందే చేరును. కనుక సర్వమును శూన్యమే యందురు. దీనిని అసత్ఖ్యాతి యందురు.

జిజ్ఞాసువు :- జననమరణములు నిర్వాణము శూన్యమైనచో బౌద్ధమతముతో అవసరమేమి? బోధి నార్జింపవలెనను ప్రయత్నమేల? శూన్యమనగా దాని అర్థమేమి?

వేదాంతి :- ఇచ్చట అసత్య, మిథ్యా, భ్రాంతి శబ్దములు ఒక దాని కొకటి పర్యాయ పదములు కావు. మూడును భిన్నార్థములను తెలుపును. అసత్యమైనది మిథ్యగాని, భ్రాంతిగాని కానక్కరలేదు. అట్లే అభావ, శూన్యశబ్దములు సహితము ఒకప్పుడు భిన్నభావములను తెలియజేయును. శూన్య మనగా :- మాధ్యమికుల దృష్టిలో శుద్ధ శూన్యము కాదు. సమస్తమును పరివర్తన శీలము గలవై నిలకడలేని వైనందున సర్వమును శూన్యమే యనిరి. "శూన్యము కలదు." అనిన అది శుద్ధ శూన్యము కాదు. ఏలయన శూన్యము కలదు "కలదు" అనునది కలిమి గలదే గదా? "శూన్యము కలదు." అన్నటో శూన్య మెట్లగును? కలిమి (అస్తి) యే, లేమి (నాస్తి) యెట్లగును? కలిమిని శూన్యమున రాదు.

లోనిది యెన్నడును లేనిదే. కాన, బుద్ధ భగవానుడు చెప్పిన శూన్యమునే మాధ్యమికులు నిర్వాణమని చెప్పిరి. ఉపనిషత్తులు చెప్పిన నిర్వి శేష బ్రహ్మస్వరూప నిర్వచనమును నిర్వాణ స్వరూప నిర్వచనమును ఒకేవిధముగా నున్నవి. కాని నిర్గుణ బ్రహ్మము, ప్రజ్ఞానఘనము, ఆనందస్వరూపము.

బుద్ధ భగవానుడు చెప్పిన శూన్యము వ్యావహారిక జగత్సంబంధమైన శుద్ధ అభావము కాదు. వారు చెప్పిన శూన్యము ఉపనిషత్తులయందు చెప్పబడిన నిర్గుణబ్రహ్మముతో సరిపోవునా? ఒకబౌద్ధ గ్రంథమునుండి డాక్టర్ రాధాకృష్ణ పండితులు బుద్ధభగవానుని ఈ క్రింది వాక్యముల నుదాహరించిరి.

"ఓ యతులారా! అది భూజల సంబంధము గాదు; అనంతాకాశ విజ్ఞాన సంబంధమును గాదు; శూన్యమును గాదు : దర్శనమును గాదు; ఇహలోకమును గాదు; పరలోకమును గాదు, సూర్యుడును గాదు; చంద్రుడును గాదు"; "అచట మృతిగాని, పుట్టుక కాని లేదు; ఇహపరము లచట లేవు, మధ్యమ లోకమును లేదు; అది దుఃఖ నాశనము", "అది శూన్యము కాదు, అది జన్మము లేనిది: ఆది లేనిది; అకృతము అమిశ్రితము; అట్టిదే లేనిచో జన్మము నుండియు విముక్తి లేదు." (భా. త. 11-అ. పుట. 128)

కనుక నీ వడిగిన ప్రశ్నకు సమాధానము లభించిన దనుకొందును. ఉపనిషత్తులు 'నేతి' 'నేతి' అని చెప్పిన నిషేధపద్ధతినే బుద్ధ భగవానుడును, నాగార్జునాచార్యులును అనుసరించిరి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు అనేక బౌద్ధగ్రంథముల పరిశీలించి నాగార్జునాచార్యుల శూన్యము (నిర్వాణము) కూడ బుద్ధభగవానుడు పైన చెప్పిన శూన్యము వంటిదేనని బౌద్ధగ్రంథముల నుదాహరించుచు చెప్పిన వాక్యము లివి:-

"నిర్వాణ స్వరూపమును గూర్చి యుపదేశించుటే మాధ్యమిక శాస్త్రప్రయోజనము", ప్రపంచభావము నశించిన యానంద స్వరూపమే నిర్వాణము. వస్తుప్రపంచ శూన్యతను గుర్తించుటే నిర్వాణము, అదియే

పరమ సత్యము. నిర్వాణమును, శూన్యతయు "నేతి" "నేతి" వాక్యములలోనే చెప్పఁ బడెను. నిర్వాణము భావము కాదు. అభావమును గాదు; రెంటికి నతీతమైనది. 'శతక' మను సుప్రసిద్ధ గ్రంథమునందు శూన్యతయే నిర్వాణమని చెప్పఁబడెను, శూన్యతయే సత్యము. "లేక వృద్ధిక్షీణతలు లేని తథత"... (భా. త. 11-అ. పుట. 147)

"పరమసత్యము, అజము, అవినాశము, అనిత్యము, నిత్యము నని యాతడు వర్ణించుటవలన, సత్పదార్థము వ్యావహారిక లక్షణము లన్నింటికిని వ్యతిరేక మైనదని యాతని భావము. ఉపనిషత్తులు, నిర్గుణబ్రహ్మ వర్ణనమున కుపయోగించిన యీ శబ్దములనే శూన్యతా వర్ణనమునకు నాగార్జునుఁడు ఉయోగించెను." (భా. త. ఏకాదశాధ్యాయము. బౌద్ధమత శాఖలు, పుటలు, 148-149)

(21) బౌద్ధశాఖల పునఃపరిశీలనము

ఇప్పు డొకసారి బౌద్ధమతమునందలి నాలుగు శాఖలను సింహావలోకనము చేసిన సంగ్రహముగ వాటిస్వరూప మిట్లుండును. సర్వాస్తివాదులలో నొకరగు వైభాషికులు బాహ్యప్రపంచమును దానిని గుర్తెరుగు మానసిక ప్రపంచమును, ఈ రెండింటియొక్క స్థితిని గుర్తించుటచే బౌద్ధ మతము ద్వైతముతో ఆరంభమైనది. సౌత్రాంతికులు ద్వైతమును కొంత అంగీకరించియు కొంత వదలిరి. జగదస్తిత్వమును అంగీకరించి అంతరంగము బాహ్యజగత్తుపై ఆధారపడినదని అని నందున అది కొంతవఱకు ద్వైతాద్వైతముల కలయికగ రూపొందించిరి. యోగాచారుల మతము అద్వైతమే. సారాంశ మేమన :- ఇది వ్యక్తి విజ్ఞానము. బాహ్యమున విషయములు లేవు. విజ్ఞానమే మందిరాది విషయరూపమున విజ్ఞానమునకే తెలియబడుచున్నది. ఈ విజ్ఞానము (వ్యక్తి విజ్ఞానము) ఆలయవిజ్ఞానము నందలి అంశమే. కనుక వారి విజ్ఞానము సత్య మయినదని వారు చెప్పినను అది నిరంతరము మార్పు చెందుచుండుటవలన సత్యము కాజాలదు. ఇక విజ్ఞానమునకంటె పరమునందున్నది.

వారి 'తథత'. ఆ 'తథత'యే సత్యమని మన మూహింపవచ్చును. కాని అదియును సరియగు నిర్ణయము కాజాలదు. తథత ఆలయ విజ్ఞానముగా రూపొందునట. అట్లే యయిన తథతకు వికారము సంభవించును. వికారము గలది సత్యము కాజాలదని అందఱు నెఱిగినదే. ఏమైనను విజ్ఞానవాదము ఒక విధమగు అద్వైతమే. శ్రీవిద్యయందు- "పరబ్రహ్మమునందు ఆయనను విడిచియుండని విమర్శరూప శక్తి కార్యార్థమై ఆయనయందుండి సదసదాత్మకమగు విశ్వాకృతిని ధరించినదని" చెప్పినప్పుడు శ్రీవిద్య అద్వైతమనియే కదా పెద్ద లంగీకరించిరి. తథతకు సంబంధించిన ఆలయ విజ్ఞానమే సదసదాత్మక ప్రపంచరూపమున ఉన్న దనిన ఇది అద్వైతమేల కాదు? కాని యిచట సమస్తము క్షణికమే యను వాదము క్షమించరాని తప్పు.

మాధ్యమికులు విజ్ఞానముకూడ నశించు ననిరి. వారు శూన్యము లేక నిర్వాణము మాత్రమే సత్య మనిరి. ఇది గౌడపాదాచార్యులవారి అద్వైతము, అజాతవాదము.

ఈ విధముగ బౌద్ధతత్త్వమునందు ద్వైతాద్వైతాది సిద్ధాంతములు అంతర్భాగములై యున్నవని మన మూహించుట తప్పుగాదు. దీనినే సంగ్రహించి చెప్పెదను :-

వైభాషిక మతమున జ్ఞత, జ్ఞానము, జ్ఞేయము, అను త్రిపుటిసత్యమే సౌత్రాంతిక మతమున జ్ఞాత, జ్ఞానము మాత్రమే సత్యము, జ్ఞేయము అనుమాన ప్రమాణముచే ఊహింప దగినదే. విజ్ఞానవాదము (యోగాచారము) న జ్ఞాత ఒక్కడే సత్యము. జ్ఞాన జ్ఞేయములు రెండును అసత్యములే. మాధ్యమికులు (శూన్యవాదమున) సమస్తమును శూన్యమే.

వజ్రయానమను శాఖ నాగార్జునుని తరువాత సుమారు ఐదారు శతాబ్దములకు పుట్టినట్లు చెప్పుదురు. శాక్తమున పూర్వకౌలులు, ఉత్తరకౌలులు - అను రెండు శాఖలున్నట్లే వీరియందును దక్షిణహస్తశాఖ, ఉత్తరహస్తశాఖలని రెండు శాఖలున్నవి.

వజ్రమనగా :- పిడుగు లేక యింద్రుని ఆయుధము అని సామాన్యార్థము. ఈ మార్గమున వైదికశక్తియని ఒక అర్థము. పురుషుని లింగమని వేఱొక యర్థము. ఈ రెండర్థముల వలన భిన్నముగా పై రెండు శాఖ లేర్పడినవి. వామహస్త శాఖ, ఉత్తరకౌలము వంటిది. ఇది వామాచారము, దీనివలన బౌద్ధమతము దాని ప్రతిష్ఠను కోల్పోయినది.

(22) బౌద్ధము భారతదేశమున క్షీణించుటకు కారణము

జిజ్ఞాసువు :- ఉపనిషన్మతముతో బౌద్ధ మతమునకు ఇంతదగ్గర సంబంధ మున్నది కదా? దీనిని నాస్తిక మత మనుటకును, ఈ మతము అవైదిక మనుటకును కారణ మేమి? బౌద్ధమతము మన దేశమున క్షీణించుటకు కారణమేమి?

వేదాంతి :- దేవుడు లేడను మతము లన్నియు నాస్తిక మతములు కావు. వైశేషికులు, సాంఖ్యులు, పూర్వమీమాంసకులు తొలుత ఈశ్వరాస్తిత్వము నంగీకరింపలేదు. అయినను వాటిని అవైదికములుగా భావింపలేదు. కారణమేమన వారు హిందు సంఘమునందు మార్పులు చేయదలపెట్ట లేదు. వారు కేవల తాత్త్విక సిద్ధాంతములయందే వారి కృషిని కేంద్రీకరించిరి. మనకు సాంఘిక స్వాతంత్ర్యము లేదు. సంఘనిబంధనలకు లోబడి తత్త్వ (మత) చింతనమునందు ఏ మార్గము ననుసరించినను సంఘము వానిని బహిష్కరింపదు. ఇటీవల కొంతకాలము వఱకు వేశ్య నుంచుకొన్న బ్రాహ్మణుడు సంఘబహిష్కృతుడు కాడు. ఆమె చేతి అన్న పానములు స్వీకరించిన వాడు సంఘబహిష్కృతుడు. భగవదనుగ్రహమున నప్పుడట్టి కఠిన నిబంధనలు సడలినవి.

బుద్ధభగవానుడు సంఘమును సంస్కరించెను. అనగా :- కుల తత్త్వములను నిరసించిరి. బ్రాహ్మణాది అగ్రవర్ణముల వారిచే అతి నీచముగా చూడబడుచుండిన హరిజనులను శిష్యులుగా చేర్చుకొనుటయే గాక వారి చేతి అన్న పానములు స్వీకరించుటకు బౌద్ధులకు అనుమతి నిచ్చిరి. హరిజనులలో యోగ్యులగు వారిని బ్రాహ్మణులతో సమానముగ చూచిరి. ఆ కారణమున బ్రాహ్మణాధిక్యము గల హిందూసంఘము

బుద్ధభగవానుని తమ సంఘద్రోహిగా భావించిరి. బ్రాహ్మణులు కొందఱీ మతమును స్వీకరించుటచే బౌద్ధులు బ్రాహ్మణుల దురాగ్రహమునకు గురియైరి. బుద్ధభగవానుడు మతమును, సాంఘికాచారములను వేఱు వేఱని తెలియక రెండును మతముగనే పొరబడుట వలనను, వర్ణవ్యవస్థను మతమునుండి వేఱుచేయుటకు వీలులేదని భావించి యుండుట వలనను, తమ మతము ప్రత్యేకమని చెప్పిరని శ్రీ వివేకానందస్వాములవారు అభిప్రాయపడిరి. శ్రీ స్వాముల వారిట్లు చెప్పిరి :-

"బుద్ధుడు మొదలు రామమోహనరాయ్ వఱకు ప్రతివాడును కులము, మత వ్యవస్థ యని పొరపడి మతమును కులమును చేర్చి ఆ మొత్తమును ధ్వంసమొనర్ప యత్నించి విఫలులైరి. కాని మతాచార్యులు ఎంత పలవరించినను, కులము కరుడు గట్టిన సాంఘిక వ్యవస్థయే."*

బౌద్ధ మతము దాని పుట్టినిల్లయిన భారతదేశమున క్షీణించుటకును, ఇతర దేశములయందు వ్యాపించి యిప్పటికి సజీవముతో నుండుటకును కారణమేమను ప్రశ్నకు పండితులు చరిత్రకారులు అనేకులు అనేక కారణములను చెప్పియున్నారు. అందులో నీ క్రింది కారణములే ముఖ్యమైనవని అనేకుల అభిప్రాయము.

(1) "మౌర్యులకు తరువాత మగధను పాలించిన శుంగవంశజులు, కాణ్వవంశజులు బౌద్ధులను హింసించడమువల్ల దేరవాదులు సింహళ గాంధారములకూ, మహా సాంఘికులు తెనుగుదేశానికి వలసపోయినారు. మౌర్యసామ్రాజ్యము పతనమైన తరువాత హిందూదేశంలో బౌద్ధానికి ఆంధ్రదేశమే కేంద్రమయింది." (శ్రీ మల్లపల్లి - సోమశేఖర శర్మ గారి వ్యాసం నుండి.)

(2) అదిగాక విదేశీయులగు శక, యవన, హూణాది జాతులు భారతదేశముపై దండెత్తి వచ్చి మన దేశమునందలి రాజులను కొందఱిని

---

* 'కులము, సంస్కృతి, సామ్యవాదము' అను స్వాములవారి ఉపన్యాసము నుండి.

జయించి వారి రాజ్యములను పాలింపదొడగిరి. కాని ప్రజాదరణ లేనిదే స్థిరముగా ఇచ్చట రాజ్యపాలనము చేయజాలమని వారు హిందూ సమాజమున అత్యున్నత స్థానము నందున్న బ్రాహ్మణులలో కొందఱిని తమ దగ్గరకు చేర్చుకొని వారికి గొప్ప పదవులను ఇచ్చి గౌరవించిరి. బౌద్ధమత ద్వేషులగు ఆ బ్రాహ్మణులు ఆ అదను చూచుకొని శకాది జాతులను హిందూమతములో కలుపుకొని, ఆ నృపతులను సూర్య చంద్రాన్వయు లగు సుక్షత్రియులని ప్రచారము చేసిరి. ఈ విధముగా బ్రాహ్మణులు బలవంతులగు విదేశీయులను తమ కనుకూలురనుగా చేసికొని బౌద్ధులపైకి వారిని పురికొల్పిరి. బౌద్ధులు నాస్తికులనియు, భగవద్ద్వేషు లనియు వారికి బోధించిరి. మానవ కారుణ్యతాభావ మెఱుగని విదేశీయ కఠిన జాతులు బౌద్ధులను చిత్రహింసల పాలుచేసిరి. ఆ బాధలను భరింపజాలక బౌద్ధభిక్షువులు బౌద్ధగ్రంథములను గైకొని సింహళము (శ్రీలంక), టిబెట్ మొదలగు దేశములకు పారిపోయిరి. పారిపోక నిలిచిన వారిలో అనేకులు మృత్యువువాత పడిరి- పిమ్మట ముస్లిములవలన హిందువులు తమ పాపఫలములను అనుభవించిరి.

(3) మునల్ మానులు ఈ దేశమును పాలించినప్పుడు సయితము "బౌద్ధులు నాస్తికులని" హిందువులు ముసల్మానులను "బౌద్ధులపైకి పురికొల్పిరి. బౌద్ధభిక్షువులను హిందూసన్న్యాసులనుండి వేఱుచేసి తెలిసికొనుట సులభము కనుక, కనబడిన భిక్షువులనెల్ల ముసల్మానులు వధించిరట. విదేశీయ ప్రభువులు బౌద్ధులకు బయటి శత్రువులు. హిందువులు ఇంటిలోని శత్రువులు. వీరిరువురి మధ్య బౌద్ధులు నశించిరి.

(4) బౌద్ధమతము క్షీణావస్థకు వచ్చునప్పటికి దాని తొల్లింటి స్వరూపమే మారిపోయి హిందూ మతముతో సారూప్యము కలుగుట వలన బౌద్ధ మతమునందు క్రొత్త యేమియు లేకపోయినది.

(5) హీనయానము నుండి మహాయాన శాఖ పుట్టినట్లే, మహాయానము నుండి వజ్రయాన మను శాఖ యేర్పడి హిందూమతమునం దిదివఱకే ప్రచారమునందున్న మంత్ర తంత్రములును, క్షుద్రదేవతోపాసనలును,

వామాచారమను పేర బౌద్ధసన్న్యాసులు, సన్న్యాసినులును కామ దాసులగుటయు ఒక కారణము. ఇట్లు ముఖ్యమగు ఈ అయిదు కారణముల వలన బౌద్ధమతము ఈ దేశమున క్షీణించినది.

బౌద్ధమతమునకు క్షీణ దశ ప్రారంభించిన కాలము నాటి బౌద్ధ మతమునకును, బుద్ధ భగవానుడు తొలుత బోధించిన బౌద్ధమతమునకును ఏదో స్వల్ప పోలిక కలదే గాని రెండింటికి స్వరూపములు భిన్నమైనవి. బౌద్ధమతము వ్యాపించిన యితర దేశము లం దిట్టి పరిస్థితులు లేనందున ఆ దేశములయందు బౌద్ధమతము శాశ్వతముగ నిలిచియున్నది.

దేశమున సుమారు వెయ్యి సంవత్సరములు వర్ధిల్లిన బౌద్ధమతము ఈ దేశమున సంపూర్ణముగ నశించిన దనిన అది పూర్తిగ నమ్మదగిన విషయము కాదు. అట్టిది అసంభవము. అది యేదో కొంత పేరు మార్చుకొనియో, తత్త్వమునందు కొలది మార్పు కల్పించు కొనియో, అజ్ఞాతవాసము చేయుచుండునే గాని పూర్తిగా నిర్మూలనము కాదు. భారత దేశమునందలి వివిధ ప్రాంతములలో భౌద్ధము వివిధమార్పులతో నిలిచి యుండవచ్చును.

ఆంధ్రప్రదేశమునందు విజ్ఞాన, మాధ్యమిక శాఖలు స్థిరముగా కొన్ని శతాబ్దములు నిలిచి యుండినందున ఆ శాఖలనుండి కొన్ని అంశములు గైకొని బౌద్ధము నవీన వేదాంతముగా రూపొందినది. అట్టి మార్పు ఎప్పటి నుండి అరంభమైనదో చక్కగా చెప్పుట కష్టమే. అనగా - బౌద్ధము పేరు మార్చుకొని తత్త్వమునందు ముఖ్య లక్షణమగు క్షణికవాదమును వదలి వేదాంత వేషమును ధరించినది. అట్లు మారువేషముతో మార్పుతో ఉన్న వాటియందు శ్రీరామడుగు శివరామ దీక్షితుల వారి 'అచలబోధ' 'అచలవేదాంతము' అనున దొకటియని నా యభిప్రాయము. అచలమత మెట్టిదో ముందు వివరింతును.* ఆంధ్రమున బౌద్ధమతము ఎంత విస్తరించి యుండెనో తెలియుటకు ఇప్పటికిని

---

* ఈ గ్రంథముయొక్క నాలుగవ భాగమున అచల మతమును వివరింతును.

ఆంధ్రులయందు 'బొజ్జమ్మ' బుజ్జమ్మ 'బొజ్జయ్య' మొదలగు పేర్లు గల వ్యక్తులు కలరు. ఇవి బుద్ధశబ్దముయొక్క వికృతులే నని పండితులు చెప్పుదురు.

(23) బౌద్ధమత విమర్శనము

బౌద్ధమతమును బాదరాయణాచార్యుల వారు బ్రహ్మ సూత్రముల ద్వితీయాధ్యాయ ద్వితీయ పాదము నందలి 4-5అధికరణముల యందు (18మొదలు 32 సూత్రముల వఱకు) 15సూత్రములచేత ఖండించిరి. శ్రీ శంకరులు ఆ సూత్రములకు విపులమగు భాష్యమును వ్రాసి బౌద్ధమతమును నిశితముగ ఖండించిరి. బౌద్ధ మతమును చక్కగా పరిశీలించిన మన దేశమందలి అధునాతన పండితులును పాశ్చాత్య పండితులును బౌద్ధమతము బుద్ధదేవుని అనంతరము వైభాషిక, సౌత్రాంతిక, యోగాచార, మాధ్యమిక శాఖలుగ భిన్నభిన్న కాలముల యందు ఆయాసందర్భముల బట్టి వెలసినవని వ్రాసిరి. వారు వ్రాసిన విధము ననుసరించి వెనుక నేను వివరించితిని.

సూత్రకారులు, భాష్యకారులు బౌద్ధమతశాఖల ఉత్పత్తిని పై విధముగా చెప్పక బుద్ధుడే తన మతమును శిష్యుల యోగ్యత ననుసరించి వారివారి అభిరుచులకు అనుగుణముగ నాలుగు విధముల ఉపదేశించెనని వ్రాసిరి. శ్రీ శంకరులు బౌద్ధమత విమర్శకు తీసికొన్న క్రమముకూడ నేను చెప్పిన క్రమము ననుసరించి గాక యోగాచార, సౌత్రాంతిక, వైభాషికులను వరుసక్రమమును గైకొనిరి.

మఱియు ఆయా శాఖలవారి కాయా నామములు కలుగుటకు హేతువులు వేఱు విధముగా పేర్కొనిరి. ఇట్లు చెప్పుటకు కారణము - బౌద్ధమతము పుట్టినకాలమును, దానియందు కాలక్రమమున కలిగిన మార్పులును ఈ కాలము నందలి బౌద్ధమత పరిశీలనము చేసిన పండితులకు తెలిసినంతగా విపులముగ పూర్వము శ్రీ బాదరాయణ, శ్రీ శంకరులవారికి తెలియదు. శ్రీశంకరులవారి కాలమునకు బౌద్ధమత గ్రంథములు హిందువులచే నాశనము చేయబడియుండెను. అనేక

ముఖ్యగ్రంథములు టిబెట్, సింహళము (శ్రీలంక) మొదలగు దేశముల యందుండెను. ఆ కారణమున శ్రీశంకరులవారికి సరియైన చరిత్రను తెలిసికొనుటకు తగిన ఆధారములు లేకపోయెను. అట్లగుటచే బౌద్ధమతశాఖలు నాలుగును ఒక్క సమయముననే బుద్ధభగవానుని చేతనే ఉపదేశింపబడెనని అభిప్రాయపడిరి.

శ్రీ బాదరాయణుల బ్రహ్మసూత్ర రచనకాలము నాటికి మాధ్యమిక శాఖ విస్తరించి యున్నట్లు కనబడదు. శ్రీ శంకరుల కాలము నాటికి చతుర్విధ బౌద్ధశాఖలు విస్తరించియుండినవి. శ్రీ శంకరులు వారి భాష్యమున బౌద్ధమతమును ఎట్లు ఖండించిరో యీ క్రింద సంగ్రహముగ తెలిపెదను.

బ్ర.సూ. 2-2-18వ సూత్రభాష్యముయొక్క సారాంశము :- చిత్తచైత్తములును స్కంధ హేతుకమైన పంచస్కంధీరూపమగు సముదాయమును అపేక్షించిన ఈ మతమునందు సర్గాదియందు ఇట్టి సముదాయ ముండుటకు వీలులేదు. ఏలయన ? సముదాయము లన్నియు జడము లగుటవలన (అచేతనము లగుటవలన)ను, దేహము జన్మింపగా విజ్ఞానమును, విజ్ఞానము జన్మింపగా దేహాది సముదాయమును కలుగునని చెప్పుటచేతను, ఇచ్చట అన్యోన్యాశ్రయ దోషము సంభవించును. క్షణిక జ్ఞానముకంటె వేఱగు జీవుడుగాని, యీశ్వరుడు గాని, స్థిరుడైన సంఘాత కర్తగాని బౌద్ధమతమున చెప్పబడి యుండనందునను, కర్త లేక, అణ్వాదులు స్వభావముచేతనే ప్రవర్తిల్లిన వనిన కారణమువలనను, నిరంతరము ప్రవృత్తి సాగుచునే యుండవలెను. అందువలన మోక్షము (ముక్తి) ఎప్పటికిని కలుగుటకు వీలులేదు. కనుక ఈ మతము యుక్తమైనది కాదనిరి.

బ్ర. సూ. 2-2-19వ సూత్రభాష్యముయొక్క సారాంశము :- బౌద్ధుల ప్రతీత్య సముత్పాదమునందు అవిద్య మొదలు జరామరణముల వఱకును గల పండ్రెండును ఒకటి ప్రతిగమనము చేయగా మఱియొకటి పుట్టుచున్నదని చెప్పియుండిరి గదా? చేతనుని సహాయము లేకనే

సంఘాతము సిద్ధింపదు. సంఘాతము నాశ్రయించి పుట్టుచుండు అవిద్యాదులు సంఘాతమునకు నిమిత్తకారణము కాజాలవు. అనాదియగు నీ సంసారమునందు సంఘాతములే యెడతెగక ఒక దాని నుండి మఱియొకటి పుట్టుచున్నవని, అవిద్యాదులు దాని నాశ్రయించి యున్నవని తలచిన ఒక సంఘాతమునుండి వేఱొక సంఘాతము పుట్టినదని అంగీకరించి నట్లగును. అట్లంగీకరించిన పక్షమున (1) ఒక సంఘాతము అన్నివిధముల తనతో సమానమగు మరియొక సంఘాతమును పుట్టించునా? లేక (2) పూర్వ సంఘాతమునకంటె భిన్నమగు సంఘాతమును పుట్టించునా? అను ప్రశ్నకు సమాధానము చెప్పవలసి యున్నది.

మొదట నియమము నంగీకరించిన, నియమముగ (నియతముగ) అనగా మనుష్యదేహమునకు మనుష్యదేహమే పుట్టవలెనుగాని, మరణానంతరము దేవతిర్యగ్యోని నారకదేహములు ప్రాప్తించక పోవలెను.- పునర్జన్మమున సహితము మానవదేహము మాత్రమే కలుగవలయును. రెండవ నియమ మంగీకరించిన క్షణికమగు మనుష్యశరీరము ఈ లోకముననే క్షణకాలమున గజశరీరముగ గాని దేవశరీరముగ గాని యై మరల మనుష్యశరీరము కావచ్చును. రెండును అసంభవములే.

స్థిరుడైన జీవుడు లేడు గనుక భోగము భోగార్థమును, మోక్షము మోక్షార్థమును అగునేగాని మనుష్యునిచే అపేక్షింపబడినది కాదు. అట్లు కాదు-భోగమోక్షములు మనుష్యులచే కోరబడినవియే అని చెప్పిన, అట్లు భోగమోక్షములు కోరినవారు క్షణములో నశింపగా భాగమోక్షము లనుభవించువారు వాటిని కోరినవారికంటె భిన్నులు కావలసివచ్చును. కనుక అవిద్యాదులు ఒక దాని యుత్పత్తికొకటి నిమిత్తములని చెప్పినను (దాని నంగీకరించినను) భోక్త్రాభావమువలన సంఘాతము సిద్ధింపదు.

బ్ర.సూ. 2-2-20వ సూత్రభాష్యముయొక్క సారాంశము :- అవిద్యాదులు వాటియందవి ఒక దాని యుత్పత్తికి మఱియొకటి హేతువులు కావు. ఎట్లన :- కార్యోత్పత్తికాలము నందే నశించు కారణము

వలన కార్యము పుట్టదు. పూర్వక్షణము అభావముచే గ్రసింపబడినది. (మ్రింగబడినది) కనుక దానికి కార్యమును పుట్టించు సామర్థ్యము లేదు. అందువలన హేతుఫల భావము సిద్ధింపదు. పూర్వక్షణమునకు (అనగా పూర్వమందున్న పరమాణువునకు) ఉత్తరక్షణమును (పుట్టబోవు పరమాణువును) పుట్టించుటకు సామర్థ్య ముండవలయు నన్న పూర్వక్షణమునకు ఉత్తరక్షణముతో సంబంధ ముండవలయును. పూర్వక్షణము క్షణిక మగుటచే దానికట్టి సామర్థ్యము లేదు. ఒక వేళ పూర్వక్షణము యొక్క స్థితిచేతనే (ఉనికి మాత్రముననే) ఉత్తరక్షణము ఉత్పత్తియగు ననుటకు వీలులేదు. ఏలయన, పూర్వక్షణస్వభావము ఉత్తరక్షణమునకు సంక్రమించుటకు సమయము లేదు. కారణ స్వభావము (పూర్వక్షణ స్వభావము) కార్యమునందు (ఉత్తరక్షణమునందు) సంక్రమించు ననిన కారణము కార్యముత్పత్తియగు వఱకు ఉండవలసివచ్చును. అట్లుండిన బౌద్ధుల క్షణికవాదమునకు భంగము వాటిల్లును.

బ్ర. సూ. 2-2-21వ సూత్రభాష్యముయొక్క సారాంశము :- కారణము లేకనే కార్యము పుట్టుననిన, ప్రతిబంధ మనునది లేకపోవలసి వచ్చును. అట్టి స్థితియందు అన్ని చోట్లను అన్నియు పుట్టవచ్చును. ఇది లోకానుభవమునకు విరుద్ధము. మట్టినుండి వస్త్రములు పుట్టవు కదా? ఇది గాక బౌద్ధులు రూపాదివిజ్ఞానమును, సుఖాదులును చతుర్విధ హేతువులచేత* పుట్టుచున్నవని చెప్పిన వచనమునకు వ్యాఘాతము కలుగును.

బ్ర. సూ. 2-2-22 వ సూత్ర భాష్యముయొక్క సారాంశము బౌద్ధులు ప్రతి సంఖ్యా నిరోధము, అప్రతి సంఖ్యానిరోధము ఆకాశము. ఈ

---

* "చతుర్విధాన్ హేతూన్ ప్రతీత్య చిత్తచైత్తా ఉత్పద్యంత ఇతీయం ప్రతిజ్ఞా హీయతే. - (బ్ర. సూ. 2-2-21)

చతుర్విధ హేతువులనగా :- 1. విషయ, 2. కరణ, 3. సహకార, 4. సంస్కారములు. దీని వివరము :- 1) రక్తవర్ణము అను జ్ఞానము మనకు కలుగుటకు రక్తవర్ణము గల వస్తువు విషయము. (2) ఆ రక్తవర్ణమును చూచు నేత్రేంద్రియము కరణము. (3) వెలుతురు నేత్రమునకు సహకారి. (4) పూర్వవిషయము సంస్కారము."

మూడును అభావములని చెప్పుదురు. భావములకు ఎడతెఱపి లేనికారణమున (పూర్వ పూర్వపరమాణువులు ఉత్తరోత్తర పరమాణువులను పుట్టించు చుండునట్టి నియమము గలదని చెప్పిన కారణమున) నిరన్వయమైన (ఆత్యంతికమైన) వినాశము సంభవింపదు, అనగా బౌద్ధమతమున సృష్టి ప్రళయములు కలుగునని చెప్పుట తప్పగును.

బ్ర. సూ. 2-2-23వ సూత్రభాష్యముయొక్క సారాంశము :- అవిద్య, ప్రతి సంఖ్యావిరోధము లోనిదని బౌద్ధుల వాదము. అవిద్య యమనియమాదులవల్ల నిరోధింప బడువేని ప్రతిది క్షణికమను మూలసిద్ధాంతమునకు భంగము వాటిల్లును. అవి నిర్హేతుకముగ నశించు ననిన అవిద్యా నాశనమునకై గురువులచే చేయబడు భావనోపదేశము (మార్గోపదేశము) అర్థము లేనిదగును.

సూ|| ఆకాశే చావిశేషాత్. (బ్ర. సూ. 2-2-24) అను సూత్రభాష్యము యొక్క సారాంశము :- బౌద్ధులు ఆకాశమును అభావ మనిన విషయమును చర్చించి బౌద్ధుల అభిప్రాయమును ఖండించిరి. ఎట్లనగా :- **"ఆకాశే - చ- అవిశేషాత్"** శ్రుతులు **"ఆత్మన ఆకాశ స్సంభూతః"** = ఆత్మవలన ఆకాశము కలిగినది అని చెప్పియున్నందున ఆకసము శూన్యము కాదని భావవస్తువని శ్రుతిప్రమాణము. అది యట్లుండ పృథివ్యాది భూతముల నాశ్రయించి గంధాది గుణము లుండుటవలన శబ్దమును బట్టి అనుమాన ప్రమాణముచే ఆకసమునకు వస్తుత్వము సిద్ధించును. అట్లుసిద్ధింపదనిన శబ్దము ఏవస్తువునకు గుణమో బౌద్ధులు నిరూపింపవలసి యున్నది.

మఱియు, ఆవరణాభావమే ఆకాశమని బౌద్ధు లనిరి. కాని, యొకచోట **"వాయురాకాశ సన్నిశ్రయః"** (వాయువు, ఆకాశ మాశ్రయముగా గలది) అని చెప్పియున్నారు గదా? ఆకాశము వస్తువు కాదేని వాయువునకు ఆశ్రయ మెట్లగును? మఱియొక విషయ మేమనగా - ఒక పక్షి ఆకాశమున సంచరించుచున్న దనిన ఆకాశము కుందేటి కొమ్మువంటి అభావ మైనచో దానియందు పక్షి యెట్లు సంచరించును? అదియును గాక వారు (బౌద్ధులు) నిరోధద్వయము ఆకసము - ఈ మూటి సముదాయము

తుచ్ఛము, అవస్తువు అని చెప్పిరి గదా? ధర్మ మనునది ధర్మిని (వస్తువును) ఆశ్రయించి యుండును. కనుక వస్తువు కాని దానికి నిత్యత్వము గాని (శాశ్వతముగా నుండుటగాని), అనిత్యత్వము (నశించుట) గాని సంభవింపదు. కనుక ఆకసమునకు ఘటాదులవలె వస్తుత్వము సిద్ధించును.

బ్ర.సూ. 2-2-25వ సూత్రభాష్యముయొక్క సారాంశము: ఆత్మ క్షణికమను బౌద్ధసిద్ధాంతము నిట్లు ఖండించిరి:- ఒకడు సంవత్సరము క్రిందట నే నీ గ్రంథమును చదివితిని (చూచితిని). ఇప్పుడు దీనిని చూచుచున్నాను అని పూర్వానుభవమును స్మరించుచున్నాడు. పూర్వము ఒకప్పుడు ఆ గ్రంథమును చూచినవాడును ఇప్పు డదే గ్రంథమును చూచినవాడును- ఇరువురు వేఱువేఱు ఆత్మలైనచో అట్టి స్మరణము అసంభవము. అనుస్మృతి అనగా :- అనుభవము ననుసరించి పుట్టు స్మరణయే. రెండింటికి కర్తలు వేఱైన, (నా) పూర్వుడు సంవత్సరము క్రిందట దీనిని చూచెను. నే నిప్పుడు దీనిని స్మరించుచున్నాను అను ప్రత్యభిజ్ఞ కలుగవలెను. వైనాశికుడు (బౌద్ధుడు) తాను పుట్టినది మొదలు ఇప్పటివరకును, వర్తమానమునుండి మరణపర్యంతమును తరువాతి తరువాతి ప్రతిపత్తుల నన్నింటికిని కర్త యొకడేనని గుర్తించుచు జన్మమాది యింతవఱకును జరిగిన ప్రతిపత్తుల నన్నింటిని నాత్మైక కర్తృకముగా ప్రతిసంధించుటకు ఏల లజ్జపడడు?

బ్ర. సూ. 2-2-26, 27వ సూత్ర భాష్యముల యొక్క సారాంశము :- అభావమునుండి భావము (లేమి నుండి కలిమి) కలుగునని చెప్పిన బౌద్ధమతమును ఇట్లు ఖండించిరి :- అభావమునుండి భావము కలుగునేని కుందేటికొమ్ము, గొడ్రాలికొడుకు - వీనినుండి అంకురములు కలుగవలెను. అట్లు కలుగుట లేదు. అభావమునుండి భావము కలిగిన అభావము కారణమును, భావము కార్యమును కావలెను. అట్లైన అభావమునకు భావత్వము సిద్ధించి అది అభావము కాకపోవును. అదిగాక అభావము భావవిశేషము కలదగుటచే అభావము విశేష్య మగును. అప్పుడది అభావమే కాదు. లేదా అభావమే కారణమై కార్యము లన్నియు

అభావాన్వితములే కావలెను. దీనిని లోకానుభవ మంగీకరింపదు. వస్తువులన్నియు వాటివాటి స్వరూపముతో కనబడుచున్నవి. మట్టినుండి ఘటము కలుగును గాని వస్త్రము కలుగదు. అభావము కారణమైన కృషి మొదలగు ప్రయత్నములతో పని లేకనే పంటలు పండవలయును. అట్లు జరుగుట లేదు కదా ?

జిజ్ఞాసువు :- అయ్యా! బౌద్ధులు బాహ్యపదార్థములు క్షణికము లను వాదమును సూత్రకారులు, భాష్యకారు లగు శ్రీ శంకరులు విమర్శించిరి కదా! అంతరమగు విజ్ఞానము సహితము క్షణికమే కదా? దాని నెట్లు ఖండించిరి?

వేదాంతి :- బ్రహ్మసూత్రకారులును, భాష్యకారులును బౌద్ధమతమును విమర్శించుటకు ఆ మతమును రెండు భాగములుగ విడదీసిరి. అందు (1) 2వ అధ్యాయము 2వ పాదమునందలి 4వ అధికరణమున 18వ సూత్రమునుండి 27వ సూత్రము వఱకును బౌద్ధమునందలి పంచస్కంధరూప సముదాయమును. ప్రతీత్య సముత్పాదవాదమును మొదలగు బాహ్యార్థములు క్షణికములను వాదమును ఖండించిరి. (2) 5వ అధికరణము నందలి 28వ సూత్రమునండి 32వ సూత్రము వఱకును క్షణిక విజ్ఞానవాదమును ఖండించిరి. 5వ అధిక కరణమునందలి సూత్రములకు శ్రీ శంకరులు వ్రాసిన భాష్యమును సంగ్రహముగా నీకు వినిపించవలసి యున్నది. సాధ్యమగునంత సులభముగా నీవు అర్థము చేసికొనుటకై భాష్యము నందున్న విషయమునే "అద్వైతి - విజ్ఞానవాది సంవాద" రూపమున వినిపింతును. సావధానుడవై వినుము.

(24) అద్వైతి - విజ్ఞానవాది సంవాదము

అద్వైతి :- మీ మతమున విజ్ఞానేతర మేదియు లేదందురు కదా? విజ్ఞానము (తెలిసికొను తెలివి), జ్ఞేయము (తెలిసికొనబడినది) అను రెండును ఒక్కటియే యనుచున్నారు. తెలిసికొను దానికంటె తెలియబడునది వేఱుగా నుండవలెను గదా?

విజ్ఞానవాది :- స్వప్నమున విజ్ఞానమే జ్ఞేయముగ (విషయి, విషయములుగ) విజ్ఞానముచే విజ్ఞానమే అనుభవింప బడుచుండ లేదా?

అద్వైతి :- మా మతము ననుసరించి బాహ్యార్థములు కలవు. చక్షురాది యింద్రియముల ద్వారా మనస్సు వాటి యందు ప్రవర్తించి వాని యాకృతులను లోనికి పంపినపుడు బుద్ధి ఆయా రూపముల బొందుచున్నది. దానినే బుద్ధివృత్తి యందుము. చిదాభాస సహితమగు బుద్ధి (వృత్తి జ్ఞానము)చే బాహ్యపదార్థము లెఱుగబడుచున్నవి. వృత్తి జ్ఞానముచే బాహ్యపదార్థము లనుభవింపబడుచున్నవి. ఇది సాక్షిచే నెఱుగబడుచున్నది.

విజ్ఞానవాది :- దీపమువలె విజ్ఞానము స్వయంప్రకాశము కనుక స్వయముగనే అనుభవింపబడుచున్నది.

అద్వైతి :- విజ్ఞానము విజ్ఞానముచే అనుభవింపబడు చున్నదనిన అగ్ని తనను తాను కాల్చుకొనుచున్నదని చెప్పినట్లగును దీనివలన ఆత్మయందు ఆత్మ విరుద్ధమగు క్రియ నంగీకరించితివి. మా మతమునందు ఆత్మకంటె భిన్నమగు విజ్ఞానముచే (వృత్తిజ్ఞానముచే) బాహ్యార్థము లనుభవింప బడుచున్నవని చెప్పితిమి. మావాదము లోకప్రసిద్ధము, అవిరుద్ధము.

విజ్ఞానవాది :- విజ్ఞానము స్వరూపమున కంటె వేఱగు దానిచే ఎఱుగబడిన అట్లు విజ్ఞానము నెఱిగినది వేఱొక దానిచే గ్రహింపబడ వలెను.* అదియు మరియొక దానిచే ఎఱుగబడవలెను. ఇట్లు అనవస్థ ప్రాప్తింపదా?

---

* ఇచ్చట పాఠకుల కొక మనవి చేయుచున్నాను. ఈ సంవాదమునందు 'విజ్ఞాన', 'జ్ఞాన' శబ్దములు వాడబడుచున్నవి. అద్వైత మతమున 'బుద్ధివృత్తిజ్ఞానము' (వృత్తిజ్ఞానము లేక వృత్తి), "కూటస్థజ్ఞానము" (సాక్షిజ్ఞానమని) అని జ్ఞానము ద్వివిధములు. బౌద్ధమతమున తెలిసికొనబడునదియు. తెలిసికొనునదియు రెండును విజ్ఞాన మనియే చెప్పుదురు. వారి మతమున కూటస్థజ్ఞానము లేదు.

బౌద్ధులు జ్ఞానశబ్దమును విజ్ఞానశబ్దమును భిన్నార్థములయందు వాడుదురు. వారి మతమున జ్ఞాన మనగా బోధి నందిన వారికి (అవిద్య నశించిన వారికి) కలుగు వివేకము. విజ్ఞాన మనగా : విషయి విషయ రూపమున తోచు ఆలయవిజ్ఞానములోని ఒక భాగము లేక ఆలయవిజ్ఞానముయొక్క అంశము.

అద్వైతి :- నీవు విజ్ఞానము దీపమువలె స్వయం ప్రకాశమని చెప్పితివి. మఱియు నీ మతమున బాహ్యార్థముల నెఱుగునట్టి విజ్ఞానము. బాహ్యపదార్థ రూపమున నున్న విజ్ఞానము - రెండును విజ్ఞానములే; రెండును స్వయంప్రకాశములే గాదా? ఒక దాని నొకటి యేల గ్రహింపవలెను. ఇది పరస్పర విరుద్ధభాషణము గాదా? రెండును సమానము లైనప్పుడు గ్రాహ్యగ్రాహక భేద ముండదు. మా (అద్వైత) మతమునందు అట్లు కాదు. బుద్ధి బాహ్యవస్తువుల ఆకృతిని గ్రహించి తదాకారమును బొందుచున్నది. అదియే వృత్తిజ్ఞానము, లేక వృత్తివిజ్ఞానము. వృత్తివిజ్ఞానము స్వయముగ దాని జన్మాదుల నది యెఱుగదు. అది స్వయంసిద్ధుడును, నిత్యుడును నగు సాక్షిచేత నెఱుగబడుచుండును. సాక్షికి సత్తయందును, స్ఫూర్తియందును వేరొకదాని యపేక్ష లేదు. చిత్తగు సాక్షికిని, జడమగు వృత్తిజ్ఞానమునకును వైషమ్యము వలన (సామ్యము - లేనందున) గ్రాహ్యగ్రాహక భావము కలుగును. వృత్తిజ్ఞానము జననమరణములు గలది (ఆగమాపాయములు గలది). సాక్షి నాశరహితుడు, జననము లేనివాడు. కనక ఆ రెండును వేఱుగుటవలన (వైషమ్యమున) గ్రాహ్యగ్రాహక భావము ప్రసన్నమగును.

స్వప్నగత పదార్థములకు (ప్రత్యయములకు) స్వప్న విజ్ఞానమునకును భేదము లేనట్లు జాగరితము నందలి విజ్ఞానమునకును స్తంభాది ప్రత్యయములకు (జ్ఞానమునకు) భేదము లేదని చెప్పితివి. దానికి నా ఆక్షేపణము వినుము .

స్వప్నజాగరములు సమానధర్మములు కలవి గావు. స్వప్నమున పదార్థములను చూచినవాడు నిద్రనుండి మేల్కొనినంతనే అవి అసత్యములని వానికి తెలియుచున్నది. జాగ్రద్దశ యందలి స్తంబాది పదార్థము లావిధముగ బాధింపబడవు. స్వప్న మనునది యొకవిధమగు స్మృతి. జాగరిత జ్ఞాన మన్నచో ఉపలబ్ధి. (జ్ఞానము.) స్మృతి స్మరణ మాత్రమే. జ్ఞానము ప్రత్యక్షానుభవము. స్వప్నోపలబ్ధివలె మిథ్య కాదు. మీరు (విజ్ఞానవాదులు) జాగరిత ప్రత్యయములకు (విజ్ఞానములకు)

ఆలంబన లేదను విషయమును సమర్థింపలేక స్వప్నజాగరణములకు సాధర్మ్యమును సమర్థింప జూచుట సరికాదు.

సూ. వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్. (బ్ర. సూ. **2-2-29**)

విజ్ఞానవాది :- బాహ్యాపదార్థములు లేకున్నను వాసనావైచిత్ర్యము (వైవిధ్యము) వలన విజ్ఞాన వైచిత్ర్యము కలుగును గదా?

అద్వైతి :- **సూ. "నభావో ఽ నుపలబ్ధతే"** (బ్ర.సూ. 2-2-30).

అన్నారు కనుక బాహ్యార్థములు లేనియెడల వాసనలు పుట్టవు. ఎల్లవస్తువులయందు ప్రమాజన్యమైన అనుభవమే కారణముగా నానావిధములగు వాసనలు పుట్టుచున్నవి. బాహ్యార్థములు లేనిచో అనుభవము లేదు. అనుభవము లేనిచో సంస్కారములు, వాసనలు లేవు (పుట్టవు) గదా?

విజ్ఞానవాది :- వాసనలు, విజ్ఞానములు అనాదులు. కనుక బీజాంకుర న్యాయమున పుట్టవచ్చును.

అద్వైతి :- అది సరికాదు, బీజము దాని అంకురము మనకు కనబడుచున్నవి. అందువలన అవి ఒకదానికి మరియొకటి కారణమని కార్యకారణ సంబంధమును చూపవచ్చును. మా మతము ననుసరించి పదార్థములు (ఆదియందు) లేవు కనుక వాసనలు పుట్టుటకే వీలులేదు. కనుక బాహ్యమున అర్థములు లేవను మీ మతము సరియైనది కాదు.

విజ్ఞానవాది :- మేము ఆలయవిజ్ఞానము కలదని చెప్పితిమి గదా?

అద్వైతి :- వాసనలే పుట్టుటకు వీలులేని మీ మతమున ఆలయ విజ్ఞానము వాసనల కాశ్రయమని యెట్లు చెప్పుదురు? అదియునుగాక, ఆలయవిజ్ఞానము క్షణికమని చెప్పితిరే. క్షణకాలమైనను స్థిరముగా నుండనిది వాసనల కెట్లాశ్రయ మగును. మా (అద్వైత) మతమునందువలె మూడు కాలములతో సంబంధము గల స్థిరుడగు జీవుడుగాని సర్వద్రష్ట యగు కూటస్థాత్మ (సాక్షి) గాని లేని మీ మతమునందు వాసనలను

దాచియుంచుటకు గాని స్మృతిప్రత్యభిజ్ఞలు కలుగుటకు గాని ఆధారము లేదు. ఒకవేళ మీరు ఆలయవిజ్ఞానమునకు స్థైర్యము నంగీకరించితిరేని మీ క్షణికవాదమునకు భంగము కలుగును. (బ్ర. సూ. 2-2-31)

సూత్రకర్తలగు శ్రీ బాదరాయణాచార్యులును భాష్యకారులగు శ్రీ శంకరులును ఈ విధముగ బౌద్ధమతమును ఖండించిరి. ఏలనో కాని బౌద్ధమాధ్యమిక (శూన్యవాద) శాఖకు చెందిన మతమును ఖండించుటకు బాదరాయణాచార్యులవారు సూత్రముల రచియింపలేదు. శ్రీశంకరులు 31వ సూత్రమునకు వ్రాసిన భాష్యమునందు "శూన్యవాది పక్షము సర్వప్రమాణ విరుద్ధము కాబట్టి తన్నిరాకరణమునకు వేఱుగా సూత్రారంభము చేయబడలేదు" అని వ్రాసిరి. (అం. సూ. భా)

(25) సింహావలోకనము-సంగ్రహపరిశీలనము

జిజ్ఞాసువు :- శ్రీశంకరులు బౌద్ధమతమును నిశితముగ ఖండించియున్నను వారిని కొందఱు ప్రచ్ఛన్న బౌద్ధుడని యందురేల?

వేదాంతి :- అద్వైత, బౌద్ధమతములు రుచింపని వారట్లందురు. లోకమునంతయు మెప్పింపగల వ్యక్తి ప్రపంచమున పుట్టియుండడు. బౌద్ధమతమునకును, ఉపనిషత్తుల (అద్వైత) మతమునకును కొంత సామ్యము గలదు. దాని నెవరును కాదనలేరు. "పరమసత్యము సత్యాసత్యములు కానిది; సదసత్తులు కానిది, జ్ఞానాజ్ఞానములు కానిది. మనోవాక్కుల కందనిది" అని ఉపనిషత్తులెట్లు వర్ణించినవో విజ్ఞానవాదులగు బౌద్ధులు వారి 'తథత', మాధ్యమిక శాఖవారు వారి 'శూన్యము' లేక 'నిర్వాణమును' ఆలక్షణములు గలదిగనే వర్ణించిరి. ఉపనిషత్తులు చెప్పిన నిర్విశేష బ్రహ్మమునే మేము 'శూన్య', 'నిర్వాణ' శబ్దములచే చెప్పితిమని నాగార్జునాచార్యులు చెప్పియుండిన మాధ్యమిక బౌద్ధమింత విమర్శకు గురియై యుండదు. ఆ విధముగ చెప్పిన 'ఇది ఉపనిషత్తుల మతమే గదా. మీరు క్రొత్తగా చెప్పినదేమి?" అని హిందువులు పరిహసింతురన్న అభిమానము వారికి అడ్డు తగిలి యుండవచ్చును. అదిగాక వ్యావహారిక జగత్తునకును నిర్వాణము (పరమసత్యము) నకును

శూన్యశబ్దమునే నాగార్జునాచార్యు లుపయోగించిరట. అందువలన సహితము వారిమతము తీవ్రవిమర్శకు గురియైనది. బహుశః నాగార్జునాచార్యులు వ్యావహారిక జగత్తునకును, పరమార్థమునకును మూలమున భేదము లేదని భావించి యుండవచ్చునేమో యని కొందఱి యభిప్రాయము.

తాత్త్విక సంబంధముల మాట అటుంచి అనుభవమును గుఱించి చూచినను చాలవఱకు రెండును సరిపోవుచున్నవి. ఎట్లనగా :- బౌద్ధులు ధర్మమునకు అధిక ప్రాముఖ్యము నిచ్చిరి. అహింసవిషయమున హిందూమతమున కంటె బౌద్ధమతమునకు అగ్రస్థాన మివ్వవలెను. చిత్త జయముకొఱకు యోగాభ్యాసమును హిందూమత శాఖలన్నియు అంగీకరించినట్లే బౌద్ధులును అంగీకరించిరి. వైరాగ్యము, ఇంద్రియ జయము, వాసనాక్షయములకు సాధనము చేయుట, అహంకార మమకారములు త్యజించుట - యివి యన్నియు ఉపనిషత్తులలోనివే; క్రొత్తవి కావు. ఉపనిషత్తు లుపదేశించిన నిర్వికల్ప సమాధియే నిర్వాణ మనిరి.

ఇరువురు భిన్నమతములవారు, వారు పొందిన వారి అనుభవము (గమ్యస్థానము) ఒక్కటై యుండియు. అట్టివారి యనుభవమును వ్యక్తము చేయుటకు వారుపయోగించిన భాష (భిన్నభిన్న పదజాలము) వలన వారివారి అనుభూతియు పరస్పర విరుద్ధ మైనదని గాని (భిన్నమైనదనిగాని) చెప్పుట యుక్తము కాదు, బుద్ధదేవుని ధ్యానమును, శంకరులవారి నిర్వికల్ప సమాధియు నొక్కటియే. నాడారకాలాముని శిష్యుడగు 'పుక్కసుడ'ను నాతడు తన గురువుయొక్క ధ్యానశక్తిని గుఱించి బుద్ధభగవానుని యెదుట కొనియాడినపుడు బుద్ధభగవానుడు తన ధ్యానశక్తినిగుఱించి చెప్పియుండెను. భగవానుడు ఒకప్పుడు ధ్యానము నందుండగా సమీపమున కుంభవృష్టి కురియుచు, మేఘములు గర్జించుచు, మెఱపులు మెఱయుచు గొప్పధ్వనితో పిడుగుపడెను. ఆ యశనిపాతమునకు రెండెద్దులు ఇద్దరు మనుష్యులు చనిపోయిరి. జనులు గుంపులు గుంపులుగా చేరి కోలాహలము చేయుచుండిరి. బుద్ధభగవానుడు

ధ్యానమున నుండినప్పు డవి యేవియు ఎఱుగడు. ధ్యానమునుండి లేచి అచ్చట నున్నవాని నొక్కని పిలిచి యా కోలాహలమునకు కారణ మడిగి జరిగిన దంతయు తెలిసికొనెను. అది నిర్వికల్పసమాధి కాదని మనమెట్లు చెప్పగలము?

బుద్ధదేవుడును, వాని యనుచరులును తామొక నూతన మతము నుపదేశించుచుంటిమని లోకులకు చెప్పుచు ప్రాచీన పదజాలమునే వారి బోధకొఱకు ఉపయోగించిన అది నూతన మతము కాదని లోకులు భ్రమపడవచ్చు నని నూతన పారిభాషిక పదములను కొన్నింటి నుపదేశించి నంతమాత్రమున వారి బౌద్ధమతము అనుభవముచే ఉపనిషన్మతమునకు విరోధి కాజాలదు. ఇట్లనుటచే బౌద్ధమత సిద్ధాంతము సంపూర్ణముగ నిర్దోషమైనదని నాయభిప్రాయము కాదు. ప్రాచీన ఉపనిషత్తుల మతమునకు మాధ్యమికబౌద్ధము పూర్తిగా సమ్మతమైనదని గాని, పూర్తిగ విరోధమని గాని చెప్పగూడదు. చాలవరకు సమ్మతమే అని చెప్పవచ్చును.

యోగాచారుల ఆలయవిజ్ఞానమును పూర్తిగా వేదాంతుల సగుణబ్రహ్మముతో పోల్చుటకు వీలులేదు. కొంతవఱకు గాని కొన్ని సందర్భములయందు రెంటిని సరిచూచుకొన వచ్చును. అట్లే వారి 'తథత'ను కూడ వేదాంతుల నిర్గుణబ్రహ్మముతో అన్నివిధముల సమానమని చెప్పుట తప్పే యగును. 'తథత' ఆలయవిజ్ఞానముగా పరివర్తన చెందుచున్నది. నిర్గుణబ్రహ్మము నిర్వికారి- మాధ్యమికుల శూన్యమునకును, వేదాంతుల నిర్గుణబ్రహ్మమునకును పూర్తి సామ్యము కుదురదు. కొంతవఱకు మాత్రమే. మాధ్యమికుల శూన్యము అతివిచిత్ర మైనది. అది శూన్యమనగా లేనిదని అర్థము కదా? లేనిది అభావము. అట్టి దానిని నిర్గుణబ్రహ్మమే యని యెట్లు చెప్పనగును? కాని, మాధ్యమికులు దానిని శుద్ధశూన్యము కాదందురు. శుద్ధ శూన్యము, మహాశూన్యము, పరమశూన్యము అను వాక్యము లన్నియు ఊహకందని వట్టిమాటలే. వాటినిగుఱించి యెట్లు చెప్పినను వాటిని ఖండించుట కష్టము.అది ఒక నిర్దుష్టమైన స్థితి కాదు. కనుకనే మాధ్యమిక బౌద్ధమును, బాదరాయణాచార్యులవారు గాని, శ్రీ శంకరాచార్యులవారు గాని

"మాధ్యమిక మొక సిద్ధాంతము కాదని" ఖండింపక త్రోసివేసిరి. మా మతతత్త్వ మిట్టిదని మాధ్యమికులు చెప్పినదానిని నితరులు ఖండింతురని వారికి భయము కాబోలు. బౌద్ధమతమును పరిశీలించిన ప్రాక్పశ్చిమ దేశీయులగు పండితులలో అధిక సంఖ్యాకులు బౌద్ధము నాస్తికమని అభిప్రాయపడిరి. వారి అభిప్రాయము పూర్తిగా త్రోసివేయదగినట్లు గాని, పూర్తిగా అంగీకరింపదగినట్లు గాని బౌద్ధము రూపొందింపబడి యుండలేదు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు వారి ప్రజ్ఞావిశేషముతోను, అత్యుత్సాహముతోను, పట్టుదలతోను పెక్కు బౌద్ధగ్రంథములు శోధించి అనేక ప్రమాణములను చూపి తమ భారతీయ తత్త్వశాస్త్రము (ఇండియన్ ఫిలాసఫి అను ఆంగ్లగ్రంథము) నందు బౌద్ధుల 'తథత', 'శూన్యము' వీటిని వేదాంతుల నిర్గుణ నిర్విశేష బ్రహ్మముతో సారూప్యము కలదని వ్రాసిరి. వారెంత చెప్పినను వేదాంతుల నిర్గుణ బ్రహ్మముతో వాటిని కొంతవఱకు లేదా చాలవఱకు పోల్చుటకు వీలగునేమో గాని పూర్తిగా సారూప్యము కుదురదు. ఏలయన సర్వము క్షణికమే, సర్వము అసత్యమే అను వారి సిద్ధాంతము వేదాంతమునకు, బౌద్ధమతమునకు మధ్య పర్వతమువలె అడ్డు తగులుచున్నది.

యోగాచారుల ఆలయవిజ్ఞానము బ్రహ్మవాదుల సగుణబ్రహ్మము (ఈశ్వరుని)తో పోల్చవచ్చునా? ఆలయవిజ్ఞానము క్షణికము. సర్వజీవుల వాసనల కది నిలయము. అదియును పరివర్తనశీలము గలది. ఈశ్వరునియందు ఆవరణశక్తి లేదు. సర్వజీవుల సమష్టి స్వరూపుడైనను ఆయనయందు అవిద్య లేని కారణమున జీవుల మాలిన్యము ఈశ్వరు నంటదు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తి, ప్రపంచ మాయన వికాసము.

మాధ్యమికుల శూన్యత వారి శాస్త్రీయపారిభాషిక పదము. వారి అనుభవము నిర్వాణము. అనుభవము ఇట్టిదని చెప్పలేము. అది అనుభవైక వేద్యము. నిర్వాణముయొక్క అనుభవమును శ్రీశంకరులవారు చెప్పిన

నిర్వికల్ప సమాధియొక్క అనుభవమును ఒక్కటియే యని వెనుక బుద్ధ భగవానుని అనుభవమును గుఱించి చెప్పిన దానినిబట్టి నిశ్చయింపవచ్చును.

ఏది యెట్లున్నను బౌద్ధమతము అవైదికము కాదు. బుద్ధ భగవానుని ప్రథమశిష్య వర్గములలో నొకశాఖవారు "ఆత్మనిత్యత" యందు విశ్వాసము గలవారున్నారు. వీరే "సమ్మతీయులు", "వజ్జిపుత్తకులు"నని కథావస్తువు చెప్పుచున్నది." అని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వ్రాసియున్నారు. (భా. త 3-భా. 126 పుట.) ఒక మతమువారు తమది వైదికసంప్రదాయమని చెప్పినను, కాదని చెప్పినను ఆసంప్రదాయము ఇట్టిదని వారి మాటలపైన ఆధారపడియుండదు. ఆ సంప్రదాయము యొక్క తత్త్వశాస్త్రము మొదలగునవి ఉపనిషత్తులకు ఎంతవఱకు సమ్మతము అను దానిపై ఆధారపడి యుండును.

షడ్దర్శనములలో ఒకటియని చెప్పబడు వేదాంతమును తీసికొందము. ఏది వేదాంతము? అద్వైతమా? విశిష్టాద్వైతమా? ద్వైతమా? వీటిలోని భేదములను ఆధారముగా గైకొని ఇందులో నేదో ఒకటిమాత్రమే వేదాంత మనియు, తక్కినవి వైదికములు కావనియు త్రోసివేయుట లేదు గదా? అట్లే బౌద్ధమతమును వైదికమే.

బౌద్ధమతము పరస్పరవిరుద్ధముగ నాలుగు శాఖలైనవి కదా. ఇందులో నేది బౌద్ధము అని ఒకప్రశ్న. పరస్పర విరుద్ధముగ నున్న ద్వైత, ద్వైతాద్వైత, విశిష్టాద్వైతములు మూడును తమ మతమే, ఉపనిషత్తుల మతమని మనము చెప్పుచుండుట లేదా? బుద్ధదేవుడు నాస్తికుడు కాడు. పునర్జన్మ సిద్ధాంతము నంగీకరించిన ఏమతమైనను (దేవుడున్నాడని చెప్పినను లేడని చెప్పినను) నాస్తికము కాదు. అది ఉపనిషత్తుల మతమే. బుద్ధభగవానుడు వ్యక్తిగతముగా యోగ్యతయందు మన మతాచార్యుల కెవ్వరికిని తీసిపోరు. ధర్మము, కరుణ - యీ రెండును బుద్ధదేవుడుగా రూపొందినవి. దేవుడున్నాడని దేవుని కొఱకై తానీపని

చేయుచున్నానని చెప్పి పరమతముల వారి కుత్తుకలు నఱికించిన రాతిగుండెగల అస్తికునకంటె సర్వభూతములను ప్రేమించిన వాడును, ఒక క్షుద్రజీవియగు గొఱ్ఱెకాలు విరిగి నడువలేక బాధపడుచుండుట చూచి సహింపలేక దానిని భుజములపై వేసికొని పాదరక్షలు సహితము లేక యెండలో చాలదూరము నడచి వచ్చిన కరుణామూర్తియు, దీనబాంధవుడును నగు నాస్తికుడే భగవంతునకు మిక్కిలి ప్రియుడు.

భగవద్గీత రెండవ అధ్యాయమున 55, 56, 57, 58, 61, 72 శ్లోకములయందు బ్రాహ్మిస్థితి నొందిన జ్ఞానియగు స్థితప్రజ్ఞు డెట్టివాడని చెప్పబడెనో అతనియొక్కయు, పంద్రెండవ అధ్యాయమున 13, 15, 16, 17, 18, 19 శ్లోకముల యందు శ్రీ కృష్ణభగవానునకు మిక్కిలి ప్రియుడని చెప్పబడిన వానియొక్కయు; గుణములన్నియు బుద్ధభగవానుని యందున్నపుడు ఆయన నాస్తికు డెట్లగును? మఱియు ఆయన భగవదంశసంభూతుడు. అట్లు కానివాడు అన్యుల సహాయము లేకనే సత్యము నెఱుగ లేడు.

నేను, బుద్ధభగవానుని వ్యక్తిత్వమును వేఱుగను, బౌద్ధమును వేఱుగను చూతును. నాకు బుద్ధదేవునియందు గౌరవము, భక్తి కలదు. బౌద్ధమతమున నాలుగు శాఖలున్నవి. ఇంకను తరచిచూచిన 18 శాఖలున్నవి. ఇట్టి సందర్భమునందు ఏది బుద్ధదేవుని అభిప్రాయము. కనుక బౌద్ధతత్త్వమున గాని, మతమునగాని లోపములున్న వాటిని విమర్శింతును. బుద్ధ దేవునియందలి భక్తితో వాటి నంగీకరింపను.

సమ్యక్ జ్ఞానియైన బుద్ధుని, ధర్మమును, సంఘమును శరణు పొందవలయును. (ధమ్మ. 14-12) ఇవి బౌద్ధుల త్రిరత్నములు.

బుద్ధభగవానుడు భౌతికకాయమును వదలునప్పుడు వారి శ్రీముఖమునుండి వెలువడిన యీ త్రిరత్నములతో నీ ప్రసంగమును ముగించుచున్నారు.

"బుద్ధం శరణం గచ్ఛామి,
ధర్మం శరణం గచ్ఛామి,
సంఘం శరణం గచ్ఛామి"
"నమో బుద్ధాయ, నమో ధర్మాయ"
"నమ స్సంఘాయ నమో నమః."

****

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామ
సుబ్బయ్యచే రచియింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస'
తృతీయభాగము నందలి బౌద్ధమత మను
నాలుగవ ప్రకరణము సంపూర్ణము.

శ్రీ కృష్ణార్పణమస్తు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మజిజ్ఞాస

తృతీయ భాగము

ఐదవ ప్రకరణము-నాస్తిక, భౌతికమతములు

శ్లో|| దేహం ప్రాణ మపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదుః
స్త్రీ బాలాంధజడోసమాస్త్వహమితి భ్రాన్తా భృశం వాదినః|
మాయాశక్తి విలాస కల్పిత మహా వ్యామోహ సంహారిణే
తస్మై శ్రీ గరుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే||*

(1) ఆరంభము

జిజ్ఞాసువు :- అయ్యా! నాస్తికమత మందురు. దేవుడు లేడనుటయేనా నాస్తికమతము? దేవుడు (ఈశ్వరుడు) అనగా : జగత్తును సృష్టించి, పాలించి, ఉపసంహరించు వాడొకడు లేడని చెప్పిన వైదిక, జైన, బౌద్ధమతములు ఏల నాస్తిక మతములు కావు? ప్రత్యేకించి నాస్తికమను మతము ఒకటి కలదా? ఉన్నచో దాని కొక ఆచార్యు డున్నాడా? దానిని నవలంబించు సంఘ మొకటి కలదా? ఏ ధర్మము లైనను ఆచరణలో నుంచుటకు సంఘముండవలయును గదా? సంఘము

---

* తా|| పరమేశ్వరానుగ్రహము లేని వారలలో 'అహం' శబ్దవాచ్యమగు పరమాత్మను, దేహమని కొందఱును, ప్రాణమని కొందఱును, శూన్యమని కొందఱును, ఇంకను కొందఱు మనస్సనియు పలువిధములుగా మాయామోహితులై పలుకుచున్నారు. వీరు ఏమియు నెఱుగని స్త్రీలు, బాలురు, జడులతో పోల్చదగినవారు. ఇట్టి వారి యజ్ఞానాంధకారమును పోగొట్టుటకు సమర్థులయిన శ్రీ గురుమూర్తియగు దక్షిణామూర్తికి నమస్కరించుచున్నాను.

లేనిచో ఆ ధర్మము అడుగంటదా? వారి మతతత్త్వమెట్టిది? అనుగ్రహించి తెలుపుడు.

వేదాంతి :- దేవుడు లేడను వాక్యము అర్థరహితమైనది. ఏలయన:- ఒక వస్తువు మన కొకప్పుడు కనబడి మఱియొకప్పుడు కనబడకపోయిన అట్టి వస్తువును "లేదు" అని చెప్పుదుము. దేవుడు ఒకప్పుడు ఒకనికి కనబడి ఇప్పుడు వానికి కనబడకపోయినచో "దేవుడు లేడు" అని చెప్పిన ఆ వాక్యమునకు అర్థమున్నది. ఇదివఱలో ఒకప్పుడు కాని, యిప్పుడుగాని కనుల కగపడని దేవుడు లేడని చెప్పిన అర్థము సరిపడదు. మనము మన స్నేహితుని యింటివద్దకు పోయి "నా మిత్రు డున్నాడా?" అని యింటిలోని వారిని ప్రశ్నించిన మిత్రుడు ఇంట లేనిచో "లేడు" అనియు ప్రత్యుత్తరము లభించును. ఇట్టి వ్యావహారికమగు కలిమిలేములయందు ప్రయోగింపబడు "ఉన్నాడు", "లేడు" అను శబ్దములు ఉండుట, లేకుండుట అనునవి లేక ఉండునట్టి 'వస్తువు' నందు "లేడు" అను శబ్దప్రయోగము వ్యర్థము. ఐనను లోకులు "దేవుడు లేడు" అను వారిని నాస్తికు లందురు. అదిగాక దేవుడు మన నేత్రములకు గోచర మగునేని అట్టివాడు రూపము కలవాడును, పరిచ్ఛిన్నుడును కావలెను. అట్టివాడు పుట్టియుండవలెను. పుట్టిన వానికి చావు తప్పదు. జననమరణములు కలవాడు దేవుడు కాడు.

"నాస్తికో వేదనిందకః" (మనుస్మృతి. 2-11) అన్నాడు. అనగా:- వేదములను నిందించువాడు నాస్తికుడనియే చెప్పిరి గాని దేవుడు (ఈశ్వరుడు) లేడని చెప్పినవాడు నాస్తికుడని చెప్పలేదు. ఇట్టి నిర్వచనము మనుస్మృతికారు డేల చేయవలెను? గౌతమ, కాణాద, జైమినులు మొదలగు కొందఱు ఋషులు ఈశ్వరాస్తిత్వమును అంగీకరింపక పోవుటయే కారణమై యుండవచ్చును. ఈ దార్శనికులు ఈశ్వరుడు కలడనుటకు తగిన సాక్ష్యము లేదనిరేగాని, ఈశ్వరుడు లేడని ఖండితముగా చెప్పలేదు. మానవుడు సహజముగా ఆస్తికుడే, నాస్తికభావము మానవునికి కొన్ని సంఘటనల ఫలితముగా కలుగుచున్నది. ఎట్లనగా : ఒక పర్వతపాదము నందుగల గ్రామములోని వారందరు ఆ పర్వత శిఖరము విరిగిపడి

మృతులైనప్పుడును, భూకంపము వలనను, అగ్ని పర్వతము ప్రేలుట వలనను లక్షలాదిప్రజలు మృతు లగుటయేగాక వికలాంగులై, జీవితమంతయు దుఃఖభాజను లగుటయు? సముద్రము పొంగి జనపదములను ముంచుటయు, మొదలగు ప్రకృతి వైపరీత్యములను చూచినపుడు, వినినపుడు దేవుడున్నాడా? అను ప్రశ్న కలుగును. సంఘమునందు ధర్మాత్ములు పలువిధములగు దుఃఖముల పాలగుటయు, పాపకర్ములు సుఖించుటయు, చూచినపుడును దేవుడున్నాడా? అను ప్రశ్న పొడసూపును. ఒకజాతి ప్రజలు దుర్మార్గులై వేఱొక జాతి వారిని నానాహింసలపాలు చేసినపుడు ఇట్టి ప్రశ్నయే కలుగును. హిందూ, బౌద్ధ, జైన మతసిద్ధాంతములను నమ్మువారు ఈ ప్రశ్నకు కర్మసిద్ధాంతముతో సమాధానపడుదురు. కర్మసిద్ధాంతమును అంగీకరింపని వారికి పై ప్రశ్నకు సమాధానము చిక్కనందున వారును, ఈ క్రింద చెప్పబోవు దురదృష్టవంతులును, ఆస్తికభావమును కోల్పోవుదురు.

(1) పూర్వము బానిసవర్తక ముండెడిది. అప్పు తీసికొన్నవాడు ఋణదాతలకు తిరిగి ఋణమును చెల్లింపలేనపుడు అతడు ఋణదాతకు బానిస యగును. (2) యుద్ధమున పరాజితులై శరణాగతులగు సైనికులు బానిసలుగా విజేతలచే విక్రయింపబడుచుండిరి. ముఖ్యముగా ఇట్టి బానిసలనుండి నాస్తికాచార్యులు ఏర్పడిరి. (3) ఒకానొక వ్యక్తి ఆస్తిక భావము కలవాడై యుండి పరిసరముల ప్రభావమునకు లొంగి పాపాచరణమునకు పూనుకొన దలచిన అతని అంతరాత్మ అట్టి కార్యములను చేయరాదని యుద్బోధించును. వాడు అంతరాత్మ ప్రబోధము నణచుటకై "దేవుడు లేడు. పుణ్య పాపములు, స్వర్గనరకములును హుళక్కి" అని పదింపదిగా మనమున తలంచుటయు నోట ఉచ్చరించుటయు, నితరులకు బోధించుటయు మొదలగు ప్రబల ప్రయత్నముచే అంతరాత్మ ప్రబోధమును అణచివేయును. అప్పు డతనికి కొంత శాంతి లభించి తాను చేయదలచిన పాపకార్యమును సంతృప్తితో చేయును. ఈ విధముగా నాస్తికభావము లోకమున పొడుకొనినది.

చరిత్రనుబట్టి చూచిన వర్తమానకాలము నందున్నంత అధిక సంఖ్య గల నాస్తికులు పూర్వ మేకాలమునందును లేరనియే చెప్పవచ్చును. అయినను నాస్తికు లందరు పాపాత్ములు కారు. నాస్తికులలో సంఘ శ్రేయమునే ప్రధానముగ నెంచి స్వార్థమును త్యజించిన మహనీయులు పెక్కండ్రు కలరు.

(2) చార్వాక , లోకాయత, నాస్తిక - మతములు

నాస్తికులనే చార్వాకులని, లోకాయతులని పిలుతురు. చార్వాకుని ప్రసక్తి మహాభారత శాంతిపర్వమునందు గలదు. భారత యుద్ధానంతరము యుధిష్ఠిరుడు కురువంశ సింహాసన మధిష్ఠింపబోవుతరి చార్వాకుడు బ్రాహ్మణవేషమున బ్రాహ్మణ సమూహమునందుండి "యుధిష్ఠిరుడు కురువంశ సింహాసన మెక్కుటకు అర్హుడు కా"డని ఆక్షేపించెను. అచ్చట నున్న బ్రాహ్మణు లాతని రాక్షసుడని గుర్తించి చంపిరి. చార్వాకునిచే బోధింపబడిన మతము గనుక చార్వాకమతమని ప్రసిద్ధి. దీనినిబట్టి యీ మతముయొక్క ప్రాచీనత బోధపడుచున్నది.

దీనికి లోకాయతమని మరియొక పేరు.* "లోకేషు ఆయతః లోకాయతః "సాధారణముగ లోకులలో (జనులలో) ప్రచారముగల యిట్టి దృష్టియే లోకాయతము. ఇంద్రియ గోచరమగు లోకమును ఆయతనము (ఆధారము)గా చేసికొనిన దర్శనము గనుక లోకాయత దర్శనమని పిలుతురు.

ఈ దర్శనమునకు మూల పురుషుడు బృహస్పతి. దేవగురుడైన బృహస్పతి యితడు కాడేమొ నని కొందరి అనుమానము. ఇతడు రచియించిన సూత్రములు (మూల గ్రంథములు) ఇప్పుడు లభ్యము కావు. చార్వాకుడు బృహస్పతి శిష్యుడని చెప్పుదురు.

సంగ్రహముగ ఈ మత మిట్లుండును :-

---

* "విజ్ఞానసర్వస్వము" ఏడవ సంపుటమునందు లోకాయత దర్శనమును గురించి డాక్టర్. కొత్త - సచ్చిదానందమూర్తిగారు విపులముగ వ్రాసియున్నారు. విశేషములు తెలియగోరువారు ఆ భాగమును చదువుదురని విజ్ఞప్తి.

(1) ప్రత్యక్షమే ప్రమాణము. కనబడని దేవుడున్నాడని చెప్పుట సరికాదు. దేవు డెవ్వరికిని కనబడలేదు. కనుక లేడు.

(2) ఈ ప్రపంచ మెట్లు పుట్టినదో యెవ్వరికిని తెలియదు. ప్రపంచమనగా భూమి, జలము, అగ్ని, వాయువు నను నీ నాలుగు భూతములే కాని 'ఆకాశ' మనునది లేదు. ఆకాశ మనగా, శూన్యము. అదియొక భూతము కాదు.

(3) శరీరమునందు జీవుడని కాని, ఆత్మయని కాని చెప్పెడి శాశ్వత పదార్థము లేదు. దేహము లేని జీవుడు కనబడడు. ఎఱుకతో కూడిన స్థూలదేహమే ఆత్మ. కంటికి కనబడు దేహమొక్కటే గాని, దేహములు రెండు, మూడు, నాలుగు లేవు. నాలుగు భూతముల సమ్మేళనమువలన నెఱుకగల ప్రాణులు పుట్టుదురు. దేహమునందలి చైతన్యము దేహవ్యతిరిక్తమగు ఆత్మకృతము (ధర్మము) కాదు. దేహము చేతనమే. కనుక దేహముకంటె భిన్నుడగు దేహి యనువా డొకడున్నాడని చెప్పుట సరికాదు. పసుపు సున్నమును చేర్చి యీ రెంటిని నీటిలో కలిపిన పసుపురంగుకంటెను, సున్నపురంగుకంటెను భిన్నమగు ఎఱుపురంగు ఏర్పడును. వక్క, ఆకు, సున్నము మూడు నమలిన ఎఱ్ఱని తాంబూల మగును. తాంబూల రక్తిమ తమలపాకునందు గాని, సున్నమునందు గాని, వక్కయందుగాని లేదు. అట్లే నాలుగుభూతముల సమ్మేళనమువలన ఎఱుక కలిగినది. అది ఆత్మకాదు. "నేను పోవుచున్నాను", "నేను మాట్లాడుచున్నాను", నేనీ వ్యాపారమును చేయుచున్నాను - అని ఇట్లు చేయబడు సమస్తవ్యాపారములకు కర్త శరీరము కనుక శరీరము వేఱు, నేను వేఱు కాదు. శరీరమే నేను.

(4) శరీరమునకంటె భిన్నమగు ఆత్మ మఱియొకటి లేనందున, మానవుడు మరణించిన పిమ్మట జీవులు పుణ్యలోకములకో, నరకమునకో బోవుదురనియు, అచ్చట కొంతకాలముండి తిరిగి భూమిపై జన్మింతురనియు చెప్పెడి మాటలను నమ్మకూడదు. మోక్షము, ముక్తి యనునవి అబద్ధము. మరణించుట ముక్తి. పుణ్యాపాపము లనునవి లేవు.

(5) ఇంద్రియసుఖమే ఆనందము. అట్టి ఆనందమును పొందుటయే మానవుల ముఖ్యకర్తవ్యము. విషయానందము కంటె ఆనందము లేదు. అర్థకామములే పురుషార్థములు.

**"అప్పు గొనియైన దొంగలియైన లెస్స
జిహ్వ కింపైన దాని భుజింపవలయు
కంటి కింపైన కాంతను గవయవలయు
బ్రతుకు దినముల మోక్షంబు వెతుకనేల."**

అని నాస్తిక మతసారమంతయు ఒక **తేటగీతలో** చెప్పిరి. రాజశాసనము పాటింపదగినది. రాజుగాని, ఆయా కాలముల యందు శాసనకర్తలుగా ప్రజలచే నియోగింపబడిన వారు గాని విధించు శాసనములును ధర్మములే.

నాస్తికమతము చాల పురాతనమైనది. బౌద్ధమతము కంటెను ప్రాచీనము. ఋగ్వేద మంత్రములలో నీ మతసిద్ధాంతములకు బీజములు కలవట. వీరు వేదసిద్ధాంతములను నిరసించిరి. ఈ నాస్తిక మతమును జాబాలి యను బ్రాహ్మణుడు శ్రీరామచంద్రున కుపదేశింపగా శ్రీరాము డామతమును ఖండించినట్లు శ్రీమద్రామాయణమునందలి అయోధ్యకాండమున 108, 109వ సర్గములయందు కలదు.

ఈ మతమును శ్రీ శంకరులవారు తమ బ్రహ్మసూత్ర భాష్యమున **"ఏక ఆత్మన శరీరే భావాత్." (3-3-53)** అను సూత్రభాష్యమున అనువదించి సూ|| **"వ్యతిరేకస్తద్భావా భావిత్వాన్న తూపలబ్ధివత్" (బ్ర. సూ. 3-3-54)** సూత్ర భాష్యమున ఖండించిరి.

(3) నాస్తిక మతమును పోషించినవారు

కకుద కాత్యాయనుడు :- ఇతడు బుద్ధదేవుని కన్న పూర్వికుడు. పంచభూతములయొక్క గుణములే ఆత్మ యని నిర్ణయించినాడు. భూతాదులను ప్రేరేపించు తత్త్వములు సుఖదుఃఖము లట. ఇది చార్వాక మతమునందు ఏకదేశీయము. ఇతని ప్రకృథ కాత్యాయను డనియు అందురు.

అజిత కేశకంబళుడు :- ఇతడు ఒక సేనానాయకునికి ఇవ్వవలసిన ఋణము తీర్చుకొనలేక అతనివద్ద బానిసగా ఉండెడివాడు. ఇతడు కొంతకాలమునకు అతని యజమానినుండి తప్పించుకొని అడవులకు పోయి అందు కొంతకాలము తిరిగి తుదకు నాస్తిక దర్శకుడుగా బయలు దేరెను.

మక్కలిఘోషాల్ - (మక్ఖలి గోశాలి) :- ఇతడు కూడ ఒక సేనానాయకుని కడ బానిస. ఇతడు గోశాలలో పుట్టినందున "గోషాల్" (గోశాలి) అని పేరు వచ్చినదట. ఒక దినమున యజమాని యింటికి నూనె కొని తెచ్చుచుండ మార్గమున వచ్చునపుడు పరధ్యానముగ నుండుటచే నూనె క్రింద పడిపోయెనట. ఇంటికి పోయిన యజమానుడు కొట్టునని భయపడి అడవులకుపోయి క్రమముగ నాస్తికదర్శకు డయ్యెనని చెప్పుదురు. ఇతడు విధివాది. (Fatalist)

క్రీస్తునకు పూర్వము సుమారు ఆఱవశతాబ్ది చివర ఆజీవకమత మున్నట్లును దీనికి కర్త మక్ఖలి (మస్కరి) గోశాలుడనియు అందురు. మక్కలి లేక మక్ఖలి. మస్కరి అనగా సాధువని, సన్న్యాసి యని ఆకాలమున వాడుక. ఇతడు తొలుత జైనుడై యుండి పిమ్మట నాస్తికు డైనట్లు తెలియుచున్నది. గోశాలి విద్యావిహీనుడగు పశుప్రాయుడు కాడు. అతడు దార్శనికుడే గాక జీవశాస్త్రజ్ఞుడు, భౌతికశాస్త్రమును పరిశీలించిన మేధావియు.

జిజ్ఞాసువు :- అయ్యా! ఆజీవక మతమనగా నెట్టిది?

వేదాంతి :- వీరి దర్శనగ్రంథములు ఇప్పుడు లభింపవు. వీరి మతమును జైనబౌద్ధమత గ్రంథములు అనువదించి ఖండించినవి. ఆ గ్రంథములయందలి వ్రాతలనుబట్టి పండితులు వీరి మతస్వరూప మిట్లుండునని తెలిసికొనిరి. "విజ్ఞాన సర్వస్వము" ఏడవసంపుటమునందును తదితర గ్రంథములయందును వ్రాసిన వ్రాతలను సంగ్రహించి తెలిపెదను.

ఆజీవకుల నియతివాదము :- లోకమునందు సర్వజీవులు (సర్వపదార్థములు) పరిణతి చెందుచుండును. భూరేణువు మొదలు

దేవతవఱకును అన్నియు జీవము గలవే. కాని, ఈ జీవులయందు ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు ఇంద్రియములు గల జీవవర్గ ముండును. మనుష్యుడు పంచేంద్రియములు కలవాడు. ఆ జీవకులు పునర్జన్మసిద్ధాంతము నంగీకరింతురు. వీరు బుద్ధభగవానుని కాలమునందు నైరంజనానదీ తీరమున నున్నట్లును, భగవానుడు బోధి నొందినపుడు ఆ జీవకుడు ఆయనను కుశలప్రశ్న చేసినట్లును "లలితవిస్తరము" 24వ అధ్యాయమున కలదు. మఱియొకచోట గయకు బోధిమండపానికి మధ్యన తథాగతుడు వచ్చుచుండగా ఆ జీవకుడు బుద్ధదేవుని సమీపించి సంభాషించినట్లును లలితవిస్తరము 26వ అధ్యాయమునందు కలదు.

ఆజీవకుల మతము ననుసరించి విశ్వమంతయు ఒకానొక నియతి (Determinism) వలన నియమింపబడుచున్నది. నియతి నెవరును అతిక్రమించలేరు. మానవుడు చేయు ప్రతికార్యమును (అది పుణ్యఫలము నిచ్చునది గాని, పాపఫలము నిచ్చునదిగాని) నియతి నియమించినట్లు చేయునేగాని స్వతంత్రముగ చేయలేడు. పుణ్యము చేయుటవలన మరణానంతరము స్వర్గప్రాప్తి కలుగు ననుటయు; పునర్జన్మమునందు ఉత్తమజన్మ కలుగుననియు; పాపకర్మవలన మరణానంతరము నరకమును, పునర్జన్మమున పాపయోనుల (నికృష్టయోనుల) యందు పుట్టుక కలుగుననియు చెప్పునట్టి వేదశాస్త్రముల వాక్యములు వీరంగీకరింపరు.

మానవుడు జీవితకాల మంతయు పుణ్యకర్మ లాచరించినను, ఘోరపాప కృత్యము లొనర్చినను వాని మరణానంతరము వానికి కలుగబోవు పునర్జన్మ అంతకంటెను ఉత్తమ మైనదిగనే యుండును. అట్లే జన్మపరంపరలు గడచి పోవుచున్న కొలదియు ఉత్తమస్థితి నొంది కడపట కేవలియై ముక్తు డగుచున్నాడు. అట్లే అందఱును ముక్తు లగుదురు. శీలము, తపస్సు, దానము, బ్రహ్మచర్యము, ఈశ్వరారాధనము, వీటివలన ఏవిధమైన లాభముగాని, నష్టము గాని కలుగదు. మూర్ఖుడుగాని మహాపండితుడు గాని వారి ప్రయత్నమువలన తము ముందుకుగాని వెనుకకుగాని పోజాలరు. నియతివశములైన చరాచర భూతజాల మంతయు ముందుకే సాగిపోవును.

పర్యవసాన మేమనగా:- పురుషప్రయత్నము వ్యర్థము. ఏలయన విశ్వమొక నియతిచే పాలింపబడుచుండుటవలన సర్వము దాని యధీనము. పురుషునికి స్వేచ్ఛ లేదు. "అత్యంత హీనాతిహీన పదార్థము మనుష్యుడగుటకు 84 వేల మహాకల్పములు- పట్టునట. జీవుల సంసరణము ఎల్లప్పుడును దుఃఖాంతము వైపునకే పయనించుచుండును. ప్రతివాడును చివరకు తీర్థంకరుడుగా మారి ముక్తుడగును." ఇతడు మతభ్రష్టుడైన జైనుడని తోచును.

జిజ్ఞాసువు :- అయ్యా! ఆస్తికులు కొందఱు సర్వమును విధికృతమనియు, ఏమి జరిగినను ఒక నియతి ననుసరించి ప్రపంచమున జరుగు ననియు; జగన్నియామకుడగు ఈశ్వరుడు కొందఱిని నిర్హేతుకముగ దయచూచు ననియు; కొందఱియెడ కఠినత వహించు ననియు; చెప్పుదురు కదా? అది నియతివాదమువంటిదే కదా?

వేదాంతి .... ఆస్తికుల 'విధివాదము' నకును ఆజీవకుల 'నియతి' వాదమునకును భేదమున్నది. ఆస్తికుడు స్వేచ్ఛచే ప్రయత్నించి యీశ్వరానుగ్రహమున విధి నతిక్రమింపగలడు. ఆజీవకుల నియతివాదికి అట్టి స్వేచ్ఛ లేదు. ఈశ్వరుడు కొందఱియందు నిర్హేతుక ప్రేమ కలిగియుండుటయను విషయము అది వేఱు. ఆయంశ మిట చర్చనీయాంశము కాదు. నేనిదివఱలో ఆ యంశమును (బ్రహ్మజిజ్ఞాస రెండవభాగము 5-వ ప్రకరణమునందలి ౨౧ వ అధ్యాయమున) చర్చించియుంటిని.

ప్రాచీన కాలమునుండియు "విధి", "నియతి" వాదములకు కొంత ప్రాముఖ్యము లేక పోలేదు. హర్షుని నైషధకావ్యము నందు - ఇంద్రుని వివాహమాడుమని బోధించుటకై దమయంతికడ కరుదెంచిన పురుహూతదూతిక వాక్యములకును, తన చెలుల వాక్యమునకును, ప్రత్యుత్తరమివ్వజాలక దమయంతి యీ నియతివాదమును అడ్డువైచి వారి నోరు మూయించినది. ఆ సందర్భమునందలి పద్యము నిట నుదాహరింతును.

క. "నియతి యచేతన; మఖిలము
నియతి పరాధీన; మిట్టి నిజ మెఱిగినచో
నియతి వశు న్నియమించుట
నియతి గుఱిచి గర్హసేత నిష్ఫల మరయన్.

శ్రీనాథకవి శృంగారనైషధము. (3-138)

ఏమి చేయించినను నియతి యచేతన మగుటవలన దాని కేదోషమును అంటదు. జీవుడు నియతికి పరాధీనుడు కనుక వా డేమి చేసినను దానిఫలము వాని నంటదు. కనక నియతినిగాని, నియతి వశునిగాని నిందింపరాదు - అని పద్యము నందలి భావము.

జిజ్ఞాసువు :- మానవునకు సుఖదుఃఖము లెట్లు కలుగుచున్న వందురు?

వేదాంతి :- నియతి వలననే, అంతకంటె వేఱొక కారణము లేదందురు. పర్యవసాన మేమన :- ఇది వ్యక్తికిగాని సమాజమునకు గాని శ్రేయోదాయక మైనది కాదు. చాల ప్రమాదకర మైనది. ఈ నియతివాదమును వేదాంతులు జడజగత్తునకు సంబంధించి నంత వఱకు అంగీకరింతురు. జీవాత్మవిషయమున అంగీకరింపరు. వెనుక శైవాధ్యాయమును చెప్పినప్పుడు (పుట 263లో) శైవుల ముప్పది ఆఱు తత్త్వములలో పదునొకండవది నియతి తత్త్వము. దానికిని ఇచట చెప్పిన నియతికిని సంబంధము లేదు. రెండును భిన్నములు. నాస్తికుల యీ నియతివాదము పునర్జన్మ నంగీకరించినను ధర్మాధర్మములను త్రోసివేసినది కనుక యిది అర్ధనాస్తిక మనవచ్చును. అయినను గర్హింపదగినది.

పూర్ణకాశ్యపుడు :- ఇతని వాదము అక్రియావాద మనియు, అహేతు అప్పచ్చయ వాదమనియు, బౌద్ధజైన గ్రంథముల వలన తెలియవచ్చిన దందురు. ఇతని వాదము ననుసరించి శూన్యమునుండి వస్తువులు పుట్టును. ఇతడు బుద్ధభగవానుని 16వ యేట శ్రావ స్తివద్ద నీటియందు దూకి చనిపోయెనని ఒక యైతిహ్యము కలదు. ఇతనివాదము,

ఔదాసీన్యవాదము, పాపపుణ్యములు లేవు. పాపపుణ్యములు ఆత్మ నంటవు, మరణమే ముక్తి. కాశ్యపుడుకూడ బానిస. ఇతడును యజమానుని బారినుండి తప్పించుకొని పారిపోయి నాస్తిక దర్శనాచార్యు డయ్యెనట.

పర్యవసాన మేమన :- నిజమైన తాత్త్విక చింతకుల నుండి గాక పీడితప్రజలనుండియే నాస్తిక మతము విస్తరించి యున్నది. పీడితప్రజలు ఆస్తికులై యున్నను బాధలు భరింపలేక నాస్తికు లగుదురు. "కలడు కలం డనెడి వాడు కలడో లేడో" అని గజేంద్రుని నోట పలికించినాడు పోతనామాత్యులు.

నాస్తికమతమునందు నాలుగు శాఖలు కలవు. (1) దేహమే ఆత్మ, (2) ఇంద్రియములే ఆత్మ, (3) ప్రాణమే ఆత్మ, (4) మనస్సే ఆత్మ అనునవి:- ఈ నాలుగింటిలో శరీరమో, దాని సంఘాతమో, అందులో ఏ యొక్కటియో ఆత్మ యగును. కనుక, ఈ నాలుగింటిలో భేద మంతగా లేదు. నాలుగును భౌతికవాదములే.

జడాత్మవాదము లేక జడాద్వైతము :- తల్లిదండ్రుల శుక్ల శోణితములతో శరీరము కలిగినది. అన్నము సూక్ష్మాంశమువలన మనస్సు, నీటియొక్క సూక్ష్మాంశమువలన ప్రాణము కలిగినది. మనఃప్రాణ సంయోగమువలన ఎఱుక (జ్ఞానము) కలిగినదను వాదము కలదు. ఇదియు పై వాదమువలెనే భౌతికవాదము. అచల మతస్థాపకులగు రామడుగు శివరామదీక్షితులవారి శిష్యపరంపరలయందు విఖ్యాతులగు భాగవతుల కృష్ణదాసనువారు పై యర్థము నిచ్చునట్టి కందార్థదరువును ఈ క్రింది విధముగా చెప్పిరి:- *

కందార్థము|| అన్నపు సూక్ష్మాంశము మన
సెన్నగ నీరంబు ప్రాణ మెఱుగుము యీ రెం -

---

* అచలవేదాంతమును ఈ గ్రంథముయొక్క రాబోవు (నాలుగవ) భాగము నందు విపులముగ చెప్పబడును.

డెన్నడు కలియవా నాడే -
సున్న సుమీ యెఱుకమాట - సుగుణ సం
పన్నా - కలసుట యెఱుక సుమి యింత
కన్నా - వున్న దెరుక మూల మన్నది వినలేదు........

(కందా, 83-152)

152-వ కందార్థమునందును పై యంశమునే చెప్పిరి -

జిజ్ఞాసువు :- బృహస్పతి దేవగురుడు కదా? ఇట్టి మత మెట్లుపదేశించెను?

వేదాంతి :- రాక్షసుల ఆచార్యుడగు శుక్రుడు ఒకప్పుడు తపము చేయుటకై అరణ్యమునకు పోయెను. అది యెఱిగి బృహస్పతిమాయచే శుక్రాచార్యుని రూపమును ధరించి రాక్షసుల కాచార్యుడుగా నుండెనట. ఆ కాలమున రాక్షసులు వైదిక ధర్మనిష్ఠులై ధర్మమార్గమున ప్రవర్తించుచు దేవతలకు దుర్నిరీక్ష్యులై యుండిరట. అట్టివారికి శుక్రరూపధరుండైన బృహస్పతి లోకాయత మతము నుపదేశించి వారిని వైదిక కర్మదూరులను చేయుటచే వారు తేజోహీనులై దేవతలచే పరాజితు లగునట్లు చేసెనని పద్మపురాణము నందున్నది - ఇంద్రపుత్రియగు జయంతితో శుక్రుడు పదిసంవత్సరములు కామమోహితుడై క్రీడించె ననియు ఆ కాలమున బృహస్పతి శుక్రరూపము ధరించి రాక్షసుల కాచార్యుడై యుండి వారలను మోసగించె ననియు చెప్పుదురు.*

ధర్మమార్గానువర్తనులగు రాక్షసులను జయించుటకు మార్గము లేక వారిని అధర్మమార్గానువర్తులను చేయుటకు విష్ణుదేవుడు బుద్ధుడై అవతరించి యీ మతము నుపదేశించె నని కొన్ని పురాణముల యందున్నది. పరమత సహిష్ణుత లేని కొందఱు వైదికమతావలంబులు ఇట్టిగాథలను కల్పించి బౌద్ధమతముపై కసితీర్చుకొంటిమని తృప్తిపడి యుండవచ్చును. భగవంతుడు సన్మార్గులను దుర్మార్గులను చేయుట

* ఆంధ్ర బ్రహ్మాండ పురాణము ఉపోద్ఘాత పాదము పంచమాశ్వాసము.

కవతరించునా? ఇవి నమ్మదగిన మాటలు కావు. చార్వాకమతోత్పత్తి యీ క్రింద చెప్పువిధముగ నుండునేమో యని తలంతును.

వేదవిహితకర్మలు జనసామాన్యమునందు విశేషప్రచారములో నున్న కాలమున ధనము గలవారు తమ మరణానంతరము స్వర్గమున కేగి అచ్చట నందనోద్యానమున రంభాది అప్సరలతో సుఖింపవచ్చు నన్న వాంఛతో యజ్ఞములు చేయుటవలన తిండిగింజలు నెయ్యి మొదలగు పదార్థములు అగ్నిహోత్రు డారగించుటచే ఆహారధాన్యములు కరువై సామాన్యజనులకు తినుటకు తిండిలేక అలమటించవలసి వచ్చి యుండును. అట్టితరి యీ మతమును ప్రచారమునకు తెచ్చి వైదికకర్మల యందు ప్రజలకు విరక్తి కలిగించి యుండినను ఉండవచ్చును. "ఒక్కప్పుడు చార్వాకమును కొందఱు బ్రాహ్మణు లాదరముతో అధ్యయనము చేసి ప్రచారము చేయు చుండెడివారు"* అని చెప్పుదురు. దీనివలన యజ్ఞకర్మలను ప్రోత్సాహించిన బ్రాహ్మణులే సంఘశ్రేయముకొఱకు నాస్తికమతమును ప్రచారము చేసిరేమో.

ఇదిగాక భక్తిమార్గము, పాతంజలయోగము, ఉపనిషత్తులయందలి జ్ఞానమార్గము, ప్రచారమునకు వచ్చి అల్పము క్షుద్రమైన స్వర్గసుఖమున కంటె శాశ్వతమైన బ్రహ్మలోకప్రాప్తిని, ముక్తిని ఆర్జింపవలయు నను కోరికతో ఆయా మతములు విశేషప్రచారములలోనికి వచ్చియున్నందున వైదికకర్మల యందాదరము తగ్గి యుండవచ్చును. వేదములయందు చెప్పిన యజ్ఞాది కర్మలప్రచారము తగ్గిపోవుటతో చార్వాకమతముయొక్క అవసరము తీరిపోయి యుండవచ్చును. అందువలన ఈ మతము గూడ సంఘమున నశించియుండును. చార్వాక దర్శనమునకు సంబంధించిన గ్రంథములను బ్రాహ్మణులే ధ్వంసము చేసిరట.

(4) విరోచన-ఇంద్రమతములు

ఛాందోగ్యశ్రుతియందు దేవాసురల మతమును గుఱించి యిట్లున్నది. ఒకప్పుడు భగవంతుడగు ప్రజాపతి యిట్లు చెప్పెను.

---

* విజ్ఞానము సర్వస్వము 7వ సంపుటములో లోకాయత దర్శనము - పుట68

"యయా ఽఽత్మా ఽపహత పాప్మా విరజో విమృత్యు ర్విశోకో ఽ విజిఘత్సో ఽపిపాస సత్యకామ సత్యసంకల్ప స్సో ఽన్వేష్ట వ్యస్స విజిజ్ఞాసితవ్య స్స సర్వాగంశ్చ లోకానాప్నోతి సర్వాగంశ్చ కామా న్యస్తమాత్మాన మనువిద్య విజానా తీతిహ ప్రజాపతి రువాచ.
(ఛాందో. 8-7-1)

తా॥ "ఏ యాత్మ పాపరహిత మైనదో, జర లేనిదో, చావు లేనిదో, శోకము లేనిదో, ఆకలిదప్పులు లేనిదో, సత్యకామ సత్యసంకల్పములు కలదియో-ఇట్టి యాత్మను వెదకి తెలిసికొనవలయును. అట్టి యాత్మను తెలిసికొన్నవాడు సకలకామములను సకల లోకములను బొందుచున్నాడు."

ప్రజాపతియొక్క యా వచనమును దేవతలును అసురులును (నను నీ యిరువురును) వినిరి. ఏ యాత్మను కనుగొన్నచో సకల లోకములును, సకల కామములును లభించునో అట్టి యాత్మను వెదుకవలయునని వారి వారి సమూహములో నిశ్చయించుకొని దేవతలయందు వారి రాజగు ఇంద్రుడును, అసురలయందు వారి రాజగు విరోచనుఁడును ఒకరి కొకరు తెలియబరచుకొనక సమిత్పాణులై ప్రజాపతి కడకు పోయిరి.

వారు అచ్చట ముప్పది రెండేండ్లు బ్రహ్మచర్యమును (గురుశుశ్రూష) అనుష్ఠించుచు నివసించిరి. ప్రజాపతి వారిని చూచి మీరిరువురు నిచ్చట నేల యున్నారని యడిగెను. వారు "పాపరహిత మైనది. నాశరహిత మైనది ఆత్మ యని తాను చెప్పినట్లు పెద్దలు చెప్పియున్నారు. ఆ యాత్మను తెలిసికొనుటకై కాచియున్నారము" అని చెప్పిరి. అప్పుడు ప్రజాపతి యిట్లు చెప్పెను. "నేత్రములయం దగపడు పురుషుడే ఆత్మ. అదే అమృతము, అభయము, బ్రహ్మము." ఇంద్ర విరోచనులకు ఆ వాక్యములయందలి అర్థములు తెలియక "నేత్రమునందు కనబడు ప్రతిబింబమే ఆత్మ" యని ప్రజాపతియొక్క భావమని తలచిరి.

అంత వా రిరువురును ఇట్లనిరి :- ఓ భగవంతుడా! నీటియందు అద్దమునందు అగపడు పురుషు డెవడు? ప్రజాపతి యిట్లనెను. "అతడే సర్వమునం దగపడును. నీటి పాత్రయందు మిమ్ము చూచుకొనుడు. ఆత్మనుగుఱించి మీ కేమి తెలియలేదో దానిని నన్నడుగుడు. అనగా వారిరువురు నీటిపాత్రయందు వారి ప్రతిబింబములు చూచి ఆ విషయము ప్రజాపతి కెరింగించిరి. ప్రజాపతి యది గ్రహించి "మీరు క్షుర కర్మ చేయించుకొని మంచిగుడ్డలు ధరించి చక్కగా అలంకరించుకొని జలపాత్రయందు మీ ప్రతిబింబము చూచుకొను"డని చెప్పెను. వారట్లు చేసి అలంకారముతో కూడిన వారి శరీర ప్రతిబింబములను చూచి మేమలంకరించుకొని యున్నట్లు మా ప్రతిబింబములు కనబడుచున్న, వని చెప్పిరి. ప్రజాపతి వారితో ఇట్లనెను. "అదే ఆత్మ, అదే అమృతము, అభయము, బ్రహ్మము" అది విని వారు శాంతహృదయులై వెడలిపోయిరి.

వెడలిపోవుచున్న వారి వైపు చూచుచు ప్రజాపతి యిట్లనెను. "ఆత్మతత్త్వమును దెలియక వీరిరువురు పోవు చున్నారు. ఈ శరీరమే ఆత్మ యని యెవరు తెలియుదురో వారు నాశన మొందుదురు"

అట్లు వెడలిపోయిన ఇంద్ర విరోచనులలో విరోచనుడు అసురులకు "దేహమే ఆత్మ యనియు, అదియే పూజనీయ మైనదనియు, అట్లు భావించిన నిహపరలోకములు రెండును సిద్ధించు ననియు" చెప్పెను. అసురులు దానిని నమ్మిరి. అసురుల తత్త్వజ్ఞాన మిదియే. వారు చచ్చిన వాని శరీరమును అన్నవస్త్రాద్యలంకారములచే నలంకరింతురు. అందువలన అతడు పరలోకము చెందునని వారి భావము - ఇంద్రునకు అనుమానము కలిగెను.

జిజ్ఞాసువు. :- గురువు చెప్పిన వాక్యమును చక్కగ అర్థము చేసికొనక విపరీతార్థమును చేసికొన్న శిష్యుని చక్కదిద్దుట గురువు కర్తవ్యము గదా? విరోచనుడు దేహాత్మవాదియై అసత్యము సత్యమని భ్రమించుటకు ప్రజాపతి కారణము గాదా?

వేదాంతి :- ఇంద్ర విరోచను లిరువురు ధన, రూప, విద్యా, బల గర్వములు గలవారు. అదిగాక రాజులు. వీరు అప్పటికి ముప్పదిరెండు సంవత్సరములు మాత్రమే గురుసేవ చేసిరి. వీరియందు విరోచనుడు తమోగుణము కలవాడు. తమోగుణ లక్షణము విపరీత జ్ఞానమును కలిగించుట. తమోగుణాధిక్యము గలవాడు బ్రహ్మము నెఱుగలేడు. అదిగాక వత్సము గోమాతను చేపి స్తన్యపాన మొనర్చునట్లు శిష్యుడు గురువును ప్రశ్నించి అతని యుపదేశ వాక్యమునందలి భావమును గ్రహించి యుక్తాయుక్త విచారము చేసి సంశయము తీర్చుకొనవలెను. మొదట ప్రజాపతి ఆత్మలక్షణము లెట్టివని చెప్పియుండెనో ఆ లక్షణములు దేహమునందు లేవని విచారించిన స్పష్టమగును. అంతమాత్రము విచారింపని విరోచనునకు ప్రజాపతి ఆత్మతత్త్వ మెట్లుపదేశింపగలడు?

ఇంద్రుడు రాజైనను కొంత సత్త్వగుణము కలవాడు గనుక జరామరణాది దోషరహిత లక్షణములు దేహమునందు లేవని అనుమానించి దేవతల యొద్దకు పోవుటకు ముందే అతనికి సంశయమును, భయమును గలిగి ఇట్లు విచారించెను. 'ఆత్మ యవినాశి. అమృతమని గదా చెప్పబడినది. ఈ శరీరము నశించునట్టిది కదా?' అని సంశయచిత్తుడై తిరిగి ప్రజాపతి కడకు సమిత్పాణియై పోయెను.

అప్పుడును ముప్పదిరెండు సంవత్సరములు బ్రహ్మచర్యముతో సేవించి సూక్ష్మశరీరము (స్వప్నగత శరీరము) ఆత్మయని విని వెడలిపోయెను. కాని దేవతలయొద్దకు చేరక మునుపే సంశయమును, భయమును గలవాడై ప్రజాపతికడకు తిరిగిపోయి తన సంశయ మెఱిగించెను. అప్పుడును ముప్పది రెండు సంవత్సరములు బ్రహ్మచర్యముతో శుశ్రూషచేసి ప్రజాపతివలన కారణశరీర మాత్మ యని తెలిసికొని వెడలిపోయెను. తిరిగి మునుపటివలె కారణశరీరము (సుషుప్తి శరీరము) కూడ నశించును కదా? అది అమృత మెట్లగు నని సంశయించెను. ఇప్పు డయిదు సంవత్సరములు బ్రహ్మచర్యముతో సేవించెను. ఇట్లు మొత్తము నూటొక్కయటచడం సంవత్సరములు బ్రహ్మచర్యవ్రతము ననుష్ఠించుటవలన ఇంద్రుని మనోగత

మాలిన్యమంతయు నశించి బుద్ధి స్వచ్ఛ మయ్యెను. బుద్ధియం దేదోషమున్నను బ్రహ్మోపదేశము పట్టదు. రజస్తమోగుణములను అణగద్రొక్కి సత్త్వగుణము అభివృద్ధిలోనికి వచ్చియున్నప్పుడే బ్రహ్మోపదేశమునకు తరుణము. కనుకనే క్రమముగా స్థూల సూక్ష్మ కారణ శరీరములు ఆత్మగాదని ఇంద్రుడు త్రోసివేయ గలిగెను. అది సరియైన దని ఇంద్రునకు ప్రజాపతి యిట్లుపదేశించెను.

మం|| అథ యత్రైత దాకాశ మను విషణ్ణం చక్షు స్స చాక్షుషః పురుషో దర్శనాయ చక్షు రథ యో వేదేదం జిఘ్రాణీతి స ఆత్మా గంధాయ ఘ్రాణ మథయో వేదే ద మభి వ్యాహరాణీతి స ఆత్మా ఉభి వ్యాహారాయ వాగథ యో వేదే దగ్ శృణ్వానీతి స ఆత్మా శ్రవణాయ శ్రోత్రము. ఛాందో. **(8-12-4)**

తా|| నేత్రమునందలి నల్ల గ్రుడ్డుచే సూచింపబడుచున్న ఆకాశమున (నేత్రాకాశమున) శరీరరహితుడగు ఆత్మ ప్రవేశించి నేత్రముచే రూపమును చూచుచున్నాడు. అతనికి రూపగ్రహణార్థ మయ్యెను. ఈ కన్ను గలదు. నేను వాసన చూడవలెనను జ్ఞానము గలది ఆత్మయే. ఆత్మ ఆఘ్రాణించుటకే..... ఘ్రాణ మతనికి, సాధనము. నేను మాటలాడ వలయునను జ్ఞాన మతనికి గలదు. మాటలాడుట కతనికి వాక్కు సాధనము. నేను వినుచున్నానని [illegible] లిసికొను వాడాత్మయే. ఆత్మ వినుటకయ్యే చెవి యున్నది.

పై శ్రుతియందలి [illegible] ఆత్మ మననము చేయుటకై దీ మనసు [illegible] మంత్రమున బ్రహ్మలోకము [illegible] తలును, ఆత్మ నుపాసించి లేక ఆత్మను తెలిసికొని [illegible] ములయందును, సర్వలోకములను పొందుదురని ప్రజాపతి ఇంద్రున కుపదేశించెను. ఇంద్రుడు దేవతల కట్లే బోధించెను.

ఇచ్చట ఇంకొక విషయము గమనింపవలయును. అసురు లందఱు దేహాత్మవాదులు కారు. వారిలో ఋషులవంటి మహనీయు లుండిరి. ప్రహ్లాదుడు, నముచి, బలి, వృత్తుడు మొదలగువారు గలరు. మహాభారతము

నందలి శాంతిపర్వమున 'ఇంద్రనముచి సంవాదము', 'ఇంద్రబలి సంవాదము', 'వృత్రగీత', వంటి ఘట్టములు చదివిన నీ విషయము బోధపడును.

ఇంద్రబలి సంవాదమునందు.-

"అమృతపానంబు జేసిన యంతకంటె
నద్దనుజపతి మధుర వాక్యామృతమున
సంభృతానందుడై సురేశ్వరుడు తనదు
పురములకు నేగి సుఖముండె గురువరేణ్య."

(తిక్కన. మ. భా. శాంతి-4-453)

ఇంద్రునకు అమృతపానము చేసినప్పుడు కలిగిన ఆనందము కంటెను బలివాగమృతమును గ్రోలినప్పుడు అధికతరానందము కలిగినట్లు మహాభారతమున చెప్పబడినది. బలి మొదలగువారు సమస్తము కాలాధీనమను కాలవాదులు. ఇచ్చట ప్రజాపతి యింద్రున కుపదేశించిన మతము తప్ప తక్కినవన్నియు నాస్తిక-భౌతిక మతములు. ఆస్తికమతములను లోకమున వ్యాపింపజేసిన మహాత్ములకు నా వందనములు.

ఇది పరమేశ్వరానుగ్రహమ్ము ... మట్టిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస" మనుపే సంపుటము

తృతీయభాగము నందలి ... తన సంపుటములను ఐదవ ప్రకరణముతో తృతీయభాగము సంపూర్ణత్వరములు ... గాని

శ్రీకృష్ణార్పణమస్తు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

శ్రీ పుష్పదంతాచార్యులు చెప్పినట్లు నదులన్నియు సముద్రము చేరునట్లు మతములన్నియు భగవంతునే చేరుచున్నవి. కనుక ఇచ్చట ఇంతవఱకు పేర్కొనిన మతాచార్యు లందఱికిని వందనము లర్పించుచున్నాను.

శ్లో|| త్రయీ సాఙ్ఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదః పథ్యమితి చ|
రుచీనాం వైచిత్ర్యాదృజు కుటిల నానాపథ జుషామ్
నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవ ఇవ||

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామ
సుబ్బయ్యచే రచియింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస'
తృతీయభాగమునందలి 'మతతత్త్వములు'
అను రెండవప్రకరణము సంపూర్ణము.
ఓమ్ శాంతిః శాంతిః శాంతిః